
శ్రద్ధ

సబూరి



# శ్రీ సాయి శారద



రచన : విశ్వనాధ్ దాసరి (విశి)

# శ్రీ సాయి శారద

ఒక స్త్రీ అసాధారణ విజయ గాథ

మూల కథ


## విశ్వనాథ్ దాసరి (విషి)

అట్లాంటా, అమెరికా


అనువాదం : చేడుదీపు సంతోష్ కృష్ణ

# అంకితం...

స్వర్గీయ దాసరి మహాలక్ష్మి (అమ్మ గారు)
స్వర్గీయ దాసరి సిద్ధేశ్వర ప్రసాద్ (నాన్న గారు)

## నా గురించి...

నా పేరు దాసరి విశ్వనాథ్ . అందరితో విషి గా పిలవబడే నేను.. హైదరాబాద్ లోని JNTU మరియు యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్ (HCU) ల నుండి ఉన్నత విద్య ని పూర్తి చేసాను. ప్రస్తుతం అట్లాంటాలో ఉంటున్నాను. పై చదువుల కోసం అమెరికాకి ప్రయాణం అయిన నేను ఇక్కడే స్థిరనివాసం ఏర్పరుచు కొనేలా పరిస్థితులు ఏర్పడ్డాయి.

## శ్రీ సాయి శారద నవల గురించి చెప్పాలంటే...

సాయి మహిమలో నుండి ముందుకు వచ్చిందే ఈ పుస్తకం...

ఆడవారిని మగవారితో సమానంగా చూడాలని సంవత్సరాల తరబడి ఉపన్యాసాలు ఇవ్వడమే తప్పితే ఇప్పటికీ ఆడవారికి సమాజంలో, మగవారితో సమానంగా గౌరవం లభిస్తుందా అన్న ప్రశ్నకి ఇంకా మనం సమాధానం కోసం తడుముకుంటూనే ఉన్నాము.

కానీ ఏ ఆధారం లేని ఒక మహిళ తన కష్టాలని, బాధలను దిగమింగుకొని ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు ఎలా సంపాదించింది... ఆ గుర్తింపు ఆమె కోరుకోనప్పటికీ, ఆమె ఇష్టపడే సాయినాదుడు ఆమెకు అంత పెద్ద విజయాన్ని ఎలా అందించాడు అన్నది అంతర్లీనంగా ఈ నవల ఇతివృత్తం...

నా వెన్నంటే ఉండి నన్ను ప్రోత్సాహించిన నా సహా భాగస్వామి డా. సబితకు కృతజ్ఞతలు... నా కుమారులు చిరంజీవి. కార్తీక్ , చిరంజీవి. రుత్విక్ ల ప్రేమపూర్వక సహకారాన్ని మరువలేను...

ఇంగ్లీష్ లో వ్రాసిన ఈ నవల ను తెలుగులోనికి అనువదించటానికి నాకు సహాయ పడిన నా మిత్రుడు సంతోష్ కృష్ణ కి కృతజ్ఞతలు

ఈ నవల పరిశీలకులతో పాటు, పాఠక సోదర సోదరీమణులకు, సాయి బంధువులకు నచ్చుతుందని ఆశిస్తూ...

మీ
విషి
అట్లాంటా, అమెరికా

ఓం శ్రీ సాయిరాం

# శ్రీ సాయి శారద

ఉపోద్ఘాతం..

“ఒక విధవరాలి కన్నీరు తుడవ లేని...

ఆకలితో ఉన్న వారి ఆకలిని తీర్చలేని మతాన్ని పాటించవద్దు...’’ స్వామీ వివేకానంద.

భారతదేశ ఔన్నత్యాన్ని, సాహిత్య, ధార్మిక సంపదని ప్రపంచానికి పరిచయం చేసిన గొప్ప యోగి చెప్పిన మాట ఇది.

భారతదేశంలో ఎన్నో కులాలు, మతాలు ఉన్నాయి, ఎన్నో మందిరాలు ఉన్నాయి. ఎన్నో కోట్ల మంది భక్తులు ఉన్నారు. అతి ప్రాచీన సంప్రదాయాలకు పునాది భారతదేశం. ప్రపంచంలోని ఎందరో మహానుభావులు, శాస్త్రవిజ్ఞానులు, ప్రపంచ చరిత్రని అధ్యయనం చేసిన వారెందరో భారతదేశాన్ని సవినయంగా గౌరవిస్తారు.

దానికి కారణం.. ప్రపంచాన్నంతా చుట్టేసి, ఎన్నో వ్యయ ప్రయాసలకి ఓర్చి ఈ సృష్టి గురించి వారు తెలుసుకొన్న విషయాలన్నింటినీ ఎన్నో వేల సంవత్సరాల క్రితమే మన భారతదేశ మహర్షులు వేదాల రూపంలో మనకి అందించారు.

మనిషి జీవిత సారాన్నంతటినీ, అర్జునుడితో చెప్పే నెపంతో, శ్రీ కృష్ణ పరమాత్ముడు భగవద్గీత రూపంలో మనకెప్పుడో అందించారు. ప్రస్తుతం ఆ భగవద్గీతని ఆధారంగా చేసుకుని ఎన్నో కార్పొరేటెడ్ కంపెనీ CEO లు తమ విధులను నిర్వహిస్తున్నారంటే భారతీయ సంస్కృతికి, సాంప్రదాయానికి ఉన్న ప్రాధాన్యత, దాని గొప్పదనం ఎలాంటిదో చెప్పాల్సిన అవసరం లేదు కదా..

కష్టాలు, నష్టాలు, సుఖాలు, దు:ఖాలు ఈ నాలుగు ప్రతి మనిషి ఎదో ఒక సందర్భంలో ఎదుర్కోక తప్పదు. అయితే ఈ కష్టాలు వచ్చాయి కదా అని కంటికి కనిపించని దేవుడికి తమ

కష్టాలని ఏకరువు పెడుతూ మానవ ప్రయత్నం చేయకుండా గాల్లో దీపం పెట్టి దేవుడా అంటే ఆ దేవుడుకరుణిస్తాడా..? ఈ ప్రశ్న మీకు చాలా సహజంగా కనిపించవచ్చు...

కానీ నిగూఢంగా ఆలోచిస్తే ఈ ప్రశ్నలో ఎంతో సందేశం ఉంది..! ఆ సందేశం ఏమిటో ఈ నవల కథానాయకురాలు సందర్భానుసారంగా తెలియజేస్తుంది.

ఈ నవల రాయడానికి ముఖ్య ఉద్దేశ్యం, ఎంతో నిరుపమానమైన మన భారతదేశ సౌభాగ్యాన్ని, సంప్రదాయాన్ని, ప్రస్తుత సాహిత్యం, నేటి తరానికి చేర్చడంలో చాలా వరకు విఫలం అవుతుందన్న ఒక ఆవేదన కారణంగా ఈ నవలని మీముందుకు తీసుకు రావాల్సి వచ్చిందని విన్న వించుకుంటున్నాను..

ఎక్కడో ఖండాంతరాల ఆవల ఉన్న అమెరికా, లండన్ లాంటి దేశాలలో నివసిస్తున్న నేటి తరం భారతీయ నాగరికతకి అనుగుణంగా తమ నడవడికలో మార్పు తీసుకు వస్తూంటే.. ఇక్కడ భారతదేశంలో మాత్రం విదేశీ పోకడలతో తమ ఉనికిని ప్రశ్నార్థకం చేసుకుంటున్నారు.. అశాశ్వతమైన క్షణికానందం కోసం ఆధ్యాత్మిక చింతనని ప్రక్కన పెట్టేసి యాంత్రిక జీవితాన్ని గడుపుతున్న కోట్లాది మంది తల్లితండ్రులు తమ పిల్లలను అసలు దేవుడు అంటే సినిమాల్లో ఓ హీరో అనుకునే విధంగా ఊహించుకునే స్థాయిలో తయారు చేస్తున్నారంటే అతిశయోక్తి కాదు. ఇలాంటి వారందరికీ కనువిప్పు కలిగించే ఇతి వృత్తం ఇది...

ఒక రాజవంశంకు చెందిన విధవరాలి నుండి వందల కోట్ల ఆస్తులను లాక్కుని, ఆమెను కట్టు బట్టలతో ఇంట్లో నుండి బయటికి నెట్టివేయటం జరుగుతుంది.

తినడానికి తిండి లేదు.. ఉండడానికి నిలువ నీడలేదు.. పైగా ఒంటరి జీవితం.. కంటిముందు దారి కనిపించడం లేదు.. కణకణలాడుతున్న ఎర్రటి ఎండలో కాళ్ళీడ్చుకుంటూ ముందుకు కదులుతున్న ఆమెని ఓదార్చడానికి ఆమె కళ్ళల్లో నుండి రెండు కన్నీటి బొట్లు రాలి, ఇకనుండి మేమే నీకు తోడుగా ఉంటాము.. ముందుకు సాగు, అని ఆమెకి ధైర్యాన్నిచ్చాయి..

ఆమె పేరే శారద..

..............................

అది సికింద్రాబాద్‌లోని ఓ సాయిబాబా మందిరం.. భక్తులతో కిటకిటలాడుతోంది. గర్భగుడిలో సాయిబాబా విగ్రహం దివ్యమంగళప్రదాయంగా  కనిపిస్తుంది.. సాయినాధుడి భక్తులు క్యూ పద్ధతిలో, చిరునవ్వు చిందిస్తూ తెల్లగా మెరిసిపోతున్న, సాయినాధుడిని దర్శించడానికి భక్తి శ్రద్ధలతో ముందుకు కదులుతున్నారు. ఓం సాయి.. శ్రీ సాయి.. జయ జయ సాయి.. సమర్థ సద్గురు సచ్చిదానంద సాయినాధ్ మహరాజ్‌కీ జై.. అన్న మాటలు ఆ మందిరంలో మారు మ్రోగిపోతున్నాయి.

సాయిబాబా.. మహారాష్ట్రలోని శిరిడీ అనే గ్రామంలో మానవ రూపంలో తిరుగాడిన పరమపవిత్ర భగవానుడు. శిరిడీలోని ఓ పాడుపడ్డ మసీదునే తన నివాసంగా చేసుకుని తన దగ్గరికి వచ్చిన భక్తులను సర్వదా కాపాడిన వారు ఆ సద్గురు సాయినాధుడు.

శ్రద్ధ, సబూరితో బాబాని కొలిచే భక్తులను ఎల్లవేళలా  రక్షించే ఆ సాయినాధుడి లీలలు అనేకం.. పిలిచిన పలికే దైవంగా పేరు గడించిన  సాయినాధుడు ఈ ప్రపంచంలో కొన్ని కోట్ల మంది హృదయాలలో వెలుగొందుతున్నారు .

సాయిబాబాని కొలిచిన వారికి అన్నీ తానై చూసుకునే సద్గురు మూర్తి ఆ సాయినాధుడు..

సాయి సూక్తులు మనిషి జీవితంలో చీకటిని పారద్రోలి వెలుగును నింపుతాయని చెప్పడంలో ఎలాంటి సందేహం లేదు.. చెడు సావాసాలతో మనిషి చెడిపోతున్న సమయంలో తన సూక్తులతో ఆ మనిషిని మంచి మనిషిగా మార్చేవాడు సాయినాధుడు.. ఆ సాయినాధుడి దివ్యాశీస్సులతో.. సాయి సూక్తులనే ప్రధాన కథావస్తువుగా శారద ముఖ్యపాత్రధారిణిగా, అనామకురాలి గా మిగిలిపోయిన శారద, సాయినాధుడి దివ్యానుగ్రహంతో ఎంత గొప్ప స్థాయికి చేరింది.. సాయితత్వాన్ని  ప్రపంచ వ్యాప్తంగా ఎలా వ్యాపింపజేసిందన్నది ముందు ముందు మీరే తెలుసుకుంటారు. నేడు సమాజంలో మనిషి యాంత్రిక జీవితానికి అలవాటు పడిపోయాడు. ఉదయం నిద్ర లేచిన దగ్గర నుండి రాత్రి పడుకునే వరకు మనిషి యంత్రంలా పని చేస్తున్నాడు. సిటీ కల్చర్ వచ్చాక కనీసం పక్కింటి వారి గురించి ఆలోచించే అవకాశమే లేకుండా పోయింది. అంతే కాదు మనిషిలోని మానవత్వం అడుగంటి పోతోంది. సాటి వాడు ఆపదలో ఉంటే అయ్యో పాపం అనే బదులు. అమ్మో.. నాకెందుకీ గొడవ అనుకుంటూ జారుకునే నైజం మనిషిలో పెరిగిపోయింది .

సాటి మనిషిని గౌరవించడం అన్నది మనిషి ఎప్పుడో మరిచిపోయాడు..

మనిషి డబ్బు అనే మాయలో పడిపోయాడు. ఒకప్పుడు కడుపు నిండా తిండి, కంటి నిండా నిద్ర, మనసు నిండా ఆనందం ఈ మూడింటికే  ఎక్కువగా ప్రాధాన్యత ఇచ్చేవాడు మనిషి.. ఇలా ఇచ్చిన సమయంలో మనిషి ఎంతో ఉన్నతమైన జీవితాన్ని అనుభవించాడు. తనతో పాటు తన చుట్టూ ఉన్న వారి గురించి ఆలోచించేవాడు. సాటి వాడికి ఆపద వస్తే ఆదుకునే వాడు, కానీ.. రోజులు గడుస్తున్న కొద్దీ మనిషి ఆలోచనలోనూ మార్పు రావడం ప్రారంభించింది.. మనిషిలో స్వార్థం నరనరాల ప్రాకిపోయింది.. సంపదని కూడగట్టుకునేందుకు ఎన్ని అడ్డ దారులైనా త్రొక్కటానికి  సిద్దపడిపోతున్నాడు.

తన స్వార్థం కోసం ఎంత మందికైనా అన్యాయం చేయడానికి వెనుకాడడం లేదు. తాను, తన కుటుంబం బావుంటే చాలు, మిగతా వారు ఏమైపోయినా ఫర్వాలేదన్న విష సంస్కృతి మనుషులలో నాటుకు పోతోంది..

అందుకే ప్రస్తుతం సమాజంలో ఎన్నో ఘోరాలని మనం చూడాల్సి వస్తోంది.. కుటుంబ కలహాలు,  ఆస్తి తగాదాలు, ఆడవారిపై అత్యాచారాలు, హత్యలు .. ఇలా హింసాత్మక సంఘటనలతో సమాజం కలుషితం అయిపోతోంది. ఈ ఘటనలు చిన్నపిల్లలలో  ఎన్నో మార్పులని తీసుకువస్తున్నాయి. స్కూల్ కు పంపించి తమ పనేదో తాము చూసుకునే తల్లిదండ్రులు, స్కూల్ కు వెళ్ళాక పుస్తకంలోని పాఠాలని బట్టీ పట్టించి తమ పనయిపోయిందనుకునే టీచర్ల మధ్య  చిన్నపిల్లల  భవిష్యత్తు ప్రశ్నార్థకమవుతోంది..

భారతదేశ సంస్కృతి ఎంతో ప్రాచీనమైనది.. ప్రపంచాన్ని శాసిస్తూ వస్తున్న వేదాలకి పుట్టినిల్లు మన భారతదేశం. ఎందరో మహానుభావులు పుట్టిన పుణ్య ప్రదేశం.. ఇంతటి మహోత్తరమైన ప్రదేశంలో జన్మించినవారు ఎంతో ఎంతో అదృష్టవంతులని ఒకప్పుడు చెప్పుకునే వారు.. కానీ ఇప్పుడు భారతదేశంలో పుట్టినందుకు తప్పైందన్న భావన తమ పిల్లలలో వచ్చే విధంగా కొందరు తల్లితండ్రులు పరిస్థితులను కల్పిస్తున్నారు..  పిల్లలకు చదువు చెప్పించడంతోనే తమ పనయిపోయిందని అనుకునే తల్లిదండ్రులు ఉన్నంతకాలం ఈ పరిస్థితులు ఇలాగే ఉంటాయి..

అలాగే సమాజం గురించి పట్టించుకోకుండా తన స్వార్థం గురించి ఆలోచించే మనుష్యులు ఉన్నంత కాలం  హింసాత్మక సంఘటనలు  పునరావృతం అవుతూనే ఉంటాయి..

తాను, తన కుటుంబం అని ఆలోచించడంలో తప్పులేదు.. కానీ తన కుటుంబం బావుంటే చాలు, సమాజం ఏమయిపోయినా ఫర్వాలేదన్న భావనే తప్పు.. ఇలాంటి భావనలు  మనసులో కదులుతున్నప్పుడు తాను కూడా ఈ సమాజంలోనే ఉన్నానన్న స్పృహ కూడా మనిషిలో కలగాలి..

ఏది ఏమయిపోయినా ఈ యాంత్రిక జీవితంలో.. ఎన్నో, ఎన్నెన్నో ప్రలోభాలను  కలిగించే ఈ మాయా ప్రపంచంలో మనిషిగా బ్రతకాలంటే ఒకే ఒక్క మార్గం ఉంది.. అది.. ప్రతి మనిషిలోనూ ఆధ్యాత్మిక చింతన అన్నది రావాలి..

వారంలో ఏడు రోజులూ పని చుట్టూ, సంపద చుట్టూ పరుగులెత్తే మనిషికి రోజులో కనీసం ఓ అరగంటయినా ఆధ్మాత్మిక చింతనలో, ఆ భగవంతుని సేవలో తరించాలి.. అలా చేసినప్పుడే సమాజం బాగుపడుతుంది..

సరిగ్గా ఇలాంటి సందేశమే సాయి తత్వంలో కూడా ఉంది. చేసే పనిలో శ్రద్ధ, చెప్పే విషయంలో నిజాయితీ ఉంటే, వారిని తాను కంటికి రెప్పలా కాపాడతానని ఆ సాయిబాబా చెప్పారు. అంతేకాదు, మనిషి, మనిషిగా జీవించడానికి కావాల్సిన ఎన్నో సూక్తులను మనకందించారు ఆ సాయినాథుడు. ఆ సూక్తులను  మన జీవితానికి అన్వయించుకుంటే ఎంతో ఉన్నతమయిన జీవితాన్ని అనుభవించడమే కాదు, ఈ సమాజానికి కూడా మనవంతు మంచిని చేసే అవకాశం కలుగుతుంది.

సర్వసాధారణంగా మనందరికీ ఇతరుల గురించి కుతూహలం ఉంటుంది. తోటివాళ్ళేం చేస్తున్నారు, ఎంత సంపాదిస్తున్నారు, ఎలా జీవిస్తున్నారు లాంటి అనేక అనవసర విషయాల మీద దృష్టి పెడతాం. ఆ అంశాల్లో ఉన్న కుతూహలం నిజంగా అవసరమైన విషయాలలో ఉండదు. ముఖ్యంగా మన గురించి మనం తెలుసుకోకుండా ఆధ్యాత్మికంగా ఔన్నత్యం సంపాదించాలనుకుంటాం... సాయిబాబా ఇతరుల విషయాలను  తెలుసుకోవాలనే ఈ రకమైన వైఖరిని పూర్తిగా ఖండించారు. ఎవరికి వారు, ''నేను ఎవర్ని? నేను ఈ లోకంలోకి ఎందుకు వచ్చాను, నేను ఏం చేస్తే జీవితం సార్థకం అవుతుంది..''

అని ఆలోచించి, ఎప్పటికప్పుడు మన నడవడిక తీర్చిదిద్దుకుంటూ, ఆదర్శప్రాయంగా జీవించాలని, షిర్డీ సాయిబాబా సామాన్యునిలా జీవించి, అసామాన్య గుణాలను ప్రబోధించారు. ఇది వినడానికి, చూడ్డానికి ఎంతో మామూలు అంశంలా కనిపిస్తుంది. కానీ, ఇందులో ఎంతో లోతైన భావం ఉంది. మన గురించి మనం ఆలోచించడం మొదలు పెడితే మన కర్తవ్యం ఏమిటో తెలుస్తుంది. తోటివారికి సంబంధించిన అనవసరమైన ఆసక్తి తగ్గుతుంది. అన్నిటినీ మించి 'నేను', 'నా' అనే స్వార్ధచింతన, అహంభావం తగ్గిపోతాయి.

సాయిబాబా ఇంకో విషయం కూడా స్పష్టంగా చెప్పారు. తనను వెతుకుతూ భక్తుడు ఎక్కడికీ పోనవసరం లేదని, తాను ఈ ప్రపంచంలోని సకల జీవజాలంలో, వస్తువుల్లో.. అన్నింటిలో ఉన్నానని చాటి చెప్పారు. ప్రతి జీవిలో చైతన్యం ఉంటుందని, ఆ చైతన్యమే దేవుడని, అది గుర్తించాలని చెప్పారు. దేవునికోసం అన్వేషణ మాని, మనం ఏం చేసినా అది దేవునికి తెలుస్తుందని గుర్తుంచుకోవాలని చెప్పారు. తోటివారిని ఏదో విధంగా బాధపెడుతూ, హింసిస్తూ దేవుణ్ణి పూజ చేసినా ఫలితం ఉండదని, మంచి పనులు చేయడం ద్వారానే దేవునికి దగ్గర అవ్వాలని హితబోధ చేసారు.

'మానవ సేవే మాధవ సేవ' అని ఎన్నోసార్లు గుర్తుచేసారు. తోటివారిని విసిగించేవారు, బాధించేవారు పాపపు రాశులను పెంచుకుంటారని, ఆ ఫలితాన్ని అనుభవించక తప్పదని, తాము కష్టపడి అయినా, ఇతర్లకు మేలు చేసేవారు జీవితాన్ని సార్ధకం చేసుకుంటారని స్పష్టం చేసారు.

.........................

సమయం ఉదయం 10 గంటలు..

సికింద్రాబాద్ స్టేషన్..

ఒకటవ నంబర్ ప్లాట్‌ఫాం.. ఆ ఫ్లాట్‌ఫాం చివరిలో ఓ మూలకి ముసుగేసుకుని కూర్చుని ఉన్నది ఓ మహిళ.

సుమారు నలభై ఐదు సంవత్సరాలు ఉంటాయి ఆమెకి. పేరు శారద. కాటన్ చీర కట్టుకుని ఉంది.. ఆ చీర మట్టి కొట్టుకుపోయిఉంది.. మోకాళ్ళు ముడుచుకుని కూర్చుని ఉంది.. ఆమె

పక్కన చేతి సంచి ఒకటి ఉంది.. అందులో ఆమెకి సంబంధించిన ఒక జత బట్టలు, కొన్ని తిను బండారాలు ఉన్నాయి. ఆమె ముఖం  మ్లానమై ఉంది.. రెండు రోజులుగా ఆహారం తీసుకోలేదామె.. అందుకే ఆమె శరీరం సన్నగా కంపిస్తోంది.. ఒంట్లో శక్తి లేనట్లు పూర్తిగా నీరసపడిపోయి ఉంది..

ఆమె దగ్గరికి ఇద్దరు యాచకులు  వచ్చారు.. ఒక ఆడ ఒక మగ.. అతని వయసు డెబ్బై సంవత్సరాలుంటుంది.

ఆమె వయసు 60 వరకు ఉంటుంది.. ఇద్దరూ శారద వైపు తేరిపార చూసారు. కొంగు కప్పుకొని మోకాళ్లపై తల ఆనించి ఉండడంతో ఆమె ముఖం కనిపించడం లేదు.. దాంతో ఆ వృద్దుడు కాస్త వంగి ఆమె ముఖం చూసాడు..

''ఏవమ్మోయ్... యాడినుండి వచ్చినవ్.. సూత్తంటే నువ్వూ అడుక్కుతినేందుకే ఈడికి వచ్చినావని తెలుస్తోంది.. మాకు పోటీగా  వచ్చినావన్న మాట..''

ఆ అరవై  సంవత్సరాల వృద్దురాలు  అంది.. ఆమె మాటకి ఆ వృద్దుడు వారించాడు..

''ఛస్ ఊరుకో... ఈమె వాలకం సూత్తంటే అడుక్కుతినేదానిలానే కనిపిస్తుంది.. కానీ ముఖం అట్టా లేదు సూడు.. ఆ ముఖం లో ఏదో కళ ఉట్టిపడుతూంటేనూ...''

ఆమె ముఖం లోకి చూస్తూ అన్నాడు వృద్ధుడు...

''ఆ.. ఆ.. మొహాలు సూత్తే అట్టాగే ఉంటాయ్.. గియ్యాల రేపు ఎవ్వరినీ నమ్మొద్దు.. అస్సలు జాలి సూపించకూదదు..

మనకి పోటీగా ఈడనే అడుక్కుతింటే.. మనకి ఏసే వోడు ఉండదు.. ముందు ఈమెని ఈడనుండి తరిమేయ్..''

వృద్దురాలు  సీరియస్‌గా ఆ వృద్ధుడి వైపు చూస్తూ అంది..

''ఓసోస్.. కూసింత ఓపిక పట్టు.. గసలు ఈమె ఎవరూ.. యాడి నుండి వచ్చిందో కనుక్కోనీ..''

వృద్ధురాలి వంక చూసి అని మెల్లిగా శారద ముందు కూర్చున్నాడు ఆ వృద్ధుడు..

''ఏవమ్మోయ్... ఎవరు నువ్వు.. గీడేం సేత్తన్నావ్.. ముఖం  సూత్తే మాలచ్చిమిలా ఉన్నావు.. ఆకారం సూత్తే మాకంటే సెండాలంగా ఉన్నావు.. అసలెవరమ్మా నువ్వు..'' అన్నాడు.

శారద నుండి సమాధానం రాలేదు.. ఆమె మూసిన కళ్ళు తెరవలేదు.. అసలా వృద్ధుడి మాట విన్నదో లేదో కూడా అర్థం కాలేదు వారికి

''నువ్వట్టా నిదానంగా అడిగితే ఏం సెప్పుద్ది.. నీ మాట పట్టనట్టే ఉంది సూసినవా.. సెవుడేమో.. కాస్త గట్టిగా మాట్టాడు..''

శారదనే తేరిపార చూస్తూ అంది..

వృద్ధుడు శారద ముఖం వైపు చూస్తూ..

''ఏవమ్మా.. నా మాట ఇనిపిస్తుందా.. ఎవ్వరు నువ్వు.. గీడేమి సేత్తన్నావ్..''

గొంతు పెంచి అన్నాడు.. అప్పటికీ ఆమెలో చలనం రాలేదు..

''ఇట్టా అడిగితే సెప్పేలా లేదులే.. అడుక్కుతినేటందుకు ఇదో సాకు.. ఉలుకు పలుకు లేకుండా అట్టాగే ఉంటే. జనాలు జాలితో కాసు పడేత్తారని నాటకాలేత్తుంది.. ఈవిడ యాక్టింగుకి అడుక్కుతినేటోళ్ళం మనకే జాలేత్తుంది..

ఇంక జనాలకి జాలేయదా ఏందీ..? సూడయ్యా.. ఈమె ఈడనే ఉంటే మన సేతిలో ఉన్న గిన్నెకి చిల్లు పడ్డట్టే..

ఎట్టాగోలా ఆమెని ఈడనుండి తరిమేసెయ్యాల్సిందే.. మాటతో ఇంటే మంచిది.. లేదంటే భుజం పట్టుకుని లాక్కెళ్ళి టేషన్ బయట ఎత్తేసి రావాలే.. ఆ..''

కోపంగా అంది ఆ వృద్ధురాలు.

''అబ్బా.. ఉండవమ్మా నీ గోల .. జనాల జేబులోనుండి ఓ రూపాయి బిళ్ళని రాల్చటం కోసం మనం ఎన్ని నాటకాలేస్తామో నాకు తెల్వదా ఏందీ.. కానీ ఈవిడ వాలకం సూత్తే అట్టా అనిపించటం లేదు.. నువ్వు కూసింత సేపు ఓపిక పట్టు.. అసలీవిడ ఎవరూ.. ఏంది కథ.. నేను తేలుస్తాను కదా..''

కూర్చున్న వాడు తల పైకెత్తి వృద్దురాలి వంక చూస్తూ అనేసి తిరిగి శారద వైపు తిరిగాడు.

''ఏవమ్మోయ్.. నువ్వట్టా మాటా పలుకు లేకుండా ఇట్టా ఉంటే నడవదు.. ఏవమ్మోయ్.. ఇనిపిస్తుందా.. నా మాట.. ఏందీ.. అమ్మా..''

అంటూ శారద చేయిపై తట్టి, ఆ స్పర్శకి వృద్ధుడు ఉలిక్కిపడ్డాడు..

ఆమె శరీరం చాలా వేడిగా ఉంది.. జ్వరంతో ఉన్నదని వృద్ధుడికి అర్థమయింది..

''అరెరె.. ఈమె ఒళ్ళంతా కాలిపోతాంది.. నిప్పుకణికని సేతిలో పట్టుకున్నంత వేడిగా ఉంది..''
''ఆమె ఒళ్ళు వేడిగా ఉంటే ఏంది.. సల్లగా ఉంటే ఏందయ్యా.. ముందీడనుండి పంపించు..'' మండిపడింది ముసలావిడ.
''ఛస్.. నీ.. గింత జాలి సూడకుండా ఏమిటా మాటు.. పాపం.. ఎవరో ఏందో.. బిక్కసచ్చిపోయి కూసుంది..
పైగా జ్వరం కూడా ఉంది.. సూత్తంటే తిండీ తిప్పలు గాలి కొదిలేసినట్టే ఉంది.. అందుకే ఒంటినిండా నీరసం నిండిపోయి కంటికి నిద్ర పట్టేసినట్టుంది.. నువ్వు కాస్త నోరు మూసుకుని కూసింత సాయం జేయి..''
కసురుకున్నాడు వృద్ధుడు ఆ వృద్ధురాలిని..
''ఓయబ్బో.. ఏంది ముసలోడా అంత జాలి దయ సూపిత్తన్నావు.. రూపాయి దానం జేసి ఆస్థులు రాసిచ్చినట్టు ఫోజు కొట్టే జనాలే కానీ మనల్నెవుడయినా జాలిగా జూస్తడా ఏంది..''
''ఛస్.. ముందా మాటలాపి కూసింత సాయం పట్టు..''
అంటూ శారద రెండు భుజాలని పట్టుకుని మెల్లిగా పైకి లేపాడు.. అతనికి ఆ వృద్దురాలు అయిష్టంగానే సాయం చేసింది.. పక్కనే ఉన్న రైల్వే బల్లపైన ఆమెని కూర్చోపెట్టి, కొన్ని నీటిని ఆమె ముఖం పై చల్లాడు వృద్ధుడు..
ముఖం పై నీళ్ళు పడగానే స్పృహలోకి వచ్చింది శారద.. మెల్లిగా కళ్ళు తెరిచింది..
ఎదురుగా వృద్ధుడు, వృద్ధ రాలు తననే ఆసక్తిగా చూడడం గమనించింది.. ఒంట్లో ఉన్న శక్తినంతా కూడదీసుకుని కాస్త సర్దుకుని కూర్చుంది...
''ఏవమ్మోయ్.. ఎవురివమ్మా నువ్వు.. ఇంత జరంతో ఉన్నావు.. ఒక్కదానివే ఉన్నావు.. ఎక్కడి నుండి వచ్చావు..
యాడికి పోతున్నావు..? సూత్తంటే అడుక్కుతినేదానిలా ఉన్నావు.. ముఖం లో నేమో లచ్చిమి కల ఊడిపడ్తాంది.. ఎవురివమ్మా నువ్వు..?'' అతని గొంతులో ఆప్యాయత కదలాడింది..
శారద అతని వైపు చూసి జీవం లేని నవ్వు నవ్వింది..
''దాహం... దాహం గా ఉంది.. కాసిన్ని మంచి నీళ్ళు''
చేయితో చూపించింది. ఆమె మాట చాలా నీరసంగా ఉంది..

వృద్ధుడు తన దగ్గర ఉన్న వాటర్ బాటిల్ తీసి ఆమె నోటికి అందించాడు..

''ఆ..ఆ.. సేవ సేసింది సాలు గానీ.. ముందు ఇసయం కనుక్కో ముసలోడా..''

వృద్ధురాలి వైపు కోపంగా చూసాడు వృద్ధుడు.

మంచి నీళ్ళు కొన్ని త్రాగిన శారదకి ఒంట్లో కాస్త సత్తువ వచ్చినట్టయింది..

''ఇప్పుడు సెప్పు.. ఎవరివి నువ్వు.. యాడినుండి వచ్చినవ్..''

''నాది.. సిద్దిపేట.. '' నీరసంగా పలికింది శారద.

సరిగ్గా అదే సమయంలో.. ఫ్లాట్‌ఫాం నెంబర్ 1 పైన అంతా ప్రయాణీకులతో హడావిడిగా మారిపోయింది. అప్పుడే మైక్‌లోనుండి అనౌన్సుమెంట్ వస్తోంది.

దయచేసి వినండి. ట్రైన్ నం. 12792 దానాపూర్ నుంచి సికింద్రాబాద్ వెళ్ళే పాట్నా ఎక్స్‌ప్రెస్ మరి కొద్ది సేపట్లో 1వ నెంబరు ప్లాట్‌ఫాం మీదికి వస్తుంది.. అన్న అనౌన్స్‌మెంట్ విని ప్రయాణీకులందరూ అప్రమత్తమయ్యారు.

ఆ ప్లాట్‌ఫాం చివర్లో కూర్చుని ఉన్నారు శారద, వృద్ధుడు, వృద్ధురాలు.

మైక్‌లో అనౌన్స్‌మెంట్ వినగానే వృద్ధుడి కళ్ళల్లో సంతోషం, వృద్ధురాలి ముఖం కూడా ఆనందంతో వెలిగి పోతుంది..

''ఏమయ్యోయ్.. ప్రభ అమ్మగారు శాన్నాళ్ళ తరువాత వచ్చేత్తున్నారు. ఇయ్యాల మన పంట పండినట్టే.. ఎప్పటి మాదిరిగానే ఆ యమ్మ మనకోసం పండ్లు, ఫలహారాలు మోసుకొస్తాంది.. పద.. పద.. కూసింత ఆలస్యం అయినా అడుక్కుతినే ఆడంగులందరూ గుమిగూడేత్తారు'' కూర్చున్న చోటు నుండి లేస్తుంది వృద్ధురాలు వృద్ధుడు కూడా లేస్తాడు. ఇద్దరూ హడావిడిగా ముందుకి కదులుతారు. ఓ మూలగా ముడుచుకుని కూర్చున్న శారద వారు వెళ్ళిన వైపే నిర్వికారంగా చూస్తూంటుంది..

వృద్ధుడు ఓ నాలుగు అడుగులు వేసి ఠక్కున ఆగిపోతాడు..

వృద్ధుడి ముఖం లో ఏదో గుర్తుకి వచ్చిన ఫీలింగ్ ప్రతిఫలిస్తుండగా వెనక్కి తిరిగి శారదని చూస్తాడు..

శారద కూడా అతని వైపే చూస్తూంటుంది..

ఆ పరిస్థితిలో శారదని అలా చూస్తూంటే ఆ వృద్ధుడి హృదయం బాధతో నిండిపోయింది. ముందుకు కదలటానికి మనసొప్పక ఆవిడ దగ్గరికి వచ్చాడు.

శారద ముఖం లో ఏ భావమూ ఉండదు, బ్లాంక్‌గా వృద్ధుడి వైపు చూస్తుంటుంది..

వృద్ధుడు మెల్లిగా ఆమె దగ్గరికి వస్తాడు.. ఆమె ప్రక్కనే మోకాళ్ళపై కూర్చుంటాడు.

''ఇప్పుడు అనౌన్స్ చేసారే.. అదే వారణాశి ఎక్స్‌ప్రెస్ రైలు కూతంత సేపట్లో వచ్చేస్తుంది అని.. ఆ రైల్లో ప్రభమ్మ ఒత్తాంది తల్లీ.. ఆ యమ్మ మనసు యెన్నపూస లాంటిది.. పతీ పదిహేను రోజులకోమారు ఇలా రైల్లో ఒచ్చి ఇక్కడున్న అడుక్కుతినేటోళ్ళకి పండ్లు, ఫలహారాలను  దానం సేత్తాది తల్లీ.. ఎవురైనా అడుక్కుతినే యావనుండి  తప్పుకోవాలనుకుంటే ఆరికి ఓ దారి సూపెడతాది.. ఆరిని ఆనాధాశ్రయాలోనో, లేదంటే ఏదైనా సంఘసేవా సంస్థలోనో చేరిపిత్తాది, ఆరి జీవితానికి  ఓ దారి సూపిత్తాది.. ఓసారి నన్ను కూడా అడిగింది తల్లీ.. ఈ అడుక్కుతినడం ఎందుకు తాతా.. నువ్వు కూడా వెళ్తానంటే సెప్పు.. మంచి వృద్ధాశ్రమంలో చేరుత్తాను, అక్కడ నువ్వు పెశాంతంగా ఉండొచ్చు అని అంది ఆ మాతల్లి.. కానీ నేనే ఎల్లలేదమ్మా.. కాటికి కాలు సాపుకుని ఉన్న నేను ఇంకా ఎన్నో రోజులో బతుకను కదా.. ఈ సివరి రోజుల్లో ఈ కట్టెకి ఇశ్రాంతి ఎందుకు తల్లీ.. ఏదో ఉన్న నాలుగు రోజులు ఇక్కడే గడిపి హరీ మంటాను అని అన్నాను. దానికి ఆయమ్మ బాధపడినాది.. సరే నీ ఇట్టం తాతా అంది..''

వృద్ధుడి కళ్ళల్లో కన్నీళ్ళ సుడులు తిరుగుతాన్నాయి..

శారద అలాగే వృద్ధుడిని చూస్తుంటుంది..

ఆమె కళ్ళల్లో కూడా కన్నీళ్ళు సుడులు తిరుగుతుంటాయి..

అంతలో వృద్ధుడి ముఖం లో ఏదో ఆనందం కనిపిస్తుంది.. ముఖం లో చిరునవ్వు ప్రవేశిస్తుంది..

''అమ్మా.. నువ్వు కూడా నాతో రా.. నేను ఆయమ్మ కాడికి తీసుకుపోతా.. నీకు మంచి దారి సూపిత్తాది.. నీకు ఇట్టా అడుక్కుతినడం మంచిది కాదమ్మా.. లెగు.. పోదాం''

వృద్ధుడి మాటలకి ఆమె ఏమీ మాట్లాడలేదు..

ఆమె కళ్ళు శూన్యంలోకి చూస్తుంటాయి..

అంతలోనే దూరంగా వారణాశి ఎక్స్‌ప్రెస్ రైలు ఫ్లాట్‌ఫాంకి చేరుకుంటుంది మెల్లిగా..

వృద్ధుడు వెనక్కి తిరిగి రైలువంక చూస్తాడు..

ఫ్లాట్ ఫాం చివరి నుండి రైలు మెల్లిగా వస్తుంటుంది.. ప్రయాణీకులందరూ ఆ ట్రైన్ ఆగగానే తమ తమ బెర్తులలో ఎక్కడానికి రెడీగా ప్లాట్‌ఫాంపై నిలబడి ఉన్నారు.

వృద్ధుడు ముఖం లో ఆందోళన..

తిరిగి శారద వైపు చూస్తాడు..

''ఏమ్మా.. ఆలస్యం చేసావంటే మనం ఎనకబడిపోతాం.. ఈపాటికే అందరూ ఆమె దిగే రైలు డబ్బాని ఎతుక్కుని ఆడ గుమి గూడి ఉంటారు.. లెగమ్మా.. లెగు..''

తొందర పెడుతున్న వృద్ధుడి ముఖం లో ఆందోళన శారద ఏమీ అనదు.. భారంగా ఓ నిట్టూర్పు విడిచి, పక్కనే ఉన్న తన సంచిని తీసుకుని మెల్లిగా లేస్తుంది..

వృద్ధుడు చిరునవ్వు చిందిస్తూ ఆమె వంక చూసి, చేత్తో పద పదా అన్నట్టు సైగ చేసి ముందుకి అడుగు వేస్తాడు.

వారణాశి ఎక్స్‌ప్రెస్ రైలు ప్లాట్‌పాం మీదికి వస్తుంది.. ఓ ముప్పై మంది అడుక్కుతినే వాళ్ళందరూ ప్రభ ఉండే కంపార్ట్‌మెంట్ కోసం వెతుకుతూ అటూ ఇటూ పరుగులు తీస్తుంటారు..

ఓ ఇద్దరు బిచ్చగాళ్ళు ఓ ప్రయాణీకుడిని తాకుతూ ముందుకు వెళతారు..

దాంతో ఆ ప్రయాణీకుడికి కోపం వస్తుంది..

''ఏయ్.. బ్లడీ బెగ్గర్స్.. యూ ఇడియట్స్.. కళ్లు నెత్తినకెక్కాయిరా.. ఛీ.. ఛీ.. కామన్‌సెన్స్ లేకుండా నన్ను తాకుతూ వెళ్ళారు..''

ప్రయాణీకుడు ముఖం లో అసహ్యం ఆ ఇద్దరు బిచ్చగాళ్ళు వెళ్ళినవైపే చూస్తూ తన రెండు చేతులతో వారు తాకిన చోట దులుపుకుంటుంటాడు..

ఆ ఇద్దరు బిచ్చగాళ్ళు అతని మాటలని పట్టించుకోకుండా ముందుకు పరుగులు తీస్తుంటారు..

దాంతో ఆ ప్రయాణీకుడికి మరింత కోపం ముంచుకు వస్తుంది..

''ఈ బిచ్చగాళ్ళకి వేళా పాళా లేదు, అసలు ఈ బెగ్గర్స్‌నందరినీ కాల్చి పాడేస్తే పీడా విరగడవుద్ది.. బ్లడీ బెగ్గర్స్.. బ్లడీ బెగ్గర్స్..''

తనలో తానే అనుకుంటూ కిందకి వంగి తన లగేజీ తీసుకుందామనుకుంటుండగా మరో ఇద్దరు బిచ్చగాళ్ళు ఇందాకటిలాగే అతన్ని తోసుకుంటూ ముందుకు పరుగు తీస్తారు..

దాంతో ఆ ప్రయాణీకుడి కోపం నషాళానికి కంటింది..

''ఒరేయ్ వెధవల్లారా.. మీకేం పోయే కాలం వచ్చిందిరా.. నన్ను తగులుకున్నారు..'' అని గట్టిగా అరుస్తాడు.

ఆ ప్లాట్ ఫాం పై అటూ ఇటూ చూస్తాడు.. దాదాపు ఓ ముప్పై మంది బిచ్చగాళ్ళు ఎక్కే, దిగే ప్రయాణీకుల మధ్య నుండి ఏదో వెతుక్కుంటూ రైలు బోగీ పక్కనుండి పరుగు తీస్తుంటారు.. ఆ బిచ్చగాళ్ళు కొందరు ప్రయాణీకుల్ని తోసుకుంటూ వెళ్తుంటే వారు బూతులు తిడుతున్నా వారి గురించి పట్టించుకోరు..

ఆ దృశ్యం చూసిన ఆ ప్రయాణీకుడికి ఆశ్చర్యం వేస్తుంది..

''అసలు ఈ బిచ్చగాళ్లందరికీ ఇక్కడేం పని.. ఇంత మంది బిచ్చగాళ్ళు ఇలా ఫ్లాట్ ఫాం మొత్తం తిరుగుతుంటే రైల్వే పోలీసులు ఏం చేస్తున్నారు..?'' మనసులోనే అనుకున్నాడు కోపంగా..

అతని చూపు రైల్వే పోలీసు కోసం వెతుకుతుంది..

అతనికి కొద్ది దూరంలో రైల్వే పోలీసు కనిపిస్తాడు..

ఆ ప్రయాణీకుడు చూస్తుండగానే ఆ పోలీసుని కూడా తోసుకుంటూ ఓ బిచ్చగాడు ముందుకు వెళ్తాడు. అయినా ఆ పోలీసు అతన్ని ఏమీ అనకుండా తన పనేదో తాను చూసుకుంటాడు..

ఆ దృశ్యం చూసిన ప్రయాణీకుడి ముఖం లో ఆశ్చర్యం..

కోపంగా ఆ రైల్వే పోలీస్ దగ్గరికి వెళ్తాడు

''హలో.. ఎక్స్‌క్యూజ్‌మి.. వాటీజ్ దిస్ సార్.. ఈ ప్లాట్‌ఫాం మొత్తం బిచ్చగాళ్లతో నిండిపోయింది.. వీళ్లతో మాబోటి ప్రయాణీకుడికి ఎంత ఇబ్బందిగా ఉందో తెలుసా.. ఇందాకే ఓ ఇద్దరు బ్లడీ బెగ్గర్స్ నన్ను తోసుకుంటూ వెళ్లారు.. సరే పోనీలే అని ఊరుకుంటే ఆ వెంటనే మరో ఇద్దరు బెగ్గర్స్ అలాగే తోసుకుంటూ వెళ్ళారు..

అసలేం జరుగుతుంది సార్ ఇక్కడ..? వీరందరినీ ఫ్లాట్‌ఫాంలోకి ఎందుకు రానిచ్చారు..?'' ప్రయాణీకుడి ముఖం లో కోపం ప్రవేశిస్తుంది.

ఆ రైల్వే పోలీసు ప్రయాణీకుడి వైపు చూసి చిన్నగా నిట్టూరుస్తాడు..

‘‘ఓ.. అదా.. ప్రతీ పదిహేను రోజులకొక సారి ఈ వారణాశి ఎక్స్‌ప్రెస్ వచ్చిందంటే ఈ బిచ్చగాళ్లందరికీ పెద్ద పండుగ.. ఈ రైలు ప్లాట్ ఫాం  నుండి వెళ్ళే వరకు వారిని ఏమీ చేయలేం..’’

ప్రయాణీకుడి ముఖం లో ఆశ్చర్యం..

‘‘అదేమిటి..? పోలీసువై ఉండి మీరు అనాల్సిన మాటలేనా ఇవి.. ఈ బెగ్గర్స్ వల్ల మాకు ఎంత ఇబ్బంది కలుగుతుందో తెలుసా.. అయినా ఈ రైలుకి, ఈ బెగ్గర్స్‌కి సంబంధం ఏమిటి సార్..’’ ఆశ్చర్యంగా అడుగుతాడు..

‘‘ఓ.. అదా.. ఈ ట్రైన్‌లో ప్రతీ పదిహేను రోజులకొకసారి ఓ సంఘసేవకురాలు వస్తుంది.. నీడలేని నిరుపేదలని ఆదుకోవడమే ఆమె ఆశయం.. దేశం మొత్తం తిరుగుతూ ఇలా అడుక్కుతినే వారికి సహాయం చేస్తూంటుంది. గత మూడేళ్ళ నుండి ఇక్కడి బిచ్చగాళ్ళకి కూడా ఆమె సహాయం చేస్తుంటుంది’’

ప్రయాణీకుడి ముఖం లో విపరీతమైన ఆశ్చర్యం..

‘‘వాటీజ్ దిస్ నాన్‌సెన్స్.. ఎవరో సంఘసేవకురాలు బిచ్చగాళ్ళకి సహాయం చేయడానికి వచ్చిందని, ఆ బిచ్చగాళ్ళందరూ మాలాంటి వారిని ఇబ్బందులకి గురిచేస్తున్నా పట్టించుకోకుండా అలా గాలికి వదిలేస్తారా..? అసలు  మీరు పోలీసులేనా..? మీరు వెంటనే ఈ బిచ్చగాళ్ళపై యాక్షన్ తీసుకోండి.. ఈ ఫ్లాట్‌ఫాం పైనుండి వారందరినీ బయటికి తరిమేయండి..’’

అతని గొంతులో కోపం తారాస్థాయికి చేరుతుంది..

పోలీసు ముఖం లో కూడా అదే స్థాయిలో కోపం ప్రవేశిస్తుంది..

‘‘హలో బాస్.. కూల్ కూల్.. ఆ బెగ్గర్స్‌పై ఆల్రెడీ యాక్షన్ తీసుకున్నాం..’’

‘‘యాక్షన్ తీసుకున్నారా... మరి.. మరి.. తీసుకున్నాక కూడా ఈ నాన్సెన్స్ ఏమిటి..’’

పోలీస్ చిన్నగా నిట్టూరుస్తాడు..

‘‘కొంత కాలం క్రితం నీలాగే వీరిపై కంప్లైంట్ వస్తే వీరిపై యాక్షన్ తీసుకున్నాము.. ప్లాట్‌ఫాం పైనున్న బిచ్చగాళ్ళందరినీ తన్ని బయటికి తరిమేసాం.. ఈ విషయం తెలుసుకున్న ఆ సంఘసేవకురాలు మాపై కోప్పడింది.

సాటి మనిషిని మనిషిగా చూడలేని మీరు మనుషులేనా అని చివాట్లు పెట్టింది.. మా డ్యూటీ మేము చేయడం తప్పా అని అడిగితే.. వెంటనే మా రైల్వే పోలీస్ డిజిపి దగ్గరికి వెళ్ళింది.. తాను పదిహేను రోజులకొకసారి ఇలా వస్తానని,
పేదోళ్ళకి, బిచ్చగాళ్లకి సహాయం చేస్తానని తాను వచ్చినప్పుడు తనని కలవడానికి వచ్చే బిచ్చగాళ్ళని ఏమీ అనవద్దని, తాను వారికి ఏదో సహాయం చేసి వెళ్ళిపోయే వరకు బిచ్చగాళ్ళని ఈ ప్లాట్‌ఫాంపై అనుమతించటానికి స్పెషల్ పర్మిషన్ కోరింది.. దానికి మా డిజిపి ఓకే అన్నాడు.. ఆమె వచ్చినపుడు ప్లాట్‌ఫాం పైకి వచ్చే బిచ్చగాళ్ళని ఏమీ అనవద్దని
ఆర్డర్ పాస్ చేసాడు.. అందుకే ఈ రైలు కదిలేంత వరకూ వారిని మేము ఏమీ అనలేము..''
ప్రయాణీకుడు నోరు తెరిచి విపరీతమైన ఆశ్చర్యంతో పోలీసు వంకే చూస్తుంటాడు..
పోలీసు ప్రయాణీకుడి వంక చిన్నగా నవ్వుతూ చూస్తాడు ప్రయాణీకుడు తన వెనుకాల నుండి అటూ ఇటూ పరుగు తీస్తున్న బిచ్చగాళ్ళ వంక నోరు తెరిచి అలాగే చూస్తూ ఉండిపోతాడు..
అంతలోనే అతని వెనుకాల నుండి ఓ బిచ్చగాడు అరవడం వినిపిస్తుంది..
''ఆ.. అదిగో అదిగో ఆయమ్మ కనిపించింది.. ఆ రైలు డబ్బాలో ఉంది.. రండి.. రండి..'' ఆ బిచ్చగాడు ఆనందంగా అరుస్తాడు. దాంతో తోటి బిచ్చగాళ్ళందరూ అతను చూపించిన వైపుకి పరుగు తీస్తారు.. అలా పరుగు తీస్తున్న వారినే నోరు తెరిచి ఆ ప్రయాణీకుడు చూస్తూండిపోతాడు అచేతనంగా..

...........................

వారణాశి ఎక్స్‌ప్రెస్ ఎస్10 నం భోగీ డోరు దగ్గర నిబడి ఉంటుంది ప్రభ.. ఆ బోగీ ముందు భిక్షగాళ్ళందరూ గుమిగూడి ఉంటారు. ప్రభని చూసిన వారి మొహాల్లో ఆనందం కనిపిస్తుంటుంది.. భక్తి శ్రద్ధలతో ప్రభకి రెండు చేతులతో నమస్కరిస్తుంటారు.. ప్రభ చిరునవ్వుతో వారిని పలకరిస్తుంది.. కుడి చేయిని పైకెత్తి వారికి అభివందనం చేస్తుంది.. రైలు దిగి వారి మధ్యలోకి వస్తుంది..
ఆమెని చూసిన ఓ భిక్షగాడు ఆనందం ఆపుకోలేకపోతాడు.

‘‘మా ఆకలి తీర్చడానికి వచ్చిన బంగారు తల్లివి.. నువ్వు నిండు నూరేళ్ళూ సల్లంగా ఉండాలి తల్లి..’’ కళ్ళల్లో ఆనందభాష్పాలు రాలుతుండగా అంటాడు.

ప్రభ ఆ భిక్షగాడి వైపు ఆప్యాయంగా చూస్తుంది.. చిరునవ్వు చిందిస్తూ తన వంకే చూస్తున్న యాచకులందరికీ అభివాదంగా చేయిని గాల్లోకెత్తి ఊపుతుంది.

దాంతో ప్రభతో చేతులు కలపడానికి భిక్షగాళ్ళందరూ ఒకరొకరుగా పోటీ పడుతుంటారు. దాంతో అక్కడ తోపులాట జరిగే పరిస్థితి వస్తుంది..

ప్రభ వారి మధ్యలో ఇరుక్కుపోతుంది..

ప్రభ వారిని సముదాయిస్తుంటుంది ప్రేమగా..

‘‘దీనబంధువులారా.. నేను మీ కోసమే వచ్చాను.. మీ అందరికీ నాకు చేతనయినంత సహాయం చేయడానికే వచ్చాను.. మీరిలా ఒకరినొకరు తోసుకుంటూ వస్తే ఎలా.. కాస్త అటువైపు పదండి..’’ అంటూంది సౌమ్యంగా..

అంతలో ఓ భిక్షగాడు మిగతా భిక్షగాళ్ళందరి వైపు కోపంగా చూస్తాడు.. భిక్షగాడి వాయిస్ ‘‘ఆ యమ్మ మనకోసమే వచ్చిందిగదా.. ఎందుకింత పరేషానవుతారు.. ఇట్టాగా అందరూ ఆ యమ్మ మీద పడితే ఎట్టా.. అందరూ ఆ పక్కన పదండి..’’

అంటూ మిగతా భిక్షగాళ్ళందరినీ ప్రభకి దూరంగా తోస్తూంటాడు.. అయినా భిక్షగాళ్ళలో ఏమాత్రం మార్పు రాదు.. వారి సహజమైన ధోరణిలో వారి చేతిలో ఉన్న గిన్నెని ప్రభ ముఖం పై పెడుతూంటారు. వారిని అదుపు చేయడానికి ఆ బిక్షగాడి వల్ల కూడా కాదు..

అంతలోనే రైల్లో నుండి వృద్ధురాలు, ఆమె మనవరాలితో పాటు ప్రభ అనుచరులైన సీత, రాధలు దిగుతారు.

సీత ఆ వృద్ధురాలు ని, ఆ బాలికని జాగ్రత్తగా రైలు దింపుతుంది.. సీత తమతో తీసుకువచ్చిన లగేజీని దింపుతుంది. భిక్షగాళ్ళతో అక్కడంతా హడావిడి వాతావరణం నెలకొంటుంది.. ప్రభ చుట్టూ గుమిగూడిన భిక్షగాళ్ళందరినీ ఆ ప్లాట్‌ఫాం పైనున్న మిగతా ప్రయాణీకుందరూ ఆశ్చర్యంగానూ, ఆసక్తిగానూ గమనిస్తుంటారు..

ప్రభని, బాలికని ప్లాట్ ఫారం పై నున్న ఓ కుర్చీలో కూర్చోబెడుతుంది సీత.. ‘‘మీరిక్కడే కూర్చోండి.. నేను ఇప్పుడే వస్తాను..’’

అంటూ ప్రభ దగ్గరికి వస్తుంది.. భిక్షగాళ్ళ తోపులాట అధికం అవుతుంది.. ప్రభ, సీత వారి మధ్యలో చిక్కుకు పోతారు..

సీత తన లగేజీని వారి మధ్యలోనుండి ఎంతో కష్టపడి తీసుకుని ప్లాట్‌ఫాం పైనున్న ఓ టేబుల్‌పైన పెడుతుంది...

ఆ లగేజీలో నుండి అరటిపండ్లు, ఆపిల్స్, బ్రెడ్స్ అన్నీ తీసి బయటికి పెడుతుంది..

ఆ తినుబండారాలు చూసిన యాచకులలో మరింత ఉత్సాహం బయలు దేరుతుంది.. వాటిని తమంటే తామే ముందు సొంతం చేసుకోవాని ఒకరితో మరొకరు పోటీపడిపోతూంటారు.

''మీరిలా అందరూ ఒకేసారి నా చుట్టూ మూగితే ఎలా.. మీరందరూ ఒక క్రమ పద్ధతిలో వస్తే అందరికీ సహాయం చేయగలను.. పదండి.. అటువైపు పదండి..''

అంటూ వారి మధ్యలోనుండి సీత వైపు నడుస్తుంది..

ప్రభ వెనకాలే భిక్షగాళ్ళందరూ వస్తారు..

ఆ భిక్షగాళ్ళందరినీ వరుస క్రమంలో నిలబడాలని సీత, రాధలు ఎంత అరిచినా ఆ భిక్షగాళ్ళు పట్టించుకోకుండా ఒకరినొకరు తోసుకుంటూ వారు తెచ్చిన వస్తువుని ముందుగా తామే తీసుకోవాలన్న ఆరాటంతో ఉంటారు..

ఎంతో సౌమ్యురాలైన ప్రభకి కూడా ఆ వాతావరణంతో ఒకింత చిరాకు ప్రవేశిస్తుంది..

అయినప్పటికీ తనలో తాను ఆ చిరాకుని అణుచుకుంటూ ముఖం లో చిరునవ్వు చిందిస్తూ..

''మీరిలా ఒకరినొకరు తోసుకుంటే సమయం వృథా అవుతుంది తప్ప మరే ప్రయోజనం ఉండదు.. మీ అందరికీ నా చేతనయినంత సహాయం చేసే అవకాశాన్ని మీరు కోల్పోయేలా చేస్తున్నారు.. మరో ఇరవై నిమిషాల్లో ఈ రైలు వెళ్ళిపోతుంది.. ఆ లోపు నేను మీ అందరికీ ఈ వస్తువులని అందజేయాలి.. దయచేసి నాకు సహకరించండి..''

అయినప్పటికీ ఆమె మాటలు వారు వినిపించుకోరు.. నేనే ముందు వచ్చానంటే.. నేనే ముందు వచ్చానంటూ పోట్లాడుకుంటూంటారు ఆ భిక్షగాళ్ళందరూ..

సీత, రాధలు వారిని అదుపు చేయడానికి తీవ్రంగా కృషి చేస్తుంటారు..

ప్రభకి వారినెలా అదుపు చేయాలో అర్థం కాదు.. ఒక విధమైన నిస్సహాయ స్థితిలో ఉండగా ఆమె చూపు ఆమెకి కొద్ది దూరంగా తమవైపే ఓ వృద్ధ భిక్షగాడి వెనుకాల వస్తున్న శారదపై పడుతుంది.

ప్రభ శారదని చూస్తుంది.. ఆమె కళ్ళలో ఒక విధమైన ఆశ్చర్యం..

శారదని తీసుకువస్తున్న వృద్ధుడు పరుగులాటి నడకతో వస్తూంటాడు.. ఆలస్యం చేస్తే తినుబండారాలు తమకి దొరకవనే కంగారు అతని ముఖం లో కనిపిస్తుంటుంది. తన వెనకాలే వస్తున్న శారదని చూస్తూ తొందరగా రమ్మన్నట్లుగా చేయితో సైగ చేస్తుంటాడు వృద్ధుడు తొందర చేస్తూండడంతో ఒంట్లో ఓపిక లేకున్నా వేగంగా నడవడానికి ప్రయత్నిస్తుంటుంది శారద..

శారద నడుస్తూంటే ప్రభ శారదని ఆపాదమస్తకం గమనిస్తుంటుంది..

శారదలో ప్రభకి ఏదో ప్రత్యేకత గోచరిస్తుంటుంది.. ఆమెని చూడగానే ప్రభలో ఇదీ అని చెప్పలేని ఆనందం కలుగుతుంది.. మాటల్లో వర్ణించలేని అనుభూతి ఏదో ఆమె మనసులో ఓ మేఘంలా కమ్ముకుంటుంది.

ఆ వృద్ధుడు పరుగు పరుగున అక్కడికి చేరుకుని శారదని కూడా తన వెనకాలే నిలబడమని పురమాయిస్తుంటాడు.

దానికి శారద సుతారంగా తిరస్కరిస్తుంది.. ఆమె ముఖం లో ఏదో తెలియని నిస్సహాయత, బాధ కనిపిస్తుంటాయి.

వృద్ధుడు కూడా ఆ భిక్షగాళ్ళ మధ్యలో కలిసిపోతాడు.. కానీ శారద మాత్రం వారికి కొద్ది దూరంలో నిల్చుంటుంది...

ప్రభ చూపు మాత్రం బేలగా చుట్టూ చూస్తున్న శారద వైపే ఉంటుంది..

''ఎవరీ స్త్రీమూర్తి..? ఆమె కళ్ళల్లో ఏదో తేజస్సు.. ప్రశాంతమైన వదనం.. కానీ ఆమె మనసు అగ్నిగుండంలా ఆమెని దహించివేస్తున్నట్టుగా ఉంది.. ఎన్నో కష్టాలను అనుభవించినట్టుగా, ఎంతో వేదనని తన హృదయంలో పెట్టుకున్నట్టుగా.. ఉంది.. అయినప్పటికీ ఆ ముఖం లో ఏదో తేజస్సు.. ఎవరీ స్రీమూర్తి..? ప్రభ మనసులో అనుకుంటుంది.. ఒక భిక్షగాడు ప్రభని కదిలించే సరికి ఈ లోకంలోకి వస్తుంది.. ఉలిక్కిపడి అటూ ఇటూ చూస్తుంది..

సీత, రాధలు భిక్షగాళ్ళందరికీ పండ్లు పంచుతుంటారు.. అయినప్పటికీ వారి వల్ల కాదు.. ప్రభ శారదని చూస్తుంది.. శారద కూడా యథాలాపంగా ప్రభని చూస్తుంది..

ఇద్దరూ కళ్ళతోనే పలకరించుకుంటారు..

ప్రభ శారదని చూసి చిన్నగా నవ్వుతుంది.. శారద ఆశ్చర్యపోతుంది.. ఇంతకు ముందు తాను ఎంతగానో పరిచయం ఉన్నట్టుగా ప్రభ నవ్వుతూ ఉండడంతో శారద కూడా చిన్నగా నవ్వుతుంది..

ప్రభ ఎంతో చనువుగా..

''అలా దూరంగా ఉండకపోతే.. నువ్వు వచ్చి మాకు సహాయం చేయకూడదు..''

నవ్వుతూ అంటుంది ప్రభ.. ప్రభ మాటలకి శారద ఆశ్చర్యపోతుంది..

అక్కడ అంతమంది జనాలు  ఉన్నా, తనని ప్రత్యేకంగా ఆహ్వానిస్తున్నందుకు ఆమె ముఖం లో ఆశ్చర్యం. శారద ఆశ్చర్యంగా నించున్న చోటునే కదలకుండా ఉండడంతో ప్రభ చేయెత్తి రమ్మన్నట్టు సైగ చేస్తుంది..

ఆమె పిలుస్తున్నందుకు అలాగే ఆశ్చర్యపోతూ అప్రయత్నంగానే ఆ భిక్షగాళ్ళందరినీ దాటుకుని ప్రభ దగ్గరికి వస్తుంది.. ప్రభ ఆప్యాయంగా శారద చేయి పట్టుకుంటుంది..

శారద కి  సీత, రాధలని చూపిస్తూ ''వారికి సహాయం చేయమ్మా..'' అంటూంది..

శారద సీత, రాధల దగ్గరికి వెళ్తుంది.. ఆమె వెనకాలే ప్రభ కూడా వస్తుంది..

బ్యాగ్‌లో ఉన్న పండ్లని సీత, రాధలు బయటికి తీస్తుంటే వాటిని శారద అందుకుంటూ భిక్షగాళ్ళకి ఇస్తుంటుంది..

వాళ్ళు అలా పంచుతూంటే భిక్షగాళ్ళలో గొడవ మొదలవుతుంది.

''ఏయ్.. ముందు నేనొచ్చినాను, నేనే ముందొచ్చినాను.. ఒరే దొంగసచ్చినోడా.. దున్నపోతులా ఉన్నావు.. మేము తీసుకునేంత వరకూ కూతంత ఓపిక పట్టచ్చుకదా..''

వారు ఒకరికొకరు తోసుకుంటూ అరుస్తూ ఉంటారు..

భిక్షగాళ్ళందరూ ఒకరిపై ఒకరు పడుతూంటే పండ్లు, బ్రెడ్డు ఇవ్వడంలో చాలా ఇబ్బంది కలుగుతుంది..

శారద చేతిలోని పండ్లని లాక్కోవడానికి భిక్షగాళ్ళు చేసిన ప్రయత్నంలో కొన్ని అరటిపండ్లు కిందపడిపోతాయి..

వాటిని భిక్షగాళ్ళు పట్టించుకోకుండా ఆ పండ్లని కాళ్ళతో తొక్కుతారు.. కింద పడ్డ పండ్లని తీయాలన్న ధ్యాస కూడా వారికి ఉండదు..

ఆ పరిణామంతో శారద ముఖం లోకి కోపం ప్రవేశిస్తుంది..

ఆమె ఒక్కసారి ఆ భిక్షగాళ్ళందరినీ చూస్తుంది..

భిక్షగాళ్ళు వారి చేతిలో ఉన్న కంచంతో మాకంటే మాకు, మాకంటే మాకు అని అరుస్తూండడం ప్రారంభిస్తారు.

ఎంతో నీరసంగా ఉన్న శారద శరీరంలోకి అనుకోకుండా ఏదో శక్తి ప్రవేశిస్తుంది...

ఆమె రెండు చేతులని భిక్షగాళ్ళందరికీ అడ్డుగా పెట్టి ఒక్కతోపు తోస్తుంది..

దాంతో భిక్షగాళ్ళందరూ రెండడుగులు వెనక్కిపోతారు.. ఎంతో నీరసంగా కనిపిస్తున్న శారద తామందరినీ కిందపడిపోయేంతలా తోసేసరికి భిక్షగాళ్ళందరిలోనూ విపరీతమైన ఆశ్చర్యం..

శారద తోయడం చూసిన ప్రభ, సీత, రాధలు కూడా ఆశ్చర్యపోతారు..

''ఇక మీకు ఏమీ ఇచ్చేది లేదు.. వెళ్ళిపోండి ఇక్కడి నుండి..'' కోపంగా అంటూంది శారద. తిరిగి సీత, రాధల వైపు చూస్తూ..

''అమ్మా ఈ బ్యాగులన్నీ సర్దేయండి.. వీళ్ళకి ఇవ్వాల్సిన పనిలేదు..''

ఆమె మాటల్లో వినిపించిన కఠినత్వానికి సీత, రాధలతో పాటు ప్రభ కూడా ఆశ్చర్యపోతుంది...

ఆ హఠాత్పరిణామానికి భిక్షగాళ్ళు కూడా సైలెంటయిపోయి శారద వైపే ఆశ్చర్యంగా చూస్తుంటారు..

ఒక్కసారిగా అక్కడంతా నిశ్శబ్ద వాతావరణం ఏర్పడుతుంది...

శారద ముఖం లో కోపం.. కోపంతో ఆమె ఆ భిక్షగాళ్ళందరివైపు చూస్తుంటుంది..

ప్రభ ముఖం లో విపరీతమైన ఆశ్చర్యం.. ఒకవిధమైన ఎగ్జైట్‌మెంట్ ఆమెలో కనిపిస్తుంటుంది...

ఆమె చూపు శారదవైపే ఉంటుంది..

శారద ప్రభ వైపు చూస్తుంది.. ఇద్దరూ కళ్ళతోనే మాట్లాడుకుంటారు..

శారద ప్రవర్తనకి ఓ భిక్షగాడికి విపరీతమైన కోపం వస్తుంది.

''ఏవమ్మోయ్.. సూత్తావుంటే నువ్వు కూడా మాకులా అడుక్కుతినేదానిలా కనిపిత్తావున్నావు.. నీ శాంతానామేంది ఈడ.. ఆ.. మాకులా అడుక్కుతినేదానికి ఒచ్చినదానికి ఆళ్ళు పడేసినాటిని కామ్‌గా తీసుకుని ఓ మూలెల్లి తినకుండా ఇట్టా హుకుం జారీ సేత్తన్నావేమిటి..''

శారద అతని వైపు కోపంగా చూస్తుంది...

''ఎంతో కష్టపడి, ఎన్నో వ్యయప్రయాసల కోర్చి కొన్నివేల మైళ్ళు ప్రయాణం చేసి మీ కడుపు నింపాలన్న సదుద్దేశ్యంతో ఇక్కడికి వచ్చారు వీళ్ళు.. మీ కడుపు నింపి మీ కళ్ళల్లో ఆనందాన్ని చూడాలన్న ఆరాటం ఈ యమ్మది.. కానీ.. మేరేం చేస్తున్నారు..'' కోపంగా అంటూ భిక్షగాళ్ళందరి వైపు చూస్తుంది శారద..

భిక్షగాళ్ళందరూ శారదనే ఆశ్చర్యంగా చూస్తుంటారు.. ప్రభ కూడా ఆశ్చర్యంతో శారదనే గమనిస్తుంటుంది..

''ఆ యమ్మ మీ అందరికీ కావాల్సిన పండ్లని తీసుకువచ్చిందని తెలిసి కూడా ఇలా ఒకరిమీదొకరు పడుతూ ఉంటె ఎలా అందరికి పంచేది.. ఇదిగో చూడండి.. మీరు చేసిన తోపులాటకి పండ్లు నేలపాలయ్యాయి చూడండి..''

వాళ్ళ కాళ్ళకింద డజను వరకు అరటిపండ్లు నలిగిపోయి నేలపై చిందర వందరగా పడి కనిపిస్తాయి వాటిని చూసిన భిక్షగాళ్ళు తమ తప్పు తెలుసుకున్నట్టు తలదించుకుంటారు..

ప్రభ ఎంతో అబ్బురంగా శారదని గమనిస్తుంటుంది..

''ఇవి మామూలు పండ్లు కావు.. ఆ దేవుడి ప్రసాదాలు.. ఆ కాశీ విశ్వేశ్వరుడి ఆశీర్వాదంతో వచ్చిన అమృతభాంధములు.. సాక్షాత్తూ ఆ పరమేశ్వరుడి దీవెనలతో తీసుకువచ్చిన ఫలాలు.. ఇవి తింటే మీకు ఒక్క పూట కడుపు నిండుతుంది.. అంతే.. ఆ తర్వాత మీరు వీటి గురించి, ఇవి తీసుకువచ్చిన ఈ యమ్మగారి గురించి మరిచిపోతారు.. ఆ విషయం ఈ యమ్మకీ తెలుసు.. అయినా ఆమె కళ్ళల్లో అనంతమయిన ఆనందం కనిపిస్తుంది.. ఎందుకు..?''

శారద మాటలతో భిక్షగాళ్లందరూ ఒకరిమొహాలకరు చూసుకుంటారు...

ప్రభ విపరీతమైన ఆశ్చర్యంతో శారద వంక చూస్తుంటుంది.. ఆమె మాటలతో సీత, రాధలు సైతం ఒకరిమొహాలొకరు చూసుకుంటారు..

''కాశీలో ఆ పరమేశ్వరుడికి నైవేద్యంగా సమర్పించిన ఫలాలు,  పదిమందికి పెడితే వారిలో ఉండే పాపాలు తొలిగిపోయి వారి జీవితంలో వెలుగు రేఖలు పూస్తాయని, ఇలా అడుక్కుతినే దుర్భర జీవితం నుండి మంచి జీవితాన్ని ప్రసాదించేలా ప్రత్యేక పూజలు చేసి తీసుకువచ్చిన ఫలాలు ఇవి.. వీటిని కేవలం పండ్లులా కాకుండా ఆ దేవుడి ప్రసాదంలా భావించండి.. ఈ పండ్లలో ఆ దేవుడి ఆశీస్సులు ఉన్నాయని గమనించండి.. మీరలా చేస్తే పంచినందుకు ఈ యమ్మకు, వీటిని తిన్నందుకు మనకు ఆ దేవుడి కృప కలుగుతుంది.. అంతేకానీ.. ఇలా నేలపాలు చేస్తే.. ఎలాంటి ప్రయోజనం ఉండదు..''

ఆమె మాటలతో ప్రభ కళ్ళల్లో కన్నీళ్ళు సుడులు తిరుగుతాయి.. సీత, రాధల కళ్ళల్లో కూడా సన్నటి కన్నీటి పొర అలుముకుంటుంది..

భిక్షగాళ్లందరూ కూడా ఒకరిమొహాలకరు చూసుకుంటారు.. శారద ఆ భిక్షగాళ్ళని చూస్తుంది.. వారి కళ్ళల్లో తాము చేసిన పనికి పశ్చాత్తాపం కనిపిస్తుంటుంది..

మరొకరు చెప్పే అవసరం లేకుండానే భిక్షగాళ్లందరూ తమకి తాముగా ఓ వరుసక్రమంలో నిలబడుతారు..

ఆ పరిణామానికి ప్రభ మరింత ఆశ్చర్యపోతుంది.. ఆమె చూపు శారదవైపే ఉంటుంది.. ఆ చూపులో శారదపై ఎనలేని అభిమానం ప్రతిఫలిస్తుంటుంది..

శారద ప్రభని చిరునవ్వుతో చూసి ''అమ్మా.. మీ చేతులతో వీరందరికీ ఈ ప్రసాదాలు ఇవ్వండి..''

అంటూ ప్రభ చేతికి సీత, రాధలు అందజేసిన ఫలాలను ఇస్తుంది.. ప్రభ శారద వైపే అపురూపంగా చూస్తూ వరుసగా నిలబడ్డ భిక్షగాళ్ళకి ఫలాలు అందిస్తుంటుంది.. అలా అందుకున్న ఓ భిక్షగాడు ప్రభని, శారదని చూస్తూ

''మా అజ్ఞానానికి మన్నించడమ్మా.. ఇన్ని రోజులు ఈ యమ్మ ఒచ్చి ఇలా పండ్లు పంచుతాఉంటే.. ఏదో ఒక్క పూట కడుపునిండుతాంది అనే ఆలోచించినాము కానీ.. ఇయ్యి ఆ దేవుడి ప్రసాదాలని ఈరోజే తెలుసుకున్నాము తల్లీ.. ఈ ప్రసాదాలు తినటం మా అదృట్టం

అమ్మా.. ఈటితో పాటు ఆ శివయ్య దీవెనలని కూడా తీసుకువచ్చిన నువ్వు మా దేవతవి తల్లీ.. ఈ ఇషయాన్ని మాకు అర్థమయ్యేలా సెప్పిన నువ్వు కూడా దేవతవి తల్లీ.. మీ ఇద్దరూ చల్లగా ఉండాలి తల్లీ..'' శారద అతని వైపు చిరునవ్వు చిందిస్తూ చూస్తుంది..

ప్రభ మాత్రం శారదవైపే చూస్తూండి పోతుంది.. వరుసక్రమంలో వచ్చిన భిక్షగాళ్లందరికీ వారు తెచ్చిన పండ్లు పంచేస్తారు..

అయినప్పటికీ ప్రభ చూపు శారదవైపే ఉంటుంది.. శారద ప్రభని చూసి నవ్వుతుంది.. ప్రభ శారదని అలాగే చూస్తూ..

''నువ్వు మామూలు స్త్రీవి కాదు.. నీతో మాట్లాడాలి.. ఆ విశ్రాంతి గదిలోకి పద..'' అంటూ ఆ ప్రక్కనే ఉన్న రైల్వే విశ్రాంతి గదిలోకి దారి తీస్తుంది ప్రభ, అమె వెనుకాలే శారద కూడా అడుగు లేస్తుంది.

........................

ప్రభ విశ్రాంతి గదిలోకి వస్తుంది.. ఆమె వెనకాలే శారద వస్తుంది.. ఆ గదిలో మరో అయిదారుమంది ఆడవాళ్ళు కుర్చీలో కూర్చుని ఉంటారు. అందులో కొందరు ఏదో మాట్లాడుకుంటుంటారు. ఒకావిడ ఏదో మ్యాగజైన్ చదువుతుంటుంది.. మరో ఇద్దరు ఆడవాళ్ళు కుర్చీలో కూర్చునే నిద్రపోతుంటారు.. శారదని, ప్రభని ఎవరూ పట్టించుకోరు. ప్రభ వారికి కొద్ది దూరంగా ఉన్న రెండు కుర్చీల దగ్గరికి వెళ్ళి ఓ కుర్చీలో కూర్చుంటుంది.. శారదని కూడా తన పక్కనే ఉన్న కుర్చీలో కూర్చోమని చెబుతుంది. శారద కూర్చోగానే ప్రభ ఆమె చేతిని తన చేతిలోకి తీసుకుంటుంది ఆప్యాయంగా..

''గత పదిహేను సంవత్సరాలుగా నేను ఆ భగవంతుని సేవలో ఉన్నాను. జీవితంలో ఎన్నో కష్టాలు అనుభవించాను.

ఎన్నో అనుభవాలను ఎదుర్కొన్నాను. నాకంటూ ఆ దేవుడు ఓ ప్రపంచాన్ని ఇచ్చాడు.. ఆ ప్రపంచంలో నా భర్త, పిల్లలు నా కుటుంబం, అదే ప్రపంచం అనుకుని వారే నా సర్వస్వంగా గడిపాను. కానీ ప్రపంచం అంటే కేవలం ఒక్క కుటుంబం కాదని, ఈ సృష్టి చాలా పెద్దదని తెలుసుకొని ఇలా భగవంతుని ధ్యానిస్తూ ప్రజలకి సేవ చేస్తూన్నాను'' ప్రభ కళ్లలో కన్నీళ్ళు

సుడులు తిరుగుతాయి. శారద ప్రభనే చూస్తుంటుంది ఆశ్చర్యంగా.. ఆమె ఏమి చెప్పాలను కుంటుందో శారదకి అర్థం కాదు. కానీ ప్రభ మనసులో ఎంతో క్షోభని అనుభవిస్తుందని ఆమె ముఖం లోని భావాలను చూస్తుంటే శారదకి అర్థమవుతుంది. ప్రభ తనలోని బాధని దిగమింగుకుని, ముఖం లోకి చిరునవ్వుని తెచ్చుకుని శారద వంక చూస్తుంది.

''ఈ ఆధ్యాత్మిక ప్రపంచంలోకి అడుగుపెట్టి, ప్రజలకి నా వంతుగా చేస్తున్న సేవలో ఎంతో తృప్తి లభించింది, కానీ ఇంతవరకూ నా ఈ ప్రయాణంలో నా మనసుకు నచ్చిన వారు తారస పడలేదు. ఈ రోజు నిన్ను చూసిన తర్వాత ఆ లోటు కూడా తీరిపోయిందనిపిస్తుంది. నిన్ను చూస్తుంటే నాలో ఏదో తెలియని అనుభూతి, నీతో మాట్లాడుతుంటే ఏదో తెలియని ఆనందం నా మనసులో కలుగుతుంది.

ఈ స్టేషనుకి ఎన్నో మార్లు వచ్చి యాచకులకు నాకు తోచిన మేరకు ఇలా పళ్ళు పంచాను, ఆ పళ్ళు తిన్న తర్వాత వారి కళ్ళల్లో ఈ పూట కడుపు నిన్డిందన్న తృప్తిని చూసి ఎంతో సంతోషించేదాన్ని, కానీ.. నేను పంచుతున్నవి పళ్ళు కాదని, ఆ దేవుడి ప్రసాదాలని చెప్పి ఇంతవరకూ నాకే తెలియని విషయాన్ని నువ్వు తెలియజేసావు. అందుకు నేను నీకు ఋణపడి ఉన్నాను..''

''నిన్ను చూస్తుంటే ఎన్నో కష్టాలని అనుభవించిన దానిలా ఉన్నావు, కానీ నీ ముఖం లో మాత్రం ఆత్మస్థైర్యం కొట్టచ్చినట్లు కనిపిస్తుంది, ఎలాంటి పరిస్థితులనయినా ధైర్యంగా ఎదురొడ్డి పోరాడే ధీరురాలిలా కనిపిస్తున్నావు, కానీ ఇలా అడుక్కుతినేలా ఎందుకు అయ్యావు, అసలేమయింది, నీ గురించి ఎంతో తెలుసుకోవాలని ఉంది.. కానీ.. సమయం లేదు..''

ప్రభ కళ్లలో శారదపై ఎనలేని ఆప్యాయత కనిపిస్తుంటుంది.. ప్రభ మాటలతో శారద మనసు పొరల్లో నిక్షిప్తమైన ఉన్న గతాన్ని తాకుతాయి.. ఆమె మనసు గతంలోకి వెళుతుంది..

గతం గుర్తుకి రాగానే శారద ముఖం మ్లానమైపోతుంది.. తనకి జరిగిన అవమానాలన్ని ఒక్కొక్కటిగా ఆమె కళ్ళముందు కదలాడుతుంటాయి..

శారద మెల్లిగా ఫ్లాష్‌బ్యాక్‌లోకి జారుకుంటుంది..

ఒక పెద్ద బంగళా.. ఆ బంగళా ఆవరణలో శారదని ఓ వ్యక్తి చేయి పట్టుకుని బయటకు ఈడ్చుకువస్తుంటాడు..

అతని కళ్ళల్లో క్రోధం కనిపిస్తుంటుంది.. శారద అతని చేయిని విడిపించుకోవడానికి విశ్వ ప్రయత్నం చేస్తుంటుంది..

కానీ అతను ప్రభని ఈడుస్తూ బయటికి లాక్కుని వస్తుంటాడు..

ఆ బంగళా హాల్లో ఒక ఇద్దరు ఆడవాళ్ళు నిలబడి ఉంటారు. వారు ఖరీదైన చీరలు కట్టుకుని ఉంటారు. వారి ఒంటినిండా బంగారు ఆభరణాలుంటాయి. ఆ వ్యక్తి శారదని ఈడ్చుకుంటూ వెళుతుంటే వారి కళ్ళల్లో ఒక విధమైన పైశాచిక ఆనందం తాండవిస్తుంటుంది. ఆ పైశాచిక ఆనందంతో తమలో తామే నవ్వుకుని ఒకరి ముఖం ఒకరు చూసుకుంటారు. ఈ ఇద్దరి ఆడవాళ్ళ ముఖం లో ఒక విధమైన శాడిజం కనిపిస్తుంటుంది. వారికి ఇరువైపులా ఆ బంగళాలో పనిచేసే నౌకర్లు ఓ పది మంది ఆడవాళ్ళు, పది మంది మొగవాళ్ళు వరుసగా నిలబడి ఉంటారు..

శారదని ఈడ్చుకువెళుతుంటే వారు బాధగా శారదని చూస్తుంటారు. వారి కళ్ళల్లో కన్నీళ్ళు సుడులు తిరుగుతుంటాయి. శారదని ఆ వ్యక్తి అలా ఈడ్చుకుంటూ వెళుతుంటే అతనికి అడ్డుపడాలన్న కసి వారిలో కనిపిస్తుంటుంది.. కానీ ఏమీ చేయలేని నిస్సహాయస్థితిలో ఉంటారు.

శారదని ఆ పరిస్థితిలో చూసి బాధ పడటం తప్ప వారు ఏమీ చేయలేకపోతారు.

ఒకరి ముఖం లో బాధ స్పష్టమవుతుంటుంది.. మరొకరి ముఖం లో శారదని ఈడ్చుకు వెళుతున్న వ్యక్తిపై కోపం తాండవిస్తుంటుంది. ఆడవాళ్ళ మొహాల్లో ఎంతో బాధ కనిపిస్తుంటుంది..

ఒకరిద్దరు ఆడవాళ్ళు తమ చీర కొంగుతో కళ్ళనీళ్ళు తుడుచుకుంటుంటారు...

శారదని ఈడ్చుకుని వస్తున్న వ్యక్తి ఖరీదైన పైజామా డ్రెస్‌లో ఉంటాడు. మెడలో బంగారు గొలుసు, చేతికి బంగారు ఉంగరాలు ఉన్నాయి. అతను శారద భర్త తమ్ముడు, ఒకప్పుడు శారద ముందు నిలబడటానికే ఎంతో భయపడేవాడు.. కానీ ఇప్పుడు శారదని బజారుకీడ్చేంతగా ఎదిగిపోయాడు...

శారద అతని చేతిలోనుండి తన చేతిని విడిపించుకోవడానికి విశ్వప్రయత్నం చేస్తుంటుంది.. కానీ అతని పట్టునుండి విడిపించుకోవడం శారద వల్ల కాదు.. ఆ భవనం నుండి మెయిన్ గేటు

మధ్య రెండు వందల గజాల దూరం ఉంటుంది .. చుట్టూ పచ్చని చెట్లు, రకరకాల మొక్కలతో నిండి ఉంటాయి. ఆ చెట్ల మధ్యలో దారి ఉంటుంది..

ఆ వ్యక్తి ఆ దారినుండి ఈడ్చుకుని వెళుతుంటే.. శారద చూపు ఆ చెట్లపై పడుతుంటుంది.. ఆ వెంటనే ఆమె కళ్ళముందు కొన్ని దృశ్యాలు తాండవిస్తాయి.. ఆ పచ్చటి చెట్ల మధ్యలో శారద, ఆమె భర్త ఇద్దరూ సరదాగా గడిపిన దృశ్యాలు కదలాడుతాయి..

శారద, ఆమె భర్త సంతోషంగా ఆ పూల మొక్కల మధ్యలో మాట్లాడుకుంటూ గడిపిన దృశ్యం శారదకి గుర్తుకి వస్తాయి.. శారదని ఆమె భర్త ఆటపట్టిస్తూ ఆ మొక్క మధ్యలో నుండి అటూ ఇటూ పరుగెడుతున్న దృశ్యాలు  ఒక్కొక్కటిగా ఆమెకి గుర్తుకి వస్తాయి.

శారద, ఆమె భర్త ఇద్దరూ ఆ పూల మొక్కల మధ్యలో పరుగు తీస్తుంటారు.. వారు అలా సంతోషంగా గడుపుతుంటే, ఇప్పుడు శారదని ఈడ్చుకు వెళుతున్న వ్యక్తి ఆనందంతో వారి ఆట పాటలు చూస్తూ ఆస్వాదిస్తుంటాడు.

కానీ.. అప్పుడు తమ అన్యోన్యతని చూసి ఆనందించిన వాడే ఆ పూల మొక్కల  మధ్యలోనుండి శారదని అతను ఈడ్చుకు వెళుతూంటే.. ఆమె మనసు బాధతో దహించుకుపోతుంది. అతను గేటు వరకూ శారదని ఈడ్చుకు వస్తాడు, గేటు తీసి శారదని విసురుగా బయటికి నెట్టేస్తాడు.. ఆ విసరుకి శారద రోడ్డుపై కింద పడిపోతుంది..

అతని వెనకాలే ఇద్దరు ఆడాళ్ళు వస్తారు.. వారి చేతిలో ఓ సంచి ఉంటుంది.. కింద పడిపోయిన శారదని చూసి వారు రాక్షసానందాన్ని పొందుతారు.

శారదకి ఆ పరిస్థితి రావాలని ఎన్నో రోజులుగా ఎదురు చూస్తున్నట్టుగా ఉంటాయి వారి మొహాల్లోని భావాలు..

నేలపై పడి ఉన్న శారద తల పైకెత్తి వారి వంక చూస్తుంది.. శారద చూడగానే ఆ ఇద్దరి ఆడాళ్లలో ఒకావిడ చేతిలో ఉన్న సంచిని విసురుగా శారద ముఖం పై విసిరేస్తుంది.. శారదని ఈడ్చుకు వచ్చిన వ్యక్తి శారదపై కోపంగా చూస్తుంటాడు..

‘‘వెళ్ళు.. ఈరోజుతో నీకు ఈ బంగళాతో, మా కుటుంబంతో సంబంధం తెగిపోయింది.. మళ్ళీ ఈ బంగళా ఛాయలో కనిపించావంటే కాల్చిపారేస్తాను.. ఇకనుండి ఈ బంగళా మాదే, ఈ ఆస్తి మాదే.. హ..హ..హ..’’

అతని నవ్వు చాలా వికృతంగా ఉంటుంది.. నవ్వుతున్న అతని ముఖం లో.. అతని కళ్ళల్లో ఏదో రాక్షసానందం.. కిందపడి ఉన్న శారదకి సహాయం అందించాలని కొందరు నౌకర్లు ముందుకు కదులుతారు.. అది గమనించిన అతడు.. ''ఒరేయ్... నౌకర్లు నౌకర్లలాగా ఉండండి.. అతి తెలివి ఉపయోగించి, దానికి సహాయం చేయాలని చూసారో.. మీ మెడపై ఉన్న తలకాయలు గాల్లోకి లేచిపోతాయి.. మీరే కాదు.. ఈ గ్రామంలో దానికి ఎవ్వరూ సహాయం చేయకూడదు.. ఇకనుండి ఈ భవనానికి నేనే అధిపతిని, ఈ ఊరికి నేనే మహారాజుని, నా మాట కాదని ఏ ఒక్కడూ దానికి సహాయం చేసాడని తెలిసిందో... జాగ్రత్త..''

అతని మాటకి నౌకర్లు విపరీతంగా భయపడుతారు. శారదకి సహాయం చేయాలనుకున్న తమ నిర్ణయాన్ని మార్చుకుంటారు..

ఒకసారి శారద వైపు చూస్తారు.. వారి ముఖం లో ఎంతో ఆవేదన.. వారి కళ్ళల్లో మేమేమీ చేయలేము అన్న నిస్సహాయత కనిపిస్తుంటుంది..

కింద పడి ఉన్న శారదకి వారు ఏడుస్తూ రెండు చేతులెత్తి నమస్కరిస్తారు.. ఆ తర్వాత తలలు దించుకుని ఆ బంగళాలోకి వెళ్ళిపోతారు...

శారద చూపు ఆ బంగళాపైకి వెళుతుంది... ఆ బంగళాని చూస్తూ కిందపడిపోయిన శారద మెల్లిగా లేస్తుంది..

ఆ ఆడాళ్ళు విసిరేసిన సంచిని చేతిలోకి తీసుకుని, ఆ బంగళాని చూస్తూ అక్కడి నుండి మెల్లిగా కదులుతుంది..

వెళ్తూ.. వెళ్తూ.. వెనక్కి తిరిగి ఆ బంగళాని చూస్తుంటుంది..

ఆమె కళ్ళల్లోనుండి ధారాపాతంగా కన్నీళ్ళు వస్తుంటాయి.. ముక్కు పుటాలు అదురుతుంటాయి.. ఎంతో బాధని మనసులో దాచుకున్న ఎక్స్‌ప్రెషన్స్ ఆమె ముఖం లో కనిపిస్తుంటాయి..

శారద ముఖం లో కనిపించిన బాధని గమనించిన ప్రభ తన మాట వల్ల శారద అప్‌సెట్ అయ్యిందని అనుకుని శారద చేతిని తన చేతిలోకి తీసుకుని ఓదార్పుగా చిన్నగా నొక్కుతుంది. అంతలోనే వారణాసి నుండి వచ్చిన ట్రైన్ బయలు దేరుతుందన్న అనౌన్స్‌మెంట్ వినిపిస్తుంది.. ప్రభ శారద భుజం పై చేయి వేసి ఎంతో ప్రేమగా చూస్తుంది..

‘‘ఆ దేవుడు చాలా గొప్పవాడు.. ఈ సృష్టి ఓ చదరంగం అయితే ఆ చదరంగంలో కదిలే పావు లాంటి వాళ్ళు మనుష్యులు .. ఆ పావులను ఎప్పుడు ఎలా కదపాలో ఆ దేవుడికి తప్ప మరెవరికీ తెలియదు.. ఇప్పుడు నిన్ను ఇలా కలుసుకున్నందుకు నాకు చాలా ఆనందంగా ఉంది.. కానీ.. కానీ..’’

ప్రభ ముఖం లో ఏదో తెలియని బాధ.. శారద ప్రభ వైపే చూస్తుంటుంది.. ఆమె ముఖం లో ఎలాంటి భావాలు ప్రతిఫలించవు..

‘‘నీకు ఏదో సహాయం చేయాలనుంది.. కానీ.. సమయం లేదు.. నేను వెళ్ళాలి.. తప్పదు.. మళ్ళీ పదిహేను రోజుల తర్వాత ఇదే రైలులో ఇక్కడికి వస్తాను.. అప్పుడు నీతో మనసువిప్పి మాట్లాడుతాను--- రైలు బయలు దేరే  సమయం అయింది.. పద..’’

అంటూ ప్రభ కుర్చీలోనుండి లేస్తుంది.. శారద కూడా లేస్తుంది.. ప్రభ శారదనే చూస్తుంటుంది.. ఆమె మనసులో ఏదో తెలియని బాధ ఉంటుంది.. ఆ బాధ ఆమె ముఖం లో వ్యక్తమవుతుంటుంది...

ప్రభ ప్లాట్ ఫాం మీదికి వస్తుంది.. ట్రైన్ కదలటానికి  సిద్దంగా ఉంటుంది.. ట్రైన్ డోర్ దగ్గర సీత, రాధలు ప్రభ రాకకోసం ఎదురు చూస్తుంటారు.

ఆ పక్కనే భిక్షగాళ్ళందరూ నిలబడి ఉంటారు. ప్రభని చూసి వారు వినయంగా నమస్కరిస్తారు.. ప్రభ వెనకాలే శారద కూడా వస్తుంది..

ఆ భిక్షగాళ్ళవైపు ప్రభ చూసి నవ్వుతుంది.. గాలిలోకి చేయి ఊపుతుంది ఇక సెలవన్నట్టు.. దాంతో ఆ భిక్షగాళ్ళు కూడా చేయి ఊపుతారు..

తన వెనుక ఉన్న శారదని  చూస్తుంది ప్రభ.. ఉన్నట్టుండి శారదతో ఏదో చెప్పాలన్న ఆరాటం ప్రభలో కదలాడుతుంది..

శారద చిన్నగా నవ్వి గాల్లోకి చేయి ఊపుతుంది.. ప్రభ కూడా నవ్వి రైలు దగ్గరికి అడుగు వేస్తుంది.. ఒక మూడు అడుగులు వేసిన ప్రభ సడన్‌గా ఆగిపోతుంది..

ఆమె ముఖం లో సంభ్రమాశ్చర్యం.. ఆమె కళ్లల్లో ఎనలేని భక్తి భావం.. అది కలనా, నిజమా అన్న సందిగ్ధం.. ఒక్కసారిగా వెనక్కి తిరిగి చూస్తుంది..

అక్కడ శారద కనిపిస్తుంది.. అలా వెనక్కి తిరిగి చూసిన ప్రభని శారద ఆశ్చర్యంగా చూస్తుంటుంది...

కానీ ప్రభ చూపు శారదపై ఉండదు.. శారద వెనకా గోడకి వేళాడుతున్న సాయిబాబా ఫోటోపై ఉంటుంది.. ఆ ఫోటోలో సాయిబాబా చిరునవ్వుతో కనిపిస్తుంటాడు.. అది ఫోటోనే.. కానీ.. కానీ... ప్రభలో అంతర్మధనం.. తాను ఇప్పుడు ఏదో అద్భుతాన్ని చూసానన్న ఫీలింగ్.. ఒకసారి మళ్ళీ గుర్తుకు తెచ్చుకోవడానికి ప్రయత్నిస్తుంటుంది..

తాను వెయిటింగ్ హాల్లోనుండి బయటికి వస్తుంది.. ఆ తర్వాత భిక్షగాళ్ళవైపు చేయి ఊపుతుంది.. ఆ తర్వాత వెనక్కి తిరిగి శారదని చూసి చేయి ఊపింది..

శారదవైపు ప్రభ చూసి చేయి ఊపినప్పుడు.. ఆ వెనకా ఉన్న సాయిబాబా కూడా ప్రభని చూసి చేయి ఊపినాడన్న భ్రమ ప్రభలో కదలాడుతుంది.. అది భ్రమా.. లేక నిజంగానే ఆ సాయినాధుడు తనవైపు చూసి చేయి ఊపాడా అన్న సందిగ్దంలో ఉన్నప్పటికీ ఆ దృశ్యం గుర్తుకి రాగానే ప్రభ కళ్ళల్లో ఎనలేని ఆనందం.. ఆ ఆనందంతో ఆమె కళ్ళల్లో ఆనంధభాష్పాలు సుడులు తిరుగుతాయి..

ట్రైన్ కదులుతున్నట్లు హారన్ వినిపిస్తుంది.. మెల్లిగా ట్రైన్ కదులుతుంది.. ప్రభ శారదవైపు చూస్తుంది.. శారదకి ఏదో చెప్పాలన్న తపన ఆమెలో కనిపిస్తుంటుంది..

డోర్ దగ్గర నిలబడి ఉన్న సీత, రాధలు ప్రభ వైపే కంగారుగా చూస్తారు..

''అమ్మా.. త్వరగా రా అమ్మా ట్రైన్ కదులుతుంది..''

కంగారుగా అంటుంది.. ప్రభ ట్రైన్‌దగ్గరికి వస్తుంది.. ఆమె వెనకాలే శారద కూడా వస్తుంది.. ప్రభ ట్రైన్ ఎక్కాక శారదకి చెబుతుంది..

''నువ్వు.. నువ్వు.. ఈ పక్కనే ఉన్న సాయిబాబా మందిరానికి వెళ్ళు.. ఆ సాయినాధుడు నిన్ను పిలుస్తున్నారు..

తప్పకుండా నువ్వు వెళ్ళు.. ఆ సాయినాధుడికి సేవ చేయి..'' అలా చెబుతున్నప్పుడు ఆమె ముఖం లోని ఒక విధమైన అనుభూతి కదలాడుతుంది..''

ప్రభ ముఖం లో ఒక విధమైన భావోద్వేగం.. ఆమె ముఖం లో ఏదో తెలియని భక్తి భావం.. అలా అంటున్నప్పుడు ఆమె కళ్ళల్లో ఒకరకమైన ఉద్వేగం..

శారద ఆశ్చర్యంగా వెళ్తున్న రైలు వంకనే కళ్ళార్పకుండా చూస్తూండిపోయింది.. ప్రభ ఉన్నట్టుండి అలా అనేసరికి ఆమెకి ఏమీ అర్థం కాదు..

ట్రైన్ మెల్లిగా కదులుతుంది.. కదులుతున్న ట్రైన్‌లోనుండి ప్రభ శారదనే చూస్తుంటుంది...

తన గొంతు శారదకి వినిపిస్తుందన్నంత గ్యాప్‌లోనే కదులుతున్న రైలుకి, ప్రభకి మధ్య దూరం కలిగి ఉండడంతో ప్రభ మళ్ళీ శారదని చూస్తూ బిగ్గరగా అరిచింది. ''నా మాటవిని నువ్వు వెంటనే ఆ సాయిబాబా మందిరానికి వెళ్ళు.. నీకు అంతా శుభమే జరుగుతుంది.. మళ్ళీ మనం కలుసుకున్నప్పుడు నిన్ను నేను ఇలా చూడకూడదు.. ''

ఆమె ముఖం లో శారదపై ఉన్న ఆప్యాయత కనిపిస్తుంటుంది.. కానీ ఆమె మాటలో శారదని ఆదేశిస్తున్న ఫీలింగ్ కనిపిస్తుంది..

అప్రయత్నంగానే శారద వెళ్తాను అన్నట్టు తలూపుతుంది..

ట్రైన్ మెల్లిగా వేగం పుంజుకుంటుంది.. ప్రభ చేయి ఊపుతుంది.. శారద కూడా చేయి ఊపుతుంది.. ఆమె వెనుక ఉన్న భిక్షగాళ్ళు కూడా చేయి ఊపుతుంటారు...

.....................................

కదులుతున్న  ట్రైన్ వంకనే శారద ఎంతో అబ్బురంగా చూస్తూ ఈ లోకంలో లేనట్టుగా ప్రభకి ఇంకా అలా గాల్లో చేయి ఊపుతూనే ఉంటుంది.  ప్రభ కూడా శారద కూడా కనుచూపు మేర కనిపించేంత వరకు ట్రైన్ డోర్ దగ్గరే ఉండి ఆమె కూడా చేయి ఊపుతూనే ఉంటుంది. క్రమంగా ట్రైన్ వేగం పుంజుకుని ఆ ప్లాట్‌ఫాం నుండి వెళ్ళిపోతుంది.. అయినప్పటికీ శారద ఇంకా అలాగే చేయి ఊపుతుంటుంది.. కానీ ఆమె ముఖం లో ఇంకా ఆశ్చర్యం..

ఆమె ట్రైన్ వెళ్లిపోయిన వైపే చూస్తూ అలాగే చేయి ఊపుతుంటుంది.. బ్యాక్‌గ్రౌండ్‌లో ప్రభ అన్న మాటలు వినిపిస్తుంటాయి..

శారద చెవుల్లో ప్రభ పలికిన మాటలు గింగిరాలు  తిరుగుతూనే ఉన్నాయి..

''ఆ సాయినాధుడు నిన్ను పిలుస్తున్నాడు.. తప్పకుండా నువ్వు వెళ్ళు.. ఆ సాయినాధుడికి సేవ చేయి..'' సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ ఆవరణ..

శారద సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ బయట నిలబడి ఉంటుంది. ఆమె చేతిలో ఒక చిన్న సంచి ఉంటుంది. ఆ సంచిని రెండు చేతులతో గుండెకి హత్తుకుని పట్టుకుంటుంది. ఆమె చూపు చుట్టూ చూస్తుంటాయి. ఆటోలు, బస్సులు, కార్లు రోడ్డుపై అటూ ఇటూ తిరుగుతూ ఉంటాయి. శారదకి ఎటు వెళ్ళాలో అర్థం కాదు.. కానీ ఇంకా ప్రభ అన్న మాటలు చెవిలో వినిపిస్తూనే ఉంటాయి.. శారద మనసులో అనుకుంటుంది..

'సాయిబాబా మందిరం ఇక్కడ ఎక్కడుందో.. ఎలా వెల్లాలో ఏమీ అర్థం కావడం లేదు..' ఆమె మనసంతా అల్లకల్లోలంగా ఉంటుంది. మెయిన్ రోడ్డుకిరువైపులా వచ్చేపోయే వాహనాలను చూస్తూ రెండు నిముషాలు అలాగే నిబడుతుంది.. ఎటు వెళ్ళాలో తెలియని అయోమయం ఆమె ముఖం లో ప్రతిఫలిస్తుంటుంది..

రైల్వేస్టేషన్ ఆవరణ అంతా కోలాహంగా ఉంటుంది.. స్టేషన్ లోపలినుండి వస్తున్న ప్రయాణీకులతో అంతా రద్దీగా ఉంటుంది..

చుట్టూ ఉన్న జనాలని చూస్తూ ఉంటే శారద మనసులో ఒక ఆలోచన మెదిలింది.. ఇంతకీ ఈ చుట్టు ప్రక్కల సాయినాధుడి విగ్రహం ఎక్కడుందో తెలుసుకునేందుకు బాబా మందిరం ఎక్కడ ఉందో ఎవరినైనా అడిగితే చెబుతారు కదా..

ఆ ఆలోచన రాగానే అక్కడే నిలబడి ఉన్న ఓ ఇద్దరు వ్యక్తుల వద్దకు అడుగులు వేస్తుంది..

''ఏవండీ..''

ఆపిలుపుకి వారిద్దరూ శారదవైపుకి చూస్తారు.. శారదని కింది నుండి పైకి తేరిపార చూస్తారు వారు..

శారద నోరు తెరిచి వారిని సాయిబాబా మందిరం గురించి అడగాలనుకుంటుంది.. కానీ ఆమె నోట్లోనుండి మాట బయటికి రాకముందే ఒక వ్యక్తి చిరాగ్గా..

''వెళ్ళవమ్మా..'' అడుక్కోవడానికి వేళాపాళా లేదు వీళ్లకి.. "సీరియస్‌గా మేమేదో మాట్లాడుకుంటుంటే ఏవండీ అని పిలిచి మరీ అడుక్కోవాలా.. వెళ్ళు ఇక్కడి నుండి...'' కోపంగా అంటాడు అతను.. అతని మాటలకి శారద షాకఅయింది..

"తాను అడగాలను కున్నది ఏమిటి..? వాళ్ళు అర్థం చేసుకున్నది ఏమిటి..?" మనసులోనే అనుకుంటూ లోలోననే కుమిలిపోతూ తల దించుకుని అక్కడి నుండి కదులుతుంది... ఆమె

మనసు ఎంతో బాధతో నిండిపోతుంది. తల దించుకుని ఎక్కడికి వెళుతుందో కూడా తెలియకుండా ఆవేశంగా ముందుకు అడుగు వేస్తుంది.. ఆ వ్యక్తులు అన్న మాటలతో శారద మనసు ఎంతో వేదనకి గురవుతుంది.. ఆ రోడ్డు పక్కనుండి అమాయకంగా అటూ ఇటూ చూస్తూ ముందుకు అడుగులు వేస్తుంది. అలా కొద్ది దూరం వెళ్ళాక మెయిన్ రోడ్డుని దాటి ఒక వీధిలోకి వెళుతుంది..

..............................

అది ఒక కాలనీ.. ఆ వీధి ఎంతో ప్రశాంతంగా ఉంటుంది.. వరుసగా ఉన్న ఒక క్రమ పద్దతిలో కట్టబడిన డూప్లెక్స్ బంగళాలతో చాలా అందంగా కనిపిస్తుంది ఆ వీధి. ప్రతీ ఇంటిముందు పచ్చని చెట్లు. చల్లగా వస్తున్న గాలి, ఆ వాతావరణం ఎంతో ఆహ్లాదకరంగా ఉంటుంది..

శారద ఆ వీధిని చూస్తూ కొద్దిసేపు అలాగే నిలబడి పోతుంది.. ఈ వీధిలో ఖచ్చితంగా సాయిబాబా మందిరం ఉంటుందని మనసులో గట్టిగా అనుకుంటూ ముందుకు సాగుతుంది..

ఆ వీధికి ఇరువైపులా ఉన్న బంగళాలను తన్మయత్వంతో చూస్తూ అలా నడుస్తుంటుంది... ఆ వీధి చివరి వరకు వెళ్లినా కూడా సాయిబాబా మందిరం కనిపించకపోవడంతో ఆమె ముఖం లో నిరుత్సాహం కనిపిస్తుంది..

చాలా దూరం నడవడంతో ఆమె ముఖం అంతా చెమటతో నిండిపోతుంది.. కాళ్లలో నడిచే ఓపిక సన్నగిల్లిపోతుంది.. ఇంక ముందుకి నడవడానికి ఆమె కాళ్లలో సత్తువ లేనట్టు తెలియడంతో ఆ పక్కనే ఉన్న పార్కు దగ్గరికి మెల్లిగా అడుగులు వేస్తుంది..

దాహంతో గొంతు తడారిపోవడంతో నీళ్లకోసం చుట్టూ చూస్తుంది.. కానీ ఎక్కడా నీళ్లు దొరికే జాడ కనిపించదు.  ఆమె శరీరం అంతా వణుకు ప్రారంభం అవుతుంది.. ముందుకు కదల లేనంత అశక్తి ఆమె శరీరంలోకి ప్రవేశిస్తుంది..

దాహంతో గొంతు తడారి పోతుంటే... ఇక ఉండబట్టలేక కాళ్ళలో సత్తువ తెచ్చుకుని ఒక ఇంటి ముందుకి వెళుతుంది.. ఆ ఇంటి గేటుని తట్టడానికి తన కుడిచేయి ముందుకి చాపుతుంది...

ఆమె చేయి గేటు వరకు వెళ్లి తట్టబోయి సడన్‌గా ఆగిపోతుంది.. ఆమె చూపు ఆ గేటు నుండి పోర్టికో మధ్యలో ఉన్న పచ్చని పచ్చిక బయళ్లపై పడుతుంది..

ఆ పచ్చిక బయళ్ల మధ్యలో వరుసగా పేర్చబడిన అందమైన పూల మొక్కలు, ఆ మొక్కలకి కాసిన పూలు, ఎంతో ఆహ్లాదకరమైన వాతావరణం.. ఆ వాతావరణాన్ని చూడగానే ఆమెకి గతం గుర్తుకు వస్తుంది..
సరిగ్గా ఆ బంగళాలో కనిపిస్తున్న వాతావరణంలో తన భర్తతో ఆ పచ్చికబయళ్ల మధ్యలో సరదాగా గడిపిన క్షణాలు గుర్తుకు వస్తాయి.. మెల్లిగా శారద గతంలోకి వెళుతుంది.

...............................

శారద భర్త చేతిలో ఓ ప్లేట్ ఉంటుంది.. శారద పచ్చికబయళ్ల మధ్య ఉన్న ఊయలలో కూర్చుని ఊగుతూంటే ఆమె భర్త శారదకి గోరుముద్దలు పెడుతుంటాడు.. శారద ఎంతో సంతోషంగా భర్త పెడుతున్న గోరుముద్దలు తింటూ ఊయల ఊగుతుంటుంది.. చూడటానికి ఆ దృశ్యం ఎంతో అందంగా కనిపిస్తుంది.
అలా గోరు ముద్దలు తింటున్న శారదకి పొలమారుతుంది.. దాంతో వెంటనే ఆమె భర్త పక్కనే ఉన్న మంచినీళ్ల గ్లాస్‌ని ఆమెకి అందిస్తాడు.. పొమారడంతో శారద దగ్గడంతో ఆ పరిసరాలలోని పనిచేసుకుంటున్న పనివారు కంగారుగా శారద దగ్గరికి పరిగెత్తుకుని వస్తారు.. శారద భర్త అందించిన గ్లాసుతో మంచినీళ్లు త్రాగుతుంది. శారద భర్త ఆమె తలపై తడుముతాడు.. ఆమె చుట్టూ పనివారు మూగుతారు.. వారందరి మొహాల్లో కంగారు కనిపిస్తుంటుంది..
తనకి కేవలం పొలమారితే వచ్చిన దగ్గు వల్లే వీళ్లందరిలో ఇంత కంగారా.. అన్న ఫీలింగ్ శారద ముఖం లో కనిపిస్తుంది.. అలాంటి జీవితాన్ని గడిపిన శారద ప్రస్తుతం గొంతు తడారిపోతున్నా గుక్కెడు మంచినీళ్ళు అందించే పరిస్థితి లేకపోవటం... ఆమె దురదృష్టానికి సంకేతంలా ఉంది. మధ్యాహ్నం వేళలో, సూర్యుడు ఎర్రగా తన ప్రతాపాన్ని చూపిస్తుంటే గొంతు నీళ్ళతో తడవకపోతే సొమ్మసిల్లే ప్రమాదం పొంచి ఉండడంతో శారద ఓ ఇంటి గేటు దగ్గర మంచినీళ్ళు అడగటానికి నిలబడుతుంది.. శారద కళ్లల్లో సన్నటి కన్నీటి పొర..

‘‘ఒకప్పుడు తనకి పొలమారితేనే అంతమంది కంగారుగా తనకి ఏమయిపోయిందో అని చుట్టూ మూగారు, కానీ ఇప్పుడు.. దాహంతో గొంతు ఎండిపోయినా అడిగే వారు లేరు..’’ అలా అనుకుంటూంటూ ఆమె మనసు బాధతో మూలుగుతుంది.

శారద ముఖం లో నైరాశ్యం.. విరక్తిగా నవ్వుతూ ఆ ఇంటి గేటు తడుతుంది..

‘‘అమ్మా...!’’ అంటూ ఆర్ధంగా పిలుస్తుంది. శారద పిలుపుకు ఎవరూ స్పందించరు.. శారదకి దాహం అధికమవుతుంది.. దాంతో ఇంటి గేటుని కాస్త గట్టిగా తడుతూ

‘‘అమ్మా.. కాసిన్ని మంచినీళ్ళు ఇస్తారా..?’’ ఎంతో జాలిగా అడుగుతుంది.

ఆమె మాటలకి ఆ ఇంటి తలుపు తెరుచుకుంటుంది.. దూరంగా తలుపు డోర్ దగ్గరే ఉండి, గేటు దగ్గర అలసటగా కనిపించిన శారదని గమనిస్తుంది ఒక మహిళ. ఆమె ఆ ఇంటి ఓనర్ అని ఖరీదైన ఆమె కట్టూబట్ట వల్ల తెలుస్తుంది. ఒక నలభై సంవత్సరాల వయసుంటుంది ఆవిడకి, గోల్డ్‌ఫ్రేమ్ కళ్ళజోడు పెట్టుకుని ఉంటుంది. ఇంటి గుమ్మం నుండి కాస్తంత ఇవతలికి వచ్చి కళ్ళజోడు సవరించుకుని మరీ మెయిన్ గేటు వైపు చూస్తుంది..

ఆ మహిళ బయటికి రావడం చూసిన శారద కళ్ళల్లో ఆనందం.. ఆమె చేతిలో మంచినీళ్ళతో కూడిన గ్లాసేమైనా కనిపిస్తుందేమో అని ఆశగా చూస్తూంది. కానీ ఆమె చేతిలో గ్లాస్ కాదు కదా.. చిన్న కప్పు కూడా కనిపించదు.

శారదలో విపరీతమైన అశాంతి ప్రవేశిస్తుంది. అయినా తనని తాను సర్దుకుని ముఖం లోకి చిరునవ్వుని తెచ్చిపెట్టుకుంటూంది, శారద ఆ మహిళకి కనిపించేలా నిలబడి ‘‘అమ్మా.. కాసిన్ని మంచినీళ్ళు ఇస్తారా..? చాలా దాహంగా ఉంది..’’

శారద గొంతు ఎంత నీరసంగా ఉందో, అంతకంటే ఎక్కువ అభ్యర్ధన ఆమె గొంతులో ప్రతిఫలిస్తుంది.. శారద మాటని విన్న ఆ మహిళ శారదని మరొకసారి నిశితంగా గమనిస్తుంది.. చెమట కొట్టుకుపోయిన శరీరం, నెరిసిపోయిన జుట్టు, వెలిసిపోయిన బట్టలు చూడగానే బిచ్చగత్తెలా కనిపించడంతో ఆ మహిళ ముఖం లో చిరాకు ప్రవేశిస్తుంది..

‘‘అడుక్కుతినేవాళ్ళకి రాను రాను తెలివి మీరిపొతోంది.. మంచినీళ్ళడిగితే దయ తలచి తిండి కూడా పెడతామని, లోకంమీద ఉన్న జాలినంతటినీ ముఖం లోకి తెచ్చుకుని మరీ

నాటకాలాడతారు.. ఎక్కడి నుండి వస్తారో, ఏమిటో ఇలాంటి వాళ్ళు..'' ఆమె ముఖం లో అసహ్యం చోటు చేసుకుంటుంది..

''అమ్మా.. కొన్ని మంచినీళ్ళు ఇచ్చి పుణ్యం కట్టుకో తల్లీ.. దాహంతో చనిపోయేలాగున్నాను..'' శారద గొంతులో వినిపిస్తున్న దైన్య స్థితికి కూడా కరిగిపోలేదు ఆ మహిళ, వచ్చిన దారినే ఇంట్లోకి వెళుతూ ''ఇంట్లో పనివాళ్లెవరూ లేరు.. వెళ్లు.. వెళ్లు..'' ఈసడింపుగా అంటూ లోపలికి వెళ్ళి ధడేల్ మంటూ తలుపేసుకుంటుంది ఆవిడ.

ఆ మహిళ తలుపు వేసుకున్న తీరు, ఆమె చెప్పిన నిర్లక్ష్యపు సమాధానంతో శారద అవాక్కైపోతుంది.. ఆమె హృదయం గాయపడుతుంది.. విపరీతమైన ఆశ్చర్యకర భావంతో కళ్ళని పెద్దవి చేసి, ఆచేతనంగా అలాగే చూస్తూండి పోతుంది--- ఒక్క క్షణం కూడా అక్కడ శారదకి ఉండాలనిపించలేదు, ఆ వెంటనే ఆక్కడి నుండి ముందుకి కదులుతుంది.. పైనుండి సూర్యభగవానుడు ప్రతాపం చూపుతుండడంతో రెండడుగులు కూడా ముందుకి వేయలేకపోతుంది..

సూర్య కిరణాలు సరాసరి ఆమె ముఖం పై పడుతుంటే.. ఊపిరి తీసుకోవడానికి కూడా నానా అవస్థ పడుతుంది.. మరి కాసేపట్లో స్పృహ కోల్పోయే స్థితిలోకి వస్తుందనగా--- ఆమె వెనుక నుండి ఓ కుక్క అరిచిన శబ్దం వినిపిస్తుంది.. అది గట్టిగా మొరుగుతుంటుంది.. ఏమిటా అని శారద వెనక్కి తిరిగి చూస్తుంది.. ఆమెకి కొద్ది దూరంలో ఓ రెండు కుక్కల్ని ఓ వ్యక్తి తరుముతూ పరుగెత్తుతూ వస్తూ కనిస్తాడు శారదకి..

ఆ వ్యక్తికి దాదాపు 45 సంవత్సరాలు ఉంటాయి. చూడగానే కుర్తా, పైజామా వేసుకుని ఉంటాడు, నెరిసిపోయిన గడ్డం ఉంటుంది. చేయికి ఓ సంచి వేలాడుతుంటుంది.. మరో చేతిలో రాయి ఉంటుంది.. ఆ రాయిని కుక్కని కొట్టడానికి ఎత్తుతూ పరిగెడుతూ ఉంటాడు...

''భౌ..భౌ..'' అంటూ మొరుగుతూ శారద పక్కనుండే ఆ కుక్కలు ఆ వీధి సందు చివరికి వెళ్ళిపోతాయి.. ఆ వ్యక్తి శారదకి కాస్త ముందుగా వచ్చి ఆగుతాడు, కాస్త సేద తీర్చుకుందామన్నట్టుగా...

శారద ఆ వ్యక్తిని నీరసంగా చూస్తుంటుంది..

కుక్కలు సందు చివర్లోకి వెళ్ళగానే ఆ వ్యక్తి మెల్లిగా శారద వైపు తిరుగుతాడు..

ఆ వ్యక్తిని శారద ఆశ్చర్యంతో చూస్తూ నిలబడుతుంది..

''సాలా... ఏ కుత్తోంకో కుచ్‌భీ దిమాఖ్ నహీ హై.. భూక్ లగేతో దేనేవాలేకో పాస్ జానాహై, ఐసా ఖతర్‌నాఖ్ ఏరియా ఫే గుమేతో ఏ లోగ్ ఖుత్తేకో మార్ మార్‌కే ఖూనీ కర్తాహై..!

ఆ వ్యక్తి మాటలకి శారద ఆశ్చర్యంగా చూస్తుంది అతని వైపే, అతను కూడా శారదని చూస్తాడు.. ఇద్దరూ ఒకరినొకరు చూసుకుంటారు.. ఆ ముసలి వ్యక్తి శారద వైపు గంభీరంగా చూస్తాడు. శారద అతన్ని అయోమయంగా చూస్తుంటుంది.. ఆమె ముఖం లో ఫీలింగ్స్‌ని బట్టి తాను అన్న మాటలు ఆమెకి అర్థం కాలేదని అతనికి తెలిసిపోతుంది.. దాంతో ఆ వ్యక్తి ముఖం లో చిరునవ్వు కదలాడుతుంది... ''ఓ, నీకు హిందీ రాదా..! నేను ఏమీ అంటున్నానంటే.. ఈ కుక్కలు ఉన్నాయి చూశావూ, మామూలు కుక్కలు కావు, ఊర కుక్కలు, వీధి మీద పడి జనాలని ఇక్కట్లకి గురి చేస్తుంటాయి.. ఈ వీధిలో ఉన్న జనాలు అస్సలే మంచోళ్లు కారు, ధనం పిచ్చి పట్టిన వాళ్ళు, కోట్లకు కోట్లు డబ్బు సంపాదించాలని, ఆడంబరమైన జీవితాన్ని అనుభవించాలని చూస్తారే తప్ప మరొకటి ఇక్కడి వాళ్ళకు పట్టదు, ఇలాంటి మనుషులున్న ఈ వీధిలో ఈ పిచ్చి కుక్కలు పెద్దగా మొరుగుతూ శబ్దం చేస్తుంటే పనివాళ్ళను పెట్టించి మరీ వాటి కాళ్ళు ఎక్కడ విరగ్గొట్టిస్తారో అని ఇలా తరుముతున్నాను.. అయినా మంచితనంతో కాసిన్ని మంచినీళ్ళు కూడా దానం చేయాలన్న దయాగుణం లేని వాళ్ళు కదా.. అందుకే ఇట్లా కుక్కలని కూడా తరమాల్సి వస్తుంది...''

శారదకి ఆ వ్యక్తి మాటలు చాలా విచిత్రంగా అనిపించాయి..

''సాటి మనిషిని పట్టించుకునే మనిషులే లేని ఈ నగరంలో ఈయనేమిటి కుక్కలపై ఇంత శ్రద్ధ తీసుకుంటున్నాడు''

అతను చేసిన చర్యలతో శారద తానున్న పరిస్థితిని మరిచిపోయింది.. అంతవరకూ గొంతు తడుముకోవడానికి మంచినీళ్లకోసం తహతహలాడిన ఆమె మనసుని మార్చగలిగాడు ఆ వ్యక్తి. ఆమె మనసులోని భావాలని గమనించినట్టుగా ''హ..హ..హ.. హలో బహెన్.. మీరు ఏమీ సోచాయిస్తున్నారో నాకు సమజయింది.. మనుష్యులని పట్టించుకునే మనిషిలేని ఈ ఏరియాలో కుక్కల కోసం ఇంత ఇంట్రెస్ట్ తీసుకుంటున్నాడేమిటన్నదే కదా నీ డౌట్.. దేఖో బహెన్..

మనుష్యులు తమ మనసులోని భావాలని బయటికి చెప్ప గలుగుతారు.. కానీ ఈ  కుక్కలు చెప్పలేవు కదా.. అందుకే ఈ కుక్కలంటే కొంచెం జాలి చూపిస్తున్నాను..

అంటూ అతని భుజానికి వెళాడుతున్న జోలె లోనుండి ఒక వాటర్ బాటిల్‌ని తీసి కొన్ని నీళ్ళు త్రాగి తిరిగి జోలెలో వేసుకోబోతూ శారద వైపు చూస్తాడు..

శారదకి మంచి నీళ్ళు చూడగానే ప్రాణం లేచివచ్చినట్టవుతుంది.. మంచినీళ్ళ బాటిల్ చూస్తూ నోటితో పెదాలని తడుపుకుంటూ ఆ బాటిల్‌వైపు ఆశగా చూస్తుంది..

''క్యా బెహెన్.. మంచినీళ్ళు త్రాగుతావా.. ఇంద తీసుకో.. ''

చిన్నగా నవ్వుతూ అంటూ ఆ వాటర్ బాటిల్‌ని శారదకిస్తాడు..

శారద యథాలాపంగా ఆ మంచినీళ్ళ బాటిల్‌ని తీసుకుని నీళ్ళు త్రాగుతుంది..

శారద మంచినీళ్ళు త్రాగుతుంటే ఆ వ్యక్తి శారదనే గమనిస్తూంటాడు చిరునవ్వుతో...

మంచి నీళ్ళు త్రాగాక ఆమెలో ఓ నూతన శక్తి వచ్చినట్టవుతుంది.. మంచి నీళ్ళు త్రాగాక ఆ బాటిల్‌ని ఆ వ్యక్తికి తిరిగి ఇస్తూ ఏదో అనాలని నోరు తెరుస్తుంది...

కానీ అతను అదేదీ పట్టించుకోకుండా ''ఈ కుక్కలు ఎంత దూరం వెళ్ళాయో ఏమిటో.. వాటిని పట్టి ఈ మనుష్యులకి దూరంగా, సురక్షితమైన ప్రాంతంలో వదిలేయాలి.. నిన్ను చూస్తుంటే చాలా నీరసంగా ఉన్నట్టున్నావు.. ఇదిగో.. ఇలాగే నేరుగా వెళ్ళి ఆ సందు మలుపు దాటిన కొద్ది దూరంలో సాయిబాబా మందిరం ఉంది.. అక్కడి కెళ్ళి కాస్త సేదతీరు.. ఈ ఎండలు తగ్గేంత వరకూ..''

అంటూ మరో మాట మాట్లాడకుండా ఆ కుక్కలు వెళ్ళిన వైపుకి పరుగు పరుగునా అడుగులు వేసుకుంటూ వెళ్ళాడు ఆ వ్యక్తి..

శారద ఎంతో ఆశ్చర్యపోతుంది..

అతను వెళుతుంటే ఏదో అడగాలని అనుకుంటుంది.. కానీ.. అదేమీ పట్టనట్టు ఆ వ్యక్తి వెళుతుంటే విపరీతమైన ఆశ్చర్యం ఆమె ముఖం లో కనిపిస్తుంటుంది..

ఆ వ్యక్తి వెనక్కి తిరిగి చూడకుండా అలా వెళుతుండగా,

శారద అతని వైపే కన్నార్పకుండా చూస్తూండిపోతూంది.

.................

అది సాయిబాబా మందిరం ఆ మందిరం ఆలయ కమిటీ మేనేజరు కంగారుగా అటూ ఇటూ పచార్లు చేస్తూంటాడు.. అతని పక్కనే ఓ వ్యక్తి నిలబడి ఉంటాడు. అతను ఆ మందిరానికి వచ్చే భక్తుడు. స్థానికంగా ఉండే వ్యక్తి.

మేనేజరు ముఖం లో అసహనం కనిపిస్తుంటుంది.. చిరాగ్గా చేతి వాచ్ వంక చూసుకుంటూ నానా హైరానా పడిపోతుంటాడు. అతను కోపంగా తన పక్కనే నిలబడి ఉన్న వ్యక్తితో ''ఏమయ్యా.. ఇక్కడ నేను ఎవరిని..? ''

ఆ వ్యక్తి కంగారుగా.. ''ఎవరిని అంటారేమిటండీ.. ఈ టెంపుల్‌కి మేనేజర్ మీరే కదా..?'' వ్యక్తి ముఖం లో ఆశ్చర్యం తాండవిస్తుండగా అంటాడు.

మేనేజర్ తిరిగి ఆ వ్యక్తిని ప్రశ్నిస్తాడు..

''మేనేజర్ చేయాల్సిన పనులేమిటయ్యా..?''

ఆ వ్యక్తి తడుముకోకుండా.. ''మేనేజరన్నాక, ఈ ఆలయ బాగోగులు చూడాలి.. భక్తుడుకి అసౌకర్యం కలగకుండా చూడాలి..! ఓవరాల్‌గా ఈ ఆలయ పవిత్రతకి భంగం కలగకుండా జాగ్రత్తగా చూడాలి..''

''కదా.. మరి.. అలాంటి పనులు చూసుకోవాల్సిన నేను, ఇలాంటి పనులు కూడా చూసుకోవాల్సి రావడమేమిటండీ..? '' చిరాగ్గా అంటూ తల కొట్టుకుంటాడు మేనేజర్..

''అలాంటి పనులు కాకుండా ఇంకా ఎలాంటి పనులు చూసుకుంటున్నారండీ..!''

ఆ వ్యక్తి ముఖం లో ఆశ్చర్యం మేనేజరు భుజాలు ఎగుర వేస్తూ అంటాడు..

''అన్ని పనులూ నేనే చూసుకోవాల్సి వస్తుందండీ..! ఉదయం కాకడ హారతి కి పది నిమిషాలు సమయం ఉందనగా వస్తారు పూజారి గారు.. హారతి ముగించుకోవడం మళ్ళీ మధ్యాహ్న హారతికి పది నిమిషాల ముందు వరకు మనకి కనిపించరు.. ఈ మధ్యలో భక్తులు సమర్పించే కొబ్బరికాయలు, గట్రా అలాగే పేరుకు పోయి ఉంటున్నాయి..

ఇవన్నీ పూజారి గారు చూసుకోవాలి కదా.. ఆయన అదేమీ పట్టించుకోవడం లేదు.. ఇక ఒకతన్ని పరిశుభ్రత కోసం క్లీనింగ్ హెడ్‌గా పెట్టినా.. ఆయన ఏమీ పట్టించుకోకుండా వెళ్ళిపోతున్నాడు.. ఇదిగో చూడండి.. ఈ హాల్లో ఎంత దుమ్ము ఉంది.. ఈ హాలు పరిస్థితి చూస్తే

వచ్చే భక్తులు ఎంత అనీజీగా ఫీల్ అవుతారు.. ఛ..ఛ.. వీళ్లకి బొత్తిగా పరిశుభ్రత అన్నది లేకుండా పోయిందండీ..!'' మేనేజర్ కోపంగా అంటూ అటూ ఇటూ తిరగడం ప్రారంభించాడు..

ఆ వ్యక్తి ఈ మాత్రం దానికే ఇంతలా టెన్షన్ పడిపోవాలా.. అన్నట్టుగా మేనేజర్ వంక చూస్తాడు..

''ఈమాత్రం దానికి ఇంత టెన్షన్ పడిపోవాలాండీ..! మీ క్లీనింగ్ హెడ్‌కి చెప్పేస్తే సరిపోతుంది కదా..! ఆయనే చూసుకుంటాడు కదా..?''

''అదీ జరిగింది..! ఆయన అవుటాఫ్ సిటీలో ఉన్నాడంట.. అర్జెంట్ కాల్ వస్తే వెళ్లాడంట.. క్లీనింగ్ కోసం ఎవరో ఒకావిడని మాట్లాడాను.. ఆవిడకి ఎవరూ లేరు, ఇక్కడే టెంపుల్ క్లీనింగ్ చూస్తూ ఇక్కడే ఉంటుందని.. ఆవిడ వస్తుంది.. కాస్త మీరు పికప్ చేసుకోండని చెప్పాడు.. నాకేమో బయటికి వెళ్ళాల్సిన పనుంది.. ఆవిడేమో ఇంకా రావడం లేదు.. అంతా టెన్షన్.. టెన్షన్.." మేనేజరు అలా అంటుండగానే ఆ టెంపుల్ మెయిన్ గేటు లోనికి దిక్కులు చూస్తూ వస్తుంది శారద.. మేనేజర్ ఆమెను చూస్తాడు. చంకలో చిన్న సంచిలాంటిది పెట్టుకుని దిక్కులు చూస్తూ వస్తున్న ఆమెని చూడగానే క్లీనింగ్ హెడ్ చెప్పిన ఆవిడ ఈవిడే అనుకుంటాడు.

''ఆ.. అదిగో ఆవిడ వచ్చినట్టుంది.. తొందరగా ఆవిడతో మాట్లాడి బయలు దేరాలి.. సరే.. మరి ఉంటాను..''

అంటూ ఆ వ్యక్తితో చెప్పేసి, మందిరం హాల్‌లో నుండి బయటికి వస్తాడు.. అతను బయటకు వచ్చే సమయానికి శారద వెనకాలే, ఇంచుమించు అంతే వయసుగల మరొకావిడ చేతిలో బ్యాగ్‌తో లోనికి వస్తుంది..

వారిద్దరిని చూసిన మేనేజర్ కాసేపు ఆశ్చర్యపోతాడు..

''ఇదేమిటీ.. అతను ఒక్కావిడనే పంపిస్తానని చెప్పాడు.. ఇప్పుడు చూస్తే ఇద్దరు వచ్చారు.. ఇందులో అతను పంపిన ఆవిడ ఎవరు.. వీరిద్దరిలో మనవాడు ఎవరిని పనికి పంపించాడో తెలుసు కోవడానికే అరగంట గడిచిపోతుంది..

అవతల చైర్మన్ గారు ఉన్న ఫళంగా రమ్మని హుకుం జారీ చేశారు.. ఇప్పుడేం చేసేది..?''

తనలో తనే అనుకుంటున్నట్టుగా అనుకుంటాడు గోపాల్.

అంతలో ఆయన జేబులో ఉన్న సెల్ ఫోన్ మ్రోగుతుంది..! జేబులోంచి ఫోన్ తీసి 'హలో' అంటాడు. అవతలి నుండి కంఠం వినిపిస్తుంటుంది..

''హల్లో.. ఆ సర్.. వచ్చేస్తున్నాను సార్.. జస్ట్ ఒక పదినిమిషాలలో మీముందుంటాను.. అంటే.. అదీ.. ఇక్కడ టెంపుల్‌లో అర్జెంటుగా ఓ పని పడింది.. అందుకే కాస్త ఆలస్యం అయ్యింది.. ఫర్వాలేదు.. నేను వెంటనే బయలు దేరుతున్నాను సార్..''

అంటూ కంగారుగా ఫోన్ జేబులో పెట్టుకుంటూ వారి దగ్గరకు వస్తాడు..

శారద అతన్ని చూడగానే..

''అయ్యా.. ఇక్కడ మందిరంలోపల...'' అంటూ ఏదో చెప్పబోతూంటే మేనేజర్ గోపాల్ అడ్డుకొంటాడు.

''సరే..సరే.. నాకంతా తెలుసు.. నేను ఒక్కరిని పంపించమంటే ఇద్దరు వచ్చారా.. మీరొక పని చేయండి.. నాకు అర్జెంటు పని ఉండి బయటకు వెళుతున్నాను.. ఈలోపు మీరు ఈ మందిరంలోపల, ఇదిగో ఈ మెట్ల దగ్గిర పరిశుభ్రంగా క్లీన్ చేయండి.. ఏదయినా ఉంటే నేను వచ్చాక మాట్లాడుతాను..''

అంటూ కంగారుగా అక్కడి నుండి వెళ్ళిపోతాడు మేనేజర్..

ఆయన మాటకి శారదతో పాటు, ఆ వచ్చే ఆవిడ కూడా ఆశ్చర్యపోతుంది.. మేనేజర్ హడావిడిగా బయటకు వెళుతుంటే శారద, మరొకావిడ ఇద్దరూ అతని వంక ఆశ్చర్యంగా చూస్తుండిపోతారు.

..........................

శారద, శారదతో పాటు ఆ మందిరం ఆవరణలోకి వచ్చిన మహిళ ఇద్దరూ వెనక్కి తిరిగి చూస్తూంటారు.. ఆ మహిళ పేరు సావిత్రి.

మెల్లిగా ఇద్దరూ ఒకరి మొహాలకరు చూసుకుంటారు..

శారద ఆమె వైపు యథాలాపంగా చూస్తుంది..

సావిత్రి మాత్రం శారదని కిందినుండిపై వరకూ అనుమానం కలిగే ఎక్స్‌ప్రెషన్స్‌తో గమనిస్తుంది.. తనకి పోటీగా శారద అలా రావడం సావిత్రికి సుతారమూ ఇష్టం లేదు..

అయినా ఆ ఆలయ కమిటీ మెంబర్లలోని వ్యక్తి రికమండేషన్ తో వచ్చిన నాకు కాకుండా ఈమెకు ఉద్యోగం ఎలా వస్తుందిలే.. అని మనసులో అనుకుంటూ ఆ మందిరం పక్కనే గోడకి ఆనుకుని కూర్చుండిపోయి శారదనే గమనిస్తుంటుంది..

ఆ తరువాత శారద ఆమె వైపు నుండి చూపు మరల్చి శూన్యంలోకి చూస్తూ ఆలోచనలో పడిపోతుంది..

''అదేమిటీ..? నేనెవరో ఆయనకి తెలియదు, అలాంటిది నేనెవరో ఆయనకి తెలిసినట్టు తాను వచ్చే వరకు మందిరాన్ని శుభ్రం చేయమని ఆర్డర్ వేసి వెళ్ళాడేమిటి..?''

మేనేజర్ చర్యకి శారద ముఖం లో ఎంతో ఆశ్చర్యం కలుగుతుంది.

సావిత్రి శారద వైపు తేరిపార చూస్తూ మెల్లిగా మాట కలుపుతుంది..

''ఏమిటీ..? నువ్వు కూడా ఇక్కడ పని చేయడానికి వచ్చావా..?''

సావిత్రి గొంతులో వ్యంగ్యం స్పష్టంగా కనిపించింది శారదకి..

శారద లేదు అన్నట్టు తల అడ్డంగా ఊపుతుంది.. సావిత్రి శారదని అనుమానంగా చూస్తుంది..

ఆ సమాధానానికి సావిత్రి ముఖం ఎర్రబడుతుంది.

సావిత్రి ''హూ.. ఎందుకు చెబుతావులే..''

అంటూ మూతి తిప్పుకుంటూ కూర్చున్న దల్లా లేచి శారదకి కాస్త దూరంగా వెళ్లి ఆ మందిరం ఆవరణలోని ఓ మూలకి వెళ్ళి కూర్చుంటుంది...

శారద సావిత్రివైపే ఆయోమయంగా చూస్తుంది..

ఆమెకి ఏం చేయాలో అర్థం కాదు.. ఒకవైపు మేనేజర్ వెళ్తూ.. వెళ్తూ సాయి మందిరాన్ని శుభ్రం చేయండి అన్న మాటలు ఆమె చెవుల్లో వినిపిస్తుంటాయి..

ఆమె సావిత్రిని చూస్తుంది.. మేనేజర్ మాట పట్టనట్లుగా ఓ మూల కూర్చుని ఏదో కూనిరాగాలు తీస్తుంటుంది...

శారద (మనసులో) 'హు.. అతను ఇలా ఎందుకు చెప్పాడో అన్నది ఎందుకు..? ఈ మందిరంలోకి వచ్చిన మొదటి సారే ఈ మందిరాన్ని శుభ్రం చేసే అవకాశం రావడం ఎంత అదృష్టం..'

అనుకుంటుంది.. ఆమె ముఖం లో ఒక దృఢ నిశ్చయానికి వచ్చినట్లుగా ఎక్స్‌ప్రెషన్స్.. ఆ పక్కనే ఉన్న నీళ్ళ కొళాయి దగ్గరకు వెళ్ళి, తన చేతిలో ఉన్న సంచిని ఓ వారగా పెట్టి.. శుభ్రంగా కాళ్ళూ, చేతులు కడుక్కుంటుంది శారద.. తన పవిట కొంగుతో తన మొహాన్ని తుడుచుకుంటుంది. ఆమె చూపు ఆ చుట్టూ పరికించి చూస్తాయి..

ఆ మందిరానికి కొద్ది దూరంలో ఒక చీపురు కనిపిస్తుంది.. శారద మరేమీ ఆలోచించకుండా.. తన సంచిని ఓ వారగా పెట్టి, కొంగుని బొడ్లో దోపుకుని సాయి మందిరాన్ని శుభ్రం చేయడానికి సిద్దం అవుతుంది..

ఓ మూలగా కూర్చున్న సావిత్రి శారద చీపురు పట్టుకుని వెళుతుంటే ఆశ్చర్యంగానూ, ఈర్ష్యగానూ చూస్తుంది.

గుడి మెట్లు ఎక్కి మందిరం ముఖద్వారం దగ్గరకు వస్తుంది శారద..

ఎదురుగా చిరునవ్వు చిందిస్తూ కూర్చుని ఉన్న నిలువెత్తు తెల్లటి సాయినాధుడి విగ్రహం కనిపిస్తుంది.. ఆ విగ్రహాన్ని చూడగానే శారద ఒళ్ళు జలదరిస్తుంది.. ఆమె కళ్ళల్లో ఏదో తెలియని అనుభూతి సాయిబాబాని చూడగానే గోచరిస్తుంది.. సాయినాధుడి పెదవులపై కదలాడుతున్న చిరునవ్వు తనని దీవించినట్టుగా, తన కష్టాలని గట్టెక్కించినట్టుగా అనిపిస్తుంది శారదకి. మనస్ఫూర్తిగా సాయినాధుడిని వేడుకుని తాను చేయాలనుకున్న పనిని చేయడం ప్రారంభిస్తుంది.

చేతిలో ఉన్న చీపురుని క్రిందపెట్టి మరోమారు రెండు చేతులు ఎత్తి, కళ్ళు మూసుకుని అత్యంత భక్తి శ్రద్ధలతో మనస్ఫూర్తిగా మొక్కుతుంది శారద..

ఆ ఆనంద పారవశ్యంలో కళ్ళు మూసుకుని ఉన్న శారద కళ్ళల్లోనుండి కన్నీళ్ళు రాలుతాయి.. అయినా కళ్ళు తెరవకుండా అలాగే మొక్కుతూ ఉంటుంది శారద..

కొద్ది క్షణాలు తర్వాత మెల్లిగా కళ్ళు తెరిచి ఆ సాయినాధుడిని కళ్ళనిండా చూసుకుని కళ్ళని తుడుచుకుని కింద ఉన్న చీపురుని తీసుకుని మందిరంలోకి ప్రవేశిస్తుంది. ఆ మందిరాన్ని శుభ్రం చేసే పనిలో పడిపోతుంది శారద..

గుడి మొత్తం చీపురుతో ఊడవడం, గోడలకి, కిటికీలకు ఉన్న దుమ్ము, ధూళీని ఓ గుడ్డతో శుభ్రం చేయడం, మందిరం ఊడ్చిన తర్వాత వచ్చిన చెత్తని ఎత్తి బయట పారేయడం, మందిర ముఖద్వారం బయట ఉన్న మెట్లని నీళ్ళతో శుభ్రంగా కడగటం, మధ్య మధ్యలో శారదకి అలసిపోయినట్టు అనిపించినా కూడా తనలో ఏదో శక్తి ప్రవేశించి తనచేత పనులు చేయిస్తుందన్న ఆలోచన ఆమె మదిలో మెదులుతుంది మందిరం మొత్తం శుభ్రం చేయడానికి శారదకి ఒక అరగంట సమయం పడుతుంది.. ఆమె మొహమంతా చెమట పట్టేస్తుంది.. శారద కష్టపడుతూంటే, సావిత్రి శారదనే గుడ్లురిమేలా చూస్తూంటూంది..

ఆమెని పట్టించుకోకుండా శారద ఆ మందిరం శుభ్రపరచడంలో నిమగ్నమయి ఉంటుంది.. మందిరం మొత్తం శుభ్రం అయ్యాక మళ్ళీ కుళాయి దగ్గరకు వెళ్ళి శుభ్రంగా చేతులు కాళ్ళు కడుక్కుంటుంది శారద.. చేతులు కడుక్కుని పవిట తో తుడుచుకుంటుండగా.. గేటు దగ్గర అలికిడి కావడంతో అటువైపు చూస్తుంది శారద...

ఎప్పుడు వచ్చాడో తెలియదు కానీ.. ఆలయ మేనేజర్ గోపాల్ ఎంతో శుభ్రంగా కనిపిస్తున్న ఆలయాన్ని, కుళాయి దగ్గర ఉన్న శారదని ఆశ్చర్యంగా చూస్తూ కనిపిస్తాడు..

గోపాల్ ముఖం లో ఎంతో ఆశ్చర్యం కలుగుతుంది. ఇంకా పనికి కుదుర్చుకోకముందే పనులన్నింటినీ ఇంత శుభ్రంగా చేసిందంటే శారదకి ఆ సాయినాధుడిపై ఉన్న భక్తి ఎలాంటిదో అర్థం చేసుకుంటాడు గోపాల్.

గోపాల్‌ని చూడగానే సావిత్రి కూర్చున్న చోటు నుండి కంగారుగా లేచి అతని దగ్గరకు పరుగెత్తుకుని వస్తుంది.. గోపాల్‌కి ఎదురుగా వచ్చి వినయంగా నిలబడుతుంది..

సావిత్రిని చూడగానే ఆమెపై ఒక విధమైన ఏహ్యాభావం కలుగుతుంది గోపాల్‌లో.. సహజంగా ఆడవారు తమ కళ్ళ ముందు ఏదైనా అపరిశుభ్రంగా కనిపిస్తే.. మరో ఆలోచన లేకుండా వాటిని శుభ్రం చేసే సహజ లక్షణం వారికి ఉంటుంది.

కానీ సాక్షాత్తూ సాయిబాబా మందిరంలో పేరుకుపోయిన చెత్తా చెదారాన్ని ఏరివేయకుండా ఓ మూలగా తిష్ట వేసుకుని కూర్చున్న సావిత్రిని చూడగానే ఆమెపై అతనికి చెడు అభిప్రాయం కలిగింది. మేనేజర్ గోపాల్ గమనించగానే తన కొంగుతో ముఖం చేతులు తుడుచుకుంటూ అతని దగ్గరకు వస్తుంది శారద.. మేనేజర్ గోపాల్ ఇద్దరి వంక చూస్తూంటాడు..

గోపాల్‌కి ఎదురుగా ఉన్న శారద, సావిత్రి గోపాల్‌నే చూస్తూంటారు.. సావిత్రి ముఖం లో కంగారు కనిపిస్తుంటుంది.. శారద ముఖం లో మాత్రం ఏ భావమూ ఉండదు.. యథాలాపంగా చూస్తున్నట్టు ఉంటుంది ఆమె ముఖం లోని హావ భావాలు.. ఆ సాయినాధుడి మందిరంలో ఒక గంటసేపైనా పనిచేసే అదృష్టం కలిగిందన్న తృప్తి ఆమెలో గోపాల్ గమనించాడు.

''ఇదంతా శుభ్రం చేసింది ఎవరు..?'' గోపాల్ శారద వంక చూస్తూ అంటాడు.

శారద తన పవిట కొంగుతో నుదుటిని తుడుచుకుంటూ..

''నేనే నండీ..!''

గోపాల్ శారద వైపు చూస్తాడు.. అతనిలో ఇంకా ఆశ్చర్యం..

''ఏమిటి..? నువ్వా..! అరగంటలో మందిరాన్ని ఇంత శుభ్రంగా చేసావా..?'' ఆశ్చర్యంగా అంటాడు.

గోపాల్ ఆశ్చర్యంతో శారదని అడుగుతూంటే, సావిత్రి శారదని గుడ్లురిమి చూస్తుంటుంది.. సావిత్రి ముఖం పాలిపోతుంది.

శారద చిన్నగా నవ్వుతూ..

''అవునండీ..! ఆ సాయినాధుడిచ్చిన శక్తితో ఇదంతా చేయగలిగాను..'' ఆమెలో పలికిన నిజాయితీకి గోపాల్ మనసు పులకించిపోతుంది.

''నమ్మలేకపోతున్నాను.. నిన్ను చూస్తుంటే ఎంతో నీరసంగా కనిపిస్తున్నావు.. నువ్వొక్కదానివే ఇదంతా చేసావా..?''

ఆశ్చర్యంగా అంటాడు గోపాల్.. ఆ తర్వాత అతని చూపు సావిత్రి వైపు పడుతుంది.. సావిత్రిని చూడగానే అతని నొసలు ముడిపడుతాయి..

''ఇంతకీ మీ ఇద్దరిలో ఇక్కడ పని కోసం వచ్చిన వారు ఎవరు..?''

గోపాల్ శారదని చూస్తూ అంటాడు.. శారద మౌనంగా సావిత్రి వంక చూస్తుంది. సావిత్రి ముఖం లో కంగారు.. ఏదో తప్పు చేసానన్న ఫీలింగ్ కనిపిస్తుంటుంది..

''పని కోసం ఈ ఆలయ కమిటీ మెంబర్ రాజారాం గారు పంపించింది నన్నే నండీ.. అసలు ఇక్కడ పని చేయడానికి వచ్చింది నేనే నండీ..! పిలవని పేరంటంగా ఇదిగో ఈవిడ ఎక్కడి నుండో ఇక్కడికి ఊడిపడింది..''

అసూయగా శారదని చూస్తూ అంటూంది సావిత్రి.

గోపాల్‌లో మరింత ఆశ్చర్యం..

''ఏమిటి ఇక్కడ పని చేయడం కోసం రాజారాం పంపించిన వ్యక్తివి నువ్వా..?'' ఆశ్చర్యంగా అంటాడు గోపాల్. గోపాల్ శారద వైపు చూస్తూ

''మరి నువ్వు..? ఇక్కడికి ఎందుకు వచ్చావమ్మా... దేవుడిని దర్శించుకోవడం కోసం వచ్చావా..?'' అడుగుతాడు గోపాల్.

''నేను.. నేను.. ''

శారదకి ఏం చెప్పాలో అర్థం కాదు.. శారద ఏం చెబుతుందా అని ఇటు గోపాల్, అటు సావిత్రి ఇద్దరూ ఆత్రంగా చూస్తుంటారు.

''నేను.. బయట ఎండగా ఉండడంతో ఈ మందిరంలో కాసేపు సేద తీరుదామని వచ్చానండీ..''

ఆమె సమాధానానికి గోపాల్ మరింత ఆశ్చర్య పోతాడు..

''సేద తీరడానికి వచ్చిన ఈవిడ.. మందిరంలో ఉన్న అపరిశుభ్రతను గమనించి స్వచ్ఛందంగా కష్టపడి ఇంత శుభ్రంగా చేసిందే... మరి.. ఇక్కడే పని చేయడం కోసం వచ్చిన నువ్వేం చేసావు..?

గోపాల్ సావిత్రి వైపు తిరిగి అడిగాడు.. అతని గొంతులో కాస్త కోపం ధ్వనించింది. సావిత్రి ముఖం లో కంగారు.. ఉన్నపళంగా మేనేజర్ అలా అడిగేసరికి ఆమెకి ఏం చెప్పాలో అర్థం కాలేదు.

''అదీ.. మరేమో.. మీరు వచ్చాక అన్ని విషయాలు మాట్లాడాక పనిలో చేరుదామని, మీరు వచ్చేంత వరకు అక్కడ కూర్చున్నానండీ..'' కాస్త తడబడుతూ అంది.

గోపాల్‌లో అదే ఆశ్చర్యం.. ఆశ్చర్యంగా సావిత్రి వంక చూస్తాడు..

మళ్ళీ తిరిగి శారద వంక చూస్తాడు...

శారద గోపాల్‌ని చూస్తుంటుంది.. ఆమె ముఖం అలసి పోయినట్టుగా ఉంటుంది.. తిరిగి సావిత్రిని చూస్తాడు..

సావిత్రి కూడా గోపాల్‌ని చూస్తుంటుంది.. ఆమె ముఖం లో ఏదో తప్పుచేసానేమోనన్న గిల్టీ ఫీలింగ్ కదలాడుతుంటుంది..

కొన్ని క్షణాలు అలాగే వారిద్దరినీ పరికించి చూస్తాడు గోపాల్..

తరువాత ఓ నిర్ణయానికి వచ్చిన వాడిలా పెద్దగా నవ్వుతూ..

''హ..హ..హ.. బావుంది.. బావుంది.. సేద తీరడానికి వచ్చినావిడ కష్టపడి పని చేసింది.. కష్టపడి పనిచేసేందుకు వచ్చినావిడ సేద తీరిందన్నమాట..''

గోపాల్ మాటకి సావిత్రి ముఖం లో ఆందోళన కనిపిస్తుంది..

''అదికాదండీ.. మీరొచ్చాక అన్నీ మాట్లాడుకుని పని మొదలెడదామనీ..'' నీళ్ళు నములుతూ జవాబిస్తుంది.

''నేను వచ్చాక పని మొదలెడదామనుకున్నావా..? నేను వెళ్ళేటప్పుడే చెప్పాను కదా.. బయటికెళ్ళి వస్తాను.. వచ్చే సరికి కాస్త మందిరాన్ని శుభ్రం చేయండని..''

గోపాల్ ఆశ్చర్యంగా సావిత్రి వంక చూస్తూ అంటాడు..

''అంటే.. చెప్పారనుకో.. కానీ.. పని కుదిరేటప్పుడు.. నెలకి జీతం ఎంతిస్తారు.. ఏమిటి అన్నది మాట్లాడుకుని తర్వాత పనిలోకి వస్తే బావుంటుంది కదాని మీరొచ్చే వరకు ఆగాను.. అంతే తప్ప మరో ఉద్దేశ్యంతో కాదు..''

ఆమె మాటకి గోపాల్‌లో విపరీతమైన ఆశ్చర్యం వేసింది. అతను నొసలు ముడివేసి తీక్షణంగా సావిత్రి వంక చూస్తాడు..

తిరిగి శారదవైపు తిరిగుతాడు గోపాల్..

''ఏమ్మా.. నువ్వెక్కడుంటావ్..?''

''హు.. ఎక్కడా అన్నది లేదండీ.. రైల్వేస్టేషన్‌లో ఒంటరిగా ఉన్న నన్ను ఓ పుణ్యాత్మురాలు సాయిబాబా మందిరానికి వెళ్ళి సేవ చేసుకో అని సలహా ఇచ్చింది.. అందుకే వెతుక్కుంటూ ఇక్కడికి వచ్చాను'' రైల్వేస్టేషన్‌లో ప్రభ చెప్పిన మాటనే గోపాల్‌కి చెప్పింది.

''అంటే.. నీవు ఒంటరి దానివన్నమాట.. '' ఆశ్చర్యంగా అంటాడు గోపాల్..

శారద మౌనంగా తలూపుతుంది అవునన్నట్టు..

గోపాల్ భారంగా నిట్టూర్పు విడుస్తాడు.. అతని దృష్టి సావిత్రిపై పడుతుంది.. సావిత్రి శారదని చూస్తుంటుంది..

ఆ చూపులో శారదపై ఈర్ష్య స్పష్టంగా కనిపిస్తుంటుంది..

గోపాల్ సావిత్రిని చూస్తూ ''మీకు ఆ రాజారాం గారు అన్నీ చెప్పాడని చెప్పాడు కదండీ.. మళ్ళీ కొత్తగా అడుగుతారేమిటీ..? నేను ఇక్కడికి వచ్చే ముందే ఇక్కడ క్లీనింగ్‌కి హెడ్‌గా ఉన్నాడే ఆయన నాకు చెప్పాడు.. మా మేనేజరు గారు గుళ్ళో ఉంటారు..

ఆయనని కలిసి పనిలో చేరు అని చెప్పాడు.. మరి.. మళ్ళీ మీరు నన్నడుగుతారేమిటి..?

ఆమె మాటలకి గోపాల్ షాకవుతాడు.. ఆ షాక్‌లో ఉండే సావిత్రి వంక చూస్తాడు.. తనవైపే చూస్తున్న గోపాల్ కళ్ళలోకి చూడలేక సావిత్రి తలదించుకుంటుంది.. కొద్ది క్షణాల తర్వాత గోపాల్ శారద వైపు తిరుగుతాడు..

''ఏమ్మా.. నీకు ఇక్కడ ఉండటానికి ఇబ్బంది ఏమీ లేదు కదా..!''

శారద ముఖం లో ఆనందం కనిపిస్తుంది..

''నాకు ఇబ్బంది ఏముంటుందండీ..! పవిత్రమైన సాయి మందిరంలో పనిచేసే అదృష్టం కలిగితే ఎవరైనా కాదంటారా ఏమిటి..?''

శారద ఎంతో వినయంగా అంటుంది..

''మరి జీతం ఎంత తీసుకుంటావు..?''

ఆ మాటకి శారద ముఖం లో అయోమయం గోచరిస్తుంది.. అయోమయంగా గోపాల్ వంక చూస్తుంది.. ''దేవుడికి సేవ చేసేందుకు జీతం ఎందుకండీ..! రెండు పూటలా ఇంత తిండి పెట్టి రాత్రివేళలో పడుకోడానికి కాస్తంత స్తలం ఇస్తే చాలు..'' ఎంతో వినయంగానూ, నిజాయితీగానూ చెబుతుంది శారద.

ఆమె సమాధానానికి గోపాల్‌తో పాటు సావిత్రి కూడా ఆశ్చర్య పోతుంది.. గోపాల్ ఆశ్చర్యంగా శారదని చూస్తాడు..

''సరే అమ్మా.. గుడిని శుభ్రం చేసి చాలా అలసి పోయినట్లు ఉన్నావు.. వెళ్ళు లోనికి వెళ్ళి కాస్తంత విశ్రాంతి తీసుకో''

గోపాల్ స్వరంలో శారదపై ఎనలేని అభిమానం ప్రతిఫలిస్తుంటుంది.. ఆ విషయం శారద గమనిస్తుంది..

శారద నిజంగా అలసిపోయి ఉండడంతో అక్కడ నిలబడే ఓపిక కూడా లేకపోవడంతో 'సరే' అని ఒకసారి సావిత్రి వంక చూస్తుంది.. సావిత్రి శారదని ఈర్ష్యగా చూస్తూంటూంది. సావిత్రికి తెలియకుండానే శారదపై మనసులో ఏదో పగ పెరిగిపోతున్న భావన కలుగుతుంది ఆమెకి.

శారద అక్కడి నుండి కుళాయి దగ్గరున్న తన సంచిని తీసుకుని ఆ గుడి పక్కనే భజన మందిరంలాంటి హాల్‌లోనికి వెళుతుంది..

దాంతో సావిత్రి కంగారుగా.. గోపాల్ వైపు తిరుగుతుంది..

''అదేమిటి.. మరి నేను ఏం చేయాలి..?''

గోపాల్ ఆమెని కోపంగా చూస్తాడు..

''నాకు కావలసినది.. నిస్వార్థంగా దేవుడికి సేవ చేసే వారు, అంతేకానీ దేవుడి దగ్గర పని చేస్తే ఎంత పైకం వస్తుందీ, ఇన్ని గంటలు పని చేస్తే ఇంత రేటు, వారానికి ఇంత రేటు, పదిహేను రోజులకి ఇంత రేటు, నెలకు ఇంత రేటు అని ఫిక్సయిపోయి పని చేసే నీలాంటి వాళ్ళు కాదు. ఏవమ్మా.. ఆ యమ్మని చూస్తేనే తెలుస్తుంది ఆమె ఎంత నీరసంగా ఉందో.. ఈ గుళ్ళో కాసేపు సేద తీరడానికి వచ్చినావిడ, నేను చెప్పానని ఎంతో కష్టపడి మందిరం మొత్తం శుభ్రం చేస్తూంటే.. నువ్వు మాత్రం ఆమెని చూస్తూ ఓ మూల కూర్చున్నావు, కనీసం ఆమెకి సహాయం చేయాలన్న ఆలోచన కూడా నీకు రాలేదు కదా..''

గోపాల్ కోపంగా అనడంతో సావిత్రి తల దించుకుంటుంది..

''నాకు కావసింది నీలాగ నోటు కోసం పని చేసే వాళ్ళు కాదు, ఆ భగవంతుడిపై భక్తితో, పది మందికి సేవ చేయాలన్న ఆకాంక్ష ఉన్న వారు కావాలి.. ఆ లక్షణాలు నీలో ఒక్కటి కూడా కనిపించడం లేదు.. జీతానికి పని చేయాలనుకుంటే  ఈ నగరంలో ఎన్నో ఉన్నాయి.. ఇక్కడ నీ అవసరం లేదు.. వెళ్ళిపో..''

సావిత్రి ఎంతో షాకయిపోతుంది.. చివాలున తలెత్తి గోపాల్ వంక చూస్తుంది.. గోపాల్ కూడా కోపంగా ఆమె వంక చూస్తాడు.. గోపాల్‌పై ఎంత కోపం వచ్చినా ఏమీ చేయలేని కారణంగా తలదించుకుని అవమానభారంతో అక్కడి నుండి మందిరం బయటికి అడుగులు వేస్తుంది.

………………………………

సాయిబాబా మందిరం పక్కనే ఆనుకుని ఉన్న భజన మందిరంలోకి మేనేజర్ గోపాల్ ప్రవేశిస్తాడు. ఆ హాల్ చాలా పెద్దదిగా, విశాలంగా ఉంది.. ఓ దిక్కున చిన్న వేదికలాగా ఏర్పాటు చేసారు. ఆ వేదికపైన ఫ్రేమ్ కట్టించిన సాయిబాబా నిలువెత్తు ఫోటో ఒకటి పెట్టారు. దాని ముందు రెండు దీపాలు వెలుగు తున్నాయి. అక్కడ ప్రతీ గురువారం, ప్రత్యేక రోజులప్పుడు సాయిబాబా భక్తులు, సాయిబాబా భజన మండలి వాళ్ళు సాయిబాబా భజనలను నిర్వహిస్తూంటారు.

ఆ హాల్‌కి కుడివైపుకి ఓ దిక్కుగా శారద తన సంచిని తల క్రింద పెట్టుకుని ముడుచుకుని పడుకుని ఉంటుంది.

గోపాల్ శారద పడుకున్న చోటుకి వస్తాడు. ఆ అలికిడికి శారద చటుక్కున కళ్ళు తెరుస్తుంది.. ఎదురుగా గోపాల్ కనిపించగానే పడుకున్నదల్లా లేచి నిలబడాలను కుటుంది..

‘‘ఆ..ఆ.. ఫర్వాలేదమ్మా.. కూర్చో.. కూర్చో..’’

అంటూ తను శారదకి కొద్ది దూరంలో కూర్చుంటాడు గోపాల్.

‘‘ఇంతకీ నీ పేరేమిటమ్మా..?’’

‘‘నా పేరు శారద..!’’

చిరునవ్వుతో అంటుంది శారద..

‘‘మరి కొద్ది సేపట్లో మధ్యాహ్న హారతి జరుగుతుంది, ఆ హారతికి సాయినాధుడికి ప్రసాదాన్ని తీసుకుని వస్తారు మా కమిటీ మెంబర్లో ఒకరు.. హారతి అయిపోగానే ఆ ప్రసాదాన్ని వచ్చే భక్తులకి పంచి పెట్టాక మిగిలింది నీవు తినమ్మా..! నీ కోసం అని అతడిని ప్రసాదాన్ని కాస్త ఎక్కువగానే తీసుకురమ్మని చెప్పాను..’’ చిరునవ్వుతో అన్నాడు గోపాల్..

గోపాల్ గొంతులో కనిపిస్తున్న ఆప్యాయతకి శారద ఎంతో పొంగిపోతుంది.. ఈ మధ్య కాలంలో తనతో అంత ఆప్యాయంగా మాట్లాడిన వ్యక్తి లేకపోవడంతో ఆమెకు వెంటనే కళ్ళల్లో నుండి కన్నీళ్ళు జల జల రాలుతాయి..

ఆమెలోని భావాలని గమనించిన గోపాల్ కంగారు పడతాడు..

''అరెరె.. ఎందుకు ఏడుస్తున్నావమ్మా.. నీకిక్కడ ఎలాంటి లోటు ఉండదు.. నిన్ను చూస్తుంటే ఎంతో ఉన్నతమైన కుటుంబంలోనుండి వచ్చిన దానిలా ఉన్నావు.. ఎవరూ లేని అనాధలా ఇలా రోడ్లవెంబడి తిరుగుతున్నావంటే దాని వెనుక బలమైన కారణమే ఉండిఉంటుందని అనుకుంటున్నాను, ఎన్నో కష్టాలు అనుభవించిన దానిలా వున్నావు..

తల్లీ.. ఏ దిక్కూ లేని వాడికి ఆ దేవుడే దిక్కంటారు.. నువ్వు సాక్షాత్తూ ఆ సాయినాధుడి సన్నిధిలోకి వచ్చి చేరావు..

ఇక నీకు ఏ లోటూ రాకుండా ఆయనే చూసుకుంటాడు.. నీ గతం గురించి చింతించకుండా ఆ సాయినాధుడిపై శ్రద్ధ పెట్టి నిస్వార్థంగా ఆయనకి సేవ చేస్తే ఆయనే నీకు ఓ దారి చూపిస్తాడు..''

గోపాల్ మాటల వల్ల శారదకి ఎంతో మానసిక ఉపశమనం లభిస్తుంది. అప్పటి వరకూ ఆమె మనసులో గూడు కట్టుకు పోయిన బాధ మెల్లిగా బయటికి వెళ్ళిపోతున్న భావన కలుగుతుంది..

''ఇంతకీ మీది ఏ ప్రాంతం..?'' యథాలాపంగా అడగుతాడు గోపాల్

''సిద్దిపేట..'' చెబుతుంది శారద.

"ఓ.. మెదక్ జిల్లానా.. సరె..సరె.. నువ్వేమీ కంగారు పడకు.. ఇక్కడ నీకు ఏలోటూ రాదు, ఈ మందిరాన్ని పరిశుభ్రంగా ఉంచే బాధ్యత నీది, గత పది సంవత్సరాల నుండి నేను ఈ సాయిబాబా మందిరం మేనేజర్‌గా పని చేస్తున్నాను.. నాకు సాయిబాబా అంటే ఎనలేని భక్తి, ఆయనకి సేవ చేసే భాగ్యం కలిగినందుకు ప్రతిరోజూ ఎంతో ఆనందిస్తుంటాను.. ఈ సాయినాధుడు కొలువై ఉన్న ఈ పవిత్ర స్థలం వేదికగా ఎన్నో మంచి పనులు చేయాలని,

ఇప్పుడున్న యువతలో ఆధ్యాత్మిక చింతన చేకూర్చేలా, వారిలో మంచి ప్రవర్తన తీసుకువచ్చేలా అనేక చర్యలు చేపట్టాలని ప్రయత్నాలు చేస్తున్నాను.. అందులో భాగంగా ప్రతీ ఆదివారం ఇక్కడ వీక్లీ ఆధ్యాత్మిక బోధను చెప్పిస్తున్నాను.'' ప్రశాంతం గా గోపాల్ శారదకు వివరిస్తాడు..

శారద గోపాల్‌నే చూస్తుంటుంది.. అతనిలో సాయినాధుడిపై ఉన్న ప్రేమ, సమాజంపై ఉన్న బాధ్యతని గుర్తించి అభినందించకుండా ఉండలేకపోతుంది.. గోపాల్‌ని ఆశ్చర్యంగా చూస్తుంటుంది శారద..

''సరె..సరె.. నేను బయటికి వెళుతున్నాను.. నువ్వు కాస్తంత విశ్రాంతి తీసుకో.. ఇంకాసేపట్లో మూర్తిగారు వస్తారు.. ఆయన ఈ ఆలయ కమిటీ మెంబర్లలో ఒకరు.. ఆయన మిమ్మల్ని ప్రశ్నిస్తే.. ఇదిగో ఈ రసీదు చూపించు. నువ్వు ఇక్కడ పనిలో చేరావని, మేనేజర్ గోపాల్ అపాయింట్ చేసారని చెప్పు.. మధ్యాహ్న హారతి అయ్యాక భక్తులకి ప్రసాదాన్ని పంచాక మిగిలిన దాన్ని నువ్వు తీసుకో సరేనా..'' అని గోపాల్ లేస్తాడు బయలుదేరుతున్నట్టు.. శారద కూడా లేచి నిలబడుతుంది..

''సరే నమ్మా.. నేను వస్తాను..''

''అలాగే సారూ..!''

తనని శారద సారూ అని సంబోధించడం గోపాల్‌కి నచ్చదు..

''చూడు శారదమ్మా... మనం మందిరంలో పని చేస్తున్నాము.. ఇక్కడ పని చేసే ఆలయ చైర్మన్ అయినా, నా లాంటి మేనేజర్ అయినా, నీ లాంటి ఆయా అయినా మనమందరం ఆయనకి సేవకులం మాత్రమే.. మనందరికీ ఆ సాయినాధుడే మార్గనిర్దేశకుడు.. నేను మేనేజర్ అయినంత మాత్రానా మీపై అజమాయిషీ చెలాయించాన్న రూలేమీ లేదు.. నా స్థాయిలో నేను ఆ సాయినాధుడి సేవలో తరిస్తాను, మీ స్థాయిలో మీరు ఆ సాయినాధుడికి సేవ చేయండి.. ఇక నుండి ఇలా సారూ లాంటి పిలుపులకు దూరంగా ఉండండి.. అంతలా పిలవాలనిపిస్తే గోపాల్ గారూ అనో, మేనేజర్ గారూ అనో పిలవండి.. మరి నేను వస్తాను.. '' ఆయన మాటలకి, ఆయనలో ఆ సాయినాధుడిపై ఉన్న భక్తి శ్రద్ధకి శారద విపరీతంగా ఆశ్చర్యపోతుంది.. తన జీవితంలో గోపాల్ లాంటి స్వచ్ఛమైన వ్యక్తిని మొదటి సారి చూస్తుంది అన్నది నిజం..

గోపాల్ అక్కడి నుండి వెళ్ళిపోతాడు...

శారద వెళుతున్న గోపాల్‌నే చూస్తూంటుంది.. శారద కళ్ళల్లో కన్నీళ్ళు సుడులు తిరుగుతుంటాయి.. అప్రయత్నంగా ఆమె రెండు చేతులు గోపాల్‌ని నమస్కరిస్తాయి.. అయితే... గోపాల్ సహకారంతో శారద సాయిమందిరంలో సేవ చేసే భాగ్యాన్ని ఆ సాయినాధుడు అందించినా... ఆ ఆలయ కమిటీ మెంబర్ సిఫారసుతో వచ్చిన సావిత్రిని కాదని గోపాల్ శారదని పనిలోకి కుదుర్చుకోవడంతో శారదపై సావిత్రి, రాజారాం చాలా కోపం

పెంచుకుంటారు. ఏమాత్రం సమయం చిక్కినా ఆమెని ఆ ఆలయంలో నుండి బయటికి తరిమివేయడానికి అప్పుడే ప్రయత్నాలు ప్రారంభిస్తారు.. మరి.. ఈ ఆపద నుండి ఆ సాయినాధుడు శారదని ఎలా బయటపడేస్తాడో ఆ సమర్థ సద్గురు సాయినాధుడికే తెలియాలి.

……………………………………

శారద దగ్గరికి మూర్తి గారు వస్తారు.. మూర్తి గారికి శారద రసీదు చూపిస్తుంది.. రసీదు చూసిన మూర్తి తల పంకించి ఆమెకు కొన్ని సూచనలు చేస్తాడు.. ఆ తర్వాత మందిరంలోకి ఆలయ పూజారి వస్తాడు..

మూర్తిగారు శారదని ఆలయ పూజారికి పరిచయం చేస్తాడు.. పూజారి కూడా శారదతో మాట్లాడుతాడు.. ఆ తర్వాత పూజారి శారదతో ఏదో చెబుతాడు.. శారద సరే.. అన్నట్టుగా ఎంతో ఉత్సాహంగా పనులు చేస్తుంటుంది..

ఆ మందిరంలోకి ఒక్కొక్కరుగా భక్తులు వస్తుంటారు.. పూజారి మధ్యాహ్న హారతికి కావాల్సిన ఏర్పాట్లు చేస్తుంటే, శారద పూజారికి కావసిన పూజా వస్తువులని అందిస్తుంటుంది. పూజారి చెబుతూ ఉంటే ఆ వస్తువులని తీసుకురావడానికి శారద ఎంతో ఉత్సాహంగా పని చేస్తుంటుంది..

మధ్యాహ్న హారతి ఇచ్చే సమయానికి ఆ మందిరం మొత్తం భక్తులతో నిండిపోతుంది..

పూజారి సాయినాధుడిని అందంగా అలంకరించి, ఆయన పాదాల చెంత స్వచ్ఛమయిన మల్లెపూలు ఉంచి, ధూప దీప నైవేద్యాని సిద్దం చేస్తాడు.. సరిగ్గా పన్నెండు గంటలవుతుండగా హారతి మొదలవుతుంది..

పూజారి అయిదు వత్తులతో కూడిన దీపారాదన చేసి, ఎంతో భక్తి పారవశ్యంతో హారతి ప్రారంభిస్తాడు.. ఆయన గొంతుకి లయబద్దంగా భజన బృందం వారు సంగీతాన్ని అందిస్తుంటారు..

‘‘ఓం శ్రీ సాయినాద్ మహరాజ్‌కీ జై..’’ అంటూ పూజారి హారతి ప్రారంభిస్తాడు.

శారదకి ఎంతో అద్భుతంగా అనిపిస్తుంటుంది ఆ దృశ్యం.. సాయిబాబా విగ్రహానికి భక్తితో నమస్కరిస్తూ ఆ హారతిని ఎంతో ఆసక్తిగా గమనిస్తూంటుంది.. హారతి మొదలవుతుంది..

పూజారి ఎంతో భక్తి శ్రద్ధలతో హారతిని ఆలపిస్తుంటారు.

''ఫేవునియా పంచారతి కరూ బాబాన్సీ హారతి, సాయిసీ ఆరతి, కరూ బాబాన్సీ హారతి..''

పూజారి భక్తి శ్రద్ధలతో హారతి పాడుతుంటే ఆయనకి లయబద్దంగా సంగీతం వినిపిస్తుంటే, ఆ మందిరంలోకి వచ్చిన భక్తులు భక్తి శ్రద్ధలతో సాయినాధుడిని మొక్కుతూ వారు కూడా కోరస్ కలుపుతుంటే.. ఆ సన్నివేశం శారదకి ఎంతో మహదానందంగా అనిపించింది...

ఆమె ముఖం లో ఎంతో ఆనందం తొణికిసలాడుతుంది.. ఎంతో భక్తి శ్రద్ధలతో సాయిబాబాని నమస్కరిస్తూ, మధ్య మధ్యలో భక్తులని, పూజారిని, డోలు వాయిస్తున్న భజన బృందాన్ని మార్చి మార్చి చూస్తుంటుంది శారద..

పూజారి మరో చరణాన్ని అందుకుంటాడు..

''హారతి సాయిబాబా సౌఖ్య దాతార జీవా, చరణ రజాతలీ ద్యావ దాసావిసావా ` భక్తా విసావా, హారతి సాయిబాబా...''

ఆయన పాడుతున్న ఒక్కో చరణానికి భక్తులు కూడా శృతి కలుపుతుంటే, దానికి తగ్గట్టుగా సంగీతం తోడవుతంటే.. ఆ ప్రదేశం ఆధ్యాత్మిక చింతనతో, ఆ వాతావరణం ఎంతో భక్తి ప్రపత్తులతో వెలిగిపోతూంది...

హారతి పూర్తయినట్టుగా పూజారి చేతిలో గంట గణగణ మ్రోగుతంటే, దానికి తగ్గట్టుగా కొందరు భక్తులు కూడ అక్కడ ఏర్పాటు చేసిన గంటని మ్రోగిస్తారు.. అయిదు వత్తులతో వెలుగు తున్న దీపాలతో సాయినాధుడికి హారతి ఇస్తాడు పూజారి.. ఆ తర్వాత పూజారి కళ్ళు మూసుకుని ఎంతో భక్తి శ్రద్ధతో..

''ఓం సచ్చిదానంద సద్గురు సాయినాధ్ మహరాజ్‌కీ జై..!

ఓం రాజాధిరాజ యోగిరాజ సాయినాధ్ మహరాజ్‌కీ జై..!

శ్రీ సచ్చిదానంద సద్గురు సాయినాధ్ మహరాజ్‌కీ జై...''

పూజారి గొంతు పెద్దది చేసి సాయినాధుడిని కీర్తిస్తుంటే భక్తులు కూడా అంతే పెద్ద కంఠంతో సాయినాధునికి జై కొడతారు..

ఆ హారతిని పూర్తిగా తిలకించిన శారద మనసులో ఎంతో ఆనందం, ఇదీ అని చెప్పలేని సాంత్వన, చాలా రోజుల తర్వాత ఆమె ముఖం లో చిరునవ్వు కదలాడుతుంది.. ఆమె ఆ

సాయినాథుడి విగ్రహాన్నే చూస్తూంటూంది.. శారద ఇంకా ఆ హారతి మూడ్‌లో నుండి బయటికి రాలేకపోతుంది.. తన జీవితంలో మొదటి సారి అంత మంచి అద్భుతమైన ఆధ్యాత్మిక సన్నివేశాన్ని చూసింది.. అందుకే ఆమెలో ఎంతో భావోద్వేగం.. కళ్ళలో కన్నీళ్ళు కదాలడుతుండగా సాయిబాబా విగ్రహాన్నే చూస్తూ రెండు చేతులతో నమస్కరిస్తూ, కళ్ళలోనుండి కన్నీరు కారుస్తూ.. ఒక విధమైన ఆనందస్థితిలో ఆమె ఉంటుంది...

ఆ సమయంలో ఆ ఆలయం మొత్తం ఆధ్యాత్మికతతో నిండిపోయింది. అక్కడ ఉన్న ప్రతి వ్యక్తి కూడా సాయినాథుడిని హృదయాంతరాలల్లో తలుస్తూ హారతిని జపించారు. అంతటి అద్భుతమైన ఆ దృశ్యాన్ని ఆ సాయినాథుడు కూడా అదృశ్య రూపంలో తిలకించి ఆ భక్తుల మనసులోని కోరికని తీర్చేందుకు సిద్ధపడిపోయి ఉంటాడనిపిస్తుంది అక్కడి వాతావరణం.

మొట్టమొదటి సారిగా సాయిబాబా హారతిని తిలకిస్తున్న శారద మనసెంతో ఆనందంతో నిండిపోతుంది.. ఆమె శరీరంలోని అణువణువూ ఆ సాయినాథుడి దివ్యమంగళ రూపాన్ని చూస్తూ పులకించి పోతున్నాయి.

హారతి పూర్తి అయిన తర్వాత ప్రసాద వితరణ పని శారదపై పడుతుంది. పూజారి ఓ పెద్ద గిన్నెని చూపిస్తూ అందరికీ ప్రసాదాన్ని అందజేయాలని సూచిస్తాడు. ఆ మందిరంలో ఒక చోట ఆ పాత్రని ఉంచుతుంది శారద.

భక్తులందరూ క్రమ పద్ధతిలో వచ్చి ప్రసాదాన్ని స్వీకరిస్తారు. వారందరికీ పంచిన తర్వాత శారదకి సరిపడా ప్రసాదం మిగిలి ఉండడం శారదకి ఎంతో ఆశ్చర్యాన్ని కలిగిస్తుంది.. ఆ ప్రసాదాన్ని అత్యంత భక్తి శ్రద్ధలతో, ఆనందంతో శారద భుజిస్తుంది.

.................................

ఆరోజు ఆదివారం..

ఉదయం ఎనిమిది గంటల సమయం.. సాయిబాబా మందిరం భక్తులతో కిటకిటలాడుతుంటుంది.. ఆలయ పూజారి వచ్చే భక్తులకు ఓపికగా అర్చనలు చేస్తూ భక్తులందరికీ హారతి ఇచ్చి తీర్థ ప్రసాదాలు అందిరడచంలో బిజీగా ఉన్నాడు. భక్తులు వరుస

క్రమంలో సాయిబాబాని దర్శించుకోవడం, కొందరు భక్తులు  హాలులో అక్కడక్కడ కూర్చుని ప్రసాదాలు తింటూ ఉంటారు. అక్కడి వాతావరణం మొత్తం ఆధ్యాత్మికత తో నిండి ఉంది...
సాయిబాబా మందిరం మెయిన్ గేటు దగ్గరికి ప్రవేశిస్తాడు మేనేజర్ గోపాల్.. ఆయన మెయిన్ గేటు దగ్గరికి రాగానే అక్కడి నుండే సాయిబాబాకి కళ్ళు మూసుకుని దండం పెడతాడు.. ఆ తర్వాత కుళాయి దగ్గరకు వెళ్ళి కాళ్ళు  కడుక్కుని మందిరం లోపలికి ప్రవేశిస్తాడు.. భక్తులందరూ వరుస క్రమంలో ఉన్నప్పటికీ ఆయన ప్రత్యేక ద్వారము నుండి సాయిబాబా విగ్రహము దగ్గరికి వస్తాడు.. గోపాల్ అక్కడికి రాగానే ఆలయ పూజారి భక్తులకు తీర్థ ప్రసాదము ఇవ్వడం ఆపేసి, గోపాల్ కోసం ప్రత్యేకంగా సాయిబాబాకి హారతి ఇచ్చి తీర్థ ప్రసాదాలు అందిస్తాడు.. గోపాల్ ఎంతో భక్తి శ్రద్ధలతో  తీర్థ ప్రసాదాలని స్వీకరించి మరొక్కసారి సాయిబాబా ఆశీస్సులు అందుకుని అక్కడి నుండి ఆయన బయటికి వస్తాడు..

ఆలయం ప్రక్కనే ఉన్న భజన మందరంలోకి గోపాల్ ప్రవేశిస్తాడు.. అక్కడ కూడా కొందరు భక్తులు సాయిబాబా భజన చేస్తూ కూర్చుంటారు.. గోపాల్ అక్కడికి రాగానే అతని చూపు ఎవరి కోసమో వెతుకుతున్నట్టుగా ఉంటాయి..
కొద్దిసేపు గోపాల్ పరిశీలనగా చూడగా ఆ మందిరంలో ఒక వారగా సాయిబాబా విగ్రహం కోసం తీసుకువచ్చిన చామంతి, బంతి, గులాబి పూలతో హారాన్ని తయారు చేస్తూ కనిపిస్తుంది శారద..
ఆమె చామంతి, బంతి, గులాబి పూలను ఒక్కొక్కటిగా చేతిలోకి తీసుకుని వాటిని దారానికి ఎక్కిస్తూ అందమైన హారాన్ని తయారు చేస్తూ మరో వైపు  సాయిబాబా భజనలో లీనమైపోతుంది.
భక్తితో భజన చేస్తున్న వారితో తానూ గొంతు కలుపుతుంది శారద..
గోపాల్ శారదవైపు చూసి ఆశ్చర్యపోతాడు.. ఆమె కళ్ళు సాయిబాబా ఫోటోపై ఉంటాయి, పెదాలు సాయిబాబా నామాన్ని పలుకుతుంటాయి, చేతులేమో చాలా ఫాస్ట్‌గా పూలు అల్లటంలో బిజీగా ఉంటాయి.. ఒకే సారి మూడు రకాల  పనులు చేస్తున్న శారదని చూసి నిజంగానే ఆశ్చర్యపోతాడు గోపాల్.. గోపాల్ శారద దగ్గరికి వచ్చి నిలబడుతాడు.. అయినా శారద

గోపాల్‌ని గమనించదు.. ఆమె పూర్తిగా భజనలో నిమగ్నమైపోయి ఉంటుంది.. దాంతో చేసేది లేక గోపాల్ కాస్త ముందుకు వంగి ఆమె కళ్ళ ముందు తన చేయిని ఊపుతాడు.. దాంతో ఉలిక్కిపడ్డ శారద గోపాల్‌ని చూస్తుంది..

గోపాల్ ఆమెవైపు నవ్వుతూ చూస్తాడు.. శారద కంగారుగా చేస్తున్న పనిని పక్కకు పెట్టి లేచి నిబడుతుంది.. అక్కడ భజన శబ్దం అధికంగా ఉండడంతో కళ్ళతోనే బయటికి రమ్మన్నట్టు సైగ చేస్తాడు గోపాల్.. శారద గోపాల్ వెనకాలే బయటికి వస్తుంది.. బయటికి రాగానే..

''క్షమించండి.. మీరు రావడం గమనించలేదు...''

''అయ్యో.. పెద్దవారు.. నన్ను క్షమించమని అడగడం ఏమీ బావోలేదు.. అయినా.. ఒకేసారి మూడు పనులు చేస్తున్న మిమ్మల్ని అభినందించకుండా ఉండలేకపోతున్నాను..''

గోపాల్ శారదవైపు చూస్తాడు అభినందన పూర్వకంగా.. శారదకి గోపాల్ అలా ఎందుకంటున్నాడో అర్థం కాలేదు.. శారద నొసలు ముడివేస్తూ అతనివైపు చూస్తుంది..

''సరె.. సరే.. విషయం ఏమిటంటే.. లోపల భజన తొమ్మిది గంటల కల్లా అయిపోతుంది.. ఆ భజన కార్యక్రమం అయిపోగానే ఇక్కడ పిల్లలకు బోధనలు చెప్పడానికి మాస్టారు గారు వస్తారు..

''ఏమిటి.. పిల్లలకు బోధనలా.. ?''

శారద ముఖం లో ఆశ్చర్యం గోచరిస్తుంది..

గోపాల్ చిన్నగా నవ్వుతూ..

..''అవును.. ప్రతీ ఆదివారం ఉదయం తొమ్మిదిన్నర నుండి పదకొండు గంటల వరకు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తాం.. ఇప్పుడు ఉన్న పిల్లలకి భగవంతుడు, భక్తి అన్నవాటికి అర్థం తెలీకుండా పెరుగుతున్నారు.. ఉదయం లేవగానే టీవీ ఆన్ చేసి, అందులో వచ్చే కార్టూన్ ప్రోగ్రామ్‌ని చూడడమో, సినిమాలు చూడడమో చేస్తున్నారు కానీ.. భగవంతుడి గురించి అసలు పట్టించుకోవడం లేదు.. ఇక తల్లితండ్రులు కూడా ఈ విషయంపై పెద్దగా దృష్టి సారించడం లేదని నా అభిప్రాయం.. ఉదయం లేవగానే రోజువారి తమ పనులతో వారు బిజీగా ఉండడం, పిల్లలకి స్కూల్ కు వెళ్ళేందుకు సిద్దం చేయడం లాంటి పనులతో బిజీగా

మారడంతో పిల్లలకు ఆధ్యాత్మిక విషయాలు గురించి చెప్పడానికి వారికీ టైం సరిపోవడం లేదు.. అందుకే ప్రతీ ఆదివారం ఈ కాలనీ చుట్టుపక్కల  ఉన్న పిల్లలకు ఆధ్యాత్మిక భోదనలు చేసే కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నాం..''

గోపాల్ చెబుతుంటే శారద చాలా శ్రద్దగా విన్నది.. చెప్పడం ఆపేసి శారద వంక చూస్తాడు గోపాల్..

''మీరు అన్నది అక్షరాల నిజం, ఉదయం నుండీ రాత్రి వరకూ ఉరుకు పరుగులతో కూడిన జీవితంలో పిల్లలకు  ఆధ్యాత్మిక భోదనలు చేసేంత తీరిక తల్లితండ్రులకు  ఉంటుందనుకోవడం భ్రమగానే ఉంటుంది.. మీరు చాలా చక్కని కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు.. పిల్లలలో ఆధ్యాత్మిక చింతన కలిగించక పోతే హింస పెరగటం, ఒకరిపై ఒకరు ద్వేషాలు పెంచుకోవడం లాంటివి జరుగుతాయి..''

''అవును.. అలాంటి పరిస్థితులు రాకుండా చిన్నప్పటినుండే పిల్లలలో పరిపక్వత పెంపొందించాలనే సంకల్పంతోనే ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నాము.. అన్నట్టు..  ఈ భజన కార్యక్రమం అయిపోగానే, ఈ భజన మందిరాన్ని శుభ్రపరిచి నీటుగా సర్ది ఉంచాల్సిన బాద్యత నీదే.."

"అయ్యో.. తప్పకుండా చేస్తాను.. భజన కార్యక్రమం అయిన తర్వాత పదినిమిషాల్లో హాలంతా శుభ్రపరుస్తాను."

నమ్మకంగా అంది శారద.. గోపాల్ చిరునవ్వు నవ్వుతూ అక్కడనుంచి నిష్క్రమిస్తాడు.. శారద కొద్ది సేపు గోపాల్ వెళ్ళిన వైపే చూసి, తిరిగి లోపలి వెళ్లి యధాస్థానంలో కూర్చుని, భజన చేస్తున్న వారితో గొంతు కలుపుతూ, చేతులతో పూలహారం కడుతూ బిజీలో పడిపోతుంది_ _ _

-------------------

భజన మందిరంలో పిల్ల లందరూ కూర్చుని ఉన్నారు.. వారి దగ్గర సాయిబాబా మందిరం తరపున ప్రత్యేకంగా తయారు చేయించిన సాయిబాబా దివ్యచరిత్ర మినీ బుక్కులు ఉంటాయి.

వారికి ఆధ్యాత్మిక బోధనలను  చేసేందుకు నియమించిన మాస్టారుతో పాటు మేనేజరు గోపాల్  కూడా ఆ హాలులోనికి  వస్తారు.. ఆ పిల్లలు కూర్చున్న చోటుకి కొద్ది దూరంలో శారద కూడా నిలబడి ఉంటుంది.. ఆమె ముఖం లో ఉత్సుకత..

పిల్లలకి ఆధ్యాత్మిక బోధనలను  ఎలా చేస్తారు..? అన్న ఆతురత ఆమె ముఖం లో కనిపిస్తుంటుంది..!

మాస్టారు ఆ పిల్లలకి ఎదురుగా నిలబడి కన్పిస్తారు. ఆలయ మేనేజరు గోపాల్ ఆ ప్రక్కనే ఉన్న కుర్చీలో కూర్చుని ఉంటారు.. ఆ హాలులో పిల్లలతో పాటు కొంత మంది పెద్దవాళ్లు కూడా పాఠాలు వినాలన్న ఆసక్తితో ఆ హాలులో ఓ పక్కగా నిలబడి ఉంటారు.

మాస్టారు ఒకసారి ఆ హాలంతా చూసి ఆ ప్రక్కనే ఉన్న సాయినాధుడి ఫోటోకి భక్తి పూర్వకంగా నమస్కారం చేస్తారు.

‘‘ఓం శ్రీసాయి రాం..’’

మాస్టారు రెండు కన్నులు మూసుకుని సాయినాధుడిని ప్రార్థిస్తాడు.. ఆ తర్వాత కళ్లు తెరిచి ఒకసారి ఆ హాలులో ఉన్న వారందరినీ పరికించి చూసి గొంతు సవరించుకుంటాడు..

‘‘ఆ సాయిబాబా దివ్య చరిత్రని తెలుసుకుంటే ఎంతో పుణ్యం లభిస్తుంది.. అంతేకాదు మనస్సుకు శాంతి కలుగుతుంది. అంతా మంచి జరుగుతుంది..’’

చెప్పడం ఆపి మళ్లీ ఒకసారి అందరినీ గమనిస్తాడు.. వారందరూ తాను ఏమి చెబుతానా అన్న ఆతురతతో గమనిస్తున్నారని తెలుసుకుని ఒకింత గర్వపడతాడు..

ఆ తర్వాత మాస్టారు చెప్పే ఆధ్యాత్మిక పాఠాలు వినడానికి పిల్లలతో సహా పెద్దలందరూ నిశ్శబ్దంగా మాస్టారునే చూస్తూంటారు.

శారద కూడా ఎంతో ఎగ్జైట్‌మెంటుగా చూస్తుంటుంది..

“ పిల్లలూ మనం గతవారం ఎంతవరకు చెప్పుకున్నాము.. ఊ.. ఆ.. గుర్తొచ్చింది.. సాయిబాబా శిరిడీలో ఉండిపోతాడని, అతనికి శ్యామా, బాయిజా బాయి, తాత్యా లాంటి కొందరు ఆప్తులు ఉంటారని తెలుసుకున్నాము కదా.. సాయిబాబా శిరిడీలో ఓ పాడుపడ్డ మసీదులో ఉండేవాడు, ఆయన ప్రతిరోజూ ఒకసారి శిరిడీ గ్రామములోకెళ్లి అందరి ఇళ్లలో భిక్షాటన చేసి చివరికి ఆ పాడుపడ్డ మసీదులోకే వచ్చి ఉండేవాడన్నమాట.. అయితే సాయిబాబా మాములు భిక్షగాని వలె కన్పించినా, ఆయన ఎంత మహిమాన్వితుడో కొన్ని సంఘటన ద్వారా  ఆ ఊరి వాళ్లకి తెలుస్తుంది..’’

మాస్టారు చెబుతూ  ఉంటే.. పిల్లలతో సహా మేనేజరు గోపాల్, మిగతా పెద్దవాళ్లు, శారద అందరూ ఎంతో శ్రద్ధగా వింటూ ఉంటారు..మాస్టారు చెప్పడం ప్రారంభిస్తాడు..

‘‘ఒకరోజు శ్యామాను పాము కరుస్తుంది.. అది మామూలు పాము కాదు.. విష సర్పం.. దాంతో శ్యామాకి ఆ విషం శరీరమొత్తం ప్రాకిపోతుంది.. దాంతో శ్యామా సాయి ఉన్న మసీదుకి వస్తాడు.. శ్యామా ఎంతో బాధతో మసీదు మెట్లెక్కుతుంటే సాయిబాబా శ్యామాని కసురుకుంటాడు.. ఓయీ దొంగపూజారి అలా పైపైకెక్కుతున్నావేమిటి..

దిగు.. దిగి ఇక్కడి నుండి వెళ్లిపో.. అంటూ గట్టిగా అరుస్తాడు సాయి.. దాంతో శ్యామా ఎంతో ఆశ్చర్యపోతాడు..

పాము కరిచినందుకు వైద్యం కోసం సాయిని  వెతుక్కుంటూ  వస్తే..  నన్ను మెట్లెక్కవద్దంటాడేమిటీ..?  వెళ్లిపో అంటాడేమిటి..? అని బాధ పడతాడు.. కానీ.. ఆశ్చర్యంగా.. అప్పటి వరకూ శ్యామా ఒంట్లోకి విషం ఎక్కుతుండటం తోపాటు ఎంతో ఆయాసంతో ఉన్న వాడు ఒక్కసారి శరీరంలో ఉన్న బాధంతా తగ్గిపోయింది.. అప్పుడు బోధపడింది శ్యామాకి.. ఆ సాయినాధుడు  అన్నది శ్యామాని కాదని, శ్యామా  శరీరంలో పైపైకి  ఎక్కుతున్న విషాన్నని.. అలా తెలుసుకున్న శ్యామా సాయిబాబాకి  భక్తితో

నమస్కరిస్తాడు.. సాయిబాబా ఎంతో ప్రేమతో 'ఈ ఫకీరు ఉన్నంత కాలం మీకేమీ కాదు' అంటూ భరోసా ఇస్తాడు..''

మాస్టారు చెప్పడం ఆపుతాడు.. మేనేజరు గోపాల్ తో సహా అందరూ మాస్టారునే చూస్తుంటారు.. శారద కూడా ఎంతో ఆసక్తిగా చూస్తుంటుంది. కానీ.. ఆమె ముఖం లో భావాలు క్రమ క్రమంగా మారిపోతుంటాయి.. మాస్టారు అలా చెప్పడం ఆమెకి ఇష్టం లేదన్న ఫీలింగు ఆమె ముఖం లో ప్రతిఫలిస్తుంటుంది.. అలాగే పిల్లల మొహలలో కూడా భావాలు మారిపోతుంటాయి.. వారికి ఇంట్రెస్టు లేనట్టుగా మొహాలు పెడతారు.. మాస్టారు చెప్పేది అక్కడున్న పెద్దవాళ్లు ఎంతో వినయంగా వింటూంటారు కానీ.. పిల్లలు మాత్రం మాస్టారు చెప్పేది వినిపించుకోకుండా తమలో తామే మాట్లాడుకుంటుంటారు..

''మరొకరోజు డాక్టరు పిళ్లేకు వీపులో పెద్ద నారికురుపు అవుతుంది. ఆ కురుపు పెట్టే బాధని ఆయన భరించ లేకుండా ఉంటాడు. ఆ బాధతో పడుకోలేడు, కూర్చోలేడు, ప్రతిరోజూ అతనికి నరకప్రాయమే.. తనకీ బాధనుండి విముక్తి లభించేలా చేయాలని ఆయన బాబాని ఆశ్రయిస్తాడు.. ఆయన బాబాతో అంటాడు.. 'బాబా.. బాబా.. నేనీ బాధని భరించలేకున్నాను, నాకు ఈ బాధనుండి విముక్తున్ని చేయండి, అలా వీలుకాని పక్షంలో నాయీ బాధని పది జన్మలో అనుభవించేలా చేయండి' అని బాబాతో వేడుకొంటాడు డాక్టరు పిళ్లే. ఆయన మాటలు విన్న బాబా చిన్నగా నవ్వుతాడు.. పిళ్లే.. నీవెంత బాధపడుతున్నావో నాకెరుకే.. పది జన్మల వరకెందుకు, పది రోజుల్లో నీకీ బాధనుండి విముక్తుదుని చేస్తాను.. అని చెప్పి పిళ్లేను తన దిండుకు ఆనుకోమని చెబుతాడు.

ఆ తర్వాత ఒక మూడు నాలుగు దినముల అయిన తర్వాత పిళ్లే ఆ మసీదులో అటూ ఇటూ పచార్లు చేస్తుండగా అక్కడే ఉన్న అబ్దుల్లా అనుకోకుండా ఆయన కాలు తొక్కుతాడు.. దాంతో ఆయన తూలి ముందుకు పడతాడు. సరిగ్గా అదే సమయంలో ఓ కాకి వచ్చి ఆయన కురుపుని పొడిచి వెళుతుంది.. దాంతో ఆ కురుపులో ఉన్న పురుగులు బయటకు వచ్చేసి, సరిగ్గా పదిరోజుల్లో ఆ కురుపు బాధనుండి శాశ్వతంగా విముక్తుడవుతాడు డాక్టరు పిళ్లే.. చూసారా

పిల్లలూ ఆ సాయిబాబా దివ్య శక్తులు ఎలాంటివో..'' మాస్టారు చెప్పిన దాన్ని ఎంతో శ్రద్ధగా వింటున్నట్టు పిల్లలు నటిస్తున్నారన్న విషయం శారదకి తోస్తుంది.. ఆమె చూపు ఆ పిల్లల పై పడింది..

పిల్లలందరూ  తమ పక్కనున్న పిల్లలతో గుసగుస గా మాట్లాడుకోవటం,  కొందరు పిల్లలు తమ చేతిలో ఉన్న పెన్నును చెవిలో పెట్టుకోవడం, మరి కొందరు ఆవలింతలు తీస్తూ అటూ ఇటూ చూస్తుండడం లాంటివి శారద కళ్ళలో పడతాయి. దాంతో మాస్టారు ఎంతో భక్తి పూర్వకంగా చెబుతున్న ఆ సాయినాధుడి దివ్య చరిత్ర పెద్దవారిని మాత్రమే ఆకట్టుకుంటుందని, దానిని పిల్లలు పెద్దగా పట్టించుకోవడం లేదన్నది శారదకి అర్థం అయ్యింది.

పిల్లల ప్రవర్తన మాస్టారు దృష్టిని కూడా దాటిపోలేదు. తాను అంత శ్రద్ధగా చెబుతున్నా కూడా పిల్లల మొఖాల్లో  చిరాకు, అనవసరంగా ఈ గుడికి వచ్చామే అన్నట్టుగా కనిపిస్తున్న ఫీలింగ్స్ ని గమనించి మాస్టారు మనసు నొచ్చుకుంటుంది.

మేనేజర్ గోపాల్ గారి లక్ష్యం.. నేటి తరానికి ఆ సాయినాధుడి దివ్య చరిత్రతోపాటు, ఆధ్యాత్మిక చింతనను వారిలో పెంచాలన్న సంకల్పం తోనే తనని ఈ పనికి పురమాయించాడు. కానీ.. తన బోధనల  వలన పిల్లలలో ఏమాత్రం ఆసక్తి కనిపించడం లేదని అర్థం కాగానే ముఖం  మ్లానమయిపోతుంది.

''అదేమిటీ.. తాను ఇంత కష్టపడి పిల్లలకు సాయిచరిత్ర చెబుతూంటే.. ఈ పిల్లలేంటీ.. నేను చెప్పినదాన్ని అస్సలు విననట్టూ.. తాను చెబుతూంది వినేందుకు ఇష్టంలేనట్టు మొహాలు పెట్టారు..''

మాస్టారు ఒక సారి పిల్లలన్దరి మొహాలు చూస్తాడు.. ఆ తర్వాత గొంతు సవరించుకుంటాడు..

''చూడండి పిల్లలూ.. మీరు నేను చెబుతుంది శ్రద్దగా వింటున్నట్లు నాకు అనిపించడం లేదు.. నేను చెప్పినదాంట్లో మీకు అర్థం కానిదేమయినా వుంటే నిరభ్యంతరంగా నన్ను ప్రశ్నించవచ్చు..''

మాస్టారు పిల్లల మొహాలు చూస్తాడు.. పిల్లలు కూడా మాస్టారు వంక చూస్తారు.. అక్కడే ఉన్న మేనేజర్ గారు, శారద లు కూడా మాస్టారు వంక, పిల్లల వంక చూస్తూంటారు.. మాస్టారు తమ వంకే తీక్షణంగా చూస్తుండడంతో పిల్లలలో కాస్త బెరుకు కనిపిస్తుంది. ప్రశ్నలు అడగాలా వద్దా అన్న సందిగ్ధావస్థలో పిల్లలు ఉన్నట్టు మాస్టారు గమనిస్తాడు..

మాస్టారు ముఖం లో చిరునవ్వు మెరుస్తుంది..

''చూడండి పిల్లలూ. మీరు ప్రశ్న వేస్తే నేనేదో కోప్పడతానన్న సందేహం మీ మనసులో మెదులుతూంది కదూ..'' మాస్టారు అంటారు.

పిల్లలందరినీ చూస్తాడు మాస్టారు.. పిల్లలందరూ అవును అన్నట్టుగా తలూపుతారు..మాస్టారు చిన్నగా నవ్వుతాడు..

''చూడండి పిల్లలూ .. నేను ఇక్కడికి వచ్చింది.. ఆ దేవుడి గురించి మీకు తెలియజెప్పడానికి, మరియూ మీలో ఆ దేవుడిపై ఉన్న సందేహాలు కూడా తీర్చడానికి, అంతేకానీ నా మానాన నేనేదో చెప్పేసి, మీ సందేహాలు మీ మనసులో అలాగే ఉంచడం కోసం నేనిక్కడికి రాలేదు..

నిరభ్యంతరంగా మీ సందేహాలను నాతో పంచుకోండి.. మీరే ప్రశ్న అడిగినా నేను దానికి సమాధానం చెబుతాను..''

మాస్టారు అలా అనడంతో మూడు వరుసలలో కూర్చున్న పిల్లలలో మధ్య వరుసలో ఉన్న ఓ చిన్న పిల్లవాడు, చేతిని పైకెత్తుతాడు, (స్కూళ్లలో ఏదైనా టీచర్ ఏదైనా క్వశ్చన్ అడిగాక, దానికి ఆన్సర్ తెలిసినవారు చేయి ఎత్తుతారే అలా..)

మాస్టారు చూపుతో సహా, మేనేజరు, శారద చూపు కూడా ఆ పిల్లవాడి చేయిపై పడతాయి. మాస్టారు కూడా ఆ చేయిపై ఆశ్చర్యంగానూ, కాస్తంత అసహనంగానూ చూస్తాడు. ఆ తరువాత మేనేజరు గోపాల్ కూడా కుర్చీలో కూర్చునే ఆ పిల్లవాడి చేయిని చూస్తాడు. అతని నొసలు ముడిపడి ఉంటాయి. శారద ఒక విధమైన ఉత్సుకతకు లోనయ్యి ఆ పిల్లవాని వైపు చూస్తుంటుంది.. ఆ పిల్లవాడు ఏం ప్రశ్న వేస్తాడా అన్న ఆతృత అందరిలో కనిపిస్తుంది.

మాస్టారు ఆ పిల్లవాడిని చూసి నవ్వుతాడు.. మాస్టారు ముఖం లో చిరునవ్వు కనిపిస్తుంది..

మాస్టారు ఆనందంతో చప్పట్లు కొడతాడు..

‘‘శభాష్.. నీలో ఉన్న సందేహం ఏమిటో నిర్భయంగా నన్నడుగు.. నీ సందేహానికి సమాధానాన్ని చెప్పడానికి నేను సిద్దంగా ఉన్నాను..’’

మాస్టారు ఆ పిల్లవాడిని చూస్తూ అంటాడు.. ఆ పిల్లవాడు కాస్త బిడియంగా తన చుట్టూ ఉన్న పిల్లలని చూస్తూ మెల్లిగా పైకి లేస్తాడు.. వినయంగా చేతులు కట్టుకుని నిలబడుతాడు..

ఆ తర్వాత ఆ పిల్లవాడు ఆ హాల్లో ఉన్న మిగతా వారందరినీ చూస్తాడు.. ఆ హాలులో ఉన్న మిగతా వారు సైతం ఆ పిల్లవాడు ఏం ప్రశ్న వేస్తాడా అన్న ఉత్సుకతతో ఆ పిల్లవాడి వంకే చూస్తాడు..

అందరికంటే ఎక్కువ ఉత్సుకత మాత్రం మేనేజర్ గోపాల్, శారదలో ఉంటాయి.. వారిద్దరూ ఆ పిల్లవాడినే తదేకంగా చూస్తూంటారు,

‘‘బాబూ నీ పేరు..?’’ మాస్టారు ఆ అబ్బాయిని అడుగుతాడు.

‘‘నాపేరు సాయిప్రతాప్ గురువు గారూ.. నేను ఈ పక్క వీధిలో ఉంటాను, అదిగో ఆ పక్కగా నిలబడి ఉన్నాడే ఆయనే మా నాన్న..’’ పిల్లవాని చూపు ఆ మందిరంలోనే కొద్ది దూరంలో నిలబడి ఉన్న ఓ మధ్య వయస్కుడిని చూపిస్తుంటుంది...

అందరి చూపూ ఆయనపై పడుతుంది... ఒక్కసారిగా ఆ హాలులో ఉన్నవారందరూ తనవైపు చూడడంతో సాయిప్రతాప్ తండ్రి  కాస్తంత బిడియపడతాడు, ముఖం లోకి చిరునవ్వు తెచ్చుకుంటూ  అందరివైపు  చూస్తూ పలకరింపుగా నవ్వుతాడు..

''చాలా సంతోషం సాయిప్రతాప్, నీ మనసులో ఎలాంటి సందేహం ఉన్నా బయటకు చెప్పేసెయ్.. నేను సమాధానం చెబుతాను..''

మాస్టారు ఆ పిల్లవాడు అడిగే ప్రశ్నకి సమాధానం చెప్పడానికి సిద్ధపడిపోతున్నట్టుగా ఎక్స్‌ప్రెషన్స్ పెడతాడు, శారద, గోపాల్‌తో పాటు సాయిప్రతాప్  తండ్రి సైతం అ అబ్బాయి ఏం ప్రశ్న వేస్తాడా అన్న కుతూహలం తో ఆ పిల్లవాడినే చూస్తుంటారు..

సాయిప్రతాప్ కాస్త భయంగానూ, బిడియంగానూ అడుగుతాడు..''

''గురువుగారూ, ఇందాక మీరు మాకు ఒక కథ చెప్పారు కదా.. అది ఎప్పుడు జరిగింది..?

''అదా.. అది సాయినాధుడు జీవించి ఉన్న కాలంలో జరిగింది..!''

మాస్టారు ముఖం లో ఇలాంటి ప్రశ్న అడిగాడేమిటి అన్న ఎక్స్‌ప్రెషన్స్..

సాయిప్రతాప్ లో కొద్దిగా ధైర్యం పెరగడంతో మరికొన్ని ప్రశ్నలు  అడగడానికి సిద్ధపడతాడు..

''ఓహో.. మీరు చెప్పిన కథలో డాక్టర్ పిళ్ళే ఉన్నారు కదా..''

''అవును ఉన్నాడు..  ఆయనకి వీపులో  పెద్ద నారి కురుపు  అవుతుంది.. ఆ  కురుపుతో అతను ఎంతో బాధ పడుతుంటాడు, వీపుపై వంద క్వింటాళ్ళ బరువు మోస్తున్న అనుభూతి కలుగుతుంది.. అలాంటిది ఆ సాయినాధుడు కేవలం పది రోజుల్లో ఆయనకి ఆ నారికురుపు నుండి విముక్తుడిని చేస్తాడు. ఇది జగమెరిగిన సత్యం.. ఇందులో నీకు వచ్చిన సందేహం ఏమిటి..?'' ఆత్రంగా అడుగుతాడు.

మాస్టారు ముఖం లో ఆశ్చర్యంతో కూడిన ఎక్స్‌ప్రెషన్..

ఆ పిల్లవాడు చిన్నగా నవ్వుతాడు, ఆ తరువాత ఒకసారి ఆ హాలులో ఉన్న వారివైపు చూస్తాడు..

ఆ పిల్లవానికి వచ్చిన సందిగ్ధం ఏమిటా అన్న ఆలోచనతోనే మిగతా వారందరూ ఆశ్చర్యంతో ఆ పిల్లవానినే చూస్తుంటారు.

సాయిప్రతాప్ అడుగుతాడు.. ''అయితే మాస్టారు.. ఇప్పుడు కూడా అలాంటి బాధలు ఉన్న వారికి ఆ దేవుడు సహాయం చేస్తాడా..?''

ఆ ప్రశ్నకి మాస్టారు హాయిగా నవ్వుతాడు.

''తప్పకుండా సహాయం చేస్తాడు, అయినా ఈ రోజుల్లో అలాంటి నారీ కురుపులు ఎక్కడుంటాయి.. నీ పిచ్చి కాకపోతే.. అయినా అలా ఉన్న వారెవరయినా సరే.. సాయినాధుడిని శరణు కోరితే ఖచ్చితంగా ఆ బాధనుండి విముక్తుడిని చేస్తాడు.. ఏం.. మీ వీధిలో గానీ ఎవరయినా అటువంటి బాధతో ఉన్నారా..?''

ఆశ్చర్యంగా అడుగుతాడు మాస్టారు..

సాయిప్రతాప్ ఒకసారి అక్కడున్న వారందరినీ చూస్తాడు.. ఆ తర్వాత మెల్లిగా తలదించుకొని..

''అలాంటి బాధ పడుతుంది మరెవరో కాదు గురువు గారూ.. నేనే..!''

సాయిప్రతాప్ అన్న మాటలతో అందరూ ఉలిక్కిపడతారు, సాయిప్రతాప్ తండ్రి ముఖం లో విపరీతమైన ఉద్వేగంతో కూడిన ఎక్స్‌ప్రెషన్స్, మేనేజర్ గోపాల్ సాయిప్రతాప్ మాటలకి కుర్చీలోనుండి లేచి నిలబడుతాడు,  శారద కూడా విపరీతమైన ఆశ్చర్యంతో సాయిప్రతాప్‌ని చూస్తూంటూంది. మాస్టారు ముఖం లో కూడా విపరీతమైన ఆశ్చర్యంతో కూడిన ఎక్స్‌ప్రెషన్స్.. అక్కడున్న వారందరూ సాయిప్రతాప్‌ని ఎంతో ఆశ్చర్యంగా చూస్తూండి పోతారు.

సాయిప్రతాప్ తండ్రి కంగారు పడతాడు..

''సాయి.. ఎమిట్రా అలా మాట్లాడుతున్నావు.. నీకేంటి ఆ నారీకురుపేంటి.. ఇక్కడందరూ పెద్దవారున్నారు, ఇంట్లో చేసినట్టు ఇక్కడ అల్లరి చేయకూడదు.. '' సాయి ప్రతాప్ తండ్రి గొంతులో కోపం ధ్వనిస్తుంది..

సాయిప్రతాప్ తన తండ్రివైపు శాంతవదనంతో చూస్తాడు..

సాయిప్రతాప్ వాయిస్ ''అవును డాడీ, మీకు తెలియదు నాకు నారీ కురుపులాంటి బాధ వుంది.. '' అతని మాటకి అక్కడున్న వారందరూ విపరీతమైన ఆశ్చర్యంతో చూస్తారు.

సాయిప్రతాప్ తండ్రి ముఖం లో కోపం ప్రవేశిస్తుంది..

''ఒరేయ్.. పరాచికాలు ఆడడానికి ఇదా సమయం.. నిన్నేం చేస్తానో చూడు.. ''సాయిప్రతాప్ వైపు గుడ్లు ఉరిమి చూస్తూ అంటాడు.. మాస్టర్ సాయిప్రతాప్ తండ్రివైపు చూస్తాడు..

''మీరు కాస్త ఊరుకోండి.. బాబు మనసులో ఏదో సందేహం ఉన్నట్టుంది.. అదేమిటో తెలుసుకుందాం.. మీరు కాస్త అతన్ని భయ పెట్టకుండా శాంతంగా ఉండండి.. అసలు విషయం ఏమిటో నేను కనుక్కుంటాను...''

మాస్టర్ అలా అనడంతో సాయిప్రతాప్ తండ్రి కాస్త వెనక్కి తగ్గుతాడు.. మాస్టర్ సాయిప్రతాప్ వంక చూస్తాడు..

''చెప్పు సాయిప్రతాప్.. ఇంతకీ నీకు అలాంటి బాధ రావడమేమిటి..? అసలు  నీ సందేహ మేమిటో సూటిగా చెప్పు.. నీ సందేహాన్ని నేను తీరుస్తాను..''

శారద సాయిప్రతాప్ వంకనే చూస్తుంటుంది.. ఆమె ముఖం లో ఒకవిధమైన ఉద్విగ్నం కనిపిస్తుంటుంది.. ఆ పిల్లవాని మదిలో ఏం ఆలోచన ఉందో తెలుసుకోవడానికి ఆమె ప్రయత్నిస్తున్నట్టు ఉంటుంది ఆమె ముఖం లోని ఎక్స్‌ప్రెషన్స్..

సాయిప్రతాప్ మెల్లిగా నోరు తెరుస్తాడు..

‘‘అవును గురూజీ.. సాయిబాబా ఉన్న కాలంలో డాక్టర్ పిళ్ళే నారీ కురుపుతో బాధపడ్డారు, ఈ కాలంలో  మేము ప్రతిరోజూ ఉదయం, సాయంత్రం మా వీపుపై స్కూల్ బ్యాగు మోస్తూ అంతకంటే ఎక్కువగా బాధపడుతున్నాము..

ఈ బాధ నా ఒక్కడిదే కాదు, ప్రైవేటు స్కూళ్లల్లో చదువుతున్న ప్రతీ ఒక్క విద్యార్థీ ఇలాంటి బాధని అనుభవిస్తున్నాడు.. ఇది ఎలిమెంటరీ స్కూల్ నుండి మొదలు పెడితే టెన్త్ క్లాస్ వరకూ ఈ బాధని అనుభవించాల్సిందే..’’

ఎంతో దీనంగా సాయిప్రతాప్ అలా అడగడంతో మిగతా విద్యార్థులందరూ ఆనందంగా చప్పట్లు కొడతారు. సాయిప్రతాప్  మాటతో ఆ హాలులో వారందరూ  విపరీతమైన ఆశ్చర్యానికి  గురవుతారు.. ఒక స్కూల్ విద్యార్థిలో ఎంతటి బాధ దాగుందో అతని మాటల్లో తెలిసిపోతుంది.. సాయిప్రతాప్ మాటతో శారద కళ్లలో కన్నీళ్ళు సుడులు తిరుగుతాయి, మేనేజర్ గోపాల్‌తో సహా అక్కడున్న మిగతా పెద్దవారందరి మొహాల్లోనూ ఆశ్చర్యం..

మాస్టారు ముఖం  తెల్లబడిపోతుంది..

‘‘ఆ సాయిదేవుడికి చెప్పి మాకీ బాధ నుండి విముక్తుడిని చేసే అవకాశం ఉందా గురువు గారూ..?’’ ఎంతో దీనంగా అడుగుతున్న సాయిప్రతాప్ ప్రశ్నకి మాస్టారు, మేనేజరు, శారద తో సహా అక్కడున్న పెద్దందరిలోనూ ఎంతో బాధకలుగుతుంది.

అతని ప్రశ్నకి మాస్టరు ముఖం  మ్లానమయిపోతుంది..! ఆ బాలుడికి  ఏం సమాధానం చెప్పాలో తెలియక నీళ్ళు నములుతాడు.. అందరి చూపూలూ  ఆ మాస్టారుపై పడుతాయి.. శారద కూడా ఎంతో ఉత్సుకతతో ఆ బాలుడి  ప్రశ్నకి మాస్టారు ఏం సమాధానం చెబుతాడా అని చూస్తుంటుంది…

మాస్టారు ముఖం లో కంగారు స్పష్టంగా కనిపిస్తుంటుంది…

యోగపురుషుని కథని ఔపోసన పట్టి,  వాటిని ప్రజలకు చెప్పే ఆ మాస్టారుకి అనూహ్యంగా ఆ కుర్రవాడు వేసిన ప్రశ్నకి ఏం సమాధానం చెప్పాలో అర్థం కాదు.. కానీ ఏదో ఒకటి చెప్పాలి కాబట్టి ముఖం లోకి చిరునవ్వుని తెచ్చుకుని అంటాడు.

''అంటే.. మరేమో..  అప్పుడు కాలం వేరు..  వారందరూ పెద్దవారు  కదా.. దేవుడంటే ఎవరు, దేవుడు ఏం చేస్తాడు, దేవుడికి ఎలా వేడుకోవాలి ఇలాంటివన్నీ తెలిసిన పెద్దవారు కాబట్టి వారి వేడుకోలుకు  దేవుడు కనికరించాడు, ఇప్పుడు మీరు చిన్న వారు కదా.. అయినా స్కూల్ కి వెళ్లాలంటే స్కూల్ బ్యాగు మోయాల్సిందే కదా.. ఇలాంటివి ఆ దేవుడిని అడగ కూడదు.. తప్పు.. మీరు పెద్దవారయ్యాక మీరేం కోరినా ఆ దేవుడు కాదనడు..''

మాస్టారు మాటలకు శారద ఎంతో ఆశ్చర్యపోతుంది.. ఆమె ముఖం లో ఒక విధమైన ఉద్విగ్నతతో కూడిన ఎక్స్‌ప్రెషన్స్.. మేనేజర్ గోపాల్ ముఖం లో కూడా ఇంచుమించు అలాంటి ఎక్స్‌ప్రెషన్..

మేనేజరు గోపాల్ శారదని చూస్తాడు.. ఆమె అసహనంగా ఉన్నదని గమనిస్తాడు, గోపాల్ నొసలు ముడిపడ్డాయి. మాస్టారు చెబుతున్నది ఆమెకి నచ్చడంలేదని ఆమె హావభావాని బట్టి గమనిస్తాడు గోపాల్.  చెబుతున్న మాస్టారుని, శారదని పరికించి మరీ తిలకిస్తాడు గోపాల్

శారద అక్కడ ఉండలేక బయటికి వెళుతుంది.. ఉన్నఫళంగా శారద అలా బయటికి ఎందుకు వెళ్ళిందో అర్థం కానీ గోపాల్ ఆమె వెనకాలే వెళతాడు.

...........................

గోపాల్ భజన మందిరం నుండి బయటికి వస్తాడు.. అతని చూపులు శారద కోసం వెతుకుతాయి.. సాయిబాబా మందిరం ప్రాంగణం అంతా భక్తులతో నిండిపోయి ఉంటుంది.. శారద కొద్ది దూరంలో భక్తులకు ప్రసాదాలు పంచేదగ్గర కనిపిస్తుంది.. శారద ముందు వరుసగా భక్తులు నిలబడి ఉంటారు. శారద వారికి ప్రసాదం పెడుతూ ఉంటుంది.. ఆమె ముందు నుండి ఒక్కొక్క భక్తుడు ప్రసాదం స్వీకరించి వెళ్ళిపోతుంటాడు.. అలా ప్రసాద

వితరణ చేస్తున్న శారదని చూసి గోపాల్ ఆశ్చర్యపోతాడు. ఆమె ప్రవర్తన ఆయనకి చాలా వింతగా అనిపిస్తుంది.

గోపాల్ భక్తులను దాటుకుంటూ శారద దగ్గరికి వస్తాడు.. శారద గోపాల్‌ని గమనించి చిన్నగా నవ్వి తనపని తాను చూసుకుంటుంది..

''ఏమిటి శారదమ్మా.. లోపల పిల్లలకి ఆధ్యాత్మిక భోధన జరుగుతూంటే మధ్యలోనే వచ్చేసావేమిటి..? పైగా పిల్లలకి ఆధ్యాత్మిక బోధను చేస్తూంటే నీకు చూడాలని ఉందని చెప్పావు..'' ఆశ్చర్యంగా అడుగుతాడు గోపాల్.

శారద గోపాల్ వంక చూసి చిన్నగా నవ్వుతుంది..

''పిల్లలకి భోదనలు చేయడం వరకు నాకిష్టం.. కానీ.. అక్కడ బోధనలు పిల్లలకి చేస్తున్నట్టుగా లేదు.. పెద్ద వారికి చెబుతూన్నట్టుగా ఉంది.. అయినా ఆ పిల్లవాడు అడిగిన ప్రశ్నకి మాస్టారు గారు చెప్పిన సమాధానం నాకు నచ్చలేదు. చిన్న పిల్లలు దేవుళ్ళతో సమానం.. వారి మనసులో మెదిలిన సందేహాలకు ఎంతో సావధానంతో  సమాధానం ఇవ్వాలి కానీ.. ఇలాంటి ప్రశ్నలు  ఇప్పుడు వేయకూడదు,  ఇప్పుడు అడగకూడదు  అన్న దాంట్లో ఎంత వరకు న్యాయం వుంది.. ఆ సాయినాధుడి చరిత్రని ఎంతో అద్భుతంగా చెప్పే ఆ మాస్టారు ఓ పిల్లవానికి  సమాధానం చెప్పడానికి మాటలు వెతుక్కోవాల్సి రావడం దురదృష్టకరం..''

గోపాల్ ఆశ్చర్యపోతాడు శారద మాటకి..

''అదేమిటి శారదమ్మా.. మాస్టారు గారు చెప్పే విధానం నీకు నచ్చలేదా..?''

''అయ్యయ్యో.. నా ఉద్దేశం అదికాదు.. వారు పెద్దవారు.. వారు చేసే బోధనకి వంక పెట్టేంత అర్హత నాకు లేదు..''

''మరి ఇంకేమిటి..? ఎందుకలా మధ్యలోనే వచ్చేసావు..? ఆ పిల్లవానికి మాస్టారు గారు చెప్పిన సమాధానం నీకు నచ్చలేదనిపించింది నాకు..''

''ఆ సమాధానం నచ్చలేదన్నది నిజం.. కానీ మాస్టారు గారు చేప్పే విధానాన్ని, ఆయన బోధనని తప్పు పట్టేంత పెద్దదాన్ని మాత్రం కాదు..''

గోపాల్ ఆశ్చర్యంగా శారద వంక చూస్తాడు..

''ఇది బావుంది. బోధన నచ్చలేదంటావు..? మాస్టారుని తప్పు పట్టనంటావు. బోధన నచ్చలేదంటే అది బోధించే మాస్టారు తప్పు చేసినట్టే కదా.. మరి ఆయనని తప్పు పట్టలేనంటావు.. నాకేమీ అర్థం కావడం లేదు..'' అయోమయం గా అంటాడు గోపాల్.

''నా ఉద్దేశ్యం ఏమిటంటే.. మాస్టారు గారు చెప్పే బోధనలు నాకు నచ్చాయా లేదా అన్నది కాదు ఇక్కడ కావాల్సింది.. ఆయన చెప్పేది పిల్లలు శ్రద్ధగా వింటున్నారా లేదా అన్నది ముఖ్యం కదా.. అయినా ఆ పిల్లవాడు అడిగిన ప్రశ్నకి కూడా ఎలాంటి సంకోచం లేకుండా సమాధానం చెప్పగలిగినప్పుడే పిల్లలలో  దేవుడిపై భక్తి శ్రద్ధలు పెరుగుతాయి..'' గోపాల్ ఉలిక్కిపడతాడు ఆ మాటలకి

''పిల్లలు శ్రద్ధగానే వింటున్నారు కదా.. గత ఇరవై వారాలుగా  వారు క్రమం తప్పకుండా వస్తున్నారు.. ఈ మాస్టారు చెప్పేది వింటున్నారు తెలుసా..?''

శారద చిన్నగా నవ్వుతుంది.. గోపాల్ నొసలు ముడిపడుతాయి.

''ఎందుకలా నవ్వుతున్నావు..?''

శారద నవ్వడం ఆపుతుంది. ఆమె ముఖం  సీరియస్‌గా మారుతుంది..

''పిల్లలు ప్రతీ వారం వస్తున్నారంటే అది వారి తల్లితండ్రులు ఒత్తిడి వల్ల వస్తూండవచ్చు కానీ.. వారు మనస్ఫూర్తిగా మాత్రం రావడం లేదనిపిస్తుంది.. సాయిప్రతాప్ అడిగిన ప్రశ్న తో మనకు  ఆ చిన్ని హృదయాలలో మరెన్ని సందేహాలు ఉన్నాయో అర్థం అవుతుంది కదా..''

''అసలు.. అసలు నీ ఉద్దేశ్యం ఏమిటో సూటిగా చెప్పు.. ''

''అయ్యో.. నేను మీకు చెప్పేంత గొప్పదాన్ని కాను.. ఈ గుడిలో పనిచేసుకుని బతికేదాన్ని..''

ఆమె తల దించుకుంటుంది.. ముఖం లో కొంత గిల్టీ ఫీలింగ్..

ఆమె మాటలకి గోపాల్ తేలికగా నవ్వుతాడు..

''చూడు శారదమ్మా.. నేను ఈ టెంపుల్‌కి మేనేజర్‌ని. కానీ నువ్వు వచ్చిన ఈ మూడు నాలుగు రోజులలో ఎప్పుడన్నా నేను మేనేజర్‌ని అన్న అహంతో నీతో మాట్లాడానా..? లేదు కదా..? నువ్వు ఇక్కడ పని దానివని నువ్వనుకుంటున్నావు.. కానీ నేను మాత్రం ఆ సాయినాధుడు ఇష్టంతో నిన్ను ఇక్కడికి రప్పించుకున్నాడని నేనంటాను.

మనుషుల్లో మంచి వారు, చెడ్డవారనే భేదాన్ని  నేను చూస్తాను కానీ, మనుష్యుల స్థాయిని గురించి కాదు.. నీ దగ్గర ఇంకా ఏమైనా మంచి ఆలోచనుంటే నాకు చెప్పు.. అవి ఆమోదయోగ్యంగా ఉంటే తప్పకుండా నేను ఆచరణలో పెడతాను.. నీ మనసులో ఉన్న భావాన్ని నిర్మొహమాటంగా నాకు చెప్పేసెయ్..''

గోపాల్ అన్న మాటతో శారదలో కొంచెం ధైర్యం వస్తుంది..

''పిల్లలకి భోధన చేయాలంటే వారు ఆలోచించే విధానానికి దగ్గరలో ఉండాలి.. ఎల్‌కెజీ, యుకెజీ చదివే పిల్లలకి ఎ అంటే యాపిల్, బి అంటే బాల్ అని టక్కున చెప్పేస్తారు.. అదే వారికి టెన్త్ క్లాస్ బుక్ ఇచ్చి గడగడా చదవమంటే చదువుతారా..? అలాగే పిల్లలలో భక్తి భావం పెంపొందించాంటే అసలు వారికి దేవుడు అంటే ఎవరు అన్నదాని గురించి ముందుగా బోధించాలన్నది  నా అభిప్రాయం.. ఇందుకు ఉదాహరణ సాయిప్రతాప్ అడిగిన ప్రశ్నయే. అయినా దేవుడి గుళ్లో దేవుడి గురించి చెప్పాల్సిన అవసరం కూడా లేదు.. వారు రోజూ తమ తల్లితండ్రులతో ఈ గుడికి వస్తారు.. ఎదురుగా విగ్రహాన్ని చూస్తారు.. ఆ విగ్రహం చూసి మమ్మీ ఆయనెవరు అనడిగితే ఆ తల్లి ఏం చెబుతుంది..? ఆయన సాయిబాబా అని చెప్పదు.. ఆయన దేవుడు అని చెబుతుంది..

అలాంటప్పుడు పిల్లలలో ఆ విగ్రహం దేవుడు మాత్రమే.. ఆ దేవుడు మంచి వారిని రక్షిస్తాడు, చెడ్డవారిని శిక్షిస్తాడు అన్నది బోధించాలి.. మంచి వారు ఎలా ఉంటారు.. చెడ్డ వారు ఎలా

ఉంటారన్నది వారికి బోధించాలి.. మంచి వారుగా ఉండాలంటే ఏం  చేయాలన్నది  వారికి చెప్పాలి..  వారికి అర్థమయ్యే  ఎల్‌కేజీ భాషలో  వారికి చెబితే అర్థమవుతుంది.. అంతేకానీ వారిని ఇలా కూర్చోబెట్టి సాయిబాబా జీవిత చరిత్ర బోధించినంత మాత్రాన ఆ పిల్లలలో మార్పు వస్తుందని నేననుకోను..''

గోపాల్ నోరు తెరిచి ఆశ్చర్యంగా చూస్తూండి పోతాడు..

''శారదమ్మా.. నువ్వు మాట్లాడుతుంటే ఒక ప్రొఫెసర్ మాట్లాడుతున్నట్టుగా ఉంటుంది.. ఇంత విశ్లేషణాత్మకంగా మాట్లాడే నువ్వు సామాన్యురాలివి కావు.. నువ్వన్నదీ నిజమే..! పిల్లలకి సాయిబాబా చరిత్ర చెబితే ప్రయోజనం ఉండదు.. నేనొప్పుకుంటాను.. కానీ వారికి అర్థమయ్యేలా చెప్పాలంటే ఏం చేయాలి..?''

గోపాల్ సీరియస్‌గా అంటాడు.. అలా అని పక్కకి తిరిగి చూస్తాడు. వారికి కొద్ది దూరంలో ఇందాక పిల్లలకి బోధన చేసిన మాస్టారు నిలబడి ఉంటాడు.. ఆ మాస్టారు వారి మాటలని వింటూంటాడు..

తమ మాటలు  మాస్టారు  విన్నాడని  అర్థమయిపోయిన శారద, గోపాల్  ఇద్దరి మొహాల్లోనూ భావాలు  మారిపోతాయి. కానీ మాస్టారు ముఖం లో మాత్రం ఎలాంటి భావం తొణికిసలాడదు. ముఖం లో చిరునవ్వు చెదిరిపోదు. తమ మాటలు  మాస్టారు హృదయాన్ని బాధించాయన్న ఫీలింగ్ మాత్రం శారదమ్మ, గోపాల్ లలో కలుగుతుంది.

మాస్టారుని చూడగానే శారదమ్మ తల దించుకుని భక్తులకు ప్రసాదం పెడుతుంటుంది.. గోపాల్‌కి మాస్టారుతో ఏం  మాట్లాడాలో  అర్థం  కాదు.. మాస్టారు  గోపాల్  వంక చూస్తాడు..  మాస్టారు  ముఖం లో చిరునవ్వు కదలాడుతుంటుంది.. ఆయన గోపాల్ వంక, శారదమ్మ వంక మార్చి మార్చి చూస్తాడు..

గోపాల్ తల దించుకుని రెండు చేతులు రుద్దుకుంటూ ఉంటాడు.. మాస్టారు వారి దగ్గరకు వస్తాడు.. గోపాల్ మాస్టార్ వంక చూసి ఒక బలవంతపు నవ్వు నవ్వుతాడు.

‘‘మాస్టారు గారూ.. అదీ.. అదీ.. ’’

గోపాల్ నోట్లోనుండి మాట బయటికి రాదు.. ఏం మాట్లాడాలో అర్థం కాక దిక్కులు చూస్తుంటాడు.. అతని అవస్థని గమనించిన మాస్టారు అర చేతితో చెప్పడం ఆపండి అన్నట్టుగా చేయి చూపుతాడు..‘‘ఈ అమ్మగారు మీతో మాట్లాడిన ప్రతి మాటనీ నేను విన్నాను. ఆమె చెప్పినదాంట్లో నూటికి నూరు శాతం వాస్తవం ఉన్నది. పిల్లలకు చరిత్రతో పని లేదు.. దీన్ని నేను అంగీకరిస్తున్నాను. అంతేకాదు ఆ పిల్లవాడు అడిగిన ప్రశ్నకి నేను తడబడడం కూడా వాస్తవమే. ఉన్న విషయాన్ని ఇంత సూటిగా చెప్పిన ఈవిడని నేను అభినందిస్తున్నాను.

చరిత్ర తెలుసుకోవడానికి పెద్దలలో ఉన్నంత ఆసక్తి పిల్లలలో ఉండదు, పిల్లలకు బోధనలు చేయాలంటే  వారిదైన చిన్న ప్రపంచంలో మనం ఇమిడిపోయి చెప్పగలిగితేనే మనం చెప్పేది వారికి అర్థమవుతుంది.. అంతేకానీ ఇలా చరిత్ర గురించి ఎన్ని గంటలు చెప్పినా వృధానే అవుతుందని ఆ బాబు అడిగిన ప్రశ్నతో నాకు అర్థమయింది.. అంతే కాదు వారిని అర్థం చేసుకుని మాట్లాడుతున్న ఈవిడ మాటల వల్ల కూడా ఈ వాస్తవం తెలుసుకున్నాను.’’

‘‘అయ్యో.. మాస్టరు గారు.. మీరు పొరబడుతున్నారు.. ఆవిడ ఉద్దేశ్యం.. మిమ్మల్ని తప్పుపట్టడం కాదు..’’

గోపాల్ ముఖం లో కంగారు..

‘‘నాకు తెలుసు గోపాల్ గారు.. ఆవిడ నన్ను విమర్శించలేదు.. పిల్లలకి  బోధన చేసే పద్ధతి గురించి మాత్రమే ఆవిడ మాట్లాడారని నాకు అర్థమయింది. ఆవిడ అలా అన్నందుకు నేనేమీ బాధపడటం లేదు.. మనం ఏం చేసినా పిల్లల భవిష్యత్తు బాగుండాలనే కదా..’’

‘‘అంతేకదండీ.. ఇప్పుడున్న పిల్లలలో ఆధ్యాత్మిక చింతన తీసుకురావాలన్న తపనతోనే కదా ఇంతలా చేస్తున్నది..’’

బాధగా అంటాడు మేనేజర్ గోపాల్.

‘‘అవును.. గోపాల్ గారు.. మీలో కలిగిన ఒక మంచి ఆలోచనని ఆచరించటానికి మీరు పడుతున్న శ్రమ నన్నెంతగానో సంతోషపెడుతుంది. ప్రస్తుతం నేటి తరం బాల బాలికలకి దేవుడి వాక్యాలు, ఆధ్యాత్మిక చింతన, భక్తి అంటే ఏమిటి అన్నవి తెలుసు కోవడం చాలా చాలా అవసరం.. ఆ విషయాన్ని గుర్తించారు కనుకనే మీరు ఇంతమంచి కార్యక్రమం చేయ సంకల్పించారు. అయితే మీరనుకున్న ఫలితం రావాలంటే మీ ఆలోచనలో కొద్దిగా మార్పు తీసుకురావాలి..’’ ఆయన ముఖం లో ఏమాత్రం చిరునవ్వు చెదిరిపోకుండా అంటారు. అయితే ఆయన మాటకి అర్థం తెలియక గోపాల్, శారదమ్మ ఇద్దరూ ఒకరి మొఖాలొకరు చూసుకుంటారు.

‘‘ నా ఆలోచనలలో మార్పు చేసుకోవాలా..? ఏమిటండీ అది..? గోపాల్ ఆశ్చర్యంగా అడుగుతాడు..

‘‘ఇందాక ఈవిడ మాటలను విన్నాక పిల్లల మనసుకి హత్తుకునే విధంగా బోధనలు చేయడం ఈవిడ ద్వారా అవుతుందని నేను నమ్ముతున్నాను. ఒక రెండు బోధనలు ఈవిడతో చెప్పిస్తే బావుంటుందని నా అభిప్రాయం..’’

మాస్టారు మాటలకు గోపాల్, శారద ఇద్దరూ షాకయిపోతారు.

శారదయితే మరింత కంగారు పడిపోతుంది...‘‘అయ్యా.. నేనేమయినా తప్పుగా మాట్లాడితే క్షమించండి.. నాకు ఎలాంటి బోధనలు రావు.. దయచేసి తప్పుగా మాట్లాడితే మన్నించండి..’’

శారద ఎంతగానో నొచ్చుకుంటుంది.. తన మాటకి మాస్టారు ఫీలయ్యారనే భావన శారదలో ఉంటుంది..

‘‘అమ్మా.. ప్రతి మనిషిలోనూ అంతర్లీనంగా ఒక అద్భుతమయిన కళ దాగి ఉంటుంది.. నాకు మీలో అలాంటి కళ ఉందని అనిపిస్తోంది.. నలుగురికి మంచి చేయాలన్న తపన, ఆ దేవుడిపై ఉన్న నిస్వార్థమైన భక్తి ఈ రెండు నీలో నిండి ఉన్నాయి.. అందుకే నువ్వు పిల్లలకి బోధన

చేయడంలో తప్పులేదు.. నీ బోధనల వల్ల వారిలో చిన్న మార్పు వచ్చినా గోపాల్‌గారి శ్రమకి అర్థముంటుంది.. నేనేదో ఈర్ష్యతోనో, లేక నాకు నేను చిన్నబుచ్చుకుని, నీకు చెబుతున్నది కాదు, సాక్షాత్తూ ఆ సాయినాధుడి నిర్ణయం ఈ విధంగా ఉందేమో..! ఒక్కసారి ప్రయత్నిస్తే తప్పులేదు కదా.. అంతేకాదు ఆ పిల్లవాడు అడిగిన ప్రశ్నకి వెంటనే ఏం సమాధానం చెప్పాలా అన్న సందిగ్ధంలో నేను కాస్త ఆలోచించాల్సి వచ్చింది, పురాణాలు, ఇతిహాసాలు, చరిత్ర గురించి నన్ను ప్రశ్నిస్తే ఏమాత్రం తడుముకోకుండా సమాధానాలు చెబుతాను, అలాంటిది మొట్టమొదటి సారి ఓ పిల్లవాని ప్రశ్నకి మాటలు తడుముకోవాల్సిన పరిస్థితి వచ్చింది..

కాలానుగుణంగా మనలోని ఆలోచనలు, బోధనలు కూడా మారాలని ఇప్పుడే నాకు అర్థమయింది..''

శారద ఎంతో ఆశ్చర్యపోతుంది.. ఆవిడ ఆ ఆశ్చర్యంతోనే మాస్టారు వంక చూస్తుంది.. మాస్టారులో అదే చిరునవ్వు.. ఆ నవ్వులో ఎలాంటి కల్మషం లేదని శారదకి అర్థమవుతుంది.. మాస్టారు పదానికి నిర్వచనంగా కనిపించాడు శారదకి ఆయన.

మాస్టారు అన్న మాటకి గోపాల్ కూడా ఆలోచనలో పడ్డారు.. గోపాల్ శారద వంక చూసాడు.. ఇద్దరూ ఒకరికొకరు చూసుకున్నారు..

''మాస్టారుగారు అన్నదాంట్లోనూ నిజముంది.. ఒకసారి నువ్వు ప్రయత్నించి చూడమ్మా..''

శారద మరింత ఆశ్చర్యంగా గోపాల్ వంక, మాస్టారు వంక చూస్తుంది.. గోపాల్, మాస్టారు ఇద్దరూ శారదనే చూస్తూంటారు.. శారద ఏం సమాధానం చెబుతుందా అన్న ఆతృత వారి మొహాలో స్పష్టంగా కనిపిస్తుంటుంది.

....................................

భజన మందిరం

ఆధ్యాత్మిక భోదనలు  చెప్పే మాస్టారు, గోపాల్, శారద ముగ్గురూ పిల్లలున్న భజన మందిరంలోకి వస్తారు.. ఆ ముగ్గురినీ చూడగానే సాయిప్రతాప్‌తో సహా పిల్లలందరూ ఎంతో ఆసక్తికరంగా వారి వంక చూస్తారు. సాయిప్రతాప్ లేచి నిలబడుతాడు... వినయంగా చేతులు కట్టుకుని మాస్టారు వంక చూస్తాడు..

మాస్టారు పిల్లలకి ఎదురుగా వస్తాడు.. సాయి ప్రతాప్ వంక చిరునవ్వుతో చూస్తాడు..

‘‘మైడియర్ చిల్డ్రెన్స్.. మీలో ఎంతో ప్రతిభ దాగుందని సాయిప్రతాప్ అడిగిన ప్రశ్నని విన్న తరువాత నాకు అర్ధమయింది. మీ ప్రశ్నకి సమాధానాన్ని మీకు అర్థమయ్యేవిధంగా చెప్పాలంటే దానికి తగిన వ్యక్తి కావాలి..’’

మాస్టారు సాయిప్రతాప్ వంక చూస్తాడు.. సాయిప్రతాప్ మాస్టారు వంకే చూస్తుంటాడు...

‘‘అదేమిటి గురువుగారూ.. నేను నా సందేహాన్ని మీతో చెప్పాను కదా..?’’

సాయిప్రతాప్ మాటలకి మాస్టారు చిన్నగా నవ్వుతాడు..

‘‘అవును నిజమే.. నువ్వు నీ సందేహాన్ని నాతోనే చెప్పావు.. కానీ నీవు అడిగిన దానికి సమాధానం చెప్పడానికి నేను వేరే వారికి అవకాశం ఇస్తున్నాను.. వారెవరో కాదు.. ఇదిగో ఈవిడే..’’ అంటూ మాస్టారు ప్రక్కనే బిడియంగా మేనేజర్ గోపాల్ పక్కన నిలబడి ఉన్న శారదని చూపిస్తాడు మాస్టారు.

పిల్లలందరూ శారద వంక చూస్తారు.. శారద బిడియంగా పిల్లల వంక చూస్తూ చిన్నగా నవ్వుతూంది.. గోపాల్ ఆవిడని మాస్టారు దగ్గరికి వెళ్లమని సైగ చేస్తాడు.. శారద గోపాల్‌ని చూస్తుంది.. ఆ చూపులో తనకెందుకో భయంగా ఉందన్న భావం కదలాడుతుంది.. గోపాల్ మరేం ఫర్వాలేదు.. అన్న ధైర్యం ఇవ్వడంతో శారద కాస్త తటపటాయిస్తూ మాస్టారు పక్కగా వచ్చి నిలబడి పిల్లల వంక చూస్తూ చిన్నగా నవ్వుతుంది..

''గురువుగారు మీరు మరోలా అనుకోవద్దు.. సాయిబాబా జీవితచరిత్ర గురించి మీరు మాతో చెప్పారు.. మీరు చెప్పిన కథ విన్నాకే నాకు సందేహం కలిగింది.. ఆ సందేహాన్ని మీతో చెప్పాను.. దానికి సమాధానం మీరు కాకుండా వేరొకరితో ఎందుకు చెప్పిస్తున్నారు..?'' వినయంగా అడుగుతాడు సాయిప్రతాప్.

సాయిప్రతాప్ అడిగిన ప్రశ్నకి మాస్టారుతో పాటు, గోపాల్, శారదలు  కూడా ఎంతో ఆశ్చర్యపోతారు. మాస్టారు ఏదో చెప్పబోతుండగా అప్పటి వరకూ బిడియంగా కనిపించిన శారదలో ఏదో తెలియని గాంభీర్యం ఆవహిస్తుంది.

ముఖం లో ఆత్మస్థైర్యంతో కూడిన చిరునవ్వు ప్రత్యక్షమవుతుంది..

''చూడు బాబూ.. నువ్వు రోజూ స్కూల్ కి  వెళ్తావు కదా..''

''అవును వెళ్తాను..''

''గుడ్.. నువ్వు రోజూ ఎన్ని సబ్జెక్ట్స్ నేర్చుకుంటావు..''

సాయిప్రతాప్ (ఏమాత్రం తడుముకోకుండా..) ''మార్నింగ్ హోంవర్క్ లో ఇంగ్లీష్, మ్యాథ్స్, లంచ్ బ్రేక్ తర్వాత సైన్స్, ఆ తర్వాత తెలుగు, ఆ తర్వాత హిందీ నేర్చుకుంటాను..''

''ఈ సబ్జెక్టులన్నింటినీ ఒక మాస్టారే  చెబుతారా..?'' చిరునవ్వుతో అడుగుతుంది శారద.

''లేదు.. ఒక్కో సబ్జెక్ట్‌ని ఒక్కో టీచర్ చెబుతారు.. ఇంగ్లీష్‌ని రమేష్ మాస్టర్ చెబుతారు, మ్యాథ్స్‌ని సుదీప్ మాస్టర్, సైన్స్‌ని దీపిక టీచర్,తెలుగుని రేణుక టీచర్ అలాగే హిందీని శ్యామ్ మాస్టర్ చెబుతారు..'' తమ మాస్టార్ల పేర్లతో సహా తమకి చదువుచెప్పే వారి వివరాలని సాయిప్రతాప్ శారదకి చెబుతాడు.

సాయిప్రతాప్ మాటలకి శారద ముఖం లో చిరునవ్వు ప్రవేశిస్తుంది.. మాస్టారు గారు, గోపాల్‌తో పాటు అక్కడున్న పిల్లల తల్లితండ్రులు శారద వంకనే చూస్తూంటారు..

''చూసారా.. ఒక్కో సబ్జెక్ట్‌ని ఒక్కో మాస్టారు గారు చెబుతారు కదా.. అలా వారందరినీ ఒక్కో సబ్జెక్ట్‌ని చెప్పమని ఆర్డర్ చేసేదెవరు..?''

శారద మాటలకి సాయిప్రతాప్ కాసేపు ఆలోచించి

''ఓ.. అది కూడా తెలీదనుకుంటున్నారా.. మా మాస్టర్లకి, టీచర్లందరికీ వారు ఏ ఏ సబ్జెక్టు చెప్పాలో నిర్ణయించేది మా స్కూల్ హెడ్మాస్టర్.. మా హెడ్మాస్టర్ ఎవరికి ఏ సబ్జెక్ట్‌ని ఇస్తే వారు అది మాకు చెబుతారు..'' గర్వంగా చెబుతాడు సాయి ప్రతాప్.

''కదా.. మీ స్కూల్‌లో మీ మాస్టర్లందరికీ ఏఏ సబ్జెక్టుని చెప్పమని పురమాయించే హెడ్మాస్టర్‌లాంటి వాడే ఇదిగో ఈ గురువు గారు..'' అంటూ తన పక్కనే నిలబడి ఉన్న మాస్టారు వంక వినయంగా నమస్కరిస్తూ చెబుతుంది శారద.

ఆమె మాటలకి మాస్టరుతో పాటు, గోపాల్ కూడా సంభ్రమాశ్చర్యాలకు లోనవుతారు.. శారద వంక ఆశ్చర్యానందాలతో చూస్తారు మాస్టారు, మేనేజర్ గోపాల్, సమస్యని సమయానుకూలంగా సాల్వ్ చేయగల నేర్పుని కనబరిచిన శారదని చూస్తే వారికి ఆమెపై ఎనలేని గౌరవభావం పెరిగింది.

సాయిప్రతాప్ మాస్టర్ వంక చూస్తాడు.. అప్పటి వరకూ సాయిప్రతాప్‌కి ఆ మాస్టర్‌పై తాను వేసిన ప్రశ్నకి సరిగా జవాబు చెప్పలేదన్న చులకన భావం ఉండేది.. కానీ.. శారద అలా చెప్పగానే ఆ పిల్లవాని మనసులో నుండి మాస్టర్‌పై ఉన్న చులకన భావం పోయి, ఒక విధమైన గౌరవభావం ఏర్పడుతుంది..

సాయిప్రతాప్ ఎంతో భక్తిశ్రద్ధలతో మాస్టర్ వంక ఎంతో వినయంగా చేతులెత్తి నమస్కరిస్తాడు.'' మీ స్కూల్‌లో హెడ్మాస్టర్ ఎవరెవరికి ఏ ఏ సబ్జెక్ట్‌ని ఇచ్చి మీకు బోధించమని చెబుతాడో, ఇక్కడ కూడా ఈ మాస్టారు గారు మాకు అలా చెబుతాడన్నమాట.. ఒక చిన్న ఉదాహరణ మీకు చెబుతాను.. నీకు సైన్స్ సబ్జెక్ట్‌లో ఏదయినా

డౌట్ వచ్చిందనుకో ఆ డౌట్‌ని మ్యాథ్స్ చెప్పే మాస్టారు దగ్గరికి వెళ్ళి అడిగితే ఆయన చెబుతాడా..?

చెప్పడు కదా.. ఒకవేళ అదే డౌటుని మీ స్కూల్ హెడ్మాస్టరు గారిని అడిగారనుకో.. ఆయనేమంటారు.. వెళ్ళి మీ సైన్స్ మాస్టర్‌ని అడగరా అంటారు కదా.. అలాగే.. నువ్వు వేసిన క్వశ్చన్‌కి సరయిన సమాధానం చెప్పమని మా హెడ్మాస్టరుగారయిన ఈ మాస్టరు గారు నన్ను ఆదేశించారన్నమాట.. అందుకే నీ ప్రశ్నకి సమాధానం చెప్పడానికి నేను మీ ముందుకి వచ్చాను..''

శారద మాటలకి అందరూ ముగ్దులయిపోతారు.. శారద చెప్పే మాటలకి పిల్లలు  కూడా ఎంతో శ్రద్ధతో వింటూంటారు.. ఒక సమస్యని అప్పటికప్పుడు స్పాంటేనియస్‌గా ఆమె సాల్వ్ చేసే విధానాన్ని చూసిన మాస్టారుకి, మేనేజర్ గోపాల్‌కి ఎంతో ఆనందం వేస్తుంది.. వారి మొహాల్లో ఎంతో సంతృప్తి..''ఊ.. ఇప్పుడు చెప్పు.. నీకు స్కూల్‌బ్యాగ్ మోయడంలో ఎంతో బాధ కలుగుతుందని అన్నావు కదా..

ఆ బాధ పోయేలా దేవుడికి చెప్పమనే కదా.. నువ్వడిగింది...''

''అవును మేడమ్.. అంతే..!'' రెండు చేతులూ కట్టుకుని నిలబడి వినయంగా అంటాడు సాయిప్రతాప్.

మేనేజర్ గోపాల్, మాస్టారు  శారద ఏం చెబుతుందా అన్న ఉత్సుకతతో చూస్తుంటారు.. పిల్లలందరూ  కూడా ఎంతో శ్రద్దతో శారద వంకే చూస్తుంటారు..

'' పిల్లలూ మీ అందరికీ కూడా స్కూల్ బ్యాగ్ మోయడం బాధగానే ఉంటుంది కదా..''

పిల్లలందరూ ఒక్కసారిగా అవును అన్నట్టుగా తలూపుతారు..

''చూడండి పిల్లలూ . మీరు ప్రతీరోజూ స్కూల్ కి మోసుకెళ్లే స్కూల్‌బ్యాగ్‌లో ఏముంటాయి.. పుస్తకాలే కదా..

పుస్తకాలంటే సరస్వతితో సమానం, సరస్వతీ దేవి కరుణా కటాక్షాలు లేకుంటే మీరు ఎంత చదివినా మీకు చదువన్నది రాదు.. మీరు రోజూ మోసుకెళ్తున్నామని బాధపడుతున్నారే .. ఆ స్కూల్ బ్యాగ్‌లో మీరు మోసుకెళుతున్నది సాక్షాత్తూ ఆ సరస్వతీ దేవినే.. అందులో ఉన్న పుస్తకాల ద్వారానే కదా మీకు చదువు వస్తుంది.. మీలో జ్ఞానాన్ని కలిగించే పుస్తకాల బ్యాగ్‌ని మోసుకెళ్ళడం మీకు భారంగా అనుకుని బాధపడడం తప్పుకదూ..! అయినా మీకు ఆ స్కూల్‌బ్యాగ్‌ని మోసేంత శక్తిని ప్రసాదిస్తున్నది ఎవరు అన్నది ఎప్పుడయినా ఆలోచించారా.? అన్న శారద మాటలకి పిల్లలందరూ ఒకరి మొహాలొకరు చూసుకుంటారు.. అవును.. ఎవరు..? అన్న క్వశ్చన్‌తో కూడిన ఎక్స్‌ప్రెషన్ వారి మొహాల్లో ప్రతిఫలిస్తుండగా ఎప్పుడూ ఆలోచించలేదు అన్నట్టుగా చేతులని అడ్డంగా ఊపుతారు...''అదీ విషయం.. మీరు ఎప్పుడూ అలా ఆలోచించలేదు కాబట్టే.. మీకు స్కూల్ బ్యాగ్‌ని మోయడం బాధగా అనిపిస్తుంది.. మీకు ఆ స్కూల్‌బ్యాగ్‌ని మోసేంత శక్తిని ఇచ్చేదెవరో కాదు.. సాక్షాత్తూ ఆ సాయినాధుడే.. ఆ మీరు తినే ఆహారంలో కలిసిపోయి, మీకు స్కూల్‌బ్యాగ్ మోసేంత శక్తిని ప్రసాదిస్తాడు.. అలా ఆయన ప్రసాదించాడు

కాబట్టే మీకా శక్తి వస్తుంది.. అందుచేత ప్రతిరోజూ మీరు స్కూల్‌కి వెళ్ళే ముందు ఆ దేవుడిని ప్రార్థించి వెళితే, మీకు స్కూల్‌బ్యాగ్ మోస్తున్న అనుభూతి కూడా కలగదు.. ఇక నుండి మీరు స్కూల్‌కి వెళ్ళే ముందు దేవుడిని ప్రార్థిస్తారు కదూ..''

పిల్లలందరూ బుద్ధిగా తలూపుతారు..! సాయిప్రతాప్ కూడా బుద్ధిగా తలూపుతాడు..

''దేవుడంటే.. ఎక్కడో బయట ఉంటాడనుకున్నాను.. కానీ మాలోనే దేవుడుంటాడా..? మేము మోసే స్కూల్‌బ్యాగ్‌లోనే సరస్వతీ దేవి ఉంటుందా..? సారీ మేడమ్.. ఈ విషయం తెలియక నేనేదో వాగాను, ఇక నుండి ప్రతీరోజూ స్కూల్‌కి వెళ్లేముందు ఆ దేవుడిని ప్రార్థించే వెళ్తాము..'' సాయి ప్రతాప్ వినయంగా అంటాడు.

సాయిప్రతాప్ ముఖం లో ఎంతో భక్తి శ్రద్ధలతో కూడిన ఎక్స్‌ప్రెషన్స్.. ఆ పిల్లాడిలో వచ్చిన మార్పుని చూసి మాస్టారు, మేనేజర్ గోపాల్, సాయిప్రతాప్ తండ్రి, మరియు అక్కడున్న మరి కొందరు పెద్దవాళ్ళు సైతం ఎంతో ఆశ్చర్యానికి, ఆనందానికి లోనవుతారు.

''ఇప్పుడు మంచి బాలుడువని అనిపించుకున్నావు.. మీలో ఇంకా ఏమయినా సందేహాలుంటే వచ్చేవారం తీరుస్తాను.. మరి ఈసారికి ముగించేద్దామా..?''

కొందరు పిల్లలు ''మేడమ్.. వచ్చేవారం కూడా మీరే మాకు పాఠాలు చెబుతారు కదా..?''

ఆ మాటలకి శారద అవాక్కయిపోయి, గోపాల్‌వంక, మాస్టారు వంక చూస్తుంది.. గోపాల్ శారదకి చెబుతానని చెప్పు అన్నట్టుగా సైగ చేస్తాడు.. శారద అలాగే అన్నట్టు తలూపి తిరిగి పిల్లల వంక తిరిగి ''నేనే చెబుతాను..'' అంటూంది..

గత ఇరవై వారాలుగా మేనేజర్ గోపాల్ తల పెట్టిన ఇంత మంచి కార్యానికి శారద బోధనతో నిండుదనం వచ్చినట్టయ్యింది. ఆమె పిల్లలకి చెప్పిన సమాధానాలు, సమయానుకూలంగా ఆమె మాట్లాడిన తీరు పిల్లలకి కాదు వారి తల్లితండ్రులకు కూడా ఎంతో బాగా నచ్చేసింది.

..............................

ఉదయం పదకొండు గంటల సమయం అవుతుంది..

శారద సాయిబాబా మందిరం ప్రాంగణంలో భక్తులు వేసిన చెత్తని క్లీన్ చేసే పనిలో ఉంటుంది.. అప్పుడే అక్కడికి వస్తాడు మేనేజర్ గోపాల్..

అతను హడావిడిగా శారద దగ్గరికి వస్తాడు.. శారద గోపాల్ వంక చూస్తుంది.. అతని ముఖం లో ఎంతో ఆనందం కనిపిస్తుంటుంది.. శారద ఊడవడం ఆపేసి అతనికి ఎదురు వెళుతుంది..

‘‘శారదమ్మా.. నువ్వు నిజంగా గ్రేట్.. ఒక్క రోజులోనే ఈ వాడలో నీపేరు మారు మ్రోగిపోయేలా చేసావు..’’

అంటూ గోపాల్ పక్కనే ఉన్న కుళాయి దగ్గరికి వెళ్ళి కాళ్ళు కడుక్కుని తిరిగి శారదమ్మ దగ్గరికి వస్తాడు.

‘‘నేనేం చేసానండీ..’’ శారద ఆశ్చర్యంగా అడుగుతుంది.

శారద చీపురును పక్కన పెట్టేసి ఆ పక్కనే ఉన్న మరో కుళాయి దగ్గర చేతులు శుభ్రం చేసుకుంటుంది..

‘‘చూసావా.. ఇదే నీలో నాకు నచ్చేది.. నువ్వు ఎంత గొప్ప పని చేసినా కూడా ఏమాత్రం గర్వం లేకుండా ఇలా సాదా సీదాగా ఉంటావు కదా.. ఏం చేసానని మెల్లిగా అంటావేమిటి శారదమ్మా.. నిన్న నువ్వు పిల్లలకి చెప్పిన పాఠాలతో  ఆ పిల్లలే కాదు, వాళ్ళ తల్లితండ్రులు కూడా ఎంతో ఆనందపడిపోయారు. తెలుసా.. వచ్చే వారం ఇంకొందరు కొత్తవారు కూడా వస్తున్నారు.. నేను వీధిలోకి వెళితే ప్రతీ ఒక్కరూ దీని గురించే అడుగుతున్నారు..

అందరూ నీ గురించే ఆరా తీస్తున్నారు..’’

శారద, గోపాల్ గుళ్ళోకి నడుస్తారు.. గోపాల్ ఓ వారగా కూర్చుంటాడు, శారద దేవుడి విగ్రహం దగ్గరికి వెళ్ళి సాయిబాబా విగ్రహానికి భక్తితో నమస్కరించి ఆ పక్కనే ఉన్న ప్రసాదాన్ని తీసుకుని గోపాల్ దగ్గరికి వస్తుంది..

‘‘ఇందులో నా గొప్పతనం ఏముందండీ.. మీరు నాకు ఇచ్చిన ప్రోత్సాహం వల్లనే నేను ఆమాత్రం చెప్పగలిగాను..

లేకపోతే నాలో అంత ధైర్యం ఎక్కడి నుండి వస్తుంది..’’

''సరె.. సరె.. ఇకనుండి పిల్లలకి పాఠాలు చెప్పే బాధ్యత పూర్తిగా నీదే.. మాస్టారు గారు కూడా నిన్ననే నాతో చెప్పారు.. ఇక ఈ పిల్లలకి పాఠాలు చెప్పడానికి వారి అవసరం లేదని చెప్పారు.. కాబట్టి ఇక నుండి ఆ బాధ్యత పూర్తిగా నీదే సుమా..''

''నాదేముందండీ.. ఆ భగవంతుడు నాతో ఎలా చేయిస్తే నేను అలా చేయడానికి సిద్దంగా ఉన్నాను..''

''సరే..సరే.. గుడి పనులంటూ ఎక్కువగా కష్టపడకుండా సాధ్యమయినంత విశ్రాంతి తీసుకో.. నేను బయటికి వెళ్తున్నాను..''గోపాల్ ప్రసాదాన్ని తినడం పూర్తి చేసి లేచి నిలబడి సాయిబాబా విగ్రహానికి భక్తిగా నమస్కరించి ఆ మందిరం నుండి బయటికి వెళ్తాడు.. వెళ్తున్న గోపాల్‌నే చూస్తుండిపోతుంది శారద.. ఆమె ముఖం లో ఏ భావమూ ప్రతిబింబించలేదు..

గోపాల్ గుళ్లో నుండి కనుమరుగు కాగానే ఆమె చూపు సాయిబాబా విగ్రహంపై పడుతుంది.. మెల్లిగా బాబా విగ్రహం దగ్గరకు వస్తుంది.. ఆమె చూపంతా ఆ సాయిపైనే కేంద్రీకరిస్తుంది.. ఆమెకి తన గతం గుర్తుకి వస్తుంది..

దేవుడి విగ్రహాన్ని ఆలా చూస్తూంటే ఆమె కళ్ళల్లోనుండి రెండు కన్నీటి చుక్కలు జారి చెంపలపై  పడుతాయి..

రెండు నిముషాలు  పాటు అలాగే నిలబడి సాయిబాబా ని మనస్ఫూర్తిగా నమస్కరించి తన కొంగుతో కళ్ళని తుడుచుకుని అక్కడి నుండి మెల్లిగా బయటికి నడుస్తుంది.

......................................

ఆ రోజు ఆదివారం.. సాయిబాబా మందిరం అంతా భక్తులతో  హడావిడిగా ఉంటుంది.. భజన మందిరంలో పిల్లందరూ కూర్చుని ఉంటారు..

అప్పుడే మేనేజర్ గోపాల్, శారదలు  ఆ హాల్‌లోకి వస్తారు.. పిల్లలు శారదని చూడగానే ఎంతో ఆనందంగానూ, భక్తితోనూ లేచి నిలబడతారు..

వారి వినయానికి గోపాల్‌తోపాటు శారద కూడా అబ్బురపడుతుంది.. వారందరినీ కూర్చోమన్నట్టుగా చేయితో సైగ చేస్తుంది శారద.. ఆమె అలా అనగానే పిల్లలందరూ కూర్చుంటారు..

గత వారం వచ్చిన పిల్లల కంటే ఈ వారం మరికొందరు పిల్లలు ఎక్కువగా ఉంటారు.. ఆ పిల్లలతో పాటు వారి తల్లితండ్రులు కూడా కొందరు వస్తారు. వారందరినీ చూడగానే గోపాల్ మనసు ఆనందంతో ఉప్పొంగిపోతుంది..

గోపాల్ ముఖం  క్లోజప్ షాట్..

శారద గోపాల్ వంక చూస్తుంది.. గోపాల్ మొదలు పెట్టు అన్నట్టుగా సైగ చేస్తాడు..

శారద గొంతు సవరించుకుంటుంది..

“ పిల్లలూ మీ అందరికీ ఒక కథ చెబుతాను.. వింటారా..!''

ఒక పిల్లాడి వాయిస్..

''మాకు ఛోటా భీమ్ కథ చెబుతారా..'' ఆశగా అడుగుతాడు.

ఆ పిల్లాడి మాటలకి మేనేజర్ గోపాల్, మాస్టార్, శారద లు  ఆశ్చర్యపోతారు..

శారద తేరుకుని..

''అవును.. అవును.. ఛోటా భీమ్ లాంటి కథ చెబుతాను.. వింటారా..'' పిల్లలందరూ ఎంతో ఆనందంగా

''ఓ.. వింటాం.. చెప్పండి..''

శారద ఆలోచిస్తుంది.. ఏం చెప్పాలా.. అని.. కొద్దిసేపు ఆలోచించిన తర్వాత ఏదో అయిడియా తట్టినట్టు ముఖం  పెడుతుంది..

''ఆ.. పిల్లలూ మీరు రోజూ ఛోటా భీమ్‌ని చూస్తుంటారు కదా..''

‘‘అవును చూస్తుంటాము.. ఛోటా భీమ్ ఎంత బాగా ఫైటింగ్ చేస్తాడో.. ఒకసారి కాలియా, వాడి అసిస్టెంట్లు ఇద్దరూ ఒక అడవిలో దొంగల  మధ్య చిక్కుకుపోతే ఛోటా భీమ్ ఆకాశం లో ఎగురుకుంటూ వెళ్ళి ఫైట్ చేసి వాళ్ళను కాపాడుతాడు..’’ ఓ పిల్లాడు ఎంతో ఎగ్జైట్మెంట్‌తో చెబుతాడు.

ఆ పిల్లవాడు అలా చెప్పడం ఆపగానే, మరో పిల్లాడు చెప్పడం ప్రారంభిస్తాడు..

‘‘ఇంకోసారి అయితే ఛోటా భీమ్ దగ్గరికి ఒక పేద్ద దెయ్యం వస్తుంది.. దానికి మంత్రాలు బాగా వచ్చు.. ఆ దెయ్యం.. ఛోటా భీం ఉన్న విలేజ్ వారందరినీ కష్టాలు  పెడుతుంటే చోటాభీమ్ ఆ దెయ్యంతో ఫైట్ చేస్తాడు..

అంతేకాదు.. ఆ దెయ్యాన్ని బంధించి మళ్ళీ ఒకసారి ఆ దెయ్యం వాళ్ళ ఊర్లోకి రాకుండా చేస్తాడు.. అప్పుడు ఛోటా భీమ్ ధైర్యానికి మెచ్చుకున్న రాజు చోటాభీమ్‌ని ఎంతో పొగుడుతాడు..’’

పిల్లాడు చెప్పడం ఆపగానే శారద గట్టిగా చప్పట్లు కొడుతుంది. శారద చప్పట్లు కొట్టడం మొదలు  పెట్టగానే మిగతా పిల్లలు కూడా చప్పట్లు కొడతారు.

‘‘చూశారా పిల్లలూ ఛోటా భీమ్ సాహసోపేతంగా ఆ ఊరిని కాపాడాడు కాబట్టి రాజ్యాన్ని పరిపాలించే రాజు సైతం ఛోటా భీమ్‌ని అభినందించాడు. దీనిని బట్టి మీకేమి అర్థమవుతుంది..?

ఒక పిల్లాడు ఉత్సాహంగా లేచి నిబడతాడు..

‘‘ఛోటాభీమ్ హీరో.. అతను ఏమైనా చేయగలడు..’’ అంటాడు ఏమాత్రం తడుముకోకుండా..‘‘

చాలా బాగా చెప్పావు.. మరి.. ఇక్కడ మందిరంలో ఉన్నాడే సాయిబాబా.. ఆయనేం చేస్తాడో తెలుసా?’’

''సాయిబాబా దేవుడు.. ఆయనేం చేయడు.. విగ్రహం కదా.. ఒకేచోట అలాగే కూర్చుంటాడు.. అందరూ ఆయనకి పూజలు చేస్తారు..'' అమాయకంగా చెబుతాడు ఆ పిల్లవాడు.

''అవునవును.. పూజలు చేసాక.. ప్రసాదాలు పంచుతారు.. నేనైతే ప్రసాదం పెట్టేటప్పుడు మూడు నాలుగు సార్లు ప్రసాదాన్ని అడిగి తీసుకుంటాను.... పులిహోర ప్రసాదం చాలా బావుంటుంది..''

ఇంకో బాలుడు  అంటాడు.

''పులిహోర ప్రసాదమే కాదు, ఈరోజు మనకి పెట్టారే.. అదే పాయసం అదయితే ఇంకా బావుంటుంది.. మా ఇంట్లో మా మమ్మీ కూడా అంత బాగా చేయదు.. అసలు నేను ఈ గుడికి కేవలం ఆ పాయసం తినడం కోసమే వస్తాను తెలుసా..!''

వారి మాటలకి శారదతో పాటు, మేనేజర్ గోపాల్ గారు, మాస్టర్ గారు అందరూ అవాక్కయిపోతారు...

శారద మేనేజర్ గోపాల్ వంక చూస్తుంది.. గోపాల్ కూడా శారద వంక చూస్తారు.. ఆయన ముఖం లో ఈ కాలం పిల్లల ఆలోచనలు చూసారా ఎలా ఉన్నాయో.. అన్న ఫీలింగ్ కనిపిస్తుంది..

శారద చిన్నగా నవ్వుతుంది..

''దేవుడి చేయని పనంటూ ఉండదు.. దేవుడు అన్ని పనులూ చేస్తాడు'' ఎంతో సౌమ్యంగా చెబుతుంది శారద..

''దేవుడు విగ్రహం కదా.. అన్ని పనులు  ఎలా చేస్తాడు.. ఎప్పుడు చూసినా  ఒకే చోట కదలకుండా కూర్చుని కనిపిస్తాడు కదా..'' అమాయకంగా అడగుతాడు ఆ పిల్లవాడు శారద మళ్ళీ నవ్వుతుంది

''దేవుడు చేసే పనులు బయటికి కనిపించవు..''

‘‘బయటికి కనిపించని పనులు చేస్తే మనకెలా అర్థమవుతుంది..?’’

‘‘ఎందుకు అర్థం కాదు.. ఊ.. ఒక ఉదాహరణ చెబుతాను.. నీకు అన్నం తినాలని ఎప్పుడనిపిస్తుంది?’’

శారద అడిగిన ప్రశ్నకి ఆ బాలుడు కొద్దిసేపు ఆలోచనలో పడిపోతాడు.. ఆ తర్వాత

‘‘ఆకలేసినప్పుడు..’’ అంటాడు తన కడుపుని చేత్తో రాసుకుంటూ..శారద వెంటనే ఆ పిల్లాడిని అడుగుతుంది..

‘‘నీకు ఆకలి వేస్తుందని ఎలా తెలుస్తుంది..?’’

బాలుడు మళ్ళీ ఆలోచనలో పడిపోతాడు.. ఎంత ఆలోచించిన ఆ ప్రశ్నకి సమాధానం దొరకలేదన్నట్టుగా ఆ బాలుడి ముఖం లో ఎక్స్‌ప్రెషన్స్ ఉంటాయి..

శారద చిన్నగా నవ్వుతుంది..

‘‘నీకు ఆకలేస్తేనే అన్నం తింటావు కదా.. అలా నీకు ఆకలి కలిగించే వాడే దేవుడు..’’
పిల్లలందరూ  ఒకరి మొహాలొకరు చూసుకుంటారు..

‘‘ఓహో.. ఆకలి కలిగించేవాడు దేవుడా..’’ అప్పుడే అర్థం చేసుకున్నవాడిలా అంటాడు.

‘‘అవును.. మీకు ఆకలిని కలిగించేవాడే దేవుడు.. అంతే కాదు.. మీకు ఆకలి వేయగానే ఆహారం తినాలి కదా.. ఆ ఆహారాన్ని ఇచ్చేవాడు కూడా దేవుడే..’’

‘‘అదేం కాదు.. ఆహారాన్ని దేవుడు ఇవ్వడు.. మా మమ్మీ ఇస్తుంది..’’ ఎంతో తెలిసినట్టుగా అంటాడు ఆ పిల్లవాడు

శారద నవ్వుతుంది..

‘‘ఆ దేవుడు ఇచ్చిన ఆహారాన్నే మీ మమ్మీ నీకు పెడుతుంది.. ఇది పక్కన పెట్టండి.. మీరు రోజూ టివిలో చూస్తారే  చోటాభీమ్.. ఆ చోటాభీమ్ వయసెంతుంటుంది..?’’

ఒక బాలుడు ఉత్సాహంగా లేస్తాడు

''నాకంటే చిన్నవాడు.. సెవన్, ఎయిట్ ఇయర్స్ ఉంటాయి అంతే..!''

''మరి.. అంత చిన్న పిల్లవాడు.. పెద్ద పెద్ద రాక్షసితో పోరాడి, అందరినీ మట్టి కరిపిస్తాడు కదా.. అవన్నీ ఎలా చేస్తాడు?''

''ఎలా అంటే.. ఛోటాభీమ్ కాబట్టి..'' తేలికగా చెప్పేస్తాడు ఆ పిల్లవాడు. పిల్లవాని మాటలను తల్లితండ్రులతో పాటు, అక్కడికి వచ్చిన భక్తులు కూడా ఎంతో శ్రద్ధగా వింటూంటారు.

శారద నవ్వుతుంది.

''ఛోటాభీమ్ కాబట్టే చేస్తున్నాడు.. కానీ అంత చిన్న పిల్లవాడు, నీకన్నా చిన్న వయసు కల వానికి అంత శక్తి ఎలావచ్చింది..?''

బాలుడు తెలియదన్నట్టు తల ఊపుతాడు..

శారద వాయిస్

''ఆ శక్తిని ఇచ్చేవాడే దేవుడు.. దేవుడు విగ్రహం మాదిరి మనకి కనిపించినా ఎప్పుడూ మన పక్కనే ఉంటూ మనం ఏమి చేస్తున్నామో గమనిస్తుంటాడు.. మనం మంచి పనులు చేసామనుకో మనకి ఎలాంటి కష్టం రాకుండా చేస్తాడు.. అదే చెడు పనులు చేసామనుకో అలా చెడు చేసినందుకు మనల్ని దండిస్తాడు.. ''

పిల్లలందరూ శారద చెబుతున్న విషయాని ఎంతో శ్రద్ధ తో వింటూంటారు.. ఆ పిల్లలలో ఒక విషయంపై అంత శ్రద్ధని తీసుకువచ్చిన శారద తెలివిని మనసులోనే మెచ్చుకుంటాడు మేనేజర్ గోపాల్.. ఇంతకు ముందు ఆ పిల్లలకి పాఠాలు చెప్పిన మాస్టారు కూడా ఎంతో ఆశ్చర్యపోతాడు..

అలాగే ఆ పిల్లల తల్లితండ్రులు కొందరు కూడా పిల్లలలో శారద చెబుతున్న విషయాలపై శ్రద్ధ కనబడేసరికి వారిలోనూ ఎంతో సంతోషం కనిపిస్తుంది..

‘‘ఆ.. పిల్లలూ  ఈరోజుకి ఇది చాలు.  మళ్ళీ వచ్చేవారం మరిన్ని విషయాలు మాట్లాడుకుందాం..’’

శారద నవ్వుతూ అంటుంది..

పిల్లలందరూ లేస్తారు..

కానీ ఓ బాలుడు మాత్రం..

‘‘మాకు వెళ్ళాలని లేదు.. ఇంకా కొద్దిసేపు ఉండాలని ఉంది..’’

ఆ పిల్లవాని మాటలకి వారి తల్లితండ్రులతో పాటు, మేనేజర్ గోపాల్, శారద కూడా ఎంతో ఆశ్చర్యానందాలకు లోనవుతారు..

శారద ఆ బాలుని వద్దకు వచ్చి ఆప్యాయంగా బుగ్గ నిమురుతూ..

‘‘ఈ రోజుకి పాఠాలు చేప్పే సమయం అయిపోయింది కదా.. ఆ దేవుడు ఎంతసేపు చెప్పమంటే అంత సేపే చెప్పాలి.. లేదంటే దేవుడికి కోపం వస్తుంది.. ఆ దేవుడి మాట మనం వినలేదనుకో.. ఏం చేస్తాడు..?’’

వెంటనే ఆ బాలుడు అందుకుంటాడు..‘‘శిక్షిస్తాడు.. హమ్మో.. దేవుడికి కోపం తెప్పించకూడదు.. సరే అయితే వచ్చే వారం వస్తాను అయితే..’’

ఆ బాలుని మాటలకి శారదతో పాటు, గోపాల్, కొందరు తల్లిదండ్రులు కూడా నవ్వుతారు.. పిల్లలందరూ లేచి బయటికి వెళ్ళిపోతారు.. కొందరు తల్లితండ్రులు శారద దగ్గరికి వస్తారు..

ఒక పిల్లవాని తండ్రి ‘‘చాలా బాగా చెప్పారమ్మా.. మా వాడిని గత మూడు నాలుగు వారాలుగా  తీసుకువస్తున్నాము కానీ..

ఎప్పుడూ ఇంత ఇంట్రెస్ట్‌గా వాడు వినలేదు.. ఇక నుండి మీరే వీరికి బోధనలు  చేయాలి..’’

‘‘అయ్యో.. ప్రతీ వారం నేనంటే.. ఎలా ’’ శారద అయోమయంగా అంటుంది...

అంటూ మధ్యలోనే ఆగిపోతుంది.. మేనేజర్ గోపాల్ వారి దగ్గరికి వచ్చి ఆ వ్యక్తి ముఖం చూస్తూ..

''ఇక నుండి ఈవిడే మీ పిల్లలకి పాఠాలు  చెబుతుంది.. ఆ పూచీ నాది'' నవ్వుతూ అంటాడు గోపాల్. దాంతో వాళ్ళు సంతోషపడతారు.. వారిద్దరికీ నమస్కరించి అక్కడి నుండి వెళతాడు.. శారద గోపాల్ వంక అయోమయంగా చూస్తుంది..

గోపాల్ శారద వంక చూస్తాడు.. నేనున్నానుగా అన్న ఫీలింగ్ కనిపిస్తుంది గోపాల్ ముఖం లో..

.........

శారద ముఖం  చెమటలతో తడిసి ఉంటుంది.. పాత్రలను శుభ్రం

చేస్తున్నట్టు కనిపిస్తుంటుంది.. మధ్య మధ్యలో తన మోచేతితో ముఖం పై పడుతున్న ముంగురులని వెనక్కి తోస్తూ శారద సాయిబాబాకి ప్రసాదం వండే పెద్ద పాత్రని శుభ్రం చేస్తూంటూంది.. అప్పుడే మధ్యాహ్న హారతి అయిపోవడంతో సాయిబాబాకి చేసిన ప్రసాదానికి సంబంధించిన పాత్రలు అవి..  అంత పెద్ద పాత్రని ఒక్కతే శుభ్రం చేస్తూండటంతో ఆమెలో ఆయాసం వస్తుంది.. అయినప్పటికీ లెక్కచేయకుండా ఆ పాత్రని శుభ్రం చేయడంలో నిమగ్నమై ఉంటుంది...

ఆమెలో అంతగా ఆయాసం వచ్చినప్పటికీ ఆమె ముఖం లో మాత్రం చిరునవ్వు చెదరకుండా ఉంటుంది.. ఆ దేవుడికి చేసే సేవలో తనకి వస్తున్న ఈ అలసట ఏపాటిది అన్నట్టుగా ఉంటుంది ఆమె వదనం..

ఓపాత్ర అయిపోయిన తర్వాత మరికొన్ని పాత్రలు కూడా ఉండడంతో ఆ పాత్రపై ఆమె దృష్టి సారిస్తుంది..

అవి కూడా ఇంచుమించు  అంతే పెద్దగా ఉండడంతో ఆమెలో  కాస్త నీరసం ఆవహిస్తుంది.. ఆ  నీరసం  ఆమె ముఖం లో స్పష్టంగా కనిపిస్తుంది..

తనలోని అలసటని తొలగించుకోవడానికి ఒకసారి గట్టిగా ఊపిరి తీసుకుని వదులుతుంది.. ఒకసారి  వెనక్కి తిరిగి చూస్తుంది.. సాయిబాబా మందిరం ఆవరణలో కనిపిస్తున్న సాయిబాబా చిత్రపటం వైపు ఆమె దృష్టి వెళ్తుంది.. కాలు మీద కాలువేసుకుని  కూర్చున్న  ఆ సాయినాధుడు ఆమె వంక ఎంతో  ఆహ్లాదంగా  చూస్తూ నవ్వుతున్న అనుభూతి కలుగుతుంది శారదకి... ఆ చిత్రపటం వైపే శారద తదేకంగా చూస్తుంది..

సాయినాధుడి విగ్రహాన్ని చూస్తూంటే ఆమెకి తెలియకుండానే ఆమెలో ఏదో శక్తి ఆవరిస్తున్న అనుభూతి కలుగుతుంది..

ఎక్కడో పుట్టి, ఎక్కడో మహారాణి లాంటి జీవితాన్ని అనుభవించి చివరికి ఎవరూ లేని అనాధలా ఇలా ఈ మందిరంలో ఈ సాయి సేవలో గడుపుతున్న ఆలోచన రాగానే ఆమె కళ్ళల్లో నుండి కన్నీళ్ళు జలజలా రాలుతాయి.

తన జీవితంలో జరిగిన ఎన్నో దురదృష్టకరమైన సంఘటనలు  తన కళ్ళ ముందు కదలాడగా ఆమె  మనసు మూగగా రోధించడం ప్రారంభిస్తుంది.. ఆమె కళ్ళల్లో నుండి కన్నీళ్ళు జారిపడుతుంటాయి.. తనకి ఉండడానికి ఆ సాయినాధుడు తన మందిరంలో చోటు కల్పించినందుకు కృతజ్ఞతగా సాయి విగ్రహం వంక చూస్తూంది భక్తి ప్రపత్తులతో.

సరిగ్గా అక్కడే ఒక అద్భుతమైన సంఘటన శారద కంటికి కనిపిస్తుంది.. తెల్లగా మెరిసిపోతున్న సాయినాధుడు ఆమె కళ్ళల్లోకి చూసి చిరునవ్వు చిందించిన భావన ఆమెకి కలుగుతుంది.

అదీ క్షణం సేపే.. ఆ దృశ్యం ఆమె కళ్ళల్లో మెరిసే సరికి ఆమె స్థాణువైపోతుంది..

అది కలా.. నిజమా అన్న సందిగ్ధం  కలుగుతుంది.. కానీ.. కానీ.. నిజంగానే ఆ బాబా పెదాలు తనని చూసి చిరునవ్వు నవ్వాయి.. ఆ ఆలోచనతో ఆమె శరీరం

పులకరించిపోయింది. అప్పటి వరకూ ఆమెలో గూడు కట్టుకుని ఉన్న బాధనంతా ఎవరో తొలగించిన  ఫీలింగ్ కలిగింది.

ఆ భావన కలగగానే, ఆమెలో ఏదో ఉత్సాహం ఒంట్లోకి వస్తుంది.. అది ఆమె కళ్లలో తెలుస్తుంది.. ఆమె ఒంట్లో శక్తి రాగానే ఆమె మరింత ఉత్సాహంగా తన ముందున్న పాత్రలను శుభ్రం చేయడంలో నిమగ్నమై ఉంటుంది.. ఆమె పెదాలు మాత్రం...

''ఓం సాయీ... శ్రీ సాయీ.. జయ జయ సాయీ.. ఓం సాయీ.. శ్రీ సాయీ.. జయ జయ సాయీ..'' అంటూ జపిస్తుంటాయి..

ఈ జీవితంలో తనకి అండగా ఆ సాయినాధుడు ఉన్నాడన్న నమ్మకం ఆ ఒక్క సంఘటనతో ఆమెలో కలగగానే సాయిబాబా నామ సంకీర్తనతో ఆమె ఉత్సాహంగా పాత్రలని శుభ్రం చేస్తూనే మనసులోనే సాయిని ప్రార్థించడం ప్రారంభిస్తుంది.

............................

సాయిబాబా గుడి ఆవరణలోనికి   టూవీలర్  వెహికల్‌పై మేనేజర్ గోపాల్ వస్తాడు. తన వెహికల్‌ని గుడి ప్రక్కనే ఉన్న పార్కింగ్ ప్లేస్‌లో ఆపుతాడు. గుడిలోపలికి వస్తుండగా ఆయన జేబులో ఉన్న సెల్ మ్రోగుతుంది..

గోపాల్ సెల్‌ని చేతిలోకి తీసుకుని నంబర్ చూసి మాట్లాడుతాడు..

''హలో మూర్తిగారూ.. నేను ఇప్పుడే గుడి దగ్గరికి వచ్చాను.. మీరు ఎక్కడున్నారు..?''

అవతలి వైపు నుండి మూర్తి గారు మాట్లాడుతారు..

''నేను గుడికి దగ్గరలోనే ఉన్నాను.. అయిదు నిమిషాలో వస్తాను..'' అవతలి నుండి మూర్తి గారు అంటారు.

''సరే.. రండి.. మీకోసం నేను ఎదురు చూస్తుంటాను..''

ఫోన్ కట్ చేసి లోపలికి వస్తాడు మేనేజర్ గోపాల్..

కుళాయి దగ్గర శారద ఒక్కతే పాత్రలని శుభ్రం చేస్తూ కనిపిస్తుంది.. ఆమె ముఖం లో ఏదో తెలియని ఉత్సాహం స్పష్టంగా కనిపిస్తుంటుంది..

గోపాల్ ఆమె వైపు ఆప్యాయంగా చూస్తాడు.. అతని చూపులు  శారద వైపే ఉంటాయి.. శారద పెదాలు చిన్నగా కదులుతుండటం గోపాల్ గమనిస్తాడు.. ఆమె పెదాలు 'ఓం సాయి.. శ్రీ సాయి.. జయ జయ సాయి..' అంటూ పలుకుతుండటం గమనిస్తాడు గోపాల్..

తన ఒంట్లో ఓపిక లేకపోయినా ఆ సాయినాధుడి నామాన్ని జపిస్తూ కష్టపడుతున్న ఆమెని చూస్తూంటే గోపాల్‌కి ఆమెపై ఎంతో గౌరవ భావం కలుగుతుంది...

గోపాల్ ఆమె వైపే తదేకంగా చూస్తూంటాడు.. అతని మనసులో ఆమె గురించిన ఆలోచనలు సుడులు తిరుగుతుంటాయి..

''ఇంత వృద్ధాప్యంలోనూ శారదమ్మ ముఖం లో ఏదో దివ్య తేజస్సు కనిపిస్తుంది.. ఎంతో ఉన్నత కుటుంబం నుంచి వచ్చిన దానిలా ఉంది.. ఆమె ప్రతీ కదలికలోనూ ఏదో హుందాతనం స్పష్టంగా కనిపిస్తుంటుంది.. చేసే పనిలోనూ నిజాయితీ ఉంటుంది.. అసలు ఈమె గతం ఏమిటి..?చూస్తూంటే గతంలో ఈమె విలాసవంతమైన జీవితాన్ని అనుభవించిన దానిలా అనిపిస్తుంది.. అష్ట ఐశ్వర్యాలతో ఎంతో మంచి జీవితాన్ని గడిపిన ఈవిడ ఇలా అనాధగా ఎందుకు మారింది..?  అసలు  ఎందుకు ఈవిడ ఒంటరి జీవితాన్ని గడుపుతుంది.. ఆస్తి, అంతస్తులన్నింటినీ త్యజించి ఇలా ఎవరూ లేని అనాధలా ఎందుకు జీవిస్తుంది.. ఈ మందిరానికి రాక మునుపు రైల్వేస్టేషన్‌లో ప్లాట్ ఫారం మీద అడుక్కుతిన్నదని చెప్పినట్టు గుర్తు.. అసలు అడుక్కుతినాల్సిన దుస్థితి ఈవిడకి ఎందుకు పట్టింది..? మొన్న పిల్లలకి ఆధ్యాత్మిక బోధనలు  చెబుతున్నప్పుడే ఈవిడ లోని మేధస్సుని తాను కనుగొన్నాడు, ఇంత తెలివి, ఇంత హుందాతనం ఉన్నప్పటికీ ఇలాంటి జీవితాన్ని ఎందుకు అనుభవిస్తుంది..? వీటన్నింటికీ  సమాధానాన్ని కనుగొనాలి..

అసలు ఆమె గతం ఏమిటో తెలుసుకోవాలి..''

గోపాల్ మనసులోనే అనుకుంటాడు.. పాత్రలని కడగడంలో నిమగ్నమైపోయిన శారద యధాలాపంగా గోపాల్ వంక చూస్తుంది.. ఆమె ముఖం లో ఆశ్చర్యం.. గోపాల్ తనవంకే తదేకంగా చూస్తూ ఏదో ఆలోచనలో పడి ఉండడం గమనిస్తుంది శారద..

శారద గోపాల్ వంక చూసి చిన్నగా నవ్వుతుంది.. అయినప్పటికీ గోపాల్‌లో చలనం ఉండదు.. అతను ఏదో ఆలోచనలో ఉన్నట్టు తెలుస్తుంది.. తనవైపే చూస్తూ అలాగే నిలబడి పోయిన గోపాల్‌ని ఆశ్చర్యంగా చూస్తుంటుంది  శారద.. అతని వాలకం చూసి శారద కనుబొమ్మలు ముడిపడతాయి..

మరొకసారి అతని వైపు చూస్తూ చిన్నగా నవ్వుతుంది.. అయినప్పటికీ గోపాల్‌లో చలనం ఉండక పోవడంతో పాత్రలని శుభ్రం చేయడం ఆపేసి, చేతులను  శుభ్రం చేసుకుని గోపాల్ దగ్గరికి వస్తూంది శారద..

గోపాల్ ఎదురుగా వచ్చి నిలబడుతుంది శారద.. వస్తున్న శారదనే తదేకంగా చూస్తూంటాడు గోపాల్.. ఆమె ఎదురుగా వచ్చి నిలబడ్డా కూడా అతనిలో చలనం రాదు.. అతని ఆలోచనలు మొత్తం ఆమె గతం చుట్టూరా తిరుగుతుంటాయి... శారద ఎదురుగా వచ్చి నిలబడ్డా గోపాల్‌లో ఎలాంటి రెస్పాన్స్ రాకపోవడంతో మరింత ఆశ్చర్యపోతుంది శారద..

''మేనేజరు గారు ఏదో దీర్ఘాలోచనలో పడిపోయారు.. ఏమిటి విషయం..?'' చిరునవ్వుతో నవ్వుతూ పలకరిస్తుంది శారద.. ఆమె మాటలకి ఉలిక్కిపడి ఈ లోకంలోకి వస్తాడు గోపాల్...

ఆమె తన దగ్గరికి ఎప్పుడు వచ్చిందో కూడా తెలియనంత పరధ్యానంగా ఉండడంతో అతని ముఖంలో కాస్త కంగారు ప్రవేశిస్తుంది..

గోపాల్ తన ముఖం పైకి చిరునవ్వు తెచ్చుకుంటాడు..

''ఈ గుడిలో నేను చేరినప్పటి నుండి మీరు ఇంత పరధ్యానంగా ఉండడం నేను ఎప్పుడూ చూడలేదు.. ''

'అబ్బే... ఏదో ఆలోచిస్తూ అలాగే ఉండిపోయాను..''

తనలోని కంగారుని కప్పి పుచ్చుకుంటూ అన్నాడు గోపాల్

''నేను పాత్రలను కడగడంలో బిజీగా ఉండడంతో మీరు రావడాన్ని గమనించలేక పోయాను.. యథాలాపంగా ఇటు చూడగానే ఇదిగో మీరు ఇలా ఏదో పరధ్యానంలో కనిపించారు.. నేను అక్కడి నుండే మిమ్మల్ని చిరునవ్వుతో పలకరించినా మీలో ఏమాత్రం స్పందన రాకపోవడంతో నేనే మీ ముందుకు వచ్చాను.. ఇంతకీ ఏమిటి విషయం..

ఏదో విషయంపై తీవ్రంగా ఆలోచిస్తున్నారు.. అదేమిటీ..?''

చిరునవ్వు నవ్వుతూ అంటూంది శారద..

''నీ గురించే ఆలోచిస్తున్నాను..''

ఆమాటలకి శారద ఉలిక్కిపడుతుంది.. ఆమె ముఖంలో ఆశ్చర్యం కనిపిస్తుంది.. గోపాల్ ఆమె వంకే తదేకంగా చూస్తూంటాడు.. శారద కూడా ఆశ్చర్యంగా గోపాల్ వంక చూస్తూంటుంది.. గోపాల్ ఒక్కసారిగా అలా అనేసరికి కొద్దిగా షాక్ కు గురవుతుంది శారద.. ఆ షాక్ నుండి తేరుకుని చిన్నగా నవ్వుతుంది శారద..

''నా గురించి ఆలోచిస్తున్నారా..? అయినా నా గురించి ఆలోచించడానికి ఏముంటుందండీ.. ఆ సాయినాధుడి దయ వల్ల మీ చలవ వల్ల ఏదో ఇలా జీవితాన్ని వెళ్ళదీస్తున్నాను..''

''ప్రస్తుతానికి మీ జీవితం ఇలా గడిచిపోతుంది కానీ.. నిన్ను చూస్తూంటే ఉన్నతమైన కుటుంబంలోనుంచి వచ్చిన దానిలా కనిపిస్తున్నావు.. నీ ప్రవర్తన, చేసే పని, చెప్పే మాటలని బట్టి చూస్తూంటే మంచి విలాసవంతమైన జీవితాన్ని అనుభవించిన దానిలా కనిపిస్తున్నావు..

ఇంత మంచి జీవితాన్ని అనుభవించిన నువ్వు ఇప్పుడు ఇలా ఎవరూ లేని అనాధలా ఈ గుడిలో గడపడానికి గల కారణం ఏమై ఉంటుందా అన్న ఆలోచన నాలో కలిగింది.. అందుకే ఈ పరధ్యానం..''

గోపాల్ మాటలకి శారద ముఖం లో రంగులు మారతాయి.. అప్పటి వరకూ చిరునవ్వు చిందిస్తూ కదలాడిన ఆమె ముఖం లో ఒక్కసారిగా ఏదో నిర్వేదం ఆవరించుకుంటుంది.. గోపాల్ ఆమె మొహాన్నే గమనిస్తుంటాడు. .

తన మాటలకి ఆమె ముఖం లో కనిపించిన తేడాని గుర్తిస్తాడు గోపాల్..శారదకి తన గతం గుర్తుకు వస్తుంది.. కళ్ళముందు తాను నివసించిన బంగళా ప్రత్యక్షమవుతుంది.. ఆ బంగళాలో తన భర్తతో తాను ఆనందంగా జీవించిన క్షణాలు గుర్తుకు వస్తాయి.. తనకి ఏది కావాలన్నా క్షణాల్లో అందించే పనివారు, తన భర్త కుటుంబ సభ్యులు, తన భర్త తనకి గోరుముద్దలు తినిపించిన సంఘటనలు, తాను, తన భర్త తో కలసి పేదవారికి బట్టలు దానం చేసిన సన్నివేశాలన్నీ ఒక్కసారిగా కళ్ళముందు కదలాడుతాయి..

గోపాల్ శారద వంకే చూస్తూంటాడు. ఆమె కూడా పరధ్యానంలో పడిపోయిందన్న విషయాన్ని గోపాల్ గ్రహిస్తాడు..

ఆమె ముఖం లోని భావాలు క్షణ క్షణానికి మారుతుండడాన్ని గోపాల్ గమనిస్తూంటాడు..

శారద తన జీవితంలో గడిపిన ఆనంద క్షణాలన్నీ ఒక్కసారిగా ఆమె కళ్ళ ముందు కదలాడుతుంటాయి.. ఆ సన్నివేశాలు గుర్తుకి రాగానే ఆమె ముఖంలో ఆనందం, సంతోషం, ఉద్వేగం, లాంటి భావాలు ఒకదాని తర్వాత ఒకటి వస్తూంటాయి.. ఆ తర్వాత ఆ బంగాళాలో పనిచేసే పనివారు శారదకి సపర్యలు చేసే సన్నివేశాలు.. అలాంటి ఒక్కో మధురమైన సన్నివేశం ఆమె కళ్ళ ముందు కదలాడుతుంటే ఆమె ముఖం లోని భావాలు ఒక్కోవిధంగా మారిపోతుంటాయి.. ఆ తర్వాత భర్త తనకి గోరుముద్దలు తినిపిస్తున్న సన్నివేశం గుర్తుకి రాగానే ఆమె మనసులో బాధ ప్రవేశిస్తుంది.

ఆ తర్వాత ఒక్కసారిగా ఆమె ముఖం లో ఒకరకమైన  విచారం ప్రవేశిస్తుంది.. అప్పటి వరకూ  ఆనందంగా కనిపించిన ఆమె ముఖం లో విచారం ప్రవేశించడంతో గోపాల్ నొసలు ముడిపడతాయి.. ఆమె ముఖం లో కదలాడుతున్న భావాలని జాగ్రత్తగా పరిశీలిస్తుంటాడు మేనేజర్ గోపాల్..

ఆమె ముఖం లో విచారం, ఆందోళన కనిపిస్తుంటాయి.. ఆ కళ్లల్లో ఒకరకమైన అలజడి స్పష్టంగా కనిపిస్తుంది..

ఇన్ని రకాల భావాలకు కారణం.. అప్పటి వరకూ తన జీవితంలో గడిపిన ఆనంద క్షణాలు గుర్తుకు  రావడంతో ఆమె ముఖం  లో  సంతోషం కదలాడుతుంది .. ఆ వెంటనే ఆమెకి ఆ విశాలమైన భవనంలో నుండి తనని ఇంటి నుండి బయటకు ఈడ్చుకుంటూ తీసుకువచ్చి.. గేటు బయటకి విసిరివేయబడ్డ సన్నివేశం గుర్తుకు వస్తుంది.. అందుకే ఆమె కళ్ళల్లో అలజడి చేరుతుంది...

ఆ సన్నివేశం గుర్తుకు  రాగానే ఆమె మనస్సు కకలా  వికలం అయిపోతుంది.. అనుకోకుండానే ఆమె కళ్ళల్లో కన్నీళ్ళు సుడులు తిరుగుతాయి.. ఆమె కళ్ళల్లో కన్నీళ్ళు గమనించిన గోపాల్ ఆశ్చర్యపోతాడు...

గోపాల్ వాయిస్.. (మనసులో)

‘‘అయ్యో.. ఈవిడకి గతం గుర్తుకు వచ్చినట్టుంది.. తన జీవితంలో అనుభవించిన చేదు అనుభవాలేవో ఈవిడ మదిలో మెదిలినట్టున్నాయి.. అందుకే ఆ కళ్ళల్లో కన్నీళ్ళు కనిపిస్తున్నాయి.. అనవసరంగా ఈవిడ గతాన్ని గుర్తుకు  చేసానా..? తనలో తానే ప్రశ్నించుకుంటాడు గోపాల్.. గోపాల్ ముఖం లో ఏదో తప్పుచేసిన ఫీలింగ్ కనిపిస్తుంటుంది..

అయినా శారద గోపాల్‌ని పట్టించుకోదు.. ఆమె చూపులు  శూన్యంలో ఉంటాయి.. కళ్ళల్లోనుండి జారిన కన్నీళ్ళు ఆమె చెంపపై చేరుతాయి...

ఇక లాభం లేదనుకున్న గోపాల్ ఆమె కళ్ళ ముందు తన చేయిని ఊపుతూ..

''శారదమ్మా.. ఏమిటీ.. నీ గతంలోకి జారుకున్నావా..?''

తన పెదాలపై చిరునవ్వుని తెచ్చి పెట్టుకుంటూ అంటాడు గోపాల్.. అతని మాటలకి ఉలిక్కిపడుతుంది శారద..

ఆ తర్వాత తన పమిట కొంగుతో తన చెంపపై జారిన కన్నీళ్ళని తుడుచుకుంటుంది.

అలా తుడుచుకుంటున్న శారద వైపు జాలిగా చూస్తూంటాడు గోపాల్..

''అనవసరం గా నీ గతాన్ని గుర్తు చేసి నిన్ను బాధ పట్టినట్లున్నాను.. అయాం సారీ..''

బాధగా అంటాడు గోపాల్...

''అయ్యో.. అంత పెద్ద మాటలు  ఎందుకు లెండి.. ఏదో పరధ్యానంలో ఉన్నాను అంతే.. ఫర్వాలేదు లెండి..''

శారద తనని తాను సర్దుకొంటూ ముఖంలో చిరునవ్వుని తెచ్చిపెట్టుకుంటూ అంటూంది..

ఆమె ముఖం లో నవ్వుని చూసిన గోపాల్ మనసు స్థిమిత పడుతుంది..

''గుండెల్లో ఇంత బాధని పెట్టుకుని చిరునవ్వుని చిందిస్తూ గడపడం నీకే చెల్లింది శారదమ్మా.. ఏది ఏమయినా.. నీ గతం ఏమిటో తెలుసుకోవాలన్న  కోరిక మాత్రం నాలో ఉంది...''

గోపాల్ శారదనే చూస్తూ అంటాడు..

శారద ముఖం లో అదే నవ్వు.. కానీ గోపాల్ మాటలతో ఏదో ఇబ్బంది పడ్డ ఫీలింగ్..

''సమయం వచ్చినప్పుడు నేనే చెబుతాను లెండి..''

ఇద్దరూ అలా మాట్లాడుతుండగానే గేటు దగ్గర ఏదో అలికిడి వినిపించి ఇద్దరూ అటు వైపు చూస్తారు..

గేటుదగ్గర ఆ గుడి క్లీనింగ్ హెడ్ రాజారాం నిలబడి కనిపిస్తాడు.. అతని చూపు శారదమ్మ పై ఉంటుంది.. ఆ చూపులో ఏదో అసూయ కనిపిస్తుంటుంది.. శారదమ్మనే తదేకంగా చూస్తూండడంతో అతని చూపుతో శారదలో కొంత ఆందోళన కనిపిస్తుంది.. రాజారాం శారదని తీక్షణంగా చూస్తూండడం గోపాల్ గమనిస్తాడు.. గోపాల్ రాజారాం వంక, శారద వంక మార్చి మార్చి చూస్తాడు..

ముగ్గురూ ఒకరిని ఒకరు చూసుకుంటుంటారు.. వారి చూపులో ఎన్నో భావాలు కనిపిస్తుంటాయి.. మేనేజర్ గోపాల్ క్లీనింగ్ హెడ్‌ని చూస్తూ ఏదో అనబోతుండగా అప్పుడే అక్కడకి వస్తాడు మూర్తి..

''ఏమిటీ.. ముగ్గురూ ఇలా గేటు దగ్గర నిలబడి మీటింగ్ పెట్టారు..?'' నవ్వుతూ పలుకరిస్తాడు మూర్తి.

''ఆ.. ఏమీలేదు.. మన మేనేజర్ గోపాల్ గారితో కాస్త పని ఉండి వచ్చాను.. పదండి ఆఫీసులో కెళ్ళి మాట్లాడుకుందాం..!'' రాజారాం గంభీరంగా అంటాడు.

………………………………

సాయిబాబా మందిరం పక్కనే ఉన్న మేనేజర్ గోపాల్ ఆఫీసులోకి అడుగు పెడుతారు గోపాల్, మూర్తి, రాజారాం. గోపాల్ తన సీట్లో కూర్చున్నాక అతని ఎదురుగా మూర్తి, క్లీనింగ్ హెడ్ ఇద్దరూ కూర్చుంటారు..

ఉపోద్ఘాతం లేకుండా రాజారాం నేరుగా విషయం లోకి వస్తాడు.

''మీరు చేస్తున్న పని ఏమీ బాగో లేదండీ..'' గంభీరంగా అంటాడు రాజారాం.

రాజారాం మాటలకి మేనేజర్ గోపాల్, మూర్తి ఇద్దరూ ఉలిక్కి పడతారు.. ఇద్దరూ ఆశ్చర్యంగా రాజారాం వంక చూస్తారు..

''నేను చేస్తున్నదా.. ఏమిటదీ.. ఏమి బాగో లేదు..?'' ఆశ్చర్యంగా అంటాడు గోపాల్.

‘‘అదే.. ఆ పనావిడకి మీరు అధిక ప్రాధాన్యత ఇవ్వడం నాకేమీ నచ్చలేదు..’’ రాజారాం గొంతులో చిరాకు ధ్వనిస్తుంది.

‘‘ఎవరూ.. ఆ శారదమ్మకా..?’’

‘‘అవును.. ఆ శారదమ్మ కే... ఆమె వచ్చినప్పటి నుండి ఈ గుడిలో అందరికంటే ఎక్కువ ప్రాధాన్యత మీరు ఆవిడకే ఇస్తున్నారు.. ఒక పనావిడకి ఇంత ప్రాధాన్యత ఇవ్వడం అవసరమా..?’’ ఈసారి అతని గొంతులో ఈర్ష్యతో కూడిన కోపం ప్రవేశిస్తుంది.

గోపాల్ అతనివంక ఆశ్చర్యంగా చూస్తాడు.. మూర్తి కూడా ఆశ్చర్యంగా చూస్తాడు..‘‘ఆవిడకి నేను అధిక ప్రాధాన్యత ఇస్తున్నానా.. అలా అని నువ్వు ఎలా అనుకుంటున్నావు..?’’

‘‘ఎలా అనుకోవడం ఏమిటి.. కళ్ళ ముందు స్పష్టంగా కనిపిస్తుంటేనూ.. ఆవిడ వచ్చినప్పటి నుండి మీలో ఏదో మార్పు కనిపిస్తుంది.. గుడిని శుభ్రపరచడానికి వచ్చిన ఆవిడని ఆదివారం రోజున పిల్లలకి బోధనలు చేసేంత పెద్దదానిని చేసింది మీరే కదా.. అంట్లు తోముకునే ఆవిడతో పిల్లలకి బోధనలు చెప్పించడం ఏమయినా బావుందా..?’’

రాజారాం ముఖం లో కోపం ప్రవేశిస్తుంది..

‘‘ఇందులో తప్పేముంది.. ఆవిడ అంట్లు తోముతుండవచ్చు.. కానీ ఆవిడలో అమోఘమైన తెలివి తేటలు ఉన్నాయి.. మొన్న ఆవిడ పిల్లలకి బోధనలు చేసిన తీరుని నువ్వు చూస్తే ఈ మాట అని ఉండేవాడివి కావు..’’ అంటాడు మూర్తి.

‘‘కరెక్టుగా చెప్పారు మూర్తి గారూ.. ఆవిడలో భగవంతునిపై నిస్వార్థమైన ప్రేమ ఉంది.. అయినా ఆవిడ అంట్లు తోమినా, చీపురు పట్టి నేలని శుభ్రం చేసినా అదంతా ఆ సాయిబాబాకి చేసే సేవనే కదా.. ఒక మనిషి చేస్తున్న పనిని బట్టి అతని సామర్ధ్యాన్ని అంచనా వేయడం తగదు..’’

అనునయంగా అన్నాడు గోపాల్.. ఆ మాటలకి రాజారాం ముఖంలో కోపం ప్రవేశిస్తుంది..

''అవునవును.. పనిని బట్టి మనుషులని అంచనా వేయడం తగదు.. కరక్టే.. కానీ.. ఒక మనిషి చేసే పనిని బట్టే ఆ మనిషి స్థాయిని గుర్తిస్తారు. అంట్లు తోముకునే ఆవిడ భగవంతుని గురించి బోధనలు  చేయడం మీకు నచ్చుతుందేమో కానీ.. ఆ బోధనలు వింటున్న పిల్లల తల్లిదండ్రులలో కొందరు ఈ విషయం పై సీరియస్‌గా ఉన్నారు.. ఆ అంట్లు తోముకొనే ఆవిడ బోధనలు చేస్తే మాత్రం ఇకనుండి తమ పిల్లలను గుడికి మేము పంపించం అని నాతో చెప్పారు.. అందుకే నేను ఇలా మాట్లాడవలసి వస్తుంది.. '' కోపంగా అన్నాడు రాజారాం.

ఆ మాటలకు గోపాల్, మూర్తి ఇద్దరూ ఒకరి మొహాలొకరు చూసుకుంటారు.. వారిద్దరిలోనూ ఒక విధమైన ఆశ్చర్యం కనిపిస్తుంది..

''అదేమిటయ్యా.. పవిత్రమైన ఈ గుడి ప్రాంగణంలో మనుష్యులందరూ సమానమే అన్న విషయాన్ని కూడా  గ్రహించలేకపోతున్నారా.. ఈ స్థాయీ, హోదా అన్నవి బయటి ప్రపంచంలో చెల్లుబాటు అవుతాయి కానీ..

పవిత్రమైన ఈ సాయిబాబా  ఆలయంలో అలాంటి వాటికి చోటుండదు.. మనుష్యులందరూ సమానమే అని ఆ దేవుడు చెప్పాడు.. పవిత్రమైన మనసుతో చూస్తే ప్రతి మనిషిలోనూ దేవుడు కనిపిస్తాడు..'' అంటాడు గోపాల్.

గోపాల్ మాటలకి రాజారాం ముఖంలో మరింత కోపం ప్రవేశిస్తుంది..

''హు.. నిజం చెబితే మీకు ఇలాగే ఉంటుంది.. మీరు చెబుతున్న ఈ మాటలు వినడానికే గానీ, ఆచరించడానికి పనికి రావు.. ఈ గుడికి వచ్చే పిల్లల తల్లితండ్రులలో కొందరు నాతో అన్నారు కాబట్టే నేను మీకు ఇలా చెబుతున్నాను.. అంతేకానీ మరో ఉద్దేశ్యం తో కాదు..'' తన మాటలను సమర్థించుకోవడానికి ఆ నెపాన్ని పిల్లల తల్లితండ్రుల పైకి నెట్టాడు రాజారాం.

''భగవంతుని గురించి బోధనలు చేయడానికి అర్హతలు చూడాల్సిన అవసరం లేదు.. ఒకవేళ అలాంటి అర్హతని పట్టించుకునే వారెవరయినా ఉంటే.. అటువంటి వారు తమ పిల్లలను పంపించకపోవడమే మంచిది.. '' చిరాగ్గా అంటాడు గోపాల్..

''గుడికి వచ్చే పిల్లలనైనా వదులుకుంటారు కానీ.. ఆ పనావిడని మాత్రం వెనకేసుకు వస్తారన్నమాట..'' రాజారాం గొంతులో కరుకు ధ్వనిస్తుంది..

''అవును.. ఆవిడ బోధనలు చేసే విధానం చాలా మందికి నచ్చింది.. పిల్లలకు కూడా ఆవిడ బోధనలు ఎంతో శ్రద్ధతో వింటున్నారు.. అంతేకాదు, మాస్టారు గారు సైతం ఆవిడ చేతనే బోధనలు చెప్పించమని చెప్పారు.. ఏదో కొందరికి నచ్చలేదని ఆవిడని తప్పించడం ఎంత వరకు కరెక్టు..?''

రాజారాం వంక సూటిగా చూస్తూ అన్నాడు గోపాల్.. ఆ మాటకి రాజారాం కసిగా తన పెదాలను కొరుక్కుంటాడు..

ఆయన ముఖంలో ప్రతి ఫలిస్తున్న భావాలని గోపాల్, మూర్తి ఇద్దరూ గమనిస్తారు

మూర్తి, గోపాల్ ఇద్దరూ ఒకరి మొహాలొకరు చూసుకుంటారు..

మూర్తి రాజారాం వంక చూస్తాడు..

''అయినా నిస్వార్థంగా సాయినాధుడి సేవలో తరిస్తున్న ఆ శారదమ్మ గురించి మీరు ఇంతగా ఎందుకు ఆలోచిస్తున్నారో నాకు అర్థం కావడం లేదు.. ఆవిడ ఈ గుడికి వచ్చినప్పటి నుండి గుడి ఎంతో శుభ్రంగా ఉంటోంది.. పరిశుభ్రం విషయంలో శారదమ్మ ఏమాత్రం తగ్గడంలేదు.. దేవుడిపై ఉన్న భక్తితో ఆవిడ సేవ చేస్తుంటే అడ్డుకోవడం భావ్యం కాదు..''

''ఊ.. మీరు కూడా వంత పాడుతున్నారా..? ఏమో.. ఈ రోజుల్లో ఎవరినీ గుడ్డిగా నమ్మడానికి వీల్లేదని నా ఉద్దేశ్యం.. అసలు ఆవిడ ఎవరో, ఎక్కడి నుండి వచ్చిందో తెలుసుకోకుండా.. ఈ గుడికి సంబంధించిన ప్రతీ వ్యవహారంలోనూ ఆవిడ జోక్యం చేసుకునేంత చనువు ఇవ్వడం మాత్రం నాకు నచ్చడం లేదు.. మీరు ఇస్తున్న ఈ అతి చనువుతో ఎప్పుడో ఒకప్పుడు ఆవిడ రూపంలో ఈ గుడికి ఏదో ఒక కీడు జరగుతుందేమోనన్న అనుమానం మాత్రం నాలో ఉంది..'' చివరి అంశంగా వారిలో ఒక అనుమానపు బీజాన్ని వేయాలనుకున్నాడు రాజారాం.

‘‘ఏమిటా మాటలు.. అసలు అలా మాట్లాడటానికి నీకు నోరెలా వచ్చిందయ్యా.. వృద్ధాప్యంలో ఉన్న ఆవిడముఖం  చూస్తుంటే నీకు కీడు చేసే  దానిలా కనిపిస్తుందా..?  సాయినాథుడిపై ఉన్న  అపారమైన భక్తితో ఆమె నిస్వార్ధంగా చేస్తున్న సేవ నీకు  అనుమానాన్ని కలిగిస్తుందా..? మరొక్కసారి ఇలాంటి మాటలు  నాముందు మాట్లాడకండి..’’ గోపాల్ గొంతులో కోపం ధ్వనిస్తుంది..

‘‘మేనేజర్ గారు కరెక్టుగా చెప్పారు.. ఆ పెద్దావిడని చూస్తుంటే మోసం చేసే  దానిలా కనిపిస్తుందా..? ఆవిడ రూపంలో ఈ గుడికి కీడు జరుగుతుందా.. ఛఛ.. ఏం మాటలయ్యా.. అలా అనడం ఏమయినా సమంజసంగా ఉందా..?’’

రాజారాం ఇద్దరినీ మింగేసేలా చూస్తాడు.. గోపాల్, మూర్తి ఇద్దరూ అతనివైపు విస్మయంగా చూస్తుంటారు..

రాజారాం కూర్చున్న కుర్చీలోనుండి విసురుగా లేచి నిలబడుతాడు.. అతను అలా లేచి నిలబడటంతో  మేనేజర్ గోపాల్, మూర్తి ఇద్దరూ అవాక్కయిపోతారు.. ఇద్దరూ లేచి నిలబడి రాజారాం వంక చూస్తూంటారు..

‘‘నేను చెప్పింది ఇప్పుడు మీకు తప్పనిపించవచ్చు.. కానీ రేపు ఏదయినా జరగకూడనిది జరిగితే అప్పుడు తల పట్టుకుని కూర్చునే కంటే.. ముందే జాగ్రత్త పడటం మంచిదని నా అభిప్రాయం.. ఆ తర్వాత మీ ఇష్టం..’’ అని చెప్పి వారి వంక చూడనైనా చూడకుండా ఆఫీసులోనుండి విసురుగా వెళ్ళిపోతాడు రాజారాం.

................................

శారద సాయిబాబా మందిరంలో సాయిబాబా విగ్రహం పక్కన ఉన్న ఓ గదిలో ఉన్న వాద్య పరికరాలను శుభ్రం చేస్తూంటుంది.. సాయిబాబాకి హారతి ఇచ్చే సమయంలో ఆ వాయిద్యాలను  ఉపయోగిస్తుంటారు..

రాజారాం అక్కడికి వస్తాడు..

''ఏయ్ ముసలిదానా.. ఇక్కడేం చేస్తున్నావ్..?'' కోపంగా అంటాడు రాజారాం.

రాజారాం గొంతులో కరుకు ధ్వనిస్తుంది... అతని చూపు తీక్షణంగా ఉంటుంది.. శారదని మింగేసేలా చూస్తూంటాడు..

ఆ మాటకి శారద ఉలిక్కిపడుతుంది.. ఆమె ముఖం లో ఎంతో ఆశ్చర్యం, ఆమె కళ్ళల్లో భయం ఒక్కసారిగా కనిపిస్తాయి.. చేస్తున్న పనిని ఆపి లేచి నిలబడుతుంది..

''నేను.. ఈ గదిలోని వస్తువులని శుభ్రపరుస్తున్నానండీ..'' వినయంగా అంటూంది శారద.

రాజారాం ఆ గదిని క్షుణ్ణంగా పరిశీలిస్తాడు, ఆ తర్వాత శారద వంక చూస్తాడు.. అతని చూపులో శారదపై వ్యతిరేక భావం కదలాడుతుంటుంది..

''అయినా గుడిలో ఎవ్వరూ లేని సమయంలో.. ఇలా గదులలో దూరి శుభ్రపరచాల్సిన అవసరం లేదు..

ఇలాంటి పనులన్నీ గుడిలో మరెవరయినా ఉన్నప్పుడు చేసుకో.. ఇంకొకసారి ఇలా గుళ్ళో ఒంటరిగా కనిపించావో నేనేం చేస్తానో నాకే తెలియదు..'' కోపంగా అంటాడు రాజారాం.

అతని గొంతులో కోపం ధ్వనిస్తుంది.. ఆ మాటలకి శారద మనసు ఎంతో గాయపడుతుంది.. శారద నోట మాట రాక స్థాణువులా నిలబడి  రాజారాం వైపే చూస్తూంటుంది..

''ఈ గుడి మేనేజర్ గోపాల్‌గారి సపోర్టు ఉంది కదా అని ఓవరాక్షన్ చేస్తే ఊరుకునేది లేదు.. నీ స్థాయి ఏమిటో తెలుసుకొని నడుచుకో.. కూటికి గతిలేక ఈ గుడికి వచ్చిన నువ్వు.. మూడు పూటలా దొరుకుతున్న తిండిని తిని ఓ మూలాన నక్కి ఉండు.. అంతేకానీ.. ఇలా ఇదేదో నీ సొంత ఇల్లన్నట్టు అన్ని పనులలో వేలు పెడితే ఊరుకునేది లేదు..''

రాజారాం ముఖం లో కోపం.. శారద వంకే సూటిగా చూస్తూంటాడు అతను.. అతను అన్న మాటలు  శారద హృదయానికి ముల్లులా గుచ్చుకొన్నాయి... ఆమె కళ్ళల్లోనుండి కన్నీళ్ళు జలజలా రాలాయి... ముఖం లో బాధ కదలాడుతుంది..

''నేను చెప్పింది అర్థమయిందా.. మరొక్కసారి ఒంటరిగా ఈ గుడిలో ఏదయినా సర్దుతూ కనిపించావనుకో.. ఆ మరుక్షణం.. నువ్వు ఈ గుడిలో నుండి బయటికి గెంటపడతావు.. జాగ్రత్త..'' హెచ్చరికగా అంటూ అక్కడి నుండి వెళతాడు రాజారాం.

రాజారాం అన్న ఒక్కొక్క మాటా.. ఆమె హృదయాన్ని తీవ్రంగా గాయపరుస్తుంది.. క్లీనింగ్ హెడ్ అక్కడి నుండి వెళ్ళిన తర్వాత శారద గట్టిగా రోదిస్తుంది.. అలాగే ఏడుస్తూ కుప్పకూలిపోతుంది.. మోకాలిపై తలని ఆనించి..

ఆవిడ ఏడుస్తూనే ఉంటుంది..

..........................

ఉదయం ఆరు గంటల సమయం.. పూజారి మందిరంలోకి ప్రవేశిస్తాడు..

''ఓం సాయి.. శ్రీ సాయి.. జయ జయ సాయి.. ఓం సాయి.. శ్రీ సాయి.. జయ జయ సాయి..'' అంటూ సాయినాధుడిని ప్రార్థిస్తూ పూజారి విగ్రహం దగ్గరికి వస్తాడు.. కళ్ళు మూసుకుని సాయిబాబా విగ్రహానికి వినయంగా నమస్కరిస్తాడు.. ఆ తర్వాత తన ఒంటిపై ఉన్న షర్టుని విప్పి ఓ మూలాన పెడతాడు.. సాయిబాబా కాగడా హారతి ఇవ్వడానికి సమయం మించిపోతుండటంతో పూజారిలో కంగారు కనబడుతుంది..కండువాని నడుముకి కట్టుకుని సాయిబాబా విగ్రహం దగ్గరికి వచ్చి, గత రాత్రి సాయిబాబా విగ్రహానికి అలంకరించిన పూల హారాలను తొలగించి శుభ్రపరచడానికి సిద్ద పడతాడు.. గబ గబా విగ్రహంపై నున్న పూల హారాలను తొలగిస్తూ..

''శారదమ్మా.. ఈ హారం అందుకో.. '' అంటాడు. అలా అని వెనక్కి తిరిగి చూస్తాడు.. అక్కడ శారద కనిపించకపోవడంతో పూజారి ఆశ్చర్యపోతాడు..

‘‘అదేమిటీ.. ఈ సమయానికి శారదమ్మ ఇక్కడికి రావాలి కదా.. ఈరోజు ఇంకా రాలేదేమిటీ..? దేవుడి హారతికి కావలసిన వస్తువులన్నింటినీ స్వయంగా సమకూర్చి, హారతి అయ్యేంత వరకూ ఇక్కడే ఉండే శారదమ్మ.. ఈరోజు ఇంకా రాలేదేమిటి..?’’ తనలో తాను అనుకుంటున్నట్టుగానే బయటికే అనేస్తాడు పూజారి.

పూజారి చూపులు ఆ మందిరం మొత్తం గాలిస్తాయి శారద కోసం.. అయినా శారద జాడ కానరాదు.. దాంతో పూజారి ఆశ్చర్యపోతాడు.. ఆ తర్వాత హారతికి సమయం మించి పోతుండటంతో తిరిగి తన పనిలో తాను నిమగ్నమయిపోతాడు...

పూజారి సాయిబాబా విగ్రహాన్ని శుభ్రపరుస్తాడు.. ఆ తర్వాత తాను తీసుకువచ్చిన కొత్త పూలమాలతో సాయినాధుడిని అలంకరిస్తారు...

ఆ తర్వాత సాయి విగ్రహం పక్కనే ఉండే తీర్థ ప్రసాదాల పాత్రలపై అతని దృష్టి పడుతుంది.. గత రాత్రికి సంబంధించిన తీర్థ ప్రసాదాలే ఆ పాత్రలో ఉండడంతో పూజారి మరింత ఆశ్చర్యపోతాడు.

‘‘శారదమ్మ ఈ పాత్రలని కూడా శుభ్రం చేయలేదే.. నేను వచ్చే సరికి విగ్రహం మినహాయించి ఈ గుడిని మొత్తం శుభ్రపరచడమే కాకుండా హారతికి సంబంధించి కావలసిన అన్ని వస్తువులను స్వయంగా సమకూర్చే శారదమ్మ ఈ రోజెందుకు రాలేదు.. శారదమ్మ ఉంటుంది కదాని తాను కాస్త బద్దకించి ఓ పావు గంట ఆలస్యం గా వచ్చానే..

హారతి సమయం మించిపోతూంది.. శారదమ్మ ఇంకా రాలేదు... సాయినాధా ఏమి పరీక్ష తండ్రీ..?’’ అనుకుంటూ ఆ విగ్రహం చుట్టూ కూడా శుభ్రపరిచి, తీర్థ ప్రసాదాల పాత్రని తానే శుభ్రపరుచుకుంటాడు పూజారి..

అప్పుడే గుడిలోకి ప్రవేశిస్తాడు మూర్తి..

‘‘పూజారి గారు ఈరోజు కంగారుగా కనిపిస్తున్నారేమిటీ..?’’

చిరునవ్వు నవ్వుతూ పలుకరిస్తాడు మూర్తి..

పూజారి మూర్తిని చూస్తాడు..

''అదేమిటి మూర్తి గారూ.. ఈరోజు శారదమ్మ రాలేదేమిటి..? ప్రతిరోజూ శారదమ్మ హారతికి కావాల్సిన వస్తువులన్నీ సమకూరుస్తుంది కదా.. కానీ.. ఈరోజు మాత్రం ఆ పని చేయలేదు.. శారదమ్మ గుళ్లో లేదా..?''పూజారి మాటలకు మూర్తి ఆశ్చర్యపోతాడు..

''శారదమ్మ గుళ్ళోనే ఉందే..! ఎందుకు శుభ్రపరచలేదు..?'' ఆశ్చర్యంగా అంటాడు మూర్తి.

''నేను అదే అడుగుతున్నాను.. ప్రతి రోజూ నేను వచ్చే సరికి హారతికి సంబంధించి అన్ని పనులను శారదమ్మనే స్వయంగా చేసేది.. నేను సాయినాధుడి విగ్రహాన్ని అలంకరించి హారతిని మొదలు పెట్టేవాడిని.. కానీ.. ఈరోజు అన్ని పనులూ  నేనే చేసుకోవాల్సి వచ్చింది..''

''శారదమ్మ ఇంకా రాకపోవడానికి కారణమేమై ఉంటుంది..?'' మూర్తి ముఖంలో ఆశ్చర్యం..

''శారదమ్మ ఒంట్లో గానీ బాగోలేదేమో..!'' అనుమానంగా అంటాడు పూజారి.

''అదే అయి ఉంటుంది.. నేను చూసొస్తాను.. ఉండండి..''

మూర్తి మందిరంలో నుండి బయటికి వస్తాడు. ఆ మందిరం పక్కనే ఉన్న చిన్న గదిలో శారద ఉంటోంది. ఆ గది దగ్గరికి వస్తాడు మూర్తి. ఆ గది తలుపులు  తెరుచుకుని ఉంటాయి..

మూర్తి ఆ గది తలుపులు తెరిచి ఉండటంతో బయట నిలబడి లోపలికి తొంగి చూస్తాడు.. లోపల ఎవరూ కనిపించరు..

''శారదమ్మా.. శారదమ్మా..'' మూర్తి పిలుస్తాడు.

మూర్తి పిలుపుకి లోపలి నుండి సమాధానం రాకపోవడంతో మూర్తి ఆశ్చర్యపోతాడు..

''ఇదేమిటీ..? శారదమ్మ గదిలో కూడా లేదు.. ఇంత పొద్దున్నే ఎక్కడికి వెళ్ళి ఉంటుంది.. ?'' మూర్తి ఒకసారి చుట్టూ చూస్తాడు.. మూర్తి ముఖంలో ఆశ్చర్యం.. మూర్తి ఆ గది నుండి మందిరం ముందు భాగానికి వస్తాడు..

మందిరం ముందు భాగంలో భక్తులు విడిచే పాదరక్షల స్టాండ్ దగ్గర శారదమ్మని చూస్తాడు మూర్తి.

''ఓ.. ఇక్కడున్నావా..'' అనుకుంటూ మూర్తి పాదరక్షల స్టాండ్ దగ్గరికి వస్తాడు..

శారద ఆ పాదరక్షల స్టాండ్‌ని ఓ గుడ్డతో శుభ్రపరుస్తూ కనిపిస్తుంది.. ఆమె చేస్తున్న పనిని చూసి మూర్తి ఎంతో ఆశ్చర్యపోతాడు..

''శారదమ్మా.. ఇక్కడేం చేస్తున్నావు..?'' ఆశ్చర్యంగా అడుగుతాడు మూర్తి.

మూర్తి మాటలతో శారద ఉలిక్కిపడి మూర్తి వంక చూస్తుంది..శారదమ్మ వాయిస్..

''ఓ.. మీరా.. ''

శారదమ్మ చిరునవ్వు నవ్వుతుంది.. ఆ తర్వాత మళ్లీ తన పనిలో తాను నిమగ్నమయిపోతుంది.. శారదమ్మ చర్యకి మూర్తిలో మరింత ఆశ్చర్యం ప్రవేశిస్తుంది..

''శారదమ్మా.. ఈరోజు నువ్వు కొత్తగా ప్రవర్తిస్తున్నావేమిటీ..? ప్రతీరోజు సాయినాధుడి కాగడ హారతి సమయానికి అన్ని వస్తువులు సమకూరుస్తావు కదా.. ఈరోజు అలా చేయలేదేమిటి..? నీకు ఆ సాయినాధుడి హారతి కన్నా ఈ పాదరక్షల స్టాండ్‌ని శుభ్రం చేయడం ముఖ్యంగా తోచిందా..''

మూర్తి ముఖం లో కాస్త చిరాకు కనిపిస్తుంది..

మూర్తి మాటలకి  శారద ముఖం మ్లానమైపోతుంది.. ఆమె ముఖం లో బాధ కనిపిస్తుంది.. ఒకసారి మూర్తి వంక చూస్తూంది.. ఆ చూపులో ఎంతో బాధ ఉన్నట్లు మూర్తి గమనిస్తాడు..

‘‘ఏమయింది శారదమ్మా.. ఈ రోజేమిటి కొత్తగా ప్రవర్తిస్తున్నావ్.. అసలేం జరిగింది..? ప్రతి రోజూ సాయినాధుడిని సేవించే నువ్వు.. ఈరోజు మందిరంలోకి రాకుండా ఉన్నావెందుకు..? హారతి ఇవ్వడానికి పూజారి వచ్చే సమయానికి మందిరాన్ని పరిశుభ్రంగా నువ్వు ఉంచాలి కదా..’’ లాలనగా అంటాడు మూర్తి.

మూర్తి మాటలకి శారద మౌనం వహిస్తుంది.. ఏం మాట్లాడాలో అర్థం కానట్లుగా ఉంటుంది ఆమె వదనం..

ఆమె మౌనం దాల్చటంతో మూర్తిలో మరింత ఆశ్చర్యం కలుగుతుంది.

‘‘సమాధానం చెప్పకుండా అలా మౌనంగా ఉన్నావేమిటి శారదమ్మా.. అసలేం జరిగిందో చెప్పు..’’

శారద మనసులో ఎంతో బాధ పడుతున్నట్టు ఆమె ముఖం లోని భావాలు గమనిస్తుంటేనే మూర్తికి అర్థమవుతుంది..

ఆమె కళ్ళలో సన్నటి కన్నీటి పొర అలముకొని  ఉంటుంది..

మూర్తి ఒక రెండు మూడు నిమిషాల పాటు ఆమె సమాధానం చెబుతుందేమో అని ఎదురు చూశాడు. కానీ ఆమె నుండి సమాధానం రాలేదు.. తన పనిలో తాను లీనమయిపోయింది. దాంతో మూర్తి ఇక చేసేదేమి లేక అక్కడి నుండి కదులుతాడు... మందిరంలోకి వెళ్ళిపోతాడు..

అతను మందిరంలోకి వెళ్ళగానే శారదమ్మ అతను వెళ్ళిన వైపు చూస్తుంది.. మందిరంలో లోపల సాయిబాబా కాగడ హారతి ప్రారంభమవుతుంది.. మైకులో నుండి హారతి మంత్రాలు మంద్రంగా వినిపిస్తుంటాయి...శారద కళ్ళల్లో కన్నీళ్ళు నిండిపోతాయి.. తన మనసులోని బాధని దిగమింగుకుంటున్నట్లు ఆమె ముఖంలోని భావాలు తెలుపుతుంటాయి..  మందిరం వంక చూస్తూ రెండు చేతులు ఎత్తి సాయినాధుడిని  మనసులో స్మరించుకుంటూ  దండం

పెడుతుంది.. కళ్ళల్లోనుండి  వచ్చిన కన్నీటిని  కొంగుతో తుడుచుకొని మళ్ళీ తన పనిలో తాను లీనమయిపోతుంది..

………………………

ఉదయం పది గంటలు కావొస్తోంది.

మేనేజర్ గోపాల్ ఆఫీసులో మూర్తి, పూజారి కూర్చుని ఉంటారు.. మేనేజర్ గోపాల్ తన సీట్లో కూర్చుని ఏదో దీర్ఘాలోచనలో ఉంటాడు.

‘‘ఈ రోజు శారదమ్మ వాలకం కొత్తగా ఉంది..  ప్రతి  రోజూ ఉదయాన్నే సాయినాధుడి హారతి  సమయానికి మందిరాన్ని అంతా శుభ్రపరిచే శారదమ్మ ఈరోజు కనీసం మందిరం లోపలికి కూడా రాలేదు.. అసలేం జరిగింది..?

‘‘అవునా.. నిన్న నాతో బాగానే మాట్లాడిందే..! ఎందుకు ఇలా చేసింది..?’’

‘‘అదే అర్థం కాలేదండీ..! ప్రతిరోజూ లాగానే ఈరోజు కూడా శారదమ్మ హారతికి కావాల్సినవన్నీ సమకూరుస్తుందని నేను కాస్త ఆలస్యంగా వచ్చాను.. కానీ నేను వచ్చి చూద్దును కదా.. ఎక్కడి సామాన్లు అక్కడే ఉన్నాయి..’’

పూజారి కూడా అనడంతో గోపాల్ ముఖం లో ఆశ్చర్యం..

‘‘శారద అలా ఎందుకు చేసింది..?’’ తనలో తాను అనుకుంటున్నట్టుగానే బయటికి అనేసాడు..

‘‘అదే అర్థం కాకుండా ఉందండి.. శారదమ్మ మందిరంలోకి రాలేదని పూజారి గారు నాతో చెప్పగానే శారదమ్మకి ఒంట్లో బాగోలేదేమో అన్న అనుమానంతో నేను ఆమె గది దగ్గరికి వెళ్ళాను.. అప్పటికే శారదమ్మ నిద్రలేచింది..

ఆశ్చర్యంగా మందిరం ఆవరణలోని భక్తుల పాదరక్షలు విడిచే స్టాండ్‌ని శుభ్రం చేస్తూ కనిపించింది.. దేవుడి హారతి కంటే ఆవిడకి ఆ పాదరక్షల స్టాండ్‌ని శుభ్రం చేయడం

ముఖ్యమయిందా.. అని ఎంతో ఆశ్చర్యపోయాను.. ఆ విషయాన్ని ఆవిడని అడిగాను కూడా.. అయినా ఏమీ సమాధానం చెప్పలేదు...''

మూర్తిగారి మాటలకి గోపాల్ తల పంకించాడు..

''సాయిబాబా అంటే శారదమ్మకి ఎంతో ఇష్టం.. ఆ సాయినాధుడికి సేవ చేసే సమయంలో ఆమె కళ్ళల్లో ఎంతో సంతృప్తి కనిపిస్తుంటుంది.. దేవునికి సేవ చేస్తున్నానన్న ఆనందం ఆమె పనిలో కనిపిస్తుంది.. సాయినాధుడికి హారతి ఇచ్చే సమయంలో ఆమె ఎంతో భక్తి శ్రద్ధలతో పనులు చేసేది.. కానీ.. ఈరోజు.. ఇలా.. పూజారి మధ్యలోనే మాటని ఆపేసి గోపాల్ వంక చూసాడు.. మూర్తి పూజారి వంక చూస్తాడు, ఆ తర్వాత గోపాల్ వంక చూస్తూ..

''అవును నిజమే..! ఆవిడ ప్రవర్తన చాలా వింతగా అనిపించింది.. నేను ఎందుకు రాలేదని ప్రశ్నించినా ఆమె మౌనంగానే ఉంది.. ఏమీ సమాధానం చెప్పలేదు.. కానీ ఆమె ముఖం లోని భావాలను గమనిస్తే మాత్రం.. ఆమె మనసులో ఏదో విషయంపై తీవ్రంగా బాధపడుతున్నట్లు అనిపించింది.. అంతేకాదు.. ఆమె కళ్ళల్లో కన్నీళ్లు సుడులు తిరగడం కూడా గమనించాను.. శారదమ్మ ఎందుకో తీవ్రంగా బాధపడుతున్నట్టు మాత్రం నాకర్థమయింది.. మీరు గానీ శారదమ్మని ఏమయినా అన్నారా..?

గోపాల్ వంక చూస్తూ అన్నాడు మూర్తి..

మూర్తి మాటలకి గోపాల్ ఉలిక్కిపడ్డాడు..

''ఛఛ.. నేనేమీ అనలేదు.. అయినా ఎంతో నిజాయితీగా దేవుడికి సేవ చేస్తున్న ఆవిడని నేనేమంటాను..?

''మరి శారదమ్మ వింత ప్రవర్తనకి కారణం ఏమై ఉంటుంది..?''

''శారదమ్మ అంతలా బాధపడేంత సంఘటన ఏమి జరిగి ఉంటుంది..? ఆవిడ ప్రవర్తనకి కారణం ఏమై ఉంటుంది..?''

గోపాల్ తనలో  తానే అనుకుంటున్నట్టుగా  బయటికి అంటాడు..  గోపాల్ తీవ్ర  ఆలోచనలో మునిగి శారద గురించి ఆలోచిస్తున్నట్టు అతని ముఖ కవళికలు కనిపిస్తుంటాయి.. టేబుల్‌పై మోచేతులు ఆనించి రెండు చేతులను తన గడ్డానికి ఆనించుకుని తీవ్రంగా ఆలోచిస్తుంటాడు గోపాల్..

.........................................

మధ్యాహ్న సమయం.. సాయిబాబా మధ్యాహ్న హారతికి సమయం అవుతుంది.. కొందరు భక్తులు సాయిబాబా మందిరంలో సాయిబాబా దర్శనాన్ని చేసుకుంటుంటారు.. మరి కొందరు భక్తులు హాలులో కూర్చుని ప్రసాదాన్ని స్వీకరిస్తూంటారు.. వచ్చే పోయే భక్తులతో సాయిబాబా ఆలయం రద్దీగా ఉంటుంది..

మధ్యాహ్న హారతి ఇచ్చేందుకు పూజారి మందిరానికి వస్తారు.. ఆయన మందిరం గేటు ముందుకు రాగానే ముందుగా ఆయన కళ్ళు ఆ మందిరం ప్రాంగణం చుట్టూ శారద కోసం వెతుకుతాయి..

పూజారి శారద కోసం వెతుకుతాడు.. ఆమె ఆ చుట్టు ప్రక్కల  కనిపించక పోవడంతో పూజారి ఆలోచనలో పడిపోతాడు..''ప్రతిరోజూ ఈ సమయానికి ఇక్కడే ఎక్కడో కనిపించే శారదమ్మ ఈరోజు కనిపించడం లేదేమిటి..?'' మనసులో అనుకుంటూనే మందిరంలోకి ప్రవేశిస్తాడు..

పూజారి గారిని చూడగానే కొందరు భక్తులు వినయంగా లేచి నిలబడుతారు.. కొందరు భక్తులు సాయిబాబా విగ్రహం ముందు ఉన్న హుండీపైన ఉంచిన హారతిని ముద్రించిన పుస్తకాలని  తమ చేతిలోకి తీసుకుంటారు..

పూజారి సాయిబాబా విగ్రహం దగ్గరికి వస్తాడు.. ఉదయం తాను హారతి ఇచ్చి వెళ్లినప్పుడు అక్కడి వస్తువులు  ఎలా ఉన్నాయో.. ఇప్పుడూ అలానే ఉండడం గమనిస్తాడు పూజారి..

''అంటే ఇప్పుడు కూడా శారదమ్మ ఇక్కడికి రాలేదన్నమాట.. ఏమిటో..'' అనుకుంటూ తన ఒంటిపై ఉన్న షర్ట్‌ని విప్పి ఓ పక్కన  పెట్టేసి, కండువాని నడుముకి చుట్టుకుని  సాయిబాబా మధ్యాహ్న  హారతికి కావలసిన ఏర్పాట్లు చేయడంలో నిమగ్నమయిపోతాడు పూజారి..

అదే సమయంలో మందిరంలోకి ప్రవేశిస్తాడు ఆ మందిరం క్లీనింగ్ హెడ్ రాజారాం. అతనితో పాటు శారద ఆ గుడికి వచ్చిన మొదటి సారి, శారదతో పాటు అక్కడ పని చేయడం కోసం వచ్చిన సావిత్రి కూడా వస్తుంది.

రాజారాం పూజారి దగ్గరకు వస్తాడు.. పూజారిని చూసి పలకరింపుగా నవ్వుతాడు.. అలాగే సాయిబాబా విగ్రహానికి భక్తిపూర్వకంగా నమస్కరిస్తాడు..

''ఏమిటండీ.. ఈ మధ్య మందిరానికి రావడమే మానేసారు..''

''తమరికి తెలియనిదేముంది పూజారి గారూ.. సికింద్రాబాద్‌లోని గణేష్ టెంపుల్ దగ్గర పూజాసామాగ్రి షాపుని ఎప్పుడయితే ప్రారంభిచానో అప్పటి నుండి అసలు తీరిక దొరకడం లేదండీ..! ఉదయం తొమ్మిది గంటల నుండి మొదలు, రాత్రి పది గంటల వరకూ కస్టమర్లతో ఊపిరి సలపనంత బిజీగా అయిపోయాననుకో..''

పూజారి ఇస్తున్న తీర్థాన్ని తీసుకుంటూ అన్నాడు క్లీనింగ్ హెడ్ రాజారాం.

''మొత్తానికి లక్ష్మీ దేవి కటాక్షానికి పాత్రుడవయినావన్నమాట..''

ఆ మాటలకి రాజారాం గర్వంగా నవ్వుతాడు..

''ఏదో మీ దయ పూజారి గారూ.. ఆ.. అన్నట్టూ చెప్పడం మరిచాను.. ఇదిగో ఈవిడ పేరు సావిత్రి.. ఈరోజు నుండి మీకు హారతి సమయానికి కావలసిన ఏర్పాట్లు చేయడానికి మీకు సాయంగా ఉంటుంది..''

తనకి వెనకగా నిలబడి ఉన్న సావిత్రిని చూపిస్తూ అంటాడు క్లీనింగ్ హెడ్.. పూజారి ఆవిడ వంక చూస్తాడు..

అతని ముఖం లో ఆశ్చర్యం.. సావిత్రి ముఖం లో తెచ్చిపెట్టుకున్న చిరునవ్వు కనిపిస్తుంటుంది.. పూజారిని చూస్తూ అతివినయంతో కూడిన నమస్కారం చేస్తుంది.. ఆవిడని చూడగానే పూజారిలో ఒక విధమైన ఏహ్యాభావం కలుగుతుంది..

''అదేమిటండీ.. ఈ మందిరంలో పని చేయడానికి శారదమ్మ గారు ఉన్నారు కదా.. మళ్ళీ కొత్తగా ఈవిడ ఎందుకు..?''

పూజారి ఆశ్చర్యంగా క్లీనింగ్ హెడ్ రాజారాం వంక చూస్తాడు.. పూజారి మాటలకి రాజారాం ముఖం లో కాస్తంత చిరాకు కనిపిస్తుంది..

''ఆ..ఆ.. ఉంది.. ఊరేదో, పేరేదో తెలియని ఒక అనామకురాలిని తీసుకువచ్చి ఈ గుళ్ళో పెట్టారు.. రేపు ఆవిడ వల్ల గుడికి ఏదయినా అపరాధం సంభవిస్తే ఆ తర్వాత బాధపడేది మనమే.. ఈ మందిరం కమిటీ మెంబర్‌గానే కాకుండా ఈ మందిరం క్లీనింగ్ హెడ్‌గా ఆవిడ వల్ల ఏదయినా పొరపాటు జరిగితే నేను బాధ్యత వహించాల్సి వస్తుంది.. అందుకే దిక్కూ మొక్కూ లేని ఆవిడని దూరంగా ఉంచాలని నిర్ణయించుకున్నాను.. ఇకనుండి నాకు పరిచయం ఉన్న ఈ సావిత్రి గారే ఈ గుడిలో అన్ని పనులూ  చేసుకుంటుంది.. కావాలంటే శారదని  భక్తులు  ప్రసాదాలు  తిని పారేసిన చెత్తా చెదారాన్ని శుభ్రపరిచేందుకు ఉపయోగించుకుందాం.. మూడు పూటలా తిండి తింటూ ఓ మూలాన పడి ఉంటుంది...'' చిరాగ్గా అంటాడు రాజారాం.

శారదని చులకనగా చేసి మాట్లాడటంతో పూజారికి కోపం వస్తుంది..

''అదేమిటండీ.. అలా మాట్లాడతారు.. శారదమ్మ వచ్చిన దగ్గరనుండి సాయినాధుడి సేవలో నిరంతరం ఎంతో శ్రమిస్తున్న విషయం  మీకు తెలియనిది కాదు.. ఆవిడ చేసే పనిలో సేవాభావం తప్ప దానికి ప్రతిగా ఏదో ఆశించాలన్న తపన ఆమెలో కనిపించడం లేదు.. అలాంటావిడ ఈ మందిరానికి ఏదో ద్రోహం తలపెడుతుందని అనటం  తప్పు..''

''ఆ..ఆ.. అందరూ నా నిర్ణయానికి విరుద్ధంగా మాట్లాడేవారే కానీ.. నన్ను సమర్థించేవారు ఎవరూ లేకపోయారు..

అసలు ఆ రోజు నేను ఈ మందిరంలో పనికి కుదర్చు కోవడానికి ఈవిడని పంపించాను.. కానీ.. ఎక్కడి నుండి వచ్చిందో ఆ మహాతల్లి.. నేను ఎంతో కష్టపడి ఈవిడని ఇక్కడ పనిచేసేందుకు ఒప్పించాను.. తీరా ఈవిడని కాదని ఊరూ పేరూ లేని ఆవిడని పనిలో కుదుర్చుకున్నారు.. ఆరోజు నేను గుడికి రాకపోవడం వల్ల ఈ తప్పిదం జరిగింది.. ఇప్పటికయినా మించిపోయిందేమీ లేదు.. ఈ సావిత్రి గారిని ఈ గుళ్లో అన్ని పనులూ చేయించటానికి ఈ మందిరం క్లీనింగ్ హెడ్ హోదాలో కుదుర్చుతున్నాను..'' గంభీరంగా అంటాడు.

''మరి.. శారదమ్మ గారూ..''

''ఆవిడని గుళ్ళోనుండి తరమివేయాలని నేనేమీ అనడం లేదు.. ఈ సావిత్రి ఏది చెబితే అది చేసి పెడుతుంది..''అంటే శారదమ్మ గుళ్లోకి రాకపోవడానికి కారణం ఇతగాడన్నమాట.. పాపం.. మనసులో భగవన్నామస్మరణ తప్ప మరోటి ఎరుగని ఆ మహాతల్లిని తప్పించి, తన చెప్పుచేతల్లో ఉండే ఈవిడని పెట్టుకోవడానికి ప్లాన్ వేసాడా..!

అందుకే శారదమ్మ రాలేదా.. ఈ విషయాన్ని మేనేజరు గారికి చెప్పాలి..'' శారదమ్మ రాకపోవడానికి కారణం ఇదన్నమాట.. అని మనసులోనే అనుకుంటాడు.

''సరే.. సరే.. నాకు హారతికి టైం అవుతుంది..''

అంటూ సాయిబాబా విగ్రహాన్ని పూలమాలలతో అలంకరించటం లో  నిమగ్నమైపోతాడు పూజారి..

రాజారాం శ్యామల  వంక చూస్తాడు.. ఇద్దరి మొహాల్లోనూ చిరునవ్వు కదలాడుతుంది..

ఆ తర్వాత మధ్యాహ్న హారతి ప్రారంభం కావడంతో భక్తులతో పాటు, వారిద్దరూ కూడా హారతిలో పాలు పంచుకుంటారు.

..................................

సాయిబాబా మధ్యాహ్న హారతి అయిపోవడంతో భక్తులందరికీ పూజారి తీర్థ ప్రసాదాలు అందిస్తాడు.. భక్తులందరూ ఒక వరుస క్రమంలో నిలబడి తీర్థ ప్రసాదాలు స్వీకరించి మందిరం నుండి బయటికి వెళుతుంటారు..

రాజారాం, సావిత్రి కూడా తీర్థ ప్రసాదాలు తీసుకుని అక్కడి నుండి మందిరం బయటికి వస్తారు.. ఆ మందిరం కుడి వైపున కొబ్బరికాయలు అమ్మే నాలుగు చక్రాల బండి ప్రక్కన కూర్చుని ఉంటుంది శారద.. కొబ్బరి కాయలు అమ్మే వ్యక్తి అభ్యర్థించడంతో కొబ్బరికాయ పీచుని తీస్తూ కనిపిస్తుంది...

శారదని రాజారాం, సావిత్రి ఇద్దరూ చూస్తారు.. ఆ తర్వాత ఒకరి మొహాలొకరు చూసుకుంటారు.. ఇద్దరూ కలిసి శారద దగ్గరికి వస్తారు..

కొబ్బరి పీచుని తీయడంలో బిజీగా ఉన్న శారద వారిని చూసి చేసే పనిని ఆపుతుంది.. రాజారాం వంక నొసలు ముడివేసి చూస్తుంది..

''ఇక్కడేం చేస్తున్నావ్..!'' రాజారాం గొంతులో అధికారం ధ్వనిస్తుంది..

అతని మాటకి శారద చివ్వున తలెత్తి అతని వంక చూస్తుంది.. రాజారాం గొంతులో అధికార దర్పం వినిపించడంతో శారద అతని వంక సీరియస్‌గా చూస్తుంది..

రాజారాం ఆమె చూపుని పట్టించుకోకుండా..''ఇలా కొబ్బరి పీచు తీస్తూ కూర్చుంటే గుళ్ళో పని ఎవరు చేస్తారు..? గుడిముందు కొబ్బరి కాయలు అమ్ముకునే వారికి పని చేసి పెట్టడానికి కాదు నిన్నిక్కడ నియమించింది.. నీకు రోజూ ముప్పూటలా తిండిపెట్టేది ఇతను కాదు..

అది గుర్తుంచుకుని ప్రవర్తించు..''

అతని మాటలు సూటిగా ఆమె మనసుకి తాకాయి.. ఆమె ముఖం లో కోపం ప్రవేశించింది.. తనపై ఆజమాయిషి చెలాయించడానికి ఇతనెవ్వరూ.. అని మనసులో అనుకుంటుంది..

రాజారాం కూడా ఆమె వైపు కోపంగా చూస్తూంటాడు.. అతని పక్కనే నిలబడి ఉన్న సావిత్రిపై శారద దృష్టి పడుతుంది.. ఆవిడని చూడగానే తాను వచ్చిన మొదట్లో తనతో పాటు ఉన్న ఆవిడే అని గుర్తు పడుతుంది శారద..

ఆవిడని అక్కడ చూడటంతో శారద నొసలు ముడి పడుతాయి.. అలాగే సావిత్రి కూడా శారదని చూస్తూంటుంది.. ఆ చూపులో శారదపై అసూయ ద్వేషం కనిపిస్తుంటాయి..

''సరె.. సరె.. ఇదిగో ఇకనుండి ఈవిడ నీకు బాస్.. నువ్వు ఈ గుళ్లో ఏం పనులు చేయాలన్నా ఈవిడ పర్మిషన్ తీసుకుని చేయాలి.. ఈవిడ ఏం చెబితే అది చేయడం నీ పని.. కాదూ కూడదు అని అంటే ఇక ఆ రోజే నీకు ఈ గుళ్ళో ఉండడానికి చివరి రోజు అవుతుంది.. వింటున్నావా..'' అజమాయిషీగా అంటాడు రాజారాం.

అతని గొంతు కరుకుగా వినిపిస్తుంది.. అతని మాటలు శారద మనసుకి శూలాల్లా గుచ్చుకుంటుంటాయి.. ఆమె ముఖం లో ఆవేశం కదలాడుతుంది.. ఆ వెంటనే తాను ఏమీ చేయలేని నిస్సహాయురాలినన్న స్పృహ కలగగానే ఆమె ముఖం లో నిరాశ ప్రవేశిస్తుంది.. శారద ముఖం లో నిరాశ, నిస్పృహ కలిగిన భావాలు కదలాడుతాయి.

అతను అన్న మాటలకి ఏమీ సమాధానం చెప్పకుండా తలదించుకుంటుంది శారద.. ఆమె మౌనంగా ఉండడంతో రాజారాంకి మరింత కోపం వస్తుంది.. అతను సావిత్రి వంక చూస్తాడు.. సావిత్రి ముఖం లో శారదపై అసూయ ద్వేషాలు కనిపిస్తూంటాయి.. సావిత్రి క్లీనింగ్ రాజారాం వంక చూసి సైగ చేస్తుంది.. శారదని ఇంకా ఏదన్నా అనమన్నట్టు.. సరే అన్నట్టు తల ఊపి తిరిగి శారద వైపు చూస్తాడు రాజారాం.

''ఇదిగో నిన్నే .. ఈవిడ ఏం చెబితే అది చేయడం ఇక నుండి నీ పని.. అర్థమయింది కదా..'' గంభీరంగా అంటాడు. క్లీనింగ్ హెడ్ సావిత్రి వంక చూస్తాడు.. సావిత్రి కళ్ళలో అనంతమైన

తృప్తి కలుగుతుంది.. సావిత్రి శారద వంక చూస్తుంది.. ఆమె ముఖం లో శారదపై ప్రతీకారం తీర్చుకున్నానన్న భావన కదలాడుతుంది.

‘‘హమ్మా.. నాకు దక్కే పనిని చేజిక్కించుకుని  గుళ్ళో తిష్టవేస్తావా..! నాకు దొరకాల్సిన పనిని తన్నుకుపోయినందుకు నీమీద అంతకంతకు నా పగని తీర్చుకుంటాను.. ఇక నుండి నువ్వు నా దాసివి.. నిన్ను ఒక చోట కూర్చోనీయకుండ, నిలబడనీయకుండా పనిని కల్పిస్తూ నా కసిని తీర్చుకుంటాను..’’ మనసులోనే కసిగా, కోపంగా అనుకుంటుంది సావిత్రి.‘‘ఆ.. సావిత్రి గారూ.. ఇక నుండి ఈవిడకి నువ్వు పని పురమాయించాలి.. నువ్వు ఏ పని చెప్పినా చేస్తూంది.. చేస్తూంది కాదు, చెయ్యాలి.. అది నా ఆజ్ఞ.. ఒక వేళ  మీరు ఏదయినా పని చెబితే ఆ పని చేయనని గానీ ఈవిడ అంటే వెంటనే నాకు తెలియజేయండి.. ఆ తర్వాత సంగతి నేను చూసుకుంటాను..’’ అధికారదర్పంతో అంటాడు.

శారద ముఖంలో కన్నీళ్ళు సుడులు  తిరుగుతుంటాయి ఆమె మనసులో ఎంతో బాధ కలుగుతుంది..

‘‘సాయినాధా.. నేనేమి ద్రోహం చేసాను తండ్రీ.. నా పట్ల ఇంత దయ కూడా చూపడం లేదు.. నీకు చేసే సేవలో ఎంతో తృప్తిని పొందుతున్న నాకు వీరిద్దరి రూపంలో చెక్ పెట్టావా తండ్రీ.. అయినా వీరికి నేను ఏమి అపకారంచేసాను..

నాపై వీరు ప్రతీకార చర్యకు పూనుకుంటున్నారని అర్థం అవుతున్నా ఏమీ చేయలేని పరిస్థితిలో నన్ను పడేశావు కద తండ్రీ..’’ మనసులోనే దేవుడిని ప్రార్థించుకుంటూ రోదిస్తుంది శారద.. రాజారాం, సావిత్రి ఇద్దరూ అక్కడి నుండి వెళ్ళిపోతారు. వారు శారదతో మాట్లాడటం, ఆమెని హెచ్చరించడం అంతా కొద్ది దూరంలో నిలబడి ఉన్న మేనేజర్ గోపాల్ గమనిస్తూనే ఉంటాడు..

………………………………

సాయంత్రం సమయం.. సాయంత్రం హారతికి ఇంకా ఒక గంట సమయం ఉంది.. దాంతో సాయిబాబా మందిరంలో భక్తులు  ఎవరూ లేరు.. ఆ మందిరమంతా నిర్మానుష్యంగా ఉంటుంది.. మందిరం పక్కనే ఉన్న శారదకి కేటాయించిన గది బయట శారద మోకాళ్ళు ముడుచుకుని రెండు చేతులూ మోకాలిపై పెట్టుకుని తల ఆనించుకుని కూర్చుని ఉంటుంది..

ఆమె కళ్ళల్లో సన్నని కన్నీటి పొర కనిపిస్తూంటుంది.. ఆమెకి రాజారాం అన్న మాటలు గుర్తుకు వస్తూంటే మనసంతా ముళ్లతో గుచ్చుతున్న బాధ కలుగుతుంటుంది. అవి మరచి పోవాలని ఎంత ప్రయత్నించినా కూడా ఆమె మనసు తిరిగి రాజారాం మాటలనే గుర్తుకు చేస్తుంది. దాంతో ఆమె తీవ్ర మనోవేదనకి గురవుతుంది.

''హు.. తాను ఏ జన్మలో ఏం పాపం చేసిందో.. జీవితంలో అన్నీ కష్టాలే.. ఏదో కాస్త ఈ సాయినాధుడి సేవలో బాధలన్నీ మరిచిపోయి ప్రశాంతంగా గడుపుతున్న సమయంలో ఇలాంటి సంఘటనలు  జరగడం నా దురదృష్టం..

హు.. జీవితంలో ఒకరికి తలవంచి బ్రతకడం ఇష్టం లేకనే కదా.. ఆస్తి, ఐశ్వర్యాలని త్యజించి ఇలాంటి దుర్భర జీవితాన్ని గడుపుతున్నాను.. అలాంటిది ఎవడో తనపై ఆజమాయిషీ చలాయిస్తుంటే ఇంక తాను ఎలా పని చేయగలుగుతుంది..! తన మనసుకి విరుద్దంగా తాను పనిచేయలేదు.. చేయను కూడా..''

శారద కళ్ళల్లో కన్నీళ్ళు కారుతూనే ఉంటాయి.. అంతలోనే శారద ఏదో నిర్ణయం తీసుకున్న దానిలా ఆమె ముఖంలో ఒక విధమైన తెగింపు కదలాడుతుంది..

''ఇక తాను ఇక్కడ ఉండడం కుదరదు.. తన మనసుకి విరుద్దంగా ఒకరి కింద పనిచేయడం అంటూ జరగదు..వీరి సూటిపోటి మాటలు  భరిస్తూ పనిచేసేకంటే ఇక్కడ నుండి వెళ్ళిపోవడమే ఉత్తమం..''

శారద ఒక నిర్ణయానికి వచ్చినదానిలా కూర్చున్నదల్లా లేచి నిబడుతుంది.. తన చీర కొంగుతో కళ్ళనీళ్ళని తుడుచుకుని తన గదిలోకి నడుస్తుంది.. ఆ గదిలో ఓ మూలకి ఉన్న సంచిలో తన బట్టలని సర్దుకుని ఆ గదిలో నుండి బయటికి వస్తుంది..

సంచిని గుండెకి హత్తుకుని మెల్లిగా అడుగులో అడుగు వేసుకుంటూ మందిరం ముఖ ద్వారం వైపు వస్తుంది..

మందిరం లోపల  సాయిబాబా విగ్రహం వైపు ఆమె చూపులు  పడతాయి..

చిరునవ్వు చిందిస్తూ కనిపిస్తున్న సాయిబాబా విగ్రహానికి శారద భక్తిపూర్వకంగా నమస్కరిస్తుంది..

‘‘తండ్రీ సాయినాధా.. ఇంతటితో నీకు సేవచేసే భాగ్యం తీరిపోయింది.. గమ్యం లేని ఈ జీవితానికి నీ ద్వారా ఒక అండ దొరికిందని సంతోషించాను.. కానీ.. ఆ సంతోషం ఎంతో సేపు నిలవ లేదు.. ఇదంతా నా దురదృష్టమే..

నిన్ను వదిలి నేను వెళుతున్నాను  తండ్రీ.. నీ ఆశీస్సులు  నాకు అందించు తండ్రీ.. ఓం సాయి.. శ్రీ సాయి.. జయ జయ సాయి..’’

కళ్ళు మూసుకుని సాయినాధుడిని ప్రార్థిస్తుంది శారద.. మూసుకున్న కనుల చివర నుండి కన్నీళ్ళు రాలుతాయి...

భారంగా అడుగులు  వేస్తూ మెయిన్ గేటు దాటి బయటికి వస్తుంది శారద.. చేతిలో సంచితో బయటికి వెళుతున్న శారదని ఆశ్చర్యంగా చూస్తాడు ఆ గుడి పక్కనే కొబ్బరి కాయలు అమ్ముకునే వ్యక్తి..

కళ్ళల్లో నుండి రాలుతున్న కన్నీటిని బయటికి కనిపించకుండా కొంగుతో తుడుచుకుంటూ అడుగు ముందుకు వేస్తుంది శారద.. ఆమె కొద్ది దూరం అడుగులు  వేసి ఎదురుగా చూస్తుంది..

ఎదురుగా కనిపించిన దృశ్యానికి శారద అవాక్కయిపోతుంది..

ఆమెకి ఎదురుగా మేనేజర్ గోపాల్ నిలబడి ఉంటాడు.. అతని చూపులు ఆమెవైపే నిశ్చలంగా చూస్తుంటాయి...

..........................................

మేనేజర్ గోపాల్ ఆఫీసులో తన సీట్లో కూర్చుని ఉంటాడు. అతని ఎదురుగా మూర్తి, పూజారి కూర్చుని ఉంటారు.. శారద ఒక ప్రక్కగా నిలబడి ఉంటుంది.. ఆమె చేతిలో సంచి ఉంటుంది.. ఆమె చూపులు నేలను చూస్తుంటాయి.. కళ్ళల్లో మాత్రం సన్నటి కన్నీటి పొర కదలాడుతుంటుంది...

''ఏమిటిది శారదమ్మా.. ఎవరో ఏదో అన్నారని, ఇలా మాతో ఎవరికీ చెప్పకుండా అలా వెళ్ళిపోవడం ఏమయినా బావుందా..?

గోపాల్ గొంతులో బాధ ధ్వనిస్తుంది.. అతని మాటలకి శారద మౌనంగా ఉండిపోతుంది.. ఆమె నుండి ఎలాంటి సమాధానం రాదు.. గోపాల్, మూర్తి, పూజారి చూపులు శారదపైనే ఉంటాయి..

''శారదమ్మా.. నీ గురించి మాకు తెలియదా ఏమిటి..? ఈ మందిరంలోకి నువ్వు వచ్చినప్పటి నుండి నిస్వార్థంగా ఆ సాయినాధున్ని సేవిస్తున్నావు కదా.. అలాంటిది.. నిన్ను ఇక్కడి నుండి మేము ఎలా పంపిస్తామనుకున్నావు.. మా సంగతి సరే.. ఆ సాయినాధుడు నిన్ను ఎలా వదులు కుంటాడనుకున్నావు..? ప్రేమగా అన్నాడు మూర్తి.

మూర్తి మాటలకి కూడా శారద మౌనంగానే ఉండిపోయింది.

''శారదమ్మ గుడిని వదిలి వెళ్ళిపోవాలనుకోవడానికి కారణం ఆ క్లీనింగ్ హెడ్ రాజారాం. అతను శారదమ్మపై పగని పెంచుకున్నాడు..''

ఆ మాటలకి గోపాల్, మూర్తి ఇద్దరూ పూజారి వంక చూస్తారు..

''అవునండీ..! ఈరోజు మధ్యాహ్నం హారతి సమయానికి అతను గుళ్ళోకి వచ్చాడు.. అతనితో పాటు ఓ మహిళ కూడా వచ్చింది.. ఆవిడ పేరు సావిత్రి అని చెప్పాడు.. ఆవిడెవరో కాదు.. శారదమ్మ ఈ గుడికి వచ్చిన రోజున ఆవిడ కూడా వచ్చింది.. క్లీనింగ్ హెడ్ ఆవిడని గుళ్ళో పనికోసం పంపించాడు.. కానీ మీరు ఆవిడని కాకుండా శారదమ్మని గుళ్ళో నియమించుకోవడంతో ఆ క్లీనింగ్ హెడ్ రాజారాం శారదమ్మపై పగ పెంచుకున్నాడని శారదపై అతను అనుచరిస్తున్న విధానాన్ని బట్టి ఇప్పుడు అర్థమవుతుంది..''

అతని మాటలకి మేనేజర్ గోపాల్ తలపంకించాడు.. మూర్తి కూడా పూజారి వంక ఆసక్తిగా చూస్తూంటాడు..

''ఈ గుడికి క్లీనింగ్ హెడ్‌గా తాను ఇక నుండి శ్యామలని గుడిలో పనికి కుదురుస్తున్నానని, శారదమ్మ ఊరూ, పేరు లేనిదని, ఆవిడని నమ్ముకోవద్దని కూడా అన్నాడు..''

పూజారి మాటలకు మూర్తి, గోపాల్ ఇద్దరూ శారద వైపు చూసారు.. ఆమె మౌనంగా వారి మాటలు  వింటుంది..

" అసలు అతనికి శారదమ్మపై ఇంత కోపం ఎందుకో అర్థం కావడం లేదు.. శారదమ్మ ఒకరి జోలికి పోకుండా తన  పనేదో తాను చేసుకుపోతుంది  కదా.. అయినా అతనికి ఈమెపై ఎందుకింత కోపం..  ఈ  మధ్య  నాతో శారదమ్మ ఆదివారం నాడు పిల్లలకి బోధనలు చేయడం కొందరు పిల్లల తల్లితండ్రులకు నచ్చడం లేదని అన్నాడు..

అంట్లు తోముకునే ఆవిడ ఆధ్యాత్మిక విషయాలు  చెప్పడమేమిటని వారు అన్నారని, శారద బోధనలు  చేస్తే తమ పిల్లలను గుడికి పంపించమని అతనితో అన్నారని నాతో చెప్పాడు..'' అన్నాడు మూర్తి.

''హు.. ఇది ఎవరో పిల్లల తల్లిదండ్రుల  అభిప్రాయం కాదండి.. అసలు శారదమ్మ బోధనలు చేయడం అతగాడికే నచ్చడం లేదు.. అందుకే మరొకరిపై నెపం మోపి తన అభిప్రాయాన్ని ఆ విధంగా చెప్పాడు.. ఆ సమయంలో నేను కూడా ఉన్నాను..''

శారద వారి మాటలని మౌనంగా వింటుంది..

''సాయినాథా.. నేను అతనికి ఏమి ద్రోహం చేసాను తండ్రీ.. నాపై అతను పగ పెంచుకోవడం ఏమిటి..? నీ సేవ చేసుకునే భాగ్యం కలిగిందన్న ధ్యాసే తప్ప మరొకరి గురించి ఆలోచించడం, వారికి ద్రోహం తలపెట్టాలన్న తలంపు నాలో ఏకోశానా లేదు కదా.. మరి ఎందుకిలా అతను నాపై కక్ష కట్టాడు..'' శారద మనసు మౌనంగా రోదిస్తుంది..

ఆమె కళ్ళల్లోనుండి కన్నీళ్ళు జలజలా రాలాయి.. ఆ కన్నీళ్ళు అక్కడ కూర్చున్న ఆ ముగ్గురికీ కనిపించనీయకుండా తన చీర కొంగుతో తుడుచుకుంది..

''ఈరోజు ఉదయం శారదమ్మ గుడిలోపలికి రాలేదంటే ఖచ్చితంగా అతగాడే శారదమ్మ మనసు నొప్పించే మాటలు మాట్లాడి ఉన్నాడన్న అనుమానం నాకు కలిగింది.. ఈ రోజు మధ్యాహ్నం హారతి తర్వాత అతను, అతనితో పాటు వచ్చిన మహిళ ఇద్దరూ శారదమ్మతో మాట్లాడటం నేను గమనించాను.. వారి మాటలతో శారదమ్మ ఎంతో బాధ అనుభవించారని ఆవిడ మొఖాన్ని చూడగానే అర్థమయింది. తన జీవితంలో ఎన్నో కష్ట నష్టాలను ఓర్చిన ఆవిడ అన్నింటినీ వదిలి ఒంటరిగానైనా బ్రతకాలని నిర్ణయించుకుందంటేనే ఆమె వ్యక్తిత్వం ఎలాంటిదో నాకర్థమయింది..

ఆమె జీవితంలో అన్నింటినీ కోల్పోయినా ఆమె వ్యక్తిత్వాన్ని మాత్రం కోల్పోలేదు.. నా అభిప్రాయం నిజమే అయితే ఆమె ఈ గుడిని వదిలి వెళ్ళిపోతుందని అనుకున్నాను.. నేను అనుకున్నదే జరిగింది.''

శారదమ్మ వైపు అభిమానంగా చూస్తూ అన్నాడు గోపాల్.. మూర్తి, పూజారి ఇద్దరూ శారదవైపు జాలిగా చూశారు.. అయినప్పటికీ శారద ఏమీ మాట్లాడలేదు.. మౌనంగా వారి మాటలని వింటుంది..

''అయినా ఈ ఆలయ మేనేజర్ మీరు కదా.. అతగాడెవరో మహిళని తీసుకుని వచ్చి ఆవిడ గుడిలో పని చేస్తుందని చెబితే అయిపోతుందా.. దానికి మీ అనుమతి తీసుకోవాలి కదా..''

మూర్తి శారద వైపు తిరుగుతాడు..

''అయినా శారదమ్మ.. నీకు కూడా తెలుసు కదా.. ఈ ఆలయానికి మేనేజర్ గోపాల్ గారని, ఈ గుడిలో  ఎవరినయినా పనికి కుదుర్చాలన్నా, పనిలోనుండి తీసివేయాలన్నా ఆ అధికారం గోపాల్ గారికే కదా ఉంది. అతగాడెవరో మిమ్మల్ని ఏదో అన్నారని మనసంతా పాడు చేసుకుని ఈ గుడినే వదిలి వెళ్లిపోవడానికి సిద్ధపడ్డావు..''

మూర్తి మాటలకి కూడా శారద ఏమీ మాట్లాడకుండా మౌనంగా ఉండిపోయింది.. మేనేజర్ గోపాల్ పెదాలపై చిన్న నవ్వు ప్రత్యక్షమయింది..''అవును కదా శారదమ్మా.. నువ్వు ఈ గుళ్ళో గోపాల్ గారు చెప్పే పనులు చేయాలి, ఎవరయినా నీకు ఇబ్బంది కలిగిస్తే గోపాల్ గారికి చెప్పాలి. అంతే కానీ ఇలా వెళ్ళిపోవడం ఏమాత్రం తగదు.. చూడు శారదమ్మా.. నీ గురించి ఈ ఆలయ మెంబర్లందరికీ సదభిప్రాయం ఉంది.. నిజాయితీగా నీవు చేస్తున్న పని, పిల్లలకి నీవు చేస్తున్న ఆధ్యాత్మిక బోధనలు అందరినీ ఆకట్టుకుంటున్నాయి.. మా అందరికీ నీపై అభిమానం ఉన్నప్పుడు అతగాడి మాటలని నువ్వు పట్టించుకోవాల్సిన అవసరం ఏముంది చెప్పు..'' అనునయంగా అన్నాడు పూజారి.

గోపాల్, మూర్తి శారదమ్మ వంక చూసారు.. అయినా శారదమ్మ మౌనంగానే ఉండిపోయింది..

''చూడు శారదమ్మ.. ఈ గుడిలో ఎవరినయినా తీసివేయాలన్న, మరెవరినయినా నియమించాలన్నా  ఆలయ కమిటీ నిర్ణయిస్తుంది.. ఆ నిర్ణయాన్ని మేనేజర్ గోపాల్ గారు అమలు పరుస్తారు. ఈ విషయాన్ని నువ్వు గుర్తు పెట్టుకో.. ఏమంటారు గోపాల్ గారు..'' అంటూ మూర్తి గోపాల్ వంక చూస్తాడు. గోపాల్ అవునన్నట్టు తలూపుతాడు.

ఆ తర్వాత గోపాల్ శారద వంక చూస్తాడు..

‘‘శారదమ్మా.. నువ్వు ఇక్కడి నుండి వెళ్లిపోవాల్సిన పనిలేదు.. అతగాడెవరో చెప్పాడని, ఏదో అన్నాడని మనసుని పాడు చేసుకోకుండా ఈ రోజుకి విశ్రాంతి తీసుకో.. రేపు గురువారం.. గుడికి భక్తులు అధిక సంఖ్యలో వస్తారు..

ఎప్పటి మాదిరిగానే నువ్వు సాయినాధుడి సేవలో తరించు.. ఇంతకు ముందులాగానే ఉదయం హారతికి అన్ని ఏర్పాట్లు చేయాల్సింది నువ్వే.. ఎవరయినా నిన్ను ఏమన్నా అంటే ఆ సమయానికి మూర్తిగారు, పూజారి గారు ఉంటారు..

వాళ్ళే చూసుకుంటారు..’’

గోపాల్ మాటలకి కూడా శారద మౌనమే సమాధానమయింది..

మూర్తి, పూజారి, గోపాల్ ముగ్గురూ ఆవిడ ఏం సమాధానం చెబుతుందా అని ఎదురు చూస్తున్నారు..

తలదించుకొని ఉన్న శారద మెల్లిగా తలెత్తి వారి ముగ్గురి వంక చూస్తుంది.. ఆమె కళ్ళల్లో సన్నటి కన్నీటి పొర.. ముఖం పై చిరు ఆనందం కదలాడుతుంది..

ఆమె నోట్లోనుండి మాటలు బయటికి రావు.. కానీ.. రెండు చేతులతో మేనేజర్ గోపాల్‌కి నమస్కరించి అక్కడి నుండి తన గదివైపు అడుగులు వేస్తుంది..

................................

ఉదయం సాయిబాబా హారతి సమయం దగ్గర పడుతుంది.. శారద సాయిబాబా విగ్రహం దగ్గర ఎంతో ఉత్సాహంతోనూ, భక్తి శ్రద్దలతోనూ హారతికి కావలసిన ఏర్పాట్లని చూస్తుంటుంది.. విగ్రహం చుట్టు పక్కల  శుభ్రంగా తడిగుడ్డతో తుడుస్తుంది.. హారతి పళ్ళాన్ని,  తీర్థ ప్రసాదాల  గిన్నెలని, దీపాలంకారణ చేసే దీపాలని అన్నింటినీ పరిశుభ్రం చేస్తుంది..

అంతలోనే అక్కడికి పూజారి వస్తాడు. ఎంతో ఉత్సాహంగా పని చేస్తున్న శారదమ్మని గమనించిన పూజారి ఎంతో సంతోషపడతాడు.

''సాయిరాం శారదమ్మా.. ఈరోజు చాలా ఉత్సాహంగా ఉన్నావు..''

ఆ మాటలకి  శారద పూజారి వైపు తిరిగి చిన్నగా నవ్వుతుంది..

''శారదమ్మా.. మళ్ళీ ఈ గుడికి కళని తీసుకువచ్చావు.. సాయినాధుడికి సేవ చేయాలని నీకు రాసిపెట్టి ఉంటే.. నువ్వు ఎక్కడికి వెళ్ళాలనుకున్నా వెళ్ళలేవని అర్ధమయింది కదా..'' తన ఒంటిపై నున్న షర్ట్‌ని విప్పుతూ నవ్వుతూ అంటాడు పూజారి.

శారద పూజారి మాటలకి నవ్వుతూనే హారతికి కావలసిన ఏర్పాట్లని చేస్తూ ఉంటుంది..

అంతలోనే అక్కడికి సావిత్రి కూడా వస్తోంది.. సావిత్రి గుడిలో అడుగు పెట్టగానే శారదని చూసి షాకై పోతుంది..

ఆమె కళ్ళు ఎరుపెక్కుతాయి.. ముక్కుపుటాలు అదురుతుంటాయి.. శారదపై కోపంతో రగిలిపోతుంటుంది.. శారదని అక్కడ చూడడంతో గుమ్మం దగ్గరే ఆగి ఉంటుంది సావిత్రి. శారద తన పని చేసుకుంటూ యధాలాపంగా గుమ్మం వైపు చూస్తుంది శారద. గుమ్మం దగ్గర సావిత్రి నిలబడటం గమనించి చేస్తున్న పనిని ఆపి ఆమె వంకే చూస్తుంది.. కానీ ఆమె ముఖం లో భయం కానీ, టెన్షన్ కానీ ఏమీ కనిపించవు.. శారద ముఖంలో చిరునవ్వు చెదిరిపోదు.. కానీ సావిత్రి మాత్రం కోపంతో రగిలిపోతుంటుంది.. కొద్ది క్షణాలు చేస్తున్న పని  ఆపేసి చూసిన శారద తిరిగి తన పనిలో నిమగ్నయిపోతుంది.. అసలు సావిత్రిని ఏమాత్రం పట్టించుకోకుండా తన పనేదో తాను చేసుకుపోతుంది.

దాంతో సావిత్రికి మరింత కోపం వస్తుంది.. ఆమె కళ్ళల్లో ఎరుపు జీరలు అలముకుంటాయి.. కోపంతో తన రెండు చేతులని కసిగా నలుపుకుంటుంది...

సరిగ్గా అప్పుడే మూర్తి గుళ్లోకి వస్తాడు.. గుమ్మం వద్దే నిలబడి శారదవైపు గుర్రుగా చూస్తున్న సావిత్రిని చూస్తూ లోనికి వెళ్తాడు మూర్తి.

''శారదమ్మా.. ఇదిగో సాయినాధుడికి నైవేద్యానికి ప్రసాదం తీసుకువచ్చాను..'' తన చేతిలో ఉన్న ఓ చేతి సంచిని శారదకి అందిస్తాడు మూర్తి. ఆ బ్యాగ్‌లో ఓ బాక్స్‌ని బయటికి తీస్తుంది.. ఆ బాక్స్‌లో వేడి వేడి పాయసం ఉంటుంది.. ఆ పాయసంలో నుండి కొంత తీసి హారతి అయ్యాక సాయినాధుడికి నైవేద్యం పెట్టేందుకు ఓ ప్రత్యేకమైన పాత్రలో పెడుతుంది శారద. మూర్తిగారు సాయినాధునికి భక్తితో నమస్కరించి ఓ పక్కన వినయంగా నిలబడి ఉంటాడు.. అతని తర్వాత

ఒక్కొక్కరే భక్తులు రావడం ప్రారంభిస్తారు.. తనని అసలు  పట్టించుకోకుండా శారద తన పని తాను చేసుకుపోతుండటంతో సావిత్రి ముఖం లో రౌద్రం కనిపిస్తుంటుంది..

.......................................

సాయిబాబా మందిరం ఆవరణలోకి సావిత్రి వస్తుంది. ఆమె ముఖంలో కోపంతో కూడిన ఎక్స్‌ప్రెషన్స్.. గుడి లోపల పూజారి, మూర్తి, శారద ముగ్గురూ అసలు  తనని చూసినా ఏమీ పట్టనట్లు ఉండడంతో ఆమె శరీరం కోపంతో రగిలిపోతుంటుంది.

''హూ.. ఆ పూజారికి ఎంత పొగరు.. క్రితం రోజు రాజారాం తనని పూజారికి పరిచయం చేసాడు.. ఈరోజు నుండి గుడి పనులన్నీ తానే చేస్తానని  కూడా చెప్పాడు. రాజారాం తనని పరిచయం  చేసినప్పుడు చిరునవ్వుతో పలకరించిన పూజారి, ఈరోజు మాత్రం అసలు తననెప్పుడూ చూడనట్టు నటిస్తాడా.. ఎంత అవమానం.. అర్జెంటుగా ఈ విషయాన్ని రాజారాంతో చెప్పి, శారదని, శారదతో పాటు ఆ పూజారిని కూడా గుడిలోనుండి బయటికి గెంటించివేస్తే గానీ నా కోపం చల్లారదు..''

అనుకుంటూ తన చేతిలో ఉన్న సెల్‌ఫోన్ బటన్‌ని ప్రెస్ చేసి ఫోన్ చెవికి ఆనించుకుంటుంది. సావిత్రి కళ్లల్లో ఎరుపు జీరలు అలముకుంటాయి.. కోపంతో ఆమె ముక్కుపుటాలు

అదురుతుంటాయి.. ఫోన్ రింగవకుండా బిజీ టోన్ వినిపించడంతో ఎంతో అసహనానికి గురవుతుంది సావిత్రి.

ఫోన్ కట్ చేసి మళ్లీ డయల్ చేసి చెవికి ఆనించుకుంటుంది సావిత్రి. ఈసారి ఫోన్ రింగవడంతో కాస్తంత ఊపిరితీసుకుంటుంది.. అవతలి నుండి రాజారాం ఫోన్ లిఫ్ట్ చేస్తాడు.

''ఆ.. సావిత్రి.. ఏమిటి సంగతి.. గుడిలో పనులు ఎలా జరుగుతున్నాయి..?''

సావిత్రి వాయిస్..

''ఆ.. బాగానే జరుగుతున్నాయి.. కానీ చేసేది నేను కాదు.. నేను గుడికి చేరుకునే సరికి ఆ రాక్షసి శారద అన్ని పనులూ చేసేసింది.. ఇంక చేయడానికి నాకు పనులేమీ మిగల్లేదు..''

''ఏమిటీ.. శారద పని చేస్తుందా.. దానికి ఎంత ధైర్యం.. అయినా నేను నిన్ననే కదా పూజారికి చెప్పాను..

ఈరోజు నుండి నువ్వే గుడి పనులన్నీ చేస్తావని..'' రాజారాం కోపంగా అంటాడు.

''ఆ.. చెప్పావులే.. నువ్వు చెప్పిన మాటలని ఆ పూజారి గాలికొదిలేసాడు.. అసలు నేను గుడిలోకి వెళితే నన్ను గుర్తుపట్టనట్లు నటించాడు.. నిన్ను నమ్ముకుని ఇక్కడికి వచ్చినందుకు ఆ పూజారి చేతిలో అవమానమే తప్ప మరింక నాకు ఒరిగిందేమీ లేదు..'' కోపంతో అంటుంది సావిత్రి.

''ఆ పూజారికి ఎంత ధైర్యం.. నా మాటలనే పట్టించుకోడా..?''

''అవును.. పట్టించుకోలేదు.. ఈ గుడిలో నువ్వేం చెప్పినా చెల్లుతుందని పేద్ద గొప్పులు చెప్పావు కదా.. ఇప్పుడేం జరిగిందో చూడు.. నిన్ను నమ్ముకున్నందుకు నాకు తగిన శాస్తే జరిగింది..'' కోపంతో ఆమె ముక్కు పుటాలు అదురుతుంటాయి.

''అబ్బా.. సావిత్రీ.. ఇప్పుడేం జరిగిందనీ.. ఆ పూజారికి ఎలా బుద్ధి చెప్పాలో నాకు తెలుసు కానీ.. నేను ఒక రెండు గంటల్లో గుడికి వస్తాను.. నేను వచ్చే వరకు నువ్వు అక్కడే ఉండు..''

''ఆ.. ఇంత అవమానం జరిగాక ఇంకా ఇక్కడ ఎలా ఉండమంటావు.. గుళ్ళో పనులన్నీ ఆ శారద చేస్తూంటే ఆమెని చూస్తూ కూర్చోమంటావా.. ఆ మహాతల్లిని ఈ గుళ్ళో నుండి పంపించి వేస్తే గానీ నా కోపం తగ్గదు.. నువ్వేం చేస్తావో నాకు తెలియదు.. ఆ శారదని ఈ గుళ్లో నుండి బయటికి గెంటేస్తేనే గానీ నేను ఇక్కడ అడుగుపెట్టను..''

''సావిత్రీ.. అనవసరంగా కంగారుపడకు.. నా మాట విను.. నువ్వు గుళ్ళో ఉండడం నీకెంత ముఖ్యమో, నాకూ అంతే ముఖ్యం.. త్వరలోనే ఆ సాయిబాబా మందిరం పది సంవత్సరాలు పూర్తి చేసుకుంటుండడంతో ఘనంగా ఉత్సవాలు చేయడానికి ఆలయ కమిటీ రెడీ అవుతుంది.. ఆ ఉత్సవాల కారణంగా మనం ఎంతో కొంత సొమ్మును వెనకేసుకోవచ్చు.. ఆ వెధవ పూజారి మాటలను పట్టించుకుని నువ్వు అనవసరంగా కోపం తెచ్చుకోకు..''

''నీకేమిటీ.. నువ్వెన్నయినా చెబుతావు.. నాలాగా నీకు అవమానం జరిగితే తెలిసేది నా బాధ..''

''సరే.. సరే.. ఈ సారికి నేను చెప్పినట్టు చేయి.. త్వరలోనే నువ్వు కోరిన విధంగా ఆ శారదని గుళ్లో నుండి తరిమేసేలా ప్లాను చేస్తాను..''

''ఊ.. మాటలు మాత్రం కోతలు దాటుతాయి.. చేసే పనిలో మాత్రం సత్తా ఉండదు..'' దెప్పి పొడుస్తున్నట్టుగా అంటుంది సావిత్రి..

''అబ్బా.. సావిత్రి. నీ దెప్పి పొడుపు మాటలు కట్టిపెట్టి నేను చెప్పినట్టు చేయి.. ఆ శారదకి మేనేజరు గోపాల్ గారి సపోర్టు ఉంది.. ఆయన సపోర్టు ఉన్నంతవరకూ ఆ శారదని గుడిలోనుండి బయటికి పంపించలేం.. చూస్తూ ఉండు.. ఆ మేనేజరు గోపాలే శారదని మెడపట్టి గుడి బయటికి తరిమేసేలా పథకం రెడీ చేస్తాను..

''ఊ.. ఆ చేసేదేదో తొందరగా చేయి.. ఆ శారదని చూస్తూంటే ఒళ్లంతా మంట పుడుతుంది నాకు..'' కసిగా అంటుంది సావిత్రి.''సరే.. సరే.. నువ్వు నేను చెప్పినట్టు చేయి.. ''

అంటూ రాజారాం ఫోనులో సావిత్రికి ఏవో సూచనలు  చేస్తూంటే, సావిత్రి ముఖం లో క్రూరమైన నవ్వు ప్రత్యక్షం అవుతుంది.

…………………………

గుడిలో ఉత్సాహంగా పని చేస్తున్న శారదని చూసి గోపాల్ సంతోషంగా నవ్వుతాడు. ఆమె దగ్గరికి వస్తాడు గోపాల్

‘‘ఏమిటి శారదమ్మా.. ఈరోజు చాలా సంతోషంగా కనిపిస్తున్నావు..’’ పనిచేస్తున్న శారద గోపాల్‌ని చూసి పనిచేయడం ఆపేసి చిన్నగా నవ్వుతుంది..

‘‘సాయినాధుడికి సేవ చేసే భాగ్యం లభించటం సంతోషమే కదండీ.. నా ఈ జీవితంలో నేనెంతగానో సంతృప్తి పొందుతున్న క్షణాలు ఈ గుడిలో గడుపుతున్నవే..’’

‘‘సాయినాధుడి అనుగ్రహం  పొందితే అలాగే  ఉంటుందమ్మా.. ఇకనుండి  నువ్వేమీ ఇబ్బంది పడకుండా ఆదేవుడికి సేవ చేసి తరించు.. అన్నట్టు ఈ ఆదివారం నాడు పిల్లలకి బోధనలు చేయాల్సింది నువ్వే అది మరిచిపోకు’’

‘‘ఆ బాబా ఆశీర్వాదం ఉన్నన్నాళ్లూ తప్పకుండా చేస్తానండి..’’

‘‘అన్నట్టు.. నీ గతం ఏమిటో తెలుసుకోవాలన్న కోరిక నాలో బాగా కలుగుతుంది.. అసలు నువ్వు ఎందుకు ఇలా అనాధలా ఒంటరిగా బ్రతుకుతున్నావు.. నీకు నీ అన్న వాళ్లు ఎవరూ లేరా..? ఎందుకిలా అందరినీ వదిలేసి ఒక్కదానివే బ్రతుకుతున్నావు.. ఒకవేళ ఈ సాయిబాబా గుడికి నువ్వు రాకపోతే నీ జీవితం ఎంత దుర్భరంగా ఉంటుందో ఊహించుకుంటూంటేనే బాధగా అనిపిస్తుంది.. అసలు నీకు ఇలాంటి పరిస్దితి ఎందుకు వచ్చింది..?’’

అప్పటి వరకూ సంతోషంగా ఉన్న శారద ముఖం లో భావాలు మారిపోయాయి.. గోపాల్ తన గతాన్ని గురించి ప్రశ్నించగానే ఆమె మనసు తన గతం తలుపు తట్టింది.. కళ్ళముందు ఒక్కసారిగా తన గతం తాలూకు ఒక్కక్క సంఘటన మెదలడం ప్రారంభించింది.

శారద ముఖం లో బాధ, ఆక్రోశంతో కూడిన భావాలు, ఆమె అంతరంగమంతా అస్తవ్యస్తం అయినట్టు ఆమె ముఖం లోని భావాలని గమనిస్తూంటేనే తెలిసిపోతుంది.. ఆమె ముఖం లో కనిపిస్తున్న భావాలనే జాగ్రత్తగా గమనిస్తున్నాడు గోపాల్..

తాను గతం గురించి అడగగానే ఆమె మనసంతా బాధతో నిండిపోయిందని తెలుసుకున్నాడు గోపాల్..

శారదకి తాను తన ఊరు వదిలి వస్తున్నప్పుడు బంగళాలోనుండి ఈడ్చుకుని వచ్చి గేటు అవతలకి తోసివేసిన సంఘటన కళ్ళ ముందు కదలాలాడింది.. ఆ సంఘటన మెదలగానే ఆమె కళ్ళలో కన్నీళ్లు సుడులు తిరిగాయి..

ఆమె కళ్ళల్లో నీళ్లు చూసిన గోపాల్ అనవసరంగా తన గతం అడిగి ఆమెని బాధపెట్టానేమోనని అనిపించింది..

''శారదమ్మా.. నీ గతం గురించి అడిగి అనవసరంగా నిన్ను బాధపెట్టాను.. క్షమించమ్మా..''

గోపాల్ బాధగా అనడంతో శరద తనని తాను నిగ్రహించుకుంది.. చీర కొంగుతో కన్నీళ్ళని తుడుచుకుని మాములుగా మారిపోవడానికి ప్రయత్నిస్తూ..

''ఫర్వాలేదండీ.. మీరు తెసుకోవాలన్నంత గొప్పగా ఏమీ లేదు నా గతం.. ఒక్కసారి నా గతంలోకి తొంగి చూస్తే కష్టాలు, కన్నీళ్ళు తప్ప మరింకేమీ ఉండవు..'' అలా అంటున్నప్పుడు శారద గొంతు బొంగురుపోయింది..

''సరే.. సరే .. ఇక నీ గతం గురించి నేనెప్పుడూ అడగను.. ఇన్నాళ్లూ కష్టాలు అనుభవించిన నీవు ఇక్కడ ఈ సాయినాధుడి సమక్షంలో సంతోషంగా ఉండమ్మా..''

''నా గతాన్ని తెలుసుకోవాలని మీరనుకోవడంలో ఆశ్చర్యం ఏమీలేదు.. ఎక్కడి నుండో వచ్చి ఎవరో తెలియకపోయినా నన్నాదరించి ఈ మందిరంలో ఆశ్రయం కల్పించిన మీకు సమయం వచ్చినప్పుడు తప్పకుండా నా గతం గురించి చెబుతాను..''

''ఇక నీవు నీ గతం గురించి మరిచిపో.. నీకు చెప్పాలని అనిపించినప్పుడే చెబుదువుగానీ.. అన్నట్టు వచ్చే ఆదివారం నాడు పిల్లలకి బోధనలు చెప్పాల్సిన బాధ్యత నీదే..''

గోపాల్ శారద వంక చూసి నవ్వుతాడు.. శారద కూడా నవ్వుతుంది..

''ఆ బాబా ఆశీస్సులుంటే తప్పకుండా చెబుతానండీ..''

''సరే.. సరే. నేను బయటికి వెళుతున్నాను.. మూర్తి గారు వస్తే ఇదిగో ఈ తాళాలు ఇవ్వమ్మా.. త్వరలో ఈ మందిరం నిర్మించి పదేళ్లు కావస్తోంది.. ఆ సందర్భాన్ని పురస్కరించుకుని ఘనంగా ఉత్సవాలు జరుపబోతున్నాము..

ఆ సాయిబాబాకి కానుకగా వచ్చిన బంగారు, వెండి ఆభరణాలు ఆ గదిలో ఉన్నాయి. వాటిని బంగారు షాపుకి తీసుకువెళ్లి కాస్త మెరుగు పెట్టించుకుని రావడానికి మూర్తి గారు వస్తారు.''

శారద, గోపాల్ ఇచ్చిన తాళం చెవిని తీసుకుంటుంది.. గోపాల్ అక్కడి నుండి బయటికి వెళుతూ తిరిగి శారదమ్మ వంక చూస్తాడు..

''శారదమ్మా.. తాళం చెవి జాగ్రత్త.. విలువైన ఆభరణాలు ఉన్నాయి ఆ గదిలో..''

''అలాగే నండీ.. జాగ్రత్తగా చూసుకుంటాను..''

గోపాల్ బయటికి వెళతాడు.. వెళుతున్న గోపాల్ నే చూస్తుంటుంది శారద.. ఒకసారి తన చేతిలో ఉన్న తాళం చెవి వంక చూస్తుంది..

................................

గుడి ఆవరణలోకి వచ్చిన మూర్తి, తన వాహనాన్ని పార్కు చేసి ఆ పక్కనే ఉన్న కుళాయి దగ్గర కాళ్లూ, చేతులు శుభ్రపరచుకొని సాయిబాబా మందిరంలోకి ప్రవేశిస్తాడు. సాయినాథునికి భక్తితో నమస్కరించి ప్రార్దిస్తుండగా అక్కడికి వస్తుంది శారద. ప్రార్ధించడం పూర్తయ్యాక శారద వంక చూస్తాడు మూర్తి.

శారద మూర్తిని చూసి నవ్వుతూ అతని దగ్గరకు వస్తుంది. తన చేతిలో ఉన్న తాళం చెవిని మూర్తికి ఇస్తుంది..

''మీకు ఈ తాళం చెవి ఇమ్మని గోపాల్ గారు చెప్పారండీ.. తీసుకోండి..''

మూర్తి తాళం చెవి అందుకుంటాడు..

''థ్యాంక్యూ అమ్మా..''

మూర్తి బంగారు, వెండి ఆభరణాలు ఉన్న గదివైపు అడుగులు వేస్తాడు.. అతను వెళుతూ వెనక్కి తిరిగి చూస్తాడు.

శారద అక్కడే నిలబడి ఉండడం గమనిస్తాడు..

''అలాగే నిలబడ్డారేమిటమ్మా.. రండి నాతో..''

శారద కాస్త తటపటాయిస్తుంది.. తటపటాయిస్తుంది. తనతో రావడానికి తటపటాయిస్తున్న శారదని చూస్తాడు మూర్తి..

''మరేమీ ఫర్వాలేదమ్మా.. రండి.. ఈ గుడిలో రహస్యాలంటూ ఏమీ లేవు.. దేవుడికి సంబంధించిన బంగారు, వెండి ఆభరణాలు ఆ గదిలో ఉన్నాయి.. వాటిని నువ్వు కూడా చూద్దువు గానీ రా..''

శారద మరేమీ మాట్లాడకుండా అతని వెనకాలే అడుగులు వేస్తుంది..

మూర్తి ఆ మందిరం పక్కనే ఆనుకుని ఉన్న ఓ గది దగ్గరకి వెళ్తాడు.. దానికి వేలాడుతున్న తాళాన్ని చేతిలోకి తీసుకుని తాళం తీస్తాడు.

మూర్తి ఆ గది తాళం తీస్తుండగా ఆసక్తిగా చూస్తూ నిలబడి పోతుంది శారద.

మూర్తి గది తలుపులు  తెరుస్తాడు.. శారద తలుపులు తెరుచుకున్న గదిలోకి శారద ఆసక్తిగా చూస్తుంటుంది

మూర్తి గదిలోకి నడుస్తూ వెనకాల ఉన్న శారద వంక చూస్తాడు..

“లోపలికి రా శారదమ్మా..!” అని మూర్తి లోపలికి నడుస్తాడు.. అతని వెనుకాలే శారద నడుస్తుంది.. ఆ గది లోపల సాయినాధుడికి చేయించిన బంగారు కిరీటాలు, వెండి కిరీటాలు, ఇంకా అనేక ఆభరణాలు ఉంటాయి. వాటన్నింటినీ  ఎంతో  ఆసక్తిగా గమనిస్తుంటుంది శారద.

మూర్తి ఆ పక్కనే ఉన్న ఓ బ్యాగుని తీస్తాడు. బంగారు, వెండి ఆభరణాలని ఆ బ్యాగులో సర్ది పెట్టుకుంటాడు.. అయితే అతను ఆ పక్కనే ఉన్న మరొక బంగారు కిరీటాన్ని బ్యాగులో పెట్టకపోవడంతో ఆశ్చర్యపోతుంది శారద..

“అదేమిటండీ.. ఆ కిరీటాన్ని వదిలేసారేమిటి..?” అని శారద అంటుంది.

మూర్తి ఆ కిరీటం వంక చూస్తాడు.. దానిని చేతిలోకి తీసుకుంటాడు..

‘‘ఈ కిరీటం క్రితం సంవత్సరం జరిగిన ఉత్సవాల్లో జారి క్రింద పడింది... దాంతో ఈ కిరీటాన్ని దేవుడికి వాడకుండా అలాగే పెట్టేసాము.. మరో కొత్త కిరీటాన్ని తయారు చేయించి దానితో సాయినాధుడిని అలంకరిస్తున్నాము.

అందుకే దీనిని పక్కన పెట్టేసాము..’’

నవ్వుతూ అంటూ ఆ కిరీటాన్ని జాగ్రత్తగా ఓ చోట పెడతాడు మూర్తి.. శారద ఆ కిరీటం వంకే చూస్తుంటుంది.. కిరీటాన్ని చూస్తున్న శారదని గమనిస్తాడు మూర్తి.. తరువాత చేతిలోకి బ్యాగ్ తీసుకుని, కిరీటాన్నే తేరిపార చూస్తున్న శారదతో..

''ఇక వెళదామా..'' అంటాడు మూర్తి నవ్వుతూ..

శారద ఉలిక్కిపడి తేరుకున్నట్టు

''ఆ..ఆ.. వెళదాము..'' అంటూంది కంగారుగా..

మూర్తి, శారద ఇద్దరూ ఆ గదిలో నుండి బయటికి వస్తారు.. బయటికి వెళుతూ శారద వెనక్కి తిరిగి ఆ కిరీటం వంక చూస్తుంది.. ఇద్దరూ ఆ గదిలోనుండి బయటికి వస్తారు.

గది బయటికి వచ్చిన మూర్తి తిరిగి ఆ గదికి తాళం వేసి తాళం చెవి శారదకి ఇస్తాడు.

''గోపాల్ గారు మరి కొద్ది సేపట్లో ఇక్కడి వస్తాడు.. ఈ తాళం చెవి ఆయనకే ఇవ్వమ్మా..'' అంటూ తాళం చెవిని శారదకి అందిస్తాడు మూర్తి.

సరిగ్గా అదే సమయంలో అక్కడికి వస్తాడు రాజారాం.. ఇద్దరూ ఆ గది దగ్గర ఉండడం చూసి వారి దగ్గరకు వస్తాడు. మూర్తి పక్కన నిలబడి ఉన్న శారదని చూసిన రాజారాం ముఖం లో ద్వేషం పొడుచుకు వస్తుంది.. శారద రాజారాం వంక చూస్తుంది.. తనవైపే ఉక్రోషంగా చూస్తున్న రాజారాం నుండి చూపు మారుస్తుంది శారద. మూర్తి రాజారాం ని చూసి చిన్నగా నవ్వుతాడు..

''రాజారాం గారేమిటీ.. షాపుని వదిలిపెట్టి ఇలా వచ్చేసారు..''

శారదనే చూస్తున్న రాజారాం తిరిగి మూర్తి వంక చూస్తాడు.. పెదవులపై చిరునవ్వు తెచ్చిపెట్టుకుంటాడు..

''ఒక ముఖ్యమైన విషయం గురించి మన మేనేజరు గారితో మాట్లాడటానికి ఇలా వచ్చాను..''

''అయ్యో.. ఆయన ఇక్కడ లేరే.. వచ్చేముందు ఫోను చేసి రావాల్సింది..'' అంటాడు మూర్తి.

''ఆ..ఆ.. చేసాను.. ఆయన ఈ పక్కనే ఉన్నాడు.. పది నిమిషాల్లో వస్తానని చెప్పాడు..''

''ఓ.. అలాగా..''

రాజారాం మూర్తి చేతిలో ఉన్న బ్యాగుని చూస్తాడు.

''ఆ బ్యాగులో ఏమున్నాయి..?''

మూర్తి తన చేతిలో ఉన్న బ్యాగు వంక చూస్తూ " బాబా బంగారు, వెండి విగ్రహాలు ఉన్నాయి. వీటిని జువెలరీ షాపుకి తీసుకెళుతున్నాను.. వీటిని మెరుగుపరచడానికి..''

రాజారాం శారద వంక గుర్రుగా చూస్తాడు..

''పరాయివారి ముందు ఇంత విలువైన వస్తువులు తీయడం ప్రమాదకరం.. బంగారాన్ని చూడగానే ఆశపుట్టనిదెవరికి..? మన జాగ్రత్తలో మనం ఉండాలి కదా..!''

శారద చివుక్కున తలెత్తి రాజారాం వంక చూస్తుంది.. రాజారాం తనని ఉద్దేశించే ఆ మాటలు అన్నాడని అర్ధం అవుతుంది.. దెబ్బతిన్న దానిలా చూస్తుంది శారద.. తనవైపే చూస్తున్న శారద ముఖం లోకి చూస్తాడు రాజారాం..

ఆమెపై అతనికి ఉన్న కోపం అంతా అతని ముఖం లో కనిపిస్తుంది..

మూర్తికి కూడా రాజారాం శారదని ఉద్దేశించే అలా మాట్లాడాడని అర్ధం అవుతుంది.. మూర్తి శారద వంక చూస్తాడు.. ఆమె ముఖం లో బాధ స్పష్టంగా కనిపిస్తుంది.. ఆమెకళ్ళల్లో కన్నీళ్లు గిర్రున తిరుగుతుండడంతో మూర్తికి కోపం వస్తుంది.. విసురుగా రాజారాం వైపు తిరుగుతాడు..

‘‘ఏమిటి రాజారాం.. నోటికి ఎంత మాట వస్తే అంత అనడమేనా.. అయినా ఇక్కడ పరాయివారెవరున్నారు.. ఉన్నది మనమే కదా.. ఈ శారదమ్మ కూడా ఈ గుడి మనిషే కదా.. ’’ కాస్త కోపంగా అంటాడు మూర్తి.

‘‘ఆ..ఆ.. గుడి మనిషే అని మీరు నెత్తినెక్కించుకుంటున్నారు.. ఈ గుడి మనిషా, పరాయి మనిషా అని తెలుసుకోవాలంటే మరికొంత సమయం ఆగాల్సిందే..’’ శారదనే కోపంగా చూస్తుంటాడు రాజారాం.. శారద ఇంక అక్కడ ఉండలేక బాధతో అక్కడి నుండి వెళ్లిపోతుంది...

వెళ్లిపోతున్న శారదనే మూర్తి బాధతోనూ, రాజారాం కోపంతోనూ చూస్తూ మెల్లిగా అక్కడి నుండి కదులుతారు.

..................................

మేనేజర్ గోపాల్ గుడి లోపలికి ప్రవేశిస్తాడు. గోపాల్‌ని చూసిన శారదమ్మ అతనికి ఎదురుగా వెళుతుంది..

శారదని చూసిన గోపాల్ పలకరింపుగా నవ్వుతాడు. కానీ శారద ముఖం లో ఏదో తెలియని బాధని గోపాల్ గమనిస్తాడు.

గోపాల్ దగ్గరికి వచ్చిన శారద తన చేతిలోని తాళం చెవిని ఆయనకి ఇస్తుంది..

గోపాల్ దాన్ని తీసుకుని అంటాడు..

‘‘ఓ.. మూర్తి గారు వచ్చారా.. ?’’

శారద ముభావంగా ‘అవును’ అన్నట్టు తల ఊపుతుంది..

గోపాల్ శారద మొహాన్ని తేరిపార చూస్తాడు.

‘‘మీ ముఖం లో ఏదో బాధ కనిపిస్తుంది.. ఏం జరిగిందమ్మా..?’’ అడుగుతాడు

“అదేమీ లేదండి” ఆమె వాయిస్‌లో కూడా ఏదో తేడా కనిపెడతాడు గోపాల్..

గోపాల్ చిన్నగా నవ్వుతూ..

‘‘హు.. నీ గతం గురించి అడిగిన విషయాన్ని ఇంకా నువ్వు గుర్తుపెట్టుకుని ఉన్నట్టున్నావు కదూ.. దేవుడి సన్నిధిలో ఆనందంగా ఉన్న నీకు నీ గతాన్ని గుర్తిచేసి తప్పు చేశాను కదమ్మా..’’

గోపాల్ మాటలకి చివుక్కున తలెత్తుతుంది శారద..

‘‘అయ్యో.. అలాంటిదేమీ లేదండీ.. ఏదో ఒంట్లో కొద్దిగా నలతగా ఉంటేనూ..’’

‘‘అయ్యో.. అలాగా.. అయితే విశ్రాంతి తీసుకోకుండా ఇలా తిరుగుతున్నావేమిటమ్మా.. వెళ్ళి విశ్రాంతి తీసుకో.. ఈ పనులన్నీ ఎప్పుడూ ఉండేవే కదా..!’’

‘‘అబ్బే.. విశ్రాంతి ఏమీ అవసరం లేదండీ.. కాస్త ఒంట్లో నలతగా ఉంది అంతే..!’’

‘‘మరీ ఎక్కువగా కష్టపడకు శారదమ్మా.. ఎంత దేవుడికి సేవ చేసినా కూడా ఆరోగ్యం విషయంలో సైతం జాగ్రత్త పడాలి..’’

శారద మరేమీ మాట్లాడలేదు.. చిరునవ్వు నవ్వుతూ అక్కడి నుండి ముందుకు కదిలింది..

మేనేజర్ గోపాల్ కూడా చిన్నగా నవ్వుతూ తన ఆఫీస్ వైపు అడుగు వేస్తాడు.

.................................

సాయిబాబా భజన హాల్

ఆదివారం, ఉదయం తొమ్మిది గంటల సమయం..

సాయిబాబా మందిరం భక్తులతో కిటకిటలాడుతోంది.. ఆ కాలనీ వాసులే కాకుండా ఆ పక్కనే ఉన్న కాలనీ లోనుండి కూడా కొందరు తల్లితండ్రులు వారి పిల్లలని గుడికి తీసుకువచ్చారు.

సాయిబాబా గుడి లోపల పిల్లల అల్లరితో అంతా కోలాహలంగా ఉంది. గుడిలో పూజారి హారతిని  ఇస్తూ, మంత్రాలు జపిస్తూ, తీర్థ ప్రసాదాలని అందిస్తూ బిజీగా ఉన్నారు.

పూజారి ముఖం లో ఒకింత ఆశ్చర్యం కనిపిస్తుంటుంది.. ఆశ్చర్యంగానే మందిరంలో ఉన్న జనాలని  చూస్తూంటాడు. సాయినాధుడిని దర్శించుకున్న భక్తులు ఆ హాలు లోపల  తమ పిల్లలతో సహా కూర్చుని కనిపిస్తుంటారు. వారందరినీ ఎంతో ఆశ్చర్యంతో చూస్తూ సాయిబాబాకి పూజలు చేస్తుంటాడు పూజారి.

ఆ గుడిలో అయిదు సంవత్సరాల నుండి మొదలుకుని 12 సంవత్సరాల మధ్య వయసు ఉన్న పిల్లలు ఎక్కువగా కనిపిస్తుంటారు. వారు చేస్తున్న అల్లరితో ఆ గుడి అంతా కోలాహలంగా ఉంటుంది.

మూర్తి గుడి లోపలికి వస్తాడు. గుడి అంతా హడావిడిగా ఉండడం గమనించిన మూర్తి సైతం ఎంతో ఆశ్చర్యపోతాడు.

లోపలికి రెండడుగులు వేసి ఆశ్చర్యంతో గుడిలో ఉన్న వారిని గమనిస్తాడు.

వారిని ఆశ్చర్యంగా గమనిస్తూనే సాయిబాబా విగ్రహం దగ్గరికి వెళ్తాడు మూర్తి. సాయిబాబాకి భక్తిపూర్వకంగా నమస్కరిస్తాడు మూర్తి.

‘‘ఇదేమిటి పూజారి గారూ.. ఈరోజు గుడిలో ఇంత మంది భక్తులు ఉన్నారు..?’’

పూజారి హారతి ఇవ్వడానికి పళ్లెం తీసుకుని అందులో కర్పూరం వేస్తూంటాడు.

‘‘అంతా శారదమ్మ గారి చమత్కారం..’’

‘‘శారదమ్మ గారి చమత్కారమా.. వింతగా ఉన్నదే..’’

‘‘వింతేమరి.. ఆవిడ గత ఆదివారం నాడు చెప్పిన బోధనలు, పిల్లలకే కాదు, పెద్దవారికి కూడా విపరీతంగా ఆకట్టుకున్నాయి. ఆమె చేస్తున్న బోధనలు పిల్లలను మంచి మార్గంలో నడిపిస్తాయన్న నమ్మకం పెద్దవారిలో వచ్చింది. అందుకే శారదమ్మ బోధన గురించి తెలుసుకున్న ప్రతీ వారు తమ పిల్లలను తీసుకుని గుడికి వచ్చేసారు.’’ నవ్వుతూ అన్నాడు పూజారి.

‘‘చాలా ఆశ్చర్యంగానూ, ఆనందంగానూ ఉంది పూజారి గారూ వీరిని చూస్తుంటే. వారంలో కనీసం ఒక గంట సేపయినా ఆధ్యాత్మిక చింతనలో గడపాలన్న ఆలోచన రావడం నిజంగా చాలా మంచి విషయం..’’ ఆనందంగా అంటాడు మూర్తి సాయినాధుని విగ్రహానికి భక్తిపూర్వకంగా నమస్కరిస్తూ..

‘‘మంచి చేయాలని సంకల్పబలం  ఉండడమే కదండీ కావాల్సింది.. ఆ మంచిని ఎదుటి వారిలో ఎలా ఎక్కించాలా అన్న లౌక్యం కూడా తెలిసి ఉండాలి. అలా తెలిసినప్పుడే ఆ మంచికి వెలుగొస్తుంది.. పదిమందికి ఆ వెలుగే జ్ఞానాన్ని ప్రసాదిస్తుంది. అలాంటి లౌక్యం ఉన్నావిడే మన శారదమ్మ గారు..’’ పూజారి మూర్తికి తీర్థ ప్రసాదాలు అందిస్తూ గొప్పగా చెబుతాడు.

‘‘ఇంతకీ మేనేజరు గారు వచ్చారా..?’’

‘‘ఇంకా రాలేదండీ.. ఈ జన సందోహాన్ని మన మేనేజరు గారు చూశారంటే.. ఆయన సంతోషానికి అవధులు ఉంటుందంటారా..?’’ నవ్వుతూ అంటాడు పూజారి.

‘‘నిజమే.. ఆయన ఆనందానికి అవధులు ఉండవు. పిల్లలలో ఆధ్యాత్మిక చింతన తీసుకురావడానికి ఆయన చేసిన ఈ ప్రయత్నం విజయవంతం కావడం ఆయనకి చాలా సంతోషాన్ని ఇస్తుంది..’’ మనస్ఫూర్తిగా అంటాడు మూర్తి.

''మంచితనం ఎక్కడున్నా ఆ భగవంతుడి ఆశీర్వాదం అక్కడే ఉంటుంది కదండీ.. ఏది ఏమయినా.. శారదమ్మ గారి రూపంలో ఆ సాయినాధుడు మంచి భక్తురాలిని సమకూర్చుకున్నాడు..'' సాయినాధుడి విగ్రహాన్ని చూస్తూ భక్తితో అంటాడు పూజారి. సరిగ్గా అప్పుడే మూర్తి పక్కగా వచ్చి నిలబడుతాడు  రాజారాం..

''పూజారి గారూ.. మీ నోటి నుండి దేవుడి స్తుతి రావాలి కానీ, మనుష్యుల స్తుతి కాదు..'' రాజారాం గొంతులో చిరాకు స్పష్టంగా తెలుస్తుంది. రాజారాం మాటకి మూర్తి, పూజారి ఇద్దరూ ఉలిక్కిపడతారు. వారిద్దరూ ఒకేసారి ఆయన ముఖం  వంక చూస్తారు.

రాజారాం పూజారినే కోపంగా చూస్తూంటాడు. కానీ అతని చేతులు మాత్రం సాయినాధుడిని మ్రొక్కుతూ ఉంటాయి.

మళ్ళీ రాజారామే అంటాడు..

''దిక్కూ మొక్కూ లేకుండా గుళ్ళోకి వచ్చి తలదాచుకున్న ఓ ముసలిదాని గురించి మీరు చాలా ఎక్కువగా మాట్లాడుతున్నారు. అది నాకు ఏమాత్రం ఇష్టం లేదు. ఇకనుండి మీరు ఆవిడగారి స్తుతిని తగ్గించి ఆ భగవంతునిపై ధ్యాస పెంచండి..'' అతని గొంతులో వినిపించిన ఈర్ష్యతో కూడిన కోపానికి పూజారి షాకయిపోతాడు..  మూర్తి కూడా ఎంతో ఆశ్చర్యపోతాడు.

....................................

మెయిన్‌గేటు దగ్గర ఉన్న కొబ్బరికాయలు అమ్ముకునే వ్యక్తి ముఖం  ఆనందంతో వెలిగి పోతూంటుంది.

అతని చేతిలో పదిరూపాయల నోట్లు ఓ ఇరవై వరకు ఉంటాయి. వాటిని అతను ఆనందంగా లెక్కపెడుతూంటాడు.

''ఈ గుడిదగ్గర ఇన్ని రోజుల  నుండి కొబ్బరికాయలు అమ్ముతున్నాను. ఒక్క గురువారం రోజు, మిగతా పండుగ రోజుల తప్ప, ఇలా ఆదివారం రోజున ఇంత రాబడి రావడం ఇదే

మొదటిసారి..'' ఆనందంతో అతని ముఖం  వెలిగిపోతూంటే డబ్బుని తన జేబులో పెట్టుకుంటూ కొబ్బరికాయ కోసం వచ్చిన వారివైపు తిరుగుతాడు. వారికి కావలసిన కొబ్బరి కాయలు  ఇచ్చి డబ్బు తీసుకుని జేబులో పెట్టుకుంటుండగా సడన్‌గా అతనికి ఒక ఆలోచన వస్తుంది.

''అవునూ.. అసలు ఈరోజు ప్రత్యేక దినం కూడా ఏమీకాదు కదా.. మరి ఇంతమంది జనాలు ఎందుకు వస్తున్నట్టు.. పైగా ఆదివారం వచ్చిందంటే హాయిగా ఇంట్లో తిష్టవేసుకుని టీవీకి అతుక్కుపోవడమో, లేదంటే ఏ సినిమాకో, షికారుకో వెళ్ళే ఈ జనాలు బుద్ధిగా సాయిబాబా గుడికి రావడం ఏమిటీ..? ఏమిటో అంతా విచిత్రంగా ఉంది...''

అతను అలా అనుకుంటుండగా మరో ఇద్దరు భక్తులు అక్కడికి వస్తారు. వారి ప్రక్కనే వారి పిల్లలు కూడా ఉంటారు..

''ఏమయ్యా.. ఒక కొబ్బరికాయ ఇవ్వు..'' జేబులో నుండి డబ్బుని బయటికి తీస్తూ అంటాడు ఆ భక్తుడు.

ఉన్న వాటిలో ఒక మంచి కొబ్బరికాయని ఏరి అతని చేతికి అందిస్తాడు కొబ్బరి కాయలు అమ్మే వ్యక్తి.

''అవునండీ.. మీకో విషయం అడుగుతాను.. ఏమీ అనుకోరు కదా..!'' ఆతృతని ఆపుకోలేక అంటాడు కొబ్బరి కాయలు అమ్మే వ్యక్తి.

''ఏమీ అనుకోనులే.. అడుగు..'' అంటాడు ఆ భక్తుడు.

''ఈరోజు సాయిబాబా పుట్టినరోజా..?'' అనుమానంగా అడగుతాడు.

''ఛఛ.. ఏమీ కాదు.. ఎందుకలా అడిగావ్..?'' ఆశ్చర్యంగా అడుగుతాడు ఆ భక్తుడు.

‘‘ కాదా..! మరలా అయితే ఈరోజు ఏమయినా ప్రత్యేకమైన దినమా.. అంటే వైకుంఠ ఏకాదశి, క్షీరాబ్ధి ఏకాదశి లాంటి దినాలు  వస్తాయి కదా.. అలాంటి విశేషమైన రోజా ఈరోజు..?’’ అమాయకంగా అంటాడు అతడు.

‘‘అబ్బే.. అలాంటిదేమీ లేదు.. అయినా.. నీకా డౌటులెందుకొస్తున్నాయయ్యా..’’ ఆశ్చర్యంగా అడుగుతాడు భక్తుడు కొబ్బరికాయలు అమ్మే వ్యక్తి అతని వంక అబ్బురంగా చూస్తూ అంటాడు.

‘‘నేను ఇక్కడ సంవత్సరం నుండి కొబ్బరి కాయలు అమ్ముతున్నాను.. గురువారం నాడు తప్ప మిగతా వారాలలో కొబ్బరికాయల అమ్మకాలు చాలా తక్కువగా ఉంటాయి. ఇంక ఆదివారం రోజునయితే చెప్పాల్సిన పనిలేదు.. ఏదో ఓ నాలుగో, అయిదో అమ్ముతాను. అటువంటిది.. ఈరోజు ఆదివారమే కదా.. మరి.. ఇయాల ప్రతీ గురువారం ఎన్ని కొబ్బరికాయలు అమ్ముతానో.. ఇంచుమించు అన్ని కొబ్బరికాయలు అమ్ముడయిపోయాయి.. ఉన్న ఫళంగా ఈ గుడికి ఇంతేసి మంది భక్తులు రావడంతో నాకెంతో ఆశ్చర్యం ఏసింది.. అందుకే అలా అడిగాను..’’ అన్ని ప్రశ్నలు ఎందుకు వేసాడో తెలియ చెప్పాడు అతడు.

కొబ్బరికాయ కొన్న భక్తుడు పెద్దగా నవ్వుతాడు..

‘‘ఓ అదా నీ డౌటు.. ఈరోజే కాదు.. ఇకనుండి ప్రతీ ఆదివారం నీ కొబ్బరికాయలకు భలే గిరాకీ ఉంటుందిలే..!’’

నవ్వుతూ అంటాడు ఆ భక్తుడు.

‘‘అదేనయ్యా.. ఎందుకిలా ఉన్నఫళంగా కాలనీ వాసులందరికీ సాయిబాబా మీద ఉన్న ఫళంగా భక్తి పెరిగిపోయిందే మిటన్నదే కదా నా ప్రశ్న..’’

‘‘ఈ కాలనీ వాసులే కాదయ్యా... ఈ చుట్టు పక్కల ఉన్న కాలనీ వాసులు కూడా ఈరోజు ఈ గుడికి రావడానికి ప్రత్యేకంగా తమ సమయాన్ని కేటాయిస్తున్నారు.. దీనికి కారణం వారికి ఆ సాయినాథుడిపై ఉన్న భక్తిప్రపత్తులు తమ పిల్లలలో కూడా కలగాలన్నది వారి ఆశ.. ’’

ఆ భక్తుడి సమాధానానికి కొబ్బరికాయలు  అమ్ముకునే వ్యక్తి బుర్ర గోక్కుంటాడు...

''తమరు సెప్పింది నాకేమీ బుర్రకెక్కలేదయ్యా.. ఇన్నాళ్ళుగా తమ పిల్లలకి సాయిబాబా అద్భుత లీలావిలాసాలు తెలపాలని అనుకోని వీరికి ఇప్పుడే ఎందుకా ఆలోచన ఒచ్చిందన్నది నా వెదవ డౌటు..'' బుర్ర గోక్కుంటూ అంటాడు కొబ్బరి కాయలు అమ్ముకునే వ్యక్తి.

''నీకు తెలియనిది ఏముందయ్యా... రెండు వారాలుగా ఈ గుళ్ళో ప్రతీ ఆదివారం నాడు ఆధ్యాత్మిక బోధనలు చేస్తున్నారు కదా.. ముఖ్యంగా శారదమ్మ గారు చేసే ఆధ్యాత్మిక బోధనలు పిల్లల మానసిక ప్రవర్తనలో  ఎన్నో మంచి మార్పులను తీసుకు వస్తున్నాయి. అందుకే ఆవిడ బోధనలని తమ పిల్లలకి వినిపించడానికే ప్రత్యేకంగా సమయాన్ని కేటాయించుకుని మరీ వస్తున్నారు..'' అన్నాడా భక్తుడు అక్కడి నుండి గుళ్ళోకి వెళుతూ..

''ఓహో.. ఇక ప్రతీ ఆదివారం కూడా గురువారం లాగా భక్తులతో కిటకిటలాడిపోతుందన్నమాట..''

భుజాలెగరేసుకుంటూ ఆనందంగా అనుకుంటాడు కొబ్బరికాయలు అమ్మేవాడు---

----------------------

సమయం తొమ్మిదిన్నర అవుతుంది.. సాయిబాబా మందిరంలో సాయినాధుడిని దర్శించుకున్న భక్తులందరూ తమ పిల్లలని తీసుకుని పక్కనే ఉన్న సాయిబాబా మందిరం హాల్‌లోకి వస్తారు. తమ పిల్లలందరినీ వరుసగా కూర్చోబెడతారు..

అప్పుడే ఆ హాల్‌లోకి వస్తాడు మేనేజర్ గోపాల్.. హాలులో పిల్లలని వరుస క్రమంలో కూర్చోపెడుతూ బిజీగా ఉంటాడు మూర్తి. గోపాల్ హాల్‌లోకి రావడం చూసిన మూర్తి గోపాల్ దగ్గరికి వస్తాడు.

''చూశారా గోపాల్ గారూ.. మీరు చేసిన సంకల్పానికి ఆ దేవుడి ఆశీస్సులు లభించాయి. శారదమ్మగారి పుణ్యమా అని ఆధ్యాత్మిక బోధన వినడానికి మన కాలనీ వాసులే కాదు,

పక్కనున్న కాలనీ వాసులు కూడా తమ పిల్లలని తీసుకుని వచ్చారు..'' మూర్తి మాటల్లో ఆనందం..

గోపాల్ ఆ హాల్‌లో నిండి ఉన్న పిల్లలని వారి తల్లితండ్రులను చూసి ఎంతో ఆనందపడిపోతాడు. ఒక విధమైన భావోద్వేగానికి లోనుకావడంతో అనుకోకుండా ఆయన కళ్ళల్లో కన్నీళ్ళు సుడులు తిరుగుతాయి ..

''అంతా ఆ సాయినాధుడి ఆశీర్వాదం.. ఇంతకీ శారదమ్మ ఎక్కడుంది..?''

''ఏదో ఒక పని చేయకపోతే ఆవిడకి ఏమీ తోచదు కదండీ.. క్లాస్‌కి టైం అవుతుంది.. పిల్లలందరూ వచ్చారు.. మీరు రావాలని అంటే.. దేవుడి ప్రసాద సామాగ్రి శుభ్రం చేసి వస్తానని చెప్పింది.. ''

''చేసే పనిలోనే దేవుడిని చూసుకుంటున్న ఆవిడపై రోజు రోజుకూ నాలో గౌరవభావం పెరిగిపోతుంది మూర్తి గారూ..'' నవ్వుతూ అంటాడు గోపాల్.

''నాక్కూడానండీ.. మీరు వచ్చి కూర్చోండి..'' మూర్తి కూడా నవ్వుతూ అంటాడు.

గోపాల్ నవ్వుతూ ఆ హాల్ లోపలికి నడుస్తూంటాడు.. గోపాల్‌ని చూసిన కొందరు భక్తులు వినయంగా నమస్కరిస్తూంటారు.. వారికి చిరునవ్వుతో ప్రతినమస్కారం చేస్తూ ఆ భజనమందిరంలో ఓ పక్కగా వేసిన కుర్చీదగ్గరికి వెళ్లి కూర్చుంటాడు గోపాల్..

అప్పుడే అక్కడికి వస్తూంది  శారదమ్మ.. ఆమె ముఖం లో ఎలాంటి భావాలు కనిపించవు.. తన బోధనలు వినడానికి అంతమంది తల్లితండ్రులు తమ పిల్లలని తీసుకువచ్చారని  తెలిసి కూడా  ఆమెలో  ఏమాత్రం గర్వం తాలూకు ఛాయలు కనిపించవు.. ఆమె మనసులో ఆ సాయినాధుడి నామమే స్మరిస్తూంటూంది ఎప్పుడూ.. గత వారం ఆమె బోధనలు విన్న వారు శారదమ్మ రాగానే వినయంగా నమస్కారం చేస్తారు. వారికి చిరునవ్వుతో ప్రతి నమస్కారం చేస్తూ వేదికపైకి వస్తుంది.. కొత్తగా వచ్చిన వారికి గత వారం వచ్చిన వారు శారదమ్మను చూపించి ఆవిడ గురించి గొప్పగా చెబుతుంటారు.

శారదమ్మ గోపాల్ వంక చూస్తుంది.. ఆయన ఆనందంతో శారదమ్మని చూసి నవ్వుతాడు.. శారదమ్మ కూడా చిన్నగా నవ్వుతుంది.. ఒకసారి ఆ పిల్లల వంక చూస్తూ.. ఇదంతా మీ బోధన మహిమనే అన్నట్టుగా సైగ చేస్తాడు గోపాల్.. దానికి కూడా ఆమె చిరునవ్వుతోనే సమాధానం చెబుతుంది..

మూర్తి వేదిక పైకి వస్తాడు.. ఆరోజు భక్తజనం ఎక్కువగా ఉండడంతో మైక్‌ని సిద్ధం చేస్తారు. మూర్తి మైక్ అందుకుంటాడు..

‘ఓం శ్రీ సాయిరాం.. ఆ సాయినాధుడిపై ఉన్న అచంచలమైన భక్తితో ఇక్కడికి విచ్చేసిన భక్తజనులందరికీ  నా హృదయ పూర్వక నమస్కారములు .. మీ పిల్లలలో ఆధ్యాత్మిక చింతనని పెంపొందించాలన్న సంకల్పంతో ఈ ఆలయ మేనేజరు గోపాల్ గారు ఏర్పాటు చేసిన ఈ డివోషనల్ క్లాసెస్‌కి ఇంతబాగా స్పందన రావడం మా మేనేజర్ గోపాల్ గారికే కాకుండా ఆలయ కమిటీ మెంబర్లమైన మాకు కూడా ఎంతో సంతోషాన్ని కలిగిస్తుంది.. ప్రస్తుతం సమాజంలో మనుష్యులందరూ యాంత్రిక జీవనానికి అలవాటు పడిపోయారు.. ఉదయం లేవడం మొదలు రాత్రి పడుకునేంత వరకూ తమ దైనందిన జీవితంలో ప్రతీ క్షణం యాంత్రిక జీవనాన్నే సాగిస్తూ మరమనిషిలాగా బ్రతకును వెళ్ళదీసుకుంటున్నారు.. అలాంటి జీవితానికి అలవాటు పడినవారు, వారి పిల్లలని సైతం అదే జీవన విధానానికి గురి చేస్తున్నారు. తమ పిల్లలని ఉదయాన్నే స్కూల్ కి పంపించడంతోనే తమ బాధ్యత తీరిపోయినట్టు చాలా మంది అనుకుంటున్నారు.. వేలు లక్షల  రూపాయల డొనేషన్లు కట్టేసి, నెల నెలా స్కూల్  ఫీజు కడుతున్నాం కదా.. తమ పిల్లల చదువు చదువు సంధ్యలన్నీ టీచర్లు చూసుకుంటారులే అన్న ధీమాతో పిల్లలని సరిగ్గా పట్టించుకోకుండా తమ పని తాము చేసుకుపోతున్న తల్లితండ్రులు ఎంతో మంది ఉన్నారు. అయితే డబ్బుతో కొనుక్కునే చదువులో విషయం ఉండదని చాలా మంది గ్రహించలేకపోతున్నారు.. ప్రస్తుతం ఈ సమాజపోకడలని గమనిస్తే మంచి కన్నా చెడు అన్ని రంగాల్లోనూ పాతుకొని పోయి కనిపిస్తుంది.. ఈ ప్రభావం పిల్లలపై ఎంతగానో పడుతుందని ప్రత్యేకంగా చెప్పాల్సిన

పనిలేదు.. సరిగ్గా ఈ విషయం గురించి ఆందోళన చెందిన మా మేనేజర్ గోపాల్‌గారు.. ఈ పసిపిల్లలలో ఇప్పటి నుండే ఆధ్యాత్మిక భావాలని పెంపొందిస్తే చెడు ప్రభావం వీరిపై పడకుండా ఉంటుందని దూరదృష్టితో ఆలోచించి ఇదిగో ఇలా ఆధ్యాత్మిక బోధనలకి రూప కల్పన చేసారు.. ఆయన మంచితనంతో తలపెట్టిన ఈ కార్యానికి మా గుడిలోనే ఉంటూ జీవనాన్ని సాగిస్తున్న శారదమ్మ గారి రూపంలో ఆ సాయినాధుడి ఓ మంచి బోధకురాలిని మనకి అందించడం నిజంగా మీ పిల్లలు చేసుకున్న అదృష్టమనే చెప్పాలి..''

మూర్తిగారి మాటలకు అక్కడున్న వారందరూ చప్పట్లు కొడతారు.. మూర్తి పక్కనే నిలబడి ఉన్న శారదమ్మ మాత్రం కాస్త అసౌకర్యంగా మూర్తి వంక చూస్తుంది.. అంతమంది ముందు మూర్తి తనని పొగడడంతో ఆమెని ఒకరకమైన బిడియం ఆవరించుకుంటుంది.

మూర్తి మాటలు  విన్న గోపాల్ సైతం ఎంతో సంతోషం తో చప్పట్లు కొడుతాడు.. అతని చూపు శారదమ్మపై పడుతుంది.. శారదమ్మ ముఖం లో కనిపిస్తున్న బిడియాన్ని చూసి నవ్వుకుంటాడు గోపాల్ గారు..

మూర్తి శారదమ్మ వంక చూస్తాడు.. ఆమెలో కనిపిస్తున్న బిడియాన్ని చూసి అతను నవ్వుకుంటాడు..

''శారదమ్మ గారు తమ బోధనలని ప్రారంభిస్తారు..''

మూర్తి శారదకి మైక్‌ని అందించి ఆ వేదికని దిగి గోపాల్ ప్రక్కగా వచ్చి నిలబడుతాడు..

శారదమ్మలో కాస్త బిడియం.. అంతమంది జనం కనిపిస్తుండడంతో ఆమెలో భయం ప్రవేశిస్తుంది.. గొంతు సవరించుకుని మాట్లాడాలని ప్రయత్నించినా ఆమె గొంతు పెగలదు.. దాంతో ఏం చేయాలో అర్థం కాక గోపాల్ వంక చూస్తుంది..

గోపాల్ ఆమె వంక చూసి మరేం ఫర్వాలేదు.. మాట్లాడు.. అన్నట్టుగా సైగ చేస్తాడు.. అతని సైగని గమనించి సరే అన్నట్టు తలాడిస్తుంది.. ఒకసారి గట్టిగా ఊపిరి పీల్చుకుంటుంది, ఆ తర్వాత కళ్ళు మూసుకుని మనసులో ఆ సాయినాధుడిని మనస్పూర్తిగా ప్రార్థిస్తుంది.. ఆ

తర్వాత మెల్లిగా కళ్ళు తెరుస్తుంది.. ఒకసారి తన ముందు కూర్చున్న పిల్లలని, వారి చుట్టూ నిలబడి తననే గమనిస్తున్న వారి తల్లితండ్రులను గమనిస్తుంది...

శారదమ్మ గొంతు సవరించుకుని బోధనలని ప్రారంభిస్తుంది.

''ఓం సాయినాధాయ నమ: దారం తెగిన గాలిపటంలా గాల్లో ఎగురుతూ గమ్యంలేని ప్రయాణం చేస్తున్న గాలిపటంలా నా జీవితం అయిపోయిన సమయంలో ఆ తెగిపోయిన దారాన్ని ఈ మందిరానికి కట్టేసి గాలిపటంలాంటి నా జీవితానికి ఒక అర్థం, పరమార్థం కలిగేలా చేసిన ఆ సాయినాధుడికి భక్తితో పాదాభివందనం చేస్తున్నాను. నేను పలికే మాటలు , చెప్పే బోధనలన్నీ నాతో ఆ సాయినాధుడు పలికిస్తున్నాడే కానీ, ఇందులో నా గొప్పతనం ఏమీ లేదని మీ అందరికీ సవినయంగా విన్నవించుకుంటున్నాను.. ''

అందరికీ తల  వంచి అభివాదం చేస్తుంది.. ఆమె మాటలకి అక్కడున్న వారందరూ గట్టిగా చప్పట్లు కొడుతారు..

గోపాల్, మూర్తిలు  కూడా చప్పట్లు కొడుతూ ఆమెని ఎంతో ఆశ్చర్యంగానూ, అభిమానంగానూ చూస్తుంటారు..

''గతంలో నేను చదివిన, విన్న కొన్ని మంచి విషయాలని ఈ పిల్లలతో పంచుకుంటున్నానే కానీ, నలుగురికి పాఠాలు చెప్పేంత దాన్ని  కాను నేను.. నా మాటలు పిల్లలకి ఆనందాన్ని కలిగిస్తున్నాయని, వారిలో  ఆధ్యాత్మిక చింతనే కాకుండా మంచి మార్గం గుండా నడవాలన్న ఆసక్తి పెరుగుతుందని తెలుసుకొని నేనెంతగానో సంతోషించాను.

నా మాటలు పిల్లలలో మార్పుకు శ్రీకారం చుడుతున్నాయని తెలుసుకున్నాక, వారిని మంచి మార్గం గుండా నడిపించడానికి నావంతు కృషి చేయడానికి నేను సిద్దపడిపోయాను..''

ఆ భజన మందిరం మళ్ళీ చప్పట్లతో మారుమ్రోగిపోతూంది.. మూర్తి, గోపాల్ కూడా ఆనందంతో చప్పట్లు కొడుతారు.. పది క్షణాల తర్వాత శారద పిల్లల వంక చూస్తుంది...'' పిల్లలూ పాఠాలు మొదలు పెడదామా..'' నవ్వుతూ అంటుంది..

పిల్లలందరూ  ఎంతో హుషారుగా తలూపుతారు.. శారద ముఖం లో సంతోషం..

ఆమె పాఠాలు చెప్పటం ప్రారంభిస్తుంది..

ఆమె పాఠాలు చెబుతూ ఉంటుంది..

ఆమె చెబుతున్న పాఠాలు పిల్లలు ఎంతో ఇష్టంగా వింటూంటారు..

శారదమ్మ ఏదో చెబుతూ ఒక్కో అబ్బాయిని లేపి ప్రశ్నలు వేస్తుంటుంది.. ఆమె వేసిన ప్రశ్నలకి వారు ఎంతో ఇష్టంగా సమాధానం చెబుతారు.. పిల్లలు సమాధానం చెప్పాక అక్కడే ఉన్న పెద్దవారు ఆనందంతో చప్పట్లు కొడుతుంటారు..

మూర్తి, గోపాల్ శారద చెబుతున్న బోధనలు వింటూ ఎంతో ఆశ్చర్యంగానూ, అద్భుతంగానూ శారదమ్మని చూస్తూ వారు కూడా భక్తులతో పాటు చప్పట్లు కొడుతూ ఉంటారు..

ఆ భక్తుల  మధ్యలో వారగా నిలబడి ఉంటాడు రాజారాం.. మిగతా వారందరూ ఆనందంతో శారదమ్మ చెప్పే బోధనలు వింటున్నప్పటికీ, రాజారాం ముఖం లో మాత్రం విపరీతమైన కోపం తాండవిస్తుంటుంది. శారదమ్మ నవ్వుతూ పిల్లల వంక చూస్తూ మాట్లాడుతుంటుంటే రాజారాం శారదనే చూస్తూ కోపంతో ఊగిపోతుంటాడు..

ఆతని కళ్లల్లో ఎరుపు జీరలు  అలుముకుంటాయి.. శారదమ్మ మాటలకి సంతోషంతో చప్పట్లు కొడుతున్న వారందరినీ  ఒకసారి గమనిస్తాడు  రాజారాం.. ఆమె మాటలకి అందరూ  చప్పట్లు కొడుతుండడం రాజారాంకి సుతారమూ నచ్చకపోవడంతో ఇక అక్కడ ఉండడం ఇష్టం లేదన్నట్టుగా విసురుగా భక్తులందరినీ తప్పుకుంటూ బయటికి వస్తాడు విసురుగా..

....................................

రాజారాం ముఖం  కోపంతో రగిలిపోతుంటుంది.. తన గదిలో చుట్టూ పచార్లు చేస్తూంటాడు.. కోపంతో పాటు చిరాకు కూడా ప్రవేశిస్తుంటుంది..

ఛ.. అని అనుకుంటూ చిరాకుగా గదిలో పచార్లు చేస్తూంటాడు..

సరిగ్గా అప్పుడే ఆ గదిలోకి సావిత్రి ప్రవేశిస్తుంది..

చిరాగ్గా అటూ ఇటూ పచార్లు చేస్తున్న రాజారాంని చూసిన సావిత్రి ముఖం లో కోపం..

''మాటలు కోటలు దాటుతాయి, మనిషి గడప దాటడు అంటే ఇదే.. సాయిబాబా గుళ్ళో నేను ఎంత చెబితే అంత అనీ, ఆ గుడి మేనేజరు తన కనుసన్నల్లోనే ఉంటాడని ఏవేవో మాటలు చెప్పావు.. అవన్నీ ఉట్టి మాటలేననీ తెలిసిపోయింది.. పని చేయడం చేతకాని వాడివి ఇలా అటు ఇటూ పచార్లు చేసి ఏం ప్రయోజనం..'' హేళనగా అంటుంది.

రాజారాం సావిత్రి వంక కోపంగా చూస్తాడు..

''అబ్బో.. ఆ చూపుకేం కొదవలేదు.. అక్కడ అదెవతో దిక్కూ మొక్కూ లేనిది వచ్చి గుడిని ఆక్రమించుకుంటుంటే ఇక్కడ నువ్వు ఇంట్లో కూర్చుని భజన చేస్తున్నావా..''

రాజారాంకి మరింత కోపం వస్తుంది..

''సావిత్రీ..'' అంటాడు గట్టిగా...

రాజారాం తీక్షణంగా సావిత్రి వంక చూసి ''సావిత్రీ.. ఊరుకుంటున్నాను కదాని నీ ఇష్టం వచ్చినట్టు వాగితే మర్యాద ఉండదు..''

సావిత్రి కొంత శాంతపడుతుంది..

''నిన్ను దెప్పిపొడవడం నా ఉద్దేశ్యం కాదు రాజారాం.. రోజు రోజుకీ ఆ శారద పెత్తనం గుళ్ళో పెరిగిపోతూ ఉంటే నా మనసు ఉడుక్కుంటుంది.. ఎలాగైనా దాన్ని ఆ గుడిలోనుండి పంపించేయాలని మనం చేసిన ప్రయత్నాలన్నీ బెడిసికొడుతుంటే నా హృదయం ఆగ్రహంతో

రగిలిపోతుంది.. నా లో పున్న కోపం ఎవరిమీద చూపించాలో అర్థం కాక నీతో ఇలా మాట్లాడాను అంతే..''

''కోపం నీకేనా.. నాకు లేదా.. ఆ శారద వచ్చినప్పటి నుండి దాన్ని గుళ్ళోనుండి బయటికి ఎలా గెంటేయాలా అని ఆలోచిస్తూనే ఉన్నాను.. దాని గురించి మేనేజర్‌కి చెడుగా చెప్పినా కూడా అతను పట్టించుకోవడం లేదు.. మాటలతో కాకుండా చేతలతో వారందరి మన్నలను పొందుతున్న ఆ శారదని ఎలా గుడిలోనుండి బయటికి గెంటేయాలా అని ఆలోచిస్తూంటే.. మధ్యలో నువ్వొచ్చి నన్ను మరింత రెచ్చగొడుతున్నావు..'' కోపంగా అంటాడు రాజారాం.

''నీ బాధ నేనర్థం చేసుకుంటాను రాజారాం.. కానీ.. మనం దాన్ని గుళ్ళో నుండి ఎలా బయటికి పంపించాలా అని తీరికగా ఆలోచిస్తూ కాలక్షేపం చేస్తూ కూర్చుంటే.. అదేమో ఆ మేనేజర్‌నే కాకుండా భక్తులని కూడా బుట్టలో వేసుకుంటోంది.. కొత్తగా అదేదో పిల్లలకి పాఠాలు చెబుతుంది కదా.. మొన్న ఆదివారం నాడు అది చెప్పే పాఠాలు వినడానికి కాలనీ అంతా గుడికి వచ్చారంటే.. అది ఎంతలా ఆ గుళ్ళో పాతుకుపోతోందో అర్థం కావడం లేదూ...సావిత్రి గొంతులో ఈర్ష్య, ద్వేషం కనిపిస్తుంటాయి.. ఆమె హృదయం రగిలిపోతుంటుంది.. ఆమె కళ్ళల్లో ఎరుపుజీరలు అలముకుంటాయి..

''ఆ..ఆ.. చూసాను.. అప్పుడు నేను కూడా ఆ గుళ్లోనే ఉన్నాను.. అది పాఠాలు చెబుతుంటే జనాలు చప్పట్లు కొడుతుండడం చూసి భరించలేక బయటికి వచ్చేసాను.. అసలు ఆ శారద ఎక్కడి నుండి వచ్చింది..? ఎలాగోలా నిన్ను ఆ గుళ్ళో పనికి కుదిర్చి, నీ ద్వారా ఆ గుడి తాలుకు సొమ్మును కాజేద్దామని నేనేసిన ఎత్తుగడ ఫలించనందుకు నాకెంత కోపంగా ఉందో తెలుసా..? అయినా ఆరోజు మేనేజరుని కలవమని నేను చెప్పినప్పుడు నువ్వు కాస్త తొందరగా వెళ్ళి ఉంటే ఇప్పుడు మనకింత టెన్షన్ ఉండేది కాదు కదా..'' సావిత్రిపై చిరాకు పడతాడు రాజారాం..

‘‘ఇది మరీ బావుంది.. నువ్వు వెళ్ళమన్నరోజు ఉదయాన్నే నేను గుడికి వెళ్ళాను.. మేనేజరు ఇంకా రాలేదంటే ఆయన రాకకోసం ఎదురుచూస్తూ అక్కడే కూర్చున్నాను.. సరిగ్గా మేనేజరు గారు పదినిమిషాల్లో వస్తారనగా ఆ శారద వచ్చింది.. దాన్ని చూసి అదేదో గుడిలో దేవుడిని దర్శించుకోవడం కోసం వచ్చిందని అనుకున్నాను.. కానీ అది నాకే ఎసరు పెట్టేందుకు వచ్చిందని నేననుకోలేదు...’’

‘‘అది గుళ్ళోకి వచ్చింది సరే.. నువ్వేం చేశావ్.. నిన్ను నేను పంపిస్తున్నానని మేనేజర్ గోపాల్‌కి ఫోన్ చేసి చెప్పాను.. సరే పంపించు.. నేను పనిలో పెట్టుకుంటానని ఆయన నాతో స్పష్టంగా చెప్పాడు.. నిన్ను పనిలోకి పెట్టుకుంటానని చెప్పినవాడు ఆ శారదని ఎందుకు పనిలోకి తీసుకున్నాడు..?’’ కోపంగా అంటాడు రాజారాం.

సావిత్రి గతుక్కుమంటుంది.. ఆమె ముఖం లో కంగారు ప్రవేశిస్తుంది.

‘‘అవును కదా.. నేనీ విషయం గురించి ఇంతవరకూ ఆలోచించనే లేదు.. గుళ్ళో పనికోసం నేను పంపించిన నిన్ను కాకుండా ఆ శారదని గోపాల్ ఎందుకు పెట్టుకున్నాడు.. అసలా రోజు ఏం జరిగింది..?’’ రాజారాం తిరిగి ప్రశ్నిస్తాడు.

సావిత్రి కంగారుగా దిక్కులు చూస్తుంటుంది.. రాజారాం ఆమె దగ్గరికి వస్తాడు.. ఆమె కళ్ళల్లోకి సూటిగా చూస్తాడు.. సావిత్రి అతని ముఖం లోకి చూడకుండా దిక్కులు చూస్తుంటుంది...

‘‘నిజం చెప్పు.. అసలు ఆరోజేం జరిగింది..?’’ గుచ్చి గుచ్చి అడుగుతాడు.

‘‘అదీ.. అదీ.. మరేమో..’’

‘‘అలా నసగకుండా ఏం జరిగిందో చెప్పు.. నువ్వు ఉదయాన్నే గుడికి వెళ్ళావు.. నువ్వు వెళ్ళినప్పుడు ఆ శారద ఇంకా గుళ్ళోకి రానే లేదని చెబుతున్నావు.. మరి ముందుగా వెళ్ళిన నిన్ను కాదని ఆ శారదని గోపాల్ ఎందుకు పనిలో కుదిర్చాడు.. చెప్పు..’’ అతని ముఖం లో కోపం ధ్వనిస్తుంది. ‘‘అంటే.. నేను ముందే వెళ్ళాను.. నా తర్వాత శారద వచ్చింది..

మేమిద్దరం మేనేజర్ కోసం ఎదురు చూస్తుండగా ఆయన హడావిడిగా గుళ్ళోకి వచ్చాడు.. మా ఇద్దర్నీ చూసాడు.. ఏదో అర్జెంటు పని ఉందంటూ వచ్చినవాడు క్షణంసేపు కూడా ఉండకుండా బయటికి వెళ్ళాడు.. మళ్ళీ ఓ అరగంట తర్వాత తిరిగి వచ్చి నువ్వు పంపింది శారదనే అనుకుని ఆమెని పనిలోకి కుదుర్చుకున్నాడు.. అదీ జరిగింది..''

ఆమె గొంతులో సన్నగా వణుకు.. రాజారాం ఆమెనే తీక్షణంగా చూస్తుంటాడు.. ఆమె చెప్పింది నమ్మనట్టుగా రాజారాంకి అనిపిస్తుంది.

''నువ్వు.. నువ్వు నా దగ్గర ఏదో దాస్తున్నావు.. నిజం చెప్పు.. ఆయన వచ్చి వెళ్లడం వరకూ ఓకే.. కానీ.. నేను పంపించింది శారదనే అనుకుని ఆయన పనిలోకి కుదుర్చుకున్నాడన్నది మాత్రం నేను నమ్మను.. ఇంకేదో జరిగింది.. ఏం జరిగిందో చెప్పు..''

''అంటే.. మరేమో..'' రెండు చేతులూ నలుపుకుంటూ నసుగుతుంది సావిత్రి.

''ఏహె.. నీ నసుగుడాపి విషయం చెప్పు..!'' కోపంగా అంటాడు.

సావిత్రి తలదించుకుంటుంది.. మెల్లిగా గొంతు విప్పుతుంది..

''ఆరోజు మేనేజర్ హడావిడిగా బయటికి వెళుతూ.. మా ఇద్దరినీ చూసాడు.. ఒక అరగంటలో వస్తాను.. ఆ లోపు గుడిని కాస్త శుభ్రం చేయండి అని చెప్పాడు..'' సావిత్రి చెప్పడం మొదలు పెడుతుంది. ''అతను చెప్పి వెళ్ళగానే.. ఆ శారద గుడి శుభ్రం చేస్తుంటే.. నువ్వేమో ఓ మూల వెళ్ళి కూర్చున్నావు..

అంతేగా..'' కోపంగా అంటాడు.

సావిత్రి అతని వంక ఆశ్చర్యంగా చూస్తుంది..

''అవును.. అదే జరిగింది.. ఇంత కరెక్టుగా ఎలా చెప్పావు..?''

''అనుకున్నాను.. నువ్విలాంటిదేదో చేసుంటావని అప్పుడే అనుకున్నాను.. అయినా.. నువ్వెళ్లింది ఆ గుడిని శుభ్రపరిచే పనికోసమే కదా.. ఆయన వచ్చేలోపు ఆపని నువ్వు చేసుంటే.. ఇప్పుడు మనకింత బాధ ఉండేది కాదు..

ఆ శారదని గుళ్ళోనుండి ఎలా బయటికి పంపించాలా అన్న టెన్షనూ ఉండేది కాదు..'' చిరాగ్గా అంటాడు రాజారాం.

''అబ్బా.. రాజారాం.. జరిగిపోయిన దాని గురించి ఇప్పుడు ఆలోచిస్తే ప్రయోజనం ఏముంటుంది..? జరగాల్సిందేదో అది చూడు..'' అక్కడి వాతావరణాన్ని తేలిక చేయడానికి అంటుంది సావిత్రి. రాజారాం తలూపుతాడు.. అతని చూపులు  శూన్యంలోకి చూస్తుంటాయి.. ఓ రెండడుగులు ముందుకు వేస్తూ తన రెండు చేతులు వెనుకగా పెట్టుకుని సీలింగ్ వంక చూస్తాడు.. అతని ముఖం లో శారదపై ఉన్న ద్వేషం స్పష్టంగా కనిపిస్తుంటుంది..

''అవును.. జరగాల్సిందాన్నే చూడాలి..''

వెనక్కి తిరిగి సావిత్రి వంక చూస్తాడు..

''ఆ శారదని గుళ్ళోనుండి బయటికి పంపించి వేయడానికి ఆల్రెడీ ఓ స్కెచ్ వేసి ఉంచాను.. అయినా.. దాన్ని గుళ్ళోనుండి తరిమేయడానికి ఇంత పెద్ద స్కెచ్ అవసరమా అనుకుని ఊరుకుండిపోయాను.. కానీ.. తప్పేలా లేదు.. దాన్ని వాడుకోవాల్సిందే.. చూస్తూ ఉండు.. రెండు రోజుల్లో ఆ శారదని గుళ్ళోనుండే కాదు, ఆ కాలనీలో నుండే తనని ఇష్టపడే వాళ్ళే తన్ని తరిమేసేలా చేస్తాను... హ..హ..హ..''

రాజారాం వికృతంగా నవ్వుతాడు.. అలా నవ్వుతున్న రాజారాంని సావిత్రి ఆశ్చర్యంగానూ, భయంగానూ చూస్తుంటుంది.

................................

రాజారాం గుడి ప్రాంగణంలోకి బైక్‌పై వస్తాడు.. బైక్‌ని పార్క్‌చేసి గుడిలోపలికి వస్తాడు.. గుడి ఆవరణలో సాయిబాబా విగ్రహానికి వేసే పూలహారాన్ని అల్లుతూ  కనిపిస్తుంది శారద.

రాజారాం శారదని  చూస్తాడు.. శారదని చూడగానే అతని కళ్ళల్లో ఒక విధమైన  కోపం కనిపిస్తుంటుంది..

యథాలాపంగా శారద కూడా రాజారాంని చూస్తుంది.. రాజారాం కళ్ళల్లో తనపై కనిపిస్తున్న కోపాన్ని చూసి కంగారుపడుతుంది శారద..

మేనేజర్ గోపాల్ ఆఫీసు వైపు అడుగులు  వేస్తాడు రాజారాం.. అతను ముందుకు అడుగులు వేస్తున్నా అతని చూపు మాత్రం శారద వైపే ఉంటుంది.. తల దించుకొని తన పని తాను చేసుకుంటున్న శారదలో ఏదో అనీజీ... మెల్లిగా తలెత్తి రాజారాం వంక చూస్తుంది.. రాజారాం చూపు తనపైనే ఉండడం.. ఆ చూపులో తనపై  ఉన్న ద్వేషాన్ని గ్రహిస్తుంది శారదమ్మ..

శారదపైనుండి చూపు మరల్చకుండానే  రాజారాం మేనేజర్ గోపాల్ ఆఫీసులోకి వెళ్తాడు.

మేనేజర్ గోపాల్ తన టేబుల్ ముందున్న ఓ ఫైల్‌లో ఏదో సీరియస్‌గా రాస్తూ ఉంటాడు.. ఆఫీసు లోపలికి రాజారాం రావడం గమనించి తలెత్తి రాజారాం వంక చూస్తాడు..''రావయ్యా రాజారాం.. రా.. కూర్చో..'' నవ్వుతూ అంటాడు మేనేజర్ గోపాల్

రాజారాం చిన్నగా నవ్వుతూ గోపాల్ ఎదురుగా కుర్చీలో కూర్చుంటాడు.. గోపాల్ తాను చేస్తున్న పనిని ఆపేసి రాజారాం వంక చూస్తాడు..

''దశ వసంతోత్సవానికి ఇంకా ఎంతో సమయం లేదు.. ఈ లోపు చాలా పనులు చేయాల్సి ఉంది.. గుడి మొత్తం లైట్ల డెకరేషన్ చేయించాల్సిన బాధ్యత నీదే కదా.. ఈరోజు నుండే ఆ పనిలో ఉండు రాజారాం..''

‘‘ఆ..ఆ.. చాలా బ్రహ్మాండంగా లైట్ డెకరేషన్ చేయిస్తాను.. గుడి లోపల, బయటా ఏర్పాటు చేసిన విద్యుత్తు లైట్ల కాంతులతో సాయి మందిరం కళకళలాడే విధంగా చేసే బాధ్యత నాదే..’’ ఉత్సాహంగా అంటాడు రాజారాం.

‘‘మంచిది.. దానికి కావలసిన డబ్బు ముందే తీసుకుంటావా..? లేక పనయిపోయిన తర్వాత సర్దమంటావా..?’’

యథాలాపంగా అంటాడు గోపాల్.

‘‘దేవుడి కార్యానికి డబ్బు ముఖ్యం కాదు లెండి.. నా వరకు నేనే ఏర్పాట్లు చేస్తాను.. వాటి తాలుకూ బిల్లులు ఇచ్చిన తర్వాతే నాకు డబ్బు ఇద్దురు గానీ.. తొందరేమీ లేదు..’’ నవ్వుతూ అంటాడు రాజారాం.

గోపాల్ సంతోషంగా నవ్వుతాడు..

‘‘ఇంకా ఏమిటి విశేషాలు..?’’

రాజారాం గోపాల్ వంక చూస్తాడు.. అప్పటి వరకు చిరునవ్వుతో ఉన్న రాజారాం ముఖం లో ఎక్స్‌ప్రెషన్స్ మారుతుంటాయి.. ముఖం లో గాంభీర్యాన్ని తెచ్చుకోవడానికి ప్రయత్నిస్తుంటాడు.. అతని ముఖం లో మారుతున్న భావాలను గోపాల్ గమనిస్తాడు.

‘‘నాతో ఇంకా ఏదయినా మాట్లాడాలా..???

రాజారాం కంగారు పడుతున్నట్టుగా నటిస్తాడు..

‘‘ఆ..ఆ.. మరేమీ లేదు.. నిన్న నేను ఏదో పనిపైన జ్యువెలరీ షాప్‌కి వెళ్ళాను..’’ అంటాడు రాజారాం.

‘‘జువెలరీ షాప్‌కి వెళ్ళారా..?’’

‘‘ఆ..ఆ.. అదే మన సాయిబాబా బంగారు ఆభరణాలు మెరుగు పరచడం కోసం ఇచ్చామే.. ఆ జువెలరీ షాప్‌కి వెళ్ళాను..’’ రాజారాం గొంతు కాస్త తడబడుతుంది.

గోపాల్ రాజారాంని ఎగాదిగా చూసి తల పంకిస్తాడు..‘‘ఓహో.. అలాగా..!’’ మాములుగా అంటాడు గోపాల్.

‘‘ఏదో మాట్లాడుతూ సాయిబాబా ఆభరణాలు మెరుగు పరిచే పని ఎంత వరకు వచ్చిందని ఆరా తీసాను.. కొన్ని ఆభరణాల పని పూర్తయిందని, మరికొన్ని మిగిలున్నాయని  రెండు మూడు రోజులలో తిరిగి ఇస్తానని  చెప్పారు..

ఒకసారి నేను వాటిని పరిశీలించాను.. అందులో అన్ని ఆభరణాలు ఉన్నాయి కానీ.. ఓ బంగారు కిరీటం మాత్రం కనిపించలేదు.. అదే వారిని అడిగాను.. ఇంకో బంగారు కిరీటం ఉండాలి కదా అని.. కానీ వాళ్ళు తమకి ఇచ్చిన ఆభరణాలు ఇవే నని, బంగారు కిరీటం ఇవ్వలేదని తెలిపారు..’’ రాజారాం గోపాల్ వంకే చూస్తూ మెల్లిగా అంటాడు రాజారాం.

గోపాల్ ఆశ్చర్యంగా చూస్తాడు.

‘‘ఏమిటీ..? బంగారు కిరీటాన్ని ఇవ్వలేదా..?’’

రాజారాం కూడా తన ముఖం లో ఆశ్చర్యాన్ని కొని తెచ్చుకుంటాడు..

‘‘అవునండీ..! బంగారు కిరీటాన్ని ఇవ్వలేదంట.. అన్ని ఆభరణాలు మెరుగు పరచడానికి ఇచ్చేసి.. ఈ ఒక్క బంగారు కిరీటాన్ని మాత్రం ఎందుకు ఇవ్వలేదని ఎంతో ఆశ్చర్యపోయాను..’’ తన ముఖం లో విపరీతమైన ఆశ్చర్యాన్ని ఒలకబోస్తున్నట్టు అంటాడు రాజారాం.

‘‘ఆ ఆభరణాలను జ్యువెలరీ షాపులో మూర్తి గారు ఇచ్చారు.. ఒక్కనిమిషం ఉండండి.. మూర్తిగారికి ఫోన్ చేసి కనుక్కుంటాను..’’

గోపాల్ తన జేబులో ఉన్న సెల్‌ఫోన్‌ని తీస్తాడు.. అందులో మూర్తి నంబర్‌ని డయల్ చేసి చెవి దగ్గర పెట్టుకుంటాడు..

రాజారాం ఫోన్ చేస్తున్న గోపాల్ వంకే చూస్తుంటాడు.. అతని ముఖం లో ఒక విధమైన పైశాచిక ఆనందం తాండవిస్తుంటుంది..

ఫోన్ రింగవుతున్న శబ్దం వినిపిస్తుంది.. గోపాల్ రాజారాం వంక చూస్తాడు..

''ఫోన్ రింగవుతుంది.. ఒక్కనిముషం..'' తన వంకే ఆసక్తిగా చూస్తున్న రాజారాంని చూస్తూ అంటాడు గోపాల్. రాజారాం తన ముఖం లోని ఎక్స్‌ప్రెషన్స్‌ని వెంటనే మార్చేస్తాడు.. ముఖం ఎంతో అమాయకంగా పెడతాడు.. గోపాల్ మాటలకి

''అలాగే నండీ..'' మూర్తి ఫోన్ లిఫ్ట్ చేస్తాడు..

''సాయిరాం గోపాల్ గారూ..'' అవతలి నుండి మూర్తి వాయిస్.

''సాయిరాం మూర్తి గారూ.. ఒక చిన్న విషయమై మీకు ఫోన్ చేసాను..''

''ఆ.. చెప్పండి..'' మూర్తి అంటాడు.

''మొన్న మీరు జువెలరీ షాపులో ఆభరణాలు మెరుగు పరిచేందుకు ఇచ్చారు కదండీ..!''

''అవును ఇచ్చానండీ.. వారం రోజుల్లో ఆభరణాలు అన్నింటినీ తళతళా మెరిసేలా చేసి ఇస్తానని ఆ షాపు యజమాని నాతో చెప్పాడు కూడా.. అయినా.. ఆ ఆభరణాలు షాపులో ఇచ్చేసిన సంగతి మీకు ఆరోజే తెలిపాను కదా.. మళ్ళీ కొత్తగా అడుగుతున్నారేంటీ '' మూర్తి ఆశ్చర్యంగా అంటాడు.

''మరేమీ లేదు.. మీరిచ్చిన ఆభరణాలో సాయిబాబా పాత బంగారు కిరీటాన్ని ఇవ్వలేదని జువెలరీ  షాపు వాళ్ళు చెప్పారని తెలిసింది.. అది కనుక్కుందామని మీకు ఫోన్ చేసాను.. ''

''ఆ..ఆ.. అవునవును.. నేనే ఆ కిరీటాన్ని ఇవ్వలేదండీ..! క్రితం సంవత్సరం మనం జరిపిన ఉత్సవాలో ఆ కిరీటం క్రిందపడిపోయింది కదా.. ఓ పక్కన సొట్ట కూడా పడింది.. ఆ కిరీటాన్ని సాయిబాబా అలంకారానికి దూరంగా ఉంచాలని పూజారిగారు చెప్పారు.. అందుకోసమే నేను ఆ కిరీటాన్ని ఇవ్వలేదు.. '' అంటాడు మూర్తి. మూర్తి సమాధానానికి గోపాల్ రిలీఫ్‌గా ఫీల్ అవుతాడు.. రాజారాం వంక నవ్వుతూ చూస్తాడు..

రాజారాం అదే అమాయకమైన ఎక్స్‌ప్రెషన్స్‌తో గోపాల్‌వంక చూసి నవ్వుతాడు..

''బంగారు కిరీటం ఇవ్వలేదని మీరు చెప్పడంతో ఎంతో కంగారు పడిపోయాననుకో.. అసలు ఆ కిరీటాన్ని జువెలరీ షాప్‌లో ఇవ్వనేలేదంట మూర్తి గారు..'' రిలీఫ్‌గా అంటాడు గోపాల్..

రాజారాం కూడా ఎంతో ఆనందపడిపోతున్నట్టు నటిస్తాడు..

''హమ్మయ్య.. నాక్కూడా కంగారు వచ్చేసింది.. బంగారు కిరీటం ఇవ్వలేదని చెప్పడంతో.. ఒకటా రెండా నాలుగు లక్షల రూపాయల విలువ చేసే  కిరీటం కదా..'' రాజారాం కూడా ఆనందాన్ని వ్యక్తం చేస్తూ అంటాడు.

''అవునవును.. మీరు ఇంత శ్రద్ధగా కనుక్కున్నందుకు థ్యాంక్యూ అండీ..''

''అయ్యో.. దీనికి థ్యాంక్స్ ఎందుకండీ.. ఈ ఆలయ కమిటీ మెంబర్‌గానే కాదు, ఈ ఆలయ క్లీనింగ్ హెడ్‌గా నాకా బాధ్యత ఉంటుంది.. మొత్తానికి బంగారు కిరీటం మన గుళ్ళోనే ఉందని తెలిసింది.. ఇప్పుడు నా మనసు తేలికపడింది.. ఇక ఉంటానండీ.. అని రాజారాం కుర్చీలో నుండి లేస్తాడు..

''మంచిది.. మందిరం అలంకరణ పనులు ఈ రోజునుండే మొదలు పెట్టండి..''

''అలాగే నండీ.. మీరు దాని గురించి ఏమాత్రం టెన్షన్ పడకండి.. అన్నీ నేను చూసుకుంటాను..'' అభయమిస్తాడు రాజారాం.

''మంచిది..'' అంటాడు గోపాల్. కానీ ఎందుకో రాజారాం ప్రవర్తనలోనూ, మాటలోనూ ఆయన ఏదో తేడా గమనిస్తాడు.

రాజారాం ఆ గదిలోనుండి బయటికి వస్తుంటాడు.. గోపాల్ వెళుతున్న రాజారాం వంకే చూస్తుంటాడు..

రాజారాం ముఖంలో రకరకాల  భావాలు  కదలాడుతుంటాయి.. మెల్లిగా ఒక్కో అడుగు వేస్తూ గోపాల్ వంక ఓరగా చూస్తుంటాడు..

ఆ ఆఫీసు గది తలుపులు దగ్గరకు వెళ్ళి ఆగిపోతాడు.. అప్పుడే ఏదో గుర్తుకు వచ్చిన వాడిలా...

సడన్‌గా ఆగిపోయిన రాజారాంని చూస్తుంటాడు గోపాల్.. రాజారాం గోపాల్ వంక తిరిగి ఆయన దగ్గరకు వస్తాడు..

''ఆ బంగారు కిరీటాన్ని కళ్లారా చూసేంత వరకూ నా మనసులో ఉన్న ఆందోళన తగ్గేలా లేదండీ.. మీరు మరోలా భావించకపోతే ఆ బంగారు కిరీటాన్ని ఓసారి చూసొద్దామా..!''

''అయ్యో.. దీనిలో పెద్ద విశేషమేముందండీ.. అలాగే చూద్దాం.. గుడిలోపల  ఉన్న గదిలోనే కిరీటం ఉంటుంది కదా.. సరే.. పద..'' అంటూ తన ముందున్న ఫైల్స్‌ని సర్దేసి ఓ పక్కగా పెడతాడు.

రాజారాం ముఖంలో పైశాచిక ఆనందం తాండవిస్తుంది.. గోపాల్ తనవైపు చూడగానే తిరిగి మాములుగా అమాయకంగా ముఖం పెడతాడు..

గోపాల్ కుర్చీలోనుండి లేచి ఆ పక్కనే గోడకి ఉన్న ఓ మేకుకి వేలాడుతున్న తాళం చెవి గుత్తిని చేతిలోకి తీసుకుని రాజారాం వంక చూస్తాడు..''పదండి వెళదాం...'' అంటాడు గోపాల్

''అలాగే.. పదండి..'' వినయంగా అంటాడు రాజారాం.

గోపాల్ ముందు వెళుతుంటాడు.. అతని వెనకాలే రాజారాం అడుగులు  వేస్తాడు.. అతని ముఖంలో రాక్షసానందం తాండవిస్తుంది.

''ఒసేయ్ శారదమ్మా.. నేటితో ఈ గుడికి, నీకు ఋణం తీరిపోతుంది.. '' మనసులోనే కసిగా అనుకుంటాడు రాజారాం.

రాజారాం మనసులో కసిగా అనుకుంటూ గోపాల్ వెనకే అడుగులు వేస్తుండగా..

......................................

మేనేజర్ గోపాల్,  రాజారాం ఇద్దరూ సాయిబాబా  మందిరం పక్కనే  ఉన్న గది  దగ్గరికి వస్తారు..

గోపాల్ తన చేతిలో ఉన్న తాళం చెవి వంక చూస్తాడు.. గోపాల్ ప్రక్కనే  ఉన్న రాజారాం ముఖంలో టెన్షన్ ప్రవేశిస్తుంది.. ఊపిరి బిగపట్టి తాళం వంకే చూస్తుంటాడు రాజారాం.. గోపాల్ రాజారాం వంక చూస్తాడు..

గోపాల్ తనవైపు చూడగానే రాజారాం తన ముఖంలో టెన్షన్ కనిపించకుండా జాగ్రత్తపడి చిన్నగా నవ్వుతాడు..

గోపాల్ రాజారాంని నిశితంగా చూస్తాడు.. రాజారాం చిరునవ్వుతో గోపాల్‌ని చూస్తూ తాళం తీయండి అన్నట్టుగా చేయితో సైగ చేస్తాడు..

గోపాల్ చిన్నగా నవ్వుతూ.. తన చేతిలో ఉన్న తాళం చెవిని రాజారాంకి ఇస్తాడు..

''రాజారాం గారూ.. తాళం తీయండి..''

''అయ్యో.. భలేవారే.. మీరే తెరవండి..'' మొహమాటంగా అంటాడు రాజారాం.

''కిరీటం ఉందో లేదో అన్న అనుమానం వచ్చింది మీకే కదా.. ఫర్వాలేదు.. మీరు తెరవండి..'' నవ్వుతూ అంటాడు గోపాల్.

గోపాల్ కాస్త పక్కకి తప్పుకుంటాడు.. రాజారాం ముఖం లో కంగారు ప్రవేశిస్తుంది.. అయినా తనని తాను సర్దుకుని తలుపుకి దగ్గరగా వస్తాడు.. తన చేతిలో ఉన్న తాళం చెవిని తాళంలోకి పోనిస్తాడు.. తాళం తెరుస్తున్నప్పుడు అతని ముఖంలో ఒక విధమైన వికృతానందం కనిపిస్తుంటుంది.. గోపాల్ రాజారాం ముఖం వైపే చూస్తూంటాడు..

తాళం తీసి తలుపులు తెరుస్తున్నప్పుడు అతని చేతులు సన్నగా కంపిస్తాయి..రాజారాం ముఖం లో టెన్షన్, గోపాల్ రాజారాం మొఖాన్నే గమనిస్తుంటాడు… తలుపులు  తెరిచాక రాజారాం

గోపాల్ వంక చూస్తాడు..

'లోనికి పదండి' అన్నట్టుగా తన చేయితో సైగ చేస్తాడు గోపాల్.. వారిద్దరూ ఆ గదిలోకి ప్రవేశిస్తారు.

గది లోపలికి వచ్చాక గోపాల్ ఆ పక్కనే గోడకి ఉన్న స్విచ్‌ని ఆన్ చేస్తాడు.. ఆ గది మొత్తం వెలుతురు ప్రవేశించగానే రాజారాం, గోపాల్ ఇద్దరూ బంగారు ఆభరణాలు  పెట్టే చోటువైపు చూస్తారు..

ఆశ్చర్యం…

ఆ ప్రదేశంలో కిరీటం కనిపించదు.. కిరీటం కనిపించకపోవడంతో గోపాల్ ముఖంలో విపరీతమైన ఆశ్చర్యం కనిపిస్తుంది.. గోపాల్ కనుగుడ్లు పెద్దవవుతాయి.. గోపాల్‌లో వస్తున్న మార్పుని గమనించి ఎంతో ఆనందపడిపోతాడు రాజారాం..

గోపాల్ ముఖం ఆశ్చర్యంతో పాటు, ఆందోళన కనిపిస్తుంటుంది.. కంగారుగా ఆ గది మొత్తం కిరీటం కోసం వెదుకుతాడు..

రాజారాం ముఖం లో ఆనందం.. గోపాల్ వెనకాల నిలబడి తనలో తాను పెద్దగా నవ్వుకుంటాడు.. గోపాల్ తన వంక చూడగానే.. ఎంతో ఆశ్చర్యంతో కూడిన ఎక్స్‌ప్రెషన్ ఇస్తాడు రాజారాం..

రాజారాం కూడా ఆ గదిలో కిరీటం కోసం వెతుకుతున్నట్టు నటిస్తాడు.. సాయినాధుడికి సంబంధించిన పట్టు పీతాంబరాలు, మొదలైన బట్టలు ఓ చోట కుప్పగా ఉంటాయి.. గోపాల్ వాటి దగ్గరికి వెళ్ళి మోకాళ్ళపై కూర్చుని ఆ బట్టలన్నీ తీసి చూస్తాడు.. వెతుకుతున్న గోపాల్ ముఖం లో కంగారు..

రాజారాం ముఖం లో అదే వికృతానందం.. కిరీటం లేదన్న విషయం రాజారాంకి ముందే తెలుసు.. అతనిలోని హావభావాలు చాలా కృత్రిమంగా కనిపించడం గోపాల్ గమనిస్తాడు.

గోపాల్ ముఖం పై చెమటబిందువులు ప్రత్యక్షమవుతాయి.. గోపాల్ విపరీతమైన ఆందోళనలో ఉన్నాడన్నట్టుగా అతని మొహకవళికలు మారిపోతాయి..

బట్టలన్నింటిలోనూ వెతికిన గోపాల్ నిరుత్సాహంతో పైకి లేస్తాడు.. డీలా పడిపోయిన ముఖం తో రాజారాం వంక చూస్తాడు.. రాజారాం కూడా ఎంతో ఆందోళన చెందుతున్నట్టుగా ముఖం లో ఎక్స్‌ప్రెషన్స్ పెడతాడు..

‘‘చూసారా.. నా అనుమానమే నిజమయింది.. మూర్తి గారు జ్యువలరీ షాపులో కిరీటాన్ని ఇవ్వలేదని చెప్పారు..

జ్యువలరీ షాపులో కిరీటం ఇవ్వకుంటే కిరీటం ఈ గదిలోనే ఉండాలి కదా..?’’ ఆందోళనని ముఖం లో నింపుకుని కంగారుగా అంటాడు రాజారాం.

రాజారాం ముఖం లో ఆందోళన తెచ్చిపెట్టుకోవడం కోసం తీవ్రంగా ప్రయత్నం చేస్తూండడం గోపాల్ రాజారాం వంక చూసినపుడు గుర్తిస్తాడు గోపాల్.

‘‘అవును.. ఈ గదిలోనే ఉండాలి.. కానీ.. కిరీటం కనిపించడం లేదంటే..’’ అర్ధోక్తిలో మాటని ఆపేసి చేతులు నలుపు కోవడం మొదలు పెడతాడు గోపాల్.

గోపాల్ వాయిస్ సన్నగా కంపిస్తుంటుంది.. గోపాల్‌లో కనిపిస్తున్న ఆందోళన చూసి రాజారాం లోలోపల ఎంతో సంతోషిస్తుంటాడు..

‘‘ఒక వేళ మూర్తిగారు ఈ కిరీటాన్ని మరోచోట దాచారేమో..!’’ తన లోని అనుమానాన్ని బయట పెడతాడు రాజారాం.

‘‘బంగారు, వెండి ఆభరణాన్నింటినీ ఈ గదిలోనే భద్రపరుస్తాము కదా.. ఈ గదిలో కాకుండా మరో గదిలో పెట్టే అవకాశమే లేదు..’’ ఆందోళనగా అంటాడు గోపాల్.

‘‘పోనీ ఓపని చేయండి.. మూర్తి గారికి  ఫోన్ చేసి విషయం చెప్పండి..’’ సలహా ఇస్తాడు రాజారాం.

‘‘వద్దు.. ఫోన్‌లో  ఈ విషయం  చెబితే మూర్తిగారు కూడా కంగారు పడిపోతారు.. ఒకవేళ మీరు చెప్పినట్టు కిరీటాన్ని వేరే ఎక్కడయినా భద్రపరిస్తే.. ఇందాక నేను ఫోన్ చేసినప్పుడే ఆ విషయం చెప్పేవాడు కదా.. అలా చెప్పలేదంటే కిరీటం ఈ గదిలోనే ఉండాలని అర్థం.. కానీ.. గదిలో కిరీటం కనిపించడం లేదంటే..’’ గోపాల్

మాటని మధ్యలోనే ఆపేస్తాడు.. అతనిలో విపరీతమైన ఆందోళన..

రాజారాం గోపాల్‌నే జాగ్రత్తగా గమనిస్తుంటాడు..

‘‘కొంపదీసి ఈ కిరీటాన్ని ఎవరైనా...’’ తనలోని అనుమానాన్ని వ్యక్త పరుస్తాడు రాజారాం. అతని భావం.. ఆ గదిలోనుండి కిరీటాన్ని ఎవరో దొంగిలించారన్న భావన రావడంతో గోపాల్ రాజారాంని విస్మయంగా చూస్తాడు.

గోపాల్ అతని వంక సీరియస్‌గా చూడడంతో మధ్యలోనే మాటని ఆపేస్తాడు రాజారాం..

''భగవంతుడి సొమ్ముని బయటివారు ఎందుకు తీస్తారయ్యా.. అయినా ఈ గదిలోకి నేను, మూర్తి గారు, మీరు తప్ప ఇంకెవరూ వచ్చే అవకాశమే లేదు.. అలాంటిది.. కిరీటం మాయం అయ్యిందంటే అది మన ముగ్గురిలోనే ఎవరో ఒకరు అశ్రద్ధ కనబరచడమే అవుతుంది..'' సీరియస్‌గా అంటాడు గోపాల్.

''ఇదేమి విచిత్రమండీ.. అనుకోకుండా నేను జ్యువలరీ షాపుకి వెళ్ళడమేమిటీ.. అక్కడ కిరీటం కనిపించకపోవడంతో నాలో ఆందోళన కలగడమేమిటీ..? ఆ ఆందోళనతో మీ దగ్గరికి వచ్చి నేను ఆరా తీయడమేమిటీ.. తీరా గదిలోకివచ్చి చూస్తే కిరీటం కనిపించకపోవడమేమిటి..? ఈ గదిలోకి  వచ్చే అవకాశం మన  ముగ్గురికే ఉండవచ్చు..

కాదనను.. కానీ.. మనకి తెలియకుండా ఇంకెవరైనా వచ్చే అవకాశం ఉండొచ్చు కదా..'' తనలోని అనుమానాన్ని వ్యక్త పరుస్తాడు రాజారాం.

ఆందోళన నిండిన కంఠంతో రాజారాం అంటాడు.. గోపాల్ రాజారాం వంక నిస్సహాయంగా చూస్తాడు.. రాజారాం మాటలకి గోపాల్ మౌనంగా ఉండిపోతాడు.. ఏదో తీవ్రంగా ఆలోచిస్తున్నట్టుగా గోపాల్ ముఖం లో ఎక్స్‌ప్రెషన్స్..

రాజారాం గోపాల్‌వంకే చూస్తూ మెల్లిగా అంటాడు..

''ఆ.. గుర్తొచ్చింది.. మూర్తిగారు బంగారు ఆభరణాలు ఈ గదిలోనుండి తీసుకువెళ్ళేసమయంలో నేను కూడా ఇక్కడే ఉన్నానండీ..'' అప్పుడే ఏదో గుర్తుకు తెచ్చుకున్నవాడిలా అంటాడు రాజారాం.

గోపాల్ రాజారాం వంక చూస్తాడు ఆశ్చర్యంగా...

''అవునండీ.. ఆరోజు ఏదో పని ఉండి ఇక్కడికి వచ్చాను.. సరిగ్గా అదే సమయానికి మూర్తిగారు ఈ గదిలోనుండి ఆభరణాలని తీసుకువెళ్ళాడు.. ఆ సమయంలో కిరీటం ఇదే గదిలో ఉండడం నేను చూశాను.. నా కళ్ళముందే మూర్తిగారు బయటికి వచ్చి గది తాళం వేసాడు కూడా.. ఆ తర్వాత మళ్ళీ ఈ గదిని ఎవరైనా తెరిచారా..?

''మూర్తిగారు ఆభరణాలు తీసుకువెళ్ళిన తర్వాత మళ్ళీ ఈ గది తలుపు  తెరవలేదు..''
గోపాల్ గుర్తుకు తెచ్చుకుంటున్నట్టుగా ముఖం లో ఎక్స్‌ప్రెషన్స్ ఇస్తూ అంటాడు.

''వింతగా ఉన్నదే.. మూర్తిగారు గది మూసేటప్పుడు గదిలోనే ఉన్న కిరీటం ఎలా మాయమై పోయింది..?''

''అదే.. అదే అర్థం కావడం లేదు..'' కంగారుగా అంటాడు గోపాల్. గోపాల్ ముఖం లో ఆందోళన.. అతని మొఖమంతా చెమటపట్టేసి ఉంటుంది..

గోపాల్ మొఖ కవళికలని గమనించిన రాజారాం.. '' గోపాల్ గారూ.. మీరు అనవసరంగా ఆందోళన చెందకండి.. కాస్త నిదానపడండి..'' అంటాడు అనునయిస్తున్నట్టుగా..

''నేను ఈ గుడి మేనేజర్‌గా ఉన్న ఇన్ని సంవత్సరాలలో ఒక్క వస్తువు కూడా కనిపించకుండా పోయిన సందర్భం లేదు.. అలాంటిది ఏకంగా బంగారు కిరీటమే కనిపించకుండా పోవడమంటే.. ఆందోళన కాక మరేముంటుందండీ..''

గోపాల్ తీవ్రంగా ఆందోళన చెందుతున్నాడని అతని ముఖం లోని భావాలే చెబుతున్నాయి.

''కిరీటం కనిపించడం లేదన్నది వాస్తవమే అయినా.. మీరు మరీ ఇంతలా కంగారు పడితే పోయిన కిరీటం వస్తుందా చెప్పండి.. అయినా.. ఒకసారి మూర్తిగారిని కనుక్కుంటే అసలు విషయం తెలుస్తుంది కదా.. మీరు అనవసరంగా కంగారు పడకండి.. ఫోన్‌లో మూర్తిగారికి ఈ విషయం గురించి చెప్పడం ఇష్టం లేకపోతే.. వెంటనే ఆయనని ఇక్కడికి పిలిపించండి.. అసలు విషయం తెలుస్తుంది..'' రాజారాం సలహా ఇస్తాడు.

''మీరన్నది నిజమే.. ముందాపని చేద్దాం.. మూర్తిగారిని పిలిపించి అసలు విషయం రాబట్టేంత వరకూ నాకు టెన్షన్ తగ్గేలా లేదు.. ఆ సాయినాధుడు నాకు ఇంత పెద్ద పరీక్ష పెడతాడని నేను కలలో కూడా ఊహించలేదే..

సాయినాథా.. నువ్వే ఈ గండం నుండి గట్టెక్కించు తండ్రీ.. అయినా నీ వస్తువుని కాజేసేవారెవరుంటారు స్వామీ..''

కనిపించని ఆ సాయినాధుడిని వేడుకుంటాడు రాజారాం..

ఆ గదిలో గోడకి వేలాడుతున్న సాయిరాం ఫోటోలో ఆయన ముఖం లోని చిరునవ్వుని గమనించిన గోపాల్ మనసు కాస్త తేలికపడుతుంది.. దేవుడి సొమ్ముకి ఆశపడేవారు ఉన్నారని తెలుసు కానీ.. మరీ ఇంతకి తెగిస్తారని మాత్రం గోపాల్‌కి ఇప్పుడే తెలిసి వచ్చింది. ఆ మందిరంలో కానుకలు వేసే హుండీలో ఉండే సొమ్ములో ఒక్క రూపాయి కూడా తేడా లేకుండా చూసుకున్న తాను.. అత్యంత విలువయిన ఈ బంగారు ఆభరణాలపై అశ్రద్ధ వహించినందుకు తనని తానే నిందించుకుంటాడు గోపాల్.

''ఎందుకుండరండీ.. రోజూ పేపర్లలో చదువుతూనే ఉన్నాము కదా.. చూడ్డానికి ఎంతో అమాయకంగా కనిపించేవారు హుండీలని కాజేయడం, దేవుడి ఆభరణాలని దొంగిలించుకుపోవడం ఈ రోజుల్లో కామన్ అయిపోయింది..

ఎవరూ లేని అనాధలమని చెప్పుకుని గుళ్ళో ఆశ్రయం పొందిన వారే ఇలాంటి పనులు చేసిన సంఘటనలు ఎన్నో ఉన్నాయి..''

ఆ మాటలకి గోపాల్ రాజారాం వంక సీరియస్‌గా చూస్తాడు.. రాజారాం తనలోని కంగారుని కప్పిపుచ్చుకుంటాడు..

రాజారాం కిరీటం మాయం అయిపోవడం వెనుక ఎవరిని అనుమానిస్తున్నాడో గోపాల్‌కి లీలగా అర్ధం అయింది. ఎవరూ లేని అనాధగా గుళ్ళో ఆశ్రయం పొందుతున్నది ప్రస్తుతం శారద మాత్రమే. పైగా ఆమె గుళ్ళోకి వచ్చిన అనతి కాలంలోనే గుడిలో జరిగే అన్ని కార్యక్రమాలలోనూ తన ప్రమేయం ఉంటుంది. ఆ సాయినాధుడి సేవలో నిస్వార్ధంగా తనపని తాను చేసుకుపోతున్న శారదనే రాజారాం అనుమానిస్తున్నాడని అర్ధం అయిన మరుక్షణం గోపాల్ ముఖం లో కోపం ప్రవేశిస్తుంది.

''అంటే.. ఈ గుళ్ళో అనాధగా వచ్చింది ఆ శారదమ్మనే కదా.. అంటే ఈ పని ఆ శారదమ్మ చేసిందనా నీ అనుమానం..'' సూటిగా గోపాల్ కళ్ళల్లోకి చూస్తూ అంటాడు గోపాల్.

''సాయిరాం.. అనవసరంగా ఆ శారదమ్మపై నిందలు నేనెందుకేస్తానండీ.. లోకం పోకడ ఇలా ఉందని చెప్పడం నా ఉద్దేశ్యం అంతే..'' ఎంతో అమాయకంగా అంటాడు రాజారాం.

''సరె.. సరె.. ముందు మూర్తి గారిని వెంటనే పిలిపించాలి.. '' అంటూ ఆ గదిలోనుండి సీరియస్‌గా బయటికి వస్తాడు గోపాల్. అతని వెనకాలే రాజారాం కూడా వస్తాడు.''గోపాల్ తన జేబులో ఉన్న ఫోన్‌ని బయటికి తీసి మూర్తి నంబర్‌ని డయల్ చేస్తాడు..''

రాజారాం గోపాల్ వంకే చూస్తుంటాడు.. అతని ముఖం లో ఒకవిధమైన రాక్షసానందం కనిపిస్తుండడం గోపాల్ దృష్టిని దాటి పోదు.

....................................

గోపాల్ నుండి కాల్ వచ్చిన పది నిమిషాల్లో మూర్తి గుళ్ళోకి వస్తాడు. వచ్చీ రాగానే గోపాల్, రాజారాం దగ్గరికి వెళతాడు. అతని ముఖం లో కంగారు స్పష్టంగా కనిపిస్తుంటుంది..

''ఏమిటండీ మీరంటున్నది..?''

గోపాల్ మూర్తి వంక సీరియస్‌గా చూస్తాడు.. రాజారాం కూడా మూర్తి వంక చూస్తుంటాడు.

''అవును మూర్తి గారూ.. గదిలో బంగారు కిరీటం కనిపించడం లేదు..''

''దటీజ్ ఇంపాజిబుల్.. నేను ఆభరణాలన్నింటినీ తీసుకుని ఆ ఒక్క కిరీటాన్ని మాత్రం గదిలోనే ఉంచాను..

ఖచ్చితంగా ఆ కిరీటం గదిలోనే ఉంటుంది..'' ఖచ్చితంగా చెబుతాడు మూర్తి.

‘‘గోపాల్ గారు చెప్పేది నిజమే మూర్తిగారు.. నేను కూడా ఆ గదిలో వెతికాను.. కిరీటం కనిపించలేదు..’’

గోపాల్ మాటలకి రాజారాం కూడా వంత పాడటంతో మూర్తి మరింత కంగారు పడిపోతాడు.

‘‘కిరీటం కనిపించకుండా పోవడమేమిటండీ.. ఆరోజు ఆభరణాలన్నింటినీ తీసుకువెళ్తున్న సమయంలో నాతో పాటు మీరు కూడా ఉన్నారు కదా.. కిరీటాన్ని గదిలో ఉంచడం మీరు కూడా చూసారు కదా.. మీముందే నేను గదికి తాళం వేసాను కదా..’’ రాజారాం వంక చూస్తూ ఆందోళనగా అంటాడు మూర్తి.

‘‘అవునవును.. నాముందే మీరు గదికి తాళం వేసారు.. ఆరోజు కిరీటం గదిలోనే ఉండడం నేను కూడా చూసాను.. కానీ.. ఇప్పుడు చూస్తే మాత్రం గదిలో కిరీటం మాయమైపోయింది..’’ బాధని ముఖం లోకి తెచ్చుకోవడానికి ప్రయత్నిస్తూ అంటాడు రాజారాం.

రాజారాం ఓరగా మూర్తి వంక చూస్తుంటాడు.. రాజారాం ముఖం లో కంగారు స్పష్టంగా కనిపిస్తుంటుంది..

కానీ ఆ కంగారుని మూర్తికి, గోపాల్‌కి కనిపించనీయకుండా చాలా జాగ్రత్తలు తీసుకుంటాడు రాజారాం..

మూర్తి కూడా చాలా కంగారు పడిపోతుంటాడు.. అతను తీవ్రంగా ఆలోచిస్తున్నట్టుగా ఎక్స్‌ప్రెషన్స్..

‘‘అసలు నేను నమ్మలేకపోతున్నానండీ.. ఏదీ ఒకసారి మళ్ళీ వెతుకుదాం పదండీ..!’’గోపాల్ సరే అన్నట్టు తల ఊపుతాడు.. రాజారాం గోపాల్‌ని, మూర్తిని ఓరకంట గమనిస్తుంటాడు.. రాజారాం ముఖం లో ఒక విధమైన రాక్షసానందం తాండవిస్తుంటుంది.. ఎందుకంటే.. ఆ కిరీటం ఆ గదిలో లేదన్న విషయం రాజారాంకి తెలుసు. అయినా తన ముఖం లోని భావాలని బయటికి కనిపించనీయకుండా జాగ్రత్త పడుతాడు రాజారాం.

ముగ్గురూ ఆ ఆఫీసులోనుండి బయటికి వస్తారు..

.....................................................

గోపాల్ ఆ గది తలుపు తెరుస్తాడు..

మూర్తి ఆతృతగా ఆ గదిలోకి అడుగు పెడతాడు. అతని చూపులు ఆ గది మొత్తం వెతుకుతుంటాయి..

మూర్తి ముఖం లో ఎంతో ఆందోళన కనిపిస్తుంటుంది.. ఆ గదిలో ఉన్న వస్తువులు, పట్టు బట్టలన్నింట్లోనూ మూర్తి వెతుకుతాడు.. ఆ గదిలో అణువణువున గాలించినా కిరీటం కనిపించకపోవడంతో మూర్తి ముఖం పాలిపోతుంది..

''ఇదేమి విచిత్రం.. గదిలో ఉన్న కిరీటం మాయమై పోవడమేమిటండీ..!'' మూర్తి ముఖం మ్లానమైపోతుంది..

అతని గొంతు సన్నగా వణుకుతుంది.

గోపాల్ ముఖం లో కూడా ఆందోళన కనిపిస్తుంటుంది..

''మూర్తి గారూ.. మీరు బాగా గుర్తుకు తెచ్చుకోండి.. ఆభరణాలు తీసుకెళ్ళిన రోజున కిరీటాన్ని మీరు ఇక్కడే ఉంచారా.. లేదంటే మరెక్కడైనా పెట్టారా..?'' సూటిగా అడుగుతాడు గోపాల్.

''లేదండీ.. ఇక్కడే ఉంచాను.. ఆభరణాలన్నింటినీ తీసుకెళ్తున్న సమయంలో ఈ కిరీటాన్ని మాత్రం పక్కన పెట్టాను.

నేను ఈ కిరీటాన్ని పక్కన పెడుతున్న సమయంలో శారదమ్మ కూడా అడిగింది.. అదేమిటి ఈ కిరీటాన్ని పక్కన పెట్టారు.. దీన్ని తీసుకెళ్ళరా అని..''

గోపాల్ మూర్తి వంక ఆశ్చర్యంగా చూస్తాడు.. రాజారాం ముఖం లో సంతోషం కనిపిస్తుంది...

రాజారాం వాయిస్ (మనసులో)

'ఇప్పుడు దారిలోకొచ్చావ్ మూర్తి.. నాక్కావాల్సింది కూడా అదే.. ఈ సీన్‌లోకి శారదమ్మని ఎలా ఎంటర్ చేయాలా అని విపరీతంగా ఆలోచిస్తున్నాను.. కానీ నాకా శ్రమ ఇవ్వకుండా నువ్వే శారదమ్మ ప్రస్తావన తీసుకువచ్చావు.. ఇంక శారదమ్మని ఎవ్వరూ కాపాడలేరు.. హ..హ..హ..'మనసులో అనుకున్న రాజారాం ముఖం లో ఒకవిధమైన రాక్షసానందం కనిపిస్తుంది.. ఆ వెంటనే తన ముఖం లో భావాలని కప్పిపుచ్చుకుని మళ్ళీ అమాయకంగా ముఖం పెడతాడు రాజారాం..

''ఏమిటీ..? శారదమ్మ అడిగింది.. అసలు.. అసలు.. శారదమ్మ ఇక్కడికెందుకు వచ్చింది..?'' ఆశ్చర్యంగా అడుగుతాడు గోపాల్.

''ఆరోజు మీరు ఈ గది తాళం చెవి శారదమ్మకి ఇచ్చి వెళ్ళారు కదా.. ఆ తాళం చెవిని నేను శారదమ్మ దగ్గర తీసుకున్నాను.. ఆ తర్వాత నేనే శారదమ్మని ఈ గదిలోపలికి తీసుకువచ్చాను..'' మూర్తి చెప్పాడు.

''మీరు తీసుకువచ్చారా..?''

''అవును.. తాళం చెవి నాకు ఇచ్చిన శారదమ్మని నేను ఈ గదికి రమ్మన్నాను.. అయినా ఇందులో రహస్యాలేముంటాయి.. దేవుడి సొమ్ము భద్రపరిచిన గది కదా.. నువ్వు ఈ గుళ్ళోనే ఉంటున్నావు కదా.. చూద్దువుగానీ రా.. అని అన్నాను.. ఆభరణాలన్నింటినీ నేను తీసుకువెళ్తున్న సమయంలో ఈ రాజారాం గారు కూడా వచ్చారు..

మేం ముగ్గురం కలిసి గది బయటికి వచ్చాక తాళం వేసి తిరిగి తాళం చెవిని శారదమ్మకే ఇచ్చాను..'' అన్నాడు మూర్తి

''అంటే.. మీరు ఆభరణాలు తీసుకెళ్తున్న సమయంలో శారదమ్మ ఇక్కడే ఉందన్నమాట..''

''అవును.. ఉన్నది.. నేను గది తాళం వేసి తాళం చెవిని మీకు ఇమ్మని శారదమ్మకి ఇచ్చాను..'' మూర్తి అన్నాడు.

''ఆ తాళం చెవిని మీరిచ్చినట్టు చెప్పి నాకే ఇచ్చేసింది శారదమ్మ..'' గోపాల్ అన్నాడు.

''మరి.. అలాంటప్పుడు గదిలో ఉన్న కిరీటం ఎలా మాయం అయిపోతుంది..?'' ప్రశ్నార్థకంగా ముఖం  పెడతాడు మూర్తి.

''అదే అంతుపట్టకుండా ఉన్నది..?'' తీవ్రంగా ఆలోచిస్తున్నట్టుగా అంటాడు గోపాల్.

''ఒకవేళ మనం ఈ గదికి తాళం వేసి వెళ్ళాక శారదమ్మ గానీ ఈ గదిలోకి వచ్చిందేమో..!'' రాజారాం అనుమానం వ్యక్తం చేస్తాడు. గోపాల్, మూర్తి ఇద్దరూ రాజారాం వంక కోపంగా చూస్తారు.

''శారదమ్మకి ఈ గదిలోకి రావాల్సిన అవసరం ఏముంటుంది..?'' విస్మయంగా అంటాడు గోపాల్.

రాజారాం  ముఖం  వెలిగిపోతుంది.. అయినా ముఖం లో ఎలాంటి భావాలు కనిపించకుండా జాగ్రత్త పడతాడు..''అంటే నా ఉద్దేశ్యం.. బంగారు వస్తువులని చూడాలన్న కోరిక ఎవరికి మాత్రం ఉండదు చెప్పండి.. పైగా ఖరీదైన బంగారు కిరీటం కదా.. మళ్ళీ ఒకసారి చూడాలన్న ఆశ ఆవిడకి కలిగి ఉండవచ్చు.. ఎలాగూ ఈ గది తాళం చెవి ఆవిడ దగ్గరే ఉంది కాబట్టి, గుళ్ళో ఎవరూ లేరు కాబట్టి మళ్ళీ ఒకసారి చూడాలని అనుకోవచ్చు..'' తనకి వచ్చిన అనుమానాలన్ని వ్యక్తపరుస్తాడు రాజారాం.

''కిరీటం చూడాలనుకున్నప్పుడు వచ్చి చూసిందే అనుకుందాం.. మరి కిరీటం మాయమైపోవడం ఏమిటి..?''

‘‘గోపాల్ గారూ.. ఒకసారి సావధానంగా ఆలోచించండి.. బంగారాన్ని చూస్తే ఎంత మంచి వాడికైనా ఏదో ఒక దురాశ పుడుతుంది.. పైగా ఆడవాళ్ళకి బంగారంపై ఉండే మోజు గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు..

కిరీటాన్ని చూడడానికి  వచ్చిన శారదమ్మలో దుర్బుద్ధి పుట్టి శారదమ్మే ఈ కిరీటాన్ని..’’ అంటూ మాటల్ని మధ్యలోనే ఆపేసి ఇద్దరి వంక చూస్తాడు రాజారాం.

‘‘రాజారాం గారు.. ఏం మాట్లాడుతున్నారు మీరు..?’’ కోపంగా అంటాడు గోపాల్.

మూర్తి కూడా రాజారాం వంక కోపంగా చూస్తాడు..

‘‘నన్ను అపార్థం చేసుకోకండి గోపాల్ గారూ.. గది తాళం వేసింది వేసినట్టే ఉంది.. గదిలోపల కిరీటం మాయమై పోయింది.. మూర్తిగారు ఆభరణాలు తీసుకెళ్తున్న సమయంలో నేను కూడా ఉన్నాను, గది తాళం వేసి తాళం చెవి శారదమ్మకి ఇవ్వడం కూడా నేను చూసాను.. మూర్తి గారు ఆవిడకి తాళం చెవి ఇచ్చాక, ఆ తాళం చెవి తిరిగి మీ చేతిలోకి రావడానికి మధ్య సమయంలోనే ఏదో జరిగి ఉంటుందని నా అనుమానం.. అంతే..’’ వారిలో శారదమ్మపై అనుమాన బీజాన్ని మెల్లిగా నాటడానికి ప్రయత్నిస్తాడు రాజారాం.

రాజారాం మాటలకి మూర్తి, గోపాల్ ఇద్దరూ  ఆలోచనలో పడిపోతారు.. శారదమ్మపై అనుమానం  రావడం వారిద్దరికీ నచ్చలేదు.. అయినప్పటికీ పరిస్థితులు శారదమ్మపై అనుమానం కలిగేలా రావడంతో గోపాల్, మూర్తి మెదదు లు మొద్దుబారిపోయినట్టయిపోతాయి.

‘‘శారదమ్మని అనుమానించడమంటే నా మనసెందుకో ఒప్పుకోవడం లేదు..’’ గోపాల్ తనలో తానే అనుకుంటున్నట్టుగా అంటాడు. రాజారాం వచ్చిన అవకాశాన్ని జారవిడుచు కోదలుచుకోలేదు.

‘‘శారదమ్మ అంటే నాకూ గౌరవమే గోపాల్ గారూ.. కానీ పరిస్థితులని బట్టి అనుమానించక తప్పడం లేదు.. పైగా గుళ్ళో నుండి కిరీటం దొంగిలించబడింది అని నలుగురికి తెలిస్తే మన ఆలయ ప్రతిష్ఠ మొత్తం పోతుంది..

ఇన్నేళ్ళుగా సాయినాధుడిని దర్శించడానికి వచ్చే భక్తులకి ఈ విషయం తెలిస్తే.. దేవుడి ఆభరణాలకే భద్రత లేని ఈ గుళ్ళోకి రావడానికి కూడా ఇష్టపడరు.. ఈ విషయం ఆ నోటా ఈ నోటా నలుగురికి తెలిస్తే ఈ ఆలయ ప్రతిష్ఠ గంగలో కలిసిపోతుంది..’’ రాజారాం భవిష్యత్తులో జరగబోయే విపత్తుని ఊహించి చెప్పేసరికి, మూర్తి, గోపాల్‌శరీరాలు జలదరిస్తాయి.

రాజారాం మూర్తి, గోపాల్ మొహాలని నిశితంగా గమనిస్తుంటాడు.. గోపాల్, మూర్తి ముఖం లో ఆందోళన స్పష్టంగా కనిపిస్తుంటుంది..

‘‘సాయినాధా.. ఇంతటి సంకట పరిస్థితిని కల్పించావేమిటి తండ్రీ.. కిరీటం ఏమై పోయింది.. నిన్ను ఎంతో భక్తిగా ఆరాధించే శారదమ్మ కిరీటాన్ని మాయం చేసిందా..?’’ మూర్తి ఎంతో బాధగా కనిపించని ఆ సాయినాధుడిని వేడుకుంటాడు.

‘‘మూర్తి గారూ, ఆవిడే కాజేసిందని నేను అనడం లేదు.. కానీ తాళం చెవి ఆవిడ దగ్గర ఉన్న సమయంలోనే ఈ గదిలోనుండి కిరీటం మాయమైపోయిందని స్పష్టంగా అర్థమవుతుంది కదా.. పైగా భక్తి ముసుగులో ఎంతో మంది ఇలాంటి నీచకార్యాలని చేయడం సమాజంలో మనం చూస్తూనే ఉన్నాము.. అమాయకంగా నటించి ఏకంగా ఆ దేవుడి కిరీటాన్నే మాయం చేసిందంటే..’’ రాజారాం మాటలని మధ్యలోనే అడ్డుకుంటాడు గోపాల్.

‘‘రాజారాం గారూ.. మీరు ఇప్పుడే శారదమ్మని దొంగని చేసి మాట్లాడుతున్నారు.. కిరీటాన్ని ఆవిడ మాయం చేసిందా లేదా అన్నది ఇంకా తెలియదు.. ఈలోపు ఇంకేమయినా జరిగి ఉండొచ్చు కదా..?’’

గోపాల్‌కి తాను అన్న మాట వల్ల  కోపం వచ్చిందని అర్థం అయింది రాజారాంకి. అందుకే తనలో తానే తమాయించుకుని గోపాల్‌ని ప్రసన్నం చేసే మాటలు మాట్లాడుతాడు.

''సాయిరాం.. నన్ను మీరు అపార్థం చేసుకుంటున్నారు.. శారదమ్మే  కిరీటం మాయం చేసిందని నేను అనడం లేదండీ..''

''మీరు అనడం లేదు.. కానీ.. మీ మనసులో మాత్రం శారదమ్మే ఈ కిరీటాన్ని మాయం చేసిందని గట్టిగా నమ్ముతున్నట్టు తెలుస్తూనే ఉంది..'' గోపాల్ గొంతులో కోపం ప్రవేశిస్తుంది.

''పరిస్థితులు అలా కనిపిస్తున్నాయి కదండీ..!'' మెల్లిగా అంటాడు రాజారాం.

గోపాల్, మూర్తి ఇద్దరూ మౌనంగా ఉండిపోతారు.. ఓ నిమిషం పాటు ఇద్దరూ ఏమీ మాట్లాడరు.. వారిద్దరి మొఖాల్లోనూ ఆందోళన స్పష్టంగా కనిపిస్తుంటుంది.. రాజారాం వారిద్దరినే గమనిస్తుంటాడు.. వారిద్దరూ తీవ్ర ఒత్తిడితో ఆలోచనలో పడిపోతారు..

తీవ్రంగా ఆలోచిస్తున్న గోపాల్ సడన్‌గా మూర్తి వంక చూస్తాడు.. మూర్తి కూడా గోపాల్ వంక చూస్తాడు..

గోపాల్ ముఖం లో మూర్తిపై  అనుమానం కలిగేవిధంగా ఎక్స్‌ప్రెషన్స్ కనిపిస్తాయి..  మూర్తి గోపాల్ మనసులో మెదులుతున్న భావాలని కనిపెడతాడు.. అతని ముఖం లో మరింత ఆందోళన కలుగుతుంది..

''గోపాల్ గారూ.. ఆ దేవుడి మీద ప్రమాణం చేసి చెబుతున్నాను.. కిరీటాన్ని నేను మాత్రం కాజేయలేదు..''మూర్తి గొంతు బొంగురుపోతుంది అలా అంటున్నప్పుడు.

''అయ్యో.. మీ గురించి మాకు తెలియదా ఏమిటి.. ఈ ఆలయం కట్టిన దగ్గర నుండి మీరు ఈ గుడికి చేసిన సేవ ఎలా మర్చిపోతాం చెప్పండి..'' అనునయంగా అంటాడు రాజారాం.

మూర్తి కళ్ళల్లో కన్నీళ్ళు సుడులు తిరుగుతాయి.. అతనిలో ఉన్న బాధంతా కన్నీళ్ళ రూపంలో బయటికి వస్తుంది..

మూర్తి వంక జాలిగా చూస్తాడు గోపాల్.. మూర్తి దగ్గరగా వచ్చి అతని భుజంపై చేయి వేస్తాడు..

''మూర్తి గారూ బాధ పడకండి.. మిమ్మల్ని అనుమానిస్తే నన్ను నేను అనుమానించడమే అవుతుంది.. దేనికైనా ఓ పరిష్కారం అన్నది ఉంటుంది.. ఈ సమస్యకి కూడా ఖచ్చితంగా పరిష్కారం దొరుకుతుంది..'' అంటాడు గోపాల్ మూర్తిని ఓదారుస్తున్నట్టుగా..

''ఆ సాయినాధుడిని సేవించే భాగ్యం కలిగినందుకు నేను ఎంతో ఆనందించేవాడిని.. కానీ.. ఈరోజు నా మూలంగా ఆ దేవాధిదేవుడి కిరీటం మాయమైపోవడాన్ని నేను భరించలేకపోతున్నానండీ.. మూర్తి అంటాడు (ఏడుపు గొంతుతో)

''మూర్తి గారు.. మీరు అనవసరంగా కంగారుపడుతున్నారు.. తప్పు మీరు చేయలేదని మాకే కాదు, ఆ దేవుడికి కూడా తెలుసు...'' అనునయంగా అంటాడు రాజారాం.

''అవును మూర్తి గారూ.. మీరు శాంతించండి..'' గోపాల్ కూడా మూర్తికి ధైర్యం చెబుతాడు.

వారి మాటలతో మూర్తిలో కొద్దిగా ధైర్యం వస్తుంది.. కళ్ళల్లో నుండి జారిన కన్నీళ్ళని తుడుచుకుంటూ..

''మరి.. ఇప్పుడు.. ఇప్పుడేం చేద్దాం..?'' అని ప్రశ్నిస్తాడు ఇద్దరినీ..

గోపాల్ తీవ్రంగా ఆలోచిస్తాడు.. రాజారాం గోపాల్ వంకే ఆతృతగా చూస్తుంటాడు.. మూర్తి కూడా గోపాల్ వంక చూస్తుంటాడు.. చివరికి ఒక నిర్ణయానికి వచ్చిన వాడిలా గోపాల్ ముఖం లో మార్పు కనిపిస్తుంది..

గోపాల్ మూర్తి వంక చూస్తాడు..

''మూర్తి గారూ.. ఈ ఆలయ మేనేజర్‌గా దీనిపై ఏమీ నిర్ణయం తీసుకోలేకపోతున్నాను.. మనం వెంటనే మన ఆలయ కమిటీ మెంబర్లతో సమావేశం ఏర్పాటు చేసుకుందాం.. ఆ

సమావేశంలో ఆలయ కమిటీ  సభ్యులు ఏం నిర్ణయం తీసుకుంటే ఆ నిర్ణయానికి కట్టుబడి ఉండడం మినహా ఇంక మనం చేసేదేమీ లేదు..''

''సరే.. మీ ఇష్టం.. వెంటనే అందరికీ కబురు చేస్తాను..'' అంటాడు మూర్తి. వారు తీసుకున్న నిర్ణయానికి రాజారాం ముఖం లో విపరీతమైన అసంతృప్తి కనిపిస్తుంది..

''అబ్బా... ఆ శారదమ్మని వీలయినంత తొందరగా గుళ్ళోనుండి బయటికి పంపించాలని స్కెచ్ వేస్తే.. వీరేంటీ.. మళ్ళీ కమిటీ సమావేశం అంటారు.. దాన్ని గుళ్ళో చూస్తూంటే.. నా ఒళ్ళంతా కంపరం రేగుతుంది.. హా.. సరే.. ఏం చేస్తాం.. ఆ శారదమ్మకి ఇంకా ఒకరోజు ఈ గుళ్ళో ఉండే అదృష్టం ఉంది..'' మనసులోనే కసిగా అనుకుంటాడు రాజారాం.

''రాజారాం గారూ.. ఇప్పుడే ఈ విషయాన్ని బయటికి తెలియజేయకండి.. దీన్ని రహస్యంగా ఉంచాలి..

బయటివారెవరికైనా కిరీటం మాయమైందన్న విషయం తెలిస్తే ఈ గుడి పరువు పోతుంది..'' రాజారాం వంక చూస్తూ అంటాడు గోపాల్.

''అయ్యో ఎంతమాట.. నేను ఎవరికీ చెప్పనండీ..!'' నమ్మకంగా అంటాడు రాజారాం.

సడన్‌గా గోపాల్ ముఖం లో కోపం ప్రవేశిస్తుంది..

''దేవుడి సొమ్మని కూడా చూడకుండా కిరీటాన్ని మాయం చేసింది ఎవ్వరైనా సరే.. వారిని కఠినంగా శిక్షించే వరకు నాకు మనశ్శాంతి ఉండదు..''

గోపాల్ కళ్ళు ఎర్రబడతాయి.. ఆ క్షణంలో గోపాల్ ముఖం లో మారిన భావాలని గమనించిన రాజారాం శరీరం చిన్నగా కంపిస్తుంది..

......................................

రాజారాం, గోపాల్, మూర్తి ముగ్గురూ సాయిబాబా గర్భాలయంలోకి ప్రవేశిస్తారు. గుమ్మం దగ్గర నుండే గోపాల్ సాయిబాబా విగ్రహాన్ని చూస్తూ, రెండు చేతులు పైకెత్తి నమస్కరిస్తూ వేగంగా వచ్చి సాయిబాబా పాదాలని పట్టుకుంటాడు..

''సాయినాథా.. దేవా.. గుళ్ళో నుండి నీ కిరీటం మాయం కావడమేమిటి తండ్రీ.. గడిచిన తొమ్మిదేళ్ళుగా ఎన్నడూ ఇలాంటి సంఘటన జరగలేదే.. ఈ గుడి వసంతోత్సవాన్ని ఎంతో ఘనంగా జరుపుకోవాలన్న ఉత్సాహంతో ఉన్న మాకు ఇంత పెద్ద అగ్ని పరీక్షను పెట్టావు తండ్రీ.. నీ కిరీటం మాయం అయింది..! ఎవరు మాయం చేసారు తండ్రీ.?'' గోపాల్ గొంతులో ఎంతో ఆవేదన ప్రతిఫలిస్తుంది..

గోపాల్ కళ్ళల్లో నుండి కన్నీళ్ళు జలజలా రాలుతుంటాయి..అతను అలా వేడుకుంటుండగానే మూర్తి, రాజారాం  కూడా విగ్రహం దగ్గరికి వస్తారు. గోపాల్ ప్రక్కనే ఇద్దరూ

నిలబడతారు. మూర్తి కూడా సాయిబాబా వదనం వంక చూస్తూ రెండు చేతులెత్తి నమస్కరిస్తాడు..

''తండ్రీ సాయినాథా.. నీ కిరీటం మాయం కావడానికి కారకుడినయినందుకు ఎంతో బాధగా ఉంది తండ్రీ.. అయినా ఈ పవిత్రాలయం లోనుండి కిరీటం మాయం చేసేంత ధైర్యం ఎవరికి ఉంది తండ్రీ..  శారదమ్మే  కిరీటం మాయం చేసిందన్న అనుమానాలు బలపడుతున్నాయి.. కిరీటం మాయం కావడానికీ, శారదమ్మకీ ఎలాంటి సంబంధం లేదని నా మనసు చెబుతోంది.. కానీ నిజానిజాలేమిటో నీకే తెలియాలి.. నిస్వార్థంగా

నిన్నే సేవిస్తూ తరిస్తున్న మాకు ఇదొక పరీక్షలాగా పెట్టావా తండ్రీ.. వీలయినంత తొందరలో ఆ కిరీటం జాడ చూపించి మాలో ఉన్న ఆందోళన తగ్గించు తండ్రీ.. ఆందోళనని తగ్గించు..'' మూర్తి మౌనంగా సాయినాధుడిని వేడుకుంటాడు. అతని కళ్ళల్లో కన్నీళ్ళు నిండి ఉంటాయి. మూర్తి ప్రక్కనే నిలబడి ఉన్న రాజారాం ముఖం లో ఆందోళన కనిపిస్తుంటుంది..

సాయిబాబా విగ్రహం వంక చూడడానికి అతనికి భయమేస్తుంటుంది.. తప్పు చేసిన వాడిలా విగ్రహం వంక చూడకుండా తలదించుకుని ఉంటాడు రాజారాం.. అతనికి అక్కడ నిలబడడం చాలా అసౌకర్యంగా అనిపిస్తుంటుంది..

''తండ్రీ సాయినాథా.. తప్పని పరిస్థితిలో నీ కిరీటాన్ని మాయం చేయాల్సి వచ్చినందుకు నన్ను మన్నించు తండ్రీ.. ఎందుకో ఆ శారదమ్మ నీకు సేవ చేయడానికి తగినది కాదని నాకు అనిపిస్తుంది తండ్రీ.. అందుకే..

ఆమెని ఈ గుళ్ళో నుండి తరిమేసి, నీకు మనస్ఫూర్తిగా సేవందించే మరో సేవకురాలిని నియమించాలన్న సదుద్దేశ్యంతోనే నేనీ పని చేసాను తండ్రీ.. ఇలా చేసినందుకు నన్ను క్షమించు తండ్రీ.. అలాగే శారదమ్మ ఈ గుళ్ళోనుండి త్వరగా వెళ్ళిపోయేలా ఆశీర్వదించు తండ్రీ..''

గట్టిగా కళ్ళు మూసుకుని మనసులో కోరికని కోరుకుంటాడు రాజారాం..

సాయినాధుడి పాదాలని పట్టుకుని వేడుకున్న గోపాల్ లేచి నిలబడతాడు. మరొకసారి సాయిబాబా విగ్రహానికి దండంపెడుతూ..

''సాయినాథా.. నిస్వార్థంగా నీకు సేవందిస్తూ తరిస్తున్న మాకు నీ కిరీటం కంటపడేంత వరకు కంటిమీద కునుకు ఉండదయ్యా. త్వరగా ఆ కిరీటం ఆచూకీ తెలిసేలా చేసి మా మనసు స్థిమిత పడేలా చూసే బాధ్యత నీదేనయ్యా..'' సాయిబాబాకి మనస్ఫూర్తిగా మొక్కుతాడు గోపాల్.. ఆ తర్వాత మూర్తి వంక చూస్తాడు.. మూర్తి కూడా సాయిబాబాని కళ్ళు మూసుకుని ప్రార్థిస్తుండడం చూసి గట్టిగా ఓ నిట్టూర్పు విడుస్తాడు.. ఓ రెండు క్షణల తర్వాత మూర్తి కళ్ళు తెరుస్తాడు..

గోపాల్ ముందుకు అడుగు వేయడంతో అతని వెనకాలే మూర్తి, రాజారాం కదులుతారు. ఓ నాలుగు అడుగులు  వేసిన తర్వాత ఆగిపోయి మూర్తి వైపు తిరుగుతాడు గోపాల్.. సడన్‌గా ఆగిపోవడంతో గోపాల్ వంక ప్రశ్నార్థకంగా చూస్తాడు మూర్తి..

''మూర్తి గారూ.. ఆ గదిలోనుండి కిరీటం పోయిందన్న విషయాన్ని శారదమ్మకి తెలియనీయకండి.. అసలే ఆవిడ చాలా సున్నిత మనస్కురాలు.. ఈ విషయం తెలిస్తే తట్టుకోలేదు..''

''అలాగే నండీ..!'' అంటాడు మూర్తి.

రాజారాంకి మాత్రం గోపాల్ మాటలతో ఒళ్ళు మండుతుంది.. అతని ముఖం లోకి కోపం ప్రవేశిస్తుంది..

''ఈ మేనేజర్ ఒకడు.. ఎక్కడి నుండి వచ్చిందో తెలియని ఆ అనామకురాలంటే ఈయనకి అంత అభిమానం ఎందుకో..! ఆవిడని ఎలాగైనా గుళ్ళోనుండి గెంటేయాలని ఇంత పెద్ద రిస్క్ చేస్తే.. ఇతగాడేంటీ.. ఆవిడపై అంతలా ప్రేమని ఒలకబోస్తున్నాడు.. ఏదేమైనా ఆ శారదని గుళ్ళోనుండి తరిమేసేంత వరకూ నాకు మనశ్శాంతి ఉండదు''

మనసులో అనుకుంటాడు రాజారాం.. రాజారాం తన ముఖం లోని ఫీలింగ్స్ బయటికి కనిపించకుండా తనని తాను సర్దుకుంటాడు..

''చూడండి మేనేజర్ గారూ.. ఈ విషయాన్ని ఎవరికీ తెలియకుండా జాగ్రత్త పడడం మంచిదే.. కానీ..'' అంటూ మధ్యలో మాటలని ఆపేస్తాడు రాజారాం.. గోపాల్, మూర్తిలు రాజారాం వంక చూస్తారు ప్రశ్నార్థకంగా అతను ఏం చెప్పబోతున్నాడా అన్నట్టుగా..

''ఆ.. కానీ.. '' నొసలు ముడివేస్తూ అంటాడు గోపాల్..

''ఎందుకయినా మంచిది.. ఒకసారి ఆ శారదమ్మని పిలిచి రహస్యంగా వాకబు చేస్తే బావుంటుంది కదా..!''

గోపాల్, మూర్తి ఇద్దరూ ఒకరి మొహాలొకరు చూసుకుంటారు..  రాజారాం గోపాల్ ముఖం వంకే కళ్ళు పెద్దవి చేసి మరీ చూస్తుంటాడు.. గోపాల్ ఏం చెబుతాడా అన్న ఆతృత అతని ముఖం లో కనిపిస్తుంటుంది..

రాజారాం మాటలకి కాసేపు దీర్ఘాలోచనలో పడిపోతాడు గోపాల్.. ఆ తర్వాత మెల్లిగా తల ఊపుతాడు.

గోపాల్ వాయిస్..

''నువ్వు అన్నది కూడా బాగానే ఉంది..''ఆ మాటలకి రాజారాం ముఖం లో సంతోషం తాండవిస్తుంది..

''కిరీటం పోయిందని నేరుగా ప్రస్తావించకుండా ఆవిడని ఎలా అడిగితే బావుంటుంది..'' అని అంటాడు గోపాల్. ''మీ ఆలోచన బావుంది మేనేజర్ గారూ.. ఆసలా రోజు నేను ఆభరణాలు తీసుకెళ్ళిన తర్వాత అసలేం జరిగిందో తెలుసుకోవడం మంచిదే..'' సాలోచనగా అంటాడు మూర్తి.

''సరే అయితే.. ఒకసారి శారదమ్మని నా ఆఫీసుకి రమ్మని చెప్పండి మూర్తిగారూ..'' మూర్తి వంక చూస్తూ అంటాడు గోపాల్.

''అలాగే నండీ..!''

మూర్తి మందిరంలో నుండి బయటికి వెళ్తాడు. గోపాల్, రాజారాం మరో ద్వారం గుండా గోపాల్ ఆఫీసులోకి అడుగు వేస్తారు.

మూర్తి శారద దగ్గరికి వస్తాడు.. శారదమ్మ తన ముందున్న పూలతో హారాలని అల్లే పనిలో బిజీగా ఉండిపోతుంది..

తన పనిలో పడిపోయిన శారదమ్మ మూర్తి అక్కడికి రావడం గమనించదు. దాంతో..

''శారదమ్మా..'' అంటూ ఆప్యాయంగా పిలుస్తాడు మూర్తి.

శారదమ్మ మూర్తిని చూస్తుంది.. చేసే పనిని ఆపేసి లేచి నిలబడి చిన్నగా నవ్వుతుంది..

మూర్తి కూడా నవ్వుతాడు..

''ఏం జరిగిందండీ..!'' యథాలాపంగా అంటుంది శారద.

శారద నవ్వుతూ అడిగినా కూడా ఆ ప్రశ్నలో ఈ గుళ్ళో ఏదో జరిగిందన్న అనుమానం ఆమెలో కలిగిందన్న విషయం మూర్తికి అర్థమవ్వడంతో మూర్తి ఉలిక్కిపడతాడు..

''అబ్బే..! ఏమీ జరగలేదే..! ఎందుకలా అడిగారు..?'' నవ్వుతూ అంటాడు మూర్తి.

''ఆహా.. ఏమీ లేదు..  గుళ్ళోకి రావడంతోనే మీ ముఖం లో కంగారు స్పష్టంగా కనిపించింది.. ఇందాక  ఆ రాజారాం నా ముందు నుండి వెళుతూ నన్ను అదోలా చూశాడు.. కొద్ది సేపటి క్రితం మీ ముగ్గురూ కలిసి గుడిలోపలికి వెళ్లడం నేను గమనించాను.. మీ ఇద్దరి మొహాల్లోనూ ఏదో ఆందోళన కనిపించింది.. అసలేమయింది?..''ఆతృతగా అడుగుతుంది శారదమ్మ.

మూర్తి ముఖం పైకి నవ్వుని తీసుకురావడానికి చాలా ప్రయత్నం చేస్తాడు ఆమె మాటలకి.

''అబ్బే.. ఏమీ జరగలేదండీ..! ఈ గుడి వసంతోత్సవానికి ఇంకా ఎంతో సమయం లేదు.. పనులేమో అన్నీ అలాగే ఉండిపోయాయి.. అందుకే వసంతోత్సవానికి సంబంధించిన పనులని వేగవంతం చేయాలని నాతో చెప్పడానికి నన్ను పిలిపించారు..'' తేలికగా అంటాడు మూర్తి.

శారద 'అలాగా' అన్నట్టుగా తల ఊపుతుంది..

''ఓహో.. అదా విషయం.. అందుకే మీరు అంత కంగారుగా ఉన్నారు.. '' నవ్వుతూ అంటుంది.

''అవును .. ఇందాక ఆ రాజారాం అదోలా చూస్తూ వెళ్లాడని అన్నారు కదూ..'' మూర్తి సడన్‌గా రాజారాం ప్రస్తావన తీసుకురావడంతో ఆశ్చర్యపోతుంది శారదమ్మ.

''అవునండీ.. ఆయన చూపులో ఏదో తేడా కనిపించింది..!'' సీరియస్‌గా అంటుంది శారదమ్మ.

మూర్తి ముఖం లో ఏదో ఆలోచన.. ఏదో అనుమానం..

''ఆ తేడా ఏమిటండీ..? నా ఉద్దేశ్యం.. ఆ చూపులకి భావం ఏమిటో మీరేమైనా కనిపెట్టారా..? అదే.. ఇందాక మా ముఖం లోని భావాలని గమనించి నన్ను అడిగినట్టుగా..!'' ప్రశ్నిస్తాడు మూర్తి ఆసక్తిగా..

''చెప్పడానికే ముందండీ.. ఆయనకి నేనంటే అసలు పడదన్న విషయం మీకు కూడా తెలుసుగదా.. నేను వచ్చినపట్పి నుండీ.. నన్ను ఒక శత్రువుగా చూస్తున్నాడు.. అసలు నేనాయనకి చేసిన అపరాధం ఏమిటో నాకర్థమవడం లేదు..

ఎందుకు నాపై ఇంత పగ పెంచుకున్నాడో తెలియడం లేదు.. నేను ఈ గుళ్ళోకి వచ్చిన సమయంలోనే అతను పంపించిన ఆ సావిత్రమ్మని కాకుండా నన్ను ఈ గుడిలో పెట్టుకోవడం ఆయనకి ఎంత మాత్రం నచ్చలేనట్టుగా ఉంది.. ఆ విషయాన్ని మనసులో పెట్టుకుని సమయం వచ్చినప్పుడల్లా.. నన్ను సూటిపోటి మాటలతో బాధిస్తున్నాడు..''

శారద మాటలకి మూర్తి ముఖం లో భావాలు మారుతాయి..

''అవును నిజమే.. శారదమ్మని తప్పించాలని రాజారాం మనసులో ఉన్న మాట వాస్తవమే.. ఆమెని ఎలాగైనా ఈ గుళ్లోనుండి బయటికి వెళ్ళేలా చేసి, తాను సెలెక్ట్ చేసిన ఆవిడని గుళ్ళో పనికి కుదర్చాలని ఆయనకి ఉందన్న విషయం ఆయన ప్రవర్తనని బట్టి అర్థమవుతూనే ఉంది.. అంటే.. అంటే.. ఒకవేళ ఆ కిరీటాన్ని అతనే మాయం చేసి శారదమ్మపై ఆ నేరాన్ని మోపడానికి గానీ రాజారాం ఎత్తు వేయలేదు కదా..'' మూర్తి మనసులోనే అనుకుంటాడు.ఆ

ఆలోచన రాగానే మూర్తి ముఖం లో కంగారు ప్రవేశిస్తుంది.. ఆందోళనగా శారద వంక చూస్తాడు.. అతనలా

ఎందుకు చూసాడో అర్థం కాదు శారదమ్మకి.. ఆశ్చర్యంగా మూర్తి వంక చూస్తుంటుంది శారద..

''ఛ..ఛ.. అతనలా చేసి ఉండడు.. గుళ్ళో కూలీ  పని చేసుకుంటున్న ఈమెపై రాజారాం అంతపెద్ద నేరం మోపేంత సాహసం  చేసి ఉండడు..  అయినా ఒక  వ్యక్తిపై కొందరికి  ప్రేమ కలుగుతుంది,  కొందరికి ద్వేషం కలుగుతుంది.. ఎవరి అభిప్రాయాలు వారివి.. నాకు గానీ, గోపాల్‌కి గానీ శారదమ్మ అంటే ఎనలేని అభిమానం ఉంది .. కానీ.. ఎందుకో ఆ రాజారాంకి ఆవిడని చూస్తేనే నచ్చదు.. అయినా ఆవిడని గుళ్ళోనుండి పంపించి వేయడానికి ఇంత నీచానికి రాజారాం ఒడిగడతాడా..? అలా అయ్యుండదు.. మరి.. కిరీటం ఎలా మాయమైపోయింది.. ఒక వేళ శారదమ్మకి కిరీటం మాయం కావడంలో శారదమ్మ హస్తం ఉందని అనుకున్నా.. ఆమె ముఖం లో కనిపించే భావాలు కానీ, ఆమె మాట్లాడుతున్న విధానం కానీ ఎంతో మామూలుగా ఉందే.. దొంగతనం చేసిన వాడిలో ఏదో తెలియని ఆందోళన కనిపిస్తుంటుంది.. పైగా ఇంత పెద్ద దేవాలయంలో ఖరీదైన బంగారు విగ్రహాన్ని మాయం చేయడం అంటే మాటలు కాదు.. అలా చేసుంటే ఏమాత్రమయినా ముఖం లో భావాలు మారాలి...'' మూర్తి మనసులోనే అనుకుంటాడు.

దీర్ఘాలోచనతో పడిపోయిన మూర్తి వంక శారద ఆశ్చర్యంగా చూస్తుంది.

''ఏమండీ మూర్తిగారూ.. ఏమిటీ.. తీవ్రంగా ఆలోచిస్తున్నారు..?''

''అబ్బే.. ఏమీలేదు..'' ఆలోచనలో నుండి తేరుకుని నవ్వుతాడు మూర్తి.

''ఏమీలేదంటారేమిటండీ.. ఎదురుగా నేను మాట్లాడుతుండగానే.. మీరు దీర్ఘాలోచనలో పడిపోయారంటే.. మీరు నా దగ్గర ఏదో దాస్తున్నట్టు అనుమానం కలుగుతంది..!'' మూర్తి వంక అనుమానంగా చూస్తుంది శారదమ్మ.

''అబ్బే.. అలాంటిదేమీ లేదు..'' కాస్త తడబడుతూ అంటాడు మూర్తి.. ముఖం లోకి నవ్వుని తీసుకురావడానికి బలవంతంగా ప్రయత్నిస్తాడు మూర్తి..

''ఆ.. శారదమ్మ.. ఒకసారి గోపాల్ గారి ఆఫీసుకు రండి.. గోపాల్ గారు మీతో ఏదో మాట్లాడుతారట..!'' తేలికగా అంటాడు మూర్తి.

ఆ మాటలకి శారదమ్మ ఉలిక్కిపడుతుంది. శారద ముఖం లో విపరీతమైన ఆశ్చర్యం..

''నేను వచ్చి ఇన్ని రోజులయినా ఒక్కసారి కూడా ఇలా పిలిపించుకోని గోపాల్ గారు.. ఈరోజు మీతో కబురు పెట్టారంటే.. ఏదో జరిగే ఉంటుంది.. అసలేం జరిగిందండీ.. నా మూలంగా ఏదైనా పొరపాటు జరిగిందా..?

తెలిసో తెలియకో నేనేమైనా తప్పు చేసానా..? ఒకవేళ నేను ఏదైనా తప్పు చేసుంటే అదేమిటో చెప్పండి..''శారద ముఖం లో ఆందోళన.. ఆమె కళ్ళల్లో సన్నటి కన్నీటి తెర కూడా ప్రత్యక్షమవుతుంది..

''అబ్బా.. మీరేమీ కంగారు పడకండీ.. ఏదో ఊరికినే రమ్మని చెప్పారు.. అదే.. ఈ వసంతోత్సవ పనులలో మీక్కూడా ఏవైనా పనులు పురమాయించడానికి కబురు పెట్టి ఉంటాడు... అంతే..!'' నవ్వుతూ అంటాడు మూర్తి.

మూర్తి మాటలకి శారదమ్మ ముఖం లో రిలీఫ్.. గుండెపై చేయి వేసుకుని 'హమ్మయ్య' అనుకుంటుంది శారద. .

''అంతేనా.. నేను చాలా కంగారుపడ్డానండీ.. నా వల్ల  ఏదైనా తప్పు జరిగిందేమో నని..!'' ఆమె గొంతులో భయం స్పష్టంగా వినిపిస్తుంది.

''ఛ..ఛ.. అలాంటిదేమీ లేదు.. ముందు మీరు పదండి..'' మనసులో ఆందోళనగా ఉన్నా ముఖం లో చిరునవ్వుని చిందిస్తూ అంటాడు మూర్తి.

చేస్తున్న పనిని ఆపేసి శారదమ్మ, మూర్తితో పాటు మేనేజర్ గోపాల్ ఆఫీసుకి బయలు దేరుతుంది..

.....................................

గోపాల్ ఆఫీస్.. గోపాల్ తన సీట్లో కూర్చుని ఉంటాడు.. అతనికి ఎదురుగా రాజారాం కూర్చుని ఉంటాడు..

గోపాల్ ముఖం  చాలా సీరియస్‌గా ఉంటుంది.. తీవ్రంగా ఆలోచిస్తున్నట్టుగా శూన్యంలోకి చూస్తుంటాడు.

రాజారాం గోపాల్‌నే జాగ్రత్తగా గమనిస్తూంటాడు.. ఇద్దరూ మౌనంగా ఉంటారు.. అక్కడి వాతావారణం అంతా నిశ్శబ్దంగా ఉంటుంది.. గోడమీద ఫ్యాన్ తిరుగుతున్న శబ్దం వినిపించేంత నిశ్శబ్దం అలుముకుంటుంది అక్కడ. ఓ ముప్పయి సెకండ్ల సమయం తర్వాత ఆఫీస్‌లోకి వస్తాడు మూర్తి.. గోపాల్ ఎదురుగా ఉన్న మరో కుర్చీలో కూర్చుంటాడు.. అతని వెనకాలే శారదమ్మ వస్తుంది..

గోపాల్, రాజారాం ఇద్దరూ శారదని చూస్తారు. గోపాల్ ముఖం  ఇంకా సీరియస్‌గానే ఉంటుంది.. రాజారాం ముఖం లో శారదపై ఉన్న ద్వేషం  స్పష్టంగా కనిపిస్తూనే ఉంటుంది.. శారదని ఓ శత్రువుని చూసినట్టు చూస్తుంటాడు..

శారదమ్మనే తీక్షణంగా చూస్తున్న రాజారాం వంక పరిశీలనగా చూస్తుంటాడు మూర్తి.. శారదమ్మపై ఆయనకి ఉన్న ద్వేషం  అంతా ఆయన ముఖం లోనే కనిపిస్తుంది. మూర్తి అతన్ని గమనిస్తూ ఏదో దీర్ఘాలోచనలో పడిపోయినట్టు శూన్యంలోకి చూస్తాడు. రాజారాం పై ఏదో అనుమానం ఆయన ముఖం లో కనిపిస్తుంటుంది..

ఆఫీస్ తలుపు పక్కగా ఒదిగిపోయి నిలబడి ఉంటుంది శారద.. ఆమె చూపులు రాజారాం పై పడుతుంది.. అతను తనని చూస్తున్న తీరుని చూసి ఉలిక్కిపడుతుంది శారద.. తనని తాను తేరుకుని తన చూపులని గోపాల్‌పై మరలిస్తుంది..

''పిలిచారంట..!'' గోపాల్ వంక చూస్తూ మెల్లిగా అంటుంది శారద.గోపాల్ తన ముఖం లో ఉన్న సీరియస్ నెస్‌ని తొలగించుకుని చిన్నగా నవ్వుతాడు..

''ఆ.. నేనే పిలిచాను.. మరేం లేదు.. వచ్చే పౌర్ణమికి ఈ ఆలయం కట్టి పదేళ్ళవుతున్న సందర్భంగా వసంతోత్సవాన్ని నిర్వహించడానికి చాలా గ్రాండ్‌గా ప్లాన్ చేస్తున్నాము.. ఈ విషయం గురించి మాట్లాడటానికే నిన్ను పిలిచాను..''

గోపాల్ మాటలతో అప్పటి వరకూ ఆందోళనగా ఉన్న ఆమె మనసు కుదుట పడుతుంది.. రిలీఫ్‌గా ఫీలయినట్టుగా ఆమె ముఖం లోని భావాలు కదలాడుతాయి.

''చెప్పండి.. వసంతోత్సవానికి నా వంతుగా ఏం పని చేయమన్నా చేస్తాను.. మామూలు రోజుల్లోనే ఆ సాయినాధుడిని సేవిస్తుంటే మనసులో ఎంతో ఆనందం కలుగుతంది.. ఇంక విశేషమైన దినాలో సాయినాధుడిని సేవించే అవకాశం రావడం నా పూర్వజన్మ సుకృతంగా భావిస్తున్నాను.. చెప్పండి ఏం చేయమంటారో.. 24 గంటలు పనిచేయడానికి కూడా నేను సిద్దంగా ఉన్నాను..'' సంతోషంగా అంటుంది శారదమ్మ.

ఆమె మాటలకి గోపాల్ చిన్నగా నవ్వుతాడు.

''ఊ.. నువ్వు పనికి భయపడని దానివని నాకు తెలుసులే శారదమ్మా.. ఏ పని చెప్పినా కష్టమనకుండా, ఆయాస పడకుండా నీవు చేయగలవు.. ఆ విషయంలో నీపై నాకు పూర్తి నమ్మకముందిలే..!'' గోపాల్ నవ్వుతాడు. అయితే పోయిన బంగారు కిరీటం విషయాన్ని శారదమ్మతో ఎలా చర్చించాలో అతనికి అర్థం కాకుండా ఉంది..

''తెగిన గాలిపటం లాంటి నా జీవితానికి ఓ ఆధారాన్ని, అర్థాన్ని ప్రసాదించిన ఆ సాయినాధుడిని కొలవడంలో ఎంతో సంతృప్తి ఉంటుందండీ..! గమ్యం లేని నా జీవితానికి ఓ దారి చూపించిన సాయినాధుడి కోసం ఏం చేయడానికైనా నేను సిద్ధమే..!'' మనస్ఫూర్తిగా అంటుంది శారద.

గోపాల్, మూర్తి ఇద్దరూ ఒకరి మొఖాలొకరు చూసుకుంటూ చిన్నగా నవ్వుతారు.. రాజారాం మాత్రం వారిద్దరి మాటలకి చిరాకు పడుతూ కుర్చీలో అసహనంగా అటూ ఇటూ కదులుతుంటాడు..

''ఊ.. చూడు శారదమ్మా.. ఇక నుండి నువ్వు కాస్త జాగ్రత్తగా ఉండాలి సుమా..! ఎందుకంటే.. ఈ వారం, పది రోజుల్లో మందిరంలోకి వచ్చే భక్తుల సంఖ్య పెరుగుతుంది.. దేశ విదేశాల్లో ఉన్న ఈ మందిర నిర్మాణానికి ఆర్థికసాయం చేసిన దాతలందరూ తమ కుటుంబ సభ్యులతో సహా ఇక్కడికి వచ్చేస్తున్నారు.. వారందరూ అధిక సమయం మందిరంలోనే గడుపుతారు.. కావున వారిని ఓ కంట కనిపెట్టే బాధ్యత నీకు అప్పజెబుతున్నాను.. ఎందుకంటే..

అసలే రోజులు  బాగాలేవు.. ఎవరి మనసులో ఏం దుర్బుద్ధి దాగుంటుందో మనకి తెలియదు కదా.. ఏమో..

ఎవరైనా ఈ మందిరంలోని విలువైన వస్తువులుని దొంగిలించే అవకాశాలు లేకపోలేదు.. అందుకే వసంతోత్సవం ముగిసేంత వరకూ మందిరం పరిసరాలని జాగ్రత్తగా గమనిస్తూ ఉండాలి..'' శారదమ్మకి జాగ్రత్తలు చెబుతాడు గోపాల్.

''తప్పకుండానండీ..! ఈ ఆలయంలోనుండి పూచికపుల్ల  కూడా బయటకి వెళ్లకుండా జాగ్రత్తగా ఉంటాను.. ఆ దేవుడి సొమ్ముపై ఆశపడే దుర్మార్గులు కూడా ఉంటారంటే.. నిజంగా వారి బ్రతుకు ఎందుకు..? బయట చేసే పాపాలని ప్రక్షాళణ చేసుకోవడానికి ఈ మందిరానికి వస్తారే అందరూ.. అలాంటిది.. ఇంతటి పవిత్ర పుణ్య స్థలంలోనే పాపపు పనులు చేయాలనుకోవడం ఎంత దారుణమండీ..!'' శారద ముఖం లో కోపం స్పష్టంగా కనిపిస్తుంటుంది..

ఆమె మాటలో నిజాయితీ ధ్వనిస్తుంది.. ఆ సాయిబాబాపై ఆమెకున్న ప్రేమ, భక్తి ఆమె మాటలలో తెలుస్తుంది.. ఆమె మాటలకి గోపాల్, మూర్తి ఇద్దరూ ఆశ్చర్యంగా చూస్తుంటారు.. వారికి ఏం మాట్లాడాలో అర్థం కాదు..

ఇద్దరూ ఒకరి ముఖాలొకరు చూసుకుంటారు.. గోపాల్ ఏం చేద్దాం అన్నట్టుగా మూర్తి వంక చూస్తుంటాడు..

మూర్తి కూడా ఏం చేద్దాం అన్న భావనతోనే గోపాల్ వంక చూస్తుంటాడు.. రాజారాం మాత్రం శారదని తీక్షణంగా చూస్తుంటాడు.. ఆమె మాటలకి మూర్తి వంక చూస్తున్న గోపాల్ వైపు చిరాగ్గా చూస్తాడు..

''ఛ.. ఈ ముసలిది మాటలతో వీరిద్దరినీ మాయ చేస్తోంది.. అసలే ఈవిడపై విపరీతమైన అభిమానంతో ఉన్న గోపాల్ మూర్తి గుళ్ళో నుండి పూచికపుల్ల  కూడా బయటికి వెళ్లనీయనని చెబుతున్న ఈవిడ గారిని ఆ కిరీటం గురించి అడుగుతారని అనుకోవడం కల్ల .. అంతేకాదు.. సాధ్యమైనంత వరకు కిరీటం విషయంలో ఈమెని ఎలా బయట పడేయాలా అనే ఆలోచనతోనే వీరిద్దరూ ఉంటారు.. ఇంక లాభం లేదు.. ఉపేక్షిస్తుంటే సమయం మించి పోతుంది.. నేరుగా  రంగంలోకి దిగడమే ఇప్పుడున్న  మార్గం.. లేదంటే అనవసరంగా  నేను ఇరుక్కున్నానంటే అసలుకే మోసం వస్తుంది...'' మనసులోనే అనుకుంటాడు రాజారాం.. వారి మాటలతో అతని ఒళ్ళు కంపరంగా అనిపిస్తుంది. ఇంక మూర్తి, గోపాల్ ఇద్దరూ శారదమ్మని కిరీటం గురించి గట్టిగా నిలదీసేలా లేరని వారి మాటల వల్ల  అర్థం కావడంతో తానే రంగంలోకి దిగాలని నిర్ణయించుకుంటాడు..

రాజారాం గట్టిగా ఊపిరి పీల్చుకుని.. ఓ సారి గోపాల్, మూర్తి వంక చూస్తూ విసురుగా లేచి నిలబడతాడు.. శారదమ్మని తీక్షణంగా చూస్తాడు..

''ఆహా.. ఏమి కబుర్లు చెప్పుతున్నావు తల్లీ.. ఈ మాటలన్నీ ఎక్కడ నేర్చుకున్నావు.. అయినా గోపాల్ గారు..

మీరు విషయాన్ని ఇలా నాన్చడం ఏమీ బాగోలేదు..'' రాజారాం చిరాగ్గా అంటాడు..

గోపాల్, మూర్తి ఇద్దరూ ఆశ్చర్యంగా రాజారాం వంక చూస్తారు.. గోపాల్ షాకయిపోయినట్టుగా రాజారాం వంక చూస్తుంటాడు.. మూర్తి కూడా రాజారాం వంక అంతే షాక్‌గా చూస్తుంటాడు..

శారద రాజారాం వైపు దెబ్బతిన్నదానిలా చూస్తుంది.. ఆమె కళ్ళు పెద్దవయిపోతాయి.. రాజారాం మాటలకి తీవ్రంగా బాధ పడ్డట్టుగా ఆమె ముఖం లోని భావాలు మారిపోతాయి. అప్పటి వరకూ ఎంతో ఆహ్లాదకరంగా ఉన్న అక్కడి వాతావరణం, రాజారాం మాటలతో ఒక్కసారిగా వేడెక్కిపోతుంది.

''ఏమిటి రాజారాం.. ఏమయింది నీకు.. అంత సీరియస్ కావాల్సిన అవసరం ఏమొచ్చింది..'' సీరియస్‌గాఅంటాడు గోపాల్.

''లేకపోతే ఏమిటండీ.. ఇదేమైనా చిన్న విషయమా..? ఈ గుడి పరువు పోయే పరిస్థితులు ఒకవైపు దాపురిస్తుంటే..

మీరు ఇలా కూల్‌గా మాట్లాడడం ఏమైనా బావుందా..?'' విసురుగా అంటాడు రాజారాం.

''చూడు రాజారాం.. ఎప్పుడు ఎలా మాట్లాడాలో నాకు తెలుసు.. నువ్వు అనవసరంగా టెన్షన్ పడమాకు..''

రాజారాంని శాంత పరచడానికి ప్రయత్నిస్తాడు గోపాల్.

''టెన్షన్ పడకుండా ఎలా ఉంటామండీ.. అయినా మేనేజర్ గారూ.. ఈ గుళ్ళో పాచిపని చేసే ఈవిడ గారిపై మీరు ఇంతలా ప్రేమని ఒలకబోయడం ఏమీ బాగోలేదు.. అసలు విషయం ఏమిటో ఇప్పుడే తేల్చండి..!'' ఉన్నట్టుండి రాజారాం గొంతు కరుకుగా మారిపోతుంది. శారదమ్మపై అతనిలో ఉన్న ద్వేషం ఆ మాటలతో బయట పడుతుంది.. శారదమ్మ అంటే

రాజారాంకి పడదు అన్న విషయం మూర్తి, గోపాల్‌కి తెలిసినా.. అతను శారదమ్మ పై ఇంతగా కక్ష కట్టాడని మాత్రం ఇప్పుడు అతను అన్న మాటల  తర్వాతే వారికి అర్థమయింది..

ఆ మాటలకి శారద ఎంతో ఆశ్చర్య పోతుంది.. ఆమె కళ్ళు పెద్దవవుతాయి.. తీవ్రమైన షాక్‌కి గురయినట్టు ఆమె ముఖం లోని భావాలు మారుతాయి.

గోపాల్, మూర్తి కూడా షాక్‌కి గురవుతారు.. వారిద్దరూ నోళ్ళు వెళ్లబెట్టుకుని రాజారాం వంక చూస్తుంటారు..

రాజారాం సీరియస్‌గా గోపాల్ వంక మూర్తి వంక చూస్తుంటాడు..

శారద కళ్ళల్లో కన్నీళ్ళు సుడులు తిరుగుతాయి.. ఆమె తీవ్రంగా బాధపడుతున్నట్టు ఆమె మొఖకవళికలు తెలుపుతాయి.. ఆమె కళ్ళల్లోనుండి కన్నీళ్ళు జారి చెంపపై పడుతుంటే ఆమెని జాలిగా చూస్తూ ఉండిపోతారు మేనేజర్ మూర్తి, గోపాల్ ఇద్దరూ..

..........................................

శారద కళ్ళల్లో నీళ్ళు సుడులు తిరుగుతుంటాయి. ఆమె చూపుల్లో ఎంతో వేదన కనిపిస్తుంది.. ఆమె ముక్కుపుటాలు అదురుతుంటాయి.. ఆమె తీవ్ర మనోవేదనకి గురవుతున్నట్టుగా ఆమె ముఖ కవళికలు కనిపిస్తుంటాయి..

తన కాళ్ళక్రింద భూమి కంపించినట్టుగా నిలుచున్న చోటునే కుప్ప కూలిపోతుంది శారదమ్మ.

ఈ హఠాత్ పరిణామానికి గోపాల్, మూర్తి ఇద్దరూ తీవ్రంగా ఆందోళన చెందుతారు.. వెంటనే కిందపడ్డ శారదమ్మ దగ్గరికి పరుగెత్తి ఆమె రెండు భుజాలని చెరొకవైపు పట్టుకుని లేపుతారు..

శారదమ్మ ఏదో షాక్‌లో ఉండిపోతుంది.. శారదని బలవంతంగా లేపుతున్న గోపాల్, మూర్తి ముఖం లో విపరీతమైన ఆందోళన కనిపిస్తుంది..

శారదని లేపి ఆ పక్కనే ఉన్న కుర్చీలో కూర్చోబెడతారు.. గోపాల్ టేబిల్‌పైనున్న వాటర్ బాటిల్‌ని శారదమ్మకి అందిస్తారు.. కానీ ఆ నీళ్ళు తాగాలన్న స్పృహలో కూడా ఆమె ఉండనంతగా షాక్‌కి గురవుతుంది..

ఆమె చూపులు శూన్యంలోకి చూస్తుంటాయి.. ఆమె కళ్ళల్లోనుండి కన్నీళ్ళు ధారాపాతంగా కారుతూనే ఉంటాయి.

గోపాల్, మూర్తి ఆమె వంకే ఆందోళనగా చూస్తూ ఆమె భుజాలని తడుతారు..

''శారదమ్మా.. శారదమ్మా...''

అయినా శారదలో చలనం రాదు.. గోపాల్, మూర్తి ఇద్దరూ ఒకరి ముఖాలొకరు చూసుకుంటారు..

''శారదమ్మా.. శారదమ్మా.. ఎందుకిలా అయిపోయావు.. ఇప్పుడేమయిందని.. ముందు మీరు కళ్ళు తుడుచుకొండి.. కాస్త నెమ్మదించండి..'' అనునయంగా అంటాడు మూర్తి..

రాజారాం శారద వంక, మూర్తి, గోపాల్ వంక కోపంగా చూస్తుంటాడు.. వారిద్దరూ శారదమ్మకి పరిచర్యలు చేయడంతో ఆయనకి కోపం ఇంకా ఎక్కువవుతుందని ఆయన ముఖం  కవళికలో తెలుస్తుంటుంది..

''శారదమ్మా.. మరీ అంతలా కంగారు పడకండి.. ముందు ఈ మంచినీళ్ళు త్రాగండి.. కాస్త నెమ్మదిస్తుంది.. ''

శారదమ్మపై వాళ్ళిద్దరూ చూపుతున్న అభిమానానికి రాజారాం మనసు రగిలిపోతుంటుంది..

''హు.. ఈ ముసలిది వీరిద్దరినీ తన వశం చేసేసుకుంది.. అయినా ఇంకా ఎన్ని రోజులు.. ఈ రోజుతో  ఈ ముసలిదాన్ని  ఈ గుళ్ళోనుండి శాశ్వతంగా బయటికి పంపించి వేయాల్సిందే.. సరయిన  సమయంలో సరయిన డైలాగ్ కొట్టడమంటే ఇదే మరీ.. నా మాటకి ఈ ముసలిదాని దిమ్మ తిరిగిపోయింది.. ఇంక ఎలాగూ కిరీటం దొంగతనం దీనిపైనే

పడిపోతుంది.. నేను స్కెచ్ వేసానంటే అది ఎదుటివాడి గుండెల్లో గునపంలా గుచ్చేసుకోవాల్సిందే..

ముందు మాట గునపాన్ని దీని గుండెల్లో దించాను.. ఆ తర్వాత.. ఈ కమిటీ మెంబర్ల ముందు ఈ ముసలిదాన్ని గుడిలోనుండి మెడబట్టి బయటికి గెంటేస్తుంటే.. ఆహా.. ఆ సీన్ చూడాలంటే రెండు కళ్ళూ చాలవు..

రాజారాం మనసులో అనుకుంటాడు.. ఆ డైలాగుకి అనుగుణంగా అతని ముఖం లో ఎక్స్‌ప్రెషన్స్ కదలాడుతున్నాయి.. అతని ముఖం లో ఒక విధమయిన రాక్షసానందం కనిపిస్తుంటుంది.. చివరికి అతను మెల్లిగా శారదమ్మని ఆలయ కమిటీ మెంబర్లందరూ శారదమ్మని మెడ పట్టుకుని ఈడ్చివేస్తున్నట్టుగా ఊహాలోకంలోకి వెళ్ళిపోతాడు

..................................

సాయిబాబా మందిరంలోని ప్రధాన హాలులో సమావేశం ఏర్పాటవుతుంది. మేనేజర్ గోపాల్, మూర్తి, రాజారాంతో పాటుగా ఆలయ కమిటీ మెంబర్లందరూ కుర్చీలో కూర్చుని ఉంటారు.. గుళ్ళో నుండి బంగారు కిరీటం మాయం అయిందన్న విషయాన్ని కమిటీ మెంబర్ల దృష్టికి తీసుకువస్తాడు మేనేజర్ గోపాల్. అయితే రాజారాం మాత్రం ఆ కిరీటం మాయం కావడానికి ప్రధాన కారకురాలు ఆ శారదమ్మే అని ఆలయ చైర్మన్‌తో పాటు కమిటీ మెంబర్లందరికీ నమ్మబలికిస్తాడు. దాంతో కమిటీ మెంబర్లు శారదమ్మని అనుమానంగా చూస్తుంటారు.

వారికి కొద్ది దూరంలో ఒకచోట శారదమ్మ తలదించుకుని ఏడుస్తూ నిలబడి ఉంటుంది.. ఆమెకి కాస్త దూరంలో సావిత్రి శారదని గుడ్లురిమేలా చూస్తూ, ఆ వెంటనే ముఖం లోకి ఎంతో అమాయకత్వాన్ని తెచ్చిపెట్టుకుంటూ రకరకాలుగా ముఖం లో ఎక్స్‌ప్రెషన్స్ మారుస్తూ ఉంటుంది..

రాజారాం శారదమ్మని  ఎంతో కోపంగా చూస్తుంటాడు.. ఆమెకి  కాస్త దూరంలో ఉన్న సావిత్రి, రాజారాం ఇద్దరూ ఒకరి మొహాలొకరు చూసుకుంటారు.. అక్కడి వారికి

అనునమానం రాకుండా ఇద్దరూ ఒక పైశాచికమైన ఆనందాన్ని పంచుకుంటారు. ఆ వెంటనే ఆలయ మెంబర్లకి అనుమానం రాకుండా తిరిగి ఏమీ  ఎరుగనట్టుగా ముఖం లో అమాయకత్వాన్ని తెచ్చి పెట్టుకుంటారు.

ఆలయ కమిటీ మెంబర్లు గంభీరంగా కూర్చుని ఉంటారు..

గోపాల్, మూర్తి శారదమ్మవైపు జాలిగా చూస్తారు.. ఇంక మేమేమీ సాయం చేయలేమన్న ఫీలింగ్ వారి మొఖాల్లో కనిపిస్తుంటుంది..

శారదమ్మ తలదించుకుని కళ్ళనిండా నీళ్ళతో వెక్కి వెక్కి ఏడుస్తుంటుంది..

''మన పాత కాలంలో ఒక సామెత ఉంది.. నవ్వే ఆడదాన్ని, ఏడిచే మగాడ్ని  నమ్మకూడదని.. కానీ ఈ శారద విషయంలో ఆ సామెతని మార్చాలేమో.. నవ్వే అడదాన్ని, ఏడ్చే మగాడ్ని అని కాకుండా ఏడ్చే ఆడదాన్ని, నవ్వే మగాడ్ని  నమ్మకూడదని మార్చాలేమో..'' ఆమె వైపు అసహ్యంగా చూస్తూ అంటాడు.

రాజారాం గొంతులో ఎంతో వ్యంగం తాండవిస్తుంది.. ఆ మాటలకి శారద చివుక్కున తలతిప్పి రాజారాం వంక చూస్తుంది.. ఆమె కళ్ళల్లో కన్నీళ్ళు.. రాజారాం ముఖం లో శారదపై ఉన్న కసి స్పష్టంగా కనిపిస్తుంటుంది.. ఇంక నన్నెవడూ ఆపలేడు అన్న ఆనందం అతనిలో కనిపిస్తుంటుంది..

ఆ మాటలకి గోపాల్, మూర్తి ఇద్దరూ జాలిగా శారదమ్మ వైపు చూస్తారు.. ఆ తర్వాత వారి అసహాయతని వ్యక్తపరుస్తూ తల కిందికి దించుకుంటారు..శారదమ్మ వెక్కి వెక్కి ఏడుస్తుంటుంది.. ఆమె ఏడుపుకి గోపాల్, మూర్తి బాధ పడుతుంటారు కానీ మిగతా వారందరూ ఆమె ఏడుస్తున్నట్టు నాటకమాడుతుందనే అనుకుంటుంటారు.. సావిత్రి కూడా శారదమ్మవైపు కోపంగా చూస్తుంటుంది..

''హమ్మో.. హమ్మో.. సాక్షాత్తూ ఆ భగవంతుడినే మోసం చేయాలంటే ఎన్ని గుండెలు కావాలి..? సాయిబాబా కిరీటాన్ని దొంగిలించిందంటే ఈవిడ గతంలో ఇంకెన్ని గుళ్ళల్లో కన్నాలేసిందో ఏమో.. ఇలా దొంగతనానికి పాల్పడింది.

కాబట్టే కుటుంబసభ్యులు మెడ పట్టి బయటికి గెంటేసి ఉంటారు..'' సావిత్రి శారదమ్మని గుడ్లురిమేలా చూస్తూ అంటుంది..

సావిత్రి మాటలకి శారదమ్మ మరింతగా కుమిలిపోతుంది. ఆలయ చైర్మన్ మౌనంగా ఉంటాడు.. అక్కడి వారి మాటలని వింటూ తనలో తానే ఆలోచనలో పడిపోతాడు.. మధ్య మధ్యలో శారదమ్మ వంక తేరిపార చూస్తుంటాడు.

''సావిత్రమ్మా.. అనవసరంగా ఈవిడ గురించి నోరు పారేసుకుని అందరి ముందు చెడ్డదానివెందుకు అవుతావు..? ఊరుకో..'' గోపాల్ చిరాకుగా అంటాడు..

రాజారాం ముఖం లో ఆనందం కనిపిస్తుంది.. ఆ ఆనందం కమిటీ మెంబర్లు కనిపెట్టకుండా గాంభీర్యాన్ని తెచ్చుకుంటాడు.. సావిత్రి, రాజారాం ఇద్దరూ ఒకరి మొఖాలోకరు చూసుకుని చిన్నగా నవ్వుకుంటారు..

''ఇలాంటి దొంగ కిలాడీని అలాగే వదిలేస్తే షిరిడీకి వెళ్ళి కూడా సాయిబాబా నగలు దొంగిలించే ఘనులు వీళ్ళు.. అసలు ఈవిడ ఈ గుళ్ళోకి వచ్చిందే సాయిబాబా బంగారు నగలని దొంగిలించడానికే అయ్యుంటుంది..

అందుకే నంగనాచిలా అమాయకంగా వచ్చి చేరింది.. ఎవరూ లేరని అందరినీ నమ్మించింది.. ఇది గుళ్ళోనే ఉంటూ ఎప్పుడు సమయం  దొరుకుతుందా.. ఎప్పుడు దొంగిలించాలా అని పథకం  వేసింది.. ఆ పథకానికి తగ్గట్టుగా మేనేజర్ గోపాల్ గారిని, మూర్తి గారిని మచ్చిక చేసుకుంది.. పాపం.. వాళ్ళు ఈ మాయలాడి అమాయకత్వాన్ని,

నటనని నిజమేనని నమ్మేసి అన్నీ ఈవిడకి అప్పజెప్పేసారు.. సరిగ్గా సమయం కోసం వేచి చూస్తున్న ఈ మాయలాడి మూర్తి గారు బంగారు నగలు ఉన్న గది తాళం చెవి ఇవ్వగానే తన పని తాను చేసేసి ఇప్పుడేమో ఏమీ తెలియని నంగనాచిలా ఎలా నిలబడిందో చూడండి..''

సావిత్రి ప్రతి మాటలోనూ శారదపై ఎంత కసి ఉందో కనిపిస్తుంది.. శారదని గుడ్లు ఉరిమి చూస్తూంటుంది సావిత్రి..

సావిత్రి మాటలకి ఆలయ కమిటీ మెంబర్లందరూ ఒకరి మొఖాలొకరు చూసుకుంటూ నిజమే అన్నట్లుగా తలూపుతుంటారు..

రాజారాం సావిత్రిని మెచ్చుకోలుగా చూస్తాడు.. అక్కడున్న వాళ్ళు ఎవరికి కనిపించకుండా సావిత్రికి కనిపించేవిధంగా తన కుడిచేతిని థమ్సప్‌లా చేసి చూపిస్తాడు..

''ఏమిటమ్మోయ్.. అసలు నీకూ  ఈ గుడికి ఏమిటి సంబంధం..  నువ్వెందుకు శారదమ్మపై అన్నేసి నిందులు మోపుతున్నావు.. అయినా ఇది మా కమిటీ సభ్యులకి , ఈ గుడికి సంబంధించిన విషయం.. నువ్విక్కడ ఉండడం కూడా కుదరదు.. దయచేసి ఇక్కడి నుండి వెళ్ళిపో..'' ఆమె ఓవరాక్షన్ భరించలేని గోపాల్ కోపంతో అంటాడు.

గోపాల్ వాయిస్‌లో కాస్త కరుకు ధ్వనిస్తుంది. దాంతో సావిత్రి ముఖం లో రంగులు మారుతాయి.. ఆందోళనగా రాజారాం వంక చూస్తుంది.. రాజారాం మరేం ఫర్వాలేదు.. నేనున్నానుగా అన్నట్లుగా సైగ చేస్తాడు..

''అదేమిటి గోపాల్ గారు అలా అంటారు.. అసలు ఈ సావిత్రమ్మకి ఆ సాయిబాబా అంటే ఎంత భక్తో మీకు తెలియదు.. ఆమె పవిత్రమైన భక్తికి మెచ్చి ఆ సాయినాధుడు ఆమెకి ఎన్నో లీలలని చూపించాడు. సాక్షాత్తూ ఆ సాయిని  తన కలలో దర్శించిన పుణ్యమూర్తి ఈవిడ..''

రాజారాం మాటలకి, గోపాల్, మూర్తి ఇద్దరూ అసహనంగా కదులుతారు.. ఆలయ కమిటీ మెంబర్లు అవునా అన్నట్టుగా ఒకరి ముఖాలొకరు చూసుకుంటారు..

''అలాంటి పవిత్రమైన భక్తురాలు ఈ సావిత్రమ్మ గారు.. ఆ సాయినాధుడు దివ్య దర్శనభాగ్యాన్ని దక్కించుకున్న ఈవిడ నా దగ్గరికి వచ్చి ఇక ఈ జీవితాన్ని ఆ సాయినాధుడికే అంకితం చేయాలనుకుంటున్నాను.. మీరు ఆలయ కమిటీగా ఉన్న సాయిబాబా ఆలయంలో ఆ సాయి సేవకురాలిగా పని చేసే అదృష్టాన్ని కలిగించదని ఎన్నో రోజులుగా వేడుకొంటుంటే ఆ విషయాన్ని నేను మన ఆలయ మేనేజర్ గోపాల్ గారికి చెప్పాను.. ఈ విషయం విన్న ఆయన సానుకూలంగా స్పందించి ఆ సాయినాధుడి సేవ చేస్తానంటే నేను మాత్రం ఎందుకు కాదంటాను.. అని ఒప్పుకున్నాడు. కానీ.. సావిత్రమ్మ గుడిలోకి వచ్చిన ఆ క్షణంలోనే ఇదిగో ఈ శారదమ్మ వచ్చి సావిత్రిని వెనక్కి నెట్టేసి తాను ఈ గుళ్ళో సెటిలయిపోయింది.. ఇంకేముంది.. సమయం చూసి కిరీటాన్ని కాజేసింది..''

రాజారాం శారద ముఖం  చూస్తూ కోపంగా అంటాడు.. ఆ మాటలకి శారద చివ్వున తలెత్తుతుంది.. ఆమె కళ్ళల్లో కన్నీళ్ళు సుడులు తిరుగుతుంటాయి.. నేను ఈ పాపం చేయలేదన్నట్టుగా రెండు చేతులని అడ్డంగా ఊపుతూ అక్కడున్న ఆలయ కమిటీ మెంబర్ల వంక దీనంగా చూస్తుంటుంది..

''రాజారాం గారు చెప్పింది అక్షర సత్యమండీ.. ఆ సాయిబాబా ఒకరోజు నాకు కలలో కనిపించి అమ్మా..

ఇకనుండి నువ్వు నాకు సేవచేస్తూ నీ శేష జీవితాన్ని గడుపు, నా మందిరంలో నాకు సేవ చేస్తూ తరించు అని చెప్పాడు.. ఆ సాయినాధుని  ఆజ్ఞ మేరకు నేను ఈ రాజారాం ని కలవడం జరిగింది.. ఆయన వెంటనే నన్ను ఈ గుళ్ళో సాయికి సేవ  చేసేందుకు గోపాల్ గారి ద్వారా ఆమోదం కూడా తీసుకున్నారు.. సరిగ్గా నేను గుళ్ళోకి వస్తాననగా ఇదిగో ఈ మాయలాడి వచ్చేసింది..'' శారదమ్మ వంక కోపంగా చూస్తూ అంటూంది సావిత్రి.

''అమ్మా.. మీ సాయిసేవా తత్వానికి నిజంగా మేము అభినందిస్తున్నాము.. కానీ ఇక్కడ అసలు దొంగతనం ఎలా జరిగింది.. ఎవరు దొంగిలించారన్న విషయం ఇంకా తేలలేదు.. ఆ

విషయం తేలే వరకూ శారదమ్మ దొంగిలించిందని మనం నిర్ణయించడం భావ్యం కాదు, అంతేకాకుండా ఆవిడే దొంగతనం చేసిందని ఆవిడపై నిందలు వేస్తూ మీరీ విధంగా మాట్లాడటం కూడా భావ్యం కాదు.. గోపాల్ గారన్నట్లు  మీరు దయచేసి ఇక్కడి నుండి బయటికి  వెళితే బావుంటుంది..'' ఎంత కంట్రోల్ చేసుకున్నా మూర్తి గొంతులో కూడా కోపం ధ్వనించింది.

''ఆవిడ ఎందుకు బయటకు వెళ్ళాలండీ.. అసలు ఆవిడ ఆరోజు ఈ సాయి మందిరంలో పనికి కుదిరితే ఇప్పుడు మనం  ఇలా  మీటింగ్ పెట్టుకోవాల్సిన  అఘాయిత్యం దాపురించేదా..?  గుళ్ళోనుండి  కిరీటం మాయమైపోయేదా..? పవిత్రురాలయిన సావిత్రమ్మ లాంటి మహాభక్తురాలిని కాదని ఈ పాపాత్మురాలిని పనిలోకి కుదిర్చాము కాబట్టే ఇప్పుడిలా మీటింగ్ పెట్టుకోవాల్సి వచ్చింది.. ఆలయంలో నుండి కిరీటం పోయిందని, ఆ కిరీటం పోవడానికి కారణం సాయి సేవ ముసుగులో చేరిన ఈ శారదమ్మే అని తెలిసిన ఈ సావిత్రమ్మ అన్నాహారాలు మాని బాధతో ఎంతో కుమిలి పోతుంది.. ఈ విషయం నాతో పంచుకున్నది కాబట్టే.. ఈవిడని ఇక్కడికి తీసుకువచ్చాను తన స్థానంలో వచ్చిన ఈ కిలాడీ లేడీ ఇంత పని చేసిందని తెలియగానే ఆమె ఎంతో కుమిలిపోయింది. ఆ సాయినాధుడిని మోసం చేసిన ఈవిడకి తగిన బుద్ధి చెప్పేదాకా ఆ సాయినాధుడు నాకు మనశ్శాంతి కలిగించడని నన్ను వేడుకున్నది కాబట్టే నేను ఇక్కడికి తీసుకువచ్చాను.. అంతేకానీ మరో ఉద్దేశ్యం కాదు..'' రాజారాం గోపాల్, మూర్తి వంక చూస్తూ సీరియస్‌గా అన్నాడు.

''అవునండీ.. కిరీటం పోయిందని  తెలిసిన మరుక్షణం నా గుండె వేయి ముక్కలయిపోయిందన్నంత ఆవేదన చెందాను.. అదీ నేను చేయాలనుకున్న పనిలో కుదిరిన ఓ పాపాత్మురాలు ఈ అఘాయిత్యానికి ఒడిగట్టిందని తెలియడంతో నా మనోవేదన ఇంకా ఎక్కువయింది.. ఈ ఆలయంతో నాకు భౌతికంగా ఎలాంటి సంబంధం లేకపోయినా.. ఈ ఆలయంలో కొలువయి ఉన్న ఆ సాయినాధుడినికి  సేవ చేయాలన్న సంకల్పంతో ఆ సాయినాధుడితో నాకు సాన్నిహిత్యం ఏర్పడిపోయింది.. భౌతికంగా నేను ఆయనకి సేవ

చేయలేకపోయినా అంతరంగంలో ఎప్పుడూ ఆ సాయిని నేను సేవిస్తూనే ఉన్నాను.. ఆ సాయినాధుడి పరమ భక్తురాలినయిన నేను నా సాయినాధుడి కిరీటం పోయిందంటే ఒక పరమభక్తురాలిగా ఆ విషయం తెలుసుకోవడం నా ధర్మం కాబట్టి నేనిక్కడికి వచ్చాను..''

ధీమాగా అంటుంది సావిత్రి.

ఆలయ కమిటీ మెంబర్లలో ఒకతను సావిత్రిని చూస్తూ అంటాడు..

''సావిత్రమ్మ గారూ.. మీ మాట వింటూంటే సాక్షాత్తూ ఆ సాయినాధుడే తనకి సేవ చేసేందుకు మిమ్మల్ని పిలిపించుకున్నాడని మాకవగతం అవుతుంది.. కానీ ఎక్కడో జరిగిన పొరపాటు వల్ల  ఈవిడ నీస్థానంలోకి వచ్చేసింది..

సరే.. అయిందేదో అయింది.. ఆలయంలోనుండి కిరీటం దొంగిలించబడ్డదని బయటివారికి తెలిస్తే ఆలయ ప్రతిష్ఠ మొత్తం దెబ్బతింటుంది.. అందుకే ఈ సమస్యకి పరిష్కారమార్గాన్ని మన మధ్యలోనే అన్వేషించాలి..'' అన్నాడు.

''శారదమ్మా.. గది తాళం చెవి నీ దగ్గర ఉన్నప్పుడే దొంగతనం జరిగిందని సాక్షాలతో సహా రుజువయ్యాయి కాబట్టి.. ఆ కిరీటం దొంగిలించింది నువ్వైనా అయ్యుండాలి.. లేదంటే నీ ప్రోత్సాహంతో మరెవరయినా ఈ అఘాయిత్యానికి పాల్పడి  ఉంటారని మా ఆలయ కమిటీ భావిస్తుంది.. ఆలయ గౌరవ మర్యాదల దృష్ట్యా ఈ విషయాన్ని  పోలీస్  స్టేషన్  వరకూ తీసుకువెళ్లకుండా  గుళ్ళోనే  సామరస్యంగా  పరిష్కరించాలని మేము నిర్ణయించుకున్నాము కాబట్టే మీరు  ఇంకా మాముందు  నిలబడి ఉన్నారు..  లేదంటే ఈ  పాటికి మీరు పోలీస్ స్టేషన్‌లో పోలీసు లాఠీ దెబ్బలు తింటూ ఉండేవారు..'' మరో ఆలయ కమిటీ మెంబర్ అన్నారు. కఠినంగా అన్న అతని మాటలకి శారద హృదయ విదారకంగా రోదించింది..

వారి మాటలకి ప్రేక్షకుల్లా మౌనంగా వినడమే తప్ప గోపాల్‌కి, మూర్తికి శారదమ్మని వెనకేసుకురావడానికి సరైన కారణాలు లేకపోయే సరికి వారు మనసులోనే బాధతో కుమిలిపోతున్నారు.

''హయ్యో.. భగవంతుడా.. ఏమిటి  ఈ పరీక్ష.. నాకే పాపం తెలియదని ఎంత మొత్తుకున్నా మీరెవరూ వినిపించుకోవడం లేదెందుకు..? ఆ సాయినాథుడి సాక్షిగా ఈ దొంగతనం ఎలా జరిగిందో నాకు తెలియదు.. ఆ సాయి దివ్య చరణాలే వెలకట్టలేని ఆభరణాలుగా భావించే నాకు ఈ బంగారు కిరీటాలతో, నగలతో పనేముంటుంది.. నన్ను నమ్మండి.. నాకూ, ఈ దొంగతనానికి ఎలాంటి సంబంధం లేదు..''

ముఖం లో చేతులు దాచుకుని వెక్కి వెక్కి రోదిస్తుంది శారద..

గోపాల్, మూర్తి ఇద్దరూ ఆవిడ రోదనకి ఎంతో జాలి పడుతుంటారు.. వారి కళ్ళల్లో కూడా సన్నటి కన్నీటి బిందువులు కనిపిస్తుంటాయి..

రాజారాం శారదమ్మ వైపు తీక్షణంగా చూస్తుంటాడు.. సావిత్రి కూడా శారదమ్మ వైపు కోపంగా చూస్తుంటుంది.

''ఆహా.. ఏమి నటిస్తున్నావు తల్లీ.. ఇలా నటించే అమాయకులైన మా మేనేజర్ గారిని బుట్టలో వేసేసుకుని గుడిలోకి ఎంటరయ్యావు..  అయినా దొంగతనం  చేసిన వారెవరయినా భుజాలెగరేసుకుంటూ నేనే  దొంగనని ఒప్పుకుంటారా ఏమిటి..? మీరిలా సుతిమెత్తగా అడిగితే ఈ దొంగతనం కేసు ఎన్నటికీ తెమలదు.. మన ఆలయ కమిటీ మెంబర్లు కాస్త కఠినంగా ప్రవర్తిస్తే బావుంటుంది..'' రాజారాం అరిచినట్టుగా అంటాడు..

కమిటీ మెంబర్లందరూ ఒకరి ముఖాలొకరు చూసుకుంటారు.. వారి చూపు తీవ్రంగా రోదిస్తున్న శారదమ్మపై పడుతుంది..

''ఆవిడ వాలకం చూస్తుంటే ఈ దొంగతనంతో ఆవిడకి ఎలాంటి సంబంధం లేదేమో అనిపిస్తుందండీ నాకు..''

ఏడుస్తున్న శారద వంక చూస్తూ జాలిగా అంటాడు అతడు. ఆ మెంబర్ మాటలకి గోపాల్, మూర్తి కళ్ళల్లో ఆనందం కనిపిస్తుంది.. ఇద్దరూ సంతోషంగా ఒకరి ముఖాలొకరు చూసుకుంటారు...

‘‘హూ.. నాకూ అలాగే అనిపిస్తుందండీ.. కానీ ఇక్కడ మన వ్యక్తిగత అభిప్రాయాలతో సంబంధం లేదు కదా.. ఆవిడ దగ్గర గది తాళం చెవి ఉన్నప్పుడు కిరీటం మాయమైపోయింది కాబట్టి.. ఈ దొంగతనానికి బాధ్యురాలు అవిడే అవుతుంది.. కాబట్టి దీనికి  శిక్ష కూడా ఆవిడే అనుభవించాలి..’’  మరో  ఆలయ  కమిటీ మెంబర్  తన అభిప్రాయాన్ని తెలుపుతాడు చైర్మన్ వంక చూస్తూ.. అయినా ఆలయ చైర్మన్ మౌనంగానే ఉంటాడు.

దాంతో మిగతా కమిటీ మెంబర్స్.. ముక్త కంఠంగా..

‘‘అవును.. ఆవిడే ఈ దొంగతనానికి బాధ్యత వహించాలి.. ’’ అని అంటారు.

వారి మాటలకి గోపాల్ ముఖం లో నిరుత్సాహం తాండవిస్తుంది.. దీనంగా ఏడుస్తున్న శారద వంక చూస్తాడు..

శారద కళ్ళల్లో కన్నీళ్ళు ఇంకా కారుతూనే ఉంటాయి.. మూర్తి కూడా శారద వంక దీనంగా చూస్తుంటాడు..

‘‘చూడండి గోపాల్ గారూ.. ఈ ఆలయ కమిటీ తరపున మేము తీసుకుంటున్న నిర్ణయం ఏమిటంటే.. ఆ గది తాళం చెవి ఈవిడ దగ్గర ఉన్నప్పుడే కిరీటం మాయమైపోయింది కాబట్టి.. ఈవిడనే దొంగగా కమిటీ భావిస్తుంది..

ఇక ఈవిడ నుండి ఆ దొంగతనం వివరాలని తీసుకోవాల్సిన బాధ్యత నీదే..’’ నిక్కచ్చిగా అంటాడు అతడు.

గోపాల్ ముఖం లో బాధ స్పష్టమవుతుంది.. శారదమ్మపై ఎక్కడా లేని జాలి కలుగుతుంది..

‘‘హబ్బా.. మళ్ళీ ఈ గోపాల్ దగ్గరికే వచ్చి ఆగిందేమిటి ఈ కేసు.. ఆ శారదమ్మపై అపారమైన మమకారాన్ని ఏర్పరుచుకున్న ఈయనగారు.. ఆవిడని దొంగగా ఎలా ఒప్పుకుంటాడు.. లాభం లేదు.. ఏదో ఒకటి చేయాలి.. ఆ శారదమ్మని  ఆయనే మెడపట్టి బయటికి గెంటేలా

ప్లాన్ చేయాలి.. ఎలా..? ఎలా..?'' రాజారాం మనసులోనే అనుకుంటాడు.. ఎలాగైనా శారదని ఈ గుళ్ళో నుండి తరిమివేయాలన్న కక్ష ఆయనలో కనిపిస్తుంది.

కమిటీ మెంబర్ల మాటకి గోపాల్ ఏం నిర్ణయం తీసుకోవాలో అర్థం కాకుండా అయోమయంగా ఆలయ చైర్మన్ వంక చూస్తాడు.. అతను మౌనంగా శారదమ్మనే గమనిస్తూండడం గ్రహించి తిరిగి మూర్తి వంక ఏం చేద్దాం అన్నట్టుగా చూస్తాడు గోపాల్.. మూర్తి కూడా నాకూ ఏమీ తోచడం లేదన్నట్టుగా సైగ చేస్తాడు..

''ఇంకా ఆలోచించడం ఎందుకండీ.. ఈ ఆలయంలో ఇప్పటి వరకూ ఎన్నో కార్యక్రమాలు జరిగాయి.. కొన్ని వేల మంది భక్తులు ఆలయాన్ని సందర్శించారు.. ఎన్నో సార్లు విలువైన వస్తువులు ఆలయంలో ఎక్కడ ఉన్నా కూడా జాగ్రత్తగా ఉండేవి.. అలాంటిది మొట్టమొదటి సారిగా ఈవిడ గారు ఆలయంలో కాలు పెట్టగానే ఏకంగా బంగారు కిరీటమే దొంగిలించబడిందంటే.. దానికి కారణం ఈ శారదమ్మే అని స్పష్టంగా తెలుస్తోంది.. ఇంకా ఉపేక్షించి లాభం లేదు.. ఇంత ఖరీదైన విగ్రహం విషయంలో పాపం గోపాల్ గారు మాత్రం ఏం చేస్తారండీ.. ఆలయ కమిటీయే ఏదో ఒక కఠిన నిర్ణయాన్ని తీసుకోవాల్సిందే.. అంతే..!'' తన నిర్ణయాన్ని తెలుపుతాడు రాజారాం.

రాజారాం మాటలకి కమిటీ మెంబర్లు ఒకరి ముఖాలొకరు చూసుకుంటారు..

అందరి మాటలు విన్న ఆలయ కమిటీ చైర్మన్ తీక్షణంగా ఆలోచనలో పడిపోతాడు..

శారదమ్మ మాత్రం తీవ్రంగా రోదిస్తూనే ఉంటుంది.. రాజారాం వంక సావిత్రి చూస్తుంటుంది.. ఆమె ముఖం లో ఆందోళన.. వాళ్ళు ఏం నిర్ణయం తీసుకుంటారు అన్నట్టుగా రాజారాంకి సైగ చేస్తుంది సావిత్రి..

''నువ్వేమీ కంగారు పడకు.. నేను చూసుకుంటాను అన్నట్టుగా రాజారాం సైగ చేస్తాడు.. ''

కమిటీ చైర్మన్ చివరికి ఒక నిర్ణయం తీసుకున్న వాడిలాగ.. అక్కడున్న వారందరి మొహాలని ఒకసారి పరికించి గొంతు సవరించుకుంటాడు. చైర్మన్ గారు స్పందించడానికి సిద్ధపడడంతో అందరి చూపు ఆయనపై పడింది.

ఆయన ఏం చెబుతాడా అని అక్కడున్న వారంతా ఎంతో ఆసక్తిగా చెవులు రిక్కించి మరీ వినడానికి సిద్ధపడతారు.

మేనేజర్ గోపాల్ వంక, మిగతా కమిటీ మెంబర్ల వంక చూస్తూ అంటాడు ఆలయ కమిటీ చైర్మన్..

''ఒకసారి ఆ పక్కగదిలోకి పదండి.. నా నిర్ణయం ఏమిటన్నది అక్కడ చెబుతాను..'' అంటూ ఆయన పక్క గదిలోకి అడుగు వేస్తాడు..

అతని మాటలకి కమిటీ మెంబర్లతోపాటు, గోపాల్, మూర్తి, రాజారాం లు కూడా ఆయన వెనకాలే వెళతారు..

వారితోపాటు వెళుతున్న రాజారాం వెళుతూ వెళుతూ సావిత్రి వంక చూస్తూ.. మరేమీ ఫర్వాలేదు.. నేను చూసుకుంటాను అన్నట్టుగా సైగ చేస్తాడు...

ఆందోళనగా చూస్తున్న సావిత్రి అతని హామీకి ఆమె ముఖం లో ఒకవిధమైన పైశాచికానందం తాండవిస్తుంది.

..............................................

ఆ మందిరంలోని మరో గదిలోకి చైర్మన్‌తో పాటు అందరూ ఎంటర్ అవుతారు.. ముందుగా వచ్చిన కమిటీ చైర్మన్ గాఢంగా ఓ నిట్టూర్పు విడిచి అందరి వంకా చూస్తాడు...

''హే సాయిరాం.. ఎంతటి పరీక్షని మా ముందు పెట్టావయ్యా.. ఈ పదేళ్ళ కాలంలో ఎన్నడూ ఎదుర్కోనటువంటి సమస్యని మాముందు పెట్టి నువ్వు మాత్రం వినోదిస్తున్నావా తండ్రీ..''

ఎదురుగా కనిపిస్తున్న సాయిరాం పటాన్ని చూస్తూ భారంగా నిట్టూర్పు విడుస్తూ అంటాడు ఆలయ చైర్మన్.

''చూడండి చైర్మన్ గారూ.. ఇది పరీక్షే.. కాదనను.. కానీ ఈ పరీక్ష లాంటి సమస్యకి పరిష్కారం కూడా మనదగ్గరలో  పెట్టుకుని మనం ఇంకా దీని గురించి తీవ్రంగా ఆలోచించడం ఏమీ బాగోలేదు.. అమాయకురాలిగా నటిస్తున్న ఆ శారదమ్మని  నాలుగు తగిలిస్తే అసలు నిజం అదే  బయటికి వస్తుంది..'' రాజారాం మాటలకి చైర్మన్‌తో  పాటు గోపాల్, మూర్తిలు కూడా రాజారాం వంక కోపంగా చూస్తారు..

''రాజారాం గారూ.. కోప తాపాలకి ఇది సమయం కాదు.. అయినా సాయి తత్వాన్ని  ఎరిగిన మనం ఇలా హింసాయుతంగా పరిష్కారమార్గాన్ని ఎంచుకోవడం ఎంత వరకు సమంజసం.. అలాంటి ఆలోచనలు మానుకోండి..''

అతని మాటలకి రాజారాం అహం దెబ్బతింటుంది.. కానీ అలా అన్నది చైర్మన్ కాబట్టి అవమానాన్ని దిగమింగుకుని తలదించుకుంటాడు..

చైర్మన్ గారు భారంగా ఓ నిట్టూర్పు విడుస్తాడు..

''ఒకసారి ఇంచుమించు ఇలాంటి పరిస్థితినే సాక్షాత్తూ ఆ సాయినాధుడు ఎదుర్కొన్నాడు.. పోలీసులకి పట్టుబడ్డ ఒక దొంగ తన దగ్గరున్న నగలన్నీ సాయిబాబా ఇచ్చాడని తెలపడంతో పోలీసులు ఆ సాయినాధుని విచారిస్తారు..

ఈ కథ మీ అందరికీ తెలిసిందే.. పోలీసు విచారణలో సాయిబాబా నిర్దోషి అని ఆ నగలు ఆ దొంగే సాయి భక్తులు దగ్గర దొంగిలించాడని తేలుతుంది.. మనకు కలిగిన ఈ క్లిష్ట పరిస్థితి గమనిస్తే నాకు ఆ కథ గుర్తుకువస్తుంది..

దేవుడి సొమ్ముని ఆశించిన వాడు ఎన్నటికీ బాగు పడలేదు.. పైగా సాయినాధుడి ఆశీస్సులతో ఆయన ఆలయానికి కర్తలుగా ఉన్న మనం ఈ విషయంలో ఎలాంటి వివాదాస్పద నిర్ణయం తీసుకోకూడదు..'' గంభీరంగా అంటాడు ఆలయ చైర్మన్.

''ఏమీ నిర్ణయం తీసుకోకుంటే మరి ఈ సమస్యకి పరిష్కారం ఎలా దొరుకుతుందండీ..'' అన్నాడు ఆశ్చర్యంగా..

''నేనన్నది మనం తీసుకునే పరిష్కారం వివాదాస్పదం కాకూడదని.. ఈ సమస్యకి నా దగ్గర ఒకే ఒక్క పరిష్కార మార్గం ఉంది.. అదేమిటంటే...''

మాటలు ఆపేసి ఒకసారి అందరి ముఖాలు చూస్తాడు ఆలయ చైర్మన్.. చైర్మన్ ఏం చెబుతాడా అని అందరూ కుతూహలంగా చూస్తూంటారు..

''భగవంతుని సన్నిధిలో ఆ భగవంతునికి సంబంధించిన వస్తువులు కనిపించడం లేదంటే.. ఇందులో మానవమాత్రులకి అర్థంగాని నిగూఢమైన రహస్యం ఏదో దాక్కొని ఉందేమో అని నాకనిపిస్తుంది.. అందుకే.. నిందారోపణలు ఎదుర్కొంటున్న ఆవిడని స్వచ్ఛందంగా ఈ గుడిలోనుండి బయటికి పంపిస్తే సరిపోతుంది..''

ఆ మాట వినగానే రాజారాం ముఖం  ఆనందంతో వెలిగిపోతుంది..

''ఎస్స్.. ఎస్స్.. నా అంచనా నిజమైంది.. ఆ శారదమ్మని గుళ్ళోనుండి తరిమేసే క్షణాలు ఆసన్నమయ్యాయి..

యాహూ.. ఈ రాజారాం స్కెచ్ వేసాడంటే.. ఇంక దీనికి తిరుగేముంటుంది.. యాహూ..'' అతని మనసులోనే ఎగిరి గంతేసినంత పని చేసి పై విధంగా అనుకుంటాడు.

గోపాల్, మూర్తి ఇద్దరి ముఖాల్లో నెత్తురు చుక్కలేకుండా పాలిపోతాయి..

''ఆ శారదమ్మని గుళ్ళో నుండి పంపించివేస్తే మరి.. ఆ కిరీటం  జాడ తెలిసేదెలా..?'' ఆశ్చర్యంగా అడుగుతాడు.

చైర్మన్ అతని వంక ఓ సారి చూసి, తిరిగి మిగిలిన వారి వంక కూడా చూసి చిన్నగా నవ్వుతాడు.

‘‘ఆ కిరీటం దొంగిలించారు అని మనం అనుకుంటున్నాం.. కానీ.. నాకు మాత్రం ఆ కిరీటాన్ని మనకి

కనిపించనీయకుండా ఆ సాయినాధుడు చేసాడనిపిస్తుంది.. ఆ భగవదనుగ్రహం ఎలా ఉంటే అలా జరుగుతుంది..

ఆ కిరీటం జాడ మనకి రెండు వారాల్లోగా తెలియాలని నేను ఆ సాయినాధుడి దగ్గర సంకల్పించాను.. అలా జరగని పక్షంలో మరొక కొత్త కిరీటాన్ని నేనే చేయించి ఆ సాయినాధుడికి సమర్పిస్తాను..’’ నిశ్చయంగా అన్నాడు ఆలయ కమిటీ చైర్మన్.

ఆయన నిర్ణయానికి అందరూ ఆశ్చర్యపోయారు.. తన వంకే ఆశ్చర్యంగా చూస్తున్న అందరి వంకా చిరునవ్వు నవ్వుతూ చూస్తుంటాడు చైర్మన్..

‘‘ఆ సాయినాధుడు ప్రపంచమంతా ప్రేమమయం కావాలని ఆశించాడు కానీ.. ఒకరిని ఒకరు నిందించుకోవాలని ఏనాడూ చెప్పలేదు.. నా నిర్ణయం ఆ సాయినాధుడికి నచ్చితే రెండు వారాల్లో కిరీటం మన దరికి చేరుతుంది..

లేదంటే.. నేను తీసుకున్న తప్పుడు నిర్ణయానికి మూలంగా  నేనే మరో కిరీటం చేయిస్తాను.. గోపాల్ గారూ..

మీరెళ్ళి ఆ శారదని ఉన్న ఫళంగా గుడిలోనుండి పంపించివెయ్యండి.. ఆవిడని ఇంకా గుళ్ళోనే కొనసాగిస్తే.. దొంగిలించబడిన కిరీటం తాలూకు జ్ఞాపకాలు గుర్తుకి వచ్చి మన అందరి మనసులో ఏదో తెలియని బాధ నిండుకుంటుంది..’’

నిదానంగా అన్నాడు చైర్మన్.

చైర్మన్  మాటలకి  గోపాల్‌కి  ఏం చెప్పాలో  అర్థం  కాలేదు..  శారదమ్మ నిర్దోషి  అని ఆయన మనసు అనుకుంటున్నప్పటికీ చైర్మన్ నిర్ణయాన్ని తోసి పుచ్చే అధికారం లేకపోవడంతో సరే అన్నట్లుగా తల ఊపి మెల్లిగా అక్కడి నుండి కదులుతాడు..

కదులుతున్న గోపాల్ వంకే విజయానందంతో చూస్తాడు రాజారాం..

........

చైర్మన్ వాళ్ళు వెళ్ళిన గది తలుపువంకే ఎంతో టెన్షన్‌తో చూస్తుంటూంది సావిత్రి.. ఆమె చాలా టెన్షన్ పడుతుందన్నట్టుగా ఆమె రెండు చేతులని నలుపుకుంటూ.. ఆత్రంగా ఆ డోర్ వంక చూస్తుంటూంది..

శారద కూడా ఆ డోర్ వంక చూస్తుంటూంది.. ఆమె ముఖం లో ఒక విధమైన వైరాగ్యం కనిపిస్తుంటుంది..

ఆమె కళ్ళల్లో నుండి కన్నీళ్ళు రాలుతూ ఆమె చెంపపై పడుతుంటాయి..

ఆ డోర్ లో నుండి మొదటగా ఆలయ చైర్మన్ బయటికి వస్తాడు.. చైర్మన్ ముఖం  చాలా గంభీరంగా ఉంటుంది..

ఆ వెనకాలే మేనేజర్ గోపాల్ బయటికి వస్తాడు.. అతని ముఖం లో ఒక విధమైన బాధ కనిపిస్తుంటుంది.. ఆ వెనుక మూర్తి వస్తాడు.. అతని ముఖం లో కూడా ఒక విధమైన బాధ కనిపిస్తుంటుంది.. అలా ఒకరి తరువాత ఒకరు అందరూ బయటికి వస్తారు.

సావిత్రి ముఖం లో ఎంతో టెన్షన్ కొట్టొచ్చినట్టు కనిపిస్తుంటుంది.. వారందరూ వస్తూంటే ఆమె చూపులు రాజారాం కోసం వెతుకుతుంటాయి.. శారద ఏడుస్తూ తల దించుకుని ఒక పక్కగా నిలబడి ఉంటుంది.

అందరికంటే చివరలో రాజారాం వస్తూ కనిపిస్తాడు.. అతని ముఖం లో ఆనందం స్పష్టంగా కనిపిస్తుంటూంది..

తాను గెలిచానన్న సంతోషం అతని ముఖం లో కనిపిస్తుంటూంది. ఒక విధమైన గర్వం అతని ముఖం లో కదలాడుతుంటుంది..

రాజారాం సావిత్రిని చూస్తాడు.. సావిత్రి ఎంతో టెన్షన్‌గా రాజారాంని చూస్తుంటుంది.. ఆమె కనులతోనే ఏమయింది అన్నట్టుగా సైగ చేస్తుంది..

ఆమె సైగని గమనించిన రాజారాం ముఖం లో చిరునవ్వు కదలాడుతుంది.. తనని ఎవరూ గమనించడం లేదని ఒకసారి ఆ చుట్టూ ఉన్న వారి వైపు చూసి ఆ తర్వాత తన కుడిచేయిని కాస్త పైకెత్తి బొటన వేలు  పైకెత్తి థమ్స్ అప్  అన్నట్టుగా చూపిస్తాడు.. అప్పటి వరకూ ఎంతో టెన్షన్‌గా చూస్తున్న సావిత్రి ముఖం లో ఎంతో ఆనందం కనిపిస్తుంటుంది..

రాజారాం సావిత్రి వంక చూస్తూ ఆ పక్కనే ఓ మూలగా తలదించుకుని నిలబడి ఉన్న శారదమ్మ వంక చూసి ఓ వికృతమైన నవ్వు నవ్వుతాడు..

ఆలయ కమిటీ మెంబర్లందరూ బయటికి వచ్చాక యథా స్థానంలోకి చేరుకుంటారు అందరూ..

మేనేజర్ గోపాల్ శారద వంక చూస్తాడు.. అతని ముఖం లో ఎంతో బాధ కనిపిస్తుంటుంది.. తల దించుకుని కన్నీళ్ళు పెట్టుకుంటున్న శారదని చూసిన ఆయన భారంగా నిట్టూర్పు విడుస్తాడు.. మూర్తి ముఖం లో కూడా ఆవేదనతో కూడిన ఎక్స్‌ప్రెషన్స్ కనిపిస్తుంటాయి..

ఆలయ ఛైర్మన్ ఒకసారి శారద వంక చూస్తాడు.. తలదించుకుని రోదిస్తున్న శారదని చూడగానే ఆయనలో కూడా కొద్దిగా జాలి కలుగుతుంది.. విలపిస్తూ కనిపిస్తున్న ఆమె వంక జాలిగా చూసి గోపాల్ వంక తిరుగుతాడు.

ఆలయ ఛైర్మన్ వాయిస్..

‘‘గోపాల్ గారూ.. నా నిర్ణయం ఏమిటో మీకు తెలియజేసాను.. ఇక దానిని పాటించడమే మీరు చేయవసింది..

ఇక ఈ వివాదాన్ని ఇంతటితో మరిచిపోవాలని నేను ప్రతీ ఒక్కరినీ కోరుకుంటున్నాను..’’

చైర్మన్ గోపాల్ వంక చూస్తూ ఏదో సైగ చేస్తూ అక్కడి నుండి ముందుకి అడుగు వేస్తాడు.. ఆ హాలులో నుండి వెళుతూ వెళుతూ తలదించుకుని నిలుచున్న శారదని చూస్తాడు..

అతని ముఖం లో ఆమెపై ఒక విధమైన జాలి కనిపిస్తుంది.. కొద్ది సెకనుల పాటు ఆమెవంక అలాగే చూస్తాడు..ఆ వెంటనే గట్టిగా ఊపిరి పీల్చుకుని అక్కడి నుండి కదులుతాడు.

అతని వెనకాలే మిగతా ఆలయ మెంబర్లు వెళ్ళిపోతారు..

రాజారాం ముఖం లో చాలా ఆనందం కనిపిస్తుంటుంది.. అతని చూపులు  శారదమ్మపై పడతాయి.. అతని ముఖం లో ఆనందం స్థానంలో క్రోధం ప్రతిఫలిస్తుంది.. రాజారాం ముఖం క్లోజప్ షాట్..

''ఈరోజుతో ఈ శారదమ్మ పీడ విరగడ అయిపోయింది.. ఎక్కడి నుండి వచ్చిందో ఈ దొరసాని.. సావిత్రిని తప్పించి ఈ గుళ్ళో తిష్ఠ వేసింది.. ఈవిడ వల్ల ఇన్నాళ్ళుగా నేను అనుకుంటున్న ప్లాన్‌లన్నీ వర్కవుట్ కాకుండా అలాగే ఉండిపోయాయి.. ఇప్పుడు ఇక నాకు తిరుగులేదు.. దిక్కూ మొక్కూ లేని వారిని తీసుకొచ్చి గుళ్ళో పెట్టుకుంటే ఇలాంటి దొంగతనాలు  జరుగుతాయని దానికి ఉదాహరణ ఈ శారదమ్మే అని చెప్పేస్తే.. ఇంక సావిత్రిని ఈ గుళ్ళో పెట్టడం పెద్ద కష్టమేమీ కాదు.. ఒక్కసారి సావిత్రి ఈ గుళ్ళో కుదిరిందంటే.. ఇంక ఆ తర్వాత… '' తన మనసులోనే అతను అనుకుంటాడు రాజారాం.

సావిత్రి ముఖం  కూడా వెలిగిపోతుంటూంది.. తనలోని సంతోషాన్ని అతి కష్టంమీద ఆపుకుంటున్నట్టుగా ఉంటాయి ఆమె ముఖం  కవళికలు…

మేనేజర్ గోపాల్ మూర్తి వంక చూస్తాడు.. అతనికి ఏం చేయాలో అర్థం కాకుండా ఉందన్నట్టుగా అతని మొహ కవళికలు ఉంటాయి.. మూర్తి కూడా గోపాల్ వంక చూసి భారంగా నిట్టూర్పు విడుస్తాడు.

మూర్తి, గోపాల్ ఇద్దరూ ఒకరి ముఖాలొకరు చూసుకుంటుండగా రాజారాం వారిద్దరినీ చిరాగ్గా చూస్తాడు..''హూ.. దేవుడు కరుణించినా పూజారి వరమివ్వడం లేదన్నట్టుగా ఈ

ఆలయ చైర్మనే శారదమ్మని ఈడ్చి బయటికి గెంటేయండని చెప్పాక కూడా.. వీళ్ళిద్దరూ ఇంకా ఏదో ఆలోచనలో పడిపోయారు.. ఛఛ.. ఇంక లాభం లేదు..తానే రంగంలోకి దిగాల్సిందే..'' మనసులోనే అనుకుంటాడు రాజారాం.

''గోపాల్ గారూ.. ఇంకా ఆలస్యం చేస్తున్నారేమిటి..? గదిలో చైర్మన్‌గారు చెప్పింది మీరు విన్నారు కదా..''

రాజారాం వంక మూర్తి కోపంగా చూస్తాడు..

''ఆ విన్నారు లెండి.. కానీ.. ఈ విషయంలో మీరు ఇంత ఉత్సాహాన్ని ఎందుకు కనబరుస్తున్నారో అర్థం కావడం లేదు మాకు..'' మూర్తి మాటల్లో అనుమానం ధ్వనిస్తుంది.

రాజారాం ముఖం లో కంగారు ప్రతిఫలిస్తుంటుంది..

తన ముఖం లోని భావాలని వెంటనే మార్చుకుంటూ.. ముఖం లోకి చిరునవ్వు తెచ్చుకుంటాడు.. మూర్తి మాటలకు విన్న సావిత్రి ముఖం లో కూడా భావాలు మారిపోతాయి.

''ఆ.. అబ్బే.. అలాంటిదేం లేదు.. ఎలాగూ తీసుకోవాల్సిన వారు నిర్ణయం తీసుకున్న తర్వాత ఇంకా ఆలస్యం ఎందుకని అంటున్నానంతే..'' ముఖం లోకి చిరునవ్వుని తెచ్చిపెట్టుకుంటూ అంటాడు.

''రాజారాం గారూ.. మనకి ఇష్టం ఉన్నా లేకపోయినా ఆలయ కమిటీ ఒక నిర్ణయం తీసుకుందంటే దాన్ని అమలు చేయాల్సిందే కదా.. కానీ..'' అంటూ ఆగిపోతాడు గోపాల్.

రాజారాం ముఖం లో ఆశ్చర్యం..

''ఆ.. కానీ..!'' ఆశ్చర్యంగా గోపాల్ వంక చూస్తూ అంటాడు.

''ఈ విషయంలో మనం ఏదో పొరపాటు చేస్తున్నామని అనిపిస్తుంది.. శారదమ్మ ముఖం చూస్తూంటే ఆమెకీ ఈ దొంగతనానికి ఎలాంటి సంబంధం లేదని నాకనిపిస్తుంది.. కానీ..'' అంటాడు గోపాల్ బాధతో అతని నోటి నుండి మాటలు రావు.

''అవునవును.. నాక్కూడా అలాగే అనిపిస్తుంది.. కానీ.. పరిస్థితులేమో శారదమ్మనే దోషిగా నిలబెడుతున్నాయి..'

రాజారాం ముఖం లో కోపం ప్రవేశిస్తుంది..

''చూడండి గోపాల్ గారూ.. ఒకసారి కమిటీ నిర్ణయం తీసుకున్న తర్వాత మీ వ్యక్తిగత అభిప్రాయాలని రుద్దేసి అనవసరంగా ఈ ఇష్యూని పెద్దగా చేయకండి.. ఆ ముసలిది వచ్చిన దగ్గర్నుంచీ మీరు ఆవిడని అదేదో మీ కుటుంబ సభ్యురాలు అన్నంత అభిమానాన్ని కనబరుస్తున్నారు.. నేనంతా గమనిస్తూనే ఉన్నాను.. మనం ఎంత అభిమానాన్ని కుమ్మరించినా దొంగ దొంగే కానీ.. మంచి వాళ్ళు కారు.. ఆవిడని బయటికి గెంటేయడం మీకు చేతకాకపోతే ఆ పనేదో ఒక ఆలయ కమిటీ మెంబర్‌గా నేనే చేస్తాను..'' కఠినంగా అంటాడు రాజారాం.

గోపాల్, మూర్తి ఇద్దరూ రాజారాం వంక చూస్తారు.. వారి ముఖాల్లో ఒక విధమైన షాక్ కనిపిస్తుంటుంది..

తలదించుకుని రోదిస్తున్న శారదమ్మ కూడా తలెత్తి షాకైపోయి చూస్తుంది వారి వంక.. సావిత్రి కోపంగా శారదని చూస్తుంటూంది..

రాజారాం కోపంగా కుర్చీలోనుండి లేస్తాడు. అతని చూపు శారదమ్మపై పడుతుంది.. ఆమె వైపు క్రోధంగా చూస్తూ తన రెండు చేతులతో హ్యాండ్ క్లాత్‌ని పైకి మడుస్తుంటాడు..

అతని చూపు తన వంకే ఆశ్చర్యంగా చూస్తున్న గోపాల్ మరియు మూర్తి వంక పడుతుంది..

గోపాల్, మూర్తి ఇద్దరూ ఒకరి ముఖాలొకరు చూసుకుంటుంటారు..

రాజారాం వారి నుండి చూపులు మరల్చి సావిత్రి వంక చూస్తాడు.. సావిత్రి కళ్ళల్లో శారదపై ఉన్న కోపం కనిపిస్తుంటుంది.. ఆమె ముక్కుపుటాలు అదురుతుంటాయి..

రాజారాం తన వంక చూడగానే అతని కళ్ళతోనే శారదని చూపిస్తూ బయటికి తోసెయ్ అనే అర్థం వచ్చేలా సైగ చేస్తుంది.. సావిత్రి సైగని అర్థం చేసుకున్న రాజారాం ముఖం లోకి ఒక పైశాచికమైన నవ్వు ప్రవేశిస్తుంది..అదీ కొద్ది సేపే.. ఆ తర్వాత రాజారాం మెల్లిగా అక్కడి నుండి ముందుకి కదులుతాడు..

రాజారాం శారద వైపు అడుగులు  వేస్తూంటాడు.. తన వైపే వస్తున్న రాజారాంని ఎంతో ఆశ్చర్యంగా చూస్తూ ఉంటుంది శారద. రాజారాం శారద దగ్గరికి వస్తాడు.. ఆమెని కోపంగా చూస్తూ ఆమె జుట్టు పట్టుకుని ఒక్కసారిగా ముందుకి లాగుతాడు..

రాజారాం అలా చేస్తాడని ఎంత మాత్రమూ ఊహించని శారద కళ్ళల్లో విపరీతమైన ఆశ్చర్యం కనిపిస్తుంటుంది..

రాజారాం కళ్ళల్లో శారదపై ఉన్న పగ ప్రతిఫలిస్తుంటుంది.. రాజారాం ముఖం లోని రౌద్రం తారాస్థాయికి చేరుకుంటుంది.

గోపాల్, మూర్తిలు రాజారాం చర్యకి ఎంతో షాకవుతారు. వారు ఆ షాక్ నుండి తేరుకునే సరికే.. రాజారాం శారద జుట్టు పట్టుకుని మందిరం గేటు వరకూ ఈడ్చుకువచ్చి ఆమెని గట్టిగా ఒక్క తోపు తోస్తాడు..

దాంతో శారద గేటు అవతల నేలపై పడిపోతుంది.. శారద కళ్లల్లో విపరీతమైన దు:ఖం కనిపిస్తుంటుంది.. ఆ గేటు పక్కనే ఉన్న కొబ్బరికాయలు  అమ్మే వ్యక్తి, మిగతా దుకాణదారులు  అందరూ శారద చుట్టూ గుమిగూడతారు..

ఎంత విసురుగా రాజారాం అక్కడికి వచ్చాడో.. అంతే విసురుగా తిరిగి లోపలికి వెళతాడు.. అతను శారద ఉన్న గది లోకి వెళతాడు..

షాక్ నుండి తేరుకున్న మేనేజర్ గోపాల్, మూర్తిలు ఆలయం బయటికి వచ్చి రాజారాం చేస్తున్న పనులని చేష్టలుడిగి చూస్తూండిపోతారు.

శారద కి సంబంధించిన వస్తువులున్న ఓ బ్యాగ్‌ని తీసుకుని మళ్ళీ గేటు దగ్గరికి వస్తాడు.. రాజారాం ముఖం లో కనిపిస్తున్న కోపానికి మేనేజర్ గోపాల్, మూర్తిలు ఆందోళనగా చూస్తూంటారు తప్ప అడ్డు చెప్పలేకపోతారు..

రాజారాం తన చేతిలోని బ్యాగ్‌ని కూడా శారద పక్కన పడేస్తాడు..

''వెళ్లవే.. వెళ్ళు.. మళ్ళీ ఒక్కసారి ఈ దరిదాపుల్లో కనిపించావంటే మేమేం చేస్తామో మాకే తెలియదు..'' కోపంగా అంటాడు రాజారాం..

ఈ గుడి చైర్మన్ గారు దయగల వాడు కాబట్టి ప్రాణాలతో బ్రతికి బయటపడ్డావు.. లేదంటేనా.. నువ్వీపాటికీ ఏ పోలీస్‌స్టేషన్‌లోనో లాఠీ దెబ్బలు తింటూ ఉండేదానివి.. మళ్ళీ ఈ ఛాయలకి రాకుండా వచ్చిన దారినే వెళ్ళిపో..

రాజారాం గొంతులో క్రోధం కనిపిస్తుంటుంది.. గోపాల్, మూర్తిలు ఏమీ చేయలేని నిస్సహాయ స్థితిలో శారదని జాలిగా చూస్తూ నిలబడుతారు..

''నేటితో ఈ గుడికి పట్టిన పీడ విరగడ అయిపోయింది.. '' అరిచినట్టుగా అంటాడు రాజారాం..

రాజారాం మాటలకి  ఆ పక్కనే నిలబడి పగతో రగిలిపోతున్న సావిత్రి రెండు చేతులతో శారద వంక చూస్తూ నొక్కుతుంది కసిగా..

ఆ తర్వాత విసురుగా మందిరం లోపలికి వెళతాడు పక్కనే ఉన్న గోపాల్, మూర్తిని కనీసం పట్టించుకోనైనా పట్టించుకోకుండా..

శారద తీవ్ర మనో వేదనతో విపరీతంగా ఏడుస్తూ నేలపైనే పడుంటుంది..అసలేం జరిగిందో తెలియని ఆ చుట్టు పక్కల ఉన్న వ్యక్తులు కొందరు నేలపై పడి ఉన్న శారదనే చూస్తుంటారు ఆశ్చర్యంగా..

రోడ్డుపైన పడి ఉన్న శారదని చూస్తూ తలా ఒకరు తలా ఒకరకంగా అనుకుంటుంటారు..

శారదమ్మ ఏడుస్తూనే మెల్లిగా లేచి నిలబడుతుంది.. ఆ పక్కనే ఉన్న బ్యాగ్‌ని తీసుకుని గుండెకి హత్తుకుని ఒక వైపు గుడి వంక చూస్తుంది..

మందిరం ముందు చిరుమందహాసంతో కనిపిస్తున్న సాయిబాబా ఫోటో వైపు తదేకంగా చూస్తూ తీవ్రంగా రోదిస్తుంది శారద..

ఆ తరువాత గోపాల్ వంక మూర్తి వంక చూస్తుంది.. గోపాల్ మూర్తిలు శారదని అలాంటి స్థితిలో చూడలేనట్టుగా తల దించుకుంటారు..

శారదమ్మ తన చుట్టూ మూగి ఉన్న జనాల వంక చూస్తుంది.. తననే చూస్తూ తలా ఒక రకంగా మాట్లాడుకుంటున్న జనాన్ని చూసాక ఆమెలోని ఏడుపు ఇంకా అధికం అవుతుంది...

ఎంతో మనో వేదనతో రెండు చేతిలెత్తి సాయిబాబాకి నమస్కరిస్తూ మెల్లిగా అడుగులో అడుగు వేస్తూ అక్కడి నుండి గమ్యం లేని ప్రయాణానికి సిద్దపడిపోతుంది శారద.

..........................................

రాజారాం ఎంతో ఆనందంతో ఊహాలోకంలో విహరిస్తుంటాడు..

శారదమ్మని గుడిలోనుండి తన చేతులతో బయటికి గెంటేసినట్టుగా అతను అప్పటి వరకూ కల కంటాడు.. అదే తన్మయత్వంతో ఉన్న రాజారాం వంక చూస్తాడు గోపాల్..

''చూడు రాజారాం ఈ విషయంలో నువ్వు కాస్త కఠినంగా వ్యవహరిస్తున్నావయ్యా.. పాపం శారదమ్మ ముఖం  చూస్తూంటే ఈ దొంగతనంతో ఆవిడకి ఎలాంటి సంబంధం లేదని నాకనిపిస్తుంది...'' అంటాడు గోపాల్.

''అవును.. శారదమ్మని నేను వచ్చినప్పటి నుండి చాలా క్షుణ్ణంగా గమనిస్తున్నాను.. ఆవిడ ఎంతో భక్తి శ్రద్దలతో సాయినాధుడికి  సపర్యలు  చేయడం తప్ప ఆ  సాయినాధుడి వస్తువులనే  దొంగిలించే  వ్యక్తి కాదని  నాక్కూడా అనిపిస్తుంది...'' మూర్తి కూడా గోపాల్ మాటలతో ఏకీభవిస్తాడు.గోపాల్, మూర్తి మాటలకి రాజారాం ఉలిక్కిపడతాడు..

అతను అప్పుడే ఊహాలోకంలో నుండి బయటికి వచ్చినట్టుగా చుట్టూ పరిసరాలని చూస్తుంటాడు..

తనకి ఎదురుగా ఏడుస్తూ నిలబడి కనిపించిన శారద ని చూసి ఆశ్చర్యపోతాడు రాజారాం..

మూర్తి, గోపాల్ మాటలకి ఊహాలోకంలో తేలిపోతున్న రాజారాం అప్పుడే తేరుకుంటాడు..

''ఓహ్.. ఇదంతా తన ఊహల్లో జరిగిందా.. ఏదయితేనేం.. ఊహల్లో జరిగితేనే ఇంత ఆనందంగా ఉందంటే..

ఇంక నిజంగా జరిగితే ఇంకెంత ఆనందంగా ఉంటుందో.. ఏదేమయినా ఈ రోజు ఆ ముసలిదాన్ని తన రెండు చేతులతో ఈడ్చి బయటికి గెంటేయాల్సిందే..'' మనసులోనే అనుకుంటాడు రాజారాం.

''రాజారాం గారూ.. ఏమిటంతలా ఆలోచిస్తున్నారు.. కాస్త పరధ్యానం వదిలి వాస్తవంలోకి రండి.. '' తన మాటలకి రాజారాం నుండి ఎలాంటి స్పందన రాకపోవడంతో అంటాడు గోపాల్.

గోపాల్, మూర్తిలు రాజారాం వంకే చూస్తుంటారు.. గోపాల్ మాటలకి రాజారాం కాస్త తడుముకున్నట్టుగా భుజాలు ఎగరేసి వారి వంక నవ్వుతూ చూస్తాడు..

''ఆ.. హబ్బే.. పరధ్యానం కాదూ పాడూ కాదూ.. ఆ సాయినాదుడికి ఇంతటి అవమానం జరుగుతుంటే.. మనసులో ఎంతో బాధని అనుభవిస్తున్నాను.. అంతే.. అయినా ఈ విషయంలో మీరు ఇంకా ఏమీ నిర్ణయం తీసుకోకుంటే అస్సలు బాగోదండీ.. తొందరగా మన కమిటీ మెంబర్లతో మీటింగ్ ఏర్పాటు చేయండి..''

రాజారాం చూపు సావిత్రిపై పడుతుంది.. సావిత్రి రాజారాంనే చూస్తుంటూంది.. ఆమె కళ్ళల్లో శారదపై ద్వేషం కనిపిస్తుంటూంది..

మన కమిటీ చైర్మన్‌కి, మెంబర్లకి మూర్తిగారు కబురంపారు.. వారు వచ్చాక గానీ ఈ విషయం గురించి ఎలాంటి నిర్ణయానికి మనం రాలేము..

గోపాల్, మూర్తి ఇద్దరూ శారదమ్మకి నీళ్లు త్రాగిస్తూంటారు..

మూర్తి ముఖం లో కంగారు స్పష్టంగా కనిపిస్తుంటుంది..

మూర్తి వాయిస్..

''శారదమ్మా.. ముందు నువ్వు తేరుకో.. ఈ మాత్రం దానికే నువ్వు ఇలా అయిపోతే ఎలా.. ''శారదమ్మ కాస్త తేరుకుంటుంది.. కానీ ఆమె మనసులో ఎంతో మనో వేదన ఉన్నట్టు ఆమె ముఖం  చూస్తుంటేనే

అర్థం అవుతుంటుంది.. ఆమె కళ్ళల్లోనుండి కన్నీళ్ళు జలజలా రాలుతుంటాయి..

ఆమె పరిస్థితిని చూసిన గోపాల్ ముఖం లో ఎంతో విచారం..

ఓదార్పుగా ఆయన శారదమ్మ తలపై ఆప్యాయంగా తడుముతుంటాడు..

వారిద్దరినీ శారదమ్మ చూస్తుంది.. తన మనసులో బాధని వారిద్దరికీ చెప్పుకోవడానికి ప్రయత్నిస్తున్నట్టుగా ఆమె ముఖం లో భావాలు కదలాడుతుంటాయి..

''శారదమ్మా.. నువ్వు మరీ ఇంతగా కలత చెందడం ఏమీ బాగోలేదు.. ఎవరో ఏదో అన్నారని నువ్వింతలా బాధపడతావెందుకు.. అన్నింటికీ ఆ సాయినాధుడు తోడుంటాడు.. నువ్వు నిస్వార్థంగా ఆ సాయినాధుడి సేవలో తరిస్తున్నావు.. ఆ సాయినాధుడు తనని ఆరాధిస్తున్న వారెవ్వరికీ ఏ ఆపదా రాకుండా అనుక్షణం  కాపాడుతాడని నీకు తెలియదా ఏమిటి..?'' ఓదార్పుగా అంటాడు మూర్తి.

మూర్తి, గోపాల్ ఇద్దరూ కోపంగా రాజారాం వంక చూస్తారు.. రాజారాం ఏదో ట్రాన్స్‌లో ఉన్నట్టుగా ఈ లోకంతో సంబంధం లేనట్టుగా, తానేదో విజయాన్ని పొందినట్టుగా అతని ముఖంలో కదలాడుతున్న భావాలని గమనించి ఇద్దరూ ఎంతో ఆశ్చర్యపోతారు..

రాజారాం అక్కడ జరుగుతున్న సంఘటనతో ఏమాత్రం నిమిత్తం లేకుండా ఇంకా తన ఊహాలోకంలో విహరిస్తుంటాడు.. రాజారాం చర్యకి గోపాల్, ముర్తి ఇద్దరూ ఎంతో ఆశ్చర్యపోతారు..

ఇద్దరూ ఒకరి ముఖాలొకరు చూసుకుంటారు..

''అనవసరంగా శారదమ్మ మనసుని గాయపరచిన ఇతగాడేమిటీ.. లోకాన్ని మరిచి ఏదో ఊహల్లో తేలిపోతున్నాడు..''

గోపాల్ గొంతులో కోపం ధ్వనిస్తుంది..

''అవునండీ.. ఈ రాజారాం గారికి శారదమ్మ అంటే అస్సలు గిట్టదని నాకు ముందుగానే తెలుసు.. శారదమ్మ ఈ గుడిలో ప్రవేశించిన మొదలు శారదమ్మపై ఇతని ప్రవర్తన  అంతా వింతగానే ఉంటుంది.. ఆగర్భ శత్రువుని చూస్తున్నట్టు ఈ శారదమ్మని ఇతను చూడడం నేను గమనిస్తూనే ఉన్నాను.. ఇప్పుడు కూడా శారదమ్మ మనసుని గాయ పరచడానికే ఇలాంటి మాటలు ఉపయోగించాడు.. '' మూర్తి కూడా రాజారాంపై అసహనం వ్యక్తం చేస్తాడు.మూర్తి ముఖం లోనూ కోపం తాలుకు భావాలు.. గోపాల్, మూర్తి మాటలకి కూడా రాజారాం లో చలనం

లేకపోవడంతో  గోపాల్,  మూర్తి ఇద్దరూ  మరింత ఆశ్చర్యపోతారు..  ఇద్దరూ  మరోమారు ఒకరి ముఖాలొకరుచూసుకుంటారు..

రెండు క్షణాల తర్వాత శారదమ్మని ఆ పక్కనే ఉన్న ఒక కుర్చీలో జాగ్రత్తగా ఇద్దరూ కూర్చోబెడుతారు.. శారదమ్మ చూపులు కూడా రాజారాం పైనే ఉంటాయి.  కానీ ఆమె కళ్ళల్లోనుండి కన్నీళ్ళు జల జలా రాలుతూనే ఉంటాయి..

గోపాల్ విసురుగా రాజారాం దగ్గరికి వెళ్ళాడు.. ఏదో ట్రాన్స్‌లో ఉన్నట్టుగా ఉన్న రాజారాం వంక చిరాగ్గా చూస్తాడు గోపాల్..

''రాజారాం గారూ..''

రాజారాంలో చలనం రాదు.. ఆలయ చైర్మన్ శారదని గుళ్ళోనుండి పంపించివేయమని చెప్పడం, తాను శారదని గుడి బయటికి జుట్టు పట్టుకుని మరీ ఈడ్చుకు వెళ్ళి పడేయడం.. ఆ దృశ్యాలే ఇంకా అతని మనోఫలకంపై ఉండడంతో ఇంకా ఆ మూడ్‌లోనే ఉండిపోతాడు రాజారాం.

గోపాల్‌లో మరింత ఆశ్చర్యం.. చిరాగ్గా మూర్తి వంక చూస్తాడు.. మూర్తి, గోపాల్ ఒకరి ముఖాలొకరు చూసుకుంటారు.. ఆ చర్యకి శారద కూడా ఆశ్చర్యపోతుంది..

గోపాల్‌లో మరింత కోపం ప్రవేశిస్తుంది.. ఈసారి తన చేతితో రాజారాం భుజాన్ని తడుతూ

''రాజారాం గారూ.. '' రాజారాం భుజాలని పట్టి ఊపుతూ అంటాడు గోపాల్..

రాజారాం ఉలిక్కిపడి అప్పుడే స్పృహలోకి వచ్చిన వాడిలా గోపాల్ వంక చూస్తాడు.. తన ఎదురుగా తన వైపే కోపంగా చూస్తున్న గోపాల్‌ని చూడగానే రాజారాం ఎంతో ఆశ్చర్యపోతాడు..

ఒక్కక్షణం తానెక్కడున్నానన్న సంగతి అతనికి అర్థం కాదు.. పక్కకి తిరిగి చూస్తాడు..

ఆ పక్కనే ఓ కుర్చీలో శారదమ్మ, ఆమె పక్కనే నిలబడి ఉన్న మూర్తిని చూసి మరింత ఆశ్చర్యపోతాడు రాజారాం..

రాజారాం ముఖం లోని భావాలు మారిపోతాయి.. శారదమ్మ కుర్చీలో కూర్చోవడం చూసి.

''అదేమిటీ.. ఈ ముసలిది ఇంకా ఇక్కడే ఉన్నది.. నేనే కదా నా చేతులతో స్వయంగా మెడ పట్టుకుని మరీ గుడిబయటికి గెంటేసాను.. ''

రాజారాంలో ఒక విధమైన ఆశ్చర్యం.. ఆందోళన ప్రతిఫలిస్తుంటాయి. రాజారాం మాటలకి మూర్తి, గోపాల్ ఇద్దరూ విపరీతమైన ఆశ్చర్యానికి గురవుతారు.. కళ్ళు పెద్దవి చేసి రాజారాం వంకే చూస్తూండి పోతారు..

ఏడుస్తూ ఉన్న శారదమ్మ కూడా రాజారాం మాటలకి ఎంతో షాకైపోతూంది..

''ఏమిటీ.. మీరు.. మీరు.. ఈ శారదమ్మని గుడి బయటికి గెంటేసారా..?'' ఆశ్చర్యంగా అడుగుతాడు మూర్తి.

గోపాల్ ముఖం లో విపరీతమైన ఆశ్చర్యం.. అదే ఆశ్చర్యంతో గోపాల్ మూర్తి వంక శారద వంక చూస్తాడు.. మూర్తి, శారద ముఖం లో కూడా విపరీతమైన ఆశ్చర్యం కదలాడుతుంది..

రాజారాం ఇంకా తేరుకోలేనట్టుగా.. శారదమ్మని చూస్తూ అయోమయం లో పడిపోతాడు..

''మీరేం మాట్లాడుతున్నారో మీకు అర్థమవుతుందా.. అయినా మీకన్నా పెద్దదాన్ని పట్టుకుని అగౌవరవంగా సంబోధించడం ఏమైనా మర్యాదగా ఉందా..?'' కోపంగా అంటాడు గోపాల్.

రాజారాం ముఖం లో భావాలు మారిపోతుంటాయి.. అయోమయంగా వారి వంక చూస్తూండిపోతాడు..

''అంటే.. శారదమ్మని ఈ గుళ్ళోనుండి తరిమేయాలని మీరెప్పుడో నిర్ణయించేసుకున్నట్టున్నారు..'' అనుమానంగా అంటాడు మూర్తి.

రాజారాంకి ఏం మాట్లాడాలో అర్థం కాదు.. అతని ముఖం లో అయోమయం కనిపిస్తుంటుంది..

''అంటే.. అంటే.. ఆలయ కమిటీ మెంబర్లతో సమావేశం కావడం, ఆలయ ఛైర్మన్ ఈ ముసలిదాన్ని గుడిలోనుండి పంపించేయమని చెప్పడం.. ఆయన మాటలతో నేను ఈ ముసలిదాన్ని మెడబట్టి బయటికి గెంటేయడం.. అంతా నేను ఊహించుకున్నానా.. అంటే.. అంటే.. ఇంతవరకూ అసలు ఆలయ కమిటీ మెంబర్లతో అసలు సమావేశమే జరగలేదా..

ఓమైగాడ్.. ఎంత పని చేశాను.. ఈ ముసలిదాన్ని ఎప్పుడెప్పుడు బయటికి గెంటేయాలా అన్న కసితో, ఆ ఆలోచనతో వీరిద్దరినీ కన్విన్స్ చేసేసి, కమిటీ మెంబర్ల చేతనే దీనిని బయటికి గెంటేయాలని నేను వేసిన ప్లాన్ ఇంకా అమలు కాకుండానే.. ఊహాలోకాల్లో తేలిపోయి వీరిద్దరికీ దొరికేసానా.. ఓమై గాడ్.. ఎంత పని జరిగిపోయింది..? తనలో తానే అనుకుంటాడు రాజారాం.. ఆయన ముఖం లో రకరకాల భావాలు మెదులుతుంటాయి.. తప్పుచేసానన్న ఫీలింగ్ అతని ముఖం లో స్పష్టంగా కనిపిస్తుంటుంది..

రాజారాంనే గమనిస్తున్న గోపాల్, మూర్తిలకి సైతం అతని ప్రవర్తనపై మొదటిసారి అనుమానం కలుగుతుంది.. అతని ప్రవర్తనని వింతగా చూస్తూంటారు..

శారదమ్మ కూడా రాజారాంని ఎంతో షాకైపోయి చూస్తూండిపోతుంది.. ఆమెలో చలనం లేనంతగా షాకైపోతుంది..గోపాల్, మూర్తిలు ఒకరి ముఖాలొకరు చూసుకుంటారు.. వారిద్దరి చూపు శారదమ్మపై పడుతుంది..

తీవ్రమైన షాక్‌లో ఉన్న శారదమ్మ భుజాలపై భరోసాగా చేయి వేసి కంగారు పడవద్దన్నట్టుగా కళ్ళతోనే సైగ చేస్తాడు.. ఆ తర్వాత రాజారాం వంక చూస్తాడు మూర్తి.

‘‘రాజారాం గారూ.. మీ స్థాయి ఏమిటీ..? మీరు చేస్తున్న పని ఏమిటీ..? ఎవరూ లేని ఓ అనాధ.. ఈ గుళ్ళో ఊడిగం చేసుకుంటూ తన శేష జీవితాన్ని గడుపుతున్న ఒక మహిళపై మీకెందుకింత కక్ష.. నేను ముందు నుండీ గమనిస్తూనే ఉన్నాను.. ఈ శారదమ్మపై మీకు చాలా కోపం ఉందని మీ ప్రవర్తనని బట్టే నాకు అర్థమయింది.. అందులో భాగంగానే కొంపదీసీ...’’

మూర్తి మాటలు సగంలోనే ఆగిపోతాయి.. ఏదో అర్థమయినవాడిలా అతనిలో ఫీలింగ్.. రాజారాం కి కూడా మూర్తి మాటలోని భావం అర్థమయినట్టుగా.. తాను చేసిన తప్పుని వారు కనిపెట్టేసినట్టుగా అతనిలో కంగారు మొదవుతుంది..

మూర్తి విపరీతమైన ఆశ్చర్యంతో గోపాల్ వంక చూస్తాడు.. గోపాల్ కూడా మూర్తి వంక చూస్తాడు.. ఇద్దరిలోనూ రాజారాంపై అనుమానం కలుగుతుంది..

వారిద్దరూ తనని అనుమానిస్తున్నారన్న విషయం రాజారాంకి అర్థమవుతుంది.. అతని ముఖం లో ఏదో తెలియని అలజడి..

''అంటే.. అంటే.. సాయిబాబా కిరీటం మాయం చేసి ఆ పాపం శారదమ్మపై నెట్టేసి శారదమ్మని ఈ గుళ్ళోనుండి శాశ్వతంగా పంపించివేయాలన్న కుతంత్రం నువ్వు గానీ చేస్తున్నావా ఏమిటీ..?'' అనుమానంగా అంటాడు గోపాల్ రాజారాంనే పట్టి పట్టి చూస్తూ..

గోపాల్ మాటలకి ఎంతో ఆందోళనకి గురవుతాడు రాజారాం..

మూర్తి కూడా రాజారాంని అనుమానంగా చూస్తూంటాడు.. శారదమ్మ కొద్దిగా తేరుకుంటుంది.. రాజారాం తనపై ఇంత కుతంత్రం అల్లుతాడా  అన్న షాక్ మాత్రం ఆమెలో ఉంటుంది..

గోపాల్, మూర్తి, శారద ముగ్గురూ రాజారాం వంకే చూస్తూంటారు.. రాజారాం ముఖం లో ఆందోళన ఇంకా కనిపిస్తూనే ఉంటుంది.. అతనిలో ఏదో అపరాధం చేసానన్న ఫీలింగ్ కనిపిస్తుంటుంది..

రాజారాం గోపాల్ వంక చూస్తాడు.. తనవైపే కోపంగా చూస్తున్న గోపాల్ ముఖం లోకి చూడడానికి రాజారాం భయపడుతాడు..''చెప్పండి రాజారాం గారూ.. '' మూర్తి రాజారాంని నిలదీస్తాడు.

రాజారాం మూర్తి వంక చూస్తాడు.. మూర్తి కూడా రాజారాం వంక కోపంగా చూస్తుంటాడు.. అతని ముఖం లోకి కూడా సూటిగా చూడలేకుండా తలదించుకుని అయోమయంగా చూస్తుండి పోతాడు రాజారాం..

''హయ్యో.. ఇదేమిటీ.. సీనంతా రివర్సయిపోయిందేమిటీ..? కిరీటం మాయం చేసిన ఈ ముసలిదాన్ని గుళ్ళో నుండి తరిమేద్దామనుకున్న నా ప్లాన్ మొత్తం ఇలా తల క్రిందులయ్యిందేమిటీ..?.. '' మనసులోనే అనుకుంటాడు రాజారాం..

'నో.. ఎలాగైనా దీన్ని గుళ్ళో నుండి బయటికి పంపేయాల్సిందే.. కానీ.. ఎలా..? ఎలా..?' రాజారాం మనసులోనే తీవ్రంగా ఆలోచిస్తుంటాడు.

''అడిగేది మిమ్మల్నే రాజారాం గారూ.. మేమడిగినదానికి సమాధానం చెప్పకుండా అలా మౌనంగా ఉండిపోతే ఎలా..?'' గోపాల్ అడుగుతాడు..

గోపాల్ మాటలకి రాజారాం ఉలిక్కిపడతాడు..

''లాభంలేదు.. నేను ఇలాగే వీరి మాటలకి భయపడిపోతే వీరి ముందు నేనే దొంగనయిపోతాను.. అలా జరగడానికి వీలేదు.. ఇలాంటి పరిస్థితిలోనే ధైర్యంగా మాట్లాడాలి.. ఎక్కువగా కంగారుని ముఖం లో కనిపించనీయకూడదు ..

ఇంక లాభం లేదు.. నేను ఎదురు తిరగాల్సిందే.. కానీ.. ఎలా.. ఎలా..?'' అతని మనసు వేగంగా ఆలోచిస్తుంటుంది...

వీరికి తనపై వచ్చిన అనుమానాన్ని నివృత్తి చేయడానికి తాను ఏదో ఒకటి చేయాలి.. ఏం చేయాలి..? మనసులోనే ఆలోచన చేస్తుంటాడు..

ఏం చెప్పాలో అర్థం కాకుండా అయోమయంలో పడిపోయిన రాజారాం చూపు శారదమ్మపై పడుతుంది..

తనవంకే ఆశ్చర్యంగా శారద చూస్తుంటూంది..

శారదని చూడగానే అతనిలో ఏదో తెలియని కసి ప్రవేశిస్తుంది.. అప్పటి వరకూ ఎంతో ఆందోళనగా, అయోమయంగా ఉన్న అతని ముఖం లోని భావాలు క్రమంగా

మారిపోతుంటాయి.. శారదని ఎలాగయినా గుడిలోనుండి తరిమేయాలన్న కసి అతని కళ్ళల్లో కనిపిస్తుంటుంది... రాజారాంలో ఎక్కడా లేని ధైర్యం వచ్చేస్తుంది..

''ఏమిటండీ అలా దబాయిస్తున్నారు.. నేనేమిటీ.. ఈవిడపై కసి పెంచుకోవడమేమిటీ..? అసలు మతి  ఉండే మాట్లాడుతున్నారా మీరు.. ఆఫ్ట్రాల్ గుళ్ళో పాచిపని చేసే ఓ ముసలిదానిపై నాకు శత్రుత్వమేమిటి.. నాన్సెన్స్ ..''

రాజారాం వారిపై ఎదురు తిరిగేలా మనసులోనే వ్యూహ రచన చేసుకుంటాడు అప్పటికప్పుడు.

దాంతో రాజారాం వాయిస్‌లో ఒక్కసారిగా కాన్ఫిడెన్స్ లెవల్ పెరిగిపోతుంది.. అప్పటి కప్పుడు రాజారాం ముఖంలో మారిన భావాలని గమనించిన గోపాల్, మూర్తి, శారద ముగ్గురూ షాకైపోతారు..

రాజారాం వారి ముగ్గురి వంకా తీక్షణంగా చూస్తుంటాడు..

''అసలు తప్పంతా మీరు చేసి నెపం నాపైన వేయాలనుకుంటున్నారా..?'' కోపంగా అంటాడు..

రాజారాం మాటలకి గోపాల్, మూర్తి, శారద ముగ్గురూ  ఒకరి ముఖాలొకరు చూసుకుంటారు...

''ఏమిటీ..? తప్పు మేము చేశామా..?'' ఆశ్చర్యంగా అంటాడు..

''అవును.. మీరే చేసారు.. దిక్కూ మొక్కూ లేని ఓ ఆడదానిని మీరిద్దరూ ఇలా వెనకేసుకు రావడమే మీరు చేసే తప్పు..!'' రాజారాం ముఖం లో శారదపై కోపం కనిపిస్తుంది..

''రాజారాం...'' గోపాల్ కళ్ళు కోపంతో నిండిపోతాయి.. మూర్తి కూడా ఎంతో కోపంగా రాజారాంని చూస్తూంటాడు.. శారదమ్మ ఎంతో షాకైపోతుంది..

రాజారాం ఆ ముగ్గురి వంకా కోపంగా చూస్తూండి పోతాడు..

‘‘మీరలా గొంతు చించుకుని అరిచినంత మాత్రాన పోయిన కిరీటం తిరిగి రాదు.. పవిత్రమైన ఈ సాయినాధుడి ఆలయంలో బంగారు కిరీటం మాయం కావడమే ఒక అపచారమైతే ఒక ఆడదాని కోసం మీరిద్దరూ ఇలా ప్రాకులాడుతుండడం మరొక అపచారం అవుతుంది..’’ రాజారాం వాయిస్ పెంచుతాడు.

‘‘రాజారాం.. అసలు.. అసలు.. నువ్వు మనిషివేనా..? వాయి వరుసలే కాదు, వయసుని కూడా లెక్కచేయకుండా ఇలాంటి మాట్లాలు మాట్లాడటానికి నీకు మనసెలా వచ్చింది..?’’ కోపంగా అంటాడు.

గోపాల్ గట్టిగా కళ్ళు మూసుకుంటాడు.. అతని ముఖంలో ఎంతో ఆందోళన..

వినకూడని మాట విన్నట్టుగా గట్టిగా చెవులు మూసుకుని..

‘‘హే.. సాయిరాం.. ’’ అని అంటాడు.. ఆ సాయినాధుడిని మనసులోనే స్మరించుకుంటూ..

మూర్తి ఆందోళనగా గోపాల్ వంక చూస్తాడు.. శారదమ్మ కళ్ళల్లో కన్నీళ్ళు సుడులు తిరుగుతుంటాయి.. ఆమె ఏదో ట్రాన్స్‌లో ఉన్నదానిలా అలాగే కొయ్యలా నిలబడిపోయి ఉంటుంది..

‘‘అవును.. నువ్వు అర్చిస్తున్న ఆ సాయిరాం కి అన్యాయం జరిగితే ఇక్కడ ఊరుకునేవారెవరూ లేరు.. ఆ కిరీటం దొంగ గురించి ఆరాతీయండని, అనుమానితురాలిపై చర్య తీసుకోండని కోరడానికి వచ్చిన నన్ను మీరు ఇన్నేసి మాటలంటారా..? ఈ ముసలిదానిపై ప్రేమ పెంచేసుకుని ఆ దేవునికి ద్రోహం చేయడానికి చూస్తారా.. ఈ విషయం ఇక్కడ కాదు.. ఈ ఆలయ కమిటీ మెంబర్లముందు, ఆలయ కమిటీ ముందే తేల్చుకోవాలి.. అంతే..’’

రాజారాం విసురుగా ఆ గదిలోనుండి బయటికి వెళ్లిపోతాడు..

...............................................

రాజారాం బయటికి వెళ్ళగానే మూర్తి విసురుగా గోపాల్ వంక చూస్తాడు..

''చూసారా గోపాల్ గారూ.. ఆ రాజారాం ఈవిడపై ఎంతటి కక్ష కట్టాడో అతని మాటల్లోనే అర్థమవుతుంది కదా.. అయినా.. అయినా.. మనల్ని కూడా ఎంతలేసి మాటలన్నాడు.. పవిత్రమైన ఈ సాయిమందిరంలో ఇలాంటి మాటలు వినాల్సి వస్తుందని, ఇలాంటి సంఘటనలో నేనూ ఉండాల్సి వస్తుందని నా జీవితంలో అనుకోలేదు నేను..''

మూర్తి కళ్ళల్లో కూడా సన్నటి కన్నీటి పొర.. మూర్తి గోపాల్ అప్పుడే తేరుకున్నట్టుగా మూర్తి వంక చూస్తాడు..

''హు.. నేను కూడా ఇలాంటి సంఘటనని ఎదుర్కుంటానని ఏనాడూ అనుకోలేదు.. పాపం మితిమీరితే ఇలాంటి సంఘటనలే ఆవిష్కృతమవుతాయని ఏనాడో పెద్దలు చెప్పారు.. అన్నెం పున్నె ఎరుగని ఓ వృద్ధురాలిపై ఇంతలేసి నిందలు వేయడం ఎంత వరకు సమంజసం..?''

గోపాల్ గొంతు గద్గదమవుతుంది.. మూర్తి, గోపాల్ ఇద్దరూ జాలిగా శారద వంక చూస్తారు...

''ఈ శారదమ్మపై రాజారాంకి మొదటి నుండీ కడుపు మంటే.. ఎలాగైనా శారదమ్మని గుళ్ళో నుండి తరిమేయడానికి ఇతను పాటు పడుతున్నాడని నాకనిపిస్తుంది.. అతన్ని వదలకూడదు.. '' కసిగా అంటాడు మూర్తి.

''కుళ్ళు, కుతంత్రాలకు అతీతమైన ఈ ఆలయంలో ఇతనికి ఇలాంటి బుద్ధి కలిగిందంటే దానికి ఎవరు మాత్రం ఏం చేస్తారు..?'' బాధగా అంటాడు గోపాల్.

''అసలు అతనికి బుద్ధి అనేది ఉంటేనా..? వృద్ధురాలని చూడకుండా ఈవిడని, మనల్ని కలిపి నిందిస్తాడా..?

రాజారాంపై ఉన్న కోపంతో మూర్తి కళ్ళు ఎర్రబడతాయి.

అప్పటి వరకూ ఏడుస్తూ షాక్‌లో ఉన్న శారదమ్మ తేరుకుంటుంది.. ఏదో నిర్ణయానికి వచ్చిన దానిలా ఆమె ముఖం లో భావాలు మారిపోతాయి.. .

అకస్మాత్తుగా ఆవిడలో వచ్చిన మార్పుకి గోపాల్, మూర్తి ఇద్దరూ ఆశ్చర్యపోతారు.. ఇద్దరూ ఒకరి ముఖాలొకరు చూసుకుంటారు..

శారద తన చీరకొంగుతో కన్నీళ్ళని తుడుచుకుని మెల్లిగా కుర్చీలోనుండి లేస్తుంది.. వారి వంక చూడకుండా ఆ గది బయటికి అడుగు వేయబోతుంది..

''శారదమ్మా.. ఎక్కడికి వెళుతున్నావు..?'' గోపాల్ మాటలకి ఆగిపోతుంది శారద.. మెల్లిగా తల తిప్పి గోపాల్ వంక చూస్తుంది..

గోపాల్, మూర్తి ఇద్దరూ శారదమ్మనే చూస్తూంటారు ఆశ్చర్యంగా..

శారదమ్మ కళ్ళల్లో కన్నీళ్ళు సుడులు తిరుగుతుంటాయి.. ఉబికి వస్తున్న దు:ఖాన్ని ఎంతో కష్టం మీద ఆపుకుంటున్నట్టుగా ఆమె ముఖం లోని భావాలు  కదలాడుతుంటాయి..

గోపాల్, మూర్తి ఇద్దరూ ఆమె వైపు జాలిగా చూస్తూంటారు..

''నేను.. నేను ఒక్క క్షణం కూడా ఇక్కడ ఉండలేను.. దయ చేసి నన్ను ఇక్కడి నుండి వెళ్ళిపోనివ్వండి.. ఎవరూ లేని అభాగ్యురాలిని, ఏదో ఈ సాయినాధుడి సన్నిధిలో చోటు దక్కిందని ఎందో ఆనందంతో పొంగిపోయాను.. నా జీవితం చివరాంకంలో ఆ సాయిాశ్వరుడి సేవ చేస్తూ తరించడానికి ఆ భగవంతుడే నన్నిక్కడికి రప్పించాడని ఎంతో సంతోషించాను.. కానీ.. కానీ..'' ఆమె నోట్లో నుండి మాటలు రావడానికి చాలా శ్రమపడుతుంది..

ఆమె ఏడుపు ఆపుకోలేకపోతూంది.. దు:ఖం ఆమె మాటకి అడ్డు పడడంతో చీర కొంగుని నోటికి అడ్డుపెట్టుకుని  రోదిస్తుంటుంది...

మూర్తి, గోపాల్ వారిద్దరి ముఖాల్లోనూ ఆమెపై జాలి కనిపిస్తుంటుంది...

''మంచి వాళ్లకి అంతా మంచే జరుగుతుంది శారదమ్మా.. అనవసరంగా నువ్వు కంగారు పడకు.. వెళ్ళు.. వెళ్ళి నీ గదిలో కాస్త విశ్రాంతి తీసుకో..'' అనునయంగా అంటాడు మూర్తి..

''విశ్రాంతి.. ఈ జీవితానికి విశ్రాంతి అన్నది దొరకడం ఈ జన్మలో జరిగే పని కాదని తేలిపోయింది.. నా అనుకున్న వాళ్లందరితోనూ మోస పోయిన దానిని, నేను చేయని ఎన్నో తప్పులకి శిక్షని అనుభవించిన దానిని..

ఇలాంటి కష్టాలు  నాకు కొత్తేం  కాదు.. కానీ.. కానీ..''  ఆమె మళ్ళీ  ఏడుస్తుంది.. ఆమె కళ్ళల్లోనుండి కన్నీళ్ళు కారుతూనే ఉంటాయి..

''శారదమ్మా.. మనిషి కష్టాలలో ఉన్నప్పుడే ఆ దేవుడు దగ్గరుండి మనల్ని ముందుకు నడిపిస్తుంటాడు.. నీవు ఏ తప్పు చేయలేదని మా ఇద్దరికీ తెలుసు.. కానీ.. నింద నీమీద పడింది.. అయినా నింద పడినంత మాత్రానా నిజం అబద్ధమైపోదు కదా.. అన్నింటికీ ఆ సాయినాధుడే ఉన్నాడని మనసుని నిబ్బరం చేసుకోవాలి కానీ ఇలా నీలో నువ్వే కుమిలిపోతూ.. నీ కష్టాలకి చింతిస్తే ఏం లాభం చెప్పు..'' ఓదార్పుగా అంటాడు గోపాల్..

''నేను బాధ పడుతుంది నాకోసం కాదు.. నాకేమయినా అడిగే వాళ్ళెవరూ లేని అనామకురాలిని నేను.. కానీ.. నా మూలంగా మీ ఇద్దరికీ ఇంత చెడ్డ పేరు రావడం నేను భరించలేకపోతున్నాను.. అనాధనయిన నన్ను ఆదరించిన మీకు నేనిచ్చే బహుమానం అపనిందలే కదా.. అదే నా బాధ..'' గోపాల్, మూర్తి ఇద్దరూ ఒకరి ముఖాలొకరు చూసుకుంటారు.. వారి కళ్ళల్లో కూడా సన్నటి కన్నీటి పొర కనిపిస్తూంటూంది..

'హయ్యో.. శారదమ్మా.. మనస్సులో ఏ కల్మషం  లేకుండా ఆ సాయిసేవకే అంకితమై పోయిన వాళ్ళం మేము.. అలాగే నువ్వు కూడా సాయి సేవలో తరించిపోతున్న దానివి.. మీరు నాపై నమ్మకముంచండి.. నేను మిమ్మలందరిని రక్షిస్తాను అని చెప్పిన వాడు ఆ సాయినాధుడు.. అలాంటిది నీ వల్ల  మేమేదో నిందలు పడ్డామని, నీ వల్ల  మేమేదో నష్టపోతున్నామని నువ్వెలా అనుకుంటావు..'' అనునయిస్తాడు మూర్తి.

''అవును శారదమ్మా.. మనం మనస్ఫూర్తిగా నమ్ముకునే ఆ సాయినాధుడు మనకి తోడుండగా.. ఎందుకు ఇంతలా బాధ పడడం, నీ వల్ల మాకొచ్చిన కీడేమీ లేదు.. ఏమీ ఆలోచించకుండా వెళ్ళి నీ గదిలో విశ్రాంతి తీసుకో.. జరగాల్సిందేదో జరగక మానదు..''

''లేదు మేనేజర్ గారూ.. నా జాతకమే అంత.. నేనేవరినైనా అభిమానిస్తే వారికి ఏదో విధంగా కీడు జరగడం ఇప్పుడేం కొత్త కాదు, ఈ అనుభవాలు నా జీవితంలో ఎన్నో ఉన్నాయి.. అయినా ఆ బ్రహ్మదేవుడు నాకు రాసి పెట్టిన రాతని ఈ సాయిదేవుడు ఎలా మారుస్తాడు.. మనిషి జీవితం కర్మ ఆధారంగానే ఉంటుంది కదా.. ఏ జన్మలో ఏ పాపం చేసుకున్నానో.. ఈ జన్మలో నా అనుకునే వారిని పోగొట్టుకుని, నన్ను అభిమానించే వారి ఆదరణని కూడా పొందకుండా చేస్తున్నాడు ఆ దేవుడు...''

శారదమ్మ ఏడుస్తూనే ఉంటుంది.. మూర్తి, గోపాల్ ఇద్దరూ ఆమె వంక జాలిగా చూసి చిన్నగా నిట్టూరుస్తారు..

''అయినా శారదమ్మా.. నువ్విప్పుడు ఇలా ఉన్నఫళంగా వెళ్ళిపోతే నీమీద పడ్డ నింద నిజమయిపోతుంది కదా..?

ఆ కిరీటం దొంగతనంలో నీ పాత్ర కూడా ఉందని అందరూ అనుకుంటారు కదా.. అలా అనుకుంటే.. నిన్ను అభిమానిస్తున్న మా ఇద్దరికీ ఆ దొంగతనంలో పాత్ర ఉందని అందరూ అనుమానించినట్టే కదా..? ఒక్కసారి ఆలోచించు.. నీ వల్ల మేమేదో అపవాదు మూటగట్టుకున్నామని ఇప్పుడు నువ్వు ఈ గుడి విడిచి వెళ్ళిపోతే ఆ తర్వాత జీవితాంతం మేము అతిపెద్ద అపవాదుని మూట గట్టుకోవాల్సి వస్తుంది..'' మూర్తి మాటలకి శారద ఒక్కసారిగా తలెత్తి ఇద్దరి వంక చూస్తుంది.. ఆమె కళ్ళల్లో ఏదో తెలియని ఆందోళన కనిపిస్తుంది..

మూర్తి, గోపాల్ ఇద్దరూ శారద వంక చూస్తారు..గోపాల్ శారద దగ్గరికి వస్తాడు..

''శారదమ్మా.. ఎదురయిన ప్రతి సవాల్ కీ భయపడి పారిపోతే.. జీవితాంతం మనం భయపడి పారిపోతూనే ఉండాలి తప్ప దానికి పరిష్కారం అంటూ ఉండదు.. నువ్వు ఏ తప్పు చేయలేనప్పుడు నువ్వెందుకు వెళ్ళిపోవడం, నీ వల్ల మాకేదో జరుగుతుందని మేమెందుకు భయపడటం.. కాబట్టి ధైర్యాన్ని తెచ్చుకో.. మనసు నిదానం చేసుకుని నీ గదిలోకి వెళ్ళి విశ్రాంతి తీసుకో.. జరగాల్సిందేదో ఆ సాయినాధుడికే తెలుసు..'' శారదమ్మకి ధైర్యం చెబుతాడు మూర్తి.

శారదమ్మ ముఖం లో అదే ఆందోళన కనిపిస్తుంది..

''ఇంకేమీ ఆలోచించకు శారదమ్మా.. వెళ్ళు..''

శారద ఓ సారి ఇద్దరి వంకా చూస్తుంది.. గోపాల్, మూర్తిలు కూడా శారద వంకే ఓదార్పుతున్నట్లుగా చూస్తూంటారు. శారద కన్నీళ్ళని తుడుచుకుని ఆ గదిలోనుండి మెల్లిగా బయటికి నడుస్తుంది.. ఆమె కనుమరుగయిపోయేంత వరకూ ఆమె వంకే చూస్తూ నిలబడిన మూర్తి, గోపాల్ ఇద్దరూ ఒకరి ముఖాలొకరు చూసుకుంటారు..

ఇద్దరి ముఖాల్లోనూ ఎంతో విచారం కనిపిస్తుంది...

............................................

శారదమ్మ ఎంతో ఆవేదనతో, నీరసంగా లోపలికి వస్తూ కనిపిస్తుంది..

ఆమెలో చాలా నీరసం కనిపిస్తుంది.. ఆమె ఎంతో బాధపడుతుందని ఆమె ముఖం లోని భావాలు తెలుపుతుంటాయి. నిలబడ లేనట్టుగా ఆసరా కోసం గోడని పట్టుకుంటుంది.. అలాగే తలని గోడకి ఆనించి ఏడవడం ప్రారంభిస్తుంది..

ఒక ఇరవై క్షణాల వరకూ అలాగే ఏడుస్తూ, ఆ తర్వాత మెల్లిగా ఆ గోడకి కొద్ది దూరంలో ఆనుకుని ఉన్న సాయిబాబా ఫోటో దగ్గరికి వస్తుంది.. ఆ ఫోటో వంకే చూస్తూ విలపిస్తుంది..

సాయిబాబా ఫోటో చూస్తూ..

''సాయిరాం.. జీవితంలో నిలువనీడ లేకుండా అయిపోయిన నాకు అండగా నీవున్నావనుకున్నానే, ఆరిపోతున్న ఈ జీవితానికి ఆధారం నువ్వయి నిలిచావని ఆనందించానే.. కానీ.. ఆ ఆనందాన్ని ఆరంభంలోనే అంతం చేసి ఆనందిస్తున్నావా తండ్రీ..

నేను నీకు ఏం ద్రోహం చేసాను తండ్రీ.. నా కష్టాని మరిచిపోయి, కన్నీళ్ళని దిగమింగుకుని, నీ సేవలో తరించిపోతున్నానే అదే నేను చేసిన తప్పా.. నీకు సేవ చేసే భాగ్యం లభించినందుకు ఎంతో ఉప్పొంగిపుతున్నానే.. అదే నేను చేసిన ద్రోహమా..? నా అనుకున్న వాళ్లు ఎందరో నాకు ద్రోహం చేసారు..? నాపై ఎన్నో నిందలు మోపారు.. అయినా అన్నింటినీ భరించాను.. కానీ.. కానీ.. నీ సన్నిదానంలో సేద తీరుతున్న నేను నీ కిరీటాన్ని దొంగిలించానన్న అపవాదుని మోపి, నీ నుండి కూడా నన్ను దూరం చేస్తున్నావా తండ్రీ..''

దు:ఖంతో ఆమె నోట్లో నుండి మాటలు బయటికి రావు, అలాగే ఆ ఫోటో దగ్గర ఒరిగిపోతుంది.. ఆమెలో ఉన్న ఆవేదనంతా కన్నీటి రూపంలో బయటికి వస్తుంది..

ఆమె కళ్ళల్లో నుండి జారుతున్న కన్నీళ్ళు ఆ సాయినాధుడి పాదాలని తడుపుతుంటాయి...

ఆ సాయినాధుడి కాళ్ళని శారద తన కన్నీళ్ళతో అభిషేకం చేస్తున్నట్టుగా ఉంటుంది ఆ దృశ్యం..

..................................

మేనేజర్ గోపాల్ ముఖం లో విచారం తో పాటు కోపం ప్రతిఫలిస్తుంటుంది.

గోపాల్ కి కొద్ది దూరం లో మూర్తి అటూ ఇటూ పచార్లు చేస్తుంటాడు. అతని ముఖం కూడా ఎంతో గంభీరంగా వుంటుంది.. రెండు చేతులని వెనక్కి పెట్టుకుని తిరుగుతుంటాడు..

కొద్ది క్షణాల తరువాత తిరగడం ఆపి గోపాల్ వంక చూస్తాడు మూర్తి..

''ఈ రాజారాం ఇంతకి తెగిస్తాడని అనుకోలేదు.. అసలు అతనికి శారదమ్మ మీద ఎందుకంత కోపం..? ఆమెపైన పగ పెంచుకుని ఎలాగైనా ఆమెని ఈ గుడి లోనుండి తరిమేయాలని కక్ష

కట్టాడు.. ఆమెని అభిమానిస్తున్న మనపై కూడా ఇన్ని నిందలు వేస్తున్నాడంటే.. దీని వల్ల అతనికి ఏమి లాభం ఒనగూడు తుందో అర్ధం కావటం లేదు..''

గోపాల్ దీర్ఘంగా నిట్టూర్పు విడుస్తాడు..

''మూర్తి గారూ.. ఇప్పుడు మనం ఆలోచించాల్సింది.. ఆ విషయం గురించి కాదు. అసలు గుడిలో నుండి కిరీటం ఎలా మాయం అయ్యింది.. ఆ కిరీటాన్ని ఎవరు ఎత్తుకెళ్ళారు అన్న విషయం ఆలోచించాలి..''

మూర్తి కూడా దీర్ఘంగా నిట్టూర్పు విడుస్తాడు.. మళ్ళీ అటూ ఇటూ పచార్లు చేయడం ప్రారంభిస్తాడు..

ఇద్దరిలోనూ అదే ఆలోచన.. ఇద్దరికీ రాజారాం అన్న మాటలు చెవుల్లో మారు మ్రోగుతుంటాయి

''మీరలా గొంతు చించుకుని అరిచినంత మాత్రాన పోయిన కిరీటం తిరిగి రాదు.. పవిత్రమైన ఈ సాయినాధుడి ఆలయంలో బంగారు కిరీటం మాయం కావడమే ఒక అపచారమైతే ఒక ఆడదాని కోసం మీరిద్దరూ ఇలా ప్రాకులాడటం మరొక అపచారం అవుతుంది..'' రాజారాం అన్న ఆ మాటలు గోపాల్ మనసుని తీవ్రంగా గాయపరిచాయని ఆయన ముఖ కవళికలే తెలుపుతున్నాయి.

పచార్లు చేస్తున్న మూర్తి సడన్ గా ఆగిపోతాడు.. మూర్తి ముఖం  లో ఏదో కనుగొన్నానన్న ఫీలింగ్.. మూర్తి ముఖం  లో సడన్ గా మారిపోయిన భావాలని గమనిస్తాడు గోపాల్..

గోపాల్ ముఖం  లో ఆశ్చర్యం..

''గోపాల్ గారు ఇందాక మనం ఆ రాజారాం తో కిరీటం గురించి ప్రస్తావించి నప్పుడు అతని ముఖంలో ఏదో తప్పు చేసానన్న భావనని నేను స్పష్టంగా కనుగొన్నాను.. అంతేకాదు కిరీటం గురించి అడిగిన ప్రశ్నలన్నింటికీ అతను జవాబు చెప్పడానికి తడుముకోవడం కూడా

చేసాడు.. అంటే.. ఆ కిరీటం మాయం కావడంలో ఖచ్చితంగా ఈ రాజారాం హస్తం ఉందేమో అన్న అనుమానం నాకు కలుగుతుంది..''

గోపాల్ ఆ సన్నివేశాన్ని గుర్తుకు తెచ్చుకుంటాడు..

''అవును నిజమే.. మనం కిరీటం గురించి రాజారాం ని అడిగినప్పుడు అతని ముఖంలో కలిగిన భావాలు నాకు గుర్తుకు వస్తున్నాయి.. అతను మనమడిగిన ప్రశ్నలకి సమాధానం చెప్పడానికి చాలా భయపడ్డాడు..''

''దీన్ని బట్టి చూస్తే ఆ కిరీటం మాయం వెనుక ఈ రాజారాం హస్తం ఉందేమో అని నాకు అనుమానంగా వుంది.. '' అంటాడు మూర్తి.

''నాక్కూడా అదే అనుమానం కలుగుతుంది మూర్తి గారు.. ఈ పదేళ్ళ కాలంలో గుడిలో నుంచి ఏ ఒక్క వస్తువు కూడా దొంగిలించ బడలేదు.. అటువంటిది ఏకంగా బంగారు విగ్రహమే దొంగిలించ బడినది అంటే దీని వెనుక ఈ ఆలయ కమిటీ మెంబర్ల ప్రమేయం లేకుండా ఎలా సాధ్యపడుతుంది..? పైగా కిరీటం భద్రపరచపడే గది నుండి,

నేనూ ఆ రాజారాం తప్ప ఇంతవరకు మన కమిటీ మెంబర్లు ఎవరూ కూడా రాలేదు కదా.. అంతె కాకుండా ఆ రాజారాం ప్రవర్తన చూస్తుంటే ఖచ్చితంగా కిరీటం మాయం వెనుక అతని ప్రమేయం వున్నదని నాకనిపిస్తుంది..''

''మీరన్నది నిజమే గోపాల్ గారు.. ఆరోజు నేను గదిలో నుండి వస్తువులని తీసుకుంటున్నప్పుడు నాతో పాటు గదిలోకి శారదమ్మ ని కూడా రమ్మన్నాను.. కానీ శారదమ్మ నాతో  రావడానికి సందేహించింది.. నేనే మరేం పర్వాలేదు రమ్మని బలవంత పెడితేనే ఆమె ఆ గదిలోకి వచ్చింది.. సరిగ్గా అప్పుడే రాజారాం కూడా అక్కడికి వచ్చాడు.. శారదమ్మ ఆ గదిలో వుండడం చూసి ఆమెని తీవ్రంగా మందలించాడు కూడా..'' మూర్తి గతాన్ని గుర్తుకు తెచ్చుకుంటున్నట్టు అతని ముఖం  లో భావాలు కదలాడుతుంటాయి..

''ఏమిటీ మీరు కిరీటం తీసుకెళ్ళిన రోజు రాజారాం కూడా ఆ గది దగ్గరికి వచ్చాడా.. ? నా అనుమానం నిజమయ్యింది.. అయితే ఖచ్చితంగా కిరీటం మాయం చేయడం లో అతని హస్తం వుండి వుంటుంది..'' గోపాల్ ముఖం లో ఆనందం ప్రవేశిస్తుంది..

''వుండి వుంటుంది కాదు.. ఖచ్చితంగా అతనే కిరీటం మాయం చేసాడు.. ఎందుకంటే తాను గదికి తాళం వేసి తాళం చెవిని మీకు ఇమ్మని శారదమ్మ కి ఇచ్చే సమయం లో కూడా అతను అక్కడే వున్నాడు.. శారదమ్మ ఆ తాళంచెవిని ఒక చోట పెట్టి తన పని తాను చేసుకుంటున్న సమయం లో మెల్లిగా ఆ తాళం చెవిని దొంగిలించి కిరీటాన్ని కాజేసి, ఏమి తెలియనట్టు తిరిగి ఆ తాళం చెవిని తీసిన చోట పెట్టేసి మెల్లిగా జారుకున్నాడు..'' మూర్తి తీగతో డొంకని లాగే ప్రయత్నం చేయడం ప్రారంభించడం మొదలు పెట్టాడు.

మూర్తి కళ్ళల్లో ఆనందం..

''ఎంత మోసం.. కిరీటాన్ని తెలివిగా కాజేసి ఆ దొంగతనాన్ని శారదమ్మ పై నెట్టేసి ఆమెని ఈ గుళ్ళో నుండి తరిమేయాలని పగడ్బంధీగా పథకం రచించాడు.. అమాయకురాలయిన శారదమ్మ ని దొంగగా మార్చడానికి ఇంతకి దిగజారుతాడా ఛీ..'' రాజారాంపై అసహ్యం కలిగింది గోపాల్‌కి..

''దీనికంతటికీ కారణం ఈర్ష్య గోపాల్ గారు.. శారదమ్మ ఈ గుళ్ళోకి మామూలు పాచి పనులు చేసే దానిలా వచ్చేసి పిల్లలకి ఆధ్యాత్మిక పాఠాలు చెప్పేంతగా ఎదగడం తో ఆమె ఎదుగుదలని భరించలేని రాజారాం ఆమెని ఎలాగైనా గుళ్ళో నుండి బయటికి పంపించి వేయడానికి కిరీటం మాయం చేసి వేసిన పన్నాగం ఇది..'' అన్నాడు మూర్తి.

''ఛీ.. ఈ పవిత్రమైన ఈ ఆలయం లో ఎంతటి దుర్మార్గానికి ఒడిగట్టాడు..'' కోపంగా అంటాడు గోపాల్..

మూర్తి ముఖంలో చిరునవ్వు ప్రవేశిస్తుంది..

''ఆ సాయినాథుడు అంతా గమనిస్తూనే వున్నాడు గోపాల్ గారు.. ఎవరు త్రవ్విన గొయ్యిలో వాళ్ళే పడతారన్నట్టుగా ..

కిరీటం కాజేసి ఆమెని ఇరికించాలని తెలివిగా ప్లాన్ వేసినా మన ముందు అడ్డంగా దొరికిపోయాడు.. ఇక ఆ రాజారామే ఆ కిరీటం దొంగిలించాడని మనం తెల్చేయడమే ఆలస్యం..''

''అవును.. ఈ విషయం లో పాపం శారదమ్మ ఎంతో కలత చెందారు.. ముందు మనం ఆమెని ఒదార్చాలి.. కిరీటం దొంగతనం విషయం లో ఆమె కి ఎలాంటి సంబంధం లేదని తెలిస్తే.. ఆవిడ ఎంతో సంతోషిస్తుంది..''

''అవును గోపాల్ గారు.. పదండి.. శారదమ్మ కి ఈ విషయం తెలుపుదాం..'' ఉత్సాహంగా అంటాడు మూర్తి..

మూర్తి అనగానే గోపాల్‌తో కలిసి శారదమ్మ ఉండే గదికి బయలుదేరుతారు ఇద్దరూ..

.................................

శారదమ్మ గది దగ్గరికి గోపాల్, మూర్తి ఇద్దరూ వస్తారు.. వారి ముఖాల్లో ఎంతో ఆనందం కనిపిస్తుంటుంది.. ఆగది తలుపులు ఓరగా వేసి వుంటాయి..

'' శారదమ్మా.. శారదమ్మా.. '' మూర్తి పిలుస్తాడు.. మూర్తి పిలుపుకి లోపలి నుండి ఎలాంటి స్పందన రాదు.

గోపాల్, మూర్తి చూపులు ఆ గది వంకే వుంటాయి.. ఆ గది తలుపులు తెరుచుకుంటాయని ఒక పది సెకండ్లు వేచి చూస్తారు..

అయినప్పటికీ గది తలుపు తెరుచుకోక పోవడం తో ఇద్దరూ ఒకరి మొహాలకరు చూసుకుంటారు..

''శారదమ్మా.. శారదమ్మా.. ''

అయినప్పటికీ తలుపులు తెరుచుకోవు.. ఇద్దరి ముఖాల్లోనూ ఆశర్యం కనిపిస్తుంది.. మళ్ళీ ఒకరి ముఖాలొకరు చూసుకుంటారు..

మళ్ళీ ఒక పది సెకండ్లు ఎదురు చూస్తారు.. అయినప్పటికీ తలుపులు తెరుచుకోక పోవడం తో మూర్తి మెల్లిగా తలుపు పై చేయి వేసి కాస్త కదుపుతాడు.. లోపలి నుండి గడియ పెట్టక పోవడం తో తలుపులు తెరుచుకుంటాయి..

తెరుచుకున్న తలుపుల్ని చూసి గోపాల్, మూర్తి ఇద్దరూ ఎంతో ఆశ్చర్య పోతారు..

మూర్తి ఆ గది లోపలికి కొద్దిగా తొంగి చూస్తాడు

''శారదమ్మా.. !''

గదిలోపల ఎవరూ కనిపించరు..

మూర్తి ఆశ్చర్యంగా గోపాల్ వంక చూస్తాడు.. గోపాల్ మూర్తి వంక ఆత్రుతగా చూస్తాడు..

మూర్తి వాయిస్..

''శారదమ్మ గదిలో లేనట్టుంది గోపాల్ గారు..''

''గదిలో లేదా..?'' గోపాల్ నొసలు ముడి పడుతాయి..

ఇద్దరూ గదిలోకి నడుస్తారు.. ఆ గదిని పరిశీలనగా చూస్తారు..

కొన్ని వంట సామాన్లు కనిపిస్తాయి.. కానీ శారద కి సంబందించిన ఏ ఒక్క వస్తువూ కనిపించదు.. కానీ ఆ గదిలో వున్న ఒక కిటికీ లో ఒక చిన్న కాగితం కనిపిస్తుంది..

ఆ కాగితాన్ని చూసి ఇద్దరూ ఆశ్చర్య పోతారు..

మూర్తి అక్కడికి వెళ్లి ఆ కాగితాన్ని తెరిచి చూస్తాడు..

ఆ కాగితంలోని విషయం చదివిన మూర్తి ముఖంలో భావాలు మారిపోతాయి.. అతని కళ్ళు పెద్దవయిపోతాయి..

నోరు తెరిచి కొయ్యబారి నట్టుగా నిలబడి పోతాడు..

మూర్తి లో కలిగిన ఆ భావాలకి గోపాల్ ఆశ్చర్య పోతాడు..

''ఏమయింది మూర్తి గారు.. అలా కొయ్యబారి పోయారు..?'' ఆశ్చర్యంగా అంటాడు గోపాల్..

మూర్తి ఏమీ సమాధానం చెప్పకుండా ఆ కాగితాన్ని గోపాల్ కి అందిస్తాడు.. గోపాల్ ఆశ్చర్యంగా ఆ కాగితాన్ని అందుకుని అందులోని విషయం చదువుతాడు..

అది చదివిన గోపాల్ లో కూడా మూర్తి లో కలిగిన భావాలే కదలాడుతాయి..

ఆ కాగితం లో ''నన్ను క్షమించండి మేనేజర్ గారు.. ఇంత అవమానం జరిగి, ఒక దొంగగా ముద్రపడ్డాక ఇక ఒక్క క్షణం కూడా ఇక్కడ ఉండడానికి నా మనసు ఒప్పుకోవడం లేదు.. నాకూ, దొంగిలించ బడిన ఆ కిరీటానికి ఎలాంటి సంబంధం లేదని నా మనస్సాక్షిగా మీకు చెబుతున్నాను.. ఆ ధైర్యం తోనే ఇక్కడి నుండి వెళ్లి పోతున్నాను.. శాశ్వతంగా..''

మూర్తి, గోపాల్ కళ్ళు పెద్దవి చేసి, నోర్లు తెరుచుకుని ఒకరి ముఖాలొకరు చూసుకుంటారు..

మూర్తి, గోపాల్ ఇద్దరూ ఆ కాగితం చూస్తూ కొయ్యబారి పోయి నిలబడిపోయి ఉండగా అంతలోనే సాయిబాబా మందిరం మెయిన్ గేటుని ఎవరో బలంగా తోసేసినట్టుగా శబ్దం వస్తుంది..

ఆ శబ్దానికి ఇద్దరూ ఉలిక్కిపడి గేటు వైపు చూస్తారు.. ఆ గేటువైపు చూసిన వారిద్దరూ మరింత  షాక్‌కు గురవుతారు.

ఆ కాగితంలో చదివిన దానికంటే మరింత పెద్ద షాక్ తగిలినట్టుగా వుంటాయి వారి ముఖాల్లోని ఎక్స్‌ప్రెషన్స్.. రాజారాం గుడి మెయిన్ గేటుని బలంగా తోయడం, అతని వెనుక

ఆలయ కమిటీ చైర్మన్‌తో పాటు, కమిటీ మెంబర్లు, సావిత్రి కూడా లోనికి రావడం కనిపిస్తుంది వారికి.

ఆలయ చైర్మన్ నేరుగా గోపాల్ దగ్గరికి వస్తాడు.. గోపాల్‌నే సూటిగా చూస్తూ..

''గోపాల్ గారూ.. అసలిక్కడ ఏం జరుగుతుంది..?'' చైర్మన్ ముఖంలో ఒకవిధమైన ఆశ్చర్యం..

గోపాల్‌కి ఏం చెప్పాలో అర్థం కాదు.. తడబడుతూ 'అదీ.. అదీ..' అంటూ ఏదో చెప్పాలనుకుంటాడు..

రాజారాం చైర్మన్ వంక చూస్తాడు..

''ఇలా మర్యాదగా అడిగితే అతనేం చెబుతాడండీ.. కాస్త గట్టిగా అడగండి..!'' శారదమ్మని వెనకేసుకురావడంతో గోపాల్, మూర్తిలపై పీకలవరకు కోపంతో ఉన్నాడు రాజారాం..

''గోపాల్‌గారూ.. ఏమిటండీ ఇది.. ఇది గుడనుకుంటున్నారా.. లేదంటే ఏదయినా సంత అనుకుంటున్నారా.. పవిత్రమైన ఈ ప్రదేశంలో ఈ కోపతాపాలేమిటీ..? గుళ్లో ఈ విపరీత పరిణామాలేమిటి..? రాజారాం గారు చెప్పింది నిజమేనా..?

చైర్మన్ గోపాల్ వంక సూటిగా చూస్తాడు..

ఆలయ చైర్మన్ సడన్‌గా అలా అడిగే సరికి గోపాల్‌కి ఏం చెప్పాలో అర్థం కాదు.. దాంతో నీళ్ళు నములుతూ మూర్తి వంక చూస్తాడు.. మూర్తి ముఖంలోని భావాలు కూడా అలాగే ఉంటాయి.. ఇద్దరూ ఒకరి ముఖా లొకరు చూసుకుంటారు..

''చెప్పండి గోపాల్ గారూ.. మిమ్మల్ని నమ్ముకుని ఈ పవిత్రమైన ఆలయ బాధ్యతలన్నింటినీ అప్పగిస్తే.. మీ ఆధ్వర్యంలో ఇలా జరగడం ఏమైనా బావుందా..? పదేళ్ళుగా ఎంతో జాగ్రత్తగా కాపాడుకుంటూ వస్తున్న ఆలయ పవిత్రతని పోగొట్టే పనులు ఈ గుళ్లో జరుగుతున్నాయని

రాజారాం గారు నాకు చెబితే నమ్మలేకపోయాను..'' చైర్మన్ మాటలకి గోపాల్ మనసు బాధతో నిండిపోతుంది..

గోపాల్ చైర్మన్ ముఖం చూడలేక, ఏం సమాధానం చెప్పాలో అర్థం కానట్టు అయోమయంతో దిక్కులు చూస్తూండిపోతాడు.. రాజారాం తీసుకువచ్చిన ఆలయ చైర్మన్, కమిటీ మెంబర్లకి ఏం చెప్పాలనుకున్నా, గుళ్ళోని కిరీటం మాయం కావడం వెనుక రాజారాం హస్తం ఉందని నిరూపించాలన్నా శారదమ్మ తప్పకుండా ఉండాల్సిందే...

కానీ.. తనకి కలిగిన అవమాన భారంతో శారదమ్మ ఆలయాన్ని వదిలి వెళ్లటంతో వారికి ఏం చెప్పాలో అర్థం కావడంలేదు.. శారద గుళ్ళో నుండి బయటికి వెళ్ళిందని వారికి తెలిస్తే.. బంగారు కిరీటం మాయం చేసింది ఖచ్చింతగా శారదమ్మే అన్న అపవాదు రావడం ఖాయం..

శారదమ్మ కనిపించకపోవడంతో వారికి ఆలయ కమిటీ చైర్మన్‌తో ఏం చెప్పాలో అర్థం కాకుండా ఉంది.''పాపం వారినడిగితే ఏం చెబుతారు చైర్మన్ గారూ.. ఏరి కోరి ఊరూ, పేరు లేని దాన్ని తీసుకువచ్చి ఈ గుళ్ళో పెట్టుకున్నారు కదా.. పిలవండి దాన్ని.. సాయికి సేవ చేస్తున్నానన్న నెపంతో ఆ సాయినాధుడి కిరీటాన్నే ఎగరేసుకుపోయిన ఆ మాయలాడిని బయటికి రమ్మని చెప్పండి..'' ఆవేశంగా అంటాడు రాజారాం. ఆయన అలా అనడంతో గోపాల్, మూర్తిలు మరింత ఇరకాటంలో పడిపోతారు...

రాజారాం అలా ఆవేశ పడటం ఇష్టం ఉండదు చైర్మన్ గారికి..

''రాజారాం గారూ.. మీకు అంత ఆవేశం పనికి రాదు.. సమస్యకి పరిష్కారం ఇలా ఆవేశకావేశాలతో దొరకదు.. కాస్త సంయమనం అవసరం.. ముందుగా అందరూ లోపలికి పదండి.. ఏదైనా ఉంటే లోపల మాట్లాడుకుందాం..''

చైర్మన్ మాటలకి చైర్మన్, కమిటీ మెంబర్లతో పాటు సావిత్రి కూడా అక్కడి నుండి ముందుకు కదులుతుంది..

రాజారాం గోపాల్, మూర్తి వంక విజయగర్వంతో చూస్తాడు..

గోపాల్, మూర్తిలు కూడా కిరీటం దొంగవి నువ్వే అని మాకు తెలిసిపోయిందిలే అన్న భావం వారి ముఖాల్లో కదలాడే విధంగా అతన్ని చూస్తారు..

..........................

సాయిబాబా మందిరానికి ఆనుకుని ఉన్న సమావేశ గదిలోకి ప్రవేశిస్తారు అందరూ..

ఆలయ కమిటీ చైర్మన్, కమిటీ మెంబర్లు తమ తమ కుర్చీల దగ్గర నిలబడి ఉంటారు.. ముందుగా ఆలయ చైర్మన్ ఆ పక్కనే గోడకు వ్రేలాడుతున్న సాయిబాబా చిత్రపటానికి నమస్కరించి కూర్చుంటాడు.. అతను కూర్చోగానే మిగిలిన వారందరూ తమ తమ కుర్చీలో కూర్చుంటారు.

వారికి ఎదురుగా మేనేజర్ గోపాల్, మూర్తి కూర్చుని ఉంటారు.. వారికి కొద్ది దూరంలో రాజారాం కుర్చీలో కూర్చుని ఉంటాడు. ఓ గోడ వారగా సావిత్రి ఎంతో అమాయకంగా నిలబడి ఉంటుంది..

సావిత్రి, రాజారాం ఇద్దరూ ఒకరి ముఖాలొకరు చూసుకుంటారు.. అక్కడి వారికి అనుమానం రాకుండా ఇద్దరూ ఒక పైశాచికమైన ఆనందాన్ని పొందుతారు.

ఆలయ కమిటీ చైర్మన్, మెంబర్లు గంభీరంగా కూర్చుని మేనేజర్ గోపాల్‌ని చూస్తూంటారు.. మేనేజర్ గోపాల్, మూర్తిలు రాజారాం వంక ఎంతో కోపంగా చూస్తూంటారు..

అదంతా కమిటీ చైర్మన్ గమనిస్తూనే రాజారాం వైపు తిరిగి చూస్తూ గొంతు సవరించుకుంటాడు..

‘‘రాజారాం గారూ.. సమస్య ఎంత పెద్దదయినా విచక్షణ అన్నది అవసరం.. మీరు ఈ మందిరం ప్రధాన గేటుని అలా ఆవేశంతో త్రోయడం నాకేమాత్రం నచ్చలేదు.. ఇదేమైనా

ఇల్లు అనుకుంటున్నారా..? పవిత్రమైన సాయినాధుడి ఆలయం, ఈ ఆలయ పవిత్రతని కాపాడే బాధ్యత మనందరిపైన ఉన్నది.. అలాంటిది మీరలా ఆవేశపడడం ఏమీ బావోలేదు..''

రాజారాం ఉలిక్కిపడతాడు.. అప్పటి వరకూ వీరావేశంతో ఊగిపోయిన రాజారాం, చైర్మన్ మాటలతో ఏదో తప్పు చేసినవాడిలా తడబడతాడు..

ఆ వెంటనే తిరిగి మామూలు స్థితికి చేరుకుని మేనేజర్ గోపాల్, మూర్తి వంక చూస్తాడు.. గోపాల్, మూర్తిలు రాజారాం వంకే కోపంగా చూస్తూంటారు..

రాజారాం తిరిగి చైర్మన్ వంక చూస్తాడు..

''నన్ను క్షమించండి చైర్మన్ గారూ.. అలా చేయడం నిజంగా పొరపాటే.. నా తప్పుని ఆ సాయినాధుడు క్షమించుగాక...'' ముఖంలో పశ్చాత్తాప భావాలు కనిపించే విధంగా తెచ్చుకుని గోడకి ఉన్న సాయిబాబా చిత్రపటానికి మొక్కుతాడు..

''సరె.. సరె.. ఇప్పుడు చెప్పండి.. అసలేం జరిగింది..?'' కుర్చీలో కుదురుగా కూర్చుంటూ ప్రశ్నిస్తాడు ఆలయ చైర్మన్ గోపాల్ వంక చూస్తూ..

గోపాల్ చైర్మన్ వంక చూస్తూ కాస్త తడబడతాడు. జరిగిన సంఘటనని ఎలా చెప్పాలో అర్థం కానట్టుగా చూస్తూండిపోతాడు..

రాజారాం ఆ విషయాన్ని గ్రహిస్తాడు..

''మేనేజర్ గారిని అడిగితే ఏం చెబుతాడు లెండి.. అసలు విషయం నేను చెబుతాను..'' గంభీరంగా అంటాడు రాజారాం.

''రాజారాం గారూ.. ఏం చెప్పాలనుకున్నా నెమ్మదిగా చెప్పండి.. ఆవేశాలకు లోను కావడం అన్నది సాయినాధుడి నచ్చని అంశం..'' నిదానంగా అంటాడు చైర్మన్.

''అయ్యో.. మీరు అంతగా చెప్పాలా..? న్యాయాన్యాయాలేమిటో నిర్ణయించే తమలాంటి పెద్దల ముందు ఆవేశకావేశాలకి చోటెక్కడుంటుందండీ.. అసలేం జరిగిందంటే... అంటూ...

రాజారాం చెప్పడం ప్రారంభిస్తాడు.. బంగారు ఆభరణాలు భద్రపరిచే గదిలోకి మూర్తి తో పాటు శారద వెళ్లడం, సరిగ్గా అదే సమయంలో తాను కూడా ఆ గది వద్దకు రావడం, ప్రస్తుతం కనపడకుండా పోయిన బంగారు కిరీటంమినహా, మిగతా ఆభరణాలని మూర్తి ఒక బ్యాగ్‌లో సర్దుకుని బయటికి వచ్చి ఆ గది తాళం వేసి ఆ తాళం చెవిని మేనేజర్ గోపాల్‌కి ఇవ్వాల్సిందిగా కోరడం, ఆ తర్వాత మూర్తితో పాటు తాను కూడా సాయి మందిరం నుండి వెళ్ళిపోవడం అంతా చెబుతాడు రాజారాం..

రాజారాం చెబుతున్న మాటలని  కమిటీ చైర్మన్, మెంబర్లు శ్రద్దగా వింటూంటారు..

''మందిరంలో ఎవరూ లేని సమయం.. పైగా లక్షలు విలువ  చేసే ఖరీదైన బంగారు కిరీటం గదిలో ఉండడం, ఆ గది తాళం చెవి కూడా తన దగ్గరే ఉండడంతో ఖచ్చితంగా ఆ కిరీటాన్ని శారదమ్మే కాజేసిందని నా బలమైన నమ్మకం చైర్మన్ గారూ..'' నమ్మకంగా చెబుతాడు రాజారాం..

రాజారాం మాటలకి గోపాల్, మూర్తికి ఎంతో కోపం వస్తుంది.. కానీ.. తమాయించుకుంటారు..  ప్రస్తుతం రాజారాం చెబుతున్న మాటలని బట్టి శారదమ్మ దొంగతనం చేసిందన్న నిర్ణయానికి అక్కడున్న వారు వొచ్చారని గోపాల్, మూర్తిలకు లీలగా అర్థమవుతుంది.. ప్రస్తుతం శారదమ్మకి అనుకూలంగా తాము ఏమి మాట్లాడినా .. ఆ కిరీటం మాయం అయిన విషయంలో తమ పాత్ర కూడా ఉండి ఉంటుందని చెప్పడానికి కూడా రాజారాం వెనుకాడడని వారికి తెలుసు.. అందుకే మౌనంగా ఉండిపోతారు..

రాజారాం చెబుతున్న మాటలని చైర్మన్‌తో పాటు, కమిటీ మెంబర్లు కూడా శ్రద్దతో వింటూండడంతో సావిత్రి ముఖంలో ఎంతో సంతోషం కనిపిస్తుంటుంది..

''ఇదీ సార్ జరిగింది..!'' శారదమ్మే  కిరీటం దొంగిలించింది అన్న నమ్మకాన్ని అక్కడున్న వారందరికి  కలిగించడంలో రాజారాం సక్సెస్ సాధిస్తాడు..

రాజారాం మాటలతో ఆలయ చైర్మన్ తీవ్రంగా ఆలోచిస్తున్నట్టుగా శూన్యంలోకి చూపు సారించి తల ఊపుతాడు.. అందరి చూపులు  చైర్మన్ పై మళ్ళుతాయి..

కమిటీ మెంబర్లు సైతం చైర్మన్ ఏం చెబుతాడా అన్న ఆతృతతో అతని వంక చూస్తూండి పోతారు..

మేనేజర్ గోపాల్, మూర్తిలు ఒకరి ముఖం  ఒకరు చూసుకుని తిరిగి చైర్మన్ వంక చూస్తారు.. సావిత్రి ఎంతో ఉత్కంఠగా చైర్మన్ వంక చూస్తూంది..

రాజారాం మాత్రం తాను చెప్పిన విషయాన్నంతా చైర్మన్ పూర్తిగా నమ్మాడన్న ఆనందంతో చూస్తూంటాడు..

అక్కడంతా నిశ్శబ్దం ఆవరించి ఉంటుంది.. అందరూ టెన్షన్‌గా ఆలయ చైర్మన్ ఏం నిర్ణయం తీసుకుంటాడా.. అన్న ఆతృతతో గమనిస్తుంటారు. చైర్మన్ మెల్లిగా గోపాల్ వైపు తిరుగుతాడు.. అతని ముఖంలో ఎలాంటి భావాలు ప్రతిఫలించలేకపోయినప్పటికీ,

చైర్మన్ వైపు గోపాల్ కాస్త భయంగానూ, ఏదో తప్పు చేసిన వాడిగా చూస్తూండిపోతాడు..

''గోపాల్ గారూ.. ఆలయంలో ఇంత పెద్ద సంఘటన జరిగినా కూడా మీరు నా దృష్టికి తీసుకురాలేదు ఎందుకు?''

ఆయన ఎంతో నిదానంగా అడిగినప్పటికీ ఆ గొంతులో కాస్తంత అసంతృప్తి కదలాడుతుంది..

చైర్మన్ మాటలకి గోపాల్ నీళ్లు నములుతుంటాడు.. రాజారాం ముఖంలో ఆనందం ప్రతిఫలిస్తుండగా గోపాల్ వంక చూస్తూంటాడు..

''అదీ.. అదీ..'' మేనేజర్ గోపాల్‌కి ఏం చెప్పాలో అర్థం కాదు.. దాంతో చేతులు నలుపు కుంటూ శారదమ్మ నిర్దోషిత్వాన్ని, రాజారాం పన్నుతున్న కుట్రలని చెప్పడానికి మాటలని వెతుక్కోవడానికి ఆలోచనలో పడిపోతాడు గోపాల్. గోపాల్‌లో కనిపిస్తున్న ఇబ్బందిని మూర్తి గమనిస్తాడు..

''ఇందులో గోపాల్ గారి తప్పేమీ లేదండీ..! ఈ విషయం తెలిసిన వెంటనే మీ దృష్టికి తీసుకురావాలని మేము ప్రయత్నిస్తుండగానే ఈ రాజారాం గారు విషయాన్ని సీరియస్‌గా చేసేసి ఇదిగో ఇంత దూరం తీసుకువచ్చాడు..''

రాజారాం వంక కోపంగా చూస్తూ అంటాడు మూర్తి.

రాజారాం కూడా మూర్తి వంక కోపంగా చూస్తాడు.. చైర్మన్ ఇద్దరి వైపు ఓ సారి చూస్తూ... రాజారాం వంక తలతిప్పి..

''రాజారాం గారూ.. సమస్య తీవ్రమైనదే అయినప్పటికీ వారికంటే ముందే మీరు ఎక్కువగా స్పందించినట్టున్నారు?..''

సావధానంగా అడుగుతాడు చైర్మన్.. అతని ముఖంలో ఎలాంటి భావాలు కనిపించవు.. ఎంతో శాంతమూర్తిలా ఉంటాడు ఆలయ చైర్మన్.

రాజారాం ఉలిక్కిపడతాడు చైర్మన్ మాటలకి.. వెంటనే తనని తాను సర్దుకుంటాడు...

''చైర్మన్ గారూ.. ఇందాక మీరే చెప్పారు.. ఈ ఆలయ పవిత్రతని కాపాడడం మనందరి బాధ్యత అని.. పైగా ఆలయంలో ఉన్న ప్రతీ వస్తువుని జాగ్రత్తగా చూసుకునే బాధ్యత కూడా నామీదనే ఉంది కదా.. అందుకే.. లక్షల ఖరీదు చేసే బంగారు విగ్రహం మాయమైందన్న విషయం తెలియగానే నేను భరించలేకపోయాను.. ఆ సాయినాధుని సంపదని కొల్లగొట్టిన వారిని ఎలాగైనా పట్టుకుని మీముందుంచాలన్న ఆరాటం నాలో పెరిగింది.. ఈ క్రమంలో నేను అతిగా స్పందిచానని మీకు అనిపించినా ఆ దేవుడి ఆస్తిని కాపాడడంలో మాత్రం నేను కరెక్టుగానే వ్యవహరించానని నాకనిపిస్తుంది..'' రాజారాం తనని తాను సమర్ధించుకోవడానికి ఎంతో వినయంగా అంటాడు.

''అవుననుకో.. అయినా.. బంగారు విగ్రహాన్ని దొంగిలించేంత ధైర్యం ఆవిడకి ఉందంటే నేను నమ్మలేకపోతున్నాను..'' శారదమ్మని గుర్తు చేసుకుంటూ అంటాడు ఆలయ చైర్మన్.

‘‘ఎందుకు నమ్మరండీ.. ఈ మధ్య ఇలాంటి ఘోరాలు ఎన్నింటిని మనం చూడడం లేదు.. తమకి ఎవరూ లేరని, అనాధలమని గుళ్ళల్లో చేరి గుళ్ళోని విలువైన వస్తువులుని దొంగిలించే సంఘటనలు ఎన్నో జరుగుతున్నాయి కదా..

ఈ మాయలాడి కూడా ఆ కోవలోకి వచ్చిందే.. అయినా.. మనందరి ముందు అమాయకంగా నటించిన  ఆవిడ గారు ఒక్కరే అని మనం అనుకుంటే పొరపాటే.. బ్యాంక్ రాబరీ బ్యాచ్, చైన్ స్నాచర్ బ్యాచ్, ఇంటికి కన్నాలేసే బ్యాచ్ లాగా ఈవిడకి కూడా గుళ్ళోని సొమ్ముని కాజేసే ఓ బ్యాచ్ ఉండి ఉంటుంది.. అందులో ఈవిడ ఒక మెంబరయి ఉంటుంది.. అమాయకంగా గుళ్ళో ఆశ్రయం పొంది, అదను చూసి తన బ్యాచ్ వారిని  రంగంలోకి దించేసి బంగారు కిరీటాన్ని కాజేసిందన్నదే నా ప్రగాఢమైన నమ్మకం..’’ రాజారాం ఉదాహరణలతో సహా చెబుతాడు..

రాజారాం మాటలకి గోపాల్, మూర్తికి ఎంతో కోపం వస్తూంది.. గోపాల్ ఏదో అనాలనుకుని ఊరుకుండి పోతాడు.. ప్రస్తుతం పరిస్థితులన్నీ తమకి వ్యతిరేకంగా ఉండడంతో గోపాల్‌కి ఏం చేయాలో అర్ధం కావడం లేదు.

ఆలయ చైర్మన్ దీర్ఘమైన ఆలోచనలో పడిపోతాడు..

చైర్మన్ తన మాటలని నమ్ముతున్నందుకు రాజారాం లో ఎంతో విజయానందం పొందుతాడు.

‘‘ఇలాంటి ఘోరాలకి మన గుడి బలి కాకూడదనుకున్న నేను ఎంతో నమ్మకస్తురాలయిన సావిత్రిని గుళ్ళో పని చేయడం కోసం మేనేజర్ గోపాల్ గారికి సిఫారసు చేసాను.. కానీ.. ఈవిడని కాదని ఆ శారదమ్మని పనిలో కుదిర్చాడు.. ఇదిగోండి.. ఈవిడే సావిత్రి..’’ గోపాల్ వంక ఓరగా చూస్తూనే.. సావిత్రి వైపు వేలెత్తి చూపిస్తాడు రాజారాం.

చైర్మన్, మిగతా మెంబర్లతో పాటు, గోపాల్, మూర్తిలు కూడా సావిత్రి వంక చూస్తారు.. అందరి చూపు తనపై పడడంతో సావిత్రిలో కంగారు ప్రవేశిస్తుంది.. అయినప్పటికీ ఎంతో

ఒద్దికగా, వీలయినంత వరకు ముఖం లో అమాయకపు ఎక్స్‌ప్రెషన్స్ తెచ్చుకుంటూ తలదించుకుంటుంది..

గోపాల్, మూర్తిలు ఒకరి ముఖం ఒకరు చూసుకుంటారు.. వారి ముఖాల్లో ఆందోళన కనిపిస్తుంటుంది..

''ఈవిడ పేరు సావిత్రి.. గుళ్ళో పని చేయడం కోసం ఆడమనిషి కావాలని మేనేజర్ గోపాల్ గారు నాకు చెప్పడంతో ఎంతో నమ్మకస్తురాలయిన ఈ సావిత్రి గారిని ఆరోజు నేను గుడికి పంపించాను.. దురదృష్టం కొద్దీ వేరే పని పడడంతో నేను ఈవిడ కూడా రాలేకపోయాను.. అదే నేను చేసిన తప్పు.. సావిత్రి గారు గుళ్ళోకి రావడం, సరిగ్గా అదే సమయంలో ఆ శారద కూడా ఇక్కడికి రావడంతో గోపాల్ గారు సావిత్రిని కాదని ఆ శారదమ్మని పనిలోకి కుదిర్చాడు.. అప్పుడే ఈ సావిత్రి గారిని పనిలో పెట్టుకుంటే.. గుళ్లోని కిరీటం దొంగపాలు అయ్యుండేదే కాదు, ఇప్పుడు మనం ఇలా సమావేశం ఏర్పాటు చేసుకునే అవసరమే వచ్చి ఉండేది కాదు..'' తన ముఖం లో బాధని తెచ్చి పెట్టుకుంటూ అంటాడు రాజారాం.

చైర్మన్ గోపాల్ వంక చూస్తాడు..

''గోపాల్ గారూ, రాజారాం పంపించిన ఈ సావిత్రిని కాకుండా మీరు ఆ శారదమ్మని ఎందుకు పనిలోకి తీసుకున్నారు..?'' నిదానంగా అడుగుతాడు చైర్మన్..

గోపాల్ అయోమయంగా చైర్మన్ వంక చూస్తాడు.. అతనికి ఏం సమాధానం చెప్పాలో అర్థం కానట్టుగా ముఖం పెడతాడు.. మూర్తి గోపాల్ వంక జాలిగా చూస్తాడు..

రాజారాం ముఖం లో ఓ విషపు నవ్వు ప్రవేశిస్తుంది.. గోపాల్‌ని ఆ పరిస్థితిలో చూసి అతనెంతో ఆనందిస్తుంటాడు..

''పాపం.. ఇందులో గోపాల్ గారి తప్పేముందండీ.. ఆ మాయలాడి గోపాల్ గారికి ఏవో మాయ మాటలు చెప్పి గుళ్ళో చేరింది.. కానీ ఆవిడగారు ఇంత పెద్ద దొంగతనం చేస్తుందని పాపం.. గోపాల్ గారు మాత్రం ఎలా ఊహిస్తాడు చెప్పండి..!''

గోపాల్‌ని వెనకేసుకు వస్తున్నట్టుగా అంటూ గోపాల్ వంక చూస్తాడు రాజారాం.. నిన్ను నా మాటల ద్వారా రక్షిస్తున్నాను అన్న అహం అతని కళ్ళల్లో కనిపిస్తుంటుంది...

అప్పటి వరకు మౌనంగా ఉన్న మూర్తి ఇక రాజారాం మాటలు వినలేకపోతాడు.

''చైర్మన్ గారూ.. జరిగిన సంఘటనకీ, ప్రస్తుతం ఉన్న పరిస్థితులకి అసలు ఏమాత్రం సంబంధం లేకుండా ఉండిపోయింది.. శారదమ్మ మాయమాటలు చెప్పే మనిషి కాదు.. అది నాకు బాగా తెలుసు.. ఆరోజు అసలేం జరిగిందంటే..!''

గోపాల్ మూర్తి చేయి పట్టుకుంటాడు.. మూర్తి గోపాల్ వంక చూస్తాడు.. ఏమీ మాట్లాడవద్దని వారిస్తాడు..

''మూర్తి గారూ.. పరిస్థితులు అనుకూలంగా లేనప్పుడు మనం ఎన్ని చెప్పినా వాటికి విలువ ఉండదు..'' మెల్లిగా అంటాడు. మూర్తి ముఖం లో ఒక విధమైన ఆక్రోశం కనిపిస్తుంటుంది..

''పాపం ఈ మూర్తి గారిని కూడా ఆ మాయలేడి బుట్టలో పడేసింది.. ఆవిడ ఒక పనిమనిషి అని తెలిసి కూడా ఈ గుడికి సంబంధించిన అన్ని పనులూ ఆవిడకి చెప్పడంతో ఆవిడ పని ఇంకా సులువైపోయింది...

ఆ రోజు ఈ మూర్తి గారు ఆ మాయలాడికి చనువు ఇచ్చి తాళం చెవి ఇచ్చి ఉండకపోతే ఇప్పుడీ పరిస్థితి వచ్చి ఉండేది కాదు..''

రాజారాం మూర్తి వంకే చూస్తూ అంటాడు... రాజారాం ముఖం గాంభీర్యంగా ఉన్నప్పటికీ కళ్ళల్లో మాత్రం వారిద్దరిపై తాను విజయం సాధించానన్న గర్వాన్ని గోపాల్, మూర్తి ఇద్దరూ గమనిస్తారు.

మూర్తి కోపంగా రాజారాం వంక చూస్తాడు.. రాజారాం ముఖం లో విషపు నవ్వు.. ఎవరికీ కనిపించనీయకుండా మూర్తికి మాత్రమే కనిపించే విధంగా ఉంటుంది..

''మూర్తి గారు.. ఆవిడ మంచిదా, చెడ్డదా అన్నది కాదు విషయం.. ఆలయం లోనుండి మాయమైన కిరీటం ఆవిడే దొంగిలించిందని బలమైన ఆధారాలు మన దగ్గర ఉన్నవి.. కాబట్టి ఆ కిరీటాన్ని తిరిగి దక్కించుకునే ఉపాయం ఆలోచించండి..!'' అంటాడు ఆలయ చైర్మన్ మూర్తి వంక చూస్తూ.. దీనికంతటికీ రాజారామే కారణమని తాము కనుగొన్నప్పటికీ ఏమీ చేయలేని నిస్సహాయ స్థితి వచ్చిందని తీవ్రమైన బాధతో ఉన్న మూర్తికి చైర్మన్ గారు తనని అలా అడిగే సరికి ఇక తనలోని ఉద్వేగాన్ని ఆపుకోలేకపోయాడు..

''చైర్మన్ గారూ.. అసలు  కిరీటం మాయం కావడానికి, ఆ శారదమ్మకి ఎలాంటి సంబంధం లేదు.. నన్ను నమ్మండి.. దీనికంతటికీ కారణం..''

మూర్తి చూపు రాజారాం పై పడుతుంది.. అతని చూపులోని భావం అందరికీ అర్థమవుతుంది.. రాజారాం విపరీతమైన అమాయకత్వాన్ని ముఖం లోకి తెచ్చుకుని చైర్మన్ వంక చూస్తాడు..

''అంటే.. అంటే.. కిరీటం దొంగిలించింది నేననా మీ అనుమానం.. సాయినాధా.. ఏమిటీ ఘోరం.. నీ సేవలో తరిస్తున్న నాపైనే అనుమానమా..! ఈనింద ని నేనెలా భరించేది.. ఈ మందిరంలో ఉన్న పూచిక పుల్లని కూడా జాగ్రత్తగా కాపాడే నాపై ఇంత పెద్ద అపనింద పడ్డాక ఇంక నేను జీవించి ఉండడం వ్యర్థం..''

రాజారాం  కళ్ళల్లో  నీళ్ళు తిరుగుతాయి..  విపరీతంగా  బాధపడిపోతున్నట్టుగా అతని ముఖం లో భావాలు కదలాడుతుంటాయి.. అందరి చూపులు రాజారాంపై పడడంతో అతను ఎంతో బాధపడిపోతున్నట్టుగా మరింతగా నటిస్తాడు..

''అయ్యో.. నా ఉద్దేశ్యం రాజారాం గారు కిరీటం దొంగిలించాడని కాదండీ..!'' మూర్తి మాటల్లో ఇందాకటి కరుకుదనం కాస్త తగ్గిపోతుంది..

‘‘మీరు ఏ ఉద్దేశ్యంతో అన్నా కూడా మీ భావం అర్థం ఇదే కదండీ..! అయినా దీనికంతటికీ కారణమైన ఆ మాయలాడిని రప్పిస్తే నిజాలేమిటో అన్నీ వాటంతట అవే బయటికి వస్తాయి.. పిలిపించండి ఆ శారదమ్మని ఇక్కడిని..

ఈ వేళ ఆ శారదమ్మ బండారం బయట పడిపోవాల్సిందే.. నాపై పడ్డ ఈ అపనింద తొలగిపోవాల్సిందే..!’’ అంటాడు రాజారాం..

మూర్తి, గోపాల్ ఇద్దరూ ఒకరి ముఖాలొకరు చూసుకుంటారు.. వారి కళ్ళు పెద్దవయి పోతాయి.. విపరీతమైన షాక్‌కి గురయినట్టుగా వారి ముఖాల్లోని ఫీలింగ్స్ మారిపోతాయి..సడన్‌గా వారి ముఖాల్లోని ఫీలింగ్స్ మారిపోయే సరికి అక్కడ ఉన్న ఆలయ చైర్మన్, కమిటీ మెంబర్లందరూ ఆశ్చర్యపోతారు..

రాజారాం వారిద్దరి వంక కసిగా చూస్తూంటాడు.. సావిత్రి కూడా ఒకరకమైన ఈర్ష్య భావంతో వారిని చూస్తూంటూంది..

(ఓం సాయి.. శ్రీ సాయి.. జయ జయ సాయి)

గోపాల్ మూర్తి ముఖం లో నెత్తుటి చుక్క మిగలదు.. రాజారాం మాటకి వారికి ఏం చెప్పాలో అర్థం కాదు..

శారద గుడి వదిలి వెళ్లిందని కమిటీ మెంబర్లకి తెలిస్తే ఎంత గొడవ అవుతుందో అన్నది వారి టెన్షన్..

అంతా ఆ సాయినాధుడి పై భారం వేస్తారు.. ఈ సమస్య నుండి గట్టెక్కించు తండ్రీ అని మనసులోనే ఆ సాయినాధుడిని వేడుకొంటారు..

‘‘ఏవండి గోపాల్ గారూ.. మీరు అలా మౌనంగా ఉంటే కాదు.. దీనికంతటికీ కారణం అయిన ఆ శారదని పిలిపించండి.. నిజా నిజాలేమిటో ఇప్పుడే తేలిపోతుంది..

గోపాల్ సమాధానం చెప్పడానికి తడుముకుంటుంటాడు..

ఆలయ చైర్మన్ అంటాడు.. ‘‘చూడండి గోపాల్ గారూ.. ఇప్పటి వరకూ రాజారాం చెప్పింది మొత్తం విన్నాం కదా.. శారదని పిలిపిస్తే ఆవిడ ఏం చెబుతుందో కూడా అర్థం అవుతుంది కదా.. పిలిపించండి..’’

గోపాల్ కాస్త భయపడుతూనే అంటాడు.. ‘‘చైర్మన్ గారూ.. శారదమ్మ కనిపించడం లేదండీ.. ఇందాక మీరు వచ్చినప్పుడు నేను ఆవిడ గది దగ్గరే ఉన్నాను.. గుళ్లో కిరీటం మాయమవడం వెనుక తన ప్రమేయం ఉందన్న అపవాదు వచ్చిందని మనస్తాపంతో ఆమె ఈ గుడి వదిలి వెళ్లిపోయింది.. ’’

గోపాల్ మాటకి అందరూ ఆశ్చర్యపోతారు..

రాజారాం అంటాడు.. ‘‘వారెవా.. చూసారా చైర్మన్ గారూ.. కిరీటం మాయమైపోయింది.. కిరీటం దొంగిలించిందని అనుమానిస్తున్న ఆ శారద కూడా మాయమైపోయింది.. అంటే.. ఈ దొంగతనం చేసింది ఖచ్చితంగా ఆ శారదే అని తేలిపోయింది కదా..’’ రాజారాం మాటలకి గోపాల్, మూర్తి లు  కోపంగా చూస్తారు.. సావిత్రికి మాత్రం ఎక్కడా లేనంత సంతోషం కలుగుతుంది..

శారద గుడి వదిలి వెళ్లిందని తెలియగానే ఆలయ చైర్మన్, కమిటీ మెంబర్లు కూడా ఆవిడే కిరీటం దొంగిలించిందన్న నిర్ధారణకి వస్తారు.

చైర్మన్ అంటాడు.. ‘‘గోపాల్ గారూ.. ఏమిటండీ ఇది..! ఎంతో నమ్మకస్తుడివని నిన్ను ఈ ఆలయ మేనేజర్‌గా పెడితే.. ఊరూ, పేరూ లేని ఆవిడకి ఈ ఆలయంలో చోటు ఇవ్వటమేమిటి ఈవిడ కిరీటాన్ని దొంగిలించటమేమిటి?

గుళ్లో దొంగతనం జరిగిందని బయటివారికి తెలిస్తే ఈ ఆలయ ప్రతిష్ట మొత్తం మంటగలిసిపోతుంది.. ఏమాత్రం పరిచయం లేని వారిని నమ్మి మీరెలా ఆమెకి ఆశ్రయం కల్పించారు..?'' చైర్మన్ కోపంగా అంటాడు..

గోపాల్‌కి ఏం చెప్పాలో అర్థం కాదు..

మూర్తి అంటాడు.. ''చైర్మన్ గారూ.. ఆ శారదమ్మ వెళ్ళిపోయిందని, ఈ దొంగతనం ఆవిడే చేసిందని నిర్ధారణకి రావడం బావోలేదండీ.. నిజా నిజాలు తెలియకుండా ఆవిడపై నింద వేయకండి.. ఆవిడ గురించి నాకు చాలా బాగా తెలుసు.. ఆవిడ ఇతరులకు సహాయం చేయాలని అనుకుంటుందే కానీ.. ఇతరుల  నుండి ప్రతిఫలాన్ని ఆశించని గుణం ఆవిడది.. అలాంటిది సాయిబాబా కిరీటాన్ని ఆవిడ దొంగిలించిందని నేననుకోను..''

రాజారాం అంటాడు.. ''మీరు ఆవిడకి మంచిదని సర్టిఫికెట్ ఇచ్చినంత మాత్రాన ఇక్కడ నమ్మేవాళ్ళు ఎవరూ లేరు.. అసలు  ఆవిడని ఆ గది దగ్గరికి తీసుకువచ్చింది మీరు.. కిరీటం మాయమైపోవడానికి మీరు కూడా కారణం అవుతారు.. ''

మూర్తి కోపంగా అంటాడు.. ''రాజారాం గారూ.. పరిస్థితులు మీకు అనుకూలంగా ఉన్నాయని మీరు ఎలా మాట్లాడినా పడటానికి ఇక్కడ ఎవరూ సిద్దంగా లేరు.. అసలు ఆ కిరీటం మాయం కావడం వెనుక మీ హస్తం ఉందని నా అనుమానం.. శారదని ఈ గుళ్ళో నుండి ఎలాగయినా బయటికి పంపించాలని కిరీటం మాయం చేసారని మా అనుమానం..''

రాజారాం కోపంగా కుర్చీలోనుండి లేచి అంటాడు.. ''నోరు అదుపులో పెట్టుకో మూర్తి.. నేనేమిటీ కిరీటం మాయం చేయడమేమిటీ..? అసలు మతి ఉండే మాట్లాడుతున్నావా..? చూసారా చైర్మన్ గారూ.. ఈ గోపాల్ గారూ, మూర్తి గార్లు ఆ శారదని ఇంతలా వెనకేసుకు రావడం వల్లనే ఇంత పెద్ద అనర్థం జరిగింది..''

చైర్మన్ అంటాడు.. ''రాజారాం గారూ.. మీరు కాస్త శాంతించండి.. సమస్యకి పరిష్కారం మార్గం కనుగొనాలి కానీ.. ఇలా ఒకరిపై ఒకరు నిందలు  వేసుకుంటే ఎలా.. వందలా వేలా.. లక్షల ఖరీదు చేసే కిరీటం పోయిందంటే ఇప్పుడు దానికి బాధ్యులని ఎవరిని చేయాలి..?''

ఒక కమిటీ మెంబర్ అంటాడు..  లక్షల విలువైన సొమ్ము గుళ్ళో నుండి మాయమైతే ఊరికే చూస్తూ ఉంటే ఎలాగండీ.. పిలిపించండి పోలీసులని.. అసలు  విషయం వాళ్ళే తేలుస్తారు.. ''

రాజారాం ముఖం లో రంగులు మారుతాయి.. పోలీసులు గానీ రంగ ప్రవేశం చేస్తే తన బండారం  భయట పడటం ఖాయమని అతనికి తెలుసు.. ఎలాగైనా పోలీసుల  వరకు ఈ విషయం పోకుండా జాగ్రత్త పడాలని వెంటనే అంటాడు..

''ఏం మాట్లాడుతున్నారండీ మీరు.. గుళ్ళో దొంగతనం జరిగిందని పోలీసు కంప్లైంట్ ఇస్తే.. ఈ విషయం కాస్తా అందరికీ తెలిసి పోతుంది.. దాంతో ఈ గుడి పరువు గంగలో కలిసిపోతుంది.. ''

చైర్మన్ అంటాడు.. ''అవునవును.. నిజమే.. పోలీసులకి కంప్లైంట్ ఇచ్చేంత దూరం వెళ్ళక్కర్లేదు.. ఈ సమస్యకి మనమే పరిష్కారం చూపించాలి.. కిరీటం మాయమైపోయింది.. ఆ కిరీటాన్ని దొంగిలించిందనుకుంటున్న ఆ శారద కూడా మాయమైపోయింది.. ఇంక మనం చేసేదేమీ లేదు.. ఆ సాయినాధుడిపై భారం వేసి కొద్ది రోజులు వెయిట్ చేద్దాం.. ''

సరిగ్గా అప్పుడే ఆ గుళ్ళోకి ఒక వ్యక్తి వస్తాడు.. దాదాపు యాభై సంవత్సరాల వయసు ఉంటుంది.. కింది నుండి పై వరకు ఒకటే తెల్లటి వస్త్రం ఉంటుంది.. అతని చేతిలో ఒక సంచి ఉంటుంది.. గబ గబా ఆ గదిలోకి వస్తాడు…

అతని చూసిన అందరూ ఆశ్చర్యపోతారు…

చైర్మన్ అతన్ని చూస్తూ ''ఎవరయ్యా నువ్వూ.. చెప్పా పెట్టకుండా లోనికి వచ్చేసావు..'' అంటాడు కోపంగా..

ఆ వ్యక్తి చైర్మన్ వంక, అక్కడ కూర్చున్న మిగతా వారి వంక ఒకసారి నిశితంగా గమనించి.. తిరిగి చైర్మన్ వంక చూస్తూ తన చేతిలో ఉన్న సంచిలో నుండి బంగారు కిరీటాన్ని బయటికి తీస్తాడు..

''అయ్యా.. ఒక బంగారు కిరీటం విషయం గురించి మాట్లాడుదామని ఇక్కడికి వచ్చాను..''

అతని మాటలకి అక్కడున్న వారంతా షాకైపోతారు.. ఏదో అద్భుతాన్ని చూస్తున్నట్టు ఆ వ్యక్తి వంక చూస్తూండిపోతారు.. రాజారాం, సావిత్రి ముఖం లో రంగులు మారుతాయి..

మేనేజర్ గోపాల్, మూర్తి ఇద్దరూ ఒక్క ఉదుటున అతని దగ్గరకు చేరుకుని అతని చేతిలో ఉన్న బంగారు కిరీటాన్ని తీసుకుని పరీక్షించి ఎంతో ఆనందానుభూతులకి లోనవుతారు.. ఆ కిరీటాన్ని చూసిన రాజారాం ముఖం లో నెత్తుటి చుక్క లేనట్లుగా పాలిపోతుంది..

''చైర్మన్ గారూ .. ఇది కలో నిజమో అర్థం కావడం లేదు.. మనం పోయిందని అనుకుంటున్న బంగారు కిరీటం ఇదే.. ఈ కిరీటం కోసమే మనం మాట్లాడుకుంటున్నాము..'' గోపాల్‌లోనూ, మూర్తిలోనూ ఎంతో ఆనందం కనిపిస్తుంటుంది..

చైర్మన్‌తో పాటు అక్కడున్న కమిటీ మెంబర్లు కూడా ఎంతో ఆశ్చర్యపోతారు .. చైర్మన్

వారి దగ్గరికి వచ్చి కిరీటాన్ని తన చేతిలోకి తీసుకుని పరీక్షిస్తాడు.. ఆలయ చైర్మన్ కుర్చీ లోనుండి లేచి అంటాడు.. ''నిజమే.. ఈ కిరీటం మనదే..'' అంటూ ఆ వ్యక్తి వంక చూసి అంటాడు.. ''ఏమయ్యా.. ఈ కిరీటం నీదగ్గరకెలా వచ్చింది..? ఈ కిరీటం దొంగిలించబడిందన్న ఆందోళనతోనే మేమంతా ఇక్కడ సమావేశమయ్యాం.. గుళ్ళో పనిచేసే ఒకావిడ దొంగిలించిందని మేమనుకుంటుండ గానే నీవు వచ్చావు..''

ఆ ముసలి వ్యక్తి పెద్దగా నవ్వుతాడు..

''హ..హ..హ.. ఇది సాయి ఆలయం, ఈ ఆలయంలో అమాయకులకు ఎన్నటికీ అన్యాయం జరగదు.. ఆవిడకీ, ఈ కిరీటానికి ఎలాంటి సంబంధం లేదు..'' అంటాడు..

‘‘అది సరే.. అసలు ఈ కిరీటం నీ దగ్గరికి ఎలా వచ్చింది..?’’ ఆతృతగా అడుగుతాడు చైర్మన్..

‘‘నేను ఓ నగల షాపులో బంగారు నగలు తయారు చేసే పని చేస్తుంటాను.. ఈ కిరీటాన్ని కరిగించి బంగారు నగలు ఓ నాలుగు చేయాలని మా యజమాని నాతో చెప్పాడు.. అదేమిటీ..? దేవుడి కిరీటాన్ని కరిగించి నగలు చేయడమా..? ఆ దేవుడికి ధరించే ఇలాంటి వాటితో మనుషులు ధరించే నగలు చేయించడమేమిటండీ.. అలా చేయించమని చెప్పినవాడికి బుద్ధి లేకపోతే మీకు లేదా.. అసలెవరయినా దేవుడి కిరీటాన్ని నగలుగా మారుస్తారా..

అసలు ఈ కిరీటం కరిగించమని చెప్పినతనికి ఈ కిరీటం ఎక్కడి నుండి వచ్చిందో తెలుసుకోకుండా మనం ఈ పని చేస్తే ఆ సాయిబాబా ఆగ్రహానికి గురవుతామని నేను మా యజమానితో చెప్పడంతో అతను భయపడి అసలు విషయం ఏమిటో కనుక్కు రమ్మని నాకు ఈ కిరీటాన్ని ఇచ్చి పంపించాడు.. అసలు విషయం ఏమిటో తెలుసుకుందామని  నేనిక్కడికి వచ్చాను..’’

అతని మాటకి గోపాల్, మూర్తితో పాటు ఆలయ చైర్మన్, కమిటీ మెంబర్లందరూ ఎంతో ఆశ్చర్యపోతారు..

రాజారాం వెన్నులో నుండి భయం పుట్టుకు వస్తుంది... సావిత్రి కూడా గజగజా వణికిపోతుంది..

‘‘ఇంతకీ ఈ కిరీటాన్ని కరిగించమని చెప్పిన వ్యక్తి ఎవరు..?’’ చైర్మన్ ఆ వ్యక్తిని అడుగుతాడు.. ఆ వ్యక్తి చూపు రాజారాం పై పడుతుంది.. అప్పటికే రాజారాం ఒళ్లంతా చెమట పట్టేసి ఉంటుంది.. కళ్ళల్లో భయం కనిపిస్తుంటుంది...

ఆ ముసలి వ్యక్తి ఎవరి పేరు చెబుతాడా అని అందరూ ఆతృతగా ఎదురు చూస్తుంటారు..

ఆ వ్యక్తి రాజారాం వైపు చూస్తూ చిద్విలాసంగా నవ్వుతూ ''ఎవరో రాజారాం అంట..'' అని చెప్పగానే.. అందరూ ఎంతో షాకైపోతారు..

అందరి చూపులూ  రాజారాంపై మళ్ళుతాయి.. రాజారాం అందరినీ ఎంతో భయంగా చూస్తుంటాడు.. చైర్మన్ రాజారాం వంక ఎంతో కోపంగా చూస్తాడు.. గోపాల్, మూర్తి లు కూడా రాజారాం వంక కోపంగా చూస్తుంటారు..

''చైర్మన్ గారూ.. ఈ ముసలతని మాటలు నమ్మకండి..! తన బండారం బయట పడిందని ఆ శారదే ఈ ముసలతన్ని ఇక్కడికి కిరీటం ఇచ్చి పంపించి, నన్ను ఇరికించాలని ఏదో ప్లాన్ వేసింది.. అంతే కానీ.. నాకే పాపం తెలియదు..''

అతని గొంతు సన్నగా వణుకుతుంటుంది.. అతని మాటలు తడబడుతుంటాయి..

''ఛీ.. మూర్ఖుడా.. చేసిందంతా చేసి ఇంకా బొంకాలని చూస్తున్నావా..? ఆ కిరీటం దొంగిలించింది నువ్వేనని నీ ఒంటికి పట్టిన ఆ చెమట, నీ కళ్ళల్లో భయమే చెబుతున్నాయి.. ఇన్నాళ్ళుగా ఎంతో నమ్మకంగా ఉన్నట్లు నటిస్తూ ఈ గుళ్ళో నుండి విలువైన వస్తువులన్నీ కాజేస్తున్నావా..?'' చైర్మన్ ముఖం లో ఎంతో కోపం కనిపిస్తుంటుంది..

వెంటనే గోపాల్ అంటాడు..

''చూసారా చైర్మన్ గారూ.. నాకు ఈ రాజారాంపై మొదటి నుండీ అనుమానమే.. ఎంతో నిస్వార్థంగా ఆ శారదమ్మ సాయి సేవలో తరిస్తుంటే చూస్తూ ఓర్వలేకుండా ఆమెపై నింద వేసి తాను దీన్ని కాజేయాలనుకున్నాడు..''

చైర్మన్ రాజారాం వంక కోపంగా చూస్తూ..

''ఆ దేవుడి సొమ్మును కాజేయాలని చూసిన నిన్ను ఏం చేసినా తప్పులేదు.. ఇంత పెద్ద తప్పుకి శిక్ష నీకు ఆ సాయినాధుడే వేస్తాడు.. వెళ్ళు ఇక్కడి నుండి.. మళ్ళీ ఈ గుడి ఆవరణలో

కనిపించావంటే.. పోలీసులకి పట్టించి జైల్లోకి తోస్తాము జాగ్రత్త..'' చైర్మన్ ఎంతో కోపంతో అంటాడు..

రాజారాం తల దించుకుని మెల్లిగా అక్కడి నుండి వెళ్ళిపోతాడు.. అతని వెనకాలే సావిత్రి కూడా మెల్లగా జారుకుంటుంది..

''చూసారా చైర్మన్ గారూ.. వీడి వల్ల పాపం.. అనవసరంగా ఆ శారదమ్మని అనుమానించాం.. ఆమె మనసు ఎంతో క్షోభపడింది.. అందుకే ఈ గుడి విడిచి వెళ్ళిపోయింది.. సమయానికి ఈ వ్యక్తి వచ్చి అసలు నిజమేమిటో తెలిసేలా చేసాడు..'' అని గోపాల్ అంటూ ఆ ముసలి వ్యక్తి వైపు చూస్తాడు..

ఆశ్చర్యం..

బంగారు కిరీటం ఇచ్చిన ఆ వ్యక్తి అక్కడ కనిపించడు..

దాంతో అందరూ విపరీతమైన ఆశ్చర్యానికి గురవుతారు..

''ఇదేమిటీ...? ఈ ముసలాయన ఇక్కడే ఉండాలి కదా..'' ఎంతో ఆశ్చర్యంగా అంటాడు చైర్మన్..

''అవునండీ.. ఆ రాజారాంతో మాటల్లో పడిపోయి ఈ ముసలి వ్యక్తిని మనం గమనించలేదు.. ఇప్పటి కిప్పుడు మన కళ్ళు గప్పి ఎక్కడికి వెళ్ళాడు..'' విపరీతమైన ఆశ్చర్యంతో అంటాడు మూర్తి..

ఓ ఇద్దరు కమిటీ మెంబర్లు గుడి బయటికి వెళ్ళి అంతా వెతుకుతారు .. కానీ ఆ ముసలి వ్యక్తి కనిపించడు..

అప్పుడు చైర్మన్, గోపాల్‌కి ఏదో లీలలా అర్థమవుతుంది...

గోపాల్ ఎంతో ఆనందంతో.. '' అంటే... అంటే.. ఈ కిరీటాన్ని తీసుకువచ్చింది.. అసలు దొంగని పట్టించింది సాక్షాత్తూ ఆ సాయినాధుడే..'' అంటూ సాయిబాబా పటానికి ఎంతో

భక్తి ప్రపత్తులతో నమస్కరిస్తాడు.. మిగతా వారందరూ కూడా ఎంతో భక్తి భావం తొణికిసలాడుతుండగా.. చేతులెత్తి దండం పెడుతూ..

''సమర్థ సద్గురు సాయినాధ్ మహరాజ్ కీ జై.. '' అంటూ పెద్దగా అంటుంటారు..

గోపాల్, మూర్తి లు  ఇద్దరూ ఎంతో బాధపడుతున్నారు.. కిరీటం దొంగిలించిందని తనపై పడ్డ ముద్రకి తట్టుకోలేకే శారద గుడి వదిలి వెళ్లడంతో వారిద్దరి ముఖాల్లోనూ విచారం కనిపిస్తుంటుంది..

ఆలయ చైర్మన్ అంటాడు.. ''గోపాల్ గారూ.. అనవసరంగా శారదమ్మని అనుమానించి పెద్ద పొరపాటు చేసాము.. ఆవిడ ఈ గుళ్ళో చేస్తున్న సేవను నేనూ గమనించాను.. ఇరవై నాలుగు గంటలూ  సాయినామ స్మరణతో తన పనేదో తాను చూసుకునే ఆ శారదమ్మ గుడి విడిచి వెళ్లిందంటే ఆమె మనసు ఎంత గాయపడిందో అర్థమవుతుంది.. ఎక్కడి నుండి వచ్చిందో, ఎక్కడికి వెళ్లిందో తెలియదు.. ఆమెపై నిందని తొలగించేందుకు సాక్షాత్తూ ఆ సాయినాధుడే కిరీటాన్ని తీసుకువచ్చి అసలు  దొంగని పట్టించాడని నాకనిపిస్తుంది..'' చైర్మన్ మాటల్లో విచారం వ్యక్తం అవుతుంది..

''అవును చైర్మన్ గారూ.. శారదమ్మ మనసు చాలా గాయపడింది.. ఆ రాజారాం ఆవిడని కిరీటం దొంగిలించింది నువ్వే అని మాట్లాడే సరికి తట్టుకోలేకపోయింది.. వచ్చింది కొద్ది రోజులే అయినా తన కష్టపడే పనితనంతో పాటు ప్రతీ ఆదివారం ఆధ్యాత్మిక పాఠాలు కూడా బోధిస్తూ భక్తులందరి మన్ననలను పొందింది.. కానీ.. ఇప్పుడు..'' ఆపై మాట్లాడలేకపోతాడు గోపాల్..

''అన్నట్లు శారదమ్మ గుడి వదిలి వెళ్లి ఎంత సేపయింది..?'' చైర్మన్ అడుగుతాడు..

''సుమారు రెండు గంటలు కావొచ్చనుకుంటాను.. మీరు ఇక్కడికి వచ్చే ముందు మేం ఆమె గదికి వెళ్ళి చూద్దుము గదా గదిలో ఆమె కనిపించలేదు కానీ, ఆమె రాసిన ఉత్తరం మాత్రం కనబడింది..'' మూర్తి అంటాడు.. దాంతో చైర్మన్ గోపాల్ వైపు తిరిగి..

''గోపాల్ గారూ.. రెండు గంటల సమయంలో ఆవిడ ఎంతో దూరం వెళ్లి ఉండదు.. మీరు మరే మాత్రం ఆలస్యం చేయకుండా ఈ చుట్టు ప్రక్కల  ఉన్న పరిసరాలను గాలించండి.. ఆవిడ ఆచూకీ తప్పకుండా లభిస్తుంది..''చైర్మన్ అలా అనడంతో గోపాల్ మూర్తి  ఒకరి మొహాలొకరు చూసుకుని మరేమాత్రం ఆలస్యం చేయకుండా అక్కడి నుండి కదులుతారు...

గుడి దాటి మూర్తి టు వీలర్ పై శారదని వెతకడానికి బయలు దేరుతారు ఇద్దరూ.. ఆ వీధి మొత్తం గాలిస్తారు.. అయినా ఆమె ఆచూకి మాత్రం లభించదు.. గుడికి దగ్గరలో ఉన్న ప్రతీ వీధిని క్షుణ్ణంగా పరిశీలిస్తూ మెల్లిగా ముందుకు సాగుతుంటారు.. దాదాపు మూడు, నాలుగు గంటల పాటు వెతికే సరికి ఇద్దరూ ఎంతో అలసి పోతారు.. కానీ ప్రయోజనం లేకపోయే సరికి ''గోపాల్ గారూ.. దాదాపు ఈ దరిదాపులోని అన్ని వీదుల్లోనూ వెతికాం కానీ ప్రయోజనం లేదు.. ఆ శారదమ్మ ఇక కనిపించేలా లేదు.. ఇప్పుడేం చేద్దాం..'' అంటాడు మూర్తి అలసటగా..

''లేదు మూర్తి గారూ.. ఎలాగైనా మనం శారదమ్మని వెతకాలి.. ఆవిడని గుళ్ళోకి తీసుకురావాలి.. నా మనసెందుకో శారదమ్మ మనకి కనిపిస్తుందని గట్టిగా చెబుతున్నది..'' అన్నాడు గోపాల్ నమ్మకంగా..

''దొరికేదయితే ఈపాటికే దొరికేది కదా.. నాకు తెలిసి ఇప్పటికే ఏ రైలో ఎక్కేసి  ఇక్కడికి దూరంగా వెళ్ళి ఉంటుంది.. '' నిరుత్సాహంగా అంటాడు మూర్తి.. మూర్తి అలా అనే సరికి గోపాల్ మెదడులో చటుక్కున ఓ ఆలోచన వస్తుంది..

''మూర్తిగారూ.. సమయానికి బాగా గుర్తు చేసారు.. మీరన్నది నిజమే.. ఇక్కడికి కొద్ది దూరంలోనే కదా సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ ఉంది.. బహుశా శారదమ్మ ఆ రైల్వేస్టేషన్‌కే వెళ్ళి ఉంటుంది..'' అంటాడు గోపాల్.

''నిజమే గోపాల్ గారూ.. మీరన్నట్టు ఆవిడ రైల్వేస్టేషన్‌కే వెళ్లి ఉంటే.. ఈ పాటికి ఏ రైలు ఎక్కక పోయి ఉంటే.. ఖచ్చితంగా మనకి దొరుకుతుంది.. '' అంటాడు మూర్తి ఆనందంగా..

''అయితే వెంటనే రైల్వేస్టేషన్‌కి వెళదాం పదా..'' ఇద్దరూ సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌కి చేరుకుంటారు..

పార్కింగ్ ప్లేస్‌లో టూవీలర్ ని పార్క్ చేసి ఇద్దరూ హడావిడిగా రైల్వేస్టేషన్‌లోకి వెళతారు.. ఇద్దరూ తలా ఒక ప్లాట్‌ఫాంపై వెతుకుతూ ఉంటారు..

చివరికి ఒకటవ నంబర్ ప్లాట్ ఫాం పైన ఓ బెంచిపై కూర్చుని కనిపిస్తుంది శారదమ్మ.. శారదమ్మని అక్కడ చూడగానే మూర్తి, గోపాల్ ముఖాలలో ఎంతో ఆనందం తాండవిస్తుంది.. అప్పటి వరకూ ఎంతో అలసిపోయినట్లు కనిపించిన వారిలో ఎక్కడ లేని ఉత్సాహం ముంచుకు వస్తుంది..

గుళ్ళో జరిగిన అద్భుతాన్ని శారదకి చెప్పేసి ఆమెని అక్కడి నుండి తీసుకొని వెళ్ళాలన్న ఆరాటం వారిలో కనిపిస్తుంటుంది.. గోపాల్, మూర్తి ఇద్దరూ ఒకరి ముఖాలొకరు చూసుకుని ఆనందంతో శారదని చూస్తారు..

శారద దగ్గరికి ఇద్దరూ వెళుదామని అడుగు ముందుకు వేసి, ఆ వెంటనే ఠక్కున ఆగిపోతారు.. ఎదురుగా కనిపించిన దృశ్యానికి ఇద్దరూ అవాక్కయిపోతారు..

ఎదురుగా శారద కూర్చున్న బెంచి దగ్గరికి గతంలో శారదమ్మకి సహాయం చేసిన వృద్ధ భిక్షగాళ్ళు ఇద్దరూ శారద దగ్గరికి వస్తారు.. వారి వెనకాలే మరో ముగ్గురు నలుగురు యాచకులు ఉంటారు.

వృద్ధ యాచకుడు శారదతో అంటాడు ఆప్యాయంగా..

''ఏవమ్మా.. నీవు కనిపించక పోయేసరికి యాడికి బోయినవో అని నేనెంత కంగారు పడిపోయానో తెలుసా తల్లీ.. ఏ ఆధారం లేకుండా ఉన్నానని సెబితివి గదా..'' ఆ వృద్ధుడి కళ్ళల్లో శారదపై ఎంతో అప్యాయత కనపడింది..

ఆ వృద్ధురాలు కూడా శారదని ఎంతో లాలనగా చూస్తుంటుంది..

''అవునమ్మా.. నేను గూడా నీ జాడ తెలీకపోయేసరికి ఎంతనో పరేషానయినా.. నువ్వు మా కాడ ఉన్నప్పుడు నీతోటి నేను కటినంగా మాట్లాడితిని గదా.. నా మాటలకు నీ మనసు ఖరాబయి ఈడినుండి ఎల్లిపోయినవనీ ఈ ముసలోడు నన్ను రోజూ తిడుతున్నడాయే.. నేను కూడా శానా బాధపడ్డాను తల్లీ.. నువ్వు కనిపించలేదనీ.. ఏదో ముసలిదాన్నయినగదా.. గదాన్నేమంటరు.. ఆ గదే చాదస్తం.. గా చాదస్తం వల్లే నిన్ను నానా మాటలంటిని ..

పోనీతీయ్.. గిప్పటికయినా మా కంట్లపడ్డావు.. నిన్ను సూడగానే మాకెంత సంతోషం ఏస్తుందో తెల్సా  తల్లీ..'' ఆ వృద్ధురాలి ఆత్మీయ మాటలకి శారద మనసు ఎంతో ఆనందంతో పొంగిపోతుంది..

కేవలం ఒకే ఒక్కరోజు వారితో గడిపినందుకు వారు తనపై చూపిస్తున్న వాత్సల్యానికి శారదకి ఎక్కడా లేని ఆనందం కనిపిస్తుంది.. అప్పటి వరకూ గుళ్లో జరిగిన సంఘటన తలుచుకుంటూ కుమిలిపోతున్న శారదలో ఆ వృద్ధ యాచకుల మాటల వల్ల ఎంతో ఓదార్పు లభించింది.. దాంతో శారద మనసు కాస్త కుదుటపడింది.. తేలిక పడ్డ మనసుతో వారితో ఆనందాన్ని పంచుకుంటోంది శారద..

''అయ్యో.. అంతంత పెద్ద మాటలు  ఎందుకమ్మా.. మీరు నాపై చూపించిన అభిమానానికి నేను మీకు ఎంతగానో ఋణపడి ఉన్నాను తెలుసా..?'' మనస్ఫూర్తిగా అంటూంది శారద వారిని చూస్తూ..

‘‘అయ్యయ్యో.. గిప్పుడు గన్నేసి మాటలెందుకు గానీ.. ఎప్పుడు తిన్నావో ఏమో.. ఇంద ఈ బ్రెడ్డు పాకెటుతిను తల్లీ.. ఒరే సాంబిగా.. క్యాంటీనుకెళ్లి ఓ గ్లాసెడు పాలు పటుక్టురా.. ఈ యమ్మ తాగుద్ది..’’ ఆ వృద్ధుడు పక్కనే ఉన్న మరో యాచకుడికి పురమాయించాడు.. వృద్ధుడు అనడమే ఆలస్యం. అతను అక్కడి నుండి వేగంగా రైల్వే క్యాంటీను వైపుకు అడుగులు వేస్తాడు..

‘‘అయ్యయ్యో.. నేను తిన్నానయ్యా.. ఇప్పుడివన్నీ ఎందుకు..?’’ మొహమాటంగా అంటూంది శారదమ్మ..‘‘నువ్వట్లా అనొద్దు తల్లీ.. నువ్వు మాకు కల్సినవు.. గంతే సాలు.. నువ్వు ఏమీ మాట్లాడకుండా ఇది తినమ్మా..!’’ అన్నాడు వృద్ధ యాచకుడు..

వారి ఆప్యాయతకి శారద ఎంతో ఉప్పొంగిపోతూంది.. ఆ వృద్ధుడు ఇచ్చిన బ్రెడ్డుని తింటూంది.. అక్కడ గుమిగూడిన యాచకులతో శారద ఎంతో ఆప్యాయంగా మాట్లాడుతుంటూంది..

దూరం నుండి ఇదంతా గమనిస్తున్న గోపాల్, మూర్తి ఎంతో ఆశ్చర్యపోతారు.. ఆ భిక్షగాళ్ళతో శారద అంతలా ఆప్యాయంగా మాట్లాడటం వారిని ఎంతో విస్మయానికి గురిచేస్తుంది..

‘‘మనం చూస్తుంది నిజమా..? కలా..? మూర్తి గారూ..’’ ఎదురుగా శారదమ్మ భిక్షగాళ్ళతో కలుపుగోలుగా మాట్లాడుతుండటం, వారిచ్చిన బ్రెడ్డు ముక్కను తింటూండడం చూసిన గోపాల్ మూర్తిని ప్రశ్నించాడు..

‘‘కళ్ళముందు కనిపిస్తుంటే.. కల అని ఎలా భ్రమపడతామండీ.. ఇది నిజమే.. శారదమ్మ అంటే ఆ భిక్షగాళ్ళకి ఎంత అభిమానమో వారి ప్రవర్తన ద్వారా తెలిసిపోతూంది..?’’ వారి వంకే చూస్తూ అంటాడు మూర్తి..

‘‘నాకూ అలాగే అనిపిస్తుంది మూర్తి గారూ..’’ అంటాడు గోపాల్..

''గోపాల్ గారూ.. నాకో ఆలోచన వచ్చింది.. మీరు ఏమీ అనుకోనంటే చెబుతాను..'' మూర్తి గోపాల్‌ని చూస్తూ అంటాడు..

''చెప్పండి.. ఏమిటా ఆలోచన..'' మూర్తి వైపు తిరిగి అడుగుతాడు..

''శారదమ్మ ఆ భిక్షగాళ్ళతో గడుపుతున్న తీరు చూస్తూంటే.. ఇప్పుడే మనం వెళ్ళి శారదమ్మకి కనబడకుండా.. ఆమె చర్యలను గమనించి ఆ తర్వాత వెళితే ఎలా ఉంటుంది..?'' అంటాడు మూర్తి..

''మీ ఆలోచన బావుంది..! ఎవరూ లేని అనాధ అని అన్న శారద చుట్టూరా అంత మంది యాచకులు చేరి అంత ఆప్యాయంగా పలకరిస్తున్నారంటే.. ఆవిడ మనకి అబద్ధం చెప్పిందేమో అనిపిస్తుంది కదా..'' గోపాల్ అనాలోచితంగా అంటాడు..

''అలా ఎలా అనుకుంటారు గోపాల్ గారూ.. అలా అయితే ఇప్పుడు మనం ఆ శారదమ్మ కోసం గత మూడు గంటలుగా ఎన్నో చోట్ల వెతికాము.. అలాగని ఆ శారదమ్మకి, మనకి ఏదైనా బంధుత్వం ఉందంటారా..?

ఇదంతా కేవలం ఆమెలో ఉన్న మంచితనం, ఆమెలో ఉన్న కలుపుగోలుతనమే తప్ప మరోటి కాదు..'' మూర్తి అంటాడు..

''నిజమే మూర్తి గారూ..'' అంటాడు గోపాల్..మూర్తి, గోపాల్ ఇద్దరూ శారదమ్మని, ఆ భిక్షగాళ్ళని గమనిస్తూ వారికి కనపడకుండా ఆ ప్లాట్ ఫాంకి ఓ పక్కగా కూర్చుంటారు..

శారదమ్మతో ఆ భిక్షగాళ్ళు ఎంతో ఆప్యాయంగా మసలుతూ ఉంటారు... ఆ ప్లాట్ ఫాంపై అడుక్కుతినే ప్రతీ యాచకుడూ శారద దగ్గరికి వచ్చి పలకరించి  వెళుతుండడం ఆమెకి ఎంతో ఆనందాన్ని కలిగిస్తుంది.. తీర్ధ యాత్రలు చేస్తూ కాశీ నుండి ప్రత్యేకంగా ఫల, ప్రసాదాలను తీసుకువచ్చి భిక్షగాళ్ళకి పంచే ఆధ్యాత్మికురాలు ప్రభ వచ్చినప్పుడు శారదమ్మ ఆమెకి చేసిన సహాకారం, ఆమె గురించి, ఆమె పంచే పండ్లు, ఫలహారాలు  గురించి శారదమ్మ చెప్పిన విషయాలతో ఆ యాచకులకి శారదమ్మపై ఎంతో అభిమానం ఏర్పడింది..

అందుకే శారదమ్మ మళ్ళీ వచ్చిందని తెలియడంతో అందరూ ఆమె దగ్గరికి వచ్చి పలకరించటం ప్రారంభిస్తారు.. వారితో ఎంతో ఆప్యాయంగా గడుపుతున్న శారదమ్మనే గమనిస్తూ కూర్చుండిపోతారు గోపాల్, మూర్తి---

గోపాల్, మూర్తి లకు వారి సమయం ఎలా గడిచిందో తెలియనంతగా శారదమ్మని గమనించడంలో లీనమైపోతారు .. అప్పటికీ అర్ధరాత్రి పదకొండు గంటల సమయం.. ప్లాట్ ఫాం పైకి రైళ్ళు వస్తూనే ఉన్నాయి, వెళ్తూనే ఉన్నాయి.. వాటినేమీ పట్టించుకోవడం లేదు గోపాల్, మూర్తి లు .. శారద కూర్చున్న చోటుకి అందరూ రావడం ఆమెతో మాట్లాడుతూండడం, అప్పుడప్పుడూ ఆమెకి అరటిపండ్లు, ఛాయ్, కాఫీ లాంటి పదార్థాలు అందిస్తూండటం చూసి ఎంతో ఆశ్చర్యపోతుంటారు వారు..

చివరికి శారదమ్మ దగ్గరనుండి మెల్లిగా ఒక్కొక్కరు సెలవు తీసుకుని అక్కడి నుండి వెళ్ళిపోతుండటంతో శారదమ్మతో పాటు ఇద్దరు వృద్ధులు  మాత్రమే మిగిలి ఉండగా.. అప్పుడు ఈ లోకంలోకి వస్తారు గోపాల్ మరియు మూర్తి...

''మూర్తి గారూ.. ఇంకా ఆలస్యం చేయకుండా శారదమ్మని కలవడం మంచిదని నాకనిపిస్తుంది..'' అంటాడు గోపాల్.. ఆయన మాటలకు మూర్తి కాసేపు ఆలోచించి..

''ఇప్పుడే వద్దులే గోపాల్ గారూ.. రేపు ఉదయమే వచ్చి శారదమ్మని తీసుకు వెళదాం---

ఎలాగూ శారదమ్మ ఇక్కడి నుండి ఎక్కడికీ వెళ్లదని తెలుస్తుంది కదా.. ఇంత రాత్రివేళ ఆమెని పలకరించి ఆమెను డిస్టర్బ్ చేయటం ఎందుకు..'' అంటాడు మూర్తి.

మూర్తి మాటలకి గోపాల్ కూడా 'సరే' అన్నట్టుగా తలాడించి మరొక్కసారి శారదని గమనిస్తూ అక్కడి నుండి వెళ్ళిపోతారు మూర్తి, గోపాల్...

మరునాడు ఉదయం ఏడు గంటల కల్లా రైల్వేస్టేషన్‌కి చేరుకుంటారు గోపాల్, మూర్తి.. వారు వచ్చే సమయానికి క్రితం రోజు ఎక్కడయితే ఉందో అక్కడే కూర్చుని కనిపిస్తుంది శారదమ్మ.. ఆమె పక్కనే ఇద్దరు వృద్ధయాచకులు కూడా ఉంటారు..గుళ్ళో నుండి బయటికి వచ్చినా కూడా ఆమెలో ఆ ఆలోచనే లేనట్టుగా ఎంతో ఉత్సాహంగా కనిపిస్తుంటుంది శారదమ్మ..

ఇంక ఏమాత్రం ఆలస్యం చేయకుండా నేరుగా శారదమ్మ దగ్గరికి వస్తారు గోపాల్, మూర్తి..

''శారదమ్మా..'' శారదమ్మ దగ్గరికి చేరుకోగానే గోపాల్ ఎంతో ఉద్విగ్నంగా పిలుస్తాడు..

ఆ పిలుపుకి శారద ఉలిక్కిపడి గోపాల్‌ని చూస్తుంది.. గోపాల్, మూర్తి ఇద్దరూ తనవైపే ఎంతో సంతోషంగా చూస్తూండడంతో శారద ఆశ్చర్యపోతూ లేచి నిలబడుతుంది..

''ఏమిటి శారదమ్మా ఇది.. ఇలా చెప్పా పెట్టకుండా వస్తే ఎలా చెప్పు..'' కాస్త కోపంగా అంటాడు గోపాల్.. శారద అతని మాటలకి నిర్వేదంగా నవ్వుతుంది..

''ఓ.. నేను మీకు చెప్పా పెట్టకుండా వచ్చినందుకు నన్ను వెతుక్కుంటూ వస్తున్నారా..? హూ.. నాకు తెలుసు లెండి.. లక్షల ఖరీదు చేసే కిరీటాన్ని దొంగిలించానని పేరు సంపాదించుకున్న నన్ను మీరు ఊరికే ఎలా వదిలి పెడతారు.. నన్ను ఆదరించి, నాకు గుళ్ళో ఇంత చోటు ఇచ్చినందుకు మీరు కూడా అపవాదు ఎదుర్కోవలసి వచ్చింది కదూ.. నేను గుడి వదిలే ముందు మీ గురించి కూడా ఆలోచించాను కానీ.. దొంగగా ముద్ర పడ్డాక ఆ గుళ్ళో ఒక్క క్షణం కూడా ఉండాలనిపించలేదు.. అందుకే వచ్చేసాను.. అయినా నేను వస్తే మాత్రం నాపై పడ్డ దొంగతనం మచ్చ ఊరికే పోతుందా..? పదండి.. ఆ కిరీటం గురించి నాకేమీ తెలియకపోయినా.. నన్ను పోలీసులకి పట్టించండి..''

నిర్వేదంగా పలుకుతుంది శారదమ్మా.. ఆమె మాటలకి గోపాల్, మూర్తి ఇద్దరూ ఒకరి ముఖాలొకరు చూసుకుంటారు..

‘‘అయ్యో.. శారదమ్మా.. నువ్వింకా ఆ కిరీటం నువ్వే దొంగిలించావన్న భ్రమలో ఉన్నావు.. అసలు నువ్వు తొందర పడి గుడి వదిలి వచ్చావు కానీ.. నువ్వు అక్కడే ఉంటే.. ఎంతటి అద్భుతం జరిగిందో నీ కన్నులారా వీక్షించే దానివి.. మంచి అవకాశాన్ని చేజార్చుకున్నావు..’’ మూర్తి ఎంతో ఉద్వేగంగా అంటాడు.. శారదమ్మ నొసలు ముడి పడుతాయి..

‘‘అధ్బుతమా..?’’ అంటూంది ఆశ్చర్యంగా..

‘‘అవును శారదమ్మా.. అద్భుతమే.. ఎంతో భక్తితో నువ్వు ఆ సాయినాధుడికి చేసిన సేవా ఫలితం  ఊరికే పోతుందా శారదమ్మా.. నీపై పడ్డ దొంగతనం మచ్చని తొలిగించేందుకు సాక్షాత్తూ ఆ సాయినాధుడే దిగివచ్చాడు తెలుసా..?’’ గోపాల్ కూడా ఎంతో ఉద్వేగంగా అంటాడు.. ఆ మాటలకి శారదమ్మ ముఖం లో విస్మయంతో కూడిన ఒక విధమైన ఆశ్చర్యం కనిపిస్తుంది..

‘‘ఏమిటి మీరంటున్నది..?’’ ఇంకా అర్థం కానట్టు అడుగుతుంది శారద..

మూర్తి జరిగిందంతా వివరంగా చెబుతాడు..

అలా జరగడం శారదమ్మ ఇంకా జీర్ణించుకోలేకపోయింది..

‘‘శారదమ్మా.. నువ్వు నిర్దోషివి.. పైగా సాయికి  ప్రియ భక్తురాలివి. నువ్వు గుళ్ళో నుండి బయటకి రావడం మాకే కాదు.. ఆ సాయినాధుడికి కూడా ఇష్టం లేదులా ఉంది.. అందుకే సాక్షాత్తూ నీకోసం ఇంతటి అద్భుతమయిన మహిమని చూపించాడు.. నీ సేవలు ఇంకా ఆ సాయినాధుడికి కావాలన్నదే ఆ సాయి ఆకాంక్ష.. ఇక నువ్వు ఎక్కడికీ వెళ్లాల్సిన పనిలేదు.. వచ్చేయి.. గుడికి వెళదాం.’’ అంటాడు గోపాల్..

వారి మాటలకి శారదలో కూడా ఆనందం కలుగుతుంది.. ఎంతో భక్తి తో రెండు కళ్ళూ మూసుకుని ఆ సాయినాధుడికి మనసులోనే ధన్యవాదాలు తెలుపుతుంది.. ఆ తర్వాత వారితో కలిసి గుడికి బయలు దేరుతుంది...

.................................

ముందు గోపాల్, మూర్తి మోటార్ సైకిల్ పై గుడి దగ్గరికి వస్తారు.. ఆ వెనకాలే ఆటోలో శారద వస్తుంది.. గోపాల్, మూర్తి ఆటో దగ్గరికి వెళ్ళి శారదని సాదరంగా గుళ్లోకి ఆహ్వానిస్తారు.. శారద ఆటో దిగుతూ ఎదురుగా ఎంతో మనోహరంగా కనిపిస్తున్న సాయిబాబా ఆలయాన్ని చూసే సరికి ఆమెలో ఒకవిధమైన ఉద్వేగం నిండిపోతుంది.. మనసులో గూడు కట్టుకుపోయిన ఆనందభాష్పాలు  బయటికి వస్తాయి.. ఆటో దిగగానే.. ఎదురుగా సాయిబాబా ఆలయ గోపురాన్ని తిలకిస్తూ ఎంతో తన్మయత్వంతో రెండు చేతులెత్తి ఆ సాయినాధుడుకి  మనస్ఫూర్తిగా నమస్కరిస్తుంది..

గోపాల్, మూర్తి శారదమ్మని గుళ్లోకి తీసుకువస్తూంటే ఆ చుట్టు పక్కల  ఉన్న వారందరూ ఆశ్చర్యంతో శారదనే ఆసక్తిగా గమనిస్తూంటారు.. అంతకు క్రితం జరిగిన సంఘటన, ఆ తర్వాత జరిగిన పరిణామాలన్నింటినీ ఉత్సుకతో గమనించిన వారందరూ శారద తిరిగి గుడిలోకి రావడాన్ని ఎంతో ఆనందంగా చూస్తూండిపోతారు..

‘‘పాపం.. ఈ శారదమ్మ ఎంతో నిజాయితీ పరురాలు, పైగా ఆ సాయినాధుడిని మనసా వాచా కర్మనా సేవిస్తూన్న మహా తల్లి.. అందుకే ఆ దేవుడు ఈమెపై పడ్డ నిందని తొలగించి తిరిగి తన దగ్గరికి రప్పించుకున్నాడు..’’

గుడి ముందు కొబ్బరికాయలు అమ్మే వ్యక్తి మరో వ్యక్తితో అంటూంటాడు..

శారదమ్మ ఇవేమీ గమనించే స్థితిలో లేదు.. ముందు గోపాల్, మూర్తిలు  గుడిలోపలికి ప్రవేశించగా.. వారి వెనకాలే తన చేతిలో ఉన్న సంచిని గుండెకి అదిమి పట్టుకుని ఎంతో భక్తిప్రపత్తులతో ఆలయం లోనికి ప్రవేశిస్తుంది శారదమ్మ..

ఆలయానికి ఓ ప్రక్కగా ఉన్న కుళాయి దగ్గరికి వెళ్ళి కాళ్ళూ, చేతులు కడుక్కుని గుళ్లోకి ప్రవేశిస్తుంది శారదమ్మ.. అప్పటి వరకూ వారి రాకకోసమే ఎదురు చూస్తున్న ఆ ఆలయ

పూజారి, మందిరంలోకి శారదమ్మ రాగానే ఎంతో సంతోషిస్తాడు.. ఆమెకి ఎదురుగా వెళ్ళి చిరునవ్వుతో పలుకరిస్తాడు ఆలయ  పూజారి.. ''అమ్మా.. శారదమ్మా.. ఈ మందిరంలో ఇప్పటి వరకూ సాయి విగ్రహం మాత్రమే ఉందని నమ్మేవారం మేమంతా.. కానీ.. నీరాకతో ఈ ఆలయ మహిమ అందరికీ తెలిసిపోయింది.. నీకోసం సాక్షాత్తూ ఆ సాయీశ్వరుడే ఇక్కడికి వచ్చి నీపై నిందని తొలగించడం మామూలు విషయం కాదు.. ఎన్నో జన్మల పుణ్యం చేస్తే కానీ ఇంతటి అదృష్టం దక్కదమ్మా.. ఏ జన్మలో ఏ పుణ్యం చేశావో గానీ ఈ జన్మలో నీకు ఇంతటి మహాద్భాగ్యం దక్కింది.. 'శ్రద్ధ, సబూరీతో నన్ను కొలిచిన వారిని  అనుక్షణం నేను రక్షిస్తూనే ఉంటాను' అన్న సాయి సూక్తులు అక్షర సత్యాలని నీ ద్వారా అందరికీ తెలిసింది.. నువ్వు మామూలు మహిళవు కాదు తల్లీ.. మహా భక్తురాలివి.. ఆ సాయినాధుడి దివ్యానుగ్రహాన్ని పొంది, నీతో పాటు మమ్మల్ని కూడా పావనం చేసిన దానివి..'' పూజారి శారదకి చేతులెత్తి నమస్కరిస్తూ అంటాడు.

ఆ మాటలని శారద ఏమాత్రం పట్టించుకోదు.. ఎదురుగా కనిపిస్తున్న నిలువెత్తు సాయి విగ్రహం పైనే ఆమె చూపంతా.. ఏదో మైకంలో ఉన్న దానిలా సరాసరి సాయిబాబా విగ్రహం దగ్గరకు వెళ్లి ఆ సాయినాధుడి పాదాలపై పడిపోతుంది.. సాయి పాదాల  వద్ద తన తల ఆనించి మనస్ఫూర్తిగా సాయినాధుడిని ప్రార్థిస్తుంది.. ఆనందంతో ఆమె కళ్ళల్లోనుండి వస్తున్న కన్నీళ్ళు సాయినాధుడి పాదాలను అభిషేకం చేస్తూంటాయి..

ఆమె వెనకాలే నిలబడ్డ గోపాల్, మూర్తి, పూజారి లు   ఆమెని ఏమాత్రం డిస్టర్బ్ చేయకుండా సాయినాధుడినికి  రెండు చేతులతో నమస్కరిస్తూ ఆమె వైపు చూస్తూ నిలబడిపోతారు..

ఒక అయిదు నిమిషాల పాటు సాయినాధుడి పాదాల  వద్దే తన తలని ఆనించిన శారద, తన మనసులో ఉన్న బాధంతా తీరిపోయాక మెల్లిగా తల ఎత్తి తేజోమయంతో నిండిపోయి, చిరునవ్వు చిందిస్తూ ఉన్న ఆ సాయినాధుడి ముఖారవిందాన్ని ఎంతో ఆరాధనగా చూస్తూండి పోతుంది..

అది గమనించిన ఆలయ పూజారి విగ్రహం వద్దకు  వచ్చి, పక్కనే ఉన్న హారతి పళ్ళాన్ని
అందుకుని, అందులో హారతి కర్పూరం వేసి వెలిగించి, ఆ సాయినాధుడిని ప్రార్ధిస్తూ హారతి ఇస్తాడు.. ఆ హారతిని ఎంతో భక్తి ప్రపత్తులతో తన కళ్ళకి అద్దుకుంటుంది శారద..

ఇప్పుడు ఆమె మనసు ఎంతో తేలికపడిపోతుంది.. అప్పటి వరకూ మనసులో గూడు కట్టుకుపోయి ఉన్న బాధంతా బయటికి పోతుంది.. ఆమె మనసు ఆ సాయినాధుడిపై ఉన్న భక్తిభావంతో నిండిపోతుంది.. తేలిక పడ్డ ఆమె ముఖాన్ని గమనించి గోపాల్, మూర్తి ఇద్దరూ ఎంతో సంతోషిస్తారు.

పూజారి ఇచ్చిన హారతిని భక్తితో కళ్ళకి అద్దుకుంటారు ఇద్దరూ.. గోపాల్ శారదని చూస్తూ...

''శారదమ్మా.. పండ్లతో నిండి ఉన్న చెట్టుపైకే రాళ్ళు విసురుతారన్నది ఎంత సహజమో, ఆ సాయినాధుడిని నీ మనసునిండా పరుచుకుని భక్తిబావంతో తరించి పోతున్న నీపై కూడా ఇలాంటి నిందలు పడడం అంతే సహజం..ఇక ఈ విషయాలన్నింటినీ మరిచిపోయి, ఆ సాయినాధుడిని సేవించడం కోసం సిద్దం అవ్వు.. ఇక నిన్ను ఈ ఆలయం లోనుండి బయటికి పంపించే శక్తులు ఏవీ లేవు.. సాక్షాత్తూ ఆ సాయినాధుడే నీకు అండగా ఉండగా.. ఇక నీకు ఎవ్వరి నుండీ ఏ హాని ఉండబోదు..'' మనస్పూర్తిగా అంటాడు గోపాల్.. అతని మాటలకి శారద చిన్నగా నవ్వి వినయంగా గోపాల్‌కి నమస్కరిస్తుంది శారద..

మూర్తి కూడా శారద వంక చూస్తూ..

''శారదమ్మా.. నీరాకతో ఈ మందిరం పవిత్రత మరింత పెరిగిపోయింది.. త్వరలోనే సాయినాధుడి వసంతోత్సవాలు ఎంతో అంగరంగ వైభవంగా జరుగబోతున్నాయి.. ఈ వసంతోత్సవంలో నీ పాత్ర చాలానే ఉంటుంది.. అందుకే ఆ సాయినాధుడి, ఆయన సేవ చేసే భాగ్యాన్ని నీకు మళ్లీ కల్పించాడు..'' అంటాడు మూర్తి..

మూర్తి మాటలకి శారద చిన్నగా నవ్వుతుంది..

''గోపాల్ గారూ.. మీరు నాపై చూపిస్తున్న అవ్యాజ్యమైన ఈ అభిమానానికి నేను ఏమిచ్చి మీ ఋణం తీర్చుకోగలను..? ఏ అడ్రస్ లేనిదానిగా వచ్చిన నాకు ఆ సాయినాధుడి దివ్యానుగ్రహం కలగటానికి కారణమైన వారు మీరే.. మీకు నా జీవితాంతం ఋణ పడి ఉంటాను..'' మేనేజర్ గోపాల్‌కి నమస్కరిస్తూ ఎంతోఅభిమానంతో అంటుంది శారద.

''శారదమ్మా.. ఇందులో నా గొప్పతనం ఏమీ లేదు.. అంతా ఆ సాయినాధుడి కృప.. సర్వాంతర్యామి అయిన ఆ సాయినాధుడి అద్భుత లీలలో మనం పాత్రధారులమే కానీ.. మరొకటి కాదు.. ఇంక మీరెలాంటి ఆలోచనలు చేయకుండా.. వెళ్ళి కాస్త విశ్రాంతి తీసుకోండి..'' చిరునవ్వుతో అంటాడు గోపాల్.. అతని మాటలతో తిరిగి ఓసారి సాయినాధుడి విగ్రహానికి నమస్కరిస్తూ ఆ మందిరంలోనుండి తన గదివైపు నడుస్తుంది శారద.. వెళుతున్న ఆమె వంకే చూస్తూండి పోతారు గోపాల్, మూర్తి, పూజారి గారు.

.......................................

ఆలయం లోని కిరీటం రాజారాం మాయం చేయడం, ఆ నిందని శారదపై వేయడం, ఆ తర్వాత శారద గుడి వదిలి వెళ్లటం, కిరీటం కోసం ఆలయంలో కమిటీ చైర్మన్ దగ్గర పంచాయితీ ఏర్పాటు చేయడం, సరిగ్గా శారదని దొంగగా నిర్ధారించే సమయంలో ఓ ముసలి వ్యక్తి ఆలయంలోకి కిరీటాన్ని తీసుకువచ్చి అసలు దొంగని పట్టి ఇవ్వడం.. ఈ విషయం మెల్లి మెల్లిగా ఆ ఆలయం ఉన్న వీధిలో అందరికీ తెలిసిపోయింది.. ఈ సంఘటనని ఓ అద్భుతంగా అందరూ భావించారు.. సాక్షాత్తూ ఆ సాయినాధుడే శారదమ్మని రక్షించడానికి ఆ కిరీటాన్ని తీసుకువచ్చాడని అందరూ, శారదమ్మ నిస్వార్థమైన భక్తికి ఆ సాయినాధుడు ఆమెపై చూపించిన కరుణ అని అందరూ విశ్వసించారు..

దాంతో ఆ ఆలయానికి వచ్చే ప్రతీ భక్తుడు సాయిబాబాని దర్శించుకున్న తర్వాత ఓ సారి శారదని చూడాలని అనుకుంటున్నారు.. క్రమంగా శారదమ్మపై భక్తులలో ఎనలేని విశ్వాసం

ఏర్పడింది.. అంతేకాకుండా ప్రతీ ఆదివారం నాడు ఆమె పిల్లలకి తీసుకుంటున్న ఆధ్యాత్మిక పాఠాల వల్ల కూడా ఆమెపై ఇంకా గౌరవం ఏర్పడేలా చేసాయి.. ఆలయ చైర్మన్ స్వయంగా శారదమ్మ దగ్గరికి వచ్చాడు..

''శారదమ్మ గారూ.. ఇకనుండి మీరు ఎక్కడికీ వెళ్ళాల్సిన పని లేదు.. కిరీటం విషయంలో మీ మనసుని గాయ పరిచే విధంగా మా ఆలయ మెంబర్లు ఎవరైనా ప్రవర్తిస్తే క్షమించండి.. ఆ సాయినాధుడి అద్భుతమయిన లీలా విలాసాన్ని మీ ద్వారా మేము తెలుసుకునే అదృష్టాన్ని కలిగించారు మీరు.. అందుకే ఈ సాయినాధుడి మందిరంలో మీకు ఏ లోటూ రాకుండా చూసుకునే బాధ్యత ఈ ఆలయ కమిటీ చైర్మన్‌గా నాపై ఉన్నది..'' అన్నాడు ఆలయ చైర్మన్ ఎంతో వినయంగా.. ఆయన మాటలకి శారద పొంగిపోలేదు.. పైగా చైర్మన్ గారికి ఎంతో భక్తి శ్రద్ధలతో నమస్కరించింది..

''చైర్మన్ గారూ.. నాపై మీరు కనబరిచిన అపారమైన అభిమానానికి కృతజ్ఞురాలిని.. జరిగిపోయిన సంఘటన గురించి నేనెప్పుడో మరిచిపోయాను.. ఇక నుండి ఆ సాయినాధుడిని సేవ చేస్తూ ఈ ఆలయ బాగోగులలో నావంతు కృషి చేసేందుకు నాకు అవకాశం కల్పించండి.. అది చాలు నాకు..'' అంటుంది వినయంగా..

ఆవిడ మాటలకి ఆలయ చైర్మన్ ఎంతో ఆశ్చర్యపోతాడు.. ఆవిడని భక్తులందరూ వేనోళ్ల పొగుడుతున్నా ఆమెలో అణుమాత్రమైనా అహం చోటు చేసుకోకపోవడం ఆయన ఆశ్చర్యానికి కారణం..

శారదమ్మ యదాతథంగా సాయి సేవలో నిమగ్నమైపోతుంది.. ఉదయాన్నే లేచి సాయి కాగడ హారతికి ముందుగానే మందిరాన్ని శుభ్రం చేయడం, సాయి పూజకి కావలసిన ఏర్పాట్లన్నింటినీ దగ్గరుండి చేయడం, హారతి సమయానికల్లా మందిరానికి వచ్చే పూజారికి ఎక్కువగా పని లేకుండా అన్నీ తానే చూసుకోవడంతో పూజారి ఎంతో ఆశ్చర్యపోతాడు..

శారదమ్మలో ఒక విధమైన ఉత్సాహం, ఆ సాయినాధుడి అండ తనకి ఉందన్న నమ్మకం రెండూ ఉండడంతో ఆమె ఎంతో ఉత్సాహంగా పని చేయడం మొదలుపెడుతుంది..

ఆ రోజు మధ్యాహ్నం గోపాల్ గుళ్ళోకి వస్తాడు.. వచ్చీ రాగానే శారద దగ్గరికి వెళ్తాడు..

''ఏమిటి శారదమ్మా.. రేపటి విశేషాన్ని మరిచిపోలేదు కదా..'' అని అడుగుతాడు గోపాల్.. దాంతో శారదమ్మ ఆశ్చర్యపోతుంది..

''రేపటి విశేషమా.. ఏమిటండీ అదీ..?'' ఆశ్చర్యంగా అంటూంది శారదమ్మా..

''అలా మరిచిపోతే ఎలాగమ్మా.. రేపు ఆదివారం.. పిల్లలకి ఆధ్యాత్మిక పాఠాలు బోధించే బాధ్యత నీదేకదా..'' ఆశ్చర్యంగా అంటాడు గోపాల్.. శారదమ్మ గుర్తుకు వచ్చినట్టుగా ముఖం  పెడుతుంది..

''ఓ.. అదా.. నా చేతిలో ఏముందండీ.. ఆ సాయినాధుడు  ఎలా ఆజ్ఞాపిస్తే నేను అలా చేస్తాను..''

''ఆ సాయినాధుడు ఎప్పుడో నిన్ను ఆజ్ఞాపించేసాడు శారదమ్మా.. రేపు నువ్వు చెప్పబోయే ఆధ్యాత్మిక పాఠాలని వినడానికి పిల్లలతో పాటు, పెద్దవారు కూడా ఎంతో ఆసక్తి కనబరుస్తున్నారు తెలుసా..'' ఎంతో ఆనందంగా అంటాడు గోపాల్..

''పెద్దవాళ్ళు కూడానా..'' ఆశ్చర్యంగా అంటూంది శారద.

''అవును.. పెద్దవాళ్ళు కూడా నీ భోదనలు వినడానికి ఉత్సాహ పడుతున్నారు.. ఈ ఆలయానికి వచ్చే భక్తులలో కొందరు నాకు స్వయంగా ఫోన్ కూడా చేసారు.. శారదమ్మ గారితో ఆధ్యాత్మిక పాఠాలు ఉన్నాయంటే ఆదివారం రోజున మా కుటుంబ సభ్యులందరమూ వస్తామని.. ఇప్పుడు శారదమ్మ అంటే మామూలు పని మనిషి కాదు.. సాక్షాత్తూ ఆ సాయినాధుడికి ఎంతో ప్రీతిపాత్రమైన భక్తురాలు. నీ నోటి నుండి ఏమాట వచ్చినా అది సాయి భక్తులని  ఎంతో ఆనందింప జేస్తుంది...'' నవ్వుతూ అంటాడు గోపాల్..

‘‘అంతా ఆ సాయినాధుడి దయ.. నా చేతిలో ఏముందండీ..! నా వంతు కృషి నేను చేస్తాను..’’ నవ్వుతూ అంటూ తిరిగి తన పనిలో తాను నిమగ్నమయిపోతుంది శారదమ్మ.. తనకి వస్తున్న గుర్తింపుని ఎంతో గొప్పగా తాను చెప్పినా కూడా ఏమాత్రం పట్టించుకోకుండా తన పనేదో తాను చేసుకుంటున్న శారదమ్మని చూసి గోపాల్

ఎంతో ఆశ్చర్యపోతాడు.. ఆమెలో ఉన్న ఆ గొప్పతనానికి మనసులో అభినందిస్తూ అక్కడి నుండి వెళ్ళిపోతాడు.. మరునాడు ఆదివారం.. ఉదయం హారతి నుండే భక్తులు మెల్లిగా రావడం ప్రారంభించారు.. శారదమ్మ తన దైనందిన సాయినాధుడి పనులో బిజీగా ఉండిపోయింది.. తొమ్మిది గంటలకి ఆధ్యాత్మిక పాఠాలు ప్రారంభించాల్సి ఉండడంతో ఇంకా చాలా సమయం ఉన్నందున శారదమ్మ తన పని తాను చేసుకుంటూ ఉంటూంది.. సాయిబాబా మందిరానికి పక్కనే ఉన్న భజన మందిరం ఎనిమిదిన్నర కల్లా భక్తులతో నిండిపోతూంది..

పిల్లలూ పెద్దవారు వచ్చి అక్కడ కూర్చుంటారు.. ఆధ్యాత్మిక బోధనలకు మరొక అరగంట సమయం ఉన్నందున ఆ ఆలయ కమిటీ మెంబర్ ఒకతను సాయి భజన ప్రారంభిస్తాడు.. ఆయన భజన చేస్తూంటే మిగతా వారందరూ ఎంతో భక్తి శ్రద్ధలతో భజన చేయడం ప్రారంభిస్తారు..

సరిగ్గా తొమ్మిది గంటలకు మేనేజర్ గోపాల్, మూర్తి ఇద్దరూ ఆలయం లోకి వస్తారు.. భజన మందిరం నిండా ఉన్న భక్తులని చూసి వారు ఎంతగానో ఆశ్చర్యపోతారు.. శారదమ్మ చెప్పే భోదనలు వినడానికి ఆ భక్తులు ఎంత ఉత్సుకతతో ఉన్నారో గమనించిన గోపాల్, మూర్తి ఆనందంగా నవ్వుకుంటారు..

సమయం కావడంతో అందరూ శారదమ్మ కోసం ఎదురు చూస్తూంటారు. శారదమ్మ సాయిబాబా విగ్రహందగ్గరకు వచ్చి ఆ సాయినాధుడిని మనసారా ప్రార్ధించి మెల్లిగా భజన మందిరంలోకి ప్రవేశిస్తుంది.. అక్కడ గుమిగూడిన వారిని చూసిన శారదకి మొదట్లో కాస్త

బెరుకుగా అనిపించినప్పటికీ ఆ సాయినాధుడిని మనసులో స్మరిస్తూ మెల్లిగా పెదవి విప్పుతుంది..

''ఓం సాయి.. శ్రీ సాయి.. జయ జయ సాయి.. అందరికీ నమస్కారం.. '' అంటూ శారదమ్మ తన బోధన ప్రారంభిస్తుంది.. ఆమెకి ముందు వరసలో ఉన్న పిల్లలందరూ ఆమె చెబుతున్న పాఠాలని ఎంతో శ్రద్ధతో వింటుంటారు...

పిల్లల నుండి పెద్ద వారికి సైతం అర్థమయ్యే విధంగా దాదాపు గంటన్నర సేపు ఏకధాటిగా ఆమె చేసిన ప్రసంగం అక్కడున్న వారందరినీ ఎంతో ఆకట్టుకుంటుంది.. ఆ సాయినాధుడి గురించిన విశేషాలతో పాటు, భక్తి, ఆధ్యాత్మికత, పిల్లలో ఉండాల్సిన మంచి గుణాలు, పిల్లలలో మంచి గుణాలు రావడానికి తల్లిదండ్రులు తీసుకోవాల్సిన జాగర్తలు, పిల్లలలో చిన్నతనం నుండి భక్తిభావాన్ని ఎలా పెంపొందింప జేయాలి తదితర అంశాలో ఏకధాటిగా ఆమె ప్రసంగించిన తీరు అక్కడున్న వారందరినే కాకుండా గోపాల్, మూర్తిలకి సైతం ఎంతో అబ్బురపరుస్తుంది..

ముఖ్యంగా.. ప్రస్తుతం సమాజంలో విద్యా బోధనలు ఎలా సాగుతున్నాయి, యాంత్రికమైన ఈ జీవనంలో తల్లి తండ్రులు పిల్లల పెంపకం విషయంలో ఎలాంటి శ్రద్ధ తీసుకోవాలి అన్న విషయాలతో ఆమె చేసిన ప్రసంగం పెద్దవారిని విపరీతంగా ఆకట్టుకుంటుంది.. ఆమె ప్రసంగం పూర్తి కాగానే ఆ హాలంతా చప్పట్లతో మారుమ్రోగి పోతుంది..

వారి నుండి వచ్చిన విశేష స్పందనకి గోపాల్, మూర్తి ఎంతో ఆశ్చర్యపోతారు.. ఆధ్యాత్మిక పాఠాలు ముగిసిన తర్వాత కూడా చాలా మంది శారదమ్మ దగ్గరకు వచ్చి తమకున్న కొన్ని అనుమానాలని నివృత్తి చేసుకోవడం, ఆ భక్తులు శారదమ్మపై చూపిస్తున్న గౌరవ మర్యాదలు గమనించిన గోపాల్, మూర్తి లు ఎంతో పొంగిపోతారు..

''గోపాల్ గారూ.. మీ లక్ష్యం నెరవేరింది.. పిల్లలలో ఆధ్యాత్మికత పెంపొందించాలన్న సంకల్పం తో మీరు మొదలు పెట్టిన ఈ కార్యక్రమంలో శారదమ్మ పాలుపంచుకోవటంతో ఈ కార్యక్రమానికే నిండుదనం వచ్చేసింది..''

మూర్తి సంతోషంతో అంటాడు..

''అవును మూర్తి గారూ.. భక్తుల నుండి ఇంత పెద్ద స్థాయిలో స్పందన వస్తుందని నేను కలలో కూడా అనుకోలేదు.. శారదమ్మ ఏదో అద్భుతాన్ని చేసింది.. ఆమెలో ఏదో శక్తి ఉందండీ.. ఆ సాయినాధుడి దివ్యాశీస్సులతో పాటు ఆమెలోని పరిజ్ఞానం ఇలా పనికి వస్తోంది.. '' శారదమ్మనే చూస్తూ అంటాడు గోపాల్..

ఒక అరగంట వరకూ ఆ ప్రాంగణం అంతా హడావిడిగా మారిపోయింది.. అరగంట తర్వాత మెల్లి మెల్లిగా భక్తులందరూ గుళ్ళోనుండి వెళ్ళిపోవడంతో చివరికి గుళ్ళో, శారదమ్మ, మేనేజర్ గోపాల్, మూర్తి మిగులుతారు.. గోపాల్ శారదమ్మ దగ్గరికి వస్తాడు..

''శారదమ్మా.. నువ్వు ఈ రోజు ఈ గుళ్ళో ఓ అద్భుతాన్ని చూపించావు.. గురువారం రోజున మాత్రమే ఈగుడిని దర్శించేందుకు వచ్చే చాలా మంది భక్తులు ఈరోజు ఆదివారం అయినప్పటికీ ఎంతో ప్రత్యేకంగా నీ బోధనలు వినడానికి వచ్చారంటే.. నీలో ఉన్న శక్తి ఏమిటో అర్ధమవుతుంది.. నిజంగా నీకు జోహార్లు చెప్పకుండా ఉండలేక పోతున్నాను..'' మనస్ఫూర్తిగా అంటాడు గోపాల్..

గోపాల్ మాటలకి శారద చిన్నగా నవ్వుతుంది..

''ఇందులో నా గొప్పతనం ఏమీ లేదండీ.. అంతా ఆ సాయినాధుడి అనుగ్రహమే తప్ప నాకు నేనుగా చేసింది ఏమీ లేదు.. ఆ సాయినాధుడు తన భక్తులకి నా ద్వారా ఏవో కొన్ని సందేశాలని చేరవేయాలని సంకల్పించి నట్లున్నాడు.. ఆయన భక్తులకు చేరవేయాలన్న సందేశాని నేను బయటికి చెబుతున్నానంతే..'' చిరునవ్వుతో అంటూ శారద అక్కడి నుండి వెళ్ళిపోతుంది.

గోపాల్, మూర్తి ఇద్దరూ ఆమె మాటలకి  ఎంతో ఆశ్చర్యపోతారు..

ఆరోజు సాయంత్రం ఆలయ కమిటీ చైర్మన్ గుడికి వస్తాడు.. మేనేజర్ గోపాల్, మూర్తి, మరి కొందరు ఆలయ కమిటీ మెంబర్లు కూడా వస్తారు.. వారంతా సాయి మందిరంలోని ఓ గదిలో సమావేశం అవుతారు..

ఆలయ చైర్మన్ వారందరి వంక ఓసారి చూస్తూ..

''ఈ ఆలయ  పదవ వార్షికోత్సవం కార్యక్రమానికి ఇంకా పది రోజులు  మాత్రమే సమయం ఉంది.. ఈ పది రోజుల్లో చేయవలసిన ఎన్నో పనులు ఉన్నాయి.. ఈ పనులన్నింటినీ మనమందరం కలిసి చేస్తేనే పది రోజుల్లో పూర్తి చేయవచ్చు.. లేదంటే అప్పటికి పనులు పూర్తి చేయడం కష్టం..'' అంటాడు ఆలయ  చైర్మన్..

''మీరన్నది నిజమేనండీ.. ఇప్పటి నుండి పనులు మొదలు పెడితేనే అప్పటికి గానీ పూర్తి కావు. చెప్పండి.. ఎవరెవరము ఏఏ పనులు  చేయాలో మీరే సెలవిస్తే.. తమరి ఆదేశాల  ప్రకారం మేము ఆ పనులలో ఉండిపోతాం..''

ఓ ఆలయ కమిటీ మెంబర్ అన్నాడు..

''ఆ పనుల పట్టిక అంతా గోపాల్ గారి దగ్గరున్నది.. ఆయన దగ్గరున్న ఆ పనుల లిస్టుని మీరంతా పరిశీలించి ఆ పనులలో ఎవరెవరు ఏఏ పని చేయడానికి అనుకూలంగా ఉంటుందో ఆయా పనులని తీసుకోండి..

నిర్దేశించిన సమయానికన్నా ముందుగానే ఆ పనులు పూర్తయ్యేలా బాధ్యత తీసుకోండి.. '' అన్నాడు చైర్మన్..

దాంతో కమిటీ మెంబర్లందరూ గోపాల్ వంక చూస్తారు.. గోపాల్ ఓ చిన్న బ్యాగ్‌లో నుండి ఓ పేపర్‌ని బయటికి తీస్తాడు.. అందులో వ్రాసి పెట్టి ఉన్న పనులన్నింటినీ బయటికి గట్టిగా

చదివి వినిపిస్తాడు.. అందులో ఎవరెవరికి ఏ పని చేయడానికి అనుకూలమైనదో ఆపనులు చేస్తామని అందరూ తలా ఒక పనిని తీసేసుకుంటారు..

''గోపాల్ గారూ.. వీరందరికీ పనులు  పురమాయించడం వరకు మాత్రమే నా బాధ్యత.. ఆ పనులు ఎంతవరకు వచ్చాయి అన్నది చూసుకోవాల్సిన బాధ్యత మీదే..'' గోపాల్‌ని చూస్తూ అంటాడు చైర్మన్..

"తప్పకుండా చైర్మన్ గారు... " అంటాడు గోపాల్.

''అన్నట్లు మరో ముఖ్య విషయం చెప్పడం మరిచిపోయాను..'' అంటూ అందరి వైపు చూస్తాడు ఆలయ చైర్మన్.. ఆయన ఏం చెప్పబోతున్నాడా అన్న ఆదుర్దా గోపాల్‌తో సహా అక్కడున్న వారందరిలో కనిపిస్తుంటుంది..

''ఈ ఆలయాన్ని కట్టించినప్పుడు సహకరించిన దాతలందరూ ఈ కార్యక్రమానికి విచ్చేస్తున్నారు.. ప్రధానంగా ఈ ఆలయ గర్భగుడితో పాటు సాయిబాబా పాలరాయి విగ్రహాన్ని సమకూర్చిన ఆనంద్ స్వరూప్ గారు అమెరికా నుండి ప్రత్యేకంగా ఈ కార్యక్రమం కోసం విచ్చేస్తున్నారు.. ఈ వార్షికోత్సవానికి అయ్యే ఖర్చుని కూడా వారే భరిస్తానని చెప్పారు.. కాబట్టి ఆయన వచ్చాక ఆయన ముందు మన పనులలో ఎలాంటి పొరపాట్లు జరగకుండా చూసుకోవాలి..''

శారదమ్మ మనసంతా ఎంతో ఆనందంతో నిండిపోయింది.. గ్రహణం వీడిన తర్వాత ఎంత స్వచ్ఛంగా సూర్యుడు కనిపిస్తాడో అలా ఉంది శారదమ్మ ముఖం .. సాయినాధుడిని సేవించడమే కాకుండా, భక్తులకి తనకున్న పరిజ్ఞానం మేరకు ఆధ్యాత్మిక బోధనలు కూడా చేయటం,  దానికి  భక్తులనుండి విశేషమైన  స్పందన  రావడంతో శారదమ్మ ప్రత్యేకంగా  ఆ సాయినాదుడికి సంబందించిన కొన్ని పురాణ గ్రంధాలను, అలాగే  భగవద్గీత, భాగవతము, రామాయణము లాంటి పవిత్ర గ్రంధాలను  తెప్పించుకుంది.. రోజూ సాయిని సేవించిన తర్వాత ఏమాత్రం తీరిక దొరికినా ఆ గ్రంధాలని పఠించడంలో నిమగ్నమైపోతుంది

శారదమ్మ.. ఆమె చర్యని గమనించిన మేనేజర్ గోపాల్, ఆ మందిరంలో శారదమ్మకి తోడుగా మరొక మహిళని పనికి కుదిర్చాడు..

''శారదమ్మా.. ఒక్కదానివే ఇంతలా కష్టపడుతుంటే చూడలేకపోతున్నాను.. పైగా ఇప్పుడు నీపై బోధన బాధ్యత కూడా ఉండడంతో నీకు సహాయం చేయడానికి మరొకరు కావాలని నేననుకున్నాను.. అందుకే ఇదిగో ఈవిడ పేరు అనసూయ.. ఇకనుండి నీకు సహాయపడుతుంది.. ఉదయాన్నే వచ్చి గుళ్ళో ఉన్న పనులన్నింటినీ చక్కబెట్టి, మధ్యాహ్న హారతి తర్వాత వెళుతుంది.. మళ్ళీ సాయంత్రం వచ్చి ఓ రెండు గంటలకు  నీకు సహాయంగా ఉండి వెళుతుంది.. ఇక నుండి గుళ్ళో ఉన్న చిన్న చిన్న పనులు ఏవైనా ఉంటే అనసూయతో చేయించుకునే బాధ్యత నీది..'' అని గోపాల్ శారదమ్మకి అనసూయని పరిచయం చేస్తాడు..

అనసూయ వయసు దాదాపు యాభై సంవత్సరాలు ఉంటుంది.. ఆమె ముఖం  చూడగానే ఆవిడలో ఎలాంటి కల్మషం లేనిదని ఇట్టే గ్రహించింది శారద.. అనసూయని చూస్తూ చిన్నగా నవ్వి గోపాల్ వంక చూస్తూంది..

''ధన్యవాదము గోపాల్ గారూ.. నాకు మరొకరిని సహాయంగా నియమించడం నాకెంతో సంతోషంగా ఉంది.. ఆ వార్షికోత్సవములో సాయినాధుడి మందిరాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దడానికి నావంతు సహకారాన్ని నేనందిస్తాను.. ఈ అనసూయమ్మ కూడా నాకు తోడుగా ఉంటే.. ఇంక నాకు కావాల్సింది ఏముంటుంది..? నవ్వుతూ అంది శారద..

గోపాల్ కూడా చిన్నగా నవ్వుతూ అక్కడి నుండి వెళ్ళిపోతాడు..

ఆరోజు సాయంత్రం మూర్తి గుళ్ళోకి వస్తాడు.. నేరుగా శారదమ్మ దగ్గరికి వెళ్తాడు.. అప్పుడు శారదమ్మ సాయినాధుడికి ఆ మరునాడు అలంకరించే పట్టు వస్త్రాన్ని శుభ్రం చేస్తూ కనిపిస్తుంది..

''శారదమ్మా.. మీరు నాకో సహాయం చేసి పెట్టాలి..'' నవ్వుతూ అంటాడు మూర్తి..

అతని మాటలకి శారదమ్మ ఎంతో ఆశ్చర్యపోతుంది..

''ఏమిటండీ ఆ సహాయం..?'' ఆశ్చర్యంగా అడుగుతుంది శారదమ్మ..

''హూ.. ఏం చెప్పమంటావు శారదమ్మా.. గుడి వసంతోత్సవానికి ఇంకా పదిరోజులున్నప్పటికీ ఇదిగో ఇప్పటి నుండే పనులు మొదలు పెట్టారు.. నాపై కూడా మోయలేనన్ని పనులు వేసేసి, ఆ పనులు పూర్తి కావడానికి సమయాన్ని కూడా డిసైడ్ చేసేసారు.. ఆ సమయంలోపే పనులన్నింటినీ పూర్తి చేసే బాధ్యత నాది.. అందుకే..

ఇప్పటి నుండే ఒక్కో పనిని ముందేసుకుని వాటిని పూర్తి చేసే పనిలో పడిపోయాను..'' గబ గబా చెప్పేసి కాస్త ఊపిరి పీల్చు కోవడానికి ఆగిపోతాడు మూర్తి.. అతని మాటలకి శారదమ్మ చిన్నగా నవ్వుతుంది..

''మోయలేనన్ని పనులు ఎందుకు నెత్తినేసుకున్నారండీ.. కొన్ని పనులు మరొకరికి అప్పగించేయవచ్చు కదా..'' నవ్వుతూ అంది శారదమ్మా..

''ఆ వెసులు బాటు నాకు కల్పించారు లెండి.. ఎంత మంది సహాయాన్నైనా తీసుకోమన్నారు.. కానీ..

అనుకున్న సమయానికి మాత్రం పని పూర్తి చేయాల్సిన బాధ్యతని మాత్రం మరువకూడదని ఆలయ చైర్మన్ గారు హుకుం జారీ చేశారు..''ఎట్టి పరిస్థితులలో

''ఇంతకీ.. నేను మీకేవిధంగా సహాయం చేయగలనో చెప్పారు కాదు..'' నవ్వుతూ అంది శారద..

''అక్కడికే వస్తున్నాను శారదమ్మా.. నువ్వు నాకు ఓ సహాయం చేయాలి.. అంటే సహాయం కాస్త పెద్దదే.. కానీ నువ్వే ఈ పనిని సరిగ్గా నిర్వహిస్తావని నీకు అప్పజెపుతున్నాను..'' నవ్వుతూ అంటాడు మూర్తి..

''ఆ పనిని నేనే చేస్తానని మీరు అంతగా నమ్మకంగా ఉన్నారంటే.. నేను కాదని ఎలా చెబుతానండీ.. మీరు చేసినా, నేను చేసినా మనందరం చేసే ఆ సాయినాధుడి సేవే కదా..

ఫర్వాలేదు చెప్పండి. . ఎలాంటి పనినైనా  చేయడానికి సిద్దంగా ఉన్నాను..'' నవ్వుతూ అంటూంది శారదమ్మ..''అందుకే నువ్వంటే నాకెంతో అభిమానం శారదమ్మా.. పని అంటే ఏమాత్రం భయపడకుండా.. ఎన్ని పనులు చెప్పినా ఇట్టే చేస్తావు కదా..'' శారదమ్మని పొగుడుతాడు మూర్తి..

''పొగడ్తలాపి ఆ పనేంటో చెప్పండి మూర్తి గారూ..'' సుతారంగా అతని మాటకి అడ్డు వస్తుంది శారదమ్మ..

''మీరు చేయవసిందేమిటంటే..! ఇదిగోండి.. ఇది మన ఆలయం మ్యాపు..'' మూర్తి తన హ్యాండ్ బ్యాగ్‌లోనుండి ఓ పెద్ద పేపర్‌ని తీసి శారద ముందు ఉన్న ఓ టేబుల్‌పై పరుస్తాడు..

ఉండ చుట్టినట్టు చుట్టి ఉన్న ఆ కాగితాన్ని పూర్తిగా తెరిచి శారద వంక చూస్తాడు మూర్తి..

''శారదమ్మ.. ఇది మన గుడికి సంబంధించిన పూర్తి మ్యాప్.. ఈ మ్యాప్ ఆధారంగా రంగు, రంగు లైట్లని ఎక్కడెక్కడ, ఎలాంటి డిజైన్ తో అలంకరిస్తే బావుంటుందన్నది మీరు నిర్ణయించాలి.. మరో గంటలో ఎలక్ట్రీషియన్ ఇక్కడికి వస్తున్నాడు.. అతని దగ్గర ఉన్న లైట్ల వివరాలు, ఎన్ని రంగు లైట్లు అందుబాటులో ఉన్నాయన్న విషయాలన్నింటిని మనకు చెబుతాడు.. అతను చెప్పిన వివరాల ఆధారంగా.. ఈ గుడి చుట్టూ, అలాగే గోపురం పైన, గుడి ముందు భాగంలో ఎలాంటి లైట్లు వేస్తే బావుంటుందన్నది నిర్ణయించాల్సిన బాధ్యతని మీమీద పెడుతున్నాను..

మీరు ఏ డిజైన్ అని చెబితే ఆ డిజైన్‌ని ఎలక్ట్రీషియన్ ఏర్పాటు చేస్తాడు.. '' నవ్వుతూ అంటాడు మూర్తి..

శారద కాసేపు ఆలోచిస్తుంది..

''అంత పెద్ద బాధ్యతని నేను నిర్వర్తించగలనా.. అయినా కలర్ కాంబినేషన్ నాకేం తెలుస్తుందండీ..'' కాస్త భయపడుతున్నట్టుగా అంటుంది శారద..

''అయ్యో.. మీరు అలా అనకూడదమ్మా.. మీ శక్తి గురించి మీకంటే మాకే బాగా తెలుసు .. మీరు కాస్త శ్రద్ధ పెట్టి ఆలోచిస్తే.. చిటికెలో మీరు ఈ పనిని చేసేయగలరు.. మీరింకేమీ ఆలోచించకండీ.. మరో గంటలో ఎలక్ట్రీషియన్ వస్తున్నాడు.. అతనికి నేను మిమ్మల్ని కలవమని చెబుతాను.. ఈ పని పూర్తి చేసే బాధ్యత మీదే..'' శారద ఏదో అనబోతున్నా.. ఆమె మాటని వినిపించుకోకుండా అక్కడి నుండి వెళ్ళిపోతాడు  మూర్తి..

అతను వెళ్లిన వంకే కొద్దిసేపు చూసి ఆ తర్వాత ఆ కాగితం వంక దీక్షగా చూస్తుంది శారద. ఆ కాగితం పై ఉన్న గుడి మ్యాపు ఆధారంగా కలర్ లైట్స్ ఎలా అమర్చాలా అన్న ఆలోచన అప్పటికే మొదలైంది ఆమెలో.. ఓ పది నిమిషాల సేపు ఆ పేపర్ వంకే చూసి చివరికి తన మనసులో ఒక డిజైన్‌ని అనుకుంటుంది శారదమ్మ..

ఆ మరునాడు ఉదయమే గోపాల్ ఆలయానికి వస్తాడు.. ఆలయానికి పెయింట్ వేసే విషయమై పనివారితో మాట్లాడుతాడు.. ఆ పనివారికి ఏవో సూచనలు  చేసాక ఆలయం ఆవరణలో ఏదో పనులు  చేసుకుంటున్న శారదమ్మని పిలుస్తాడు..''శారదమ్మా.. నువ్వేం చేస్తావో నాకు తెలియదు.. ఈ పని మాత్రం నీకే అప్పజెప్పేస్తున్నాను.. దగ్గరుండి మరీ చేయించాల్సిన బాధ్యత నీదే..'' అంటాడు గోపాల్..

గోపాల్ మాటలకి శారద ఎంతో ఆశ్చర్యపోతుంది..

''ఏమిటండీ ఆ పని..?''

''అదేమిటి శారదమ్మా.. ఈ పనివారిని చూస్తూంటే అర్థం కావటం లేదా..? ఈ ఆలయ ప్రాకారాలన్నింటికి రంగు రంగుల పాయింట్స్ వేయించాలని ఆలయ కమిటీ నిర్ణయించింది.. ఈ పెయింట్ వేసే వారే వీళ్ళు.. వీరితో అన్ని గోడలకి పెయింట్‌ని అందంగా వేయించే బాధ్యత నీదే.. వీరు పెయింట్ వేస్తుండగా నీవు దగ్గరుండి  మరీ మంచిగా వేయించాలి..'' గోపాల్ శారదమ్మకి హుకుం జారీ చేస్తున్నట్టుగా అనేసి, ఆ తర్వాత చిన్నగా నవ్వుతాడు..

''అలాగే నండీ..'' అంటుంది శారదమ్మ నవ్వుతూనే..

''ఇంతకీ అనసూయ ఎలా పని చేస్తుంది.. నీకు ఆవిడ బాగానే సహకరిస్తుంది కదా..?'' అంటాడు గోపాల్..

''అయ్యో.. పాపం ఆవిడ నేనేం చెప్పినా క్షణాల్లో చేసేస్తుంది.. నాకు ఒక మంచి సహాయకురాలిని ఇచ్చినందుకు మరొక్కసారి మీకు ధన్యవాదములు  చెబుతున్నాను..'' వారలా మాట్లాడుకుంటుండగానే ఆ ఆలయ చైర్మన్ మందిరంలోకి ప్రవేశిస్తాడు..

అతన్ని చూడగానే గోపాల్ చిరునవ్వు నవ్వుతూ అతనికి ఎదురుగా వెళ్తాడు..

''రండి చైర్మన్ గారూ.. రండి..'' సాదరంగా ఆహ్వానిస్తాడు గోపాల్.. గోపాల్‌ని చూసి చైర్మన్ చిరునవ్వు చిందిస్తూ పక్కనే ఉన్న కుళాయి దగ్గర కాళ్లు,చేతులు శుభ్రం చేసుకుని మందిరంలోకి నడుస్తాడు.. సాయినాధుడి విగ్రహాన్ని దర్శించి, ప్రణామాలు చేసాక తిరిగి బయటికి వస్తాడు..

''ఊ.. ఇప్పుడు చెప్పండి.. పనులు  ఎలా సాగుతున్నాయి..'' గోపాల్‌ని ప్రశ్నిస్తాడు చైర్మన్..

''అన్నీ మనం అనుకున్న ప్రకారంగానే సాగుతున్నాయండీ.. ప్రస్తుతానికైతే పనులు అందరికీ పంచే కార్యక్రమం అయితే దిగ్విజయంగా పూర్తి చేసాము.. మరి.. అనుకున్న సమయానికి ఆ పనులు పూర్తవుతాయా.. అన్నది చూడాలి..''

అంటాడు గోపాల్..

''మీరే అలా అంటే ఎలా గోపాల్ గారూ.. పనులన్నీ మనం అనుకున్న సమయానికి పూర్తి కావాల్సిందే.. ఆ బాధ్యతని పూర్తిగా మీపైనే పెడుతున్నాను నేను.. అనుకున్న సమయానికి పనులు  కాకపోతే.. ఆ తర్వాత జరగ వలసిన కార్యక్రమాలన్నీ డిస్టర్బ్ అయిపోతాయి..'' కాస్త సీరియస్‌గా అంటాడు చైర్మన్..''అయ్యో.. తమరు అంతలా చెప్పాక నేను ఊరికే ఉంటానా..? తప్పకుండా పనులు  పూర్తయ్యేలా చూస్తాను..''

నమ్మకంగా అంటాడు గోపాల్..

''అన్నట్టు.. ఆ శారదమ్మ గురించి వాకబు చేయడానికి నేనిప్పుడు వచ్చాను..'' సడన్‌గా చైర్మన్ శారదని అడిగే సరికి మేనేజర్ గోపాల్ విస్మయానికి గురౌతాడు.. ఎప్పుడూ శారదమ్మ గురించి అసలు పట్టించుకోని చైర్మన్ ఈరోజు ప్రత్యేకంగా వాకబు చేయడం ఏమిటా..? అన్న ఆశ్చర్యం అతనిలో కలిగింది.. ఆశ్చర్యంగా తనవంకే చూస్తున్న గోపాల్ వంక చూస్తాడు చైర్మన్.

''గోపాల్ గారూ.. ఒక సారి ఆ శారదమ్మని ఇలా పిలవండి... ఆమెతో కాస్త మాట్లాడాలి..''అంటాడు చైర్మన్.. దాంతో మరింత ఆశ్చర్యపోతాడు గోపాల్.. శారదమ్మతో చైర్మన్ మాట్లాడటమా..? కొంపదీసి మళ్లీ ఆ కిరీటం తాలూకు ఏమైనా అనుమానాలు తలెత్తాయా..? ఉన్నఫళంగా చైర్మన్ గారు శారద గురించి అడగగానే గోపాల్‌లో రకరకాల ప్రశ్నలు తలెత్తాయి..

''గోపాల్ గారూ.. మీకే చెబుతున్నాను.. ఒకసారి శారదమ్మకి కబురంపండి.. ఆవిడతో మాట్లాడాలి..''

గోపాల్ మౌనం వహించడంతో మళ్లీ అన్నాడు చైర్మన్.. ఆయన మాటలకి ఉలిక్కిపడ్డ గోపాల్..

''ఆ..ఆ.. ఇప్పుడే పిలిపిస్తానండీ..'' అంటూ ఆ పక్కనే ఉన్న ఓ వ్యక్తితో శారదమ్మకి కబురంపాడు గోపాల్..

అయిదు నిమిషాల తర్వాత శారదమ్మ వారి వద్దకు వచ్చింది.. చైర్మన్ తనని పిలిచాడని చెప్పడంతో శారదమ్మ కూడా చాలా షాక్‌కి గురవుతుంది.. చైర్మన్‌కి తనతో పని ఏముంది అన్న ఆలోచన ఆమె మనసులో అలజడి రేపుతుంది.. ఇప్పుడిప్పుడే కిరీటం దొంగతనం విషయం మరిచి పోయి, తిరిగి సాయి సేవలో నిమగ్నమైపోయిన తనకి మళ్లీ ఏదైనా పరీక్ష ఎదురవనుందా.. అన్న ఆందోళన ఆమెలో కలిగింది..

కాస్త భయపడుతూనే చైర్మన్ దగ్గరికి వచ్చింది శారద.. ఆమె చైర్మన్ పక్కనే ఉన్న గోపాల్ వైపు చూస్తుంది..

అలయ 'చైర్మన్ గారు తనని ఎందుకు పిలిచారు..?' అని కళ్ళతోనే ప్రశ్నిస్తుంది గోపాల్‌ని శారదమ్మ.. తనకి కూడా ఏమీ తెలియదన్నట్టుగా తలని అటూ ఇటూ ఊపుతాడు గోపాల్.. శారద, గోపాల్ ఇద్దరిలోనూ ఒక విధమైన టెన్షన్ పట్టుకుంటుంది..

శారద తన ఎదురుగా నిలబడగానే.. ఆలయ చైర్మన్  శారదని చూసి చిన్నగా నవ్వుతాడు..

''శారదమ్మా.. బాగున్నారా..?'' ఆప్యాయంగా అడుగుతాడు ఆలయ చైర్మన్..అతని మాటలకి శారదతో పాటు గోపాల్ కూడా ఎంతో ఆశ్చర్యపోతాడు.. ఒక పనావిడని చైర్మన్ అంత గౌరవంగా సంభోధించడం, ప్రత్యేకంగా పిలిపించుకుని మరీ మాట్లాడటం.. ఇద్దరికీ ఎంతో ఆశ్చర్యం కలిగిస్తుంది..

అసంకల్పితంగానే.. 'బాగున్నాను' అనే అర్థం వచ్చేలా తలూపుతుంది శారద..

ఆలయ చైర్మన్ శారదని చూస్తూ చిరునవ్వుతో అంటాడు..

''శారదమ్మ గారూ.. కిరీటం విషయంలో మీకు జరిగిన అవమానానికి నేను చాలా విచారిస్తున్నాను.. నిజం చెప్పాలంటే .. అసలు  మీరెవరో తెలుసుకోవాల్సిన అవసరం నాకు లేదు.. కానీ.. కిరీటం మాయం అయిపోయిన విషయంతో మీరు నా దృష్టికి వచ్చారు.. అదే కిరీటం ఎవ్వరూ ఊహించని విధంగా దొరికిపోవడంతో, ఈ ఆలయ ఫౌండర్, అమెరికాలో స్థిరపడ్డ ఎన్నారై ఆనంద్ స్వరూప్ దృష్టికి కూడా మీరు వచ్చారు.. కిరీటం రాజారాం కాజేయడం, ఆ నెపాన్ని మీపై తోయడం, ఆ తర్వాత మీరు గుళ్ళోనుండి వెళ్ళిపోవడం, ఓ అద్భుత అవతార మూర్తి కిరీటాన్ని గుళ్ళోకి చేర్చటం, ఆ తర్వాత మీరు మళ్ళీ ఈ గుళ్ళోకి రావటం.. అంతా ఈ గుడి ఫౌండర్ అయిన ఆనంద్ స్వరూప్ గారికి తెలిసిపోయింది.. ఆయన నాకు ఫోన్ చేసి ప్రత్యేకంగా మీ గురించి వాకబు చేసారు.. ఈ వసంతోత్సవానికి

ఆయన  ఇండియాకి  వస్తున్నారు..  మీకు ప్రత్యేకంగా అభినందనలు తెలుపమని నన్ను పురమాయించారు.. అందుకే నేను ఇప్పుడు మీ వద్దకు వచ్చాను..''

ఆలయ చైర్మన్ మాటలకి గోపాల్ ఎంతో ఆనందపడిపోతాడు.. శారదమ్మ గురించి అమెరికాలో ఉన్న ఆనంద్ స్వరూప్‌కి కూడా తెలిసిపోయిందన్న విషయం ఆయనకి ఎంతో విస్మయానికి గురిచేసింది. సాయిబాబా గుడి ప్రారంభం అయిన దగ్గర నుండీ గోపాల్ మేనేజర్‌గా వ్యవహరిస్తున్నాడు.. ఈ కాలంలో ఒకే ఒక్కసారి మాత్రమే గోపాల్ ఆనందస్వరూప్ గారిని చూడడం జరిగింది.. అంతే తప్ప ఆయనతో గోపాల్‌కి పెద్దగా పరిచయం లేదు.. ఆనంద్ స్వరూప్ అడపా దడపా ఆలయ చైర్మన్‌కి ఫోన్ చేస్తూంటాడు.. సాయిబాబా గుడి గురించి ఆరా తీస్తుంటాడు.

అయితే మొదటి సారి గుళ్ళో పనిచేసే ఓ మహిళ గురించి ఆయన అడగడం, ఆ విషయాన్ని స్వయంగా ఆలయ చైర్మన్ వచ్చి శారదమ్మకి చెప్పడంతో, శారదమ్మ పేరు అమెరికా వరకూ వ్యాపించడం గోపాల్ ఆనందానికి కారణం అయ్యింది..

అయితే శారదమ్మ  మాత్రం ఎంతో ఆశ్చర్యపోయింది.. ఆనందస్వరూప్ ఎవరో ఆమెకి తెలియకపోయినా తన గురించి ఆయన వాకబు చేసాడని చైర్మన్ చెప్పడంతో ఎలా స్పందించాలో అర్థం కాక, ఓ చిరునవ్వు నవ్వి మౌనంగా నిలబడి పోయింది..

తిరిగి ఆలయ చైర్మనే శారదని చూస్తూ అంటాడు..

''శారదమ్మా.. ఆ సాయినాధుడి ఆదేశం లేనిది ఏదీ జరగదు.. గుడి కట్టి పదేళ్ళు అయిన సందర్భంగా ఆయన తన ఉనికిని చాటుకోవడం కోసమే ఆలయంలో కిరీటం మాయం అయ్యేలా సంకల్పించాడు.. దీని వల్ల మాకు రెండు విషయాలు  బోధపడ్డాయి.. ఒకటి ఈ గుడిలో ఆ సాయినాధుడు నిజంగా కొలువై ఉన్నాడని, రోజు ఆలయానికి వచ్చే భక్తులకు తన ఆశీర్వాదాలని అందిస్తున్నాడని, ఇక రెండవది, ఆ సాయినాధుడు తన భక్తులకు ఏదైనా ఆపద ఎదురైతే సాక్షాత్తూ తానే స్వయంగా ఆ ఆపదని తొలగించడానికి వస్తాడని.. ఈ రెండు

విషయాలు  మాకు బోధపడేలా చేసింది నువ్వే శారదమ్మా.. అందుకే నీకు ప్రత్యేకంగా అభినందనలు  తెలియజేసాడు ఈ ఆలయ ఫౌండర్ ఆనందస్వరూప్ గారు..'' చైర్మన్ ముఖం లో ఎంతో ఆనందం కనిపిస్తుంటుంది..

ఆ మాటలకి కూడా శారదమ్మ మౌనమే సమాధానమవుతుంది..

''చైర్మన్ గారూ  .. శారదమ్మ ద్వారా ఆ సాయినాధుడు భక్తులకు ఎంతో మేలు చేయడానికి సంకల్పించాడు..

అందుకే ఎన్ని అవాంతరాలు  ఎదురైనా తిరిగి శారదమ్మ ఈ గుడికి వచ్చేలా చేసాడు..'' అన్నాడు గోపాల్..

''మీరన్నది నిజమే గోపాల్ గారూ.. అన్నట్లు గుడి పనులు  ఎంత వరకు  వచ్చాయి..?'' చైర్మన్ తిరిగి గుడి తాలూకు పనుల  ప్రస్తావన తీసుకురావడంతో గోపాల్ తన జేబులో ఉన్న ఓ కాగితాన్ని బయటికి తీసాడు.

''పనులన్నీ వేగ  వంతంగా పూర్తవుతున్నాయి చైర్మన్ గారూ.. మరో వారం రోజుల్లోగా ఈ గుడిని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దడానికి అన్ని ఏర్పాట్లూ చేసాను..'' అన్నాడు..

''చాలా మంచిది.. ఈ వసంతోత్సవాన్ని ఎంతో ఘనంగా నిర్వహించాలి.. ఈ విషయంలో మనం రాజీ పడకూడదు..'' అన్నాడు చైర్మన్. ఆ తర్వాత వారి దగ్గర సెలవు తీసుకుని అక్కడి నుండి వెళ్ళిపోతాడు.. చైర్మన్ వెళ్ళిపోయిన తర్వాత గోపాల్ శారద వంక చూస్తాడు ఆనందంగా..

''చూశావా శారదమ్మ.. నీ పేరు ఖండాన్తరాలలో కూడా వినిపిస్తుంది..'' అన్నాడు.. దానికి శారదమ్మ చిరునవ్వు నవ్వుతుంది..

''ఇందులో నా గొప్పతనం ఏమీ లేదండీ.. అంతా ఆ సాయినాధుడి లీల ..'' అంటుంది నిజాయితీగా..

‘‘నీ గొప్ప తనాన్ని నువ్వు ఒప్పుకోవు కదా.. నీలో ఉన్న ఈ నిరాడంబరమే నీకింతగా పేరుని తీసుకువస్తుంది..’’

గోపాల్ శారదని మెచ్చుకుంటాడు..

......................

గుడిలో వసంతోత్సవానికి సంబంధించిన పనులు వేగవంతం అయిపోతాయి.. ఆ గుళ్ళోకి వచ్చే భక్తులు సైతం తమకి తోచినంత విరాళాలు ఇస్తూండడంతో ఏర్పాట్లని మరింత ఘనంగా చేసేందుకు ఆలయ కమిటీ నిర్ణయించింది..శారదమ్మ కూడా ఎంతో ఉత్సాహంగా పనులని చేస్తుంది.. మూర్తి, గోపాల్ లు తనకి అప్పగించిన పనులని ఆమె దగ్గరుండి మరీ చేయిస్తుంది.. రంగు రంగుల లైట్లతో ఆ ఆలయ ప్రాకారాలన్నింటినీ ముస్తాబు చేసేసారు..

అలాగే ఆలయ గోడలకి చూడముచ్చటయిన రంగులతో పెయింటింగ్ వేయిస్తుంది శారదమ్మ..

మూడు రోజులలో ఆ గుడి రూపునే మార్చేసారు అలంకారాలతో.. రాత్రి వేళలో ఆ గుడికి అలంకరించిన విద్యుత్తు లైట్లతో దేదీప్యమానంగా వెలిగిపోతుంది ఆ ఆలయం..

విద్యుత్తు లైట్లని అమర్చడంలో శారదమ్మ కనబరిచిన నేర్పుని ప్రతీ ఒక్కరూ ప్రశంసిస్తారు .. ఆలయ ప్రధాన అర్చకులు వారం రోజుల పాటు ఆలయంలో జరిగే ఉత్సవాలకి సంబంధించి ముహూర్తాన్ని ఖరారు చేస్తారు.. మరో రెండు రోజుల్లో ఆలయంలో వసంతోత్సవాలు మొదలు కావడానికి అన్నీ సిద్ధం చేసేసారు..

ఈ పనులతో శారదమ్మ, అనసూయ సహకారంతో తీరిక లేకుండా కష్టపడుతూనే ఉంది.. అంతేకాదు..

మధ్య మధ్యలో గుళ్ళోకి వస్తున్న భక్తులకు ఆధ్యాత్మిక సందేహాలను కూడా నివృత్తి చేస్తూ, రాత్రి వేళలో సాయినాధుడి భజనలో కూడా చురుకుగా పాల్గొంటుంది శారదమ్మ..

ఆమె ఉత్సాహానికి ఆలయ కమిటీ మెంబర్లు ఎంతో ఆశ్చర్యపోతారు.. వయసుపై బడ్డా కూడా ఉత్సాహంతో ఆమె పనులని చేయడం వారందరికీ ఎంతో విస్మయాన్ని కలిగిస్తుంది..

వసంతోత్సవాలు  జరగడానికి మరొక రోజు ఉందనగా అమెరికా నుండి ఆనందస్వరూప్ వస్తారు.. ఆయన ఇండియాకి వచ్చారనితెలుసుకున్న ఆలయ చైర్మన్, మేనేజర్ గోపాల్ తో పాటు మిగిలిన కమిటీ మెంబర్లు ఆయన్ని మర్యాద పూర్వకంగా కలుస్తారు..

వారితో యోగక్షేమాలన్నీ పంచుకున్నాక ఆనంద స్వరూప్ శారదమ్మ గురించి అడుగుతాడు.. ఆమె చేసే ఆధ్యాత్మిక బోధనలు  గురించి వాకబు చేస్తాడు..

మరు నాడు ఉదయమే ఆనంద స్వరూప్ ఆలయంలోకి ప్రవేశిస్తాడు.. ఆయనతో పాటు ఆలయ చైర్మన్, గోపాల్, మిగిలిన ఆలయ కమిటీ మెంబర్లు కూడా వస్తారు..

సాయినాధుడిని దర్శించుకుని హారతి, ప్రసాదాలు  అందుకున్నాక ఆనంద స్వరూప్ శారదమ్మ గురించి అడుగుతాడు చైర్మన్‌ని.. చైర్మన్  ఆదేశాలతో శారదమ్మ ఆనంద స్వరూప్ దగ్గరికి వస్తుంది..

శారదమ్మని చూసిన ఆనంద స్వరూప్ ఎంతో ఆశ్చర్యపోతాడు.. అయిదు పదుల  వయసులో ఉన్నా కూడా ఆమె ముఖం లో ఒక విధమైన తేజస్సుని గమనిస్తాడు ఆనంద స్వరూప్..

అసంకల్పితంగానే చేతులెత్తి నమస్కరిస్తాడు ఆనంద స్వరూప్.. తనని చూసి ఆయన నమస్కరించడంతో  శారదమ్మ ఎంతో బిడియపడుతుంది.. ఆమె కూడా చేతులెత్తి నమస్కరిస్తుంది..

‘‘శారదమ్మ అంటే మీరేనా..? మీ గురించి చాలా విన్నాను.. నేను విన్న మాటల్లో అసత్యం ఏమీ లేదని మిమ్మల్ని చూస్తేనే అర్థమవుతుంది.. ఆ సాయినాధుడికి ఎంతో సేవ చేస్తున్న మీరు ఈ గుళ్ళోకి రావడం నిజంగా మా అదృష్టం..’’ మనస్ఫూర్తిగా అంటాడు ఆనంద స్వరూప్..

ఆయన అలా అనేసరికి శారదమ్మకి ఏం మాట్లాడాలో అర్థం కాదు.. తిరిగి ఆయనే అంటాడు..

''మేనేజర్ గోపాల్ గారు రెండు నెలల క్రితం నాకు ఫోన్ చేసి, ఈ ఆలయంలో ప్రతీ వారం భజన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాము.. కానీ ఆ సాయి తత్వాన్ని, ఆధ్యాత్మికతని పిల్లలలో కూడా పెంపొందించడానికి గుళ్ళో ఆధ్యాత్మిక బోధనలు చేయిస్తే బావుంటుందని నాతో అన్నాడు.. అయితే ఆధ్యాత్మిక బోధనలు చేయడం అంత సులభం కాదు, అలా బోధన చేయాలంటే ఎంతో నిష్టతో, గురువనుగ్రహాన్ని పొంది, దైవ చింతనలో ఎన్నో ఏళ్ళు గడిపిన అనుభవజ్ఞులే అర్హులు .. పెద్ద పెద్ద స్వామీజీలు వారి ఆశ్రమాల ద్వారా ఎంతో కొంత ఆధ్యాత్మికతని ప్రజలకి చేరవేస్తున్నారు.. మనం అంత పెద్ద కార్యాన్ని నెరవేర్చగలమా.. అన్న సందేహాన్ని నేను ఆయన ముందు ఉంచడం జరిగింది.. అయితే ఆయన ఎంతో పట్టుదలతో ఈ కార్యాన్ని ఎలాగైనా చేయాలని సంకల్పించడంతో సరే..

కానివ్వండి అని అన్నాను.. లోక కళ్యాణం కోసం తీసుకున్న ఈ నిర్ణయం ఆ సాయినాధుడికి ఎంతో నచ్చినట్టుంది..

అందుకే ఈ కార్యాన్ని నిర్విఘ్నంగా కొనసాగించడానికి మిమ్మల్ని ఈ గుడికి వచ్చేలా చేసారు..'' ఆనంద స్వరూప్‌గారు అన్న మాటలకి శారదమ్మ ఎంతో విస్మయానికి గురవుతుంది..

అమెరికాలో ఉండి వచ్చానన్న అహం ఆయనలో ఏమాత్రం కనిపించడం లేదు.. ఆయన మాటల్లో ఆ సాయినాధుడిపై ఆయనకి ఉన్న అపారమైన భక్తి విశ్వాసాలు కనిపిస్తున్నాయి.. అంత పెద్ద వ్యక్తి తనని పొగుడుతుండడంతో శారదమ్మకి నోట మాటలు రావడం లేదు.. ఎలాగోలా గొంతు పెగుల్చుకుని..

''అంతా ఆ సాయినాదుడి ఆశీర్వాదం అండీ..'' అని మాత్రం అనగలిగింది.. ఆమె అలా అనడంతో ఆనంద స్వరూప్ మరింత ఆశ్చర్యపోతాడు.. ఏమాత్రం కల్మషం లేని ఆమె వ్యక్తిత్వాన్ని ఆయన అంచనా వేయగలిగాడు..

''శారదమ్మా.. నాక్కూడా మీ బోధనలు వినాలన్న ఆసక్తి ఉంది..'' అంటూ.. తిరిగి ఆలయ ఛైర్మన్ వంక చూస్తాడు ఆనంద స్వరూప్..

‘‘చైర్మన్ గారూ .. ఈ వసంతోత్సవ కార్యక్రమంలో ప్రత్యేకంగా శారదమ్మ చేత ప్రసంగాన్ని కూడా ఏర్పాటు చేయండి.. ప్రతీ రోజు సాయంత్రం వేళలో రెండు గంటల పాటు ఈ కార్యక్రమాన్ని నిర్వహించేలా ప్లాన్ చేయండి..’ అని అన్నాడు..

‘‘తప్పకుండా ఏర్పాటు చేస్తానండీ..’’ అన్నాడు చైర్మన్

..................................

ఆరోజు నుండి ఆలయం వసంతోత్సవ కార్యక్రమాలు మొదలయ్యాయి.. ఆ మందిరంలో జరుగుతున్న కార్యక్రమాలని కొన్ని టివి ఛానెళ్ళు ప్రత్యేక ప్రసారాలు కూడా నిర్వహిస్తున్నాయంటే.. ఆ ఏర్పాట్లు ఏ స్థాయిలో చేసారో అర్థమవుతుంది..

ఉదయం నాలుగున్నర నుండే కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి.. ఆ సాయినాధుడికి చేసే అభిషేకాలతో, హారతులతో, భక్తులు చేసే సాయినామస్మరణతో ఆ ఆలయం మారుమ్రోగిపోతోంది.. ఆ కార్యక్రమాలకి ప్రత్యేకంగా కొంతమంది పీఠాధిపతులని ఆహ్వానించారు.. వారు విచ్చేసి లోక కళ్యాణం కోసం చేసే హోమాలతో ఆ ప్రాంగణమంతా ఆధ్యాత్మికత సంతరించుకుంది..

టీవీ ఛానళ్ళలో ఆ ఆలయంలో జరగుతున్న కార్యక్రమాల గురించి ప్రత్యేకంగా కథనాలు వస్తూండడంతో, ఆ చుట్టు పక్కల ఉన్న వారే కాకుండా నగరంలో నలుమూలల నుండి భక్తులు తండోప తండాలుగా విచ్చేస్తున్నారు..

వేలాదిగా తరలి వస్తున్న భక్తులకి మధ్యాహ్న వేళ అన్నదానం నిర్విరామంగా ఏర్పాటు చేసారు..

సాయంత్రం వేళలో భజన మందిరంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వేదికపై శారదమ్మ ప్రసంగిస్తారని తెలియడంతో ఆమె ప్రసంగం వినడానికి వందలాదిమంది భక్తులు అక్కడికి చేరుకున్నారు..

ఆనంద స్వరూప్, ఆలయ చైర్మన్‌తో పాటు మిగిలిన ఆలయ కమిటీ మెంబర్లు కూడా ఆమె ప్రసంగాన్ని వినటానికై ప్రత్యేకంగా ఆ మందిరంలో ఆసీనులయ్యారు..

శారదమ్మ ఆ సాయినాధుడిని  మనసులోనే ప్రార్థించి బోధనలు  చేయడం ప్రారంభించింది..

మొదటగా చిన్న చిన్న చినుకు బిందువు నేల  మీద పడ్డట్టుగా ప్రారంభం అయ్యి

ఓ తుఫాను మాదిరిగా మారిపోయింది..ఆమె ప్రసంగం..  రాను రాను

ఆమె నోట్లో నుండి వస్తున్న ప్రతీ మాట ప్రతీ మనిషి జీవితంలో ఆచరించదగ్గ, ఆలోచించదగ్గ వాక్కులతో అక్కడున్న ప్రతీ ఒక్కరూ ఎంతో భక్తి శ్రద్దలతో వింటున్నారు. ఆనంద స్వరూప్ అయితే ఒక విధమెన ఆశ్చర్యానందాలతో ఆమె ప్రసంగాన్ని వింటున్నాడు..

ఆమెలో అంత మేధస్సు ఉందని ఆయన ఊహించలేకపోయాడు.. మొదటగా కాస్త బిడియంతో ప్రారంభించిన ఆమె ప్రసంగం.. ఆ తర్వాత ఏమాత్రం తడబాటు లేకుండా ఆ సాయినాధుడి లీలా విశేషాలతో పాటు, సాయి తత్వాన్ని మానవ జీవితాలలో ఎలా అన్వయించుకోవాలి.. చిన్న పిల్లల  నుండి పెద్దవారి వరకూ ఆధ్యాత్మికంగా ఎలా వ్యవహరించాలి.. మనిషి భక్తి మార్గంలో పయనిస్తే ఆ దేవుడు చూపించే కరుణా కటాక్షాలు ఏ విధంగా ఉంటాయి.. అన్న విషయాని చర్చిస్తూ సాగిపోతున్న ఆమె ప్రసంగం యావత్తూ అందరి మనసులనీ ఆకట్టు కుంటుంది..ఆమె ప్రసంగం ఆనంద స్వరూప్ ని విపరీతంగా ఆకర్షించింది..

ఆ కార్యక్రమాన్నంతటినీ టీవీలో ప్రసారం చేస్తూండడంతో ఆమె పేరు తెలుగు ప్రజలందరి నోళ్ళలోనూ నానేలా చేసింది.. ఆమెలో ఉన్న ఆధ్యాత్మిక మేధస్సుకి మిగతా ఆధ్యాత్మిక ప్రసంగాలు  చేసే వారిని కూడా ఎంతో ఆశ్చర్యానికి గురి చేస్తుంది..

మనిషి జీవితంలో అన్వయించుకునే అనేక అంశాలని ఎంతో అవలీలగా ఆమె బోధించడం ఆనంద్ స్వరూప్‌కి ఎంతో బాగా నచ్చేసింది..

అయితే హిందూ ధర్మాన్ని, ఆ ధర్మంలో ఉన్న గొప్ప తనాన్ని తనదైన శైలిలో ఆమె ఆవిష్కరిస్తుండడం కొంత మంది అన్య మతాల  వారికి ఏమాత్రం నచ్చలేదు.. ఆమె బోధనలు తమ మతాన్ని కించపరిచేలా ఉన్నాయని వారు ఆరోపించారు.. అంతేకాదు ఆమెపై వెంటనే న్యాయ పరమైన చర్యలు  తీసుకోవాలని పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదుని కూడా చేసారు..

ఒకవైపు వసంతోత్సవ కార్యక్రమాలు  నిర్విరామంగా కొనసాగుతూనే, మరో వైపు శారదమ్మ చేసే ప్రసంగాలని వినటానికి ఎంతో మంది భక్తులు  అక్కడికి చేరుకుంటున్నారు.. ఆమెపై అన్య మతాల  వారు పెట్టిన కేసుని ఆనంద్ స్వరూప్ తన భుజంపై వేసుకున్నాడు.. ఆమెకి అండగా ఆయన నిలిచాడు.. ఆమె అవసరం ఈ దేశంలోనే కాదు, యావత్తు ప్రపంచానికి ఉందని ఆయన భావించాడు..

ఆమెని విదేశాలకి తీసుకెళ్ళి అక్కడ కూడా ఆమెతో ఆధ్యాత్మిక ప్రసంగాలు  చేయించాలని ఆనంద స్వరూప్ సంకల్పించాడు.. దాంతో ఆమెపై పెట్టిన కేసుని వారు విత్‌డ్రా చేసుకునే విధంగా ఆనంద స్వరూప్ చేయగలిగాడు..

వసంతోత్సవాలు  పూర్తయ్యే సరికి శారద పేరు రాష్ట్రమంతటా తెలిసిపోయింది..

దాంతో ఆమె తమ ప్రాంతంలో కూడా ప్రసంగించాలన్న విన్నపాలు  అధికమవసాగాయి.. రాష్ట్రం నలుమూలల నుండి ప్రత్యేకంగా ఆమె దగ్గరికి రావడం ప్రారంభించారు. తమ ప్రాంతంలో ప్రసంగించాలని ఆమెని వేడుకోసాగారు.. అంతేకాదు.. కొన్ని టీవీ ఛానెల్ల వారు ఆమె కోసం తమ చానళ్ళలో ప్రత్యేకంగా ఓ కార్యక్రమం  ఏర్పాటు చేస్తామని, ఆ కార్యక్రమంలో ప్రసంగాలు  చేయాలని కూడా కోరారు..

శారదమ్మ  వారందరి విన్నపాలని సుతారంగా తిరస్కరించింది.. తనకి నీడనిచ్చిన ఈ ఆలయాన్ని వదిలి ఎక్కడికి రానని ఆమె అందరికీ తెలియజేసింది..

దాంతో ఆనంద స్వరూప్ మరింత ఆశ్చర్యపోయాడు.. ఇంతటి పేరు ప్రఖ్యాతు లు  వచ్చినప్పటికీ ఆమె వాటిని ఏమాత్రం పట్టించుకోకపోవడంతో ఆయనలో ఆమెపై మరింత అభిమానం కలిగింది..తనతో పాటు విదేశాలకి ఆమెని తీసుకెళ్లాలి అని  ఆయన అనుకుంటున్నాడు కానీ, తన నిర్ణయానికి ఆమె ప్రతిస్పందన ఎలా ఉంటుందో అని ఆయనలో కొద్దిగా సందేహం కూడా నెలకొంది..

ఆరోజు ఉదయం ఆ ఆలయంలో సమావేశాన్ని ఏర్పాటు చేసాడు ఆనంద స్వరూప్.. ఆ సమావేశంలో ఆలయ చైర్మన్‌తో పాటు మేనేజర్ గోపాల్, మూర్తి, మిగతా ఆలయ కమిటీ మెంబర్లు కూడా పాలు  పంచుకున్నారు..

‘‘ఈరోజు నాకెంతో ఆనందంగానూ, గర్వంగానూ ఉంది.. ఈ ఆలయంలో జరిగిన వసంతోత్సవం నిజంగా నా జీవితంలో ఓ మరుపురాని ఘట్టం.. ఈ కార్యక్రమం ఇంతటి ఘనవిజయాన్ని దక్కించుకోవడం వెనుక ఇక్కడున్న ప్రతీ ఒక్కరి శ్రమ ఉంది.. మీ అందరికీ నేను మనస్ఫూర్తిగా ధన్యవాదాలని తెలియజేస్తున్నాను.. ఇంత బ్రహ్మాండంగా ఈ కార్యక్రమం జరుగుతుందని నేనేమాత్రం ఊహించలేకపోయాను..’’ ఆనంద స్వరూప్ గారు ఎంతో ఉద్వేగంగా అన్నాడు..

ఆయన మాటలకి అక్కడున్న వారందరూ చప్పట్లతో తమ ఆనందాన్ని వ్యక్తం చేశారు..

‘‘నేటి సమాజంలో మనిషి జీవితం యాంత్రికంగా మారిపోయింది.. ఉదయం లేవడం మొదలు, రాత్రి పడుకునే వరకూ.. ఓ మరమనిషి మాదిరిగా కష్టపడడం తప్ప మరో ఆలోచన లేకుండా గడుపుతున్నాడు.. ఈ విషయంలో ఎవరినీ తప్పు పట్టలేము. ఎందుకంటే వేగంగా అభివృద్ధిని సాధించాలన్న తపనతో, ఆర్థికంగా ఎదిగిపోవాలన్న ఆరాటంతో మనషి తనని తానే మరిచిపోతున్నాడు.. అందుకే ఇలా జరిగిపోతుంది.. అయినప్పటికీ ఎంత కష్టపడ్డా, ఎన్ని పనులు ఉన్నప్పటికీ ఆధ్యాత్మికంగా కూడా వారి ఆలోచనలు సాగిపోకుంటే భవిష్యత్తు తరాలకి ఎంతో నష్టం వాటిల్లుతుంది.. ఎందుకంటే.. ఆ దేవుడి గురించి మనమే ఆలోచించకుండా యాంత్రిక జీవనం సాగిస్తుంటే.. ఇక మన పిల్లలకి ఏం చెబుతాం.. వారు ఏమి నేర్చుకుంటారు.. అందుకే ప్రతీ ఒక్కరూ, ప్రతీ రోజూ కొద్ది సమయాన్ని ఆ భగవంతుడిని ధ్యానించడానికి సమయం కేటాయించాలన్న సంకల్పంతోనే ఈ మందిరాన్ని ఏర్పాటు చేయడం జరిగింది.. ఆ సాయినాధుడి ఆశీస్సులతో ఇప్పటి వరకూ అంతా బాగానే జరిగింది.. నా ఈ సంకల్పానికి మీరందించిన కృషిని నేను ఎప్పటికీ మరిచిపోలేను.. ఈ విషయంలో మీరు ఆ సాయినాధుడి గురించి నిస్వార్థంగా కష్టపడ్డ ఫలితం ఊరికే పోదు.. ఆ సాయినాధుడి ఆశీస్సులు మీ అందరికీ మెండుగా ఉంటాయి..’’

ఆనంద స్వరూప్ మనస్ఫూర్తిగా అన్నాడు..

ఆయన మాటలకి అక్కడున్న వారు సంతోషంగా ఒకరి ముఖాలొకరు చూసుకున్నారు..

''ఈ వసంతోత్సవాలు  ఇంత ఘనంగా జరగడంలో మరొకరు ప్రముఖ పాత్ర వహించారు..'' అన్నారు ఆనంద స్వరూప్.. ఎవరు అన్నట్టుగా అక్కడున్న వారందంరూ ఆసక్తిగా ఆనంద స్వరూప్ వంక చూసారు..

''ఆవిడ ఎవరో కాదు, శారదమ్మ.. మనం ఏర్పాటు చేసిన అన్ని కార్యక్రమాలలో కెల్లా ప్రతీ రోజూ సాయంత్రం వేళ శారదమ్మ చేసిన ప్రసంగాలతోనే మన కార్యక్రమాలకి మరింత ఆదరణ లభించింది.. ఆమెకి నా ప్రత్యేక కృతజ్ఞతలు  తెలియజేస్తున్నాను..'' అన్నాడు ఆనంద స్వరూప్.

ఆయన మాటలకి సభ్యులందరూ మరొక్కసారి చప్పట్లతో తమ సంతోషాన్ని వ్యక్తం చేసారు..

''శారదమ్మ చేసిన ప్రసంగాలు  సాధారణ  మానవులనే కాదు, నన్ను కూడా ఎంతో విపరీతంగా ఆకట్టుకున్నాయి..ఈ ఆధ్యాత్మిక ప్రపంచంలో ఆ సాయి తత్వాన్ని ఇంత బాగా జనాల్లోకి తీసుకువెళ్ల గలగడం చాలా గొప్ప విషయం..ఆమె తన మాటలతో ప్రతీ ఒక్కరి హృదయాల్లోనూ స్థానం సంపాదించుకుంది..'' అన్నాడు ఆనంద స్వరూప్..

అతని మాటలకి అక్కడున్నవారందరూ అవునన్నట్లుగా తలూపారు.. తిరిగి ఆయనే అన్నారు..

''ఏది ఏమయినప్పటికీ ఈ వసంతోత్సవం ఇంత అద్భుతంగా జరిగినందుకు నాకెంతో ఆనందంగా ఉంది.. ఆ సాయినాధుడి ఆశీస్సులతోనే ఇది సాధ్యపడింది.. ఈ బృహత్కార్యానికి మీరందరూ మీవంతు సహకారాన్ని అందించినందుకు మరొక్కమారు మీకు ధన్యవాదములు  తెలియజేస్తున్నాను..'' ఆనంద్ స్వరూప్ మనస్ఫూర్తిగా అన్నాడు..

ఆ తర్వాత ఆనంద స్వరూప్ శారదమ్మ వైపు తిరిగి ఆమె వంక నవ్వుతూ చూసారు..

''శారదమ్మ గారూ.. ఈ కార్యక్రమాలు  ఇంత విజయవంతం కావడం వెనుక మీ కృషి కూడా ఎంతో ఉంది.. మీ ఉపన్యాసాలు  యావత్‌రాష్ట్ర ప్రజలనే కాకుండా.. నన్ను కూడా ఎంతగానో ప్రభావితం చేశాయి.. దీనికినేను మీకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు  తెలుపుతున్నాను..'' ఆమె దగ్గరగా వచ్చి రెండు చేతులెత్తి నమస్కరిస్తూ అన్నాడు ఆనంద స్వరూప్. ఎంతో ఉన్నతమైన

స్థాయిలో ఉన్నా కూడా తనని అంతలా పొగుడుతున్న ఆనంద స్వరూప్‌పై శారదమ్మలో గౌరవభావం అంతకంతకూ రెట్టింపయ్యింది.. శారద కూడా రెండు చేతులెత్తి నమస్కరిస్తూ..

''ఇందులో నా గొప్పతనం ఏమీ లేదండీ.. అంతా ఆ సాయినాధుడి లీల ..'' అంది..

శారద మాటలకి ఆనంద స్వరూప్ ఆశ్చర్యపోయాడు.. ఆమెతో ఇంకేదో అనాలనుకుని చివరి క్షణంలో విరమించుకున్నాడు.. అక్కడున్న వారందరి దగ్గరా సెలవు తీసుకుని గుళ్ళో నుండి వెళ్ళిపోయాడు ఆనంద స్వరూప్..

ఆయన వెళ్ళిపోగానే మిగిలిన సభ్యులు  కూడా శారదమ్మని అభినందించారు...

..........................

ఆరోజు ఆదివారం.. ఉదయం ఎనిమిది గంటల  సమయం నుండే సాయిబాబా ఆలయంలోకి వచ్చే భక్తుల సంఖ్య క్రమంగా పెరగడం ప్రారంభించింది.. సరిగ్గా తొమ్మిది గంటలకు శారదమ్మ ప్రవచనం ఉండడంతో ఆమె ప్రవచనాన్ని వినడానికి భక్తులందరూ ఎంతో ఆసక్తిగా  ఎదురు చూస్తున్నారు..

ఆ గుళ్ళోకి ఆరోజే మొదటి సారిగా ఓ వ్యక్తి వచ్చాడు.. ఆయన పేరు రామదాసు.. ఆ గుళ్ళో సాయినాదుడి దర్శనం అనంతరం తిరిగి వెళుతూ పక్కనే ఉన్న భక్తుల  మాటల  ద్వారా అక్కడ జరిగే కార్యక్రమం గురించి తెలుసుకుని అదేదో చూసే వెళ్ళాలని అతను కూడా భజన మందిరం వైపు అడుగులు  వేస్తాడు..

అప్పటికే భజనమందిరం మొత్తం భక్తులతో నిండిపోయి ఉంటుంది.. రామదాసు ఓ పక్కగా నిలబడతాడు..

సరిగ్గా తొమ్మిది గంటలకి వేదికపైకి శారదమ్మ వస్తుంది.. శారదమ్మని రామదాసు చూస్తాడు..

అంతే.. అతని కాళ్ళ క్రింద భూమి కంపించిపోతుందేమో అన్నంతగా షాకైపోతాడు.. అతని కళ్ళు పెద్దవి అవుతాయి.. ఏదో అద్భుతాన్ని చూస్తున్నట్టుగా శారదమ్మని చూస్తూండిపోతాడు.. ఇదేమీ తెలియని శారదమ్మ తన ప్రసంగాన్ని ప్రారంభిస్తుంది.. సరిగ్గా గంట సేపటి వరకు సాగిన ఆమె ప్రసంగాన్ని అక్కడున్న వారందరూ ఎంతో తన్మయత్వంతో వింటూండిపోతారు..

ఆమె మాటలు అక్కడి వారిని ఆధ్యాత్మిక ప్రపంచంలోకి తీసుకువెళ్ళిపోతున్నాయి.. వ్యక్తి గత సమస్యలని పూర్తిగా మరిచిపోయి, ఆమె ప్రసంగంలో లీనమయిపోతారు అందరూ.. ఒక్క రామదాసు తప్ప..

రామదాసు శారదమ్మని చూస్తూ ఎంతో ఆనందాశ్చర్యాలకి గురవుతూంటాడు.. అతని కళ్ళల్లోనుండి కన్నీళ్లు జాలువారుతుంటాయి.. ఎన్నో ఏళ్ళ తర్వాత శారదని చూసిన ఆనందం అతని ముఖంలో స్పష్టంగా కనిపిస్తుంటుంది..

ఇదీ అని చెప్పలేని భావన అతనిలో కలుగుతుంటూంది.. ఉన్న ఫళంగా శారద దగ్గరికి వెళ్ళాలన్న ఆరాటం అతనిలో కనిపిస్తుంటుంది..

ప్రవచనం పూర్తి కాగానే భక్తులందరూ శారదతో మాట్లాడాలని అందరూ ఆమె చుట్టూ మూగిపోతారు..

రామదాసు కూడా శారద దగ్గరికి చేరుకోవాలని ఎంతో ప్రయత్నిస్తాడు.. కానీ.. అప్పటికే భక్తులందరూ శారద చుట్టూ చేరిపోవడంతో, శారదని కలవడానికి రామదాసుకి సాధ్యపడదు.. అయినప్పటికీ ఆమె దగ్గరికి వెళ్ళడానికి రామదాసు విశ్వప్రయత్నం చేస్తాడు.. భక్తులందరినీ తోసుకుంటూ సరిగ్గా శారద దగ్గరికి చేరుకున్న సమయంలోనే శారద ఆ మందిరంలోనుండి వెళ్ళిపోతుంది..

దాంతో రామదాసులో తీవ్ర నిరాశ కలుగుతుంది.. ఎలాగైనా శారదమ్మని కలుసుకోవాలని అతని మనసు ఆరాటపడుతుంటుంది.. శారదమ్మ కోసం ఆ గుడి మొత్తం వెతుకుతాడు.. అయినా ఆమె జాడ తెలియకపోవడంతో అతనిలో నిరాశ కలుగుతుంది..శారద కనిపించకపోయినా ఆమెని కలుసుకున్నాకనే ఆ గుళ్ళో నుండి బయటికి వెళ్ళాలని నిర్ణయించుకుంటాడు.. కొందరు భక్తులను శారద గురించి అడుగుతాడు కానీ.. వారు కూడా శారద గురించి ఎలాంటి సమాచారాన్ని అందించలేకపోతారు..

క్రమంగా భక్తులందరూ ఆలయం లోనుండి బయటికి వెళ్ళిపోవడం ప్రారంభిస్తారు.. రామదాసు తనకి కనిపించిన వారినందరినీ శారద గురించి అడుగుతూనే ఉంటాడు.. కానీ ఎవరూ ఆమె ఎక్కడుంటుందో చెప్పలేకపోతారు.. చివరికి ఒక వ్యక్తి మాత్రం శారద

గురించి తెలుసుకోవాలంటే.. ఈ ఆలయ మేనేజర్ గోపాల్ గారిని కలవండని సలహా ఇస్తారు..

మేనేజర్ గోపాల్ గారిని కలిస్తే శారదమ్మ ఎక్కడుంటుందో ఇట్టే తెలిసిపోతుందని చెప్పడంతో రామదాసు మరేమీ ఆలోచించకుండా నేరుగా గోపాల్ ఉండే ఆఫీసు దగ్గరికి వెళ్ళిపోతాడు..

రామదాసు వెళ్ళిన సమయంలో మేనేజర్ గోపాల్ ఆఫీసులోనే ఏవో ఫైల్స్ చూస్తూ ఉంటాడు..

''అయ్యా.. లోపలికి రావచ్చా..'' ఎంతో వినయంగా అంటాడు రామదాసు..

ఏవో ఫైల్స్ చూస్తున్న గోపాల్ తలెత్తి రామదాసు వంక చూస్తాడు.. అతని నొసలు ముడిపడుతాయి..

ఇంతకు ముందు ఎప్పుడూ అతన్ని చూడకపోవడంతో గోపాల్ లో ఒక విధమైన ఆశ్చర్యం.. పక్కా పల్లెటూరి రైతులా రామదాసు కనిపిస్తుంటాడు.. రామదాసు తెల్లటి షర్టు వేసుకున్నాడు.. పంచె కట్టుకున్నాడు.. భుజంపై ఓ తువ్వాలు వేసుకున్నాడు.. చేతిలో ఓ చేతి సంచి ఉంది.. అతన్ని చూడగానే రైతు అని ఇట్టే కనిపెట్టేస్తారు ఎవరయినా..

గోపాల్ ఆశ్చర్యంలోనుండి తేరుకుని 'రండి ..'' అని అంటాడు..

రామదాసు లోనికి ప్రవేశిస్తాడు.. అతని ముఖం లో ఏదో తెలుసుకోవాలన్న ఆతృత కనిపిస్తుంటుంది..

''ఎవరండీ మీరు..? ఏమి కావాలి..?'' గోపాల్ ప్రశ్నిస్తాడు రామదాసుని..

''నా పేరు రామదాసండీ.. శారదమ్మ గోరు యాడుంటారో తెలుసుకుందామని గుళ్ళో ప్రయత్నిస్తూంటే, మిమ్మల్ని అడిగితే ఆయమ్మ యాడుంటుందో తెలుస్తదని చెబితే.. మీ ఆఫీసు వెతుక్కుంటూ ఇలావొచ్చానయ్యా..''

తెలంగాణ యాసలో మాట్లాడుతున్న అతన్ని ఎంతో ఆశ్చర్యంగానూ, వింతగానూ చూస్తూంటాడు.. అయితే రామదాసు శారదమ్మ గురించి అడిగేసరికి గోపాల్ ఉలిక్కిపడతాడు..

''ఏమిటీ.. శారదమ్మ కోసం వచ్చావా..?'' ఎంతో విస్మయంగా అంటాడు గోపాల్..

''అవునయ్యా.. ఆ యమ్మని మళ్ళీ సూత్తానని కల్లో కూడా అనుకోలేదయ్యా.. ఊళ్ళో నుండి మాయమైపోయిన ఆయమ్మ జాడ తెలియకపోయే సరికి ఎప్పుడో కాలం చేసిందనే అందరమూ అనుకుంటున్నాము.. కానీ.. కానీ.. ఈ రోజు ఆ యమ్మని గుళ్ళో చూసిన.. నేను ఎంటనే ఆయమ్మని కలవాలి .. ఆ యమ్మతో మాట్లాడాలా.. కోట్ల ఆస్తిని తృణప్రాయంగా వొదిలేసి, అయిన వాళ్ళ చేతనే మోసగించబడింది ఆయమ్మ.. దానాలు సేయడంలో ఆయమ్మ తర్వాతనే ఎవరయినా.. ఆ యమ్మ మనసు బంగారం.. నాబోటోల్లెందరో ఆయమ్మ పేరు సెప్పుకుని మా జీవితాలలో వెలుగు నింపుకున్నాము.. అట్టాంటి ఆయమ్మని పలకరించాలి .. ఆ యమ్మని కల్వాలి.. సెప్పయ్యా.. ఆయమ్మ యాడుంటదో సెప్తే.. ఎంటనే ఎళ్లి ఆ యమ్మతో మాట్టాడాలా..'' రామదాసు ఎంతో ఆతృతతో అడుగుతాడు.. అతని కళ్ళల్లోనుండి శారదని చూసిన సంతోషంతో ఆనందభాష్పాలు రాల్తాయి..

రామదాసు మాటలకి గోపాల్ కూడా షాకైపోతాడు.. ఎవరూ లేని అనాధగా పరిచయం చేసుకున్న శారదమ్మని వెతుక్కుంటూ మొదటి సారి ఓ వ్యక్తి రావడం అతని ఆశ్చర్యానికి కారణం..

''శారదమ్మ.. ఆ.. శారదమ్మ నీకు తెలుసా..?'' ఉద్వేగంగా అంటాడు గోపాల్..

''తెలీకపోవడమేమిటయ్యా.. మా ఇంటిల్లి పాదీ కడుపుకింత గంజినీళ్ళు తాగుతున్నామంటే ఆ యమ్మగారి దయనే నయ్యా.. నాలాటి వందలాది మందికి ఆయమ్మ దేవతతో సమానం..'' ఎంతో భక్తిభావంతో అంటాడు రామదాసు..

''ఇంతకీ.. శారదమ్మ.. నీకెలా పరిచయం..? అసలు మీది ఏవూరు.. శారదమ్మ గతం ఏమిటో చెబుతావా..?''

గోపాల్ కుర్చీలో నుండి లేచి రామదాసు దగ్గరికి వచ్చి ఆయన భుజంపై చేయి వేసి మరీ అడుగుతాడు..

‘‘తమరు ఆ యమ్మని నాకు సూపిత్తానంటే.. ఆయమ్మ గతాన్ని మీకు సెప్తానయ్యా.. ఇప్పుడు ఇట్టా ఏకాకిగా బతుకీడుత్తాంది కానీ.. ఆయమ్మది జమిందారు కుటుంబమయ్యా..’’

‘‘ఏమిటీ..? జమిందారి కుటుంబమా..?’’ గోపాల్ ఆశ్చర్యంతో నోరు వెళ్లబెడతాడు.. ఒక జమిందారు కుటుంబం నేపథ్యం కలిగిన శారదమ్మ ఇలా ఒంటరిగా, ఎవరూ లేని అనాధలా ఎందుకు బ్రతుకుతుంది..?

గోపాల్‌లో మనసులో ఆలోచనలు సుడులు తిరుగుతుంటాయి.. ఎదురుగా కనిపిస్తున్న రామదాసుని చూసి అతని మనసు ఎంతో ఆనందానికి గురవుతుంది..

శారదమ్మ గతాన్ని తెలుసుకోవాలని తాను ప్రయత్నించినా ఆవిడ తన గతాన్ని దాటవేస్తూ వచ్చింది..

ఇన్నాళ్ళకి ఇతని ద్వారా శారదమ్మ గతం తెలుసుకునే అవకాశం వచ్చింది.. అని మనసులోనే అనుకుంటాడు గోపాల్..

‘‘చూడు రామదాసు.. ముందు నువ్వు కూర్చో.. ఇదిగో ఈ మంచినీళ్ళు కాసిన్ని త్రాగు.. టీ కూడా తెప్పిస్తాను..

నాకు.. ఆ శారదమ్మ గతమేమిటో చెప్పు.. నువ్వు చెప్పాక నేనే స్వయంగా నిన్ను ఆ శారదమ్మ దగ్గరికి తీసుకువెళ్తాను..’’గోపాల్ రామదాసుని కుర్చీలో కూర్చోబెట్టి, వాటర్ బాటిల్ అందించి, తాను వెళ్ళి తన కుర్చీలో కూర్చుంటూ అంటాడు.. రామదాసు మంచినీళ్ళు త్రాగి, కాస్త కుదురుకున్నాక..

శారదమ్మ గతాన్ని చెప్పడం ప్రారంభిస్తాడు..

అది తెలంగాణ రాష్ట్రంలోని మెదక్ జిల్లాలోని సిద్దిపేటకి దగ్గర్లోని ఒక గ్రామం..

చుట్టూ అందమైన పచ్చని పొలాలు మధ్యలో చిన్న చిన్న పెంకుటిళ్లు.. వాటిని కలుపుతూ అందమైన మట్టి రహదారి .. ఒక చిత్రకారుడు ఎంతో ముచ్చటపడి వేసిన పెయింట్‌లాగా కనిపిస్తుంది ఆ ఊరి వాతావరణం..

ఆ ఊరికి మధ్యలో ఓ పెద్ద భవంతి.. రాజుల కాలం నాడు ఎంతో ముచ్చట పడి కట్టించుకున్నట్టుగా ఉంటుంది.. ఎంతో అందంగా.. హుందాగా కనిపిస్తుంటుంది ఆ భవంతి..

దాదాపు పది ఎకరాల స్థలంలో ఉంది అది.. ఆ భవంతికి మూడు వందల సంవత్సరాల చరిత్ర ఉంది.. రాజుల దండయాత్రకి, బ్రిటీష్‌వారి తుపాకీ గుళ్లకు నిలువెత్తు సాక్షంగా నిలుస్తుంది ఆ భవంతి., స్వాతంత్ర్య సమరంలో తెలంగాణ యోధులు నెరపిన పోరాటానికి ఆ భవంతిని కట్టింది రాజబహుదూర్ భూపతి జమిందారు.. ఆ చుట్టూ ఉన్న ముప్పై గ్రామాలకు ఆయన అధిపతి.. ఎన్నో వేల ఎకరాల భూమి, వందల కొద్దీ నౌకర్లు, ఎంతో విలాసవంతమైన జీవితం.. అయినప్పటికీ ఆయన తనని నమ్ముకున్న ప్రజలకి ఏది కావాలన్నా అందిచ్చేవాడు..

ఆ రోజుల్లో ఆ ముప్పై ఊర్లలో ఉండే ప్రజల దగ్గర జమీందారు కొంత మొత్తంలో పన్ను వసూలు చేసేవాడు.. ప్రతీ గ్రామంలోనూ తనకున్న భూమిలో సాగు చేసే వారి దగ్గర మినహాయించి, మిగతా వారి దగ్గర ఈ పన్నులని ఆయన వసూలు చేసేవాడు..

అయితే ఈ పన్ను వసూలు చేయడం వెనుక ప్రజా సంక్షేమం దాగుంది.. అప్పట్లో చుట్టూ ఉండే రాజులు ఏ క్షణాన్నైనా ఊళ్ళ పై దండ యాత్ర చేసి తమ ఆధీనంలోకి తీసుకోవాలని విశ్వ ప్రయత్నం చేసేవారు.. అలాంటివారి బారినుండి ఆ ఊళ్ళ ని రక్షించడానికి భూపతి గారు తనకంటూ సొంత సైన్యాన్ని ఏర్పాటు చేసాడు.. ప్రతీ గ్రామంలోనూ ఆ సైన్యం ఇరవై నాలుగు గంటలు పహారా కాస్తూండేది..

ఆ ఊళ్ళని రక్షించడానికి వినియోగించిన ఆ సైన్యాన్ని పోషించడానికయ్యే సొమ్ముని సగభాగం తాను భరించేవాడు, మిగతా సగం ఇలా పన్నుల రూపంలో ప్రజల నుండి వసూలు చేసి, వారికి రక్షణ కల్పించేవాడు..

అందుకే ఆ జమిందారు అంటే ఆ ముప్పై ఊర్లలో ఉండే గ్రామ ప్రజలకి ఎనలేని అభిమానం..

జమీందారుకి ఇద్దరు కుమారులు, ముగ్గురు కుమార్తెలు.. ఇద్దరు కుమారులలో పెద్దవాడి పేరు అమరేంద్ర భూపతి, చిన్నవాడు విజయేంద్ర భూపతి.. వీరికి ముగ్గురు అక్కలు ..

తండ్రి జమిందారు కావడంతో వారి బాల్యం  మొత్తం ఎంతో విలాసవంతమైన జీవనంతో సాగిపోయింది..

అమరేంద్ర భూపతికి తన తండ్రి రాజబహదూర్ భూపతిలోని మంచితనం, ప్రజల  గురించి ఆలోచించే తత్వం, ప్రజల  కోసం ఏమైనా చేయాలన్న తపన సంక్రమించాయి.. చిన్నవాడు విజయేంద్ర భూపతికి మాత్రం ఇలాంటివేవీ అబ్బలేదు.. పన్నెండేళ్ల ప్రాయం నుండే చెడు అలవాట్లని ఒంట బట్టించుకున్నాడు.. తన చుట్టూ ఎప్పుడూ ఓ పది, ఇరవై మంది తన వయసు వారైన స్నేహితులుండేవారు .. వారి ద్వారానే అతనికి చెడు వ్యసనాలు ఒంటబట్టాయి..

గ్రామాలలో దొరికే సారా త్రాగడం, అందమైన అమ్మాయిలని తన వశం చేసుకోవడం, జమిందారు కుమారుడన్న అహంతో గ్రామ ప్రజలలో తన ఆధిపత్యాన్ని చెలాయించడం లాంటివి చేసేవాడు..

అతడు జమిందారు కొడుకు కావడం, ఆ జమీందారు పై గ్రామ ప్రజలలో ఉన్న ఎనలేని అభిమానం కారణంగా విజయేంద్రభూపతి ఎన్ని తప్పులు  చేసినా కూడా అతన్ని ఏమీ అనేవారు కారు. విజయేంద్ర భూపతి తమ గ్రామంలోకి అడుగుపెట్టాడని తెలియగానే ఆ ఊరి ప్రజలు  ఎన్నో జాగ్రత్తలు  తీసుకునే వారు.. విజయేంద్ర భూపతి దృష్టిలో తాము పడకుండా తగు జాగ్రత్తలు తీసుకునే వారు కంట పడకుండా జాగ్రత్త పడేవారు.... ముఖ్యంగా వయసుకు వచ్చిన ఆడపిల్లలని అతని చెడు సావాసాలతో, చెడు అలవాట్లతో పూర్తిగా చెడిపోయిన విజయేంద్రభూపతి గురించి తన అక్కకి తెలిసినా కూడా వారు అతన్ని ప్రోత్సహించేవారే కానీ.. ఇది తప్పు అని చెప్పేవారు కాదు.. కానీ అమరేంద్రభూపతి అలా కాదు.. తన తమ్ముడు చెడు అలవాట్లకి బానిసయ్యాడని తెలిసిన మరుక్షణం, తమ్ముడిని కొట్టి మందలించడమే కాకుండ .. తన తండ్రికి కూడా ఈ విషయాన్ని తెలియజేశాడు..

దాంతో తండ్రి కూడా ఎంతో కోపోద్రిక్తుడయ్యి విజయేంద్రభూపతిని తీవ్రంగా దండించాడు.. రెండు రోజుల  వరకు అన్నపానీయాలు  లేకుండా ఓ చీకటి గదిలో బందిస్తాడు.. మళ్లీ ఒక్కసారి ఇలాంటి పనులు  చేస్తే ఇలా బంధించడాలు  లేకుండా, ఈ ఇంటినుండే కాదు,

తమ ఆధీనంలో ఉన్న ఊళ్ళ పొలిమేరలకి కూడా రాకుండా పంపించేస్తానని రాజాబహదూర్ భూపతి తీవ్రంగా హెచ్చరిస్తారు..

దాంతో విజయేంద్రభూపతి, అమరేంద్రభూపతిపై కక్ష పెంచుకుంటాడు.. అదేమీ పట్టించుకోని అమరేంద్రభూపతి మళ్లీ తన తండ్రితో తమ్ముడికి అనుకూలంగా మాట్లాడి, గదిలో బంధీగా ఉన్న తమ్ముడిని విడిపించి, మంచి మాటలు  చెబుతాడు.. అయినప్పటికీ విజయేంద్రభూపతి తన అన్న అమరేంద్రభూపతిపై కక్ష పెంచుకుంటాడు..

రాజ బహదూర్ భూపతి తన ఇద్దరు కొడుకుల  గురించి ఆలోచనలో పడిపోతాడు.. విజయేంద్రభూపతి చేసే పనులు  గురించిన సమాచారాన్ని రహస్యంగా సేకరిస్తాడు రాజ బహదూర్ భూపతి.. పదిహేనేళ్ల వయసు కూడా రాకుండానే విజయేంద్రభూపతికి లేని చెడు వ్యసనం లేదు అని తెలుసుకుని తీవ్రంగా ఆందోళనకి గురవుతాడు..

అయితే తన పెద్ద కుమారుడు అమరేంద్రభూపతి మాత్రం తనలాగే నలుగురి క్షేమం కోరేవాడిలా ఉండడంతో కాస్తంత ఊరట చెందుతాడు ..

అయితే అమరేంద్రభూపతి ఇక్కడే ఉంటే చిన్న కొడుకు లాగే అతను కూడా చెడు వ్యసనాలకి లొంగిపోతాడేమో అన్న భయంతో అతని చదువు కోసం పట్నం పంపిస్తాడు.. దాంతో అమరేంద్రభూపతి పాతికేళ్ల వయసు వచ్చే వరకూ చదువు నిమిత్తం పట్నవాసం చేయాల్సి వచ్చింది..

ఈ పాతికేళ్ళలో విజయేంద్రభూపతి చేయని ఆగడాలంటూ ఉండవు.. తన తండ్రి, తాతలు  ఎంతటి మంచి కీర్తిని గడించారో, ఆ కీర్తినంతటినీ చెడగొట్టే పనిలో విజయేంద్రభూపతి ఎప్పుడూ బిజీగా ఉండేవాడు.. పెద్ద కొడుకు ప్రయోజకుడు కావడంతో ఒకవైపు ఆనందంగానే ఉన్నప్పటికీ చిన్న కొడుకు చెడు వ్యసనాలకి బానిసయ్యి పూర్తిగా చెడిపోవడంతో తీవ్రంగా ఆందోళన చెందాడు.. విజయేంద్ర భూపతిని మార్చాలని ఎంతో ప్రయత్నించాడు..

కానీ.. మొక్కై వంగనిది, మ్రానై వంగునా అన్నట్టుగా.. అతని ఆగడాలు, రోజు రోజుకూ శృతి మించి పోయాయే కానీ తగ్గలేదు.. దాంతో రాజబహదూర్ భూపతి తీవ్రమైన మానసిక వేదనలో మునిగిపోయాడు.. తన తాతలు, తండ్రులు తాను మంచి వ్యక్తిత్వంతో ఎన్నో ఆస్తులను కూడబెట్టుకుని వంశ ప్రతిష్ఠని పెంచేలా ప్రవర్తించారు.. దాంతో తమ పాలనలో ఉన్న ప్రజలలో గౌరవ మర్యాదలు  ఏర్పాటు చేసుకున్నారు.. కానీ ఈ విజయేంద్రభూపతి కారణంగా తమ వంశ ప్రతిష్ట, గౌరవ మర్యాదలకి కూడా తీవ్ర భంగపాటు కలగడంతో ఏం చేయాలో తెలియక విపరీతమైన ఆందోళనలో మునిగిపోయాడు రాజ బహదూర్ భూపతి..

అతనికి కూడా వయసు పైబడుతుండడంతో తన తదనంతరం వ్యవహారాలన్నింటినీ పెద్ద కుమారుడైన అమరేంద్రభూపతికి అప్పగించాలని నిర్ణయం తీసుకున్నాడు.. ఆ నిర్ణయం తీసుకోవడమే ఆలస్యం.. వెంటనే పట్నంలో చదువుకుంటున్న అమరేంద్రభూపతిని రప్పించాడు..

తన మనసులోని ఆలోచనని అమరేంద్రభూపతికి తెలియజేసాడు.. తండ్రి మాటని కాదనలేక అమరేంద్రభూపతి వ్యవహారాలన్నింటినీ చూసుకోవడానికి ఒప్పేసుకున్నాడు. దాంతో ఆ చుట్టు పక్కల  ఉన్న ఊళ్ళలో సంబరాలు జరుపుకున్నారు.. రాజాబహదూర్ భూపతిలోని మంచితనాన్ని పుణికి పుచ్చుకున్న అమరేంద్రభూపతి యువ జమిందారుగా బాధ్యతలు  తీసకున్నాడని తెలియడంతో ఎంతో ఆనందించారు..

కానీ తన అన్నయ్యని జమిందారుగా చేయడం తమ్ముడు విజయేంద్ర భూపతికి ఏమాత్రం నచ్చలేదు..

దాంతో ఓరోజు బాగా త్రాగి తండ్రి దగ్గరకి వచ్చి నానా గొడవ చేసాడు. అమరేంద్రభూపతి ఈ ఊరికి దూరంగా ఎక్కడో ఉండి చదువు కొన్నాడని, అతనికి ఇక్కడి వ్యవహారాలేవీ సరిగ్గా తెలియవని, తాను మాత్రం ఇక్కడే ఉండి అన్ని గ్రామాలని సందర్శించినవాడిని  కాబట్టి జమీందారీ గిరి తనకే ఇవ్వాలని పట్టుబట్టాడు.. దానికి రాజ బహదూర్ భూపతి ససేమిరా అన్నాడు..చెడు అలవాట్లతో జీవితాన్ని పాడు చేసుకున్న విజయేంద్రభూపతి చేతిలో

జమిందారీ గిరీ పెడితే ఎన్నో తరాలుగా వృద్ధి చెందిన తమ వంశ పరువు ప్రతిష్ఠ మంట గలిసిపోవడం ఖాయమని ఆయన వాదించాడు..

అదీకాక.. తండ్రి తర్వాత పెద్ద కుమారుడికే పట్టాభిషేకం చేయడం ఆనవాయితి కానీ. పెద్ద కుమారుడు ఉండగానే చిన్న కుమారుడికి జమీందారీ గిరి కట్టబెట్టడాన్ని ఎవరూ హర్షించరని సముదాయించాడు రాజాబహదూర్ భూపతి.

అప్పటికీ ఆయన మాటలు  విన్నట్లు  నటించాడు విజయేంద్ర భూపతి.. కానీ మనసులో మాత్రం అమరేంద్ర భూపతిపై అంతకంతకూ కసి పెంచుకున్నాడు.. అతడిని తప్పించి ఎలాగైనా జమిందారి గిరిని తన వశం చేసుకోవాలన్న ఆశ అతనిలో రోజు రోజుకీ పెరిగిపోవడం ప్రారంభించింది..

ఇదిలా ఉండగా..

అమరేంద్రభూపతి జమీందారుగా బాధ్యతలు  తీసుకున్న తర్వాత వారి ఆధీనంలో ఉన్న గ్రామ ప్రజలకి ఎన్నో మంచి పనులు  చేయడానికి పథకాలు  ప్రారంభించాడు.. అత్యధికంగా భూమిని నమ్ముకుని పంట పండిస్తూ బతికే వారే ఎక్కువగా ఉండడంతో, వారు పంటకి కావలసిన విత్తనాలు, మిగతా సామాగ్రిని తామే సమకూర్చడం చేసాడు.. దాంతో అమరేంద్ర భూపతికి అక్కడి ప్రజలలో విశేషమైన అభిమానాన్ని సొంతం చేసుకున్నాడు..

అంతేకాదు.. అన్ని గ్రామాలలో తమకున్న వేల  ఎకరాల  భూమిని పంట పొలాలుగా అభివృద్ధి చేసి, భూమి లేని రైతులకి కౌలుకి ఇచ్చాడు.. అప్పటి వరకూ పట్టెడన్నం దొరకడానికే ఎంతో కష్టపడే ఆ రైతులకి ఆ అవకాశం రావడంతో అమరేంద్రభూపతిని దేవుడిలా కొలిచారు..

అమరేంద్రభూపతి జమీందారుగా బాధ్యతలు  తీసుకున్న అయిదు సంవత్సరాల  కాలంలో తనదైన ముద్రని అక్కడి జనాలలో వేయగలిగాడు.. కొడుకు చేస్తున్న మంచి పనులకి రాజ బహదూర్ భూపతి ఎంతో గర్వంతో ఉప్పొంగిపోయాడు.. అమరేంద్రభూపతికి పెళ్ళీడు రావడంతో, పెళ్ళి సంబంధాలు  చూడడం మొదలు  పెట్టాడు.. ఈ విషయంలో అమరేంద్రభూపతి అభిప్రాయాన్ని అడిగాడు రాజ బహదూర్ భూపతి..

‘‘కట్న కానుకలు మతాలు, ఆస్తి పాస్తులు  అన్న పట్టింపులేవీ లేవు.. అమ్మాయి గుణవతి అయితే చాలు .. తాను పెళ్ళి చేసుకుంటానని’’ ఎంతో వినయంగా తండ్రికి తెలిపాడు అమరేంద్రభూపతి..

అమరేంద్రభూపతి మాటలు  విన్న రాజ బహదూర్ భూపతి ఎంతో ఆనందించాడు. తన కుమారుడు తన మాటని జవ దాటడని అతనికి తెలుసు.. అయినప్పటికీ కొడుకు అభిప్రాయాన్ని కూడా తెలుసుకోవాలని అడిగాడు అంతే.. కొడుకు నిర్ణయం తెలుసుకున్న తర్వాత ఇంక ఆలస్యం చేయదలుచుకోలేదు రాజ బహదూర్ భూపతి..

వెంటనే తమ ఆస్థాన సిద్ధాంతి  గారిని పిలిపించాడు.‘‘సిద్ధాంతి  గారూ.. నా పెద్ద కుమారుడికి వివాహం చేయడానికి నిర్ణయించుకున్నాను.. వాడి జాతకంలో పెళ్ళి యోగం ఎప్పుడున్నది.. వాడికి కాబోయే భార్య జాతక చక్రం ఎలా ఉండాలి..? అన్న విషయాని మీ ద్వారా తెలుసుకోవడానికి మిమ్మల్ని పిలిపించాను..’’ రాజ బహదూర్ భూపతి ముఖం లో ఎంతో ఆనందం కనిపిస్తుంది

సిద్ధాంతి కి.. ఆయన మాటలు  విన్న సిద్ధాంతి  కూడా ఎంతో ఆనంద పడిపోయాడు..

‘‘శుభస్య శీఘ్రం.. ప్రజల  శ్రేయస్సు కోసం ప్రాణాని సైతం ఫణంగా పెట్టే మీలాంటి వారికి అంతా శుభమే జరుగుతుంది.. మీ అమరేంద్రభూపతి కూడా జమీందారుగా మిమ్మల్ని మించే విధంగా ప్రజల  శ్రేయస్సు కోసం పాటు పడుతున్నాడని విన్నాను.. ఎంతో ఆనందమేసింది.. మంచి వాళ్ళకి ఆ భగవంతుడు ఎప్పుడూ మంచే చేస్తాడు.. ఏదీ మీ అబ్బాయి జాతకాన్ని ఇవ్వండి..’’ అన్నాడు సిద్ధాంతి ..

రాజ బహదూర్ ఆజ్ఞ మేరకు అమరేంద్రభూపతి జాతకపత్రాని సిద్ధాంతి కి అందజేస్తాడు పని వాడు..

సిద్ధాంతి  అమరేంద్రభూపతి జాతకాన్ని పరిశీలిస్తుంటాడు.. ఒక అయిదు నిమిషాల  పాటు జాతక చక్రాన్ని తదేకంగా పరిశీలిస్తాడు.. ఆ జాతకాన్ని పరిశీలిస్తున్న కొద్దీ సిద్ధాంతి  ముఖం

లో రంగులు  మారడం ప్రారంభిస్తాయి.. ఆయన ముఖంలో ఏదో విచారం కొట్టొచ్చినట్టు కనిపిస్తుంది..

రాజ బహదూర్ భూపతి సిద్ధాంతి  ముఖంలో భావాలు  మారడం గమనిస్తూనే ఉంటాడు.. సిద్ధాంతి  ముఖంలో కనిపిస్తున్న ఆందోళనని గమనించి రాజ బహదూర్ కంగారు పడిపోతాడు..

''సిద్ధాంతి  గారూ.. మీరెందుకో ఆందోళన చెందుతున్నట్టు కనిపిస్తుంది.. జాతకంలో ఏమైనా లోపాలు  ఉన్నాయా..?'' కంగారుగా అడుగుతాడు రాజ బహదూర్ భూపతి.

భూపతి మాటలకి సిద్ధాంతి  తలెత్తి ఆయన వంక చూస్తాడు.. ఆ చూపులో ఏదో విచారం కనిపిస్తుంటుంది..

రాజ బహదూర్ భూపతి సిద్ధాంతి  ఏం చెబుతాడా అని ఆత్రంగా చూస్తూంటాడు..

''భూపతి గారూ  .. మీ అబ్బాయి జాతకంలో ఏదో దోషం కనిపిస్తుంది..'' అంటాడు విచారంగా..

ఆ మాటలకి భూపతి తేలిగ్గా ఊపిరి పీల్చుకుంటాడు..

''ఓస్ అంతేనా..? దానిదేముంది సిద్ధాంతి  గారూ.. దోష నివారణకి ఎన్నో మార్గాలు  ఉన్నాయి కదా.. మా బాబు జాతకంలోని దోషనివారణ కోసం ఎన్ని దానాలు చేయడానికైనా సిద్దమే.. భూదానం, గోదానం, సువర్ణదానం..

ఇలా ఏ దానం చేయడానికైనా సిద్దమే.. ఎంత మంది దేవుళ్ళకి ముడుపులు  చెల్లించడానికైనా సిద్దమే..చెప్పండి..

మా అబ్బాయి జాతకంలోని దోష నివారణ కోసం ఏం  చేయడానికైనా నేను సిద్దంగా ఉన్నాను.. ఏం చేయమంటారో సెలవియ్యండి..'' అంటాడు రాజ బహదూర్ భూపతి..భూపతి

మాటలకి సిద్ధాంతి  ఏమీ సమాధానం చెప్పకుండా.. తిరిగి జాతకం చూడడంలో నిమగ్నమైపోతాడు..

ఓ వైపు జాతకాన్ని తదేకంగా చూస్తూ.. ఆ వెంటనే శూన్యంలోకి చూసి తీవ్రంగా ఆలోచిస్తూ.. తన చేతివేళ్ళని లెక్కిస్తూ.. ఇలా చాలా సేపు జాతక పరిశీలనలో మునిగి తేలుతున్న సిద్ధాంతి వంకే చూస్తూ ఉండిపోతాడు భూపతి.

సిద్ధాంతి   అంత సీరియస్‌గా జాతకాన్ని పరిశీలిస్తుండడంతో భూపతి మనసెందుకో కీడుని శంకిస్తుంది..

సిద్ధాంతి  జాతకాన్ని చూసే విధానాన్ని బట్టి తన కుమారుడి జాతకంలో ఏదో పెద్ద దోషమే ఉండి ఉంటుందని మాత్రం భూపతికి అర్థమయ్యింది.. అందుకే సిద్ధాంతి  ఎంత సమయం తీసుకున్నప్పటికీ మౌనంగా అతని వంకే చూస్తూ ఉండిపోతాడు..

ఓ పావు గంట వరకు జాతకాన్ని గమనించిన తర్వాత విచారంగా భూపతి వంక చూస్తాడు సిద్ధాంతి ..

''భూపతి గారూ

.. మీకెలా చెప్పాలో అర్థం కావడం లేదు.. మీ అబ్బాయి జాతకంలో..'' అంటూ ఆగిపోతాడు

ఆయన అలా అర్థోక్తిలో ఆగిపోవడంతో భూపతి మనసులో మరింత ఆందోళన చెలరేగుతుంది..

''సిద్ధాంతి  గారూ.. మరేం ఫర్వాలేదు.. జాతకంలో ఏముందో ఉన్నది ఉన్నట్టుగా చెప్పండి..'' ధైర్యాన్ని

కూడ దీసుకుని అంటాడు భూపతి..

సిద్ధాంతి  భారంగా నిట్టూర్పు విడిచి..

''మీ అబ్బాయి జాతకంలో కళ్యాణ ఘడియలు  స్పష్టంగా కనిపిస్తున్నాయి.. కానీ..'' అంటూ మళ్ళీ ఆగిపోతాడు సిద్ధాంతి .. సిద్ధాంతి  అలా ఆగిపోవడంతో భూపతిలో అంతకంతకు ఆందోళన అధికమవ్వసాగింది..

''కళ్యాణ ఘడియలు  కనిపిస్తున్నాయని అంటున్నారు కదా.. ఇంక విచారించాల్సింది ఏముంది సిద్ధాంతి  గారూ..'' అంటాడు రాజ బహదూర్ భూపతి..

సిద్ధాంతి కి ఎలా చెప్పాలో అర్థం కావడంలేదన్నట్టుగా కూర్చున్న చోటునే కాస్త ఇబ్బందిగా కదులుతుంటాడు..

ఆయన అలా మౌనంగా ఉండడం భరించలేకపోతాడు భూపతి.. ఆందోళన స్థానంలో చిరాకు ప్రవేశిస్తుంది అతనిలో..

''సిద్ధాంతి  గారూ.. మీరు అలా మౌనంగా ఉండి నాలో ఆందోళనని అధికం చేస్తున్నారు.. అసలు  జాతకంలో ఏం దోషముందో నిర్భయంగా చెప్పండి.. అలాగే ఆ దోష నివారణకి ఏమి చేయాలో కూడా సెలవియ్యండి..

తప్పకుండా మీరు చెప్పింది చేయడానికి నేను సిద్దంగా ఉన్నాను..'' అంటాడు భూపతి..

''భూపతి గారూ.. కళ్యాణ ఘడియలు  స్పష్టంగా ఉన్నాయి కాబట్టి దోషం ఉన్నప్పటికీ, నివారణ సాధ్యమయ్యేటంత పెద్దదేమీ కాదు.. కానీ.. కానీ.. మీవాడి జాతకంలో మరొకటి స్పష్టంగా గోచరిస్తుంది.. అందుకే నాలో విచారం కనిపిస్తుంది.. అసలు .. ఇది.. ఎలా సాధ్యం అన్నదే నాకు అర్థమవ్వడంలేదు..'' అంటాడు సిద్ధాంతి  విచారంగా..

''సిద్ధాంతి  గారూ.. కళ్యాణ ఘడియలు  ఉన్నాయంటున్నారు, దోష నివారణ సాధ్యమే అంటున్నారు.. మరింక సమస్యేమిటండీ..?'' ఆతృతగా అడుగుతాడు రాజ బహదూర్ భూపతి..

''భూపతి గారూ  .. మీ కుమారుడి జాతకంలో కళ్యాణ ఘడియలు  ఎంత స్పష్టంగా కనిపిస్తున్నాయో.. అంతే స్పష్టంగా మీ అబ్బాయికి అల్పాయుష్షు కూడా కనిపిస్తుంది.. అందుకే ఇంత విచార పడుతున్నాను..'' నెమ్మదిగా చెబుతాడు సిద్ధాంతి ..

సిద్ధాంతి మాటలు విన్న రాజ బహదూర్ భూపతి కాళ్ళ క్రింద భూమి కంపించిందేమో అన్నంతగా షాకైపోతాడు.. అతని చుట్టూ ఉన్న భూమి గిర్రున తిరిగినట్టు అవుతుంది.. ఒంట్లో ఉన్న శక్తి నంతా ఎవరో బలంగా లాగేసుకున్నట్టు గజ గజా వణికిపోతాడు..

''సిద్ధాంతి గారూ.. ఏమిటి.. మీరంటున్నది..'' భూపతి గొంతులోనుండి మాట బయటికి రావడానికి ఎంతో కష్టమయింది.. అతని గొంతు సన్నగా కంపించింది.. ఒళ్ళంతా చెమటలు పట్టేసాయి..

భూపతిలో వచ్చిన ఆ మార్పుని సిద్ధాంతి గమనించి ఆందోళన పడతాడు..

''భూపతి గారూ.. మీరు అనవసరంగా కంగారు పడకండి.. నిజం చెబితే మీరిలా అయిపోతారనే ఇందాకటినుండి ఈ విషయాన్ని మీతో చెప్పడానికి సంశయించాను.. జాతక శాస్త్రం ప్రకారం ఇలాంటి విషయాలు ఎవరికీ తెలియపరచకూడదు.. కానీ.. వంశపారంపర్యంగా మీకు మేము సేవలు అందిస్తున్నాము కాబట్టి చెప్పకతప్పలేదు ..''

బాధగా అంటాడు సిద్ధాంతి ..

రాజ బహదూర్ మెదడంతా మొద్దుబారిపోయినట్టు అనిపిస్తుంది.. కళ్ళముందు అమరేంద్రభూపతి ఆకారం మెరుస్తుంది.. ఆరడుగుల ఎత్తులో ఎంతో అందమైన ముఖారవిందంతో, కల్మషం లేని చిరునవ్వు చిందిస్తూ తన కళ్ళముందు కన్న కొడుకు మెదిలే సరికి తట్టుకోలేకపోతాడు రాజ బహదూర్ భూపతి.. ముఖాన్ని చేతుల్లో దాచుకుని బోరున విలపిస్తాడు..

రాజ బహదూర్ భూపతి పరిస్థితికి సిద్ధాంతి ఎంతో జాలి పడతాడు.. కానీ.. తాను మాత్రం ఏం చేయగలడు..

అతని జాతకంలో అల్పాయుష్షు స్పష్టంగా కనిపిస్తుంటే.. ఓ పది నిముషాల వరకు అలా ఏడుస్తూనే ఉంటాడు భూపతి.. ఏడుస్తున్న భూపతిని ఓదార్చే ప్రయత్నం ఏమీ చేయలేదు సిద్ధాంతి .. మనసులో గూడు కట్టుకుని ఉన్న బాధ అంతా కన్నీళ్ళ రూపంలో బయటికి వస్తే.. కాస్త తేరుకుంటాడని అర్థం చేసుకుని సిద్ధాంతి మౌనంగా ఉండి పోతాడు..

ఓ పదినిముషాల  తర్వాత భూపతి కాస్త తేరుకుంటాడు.. మనసుని తన ఆధీనంలోకి తెచ్చుకుని, ధైర్యాన్ని కూడదీసుకుని తిరిగి మామూలు  స్థితికి వస్తాడు రాజ బహదూర్ భూపతి..

''సిద్ధాంతి  గారూ.. ఈ విషయం మరో పండితులెవరైనా చెబితే అతడిని అక్కడికక్కడే ముక్కలు ముక్కలుగా నరికేసేవాడ్ని .. కానీ.. మీరు చెప్పారు కాబట్టి.. నమ్మకుండా ఉండలేకపోతున్నాను.. కానీ.. కానీ.. ఎందుకలా జరిగింది.. ఏ పాపమూ ఎరుగని నా కుమారుడికి అల్పాయుష్షు ఉండడం ఏమిటి..? ఎందుకిలా..?'' బాధతో

రాజ బహదూర్ భూపతి గొంతు బొంగురు పోతుంది..

''ఇలా జరగడానికి కారణం మీ వంశానికి శాపం తగలడమే..'' అంటాడు సిద్ధాంతి ..

ఆ మాటలకి ఉలిక్కిపడతాడు రాజ బహదూర్ భూపతి..

''ఏమిటీ..? మా వంశానికి శాపం తగిలిందా..? ఎందుకు.. ఎలా..?'' ఎంతో ఆశ్చర్యంగా అడుగుతాడు భూపతి..

''అవును.. మీ వంశం శాపగ్రస్తమైంది.. మీ తండ్రి రాజ ప్రతాప బహదూర్ చేసిన ఘోరమైన తప్పిదానికి ఇప్పుడు మీ పిల్లలు బలి అవబోతున్నారు..'' భారంగా అంటాడు సిద్ధాంతి..

ఆ మాటకి అదిరి పడతాడు రాజ బహదూర్ భూపతి..

''అవును భూపతి గారూ.. ఇన్నాళ్ళుగా ఈ ప్రస్తావన మీ దగ్గర ఎన్నడూ రాలేదు కాబట్టి మీకు చెప్పలేదు..

రాజ ప్రతాప బహదూర్ గారు చేసిన ఘోరమైన తప్పిదాన్ని గురించి మా తాత గారు, మా తండ్రి గారితో అప్పుడప్పుడూ చర్చిస్తుండగా నేను విన్నాను.. ఇప్పుడు మీ కుమారుడి జాతకాన్ని గమనిస్తే అర్థమవుతుంది.. మీ తండ్రి గారు చేసిన తప్పు మీ వంశం మొత్తానికి శాపం తగిలేలా చేసిందని..'' అంటాడు సిద్ధాంతి..

''మా తండ్రి గారు ఏం చేసారు..? నాకు తెలియని విషయం ఏమిటి

చెప్పండి..'' ఆత్రంగా అడుగుతాడు రాజ బహదూర్ భూపతి..

రహస్యం ఉన్నదా.. ఇంతకీ మీకు తెలిసింది ఏమిటో సిద్ధాంతి పాత జ్ఞాపకాలని గుర్తుకు చేసుకుంటున్నట్టు శూన్యంలోకి చూస్తూ చెప్పడం ప్రారంభిస్తాడు..

''మీ తండ్రి రాజ ప్రతాప్ బహదూర్ గారు ఈ ప్రదేశాన్ని పరిపాలించిన రోజులలో తనకి ఇష్టమైన ప్రదేశాన్ని తన సొంతం చేసుకోవడానికి ఏం చేయడానికైనా వెనుకాడేవారు కాదని మా తాత గారు అంటూండే వారు.. మీ తండ్రి గారికి వేలాది ఎకరాల భూమిని తన సొంతం చేసుకోవాలనే ఆరాటం ఉండేదట.. నయానో, భయానో తనకి నచ్చిన భూమిని సొంతం చేసుకోవడంలో మీ తండ్రి గారు బహు నేర్పరి.. ఈ క్రమంలో మీ తండ్రి గారి కన్ను ఓ వంద ఎకరాల సారవంతమైన భూమిపై పడింది.. ఎప్పుడూ పచ్చని పంట పొలాలతో కళకళలాడుతున్న ఆ భూమిని దక్కించుకోవాలన్న ఆశ మీ తండ్రిగారికి పుట్టింది.. ఆ భూమి ఓ ఆదర్శ రైతు కుటుంబానిది..వారికి ఆ భూమి వంశపారంపర్యంగా వస్తూంది.. తరతరాలుగా తమ వంశం ఆధీనంలో ఉన్న ఆ భూమిని ఆ కుటుంబం తమ ప్రాణం కంటే ఎక్కువగా ప్రేమించేవారు.. వారి చేతుల్లోనుండి ఆ భూమిని రాబట్టుకోవడం కోసం రాజ ప్రతాప బహదూర్ ఆ కుటుంబానికి ధనాశ చూపించారు.. ఆ భూమిని తన సొంతం చేస్తే వారు కోరుకున్నంత ధనాన్ని ఇస్తానని వారిని ఎంతో ప్రాధేయపడ్డాడు.. రాజ ప్రతాప బహదూర్ మాటలకి ఆ కుటుంబం ససేమిరా అంది.. తమ ప్రాణాలు పోయినా సరే.. ఆ భూమిని మాత్రం వదులుకునేది లేదని ఖరాఖండిగా చెప్పడంతో ఆగ్రహించిన మీ తండ్రిగారు.. వారినుండి ఆ భూమిని బలవంతంగా ఆక్రమించుకుని ఆ కుటుంబాన్ని వీధి పాలు చేసారు.. కోపంతో రగిలిపోయిన ఆ కుటుంబం మీ వంశం అంతరించిపోవాలని శాపం పెట్టారు.. ఆ శాపం వల్ల మీ వంశాభివృద్ధి ఆగిపోవడమో, లేదా మీ వంశంలో ఎవరైనా పుట్టినా వారు అర్ధాయుష్షులై ఉండడమో జరుగుతుందని మా తాత గారు చెప్పారు.. ఆ శాపం వల్లనే మీ కుమారుడికి అల్పాయుష్షు సిద్ధించింది.. అంతేకాదు.. మీ తదనంతరం మీ ఇద్దరి కుమారులు తర్వాత ఇక మీ వంశం శాశ్వతంగా అంతర్ధానమైపోతుంది..''
సిద్ధాంతి చెప్పిన మాటలకి రాజ బహదూర్ భూపతి తట్టుకోలేకపోతాడు.. అతని మనసంతా

అస్తవ్యస్తమైపోతుంది.. దు:ఖంతో హృదయం బరువెక్కుతుంది.. ఆ నిజాన్ని భరించలేనన్నట్టుగా అలాగే కుప్పకూలిపోతాడు..

రాజ బహదూర్ భూపతిలో వచ్చిన ఆ మార్పులకి సిద్ధాంతి  ఎంతో ఆందోళన చెందుతాడు.. కుర్చీలోనుండి నేలమీద పడిపోయిన రాజ బహదూర్ భూపతిని బలవంతంగా లేపి కుర్చీలో కూర్చోబెడుతాడు సిద్ధాంతి ..

రాజ బహదూర్ భూపతి కళ్ళల్లోనుండి కన్నీళ్ళు ధారాపాతంగా రాలుతుంటాయి..

తన తండ్రి చేసిన తప్పిదానికి, తన కొడుకు శిక్ష అనుభవించడమా.. తనకి పుత్రశోకం కలగడమా..

హతవిధీ.. ఏమిటీ శిక్ష.. తలకొరివి పెట్టే కొడుకుకి తానే తలకొరివి పెట్టే సమయం రాబోతుందా..? ఆ ఆలోచనే భరించలేకపోతాడు రాజాబహదూర్ భూపతి.. అతనికి  ఎంతో ఆయాసం కలుగుతుంది.. గుండెల్లో చిన్నగా ప్రారంభమైన నొప్పి రాను రాను పెరగడం ప్రారంభించింది.. ఎంతో కష్టంగా సిద్ధాంతి  వంక చూస్తూ..

''సిద్ధాంతి  గారూ.. ఈ నిజాన్ని నేను భరించలేకపోతున్నాను.. నా కొడుకు నా కళ్ళముందు చనిపోతే చూస్తూ బ్రతికేంత ధైర్యం నాకు లేదు.. ఈ భయంకరమైన నిజం ఎవ్వరికీ తెలియడానికి వీల్లేదు.. ఈ నిజం నాతోనే సమాధి కావాలి.. అలా అని నాకు మాటివ్వండి..'' అంటూ సిద్ధాంతి  చేతిలో తన చేయి వేసి ప్రాణాలు  వదులుతాడు రాజ బహదూర్ భూపతి.

తన తండ్రి మరణాన్ని జీర్ణించుకోలేకపోతాడు అమరేంద్ర భూపతి.. ఎంతో ఆవేదనతో కృంగిపోతాడు..

కానీ అతని తమ్ముడు విజయేంద్ర భూపతి మాత్రం జల్సాగా త్రాగుతూ, తిరుగుతూ తన తండ్రి మరణించాడన్న బాధని కూడా వ్యక్తం చేయకుండా ఉంటాడు.

అతని ప్రవర్తన గురించి తెలుసు కాబట్టి అతన్ని పెద్దగా ఎవరూ పట్టించుకోరు.. కానీ అమరేంద్ర భూపతి రోజూ రోజుకూ తండ్రినే తలుచుకుంటూ దిగాలు  పడిపోవడం ఆందోళన కలిగిస్తుంది..ముఖ్యంగా రాజ బహదూర్ మరణం సిద్ధాంతి ని తీవ్రంగా కలచివేసింది.. తాను

నిజం చెప్పి ఉండకపోతే రాజ బహదూర్ చనిపోయి ఉండే వాడు కాదని, అతని చావుకి పరోక్షంగా తానే కారణమయ్యానని ఎంతో ఆవేదన చెందుతాడు. అందుకే అమరేంద్ర భూపతికి కళ్యాణం చేసే బాధ్యతని తన భుజస్కంధాలపై వేసుకుంటాడు..

అతనికి ఉన్నది అల్పాయుష్షే అయినా ఉన్నన్ని రోజులు అన్ని సుఖాలని అనుభవించేలా చేయాలని నిశ్చయించుకుంటాడు..

ఈ విషయాన్ని అమరేంద్ర భూపతి సోదరీమణులకి చెబుతాడు.. వారు సిద్ధాంతి నిర్ణయానికి ఒప్పుకుంటారు..

దాంతో సిద్ధాంతి అమరేంద్ర భూపతి కోసం మంచి వధువుని వెతికే పనిలో నిమగ్నమైపోతాడు..

వారి చుట్టూ ఉన్న గ్రామాల్లోనే కాకుండా సుదూర ప్రాంతాలలో కూడా అమరేంద్ర భూపతికి తగిన వధువు కోసం గాలింపు మొదలు పెడతాడు సిద్ధాంతి .. కొన్ని చోట్ల అమ్మాయి లక్షణంగా ఉన్నప్పటికీ ఇద్దరి జాతకాలు కలవడం లేదు.. మరి కొన్ని చోట్ల జాతకాలు కలిసినప్పటికీ అమ్మాయి అమరేంద్రభూపతికి సరైన జోడీ కాదన్న అభిప్రాయం సిద్ధాంతి లో కలిగింది..

సిద్ధాంతి లో ఉన్న ఆలోచన ఒకటే.. తన భర్త అల్పాయుష్కుడని ముందే చెబితే వివాహం చేసుకునేవారు ఎవరూ ఉండరు.. అలాగని ఆ విషయం దాచి పెళ్ళి చేస్తే తాను ఆ అమ్మాయి జీవితాన్ని మోసం చేసిన వాడవుతాడు..

అందుకే తన భర్త అల్పాయుష్షుడు అని తెలిసినా ఆ వంశం కీర్తి ప్రతిష్ఠలని తన భుజాన వేసుకుని ధైర్యంగా బ్రతకగల వీర వనిత కోసం అతని గాలింపు మొదలవుతుంది..

అలా గాలించగా ఒకానొక గ్రామంలో సిద్ధాంతి కి కావలసిన అమ్మాయి ఉన్నట్టు ఆయనకి సమాచారం వస్తుంది.. ఆ అమ్మాయే శారద.. శారద ఒక పేదింట్లో పుట్టింది.. ఆమె తల్లిదండ్రులకి శారద ఒక్కతే సంతానం..

అందుకే ఎంతో అల్లారు ముద్దుగా పెంచుతారు.. తాము పస్తున్నా సరే తమ కూతురుకి ఏ లోటూ రాకుండా చూసుకుంటారు.. పేదరికం వారికే గానీ, తమ కూతురుకి మచ్చుకైనా అంటకూడదన్న సంకల్పంతో వారుంటారు.

వారి ఆలోచనకి తగ్గట్టుగానే శారద చిన్నప్పటి నుండే ఎంతో చలాకిగా ఉంటుంది. చిన్నతనంలో సహజంగా చేసే అల్లరి చేస్తూనే తన చుట్టూ జరుగుతున్న సంఘటనలని అర్థం చేసుకునే సామర్థ్యాన్ని సొంతం చేసుకుంది

శారద. ఏ పని చేసినా ఎంతో ఏకాగ్రతతో, ఆ పని పూర్తి చేసే వరకూ మరో ఆలోచన లేకుండా ఉండే తమ కూతురిని చూస్తూ ఆ తల్లిదండ్రులు ఎంతో ఆనందపడతారు..

చదువులోనూ శారద ముందుండడంతో తమకి తలకి మించిన భారమే అయినా ఆమెని ఉన్నత చదువులు చదివిస్తారు.. శారదకి తన తల్లిదండ్రులంటే ఎంతో ప్రేమ.. తనకి పెళ్ళీడు వచ్చి పెళ్ళి చేయాలని తల్లిదండ్రులు అనుకుంటున్నట్టు తెలియగానే.. తాను పెళ్ళి చేసుకోనని, మీతోపాటే ఉంటానని భీష్మించుకుని కూర్చుంది.. తనని పెంచడం కోసం వాళ్ళెంత కష్టపడ్డారో కళ్ళారా చూసింది కాబట్టి వారిని విడిచి భర్తతో వెళ్ళిపోవడం ఆమెకి ఏమాత్రం ఇష్టం లేదు..

తనని పోషించడం కోసం వారు తమ జీవితానే త్యాగం చేసారు.. అలాంటి వారు ఇప్పుడు వృద్ధులుగా మారిపోయారు.. వారిని వదిలేసి, తన మానాన తాను భర్తతో అత్తారింటికి వెళ్ళడం ఎంత వరకు సమంజసం..?

అంటూ తన పెళ్ళి ప్రస్తావన తీసుకువచ్చే పెద్దవారిని ప్రశ్నించడంతో వారు చేసేది లేక వెనుదిరిగేవారు.. అందుకే ఆమెని పెళ్ళి చేసుకో అని చెప్పడానికి ఎవరూ ధైర్యం చేసేవారు కాదు..

సరిగ్గా అలాంటి సమయంలో సిద్ధాంతి దృష్టిలో పడుతుంది శారద.. సిద్ధాంతి రహస్యంగా శారద జాతక చక్రాన్ని తెప్పించుకుని చూస్తాడు.. శారద జాతకాన్ని చూసిన సిద్ధాంతి ముఖం లో ఎంతో ఆనందం.. ఇన్నాళ్ళుగా తాను వెతుకుతున్న అమ్మాయి ఈ శారదే అని అతనికి తెలిసి పోతుంది..

ఎంతో మనో నిబ్బరం, ఆత్మ స్థైర్యం, ఎంతటి విపత్కర పరిస్థితులనైనా ధైర్యంగా ఎదుర్కొనే ధీరత్వం, భర్త అండ లేకపోయినా సమాజంలో తలెత్తుకుని నిలబడగలిగే సంకల్ప బలం శారదలో ఉన్నాయని సిద్ధాంతి కి తెలిసిపోతుంది..

ఇక సిద్ధాంతి ఏమాత్రం ఆలస్యం చేయలేదు.. వెంటనే శారదని వెతుక్కుంటూ వెళతాడు.. ఓ కుగ్రామంలో ఓ పూరి గుడిసెలో శారదని చూస్తాడు సిద్ధాంతి .. ఆ ముఖంలో కనిపిస్తున్న తేజస్సును చూసి అతని మనసెంతో పులకించిపోతుంది.. జమిందారీ వంశానికి పెద్ద కోడలుగా శారదని ఊహించుకుంటాడు సిద్ధాంతి .. నూటికి నూరు శాతం శారద జమిందారు వంశాన్ని తన భుజాలపై మోస్తుంది.. పుత్ర శాపంతో అల్లాడిపోతున్న ఆ వంశానికి శారద రూపంలో అనంతమైన ఖ్యాతి సొంతమవుతుందని భావించిన సిద్ధాంతి మనసంతా ఆనందంతో నిండిపోతుంది..

ఖరీదైన గుర్రపు బండి తమ పూరి గుడిసె ముందు ఆగడంతో శారద, ఆమె తల్లిదండ్రులు ఎంతో ఆశ్చర్యపోతారు.. అందులోనుండి దిగిన సిద్ధాంతి ని చూసి వినయంగా రెండు చేతులెత్తి నమస్కరిస్తారు శారద తల్లిదండ్రులు ..

''మీ అమ్మాయికి అదృష్టం వెతుక్కుంటూ వచ్చింది.. ఈ చుట్టు పక్కల ఉన్న గ్రామాలను పరిపాలిస్తున్న రాజ బహదూర్ భూపతి కుమారుడు అమరేంద్ర భూపతిని వివాహం చేసుకోవడానికి మీ అమ్మాయి అన్ని విధాలా అర్హురాలని తెలుసుకుని వచ్చాను..'' అంటాడు సిద్ధాంతి ..

సిద్ధాంతి మాటలకి ఆ తల్లిదండ్రులిద్దరూ ఎంతో ఆశ్చర్యపోతారు.. పూటకి కూడా గడవకుండా ఉండే తామెక్కడా.. బంగారు పళ్ళాలలో భోజనం చేసే ఆ జమిందారులెక్కడ.. అసలు జరిగే పనేనా ఇది..? అని ఆశ్చర్యపోతారు..''ఎంతో మంది అమ్మాయిలని చూడగా, చివరికి మీ అమ్మాయే జమిందారు అమరేంద్ర భూపతికి తగిన వధువు అని కనుక్కున్నాము.. మీకు అభ్యంతరం లేకపోతే అమరేంద్ర భూపతితో మీ అమ్మాయి వివాహం అంగరంగ వైభవంగా జరిగిపోతుంది..'' చిరునవ్వుతూ అంటాడు సిద్ధాంతి ..

అది కలో, నిజమో అన్న సంధిగ్ధంలోనే ఉండిపోతారు తల్లిదండ్రులు .. ముందుగా శారద తల్లి తేరుకుంటుంది..

''అయ్యా.. నా బిడ్డ జమిందారు వంశానికి కోడలుగా వెళుతుందంటే మాకు అంతకంటే కావలసింది

ఏముంది..? నా కూతురు సంతోషమే మా సంతోషం కదా..'' అంటూంది. ఆనందంతో ఆమె కళ్ళల్లోనుండి కన్నీళ్ళు జాలువారుతాయి.. శారద తండ్రి కూడా ఎంతో సంతోషిస్తాడు..

కానీ.. శారద మాత్రం ఆ పెళ్ళికి ససేమిరా అంటుంది.. వాళ్ళు జమీందారులే కావొచ్చు.. కానీ.. తాను మాత్రం తన తల్లిదండ్రులని విడిచిపెట్టి ఎక్కడికీ కదిలేది లేదని ఖరాఖండిగా చెబుతుంది..

ధన కనక వస్తు వాహనాలు కాళ్ళ దగ్గరికి వచ్చినా కూడా తన కన్న తల్లిదండ్రుల కోసం వాటిని తృణ ప్రాయంగా వదిలేస్తానని అంటున్న శారద మనో నిబ్బరానికి ఎంతో అబ్బురపడతాడు సిద్ధాంతి..

ఆయన ఇక ఉపేక్షించదలచలేదు.. ఎలాగైనా శారదని, అమరేంద్ర భూపతి భార్యగా చేయాలన్న సంకల్పం ఆయనలో మరింత రెట్టింపవుతుంది.. దానికంటే ముందు శారదకి అమరేంద్ర భూపతి ఆయుష్షు గురించి తెలియజేయాలి.. ఈ విషయాన్ని చెప్పాక ఆమె నిర్ణయం ఎలా ఉండబోతోందో తెలుసుకోవాలి.. ఆమె ఒప్పుకోకపోతే ఎలాగైనా ఒప్పించాలి.. పసుపు కుంకుమతో భర్త ముందే తన ప్రాణాన్ని వదిలి పెట్టాలని ప్రతీ భారతీయ స్త్రీ కోరుకుంటుంది.. కానీ కళ్ళముందే తన భర్త చనిపోతాడని ముందే తెలిస్తే ఎవరు మాత్రం పెళ్ళి చేసుకుంటారు..?

కానీ.. శారద మనస్తత్వం, ఆమె మాటను బట్టి ఖచ్చితంగా ఆమె ఈ పెళ్ళికి ఒప్పుకుంటుందన్న నమ్మకం ఆయనలో కలిగింది..

అందుకే శారదతో ఏకాంతంగా మాట్లాడి ఆమె చేత ఈ పెళ్ళికి ఒప్పిస్తానని శారద తల్లిదండ్రులకి చెప్పడంతో వారు అక్కడి నుండి వెళ్ళిపోతారు.. వారు వెళ్ళిన తర్వాత సిద్ధాంతి

శారదకి  ఎన్నో విధాలుగా నచ్చ జెప్పే ప్రయత్నం చేస్తాడు.. కానీ శారద పెళ్ళికి అస్సలు  ఒప్పుకోదు.. ఇక చివరగా..

''చూడమ్మా.. శారద.. నీ కళ్ళల్లో ఆ కాంతి, నీ ముఖం లో తేజస్సు, నీ రూపంలో ఉన్న ఆ దర్పం ఇవ్వన్నీ నువ్వు ఇలా పేదదానిగా ఓ పూరి గుడిసెలో జీవించడానికి ఇష్టపడటం లేదని  తెలుపుతున్నాయి..  జమిందారు వంశానికి కోడలుగా రావడానికి నీకు అన్ని విధాలా అర్హత ఉంది.. అందుకే నిన్ను వెత్తుకుంటూ నేనే స్వయంగా ఇక్కడికి వచ్చాను.. జమీందారు వంశానికి కోడలుగా వచ్చిన అవకాశాన్ని నీవు ఏమాత్రం లక్ష్యపెట్టడం లేదంటేనే నీ తల్లిదండ్రుల పట్ల  నీకెంత  ప్రేమ ఉందో  అర్థమవుతుంది.. అయితే  నువ్వు జమీందారుని పెళ్ళి చేసుకోవడానికి ఒప్పుకుంటే.. నీతో పాటు నీ తల్లిదండ్రులు  కూడా ఆ కోటలోనే ఉంటారు.. ఇంద్రభవనం లాంటి ఆ బంగళాలో చుట్టూ ఉన్న పని మనుషులు  మధ్య ఎంతో వైభవంగా మీరు జీవించవచ్చు.. నీ భర్త తదనంతరం ఆ జమీందారు వంశానికి నువ్వే అధినాయకురాలు  అవుతావు.. కటిక దారిద్ర్యాన్ని అనుభవిస్తూ గడిపిన ఈ ప్రదేశాన్నే నువ్వు పరిపాలించవచ్చు..''

సిద్ధాంతి మాటలకి శారద ముఖంలో ఏదో మార్పు వస్తుంది.. దాన్ని గమనించిన సిద్ధాంతి ముఖం లో ఆనందం ప్రత్యక్షమవుతుంది..

''నేను పెళ్ళి చేసుకున్నాక.. మా అమ్మ, అయ్యని కూడా నాకాడనే ఉంచుకోవచ్చునా..'' అమాయకంగా అంటూంది శారద..

''ఆ దేవుడి మీద ప్రమాణం చేసి చెబుతున్నాను.. నీ పెళ్ళి తర్వాత నీవుండే ఆ రాజభవనంలోనే నీ తల్లిదండ్రులు కూడా ఉంటారు.. నీవు అనుభవించే రాచ మర్యాదలన్నీ, వారూ అనుభవిస్తారు.. ఈ పెళ్ళికి నువ్వొప్పుకుంటే మీ జీవితాలే మారిపోతాయి..'' నమ్మకంగా అంటాడు సిద్ధాంతి ..

చిన్నప్పటి నుండీ తన తల్లిదండ్రులు  తనని పెంచి పోషించడం కోసం ఎంత కష్టపడ్డారో శారద కళ్ళముందు కదలాడుతుంది.. వారి కోసమైనా ఈ వివాహేకి అంగీకరించాలని మనసులో అనుకుంటుండగా.. అసలు  విషయాన్ని ఆమె ముందు ఉంచుతాడు సిద్ధాంతి ..

''ఈ వివాహంతో నీకు అన్నీ సమకూరుతాయి.. విలాసవంతమైన జీవితం నీకు లభిస్తుంది.. నీ తల్లిదండ్రులు జీవితాంతం ఏ కష్టాలు  లేకుండా గడుపుతారు.. ఐశ్వర్యం నీ చుట్టూ చేరిపోతుంది.. కానీ.. కానీ..'' ఎలా చెప్పాలో అర్థం కానట్టుగా సందేహిస్తాడు సిద్ధాంతి ..

''ఆ.. కానీ.. ఏమిటండీ.. చెప్పండి..'' అంటుంది శారద ఆత్రంగా..

''కానీ.. నువ్వు చేసుకోబోయే అమరేంద్ర భూపతి అల్పాయుష్కుడు.. అతనికి అన్నీ ఉన్నాయి కానీ.. కానీ ఆయుష్షు లేదు..'' అంటాడు సిద్ధాంతి .. ఈ మాటలకి శారద ఎలా రియాక్ట్ అవుతుందా అని ఆమె ముఖం  వంకే చూస్తూ..

ఆ మాటలకి శారద షాకైపోతుంది.. అల్పాయుష్షుడైన వాడిని చేసుకుని, అతను మరణించాక విధవగా జీవితమంతా గడపాలా.. ఆ ఆలోచనే శారద భరించలేకపోయింది.. ఆమె ముఖంలో కోపం ప్రవేశిస్తుంది..

ఎదురుగా కనిపిస్తున్న సిద్ధాంతి ని పీక పిసికి చంపేయాలన్నంత కసి పెరుగుతుంది.. వయసులో పెద్దవాడు కావడంతో తన కోపాన్ని నిగ్రహించుకుంటుంది శారద.

''అమ్మా.. నేనీ విషయం చెప్పగానే నీకు కోపం వస్తుందని నాకు తెలుసు.. ఒక అల్పాయుష్షు కలిగినవాడితో నీ వివాహం జరిపించి నీ జీవితాన్ని నాశనం చేయాలనుకునేంత పాపాత్ముడిని నేను కాను.. నీ జాతక చక్రాన్ని గమనించాకే నేనీ నిర్ణయం తీసుకున్నాను.. నీ జాతకంలో కూడా నీ పెళ్ళయిన కొన్ని సంవత్సరాలకే భర్తని పోగొట్టుకుంటావని స్పష్టంగా ఉంది.. అంతేకాదు.. వివాహం అనంతరం నీవెన్నో కష్టాలని భరించాల్సి ఉంటుందని కూడా నీ జాతకంలో ఉంది.. కానీ.. నువ్వెన్ని కష్టాలని అనుభవిస్తావో.. అంతకంటే రెట్టింపు ఖ్యాతిని కూడా పొందుతావని నీ జాతకంలో ఉంది.. ఈ ప్రపంచం మొత్తం చుట్టివచ్చే అవకాశం కూడా నీ జాతకంలో కనిపిస్తుంది..

నువ్వు ఈ జమిందారుని వివాహం చేసుకోకుండా మరెవరిని చేసుకున్నా నీ జాతకరీత్యా నీ భర్త నీ వివాహం అయిన కొద్ది సంవత్సరాలకే చనిపోవడం ఖాయం.. ఇది ఆ దేవుడి నిర్ణయం.. దీన్ని ఎవరూ చెరపలేరు.. ఆ తర్వాత నీ ఇష్టం..'' సిద్ధాంతి  చెప్పిన మాటలు  విని శారద కొయ్యబారిపోతుంది.. ఆమె మెదడు స్థబ్దుగా మారిపోతూంది.. ఒక విధమైన షాక్‌కి

గురవుతుంది.. తేరుకోవడానికి ఆమెకి పది నిముషాల  సమయం పడుతుంది.. ఆ తర్వాత శారద ఆలోచనలో పడిపోతుంది..

భర్తని పోగొట్టుకోవడం అన్నది తన చేతిలో లేదు.. అది దైవ నిర్ణయం.. దైవ నిర్ణయానికి ఎదురొడ్డి పోరాడి నిలువగలమా..? ఆమె మనసు మెల్లిగా కుదురుకుంటుంది... ఆమె ఆలోచనలు  శరవేగంగా పరుగు తీస్తున్నాయి.

జమీందారుని వివాహం చేసుకుంటే తన జీవితంతో పాటు తన తల్లిదండ్రుల  జీవితాలలో కూడా వెలుగు   నిండుతుంది.. కాదని తాను మొండికేస్తే..  ఆ తర్వాత ఊహించడానికి కూడా శారద   మనసు అంగీకరించడంలేదు..  మంచో, చెడో.. అమరేంద్ర భూపతి జమీందారుని వివాహం చేసుకోవాలనే చివరికి నిర్ణయం తీసుకుంది శారద.. ఆమె నిర్ణయంతో సిద్ధాంతి లో ఎంతో సంతోషం కలుగుతుంది.. ఈ విషయం వెంటనే అమరేంద్ర భూపతికి తెలియజేయాలన్న ఆరాటం ఆయనలో కనిపిస్తుంది..

శారద దగ్గర సెలవు తీసుకుని వెంటనే అమరేంద్ర భూపతి దగ్గరికి వెళతాడు సిద్ధాంతి .. తనకి తగిన వధువుని చూశానని సిద్ధాంతి  చెప్పడంతో ముందు వివాహానికి ససేమిరా అంటాడు అమరేంద్ర భూపతి. తండ్రి మరణంతో తీవ్ర విషాదంలో ఉన్న ప్రస్తుత తరుణంలో తనకి పెళ్ళి చేసుకోవాలనే ఉద్దేశ్యం లేదని అంటాడు.

కానీ.. అమరేంద్రభూపతికి  సిద్ధాంతి  తో పాటు అతని సోదరీమణులు  కూడా నచ్చజెప్పడంతో తప్పని పరిస్థితిలో తన వివాహానికి ఒప్పుకుంటాడు అమరేంద్రభూపతి.

పదిహేను రోజుల్లో అమరేంద్ర భూపతి వివాహం శారదతో అంగరంగ వైభవంగా జరిగిపోతుంది.. అమరేంద్ర భూపతి శారదని చూసిన మొదటి చూపులోనే ఆమెపై ఎంతో ప్రేమని పెంచుకుంటాడు. శారద కూడా అమరేంద్ర భూపతిని చూసిన మరుక్షణం ఆమె కళ్ళల్లోనుండి కన్నీళ్ళు జల  జలా రాలుతాయి..

ఎంత సుందర రూపం తన భర్తది.. ఈ రూపం ఈ భూమిపై ఉండేది కేవలం  కొద్ది సంవత్సరాలు మాత్రమే అన్న నిజం శారద మనసులో మెదులుతూంటే గునపంతో గుచ్చినంత బాధ కలుగుతుంది.వివాహం జరిగిన మొదటి రోజునే శారద ఒక నిర్ణయానికి

వచ్చింది.. ఇంకా ఎన్నాళ్ళు ఆయన బ్రతుకుతాడో తెలియదు.. కానీ అమరేంద్ర భూపతి బ్రతికినన్ని రోజులు ఏలోటూ రాకుండా చూసుకోవాలన్నదే ఆమె నిర్ణయం..

పెళ్ళి అయిన అనంతరం తల్లిదండ్రులతో సహా విశాలమైన ఆ భవంతిలోకి వచ్చిన శారదకి ఆ వాతావరణం అంతా కొత్తగా అనిపిస్తుంది.. ఇంద్రభవనం లాంటి ఆ ఇంటిలో, పదుల సంఖ్యలో ఉన్న పనివారి మధ్యలో మహారాణి జీవితంలోకి అడుగుపెట్టిన శారదకి ఆ ఐశ్వర్యం అనుభవించడం సంతోషంగా ఉన్నా, తన భర్త గురించిన దిగులు మాత్రం ప్రతీ క్షణం ఆమెని వెంటాడుతూనే ఉంది.

అమరేంద్ర భూపతి, శారదని ఎంతో ప్రేమగా చూసుకుంటున్నాడు.. భార్యా, భర్తలు ఇద్దరి అన్యోన్యతని గమనించిన పనివారు సైతం ఎంతో ముచ్చట పడుతున్నారు.. తన తండ్రి మరణంతో దిగాలుపడిపోయిన అమరేంద్ర భూపతి, శారద రాకతో మెల్లి మెల్లిగా కోలుకోవడం ప్రారంభించాడు. శారద చూపిస్తున్న ప్రేమకి అతనిలో అమితమైన ఉత్సాహం వచ్చేసింది.. ఏకాంతంగా ఉన్నప్పుడు ఇద్దరూ మనసు విప్పి తమ భావాలని పంచుకున్నారు.. జమీందారుగా తన ముందున్న కర్తవ్యాలన్నింటినీ శారదతో పంచుకున్నాడు అమరేంద్ర భూపతి.. తన జీవితంలో శారద ప్రవేశించడంతో అమరేంద్ర భూపతికి ఎంతో పెద్ద ఊరట లభించినట్లయింది.. శారద కూడా అమరేంద్ర భూపతి చూపిస్తున్న అనురాగంలో తడిసి ముద్దయిపోయింది..

భార్యా, భర్తలు ఇద్దరూ ఒకరినొకరు అర్థం చేసుకోవడానికి ఎంతో సమయం పట్టలేదు.. ఇద్దరిలోనూ స్వతంత్ర భావాలు ఉండడం, ఇద్దరి ఆలోచనలు ప్రజలకి మేలు చేయాలన్న తీరులోనే కలిగి ఉండడంతో ఇద్దరూ ఒకరిని విడిచి ఒకరు ఉండలేనంతగా అనురాగాన్ని పంచుకున్నారు.

ఆ కొత్త జంట ఆ భవనంలో సందడి చేస్తుంటే ఆ భవనానికే కొత్త కళ వచ్చినట్టయ్యింది. అమరేంద్ర భూపతి సోదరీమణులు కూడా ఆ జంటని చూసి తెగ ముచ్చట పడిపోయారు.. కళ్ళ ముందే శారద, అల్లుడు అమరేంద్ర భూపతి ఇద్దరూ ఎంతో అన్యోన్యంగా గడపడం చూస్తున్న శారద తల్లిదండ్రుల ఆనందానికి అవధుల్లేకుండా పోయాయి.

తన కూతురుకి పట్టిన అదృష్టానికి వారెంతగానో సంబరపడిపోతున్నారు.. ఇన్నాళ్ళుగా అనుభవించిన పేదరికం ఎగిరిపోవడం, కావాలనుకున్నది ఏదయినా పనివారు క్షణాల్లో సమకూర్చడంతో శారద తల్లిదండ్రులు  ఎంతో సంబరంగా జీవితాన్ని అనుభవిస్తున్నారు. మెల్లి మెల్లిగా ఆ వాతావరణానికి అలవాటు పడింది శారద.. ఇంట్లో ఉన్న పనివాళ్ళని ఎంతో అభిమానంగా చూసుకుంటోంది శారద.. దాంతో పనివాళ్ళు కూడా శారదని ఎంతో గౌరవాన్ని పెంచుకున్నారు

వారితో కలివిడిగా ఉంటూ, తనకి కావాలసిన పనులని చేయించుకోవడంలో  శారద నేర్పు స్పష్టంగా కనిపిస్తుంది. పనివాళ్ళకి ఏదయినా కష్టం వస్తే.. వెంటనే తన భర్తతో చెప్పి వారి కష్టాన్ని తీర్చేయడంతో పనివాళ్ళందరి దగ్గరా విపరీతమైన అభిమానాన్ని సంపాదించుకుంది శారద.

తమ ఆస్తి  వ్యవహారాలని, ఆదాయ లెక్కలని చూసుకునే దివాను కూడా శారదని అభిమానంగా చూస్తాడు..మొత్తానికి పెళ్ళైన కొన్ని రోజుల  వరకు శారద జీవితం భర్త సాంగత్యంలో ఎంతో ఆహ్లాదంగా, అద్భుతంగా సాగిపోయింది.. శారద కూడా అమరేంద్ర భూపతిని కంటికి రెప్పలా చూసుకుంటుంది. భర్తకి కావలసినవన్నీ దగ్గరుండి శారదే చూసుకుంటోంది. భర్తకి ఇష్టమైన వంటకాలని స్వయంగా తానే చేసి పెడుతోంది..

అమరేంద్ర భూపతిని కలవడానికి చుట్టు  పక్క ఊళ్ళ నుండి ఎంతో మంది వచ్చేవారు.. వారందరూ విశ్రాంతి తీసుకోవడానికి ఆ భవంతిలో ఒక పెద్ద హాలు  ఉండేది.. వచ్చిన వారందరూ ఆ హాల్లోనే కూర్చుండే వారు..

ఆ హాలు  పక్కనే అమరేంద్ర భూపతి కార్యాలయం ఉండేది.. తనని కలవడానికి వచ్చిన వారందరినీ ఒక్కొక్కరితో విడిగా ఆ కార్యాలయంలోకి పిలిపించి అమరేంద్ర భూపతి మాట్లాడుతుండే వాడు..

దూర గ్రామాలలో నుండి ఎడ్ల బండ్లు కట్టుకుని అమరేంద్ర భూపతిని కలవడానికి వచ్చేవారికి, ఒక్కోసారి సాయంత్రం వేళ అయినా కూడా ఆయనని కలవడం కుదరనంత బిజీగా

ఉండేవాడు.. అలాంటప్పుడు వారు ఆకలి దప్పులకు అల్లాడుతుండే వారు.. అమరేంద్ర భూపతిని కలిసి తిరిగి వెళ్ళేటప్పుడు ఎంతో నీరసంగా వెళ్ళిపోయేవారు..

వారి అవస్థని శారద గమనిస్తుంది..

ఆ వెంటనే తన భర్త తో ఈ విషయాన్ని ప్రస్తావించి, వారందరికీ ఉదయం వేళ అల్పాహారం, మధ్యాహ్నం భోజనం, సాయంత్రం వేళ  అల్పాహారం ఏర్పాటు చేయిస్తే బావుంటుందన్న

సలహాని ఇస్తుంది.. తన భార్యకి వచ్చిన ఆ ఆలోచనకి అమరేంద్ర భూపతి ఎంతో పొంగిపోతాడు.. ఇన్నాళ్ళుగా తమకి రాని ఆలోచన శారదకి రావడంతో మరోవైపు గర్వంగా కూడా ఫీలవుతాడు అమరేంద్ర భూపతి..

ఆ మరునాటి నుండే అమరేంద్ర భూపతిని కలవడానికి వచ్చే ప్రతీ వారికి అల్పాహారం, భోజనం ఏర్పాట్లు దగ్గరుండి చేయించింది శారదమ్మ.. దాంతో అమరేంద్ర భూపతిని కలవడానికి వచ్చే ప్రజలు  ఎంతో ఆనందపడిపోతారు.. తమ కష్టాలను గమనించి తగిన చర్యలను తీసుకోవడంలో అమరేంద్ర భూపతినే మించిపోయింది ఆయన భార్య శారదమ్మ అంటూ శారదని పొగడ్తల తో ముంచెత్తుతారు.

ఈ విషయం అమరేంద్ర భూపతి ఆదీనంలో ఉన్న గ్రామ ప్రజలందరికీ తెలిసిపోతూంది.. ప్రజలందరూ ఎంతగానో సంతోషిస్తారు. అంతేకాదు.. చుట్టు ప్రక్కల  ఉన్న ఎవరి ఇండ్లలోనయినా శుభకార్యాలు  జరుగుతున్నాయని తెలిసినప్పుడు అమరేంద్ర భూపతి వారికి కొంత ధనాన్ని సహాయంగా అంద జేసేవాడు.. శారద ఆ ఆచారాన్ని కూడా మార్చి వేసింది.. ఎవరిండ్లలోనయినా పెళ్లిళ్లు జరుగుతున్నాయని తెలిస్తే వారికి మంగళ సూత్రం, వధూ, వరులకు పట్టు వస్త్రాలను అందించే సంప్రదాయాన్ని మొదలు  పెట్టింది.. చిన్న, చితకా శుభకార్యాలకి ఆయా శుభకార్యాని బట్టి వస్త్రాలను, ధనాన్ని, పండ్లు, పలహారాలని ఇవ్వడం ప్రారంభించింది..

అమరేంద్ర భూపతిని పెళ్ళి చేసుకుని అతి తక్కువ కాలంలోనే శారద ప్రజలందరిలోనూ ఎంతగానో పేరు సంపాదించుకుంది.వివాహం అయిన మొదట్లో శారదని గానీ, అమరేంద్ర భూపతిని గానీ పెద్దగా పట్టించుకోలేదు విజయేంద్ర భూపతి.. అయితే అమరేంద్ర భూపతి

పెళ్ళి అయిన తర్వాత, తమ ఇంట్లో జరుగుతున్న పరిణామాలని గమనిస్తూండిపోయాడు.. శారదపై విజయేంద్రభూపతికి దురభిప్రాయం మాత్రం ఏర్పడింది.. ఎందుకంటే ఓ పూరి గుడిసెలో, కటిక పేదరికాన్ని అనుభవించిన శారదని తీసుకువచ్చి తమ ఇంట్లో ఐశ్వర్యవంతురాలిగా చేయడం విజయేంద్ర భూపతికి నచ్చలేదు. తన ఇష్టాఇష్టాలని పట్టించుకునే వారు లేకపోవడంతో చేసేది లేక మిన్నకుండి పోయాడు. అన్న వివాహంలో కూడా విజయేంద్ర భూపతి పెద్దగా హడావిడి చేయకుండా తన పనేదో తాను చూసుకున్నాడు.

అయితే తండ్రి మరణించడంతో విజయేంద్రభూపతి ఆగడాలకు అడ్డూ అదుపూ లేకుండా పోయాయి..

అమరేంద్ర భూపతికి తన తమ్ముడు చేసే దుశ్చర్యలను చెప్పేంత చొరవ ఎవరికీ లేకపోవడంతో విజయేంద్ర భూపతిపై శ్రద్ధ చూపే వాడు కాదు అమరేంద్ర భూపతి. ఎప్పుడు అడిగినా తమ పొలానికి సంబంధించిన పనులు చేయిస్తున్నానని విజయేంద్ర భూపతి చెబుతూండేవాడు.. ఒక్కోసారి వారంలో నాలుగు రోజుల వరకు అసలు ఇంటి ఛాయలకి కూడా వచ్చేవాడు కాదు.

అయినా కూడా అమరేంద్ర భూపతికి అనుమానం కలగలేదు. వంద ఎకరాల వ్యవసాయం ఉండడంతో వాటిని చూసుకునేందుకు విజయేంద్రభూపతి కష్టపడుతున్నాడని అనుకున్నాడే కానీ, తన తమ్ముడు చేసే చెడు సావాసాల గురించి అసలు తెలియదు అమరేంద్ర భూపతికి.. లెక్కలు అడిగే వారు లేకపోవడంతో విజయేంద్ర భూపతి తన జల్సా కోసం విపరీతంగా డబ్బుని ఖర్చు పెట్టడం మొదలు పెట్టాడు..

ఇక అమరేంద్ర భూపతి సోదరీమణులు, బావలు సైతం ఆ భవనంలో శారద పెత్తనం మెల్లి మెల్లిగా పెరిగిపోతుండడంతో తమకి అందిన కాడికి దోచుకోవడం మొదలు పెట్టారు. తండ్రి ఉన్నంత వరకూ ఒద్దికగా ఉన్న వాళ్ళు, అమరేంద్రభూపతి వివాహం అయిన మరుక్షణం ఆ బంగళాలో ఉన్న బంగారం, వెండి, నగదుపై కన్నేసారు. అమరేంద్రభూపతి వాటి విషయం పెద్దగా పట్టించుకోకపోవడంతో వారు ఆడింది ఆట, పాడింది పాటగా మారిపోయింది..

అమరేంద్ర భూపతి జమిందారు గిరీ వ్యవహారాలని చూసుకోవడంతో తమ్ముడు విజయేంద్రభూపతి ఎప్పుడూ వ్యవసాయం పనులతో బిజీగా ఉన్నాడని భావించిన అమరేంద్ర భూపతి ఇంటి వ్యవహారాలు, తమ ఆస్తిపాస్తులకి సంబంధించిన వ్యవహారాలు, ఆదాయానికి సంబంధించిన లెక్కల వ్యవహారాలన్నింటినీ చూసే బాధ్యతని శారదపై పెడతాడు. అప్పటికే ఆ ఇంటీలో శారదంటే అందరిలోనూ గౌరవ భావం ఉండడంతో శారద ఎంతటి భాద్యతనైన ఇట్టే నిర్వహిస్తుందన్న నమ్మకం అమరేంద్ర భూపతిలో కలుగుతుంది. అందుకే ముఖ్యమైన వ్యవహారాలన్నింటినీ శారదకి అప్పచెబుతాడు. దాంతో అమరేంద్రభూపతి తోబుట్టువులకి శారదపై కసి పెరగడం ప్రారంభమవుతుంది..

అప్పటి వరకూ ఎంతో అన్యోన్యంగా, ఆహ్లాదకరంగా గడిచిపోయిన తన జీవితంలో ఓ పెద్ద కుదుపు రావడానికి నాంది అప్పుడే పడిందని ఊహించని శారద, అమరేంద్ర భూపతి తనకి అప్పచెప్పిన బాధ్యతని నెరవేర్చడానికి వెంటనే రంగంలోకి దిగిపోతుంది..

లెక్కలని చూసే దివాను సహాయంతో తమ ఆస్తిపాస్తుల వివరాలని, ఆదాయ వనరులని అన్నింటినీ పరిశీలించిన శారదకి మెల్లి మెల్లిగా ఆ ఇంట్లో.. తమ ఇంటి వారే చేస్తున్న మోసాలు ఒక్కొక్కటిగా వెలుగులోకి రావడం మొదలవుతుంది. తన మరిది విజయేంద్రభూపతి చెడుసావాసాల గురించి కూడా దివాను ద్వారా తెలుసుకుంటుంది శారద. అలాగే తమ ఆడపడుచులు కూడా అందినకాడికి దోచుకుపోవడం, ఆస్తి పాస్తులు , భూములకి సంబంధించిన కొన్ని పత్రాలని మాయం చేసి తాము స్వాధీనం చేసుకోవడానికి సంబంధించిన వివరాలని కూడా తెలుసుకుంటుంది.

తమకి తెలియకుండా జరుగుతున్న ఈ విషయాన్నింటినీ జమిందారు అమరేంద్ర భూపతితో చెప్పాలనుకుంటుంది కానీ.. చెప్పలేకపోతుంది శారద.. ఇప్పటికే చుట్టూ ఉన్న గ్రామాలోని ప్రజల సమస్యలని తీర్చే పనులలో ఎంతో సమయాన్ని కేటాయిస్తూ అలసిపోతున్న తన భర్తకి ఇంట్లో జరుగుతున్న ఈ వ్యవహారాలని చెబితే ఎలా స్పందిస్తాడో అన్న భయం ఆమెలో చోటు చేసుకుంది.

ఒక వేళ జమీందారు ఆగ్రహంతో తన ఆడపడుచులని, మరిదిని నిలదీస్తే.. ఈ విషయాలన్నింటినీ తానే చెప్పానని తెలుసుకుని వారు తనపై కక్ష పూనుతారన్న భయం కూడా ఆమె అమరేంద్రభూపతికి చెప్పకపోవడానికి ఒక కారణం. పెళ్ళయి సంవత్సరం కూడా పూర్తి కాకుండా ఇంట్లో వారందరి మధ్య చిచ్చు పెట్టిందన్న అపవాదు తనపై పడుతుందన్న ఆలోచన కూడా శారదలో కలిగింది.. అందుకే భర్తకి ఈ విషయం చెప్పకుండా మౌనం వహించింది..

కానీ.. చూస్తూ.. చూస్తూ.. ఈ అన్యాయాలని ఎలా సహించగలదు.. ఈ విషయంలో ఏదో ఒకటి చేయాలన్న పట్టుదల మాత్రం శారదలో పెరిగిపోయింది.. ఇదే విషయాన్ని దివానుతో సంప్రదించింది.. ఆ కుటుంబానికి ఎంతో నమ్మకస్తుడైన దివానుకి ఆ ఇంట్లో అక్రమంగా తరలిపోతున్న ఆస్తి గురించి అంతా తెలుసు.. అలాగే విజయేంద్రభూపతి చేసే ఖర్చు కూడా దివాను లెక్కల్లో రాసుకుంటాడు .. ఈ లెక్కలని అమరేంద్ర భూపతి కి చూపించకూడదన్న బలమైన హెచ్చరిక విజయేంద్ర భూపతి ద్వారా, అతని సోదరీమణుల ద్వారా రావడంతో మిన్నకుండిపోవడం తప్ప మరేమీ చేయలేకపోయాడు దివాను..

కానీ.. ఇన్నాళ్ళకి ఆ ఇంటి ఇల్లాలు శారద ద్వారా వారు చేస్తున్న మోసాలన్నింటినీ అమరేంద్ర భూపతి దృష్టికి తీసుకువెళ్ళాలనుకున్నాడు దివాను. శారద ఈ విషయంపై తనని అడగగానే ఆమెకి రాజ విజయేంద్ర భూపతి నిర్యాణం తర్వాత వారు కాజేసిన ఆస్తుల వివరాలని, విజయేంద్ర భూపతి జల్సాలకి అయిన ఖర్చులకి సంబంధించిన లెక్కలని శారద ముందు పెట్టాడు.. వాటన్నింటినీ చూసిన శారద నోరు తెరిచింది..

విజయేంద్ర భూపతి నెల వారీ ఖర్చు అక్షరాలా లక్ష రూపాయులు ..

లక్ష రూపాయలంటే.. వెయ్యి పేద కుటుంబాలు నెల రోజుల పాటు ఆనందంగా బతకడానికి సరిపడే సొమ్ము.. ఎన్నో వేల ఎకరాల భూములు ఉండడం, వాటిలో వంద ఎకరాల్లో వ్యవసాయం సమృద్ధిగా సాగిపోతుండడంతో విజయేంద్రభూపతి పెట్టే ఖర్చుని ఎవరూ పెద్దగా పట్టించుకోలేకపోయారు. ముఖ్యంగా ఈ విషయాన్ని జమిందారు అమరేంద్ర భూపతి దృష్టికి తీసుకువెళ్లితే, ఖచ్చితంగా విజయేంద్రభూపతిపై ఆగ్రహిస్తాడు.. అసలే

తనంటే విజయేంద్రభూపతికి అయిష్టత ఉందన్న విషయం అతని ప్రవర్తన ద్వారా కనిపెట్టింది శారద.. ఈ పరిస్థితిలో అతనిపై తన భర్తకి చెబితే ఎలాంటి పరిస్థితులు  ఎదురవుతాయో అన్న ఆలోచన ఆమెలో కలిగింది. తన అన్న అమరేంద్ర భూపతి తో కలిసి ఉన్నప్పుడు విజయేంద్ర భూపతి అన్నంటే ఎంతో అభిమానం ఉన్నట్టుగా, అతనికి భయపడుతున్నట్టుగా ఉంటాడు. అది ఖచ్చితంగా నటననే అని శారద ఎప్పుడో కనిపెట్టేసింది.. ఇప్పుడు అతగాడు పెట్టే ఖర్చుని చూసాక అది నిజమే అని నిర్ధారణ అయ్యింది..

విజయేంద్ర భూపతి చుట్టూ ఎప్పుడూ ఓ గుంపు ఉంటుంది.. విజయేంద్రభూపతిని పొగడడం, అతను ఇచ్చే నజరానాని అందుకోవడం కొందరి పనయితే, మరికొందరు విజయేంద్ర భూపతి కన్నేసిన మగువని నయానో, భయానో ఒప్పించి అతని చెంతకి చేరవేసి అతను అందించే నజరానాని తీసుకోవడం మరి కొందరి పని.. ఇక వ్యవసాయ క్షేత్రంలో ఉన్న తోటకి, పంట పొలాలకి కావలిసిన ఎరువుని తీసుకువచ్చి, వాటికయ్యే ఖర్చుని రెట్టింపుగా చెప్పి దండుకునే వారు మరి కొందరు.. ఇక గ్రామాలలో కాసే ఇప్పపూవు నాటు సారాని ప్రత్యేకంగా విజయేంద్రభూపతి కోసం ఏర్పాటు చేసి డబ్బు దండుకునే వారు మరికొందరు.. ఇలా అతని చుట్టూ ఉన్న వీరందరి మధ్య విజయేంద్ర భూపతి ఎంతలా చెడిపోవాలో అంతలా చెడిపోయాడు. వారందరికీ విజయేంద్ర భూపతి పెట్టే ఖర్చు నెలకి లక్ష రూపాయలు.

రాను రాను తన మరిది విజయేంద్ర భూపతి, ఆడపడుచులు చేస్తున్న ఆరాచకాలు  శృతిమించిపోవడంతో ఇంక చేసేది లేక ఒక రోజు అమరేంద్ర భూపతికి అన్ని విషయాలను చెబుతుంది శారద. శారద మాటలు  విన్న అమరేంద్ర భూపతి భరించలేకపోతాడు. ముఖ్యంగా తన తమ్ముడు వ్యసనాలకు బానిసయ్యాడన్న విషయాన్ని అతడు జీర్ణించుకోలేకపోతాడు.

అమరేంద్ర భూపతి ముఖంలో మారుతున్న భావాలని గమనించి ఆందోళన చెందుతుంది శారద. ఈ విషయాలు  కేవలం  అతనికి దృష్టికి తీసుకురావాలన్న ఉద్దేశ్యమే తప్ప అతని చేత వారికి చివాట్లు తినిపించాలని శారదలో ఏకోశానా లేదు.. కానీ.. అమరేంద్ర భూపతి

ఊరుకోలేదు.. ఆగ్రహావేశాలతో ఊగిపోయాడు. శారద వారిస్తున్నా వినిపించుకోకుండా విజయేంద్ర భూపతి దగ్గరకు వెళ్తాడు.

మొట్ట మొదటి సారిగా తన వంక కోపంగా దూసుకువస్తున్న అన్నని చూసి ఎంతో విస్మయానికి గురౌతాడు విజయేంద్ర భూపతి. అతను ఏదో అనబోయేంతలోనే అమరేంద్రభూపతి తమ్ముడి చొక్కాని పట్టుకుని రెండు చెంపలు వాయించేస్తాడు.. ఆ హఠాత్పరిణామానికి ఎంతో షాక్‌కి గురవుతాడు విజయేంద్రభూపతి..

''తరతరాలుగా  పరువు, ప్రతిష్టని కాపాడుకుంటూ వస్తున్న మన వంశం తల దించుకునే పనులు  చేస్తావురా నువ్వు..'' అంటూ ఆగ్రహంతో ఊగిపోతాడు అమరేంద్రభూపతి.. విచక్షణా జ్ఞానం కోల్పోయి తమ్ముడిని తీవ్రంగా కొడతాడు. మొట్ట మొదటి సారి అన్న కళ్ళల్లో కనిపించిన ఆగ్రహ జ్వాలని చూసి భయపడిపోతాడు విజయేంద్ర భూపతి. ఆ హఠాత్పరిణామానికి పని వాళ్ళందరూ కొయ్యబారిపోయి అలాగే చూస్తూండి పోతారు. విజయేంద్ర భూపతిని, అమరేంద్ర భూపతి గొడ్డును బాదుతున్నట్టు కొడుతున్నాడని తెలుసుకున్న సోదరీమణులు  పరుగుపరుగున అక్కడికి వస్తారు.

అమరేంద్ర భూపతిని అడ్డుకునే ప్రయత్నం చేస్తారు.. అయినా అమరేంద్ర భూపతిలో తమ్ముడిపై కోపం తగ్గదు.. తనకి అడ్డు వచ్చిన తన సోదరీమణులని ఈడ్చి పక్కకి నెట్టేస్తాడు. దాంతో ఇద్దరూ తలో పక్కన పడిపోతారు..

తమ భార్యని అమరేంద్ర భూపతి అలా ఈడ్చివేయడంతో వారి భర్తలకి కోపం వస్తుంది.. ఇద్దరూ అమరేంద్ర భూపతిపైకి వస్తారు..

అదంతా చూస్తున్న శారదకి ఏం చేయాలో అర్థం కాలేదు. ఎవర్ని వారించాలో తెలియకుండా అలాగే ఉండిపోతుంది.. ఆరోజు ఆ భవంతిలో జరిగిన ఈ గొడవతో ఇన్ని రోజులుగా ఎంతో ఆహ్లాదంగా ఉన్న ఆ ఇంటి వాతావరణం ఒక్కసారిగా వేడెక్కిపోయింది..
తోబుట్టువులు  తమ్ముడికి అండగా నిలిచారు.. బావలు  కూడా విజయేంద్ర భూపతినే వెనకేసుకు వచ్చారు. అమరేంద్ర భూపతి అలా ప్రవర్తించడం వెనుక శారద హస్తం ఉందని వారికి తెలిసిపోవడంతో అందరూ శారదపై కక్ష పెంచుకుంటారు. ప్రజల  శ్రేయస్సు కోసం

నిరంతరం పాటు పడుతున్న అమరేంద్రభూపతికి తన కుటుంబీకులే ఇంతటి ద్రోహానికి పాల్పడడం, తన తమ్ముడు ఇన్ని పాపాలని చేయడం ఏమాత్రం సహించలేకపోతాడు. అందుకే వారందరినీ నిర్దాక్షిణ్యంగా ఇంట్లోనుండి బయటికి గెంటించివేస్తాడు.

జమిందారు గారింట్లో జరిగిన ఆ కుటుంబ గొడవ క్షణాల్లో అన్ని గ్రామాల్లోకీ ప్రాకిపోతుంది.. అందులో అధిక శాతం ప్రజలు అమరేంద్ర భూపతి వైపు నిలబడగా, మిగతా వారందరూ విజయేంద్రభూపతికి వత్తాసు పలుకుతారు. దాంతో కనిపించని ఓ యుద్దానికి తెరలేచింది.

విజయేంద్ర భూపతి తన అన్నా వదినపై ఎంతో పగని పెంచుకుంటాడు. దానికి తోడు తన అక్కలు కూడా వత్తాసు పలకడంతో అతనిలో ఉన్న పగ తీవ్ర రూపం దాల్చుతుంది. ముఖ్యంగా శారద పేరు వింటేనే అతను మండిపడిపోతున్నాడు.

ఒక చిన్న అగ్గిరవ్వ చాలు పెద్ద జ్వాలగా మారడానికి.. అలాగే ఒక చిన్న కారణం చాలు , పగ ప్రతీకార జ్వాలలు రగిలించడానికి.. ఇప్పుడు విజయేంద్ర భూపతి, అతని అక్క, బావల లక్ష్యం ఒక్కటే.. తనని ఇంట్లోనుండి గెంటేసిన అమరేంద్రభూపతి, అతని భార్య శారదపై ప్రతీకారం తీర్చుకోవడం.. అందుకోసం ఎంతకైనా తెగించడానికి వారు సిద్దపడిపోయారు.

ఆ ఇంట్లో మారిపోయిన పరిస్థితులతో తీవ్రంగా కలత చెందుతుంది శారద.. ఇదంతా తన వల్లే జరిగిందన్న ఊహే ఆమె భరించలేకపోతూంది. అమరేంద్ర భూపతికి అసలు విషయం ఎందుకు చెప్పానా అని మదనపడిపోయింది.

కానీ.. ఎప్పటికైనా ఈ విషయం ఆయనకి తెలియాల్సిందే కదా.. అంటూ ఓదారుస్తాడు దివాను.

అయినా ఆమె మనసులో మాత్రం ఆందోళన ప్రతిఫలిస్తూనే ఉంటుంది. పైగా విజయేంద్ర భూపతి గురించి తెలిసిన కొందరు పని వాళ్ళు, అన్నపై పగ పెంచుకున్న అతని నుండి అమరేంద్రభూపతికి ప్రమాదం పొంచి ఉందని చెప్పడంతో శారద మరింత కంగారు పడిపోతుంది.

తన భర్తకి అల్పాయుష్షు ఉందని సిద్ధాంతి  గారు చెప్పిన మాటలు  శారద చెవుల్లో మారు మ్రోగిపోతుంటాయి..ఆ మాటలు  గుర్తుకి రాగానే ఆమెలో మరింత ఆందోళన ప్రవేశిస్తోంది.

తన భర్త  క్షేమం కోసం కనిపించిన దేవుళ్ళకి అందరికి మొక్కింది.

ఈ గొడవ వేడి ఒక నెల  రోజుల  వరకు కొనసాగింది.. ఆ తర్వాత నివురు గప్పిన నిప్పులా సద్దుమణిగిపోయిందన్నట్టుగా పరిస్థితులు  ఏర్పడటంతో అప్పటికి శారద మనసు కొద్దిగా స్థిమిత పడింది. విజయేంద్ర భూపతి తన తప్పుని తెలుసుకుని అన్న చెంతకి రావాలని మనస్ఫూర్తిగా కోరుకుంటుంది శారద. కానీ అది సాధ్యమయ్యే పని కాదని కొందరు పని వాళ్ళు చెబుతారు.

ఇలా ఉండగా ఒక రోజు ఉదయాన్నే కొందరు రైతులు  ఎంతో ఆందోళన చెందుతూ అమరేంద్రభూపతిని కలవడానికి వస్తారు. అలా వచ్చిన రైతులలో ఒకడు రామరాజు.. వారందరినీ గమనించి శారద అక్కడికి వస్తుంది.

తాము వెంటనే జమిందారు గారిని కలవాలని శారదతో వేడుకుంటారు. అసలు  వారెందుకు అంతలా ఆందోళన చెందుతున్నారు.. అసలేం జరిగింది..? అని కుతూహలంగా అడుగుతుంది శారద. దాంతో వారందరూ ‘‘పదేళ్ళ క్రిందట తమ మామ గారు రాజ బహదూర్ భూపతి గారు మాకు దానంగా ఇచ్చిన వ్యవసాయ భూమిని అమరేంద్ర భూపతి సోదరీమణులు , వారి భర్తలు  అన్యాయంగా లాక్కున్నారమ్మా..’’

అంటూ బోరున విలపిస్తారు శారద ముందు. శారద ఎంతగానో ఆశ్చర్యపోతుంది వారి మాటలు  విని.. అప్పుడే అక్కడికి వస్తాడు అమరేంద్ర భూపతి..

ఆయన్ని చూడగానే రైతులందరూ మూకుమ్మడిగా అతని కాళ్ళమీద పడిపోతారు రామరాజుతో సహా.

‘‘అయ్యా.. మాకు మీరే న్యాయం చేయాలయ్యా.. మీ తండ్రి గారు మాకు దానంగా ఇచ్చిన వందెకరాల వ్యవసాయ భూమిని మీ అక్కలు , బావలు  లాక్కున్నారయ్యా.. వారితో మాట్లాడి

మా భూములు  మాకు ఇప్పించే బాధ్యత మీదేనయ్యా..'' అంటూ రోదిస్తారు వారంతా..వారి మాటలు  విన్న అమరేంద్ర భూపతికి పట్టరానంత కోపం వస్తుంది..

''మా జమిందారు వంశంలో దానంగా ఇచ్చిన భూమిని తిరిగి లాక్కోవడం అన్నది ఇంత వరకూ జరగలేదు..

జరగదు కూడా.. మీరేమీ దిగులు  పడకండీ.. మీ భూమి మీకు తిరిగి ఇప్పించే బాధ్యత నాది..'' అంటూ వారిని ఓదార్చి పంపించి వేస్తాడు అమరేంద్ర భూపతి.

భర్త నిర్ణయంతో శారదలో మళ్ళీ భయం ప్రవేశిస్తుంది.. అసలే అమరేంద్ర భూపతిపై ఎంతో కోపంగా ఉన్న వారు, ఇప్పుడు ఈ భూమికోసం వారితో ఘర్షణకి దిగితే ఎలాంటి పరిణామాలు  చోటు చేసుకుంటాయో అన్న ఆందోళన శారదలో కలుగుతుంది.

వారితో మాట్లాడడానికి వెళ్లడం కోసం, సిద్ధ పడుతున్న భర్త దగ్గరికి ఆందోళనగా వస్తుంది  శారద..

''ఏవండీ.. మీరు ఇప్పుడు అక్కడికి వెళ్ళి మాట్లాడితే మళ్ళీ గొడవలు  మొదవుతాయి.. అసలే మీపై వారు

ఎంతో కోపంగా ఉన్నారు.. ఈ పరిస్థితిలో మీరు వారితో మాట్లాడటం ఏమాత్రం మంచిది కాదు.. నా మాట వినండి.. కావాలంటే ఈ రైతులకి మనకున్న భూముల్లోనుండి కొంత దానంగా ఇచ్చేయండి.. అంతేకానీ.. మీరు మాత్రం వారి దగ్గరకు వెళ్ళడానికి వీళ్ళేదు..'' అని అంటుంది శారద ఖరాఖండిగా..

శారద మాటలకి అమరేంద్ర భూపతి ఎంతో కోపంగా చూస్తాడు..

''మా జమీందారు వంశం గురించి నీకేం తెలుసని అలా మాట్లాడుతున్నావు..? ఒక్క సారి ఎవరికైనా దానంగా ఇచ్చిన దానిని తిరిగి లాక్కోవడమన్నది మా వంశ చరిత్రలోనే జరగలేదు. అలాంటిది.. ఇప్పుడు వారు అన్యాయంగా రైతుల నుండి భూమిని లాక్కుంటే చూస్తూ ఊరుకోమంటావా..? ఇప్పుడు నేను మౌనంగా ఉండిపోతే..

ఇప్పటి వరకూ ఎంతో జాగ్రత్తగా కాపాడుకుంటూ వచ్చిన మా వంశ పరువు, ప్రతిష్ఠ మంట గలిసిపోతుంది..

రేప్పొద్దున గ్రామాల్లోకెళ్ళి ప్రజల  ముందు నా మొహాన్ని ఎలా చూపించుకోమంటావు..'' ఆగ్రహంగా ప్రశ్నిస్తాడు అమరేంద్ర భూపతి.

తాను ఎంత చెప్పినా అమరేంద్ర భూపతి వినడని అర్థమైపోతుంది శారదకి. ఆమె మనసెందుకో కీడుని శంకిస్తుంది.. అమరేంద్ర భూపతిని రెచ్చగొట్టడానికి కావాలనే వారు ఈ పథకం వేశారేమో అన్న అనుమానం కూడా ఆమెలో కలుగుతుంది. దాంతో ఆమెలో ఆందోళన మరింత తీవ్ర రూపం దాల్చుతుంది..

అమరేంద్ర భూపతిని ఒంటరిగా పంపడానికి ఆమె మనసు అంగీకరించడం లేదు.. ఏం చేయాలో అర్థం కాకుండా ఏడుస్తూ ఉన్న శారదని చూసి ఆమె తల్లిదండ్రులు  తల్లడిల్లిపోతారు..

''నువ్వూరుకో బిడ్డా.. అల్లుడు గారిది ఎంతో మంచి మనసు.. మంచి వాళ్ళకి ఆ దేవుడు అండగా ఉంటాడు..

నువ్వు భయపడమాకు.. కావాలంటే అల్లుడు  గారికి తోడుగా మేము కూడా వెళ్తాము.. మాకు వీలయినంత మటుకు వారికి సర్దిచెప్పే ప్రయత్నం చేస్తాము..'' అంటూ శారద చెబుతున్నా వినకుండా..

అమరేంద్ర భూపతి వెనకాలే గుర్రపు బండిలో వారు కూడా బయలు  దేరుతారు. శారద ఎంతో విలపిస్తుంది..

తానెంత చెప్పినా వినిపించుకోకుండా వెళ్ళిన వాళ్ళని ఆ దేవుడే రక్షించాలి అంటూ దేవుళ్ళని ప్రార్థిస్తూ అలాగే కుప్పకూలిపోతుంది..

ఏదో అనర్థం జరగబోతుందని తన మనసులో సంకేతాలు  మొదలవుతుండడంతో తీవ్రంగా కలత చెందుతుంది...

శారద.. కళ్ళ నిండా నీళ్ళతో ఆ భవంతి ముఖ ద్వారం వంకే చూస్తూ ఉండిపోతుంది.. క్షణాలు భారంగా గడుస్తుంటాయి.. ఆమె మనసులో సముద్రపు ఘోష.. ఏ క్షణం ఏ మాట వినాల్సొస్తుందో అన్న భయం.. శారదని ఆ పరిస్థితిలో చూసిన పనివారందరూ ఆమె చుట్టూ మూగి ఆమెని ఓదారుస్తుంటారు.. అయినా శారదలో భయం తగ్గదు.. గంటా.. రెండు గంటలు .. మూడు గంటలు .. సమయం భారంగా గడిచిపోతుటుంది.. ఆమె చూపు గేటు వైపే ఉంటుంది.. తన భర్త రాక కోసం ఆమె మనసు ఎంతో ఆత్రంగా ఎదురు చూస్తుంటుంది..

నాలుగు గంటల సమయం తర్వాత ఓ పనివాడు గేటుని తోసుకుంటూ పరుగు పరుగునా లోనికి వస్తాడు..

''అమ్మగారూ.. అయిపోయిందమ్మా.. జమిందారు గారిని, మీ అమ్మా, అయ్యని ఆ దుర్మార్గులు పొట్టన పెట్టుకున్నారమ్మ ''అంటూ పెద్దగా రోదిస్తూ చెబుతాడు అతడు..

ఆ మాటలు విన్న శారదలో చలనం ఆగిపోతుంది.. వినకూడని వార్త వినడంతో ఆమె శరీరంలోని అవయవాలన్నీ పనిచేయడం ఆగిపోతాయి.. పనివాళ్ళందరూ ఆ దారుణ వార్త విని రోదించడం ప్రారంభిస్తారు..

అందరూ శారద వైపు జాలిగా చూస్తూండి పోతారు.. శారదలో ఎలాంటి చలనం లేకపోవడంతో వారు భయాందోళనకు గురవుతారు..

సరిగ్గా అరగంట తర్వాత విజయేంద్ర భూపతి, తన అక్క, బావలతో ఆ భవంతిలోకి ప్రవేశిస్తాడు.. అతని ముఖం లో పగ చల్లార్చుకున్నానన్న పైశాచిక ఆనందం కనిపిస్తుంటుంది.. వారి వెనక వస్తున్న తన అక్కలు, బావలు శారదపై కోపంతో రగిలిపోతుంటారు..

విజయేంద్ర భూపతి వచ్చీరాగానే ''ఒరేయ్.. ఇది ఇక్కడికి వచ్చినప్పుడు చినిగిపోయిన చీర ఓ సంచిలో పెట్టుకుని వచ్చిందే దాన్ని తీసుకురా..'' అంటూ ఓ పనివాడికి హుకుం జారీ చేస్తాడు.. ఆ పని వాడు గజ గజ వణికిపోతూ వెంటనే లోపలికి వెళ్ళి ఆ సంచిని తీసుకువస్తాడు.. విజయేంద్ర భూపతి శారద జుట్టు పట్టుకుని బలవంతంగా పైకి

లేపుతాడు..''పూరి గుడిసెలో పుట్టినదానివి నీకు బంగళాలెందుకే.. నా అన్నని మా పైకి ఉసిగొల్పినావు గదే నువ్వు..

ఇప్పుడు అన్నే లేకుండా పోయాడు.. ఇంక నువ్వెందుకే ఈ బంగళాలో..'' అంటూ పచ్చి బూతులు తిడుతూ ఆమెని మెయిన్ గేటు వరకు ఈడ్చుకుంటూ వచ్చి బయటికి తోసేస్తాడు.. ఆ తోపుకి నేల మీద పడిపోతుంది శారద..

''మళ్లీ ఈ ఇంటి ఛాయలలో కనిపిస్తే.. నిన్ను కూడా నీ మొగుడు దగ్గరికి పంపిస్తాను జాగ్రత్త..'' అంటూ దఢేల్ మని గేటుని మూసేస్తాడు విజయేంద్ర భూపతి..

ఆ సన్నివేశాన్ని ఎంతో ఆనందంగా వీక్షిస్తుంటారు విజయేంద్ర భూపతి అక్క, బావలు ..

శారదని అలా గెంటేయడంతో ఆ భవంతిలో పనిచేసే వారందరూ మనసులోనే ఎంతో రోదిస్తుంటారు..

అందరిలోనూ శారదపై విపరీతమైన జాలి కలుగుతుంది.. కానీ.. విజయేంద్ర భూపతికి భయపడి ఎవరూ శారదని కాపాడే సాహసం చేయలేకపోతారు.. తనని ఇంత అవమానపరిచినా అది పట్టించుకునే స్థితిలో లేదు శారద..

తన భర్త మరణించాడని పనివాడు చెప్పిన మాటలే ఆమె మెదడులో తిరుగుతూ ఉంటాయి.. కళ్ళల్లోనుండి కన్నీళ్ళు కూడా రానంతగా షాక్‌కి గురవుతుంది శారద.. ఆ గేటుకి అవతల గుమి గూడిన జనం శారదనే చూస్తూండిపోతారు.. ప్రజలలో ఎవరూ కూడా నేలపై కిందపడ్డ శారదని లేపే సాహసం చేయలేరు.. కానీ శారదని చూసి అందరూ విలపిస్తుంటారు.. శారద ఈ లోకంలో లేనట్టు శూన్యంలోకి పిచ్చి చూపులు చూస్తూ పక్కనే పడిపోయిన సంచిని చేతిలోకి తీసుకుని, మెల్లిగా లేచి ఆ దారిగుండా ముందుకు సాగిపోతుంది..

అక్కడంతా నిశ్శబ్ద వాతావరణం అలుముకుంది.. రామదాసు కళ్ళల్లోనుండి కన్నీళ్ళు జలజలా రాలుతుండగా గతం తాలూకు దృశ్యాలు కళ్ళముందు కదలాడుతున్నట్టుగా అతని చూపులు శూన్యంలోకి చూస్తున్నాయి. గోపాల్ కూడా మౌనంగా ఉన్నా శారద గతం

తెలుసుకున్న తర్వాత ఆయన హృదయాంతరాలలో ఎంతో భావోద్వేగం కట్టలు తెంచుకుంటుంది. అయినప్పటికీ గంభీరవదనంతో మౌనంగా ఉండిపోయాడు.

ఆనంద స్వరూప్ చూపులు శారదవైపే ఉన్నాయి. ఆమె అనుభవించిన కష్టాలు, ఒకప్పుడు ఆమె జమీందారు నేపథ్యం ఉన్నదని తెలుసుకున్న ఆయనకి శారదపై ఎనలేని అభిమానం కలిగింది.. పది నిమిషాలు భారంగా దొర్లాయి..

ఆ తర్వాత గోపాల్ కుర్చీలో నుండి లేచి శారద దగ్గరికి వచ్చి రెండు చేతులెత్తి నమస్కరించాడు..

''శారదమ్మా.. మీ గురించి తెలుసుకున్న తర్వాత, మీరు అనుభవించిన కష్టాలు, అవమానాలు విన్న తరువాత మీపైన నాకు మరింత గౌరవం పెరిగింది.. ఎవరూ లేని అనాధలా ఈ గుడిలోకి వచ్చిన మీరు వందల కోట్ల ఆస్తిపాస్థులు కలిగిన వారని తెలిసి ఇంకా నమ్మలేకపోతున్నాను.. మీరు ఈ గుడిలోకి వచ్చినప్పుడు మిమ్మల్ని చూసిన మొదటి క్షణమే మీపైన నాకు ఎనలేని గౌరవ భావం కలిగింది.. గుళ్లో మీరు శ్రద్ధా భక్తులతో పని చేస్తుంటే ఆ గౌరవభావం ఆరాధనాపూర్వకంగా మారింది. మీరు ఎవరూ లేని అనాధలా పరిచయం చేసుకున్నప్పటికీ మీ ముఖంలో తాండవిస్తున్న ఆ కళ, మీ కళ్ళల్లో ఉన్న ఆత్మవిశ్వాసం మీరు అనాధ కాదని, మీరు ఎంతో ఉన్నత స్థితి నుండి వచ్చారని అప్పుడే ఊహించాను.. అందుకే మీ గతం తెలుసుకోవాలన్న తపన నాలో అధికం అయ్యింది.. ఆ సాయినాధుడి దయవల్ల నేడు మీరేమిటో, మీ వ్యక్తిత్వం ఏమిటో అవగతమయింది..'' భావోద్వేగంతో ఆయన కళ్ళల్లోనుండి కన్నీళ్ళు జలజలా రాలాయి..

శారద మెల్లిగా తలెత్తి గోపాల్ వంక చూసింది.. మౌనంగా ఓ చిరునవ్వు నవ్వి ఊరుకుంది..

రామదాసు భుజంపై ఉన్న రుమాలు తో కళ్ళు తుడుచుకుని,

''ఈ అమ్మగారి గతం గురించి సెప్పే అదృష్టం నాకు కలిగినందుకు నాకెంతో ఆనందంగా ఉందయ్యా... ఇన్నాళ్ళుగా ఈయమ్మ యాడుందో, అసలు ఉందో, లేదో అన్న బాధతో ఉన్న మాకు ఈడ కనిపించిన ఈయమ్మని సూడంగనే పోయిన ప్రాణం తిరిగొచ్చినంత పనయ్యింది..'' ఆనందంగా అన్నాడు రామదాసు..

''ఏ దిక్కూ లేని దానిలా వచ్చిన శారదమ్మని ఆ భగవంతుడు సరయిన దారిలోకి తీసుకువచ్చాడు.. ఆ సాయినాధుడి ఆశీర్వాదంతోనే శారదమ్మ ఈ గుళ్ళోకి అడుగిడింది ..

శారదమ్మ రాకతో ఈ గుడికి మరింత వన్నె చేకూర్చింది. సాయినాథుడి దివ్య ప్రవచనాలతో ఈ మందిరాన్ని దేశ విదేశాలవారికి సైతం పరిచయం చేయగలిగింది..'' ఆనందంగా అన్నాడు గోపాల్..

''మీరన్నది నిజమే గోపాల్ గారూ.. శారదమ్మ గతం తెలుసుకున్న నాకు ఆమెపై ఎనలేని అభిమానం కలిగింది.. ఇకనుండి శారదమ్మ ఈ గుళ్ళో పనిచేసే సాధారణ స్త్రీ కాదు, ఆ సాయినాథుడికి సేవలందించేందుకు స్వయంగా సాయినాథుడి ఆశీర్వాదంతో వచ్చిన గొప్ప భక్తురాలు, అందుకే మన కమిటీ మెంబర్లందరూ ఆమెకు సముచిత గౌరవాన్ని ఇవ్వాలని నేను ఆదేశిస్తున్నాను..'' ఆనంద స్వరూప్ గంభీరంగా అన్నాడు..

ఆయన మాటకి శారద ముఖం లో కాస్త మొహమాటం కనిపించింది..

''అయ్యో.. మీరు అలా మాట్లాడి నన్ను గొప్పదాన్ని చేయకండి.. ఆ సాయినాథుడి ఆశీర్వాదంతో, నాకున్న కొద్దిపాటి పరిజ్ఞానంతో నాకు తోచింది నేను చేసాను తప్ప ఇందులో నా గొప్పతనం ఏమీ లేదు..'' వినయంగా అంది శారదమ్మ..

ఆమె మాటలకి అబ్బురపడిపోయాడు ఆనంద స్వరూప్..

''ఈ వినయవిధేయతలే మీ వ్యక్తిత్వాన్ని మరింత పరిపూర్ణం చేస్తున్నాయి శారదమ్మ గారూ.. మీకు మీరుగా సాధారణ వ్యక్తిలా అభివ్యక్తీకరించినప్పటికీ మీ విలువ ఏమిటో నాకు తెలుసు.. మీ సేవలు కేవలం ఈ ఒక్క మందిరానికి వచ్చే భక్తులకే పరిమితం కాకూడదు, మీరు చేసే ప్రవచనాలు ప్రస్తుతం ఉన్న ఈ సమాజానికి ఎంతో అవసరం, మానవ విలువలు దిగజారుతున్న ఈ పరిస్థితులలో ఆ సాయినాథుడు మీ రూపంలో మనిషిలోని మానవత్వాన్ని మేల్కొలిపేందుకు మా మధ్యలోకి తీసుకువచ్చాడు..

శారదమ్మ గారూ.. నేను అమెరికాలో ఉన్నప్పటికీ నాకు భగవంతుడు, భక్తి, ఆధ్యాత్మిక ఆరాధన అంటే ఎంతో ఇష్టం, అమెరికాలో మా ఇంట్లో ప్రత్యేకంగా సాయినాథుడికి ఓ మందిరాన్ని కట్టించుకున్నాను. అంతేకాదు అమెరికాలో ఉన్న లక్షలాది తెలుగు వారందరినీ ఒకేతాటికి తీసుకువచ్చి ఒక తెలుగు సంఘంగా ఏర్పరచి దానికి అధ్యక్షుడిగా కూడా కొనసాగుతున్నాను.. మన రాష్ట్రంలో భగవంతుడిని ఎంత భక్తిగా ఆరాధిస్తారో, అమెరికాలో ఉన్న తెలుగు ప్రజలు కూడా అంతే భక్తిగా భగవంతుడిని పూజిస్తారు. అందుకే అక్కడ ప్రతీ ఒక్క రాష్ట్రంలో మన

దేవుళ్ళ మందిరాలు వెలిసాయి, ప్రతీరోజూ ధూప, దీప నైవేద్యాల తో ప్రతీ మందిరం కూడా శోభాయమానంగా అలరారుతుంది.. వయసు అయిపోయిన వాళ్ళే కాదు, యువతీ యువకులు కూడా మన సంస్కృతి, సంప్రదాయాలకు అనుగుణంగా మసులుకుంటారు.. వాళ్ళలో అలాంటి మార్పు తీసుకు రావడం కోసం నేను ఎంతో కృషి చేస్తున్నాను.. విదేశీ కల్చర్ కొంత అలవరుచు కున్నప్పటికీ మన సంస్కృతిని కూడా వారిలో నాటడానికి నావంతుగా నేను కృషి చేస్తున్నాను.. నా కృషికి ఇప్పుడు మీరు కూడా తోడు కాబోతున్నందుకు నాకెంతో ఆనందంగా ఉంది..'' ఆనంద స్వరూప్ ముఖం లో ఆనందం వెల్లవిరుస్తుండగా అన్నాడు..

ఆయన మాటలకి శారదమ్మ ఆశ్చర్యంగా చూసింది..

''మీలాంటి పెద్ద వారికి నేను తోడుని అందించడమా...?'' అంది శారదమ్మ..

''అవును శారదమ్మ గారూ.. మీ సహకారం నాకు కావాలి, నేను అమెరికాలో చేస్తున్న ఆధ్యాత్మిక ఉద్యమానికి మీరూ తోడ్పాటుని అందించాలి, మీ ప్రవచనాలతో అక్కడి జనాలని కూడా రంజింప జేయాలి, భగవంతుడిపై భక్తిని ప్రేరేపించేలా మీరు చేయాలి.. భవిష్యత్తు తరం ప్రలోభాలకి లోను కాకుండా మనం కృషి చేయాలి.. అందుకే మిమ్మల్ని నాతో పాటుగా అమెరికాకి తీసుకు వెళ్ళాలనుకుంటున్నాను..''

ఆనంద స్వరూప్ మాటలకి శారదమ్మ అవాక్కయిపోయింది.. ఆమెకి నోట మాట రాలేదు.. తానేమిటీ.. అమెరికా వెళ్లడమేమిటీ.. తాను వింటున్నది నిజమేనా అన్న సందిగ్ధం కలిగింది ఆమెలో.. ఆమె ఆ ఆశ్చర్యంలో నుండి తేరుకోకముందే తిరిగి ఆనంద స్వరూప్ అన్నాడు..

''మీ అభిప్రాయం తెలుసుకోకుండా నేనీ నిర్ణయం తీసుకున్నందుకు నన్ను మన్నించండి.. కానీ.. మీ సేవలు అక్కడి తెలుగు వారికి కూడా అందాలన్నదే నా తాపత్రయం.. నా విన్నపాన్ని మన్నించి మీరు నాతో పాటు అమెరికాకి రావాలి.. ఇది నా ఆదేశం కాదు, అభ్యర్థన..'' అంటూ ఆమె వంక చూసాడు ఆనంద స్వరూప్.. ఆమె ఏమి చెబుతుందా అన్న ఆతృత ఆయనలో కనిపిస్తుంది..

''నేను.. నేను.. అమెరికా.. అంత దూరం నేను రావడమా..?'' సందిగ్దంగానూ, అయోమయంగానూ అంది శారదమ్మ.. ఆమె మాటలకి చిన్నగా నవ్వాడు ఆనంద స్వరూప్..

''మీరు కంగారు పడాల్సినదేమీ లేదు.. ఒక ఆరు నెలల పాటు మీరు అమెరికాలో ఉండేందుకు కావాల్సిన ఏర్పాట్లు నేను చేస్తాను.. మీకు ఉండడానికి, మీ బాగోగులు చూసుకోవడానికి మనుషుల్ని ఏర్పాటు చేస్తాను.. అక్కడ మీకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చూసుకునే బాధ్యత నాది.. నా మాట కాదనకండి..'' అన్నాడు ఆనంద స్వరూప్..

శారదమ్మ ఎటూ తేల్చుకోలేకపోతుంది.. ఆనంద స్వరూప్ నిర్ణయానికి గోపాల్ కూడా ఎంతో సంతోషించాడు.. శారదమ్మ అయోమయ పడటం చూసిన గోపాల్ ఆమెకి సర్ది చెబుతున్నట్టుగా అన్నాడు..

''అమ్మా.. మీరు మరీ అంతగా విచారించాల్సిన అవసరం లేదు.. స్వయంగా ఆనంద స్వరూప్ గారే మిమ్మల్ని అమెరికాకి ఆహ్వానిస్తున్నారంటే ఈ గౌరవం ఇంతవరకూ ఎవరికీ దక్కలేదు.. మీరేమీ ఆలోచించకుండా అమెరికా వెళ్ళేందుకు అంగీకరించండి..'' సంతోషంగా అన్నాడు గోపాల్..

రామదాసు రెండు చేతులు కట్టుకుని వినయంగా వారి మాటని వింటూ మౌనంగా ఉండిపోయాడు...

''కానీ.. గోపాల్ గారూ..'' అంటూ శారద ఏదో చెప్పాలని అనుకుంటుండగా మధ్యలోనే అడ్డుకున్నాడు గోపాల్..

''అమ్మా.. ఈ విషయంలో మీరింకేమీ ఆలోచించకండి.. అక్కడ మీకేలోటూ రాదు.. ఆనందంగా ఒప్పుకోండి..'' అన్నాడు గోపాల్.. రెండు క్షణాలు ఆలోచించిన శారదమ్మ చివరికి సరే అనక తప్పలేదు.. ఆమె నిర్ణయానికి ఆనంద స్వరూప్, గోపాల్ ఇద్దరూ ఎంతో సంతోషించారు.. ఆనంద స్వరూప్ గోపాల్ వంక చూస్తూ..

''గోపాల్ గారూ.. మరో నెల రోజుల్లో అమెరికా ప్రయాణం ఉంటుంది.. మీరు శారదమ్మకి కావాల్సిన పాస్ పోర్ట్ సంగతి చూడండి.. వీసా గురించి నేను చూసుకుంటాను.. ఈ క్షణమే శారదమ్మ రాక గురించి అమెరికాలో ఉన్న మా సంఘం సభ్యులకు తెలియ జేస్తాను.. మేము అమెరికాకి వెళ్ళే సరికి శారదమ్మకి కావాల్సిన సౌకర్యాలు ఏర్పాటు అయ్యేలా చూస్తాను..'' అంటూ శారదమ్మకి నమస్కరించి అక్కడి నుండి కదిలాడు ఆనంద స్వరూప్..

శారదమ్మలో ఎక్కడో తెలియని భయం ఉన్నప్పటికీ ''అంతా ఆ సాయినాధుడి లీల.. ఏమి జరిగినా ఆ సాయినాధుడే చూసుకుంటాడు'' అని మనసులోనే అనుకుంటూ ఎదురుగా చిద్విలాసంగా దర్శనమిస్తున్న సాయినాధుడికి భక్తిపూర్వకంగా నమస్కరించింది శారదమ్మ.

..............................

ఆ మరునాడు రామదాసు తమ ఊరికి వెళ్ళేందుకు సిద్దమయ్యాడు..

''అమ్మా.. శారదమ్మా.. మిమ్మల్ని ఇట్లా కలుసుకున్నందుకు నాకెంతో ఆనందంగా ఉంది.. ఎంటనే ఎళ్ళి మీ విషయాన్ని మన ఊరోళ్ళందరికీ సెపితే కానీ నాకు తృప్తి ఉండదు.. ఇంక నేను బయలుదేరుతానమ్మా..'' అన్నాడు రామదాసు..

ఆయన మాటకి శారదమ్మ కంగారుపడింది..

''ఒద్దు రామదాసూ... నేను ఇక్కడ ఉన్న విషయం నువ్వు ఎవరితోనూ చెప్పకు.. నేను అమెరికా నుండి తిరిగి వచ్చాక వీలు చూసుకుని ఒకసారి ఊరికి వస్తానులే..'' అంది శారద..

ఆ మాటలకి రామదాసు ఎంతో సంతోషపడ్డాడు..

''మీరు ఊరికి వస్తానన్న ఆ చల్లని మాట చాలు తల్లీ.. నీ రాక కోసం మేమంతా ఎదురుసూత్తూంటాము.. మీరు ఊరికి రావాలా, మీ మరిదిగారు సచ్చిపోయిన తర్వాత శిధిలావస్థలో పడిపోయిన ఆ భవంతికి తిరిగి పూర్వ వైభవాన్ని నువ్వు తీసుకు రావాలి తల్లీ..'' ఆనందంగా అన్నాడు రామదాసు..

''హు.. మళ్ళీ గత వైభవాన్ని అనుభవించాలన్న ఆశ నాకు లేదు రామదాసు.. ఆ ఆస్థి పాస్తుల మీద నాకు ఆసక్తి ఎప్పుడో చచ్చిపోయింది.. కేవలం మీ అందరిని చూడడానికి మాత్రమే నేను వస్తాను..'' నిర్వేదంగా అంది శారదమ్మ..

''కోట్ల రూపాయల ఆస్తిని గాలికి ఒదిలేత్తానంటే ఎట్టా తల్లీ.. అయినా ఈ కాలం లో ఆస్తి వస్తుందంటే లాగేసుకోవడానికి ఆరాటపడే వాళ్ళెంతమంది ఉన్నారు.. నువ్వేమో ఉన్న ఆస్తిని వద్దంటున్నావాయే.. సరేలే.. ఏది ఏమయినా.. నువ్వు మళ్ళీ ఊళ్లోకి అడుగు పెట్టాలి.. నువ్వొస్తున్నావని తెలిస్తే ఊళ్ళో వాళ్లంతా ఎంత సంతోషపడతారో కదా..'' కళ్ళల్లో ఆనంద బాష్పాలు రాలుతుండగా అభిమానంగా అన్నాడు రామదాసు.. అతను తనపై చూపిస్తున్న అభిమానానికి చలించిపోయింది శారదమ్మ.. ఆమె కళ్ళల్లోనుండి కూడా కన్నీళ్ళు రాలాయి..

అయినా తమాయించుకుని చిరునవ్వుతో రామదాసుని ఆలయం ప్రధాన ద్వారం వరకూ వెళ్ళి సాగనంపింది శారదమ్మ..

........................

శంషాబాద్ ఎయిర్‌పోర్ట్..

రాత్రి పన్నెండు గంటలకి అమెరికా ఫ్లైట్ ఉండడంతో పది గంటలకల్లా ఆనంద స్వరూప్, అతనితో పాటు ఇండియాకి వచ్చిన మరి కొందరితో పాటు శారదమ్మ కూడా చేరుకుంది.. వారిని సాగనంపడానికి మేనేజర్ గోపాల్, మూర్తితో పాటు ఆలయ కమిటీ మెంబర్లందరూ ఎయిర్ పోర్టుకి చేరుకున్నారు..

మొట్టమొదటి సారి విమానాశ్రయాన్ని చూస్తున్న శారదమ్మలో ఎంతో విస్మయం కలిగింది.. ఆకాశంలో ఎగురుతున్న విమానాలు, రన్‌వేపై ల్యాండ్ అవుతున్న విమానాలని ఎంతో అబ్బురంగా చూస్తూ ఉండిపోయింది..

శారదమ్మ కూడా వస్తుందన్న విషయం అమెరికాలో ఉన్న తెలుగు సంఘాల వారికి ముందే తెలియజేయబడటంతో శారదమ్మ రాక కోసం అక్కడి వాళ్ళు కూడా ఎంతో ఆత్రుతగా ఎదురుచూస్తున్నారు..

విమానాశ్రయానికి చేరుకోగానే ఆనందస్వరూప్ సెల్‌కి మెసేజ్ వచ్చింది...

‘‘మీ రాక కోసం వేయి కళ్ళతో, శారదమ్మ రాక కోసం కోటి కళ్ళతో ఎదురు చూస్తున్నాము’’ అన్న మెసేజ్‌ని చదవి మనసులోనే నవ్వుకున్నాడు ఆనంద స్వరూప్..

విమానాశ్రయంలో లాంచనాలన్నీ పూర్తయ్యాక బోర్డింగ్ పాస్ తీసుకుని చివరి సారిగా మేనేజర్ గోపాల్‌కి, మూర్తికి, ఆలయ కమిటీ మెంబర్లందరినీ పేరు పేరునా పలుకరించింది శారదమ్మ..

ఆమె అమెరికా యాత్ర సంపూర్ణంగా ముగియాలంటూ ప్రతీ ఒక్కరూ కోరుకున్నారు..

యునైటెడ్ ఎయిర్‌వేస్ ఫ్లయిట్ మరి కొద్ది సేపట్లో వస్తుందన్న అనౌన్స్‌మెంట్ విన్న ఆనంద స్వరూప్, శారదతో సహా అందరూ చివరిసారిగా అందరికీ వీడ్కోలు పలికి లోనికి వెళ్ళిపోయారు..

విమానం లోపల విశాలంగా ఉన్న సీట్లు, వాటి ముందు ఏర్పరచిన ఎల్సిడి టీవీని చూసి ఎంతో ఆశ్చర్యపోయింది శారదమ్మ.. తన సీట్లో కుదురుగా కూర్చున్నాక ఆమెలో కాస్త భయం ప్రవేశించింది. మొదటి సారి విమాన ప్రయాణం చేస్తూండడంతో ఆమెలో ఏదో గుబులు పట్టుకుంది.. అది పసిగట్టిన ఆనంద స్వరూప్ ఆమెని ప్రశాంతంగా కూర్చోండంటూ సైగ చేసాడు..

ఫ్లయిట్ టేక్ఆఫ్ అవుతుందన్న అనౌన్స్‌మెంట్ రాగానే సీటు వెనక్కి ఒరిగి గట్టిగా కళ్ళు మూసుకుంది శారద.. ఆమె కళ్లల్లో చిరుమందహాసంతో ఆశీర్వదిస్తున్న సాయినాథుడి దివ్యరూపం మెదలగానే ఆమెలో ఉన్న భయం మొత్తం ఎగిరిపోయింది.. ఆ భక్తి పారవశ్యంలో ఉండగానే విమానం గాలిలోకి లేచింది.. మేఘాల్ని ఢీకొంటూ, దేశాన్ని దాటుకుంటూ అమెరికా వైపు వేగంగా సాగిపోయింది విమానం...

......................

అదొక పెద్ద మహా నగరం...

అందమైన మేడలు, మిద్దెలు. విశాలమైన వీధులూ.. అక్కడి వాతావరణం అంతా ఎంతో ఉల్లాసభరితంగా కనిపిస్తోంది.. ప్రపంచంలో ఉన్న రంగులన్నీ అక్కడి ప్రతీ మేడకీ అమర్చబడి ఉన్నాయి.. అక్కడి మనుష్యులందరూ ఎంతో అన్యోన్యంగా ఉన్నారు... ఆ నగరం రెండు పెద్ద పర్వతాల మధ్యలో నిర్మించారు.. ఎడమ పర్వతానికి ఆనుకుని ఒక జీవనది ప్రవహిస్తూ ఉంటుంది.. ఆ నదికి ఆనుకుంటూనే రెండు వందల మైళ్ళ దూరంలో ఉన్న కుడి పర్వతం మధ్యలో ఈ నగరం రూపొందించారు..

ఆ నగరానికి మధ్యలో ఒక విశాలమైన వీధి.. ఆ వీధికి చివర కుడి పర్వతానికి ఆనుకుని ఒక పెద్ద మందిరం కనిపిస్తోంది.. ఆ మందిరాన్ని చూస్తేనే అదెంతో పురాతనమైనదని ఇట్టే తెలిసిపోతుంది.. పర్వతానికి సమానంగా గాలిగోపురం వెలిసింది.. ఆ గుడి దగ్గర నిలబడి చూస్తే దూరంగా ప్రవహిస్తున్న నది కనిపిస్తూంటూంది.. తెల్లవారు జామున గుడికి వచ్చే భక్తులు ఒక మహాద్భుతమైన అనుభవాన్ని పొందుతారు.. అదేమిటంటే.. గుళ్లోనుండి వినిపించే

ఓంకార నాధంతో పాటు, చల్లటి గాలిలోనుండి లీలగా వినిపించే నది చేసే ఆ శబ్దం.. ఆ శబ్దం వింటూ భక్తులు పరవశించిపోతారు..

తమకి తెలియకుండానే ఏదో అద్వైతానందానికి గురవుతారు.. స్వచ్ఛమైన నీళ్ళు జలజలా వెళుతూ చేసే ఆ శబ్దం.. ఓంకార నాదంలో లీనమయిపోతూ.. అప్పుడే చెట్లపై నుండి లేచిన పక్షుల కిలకిలా రావాలు. గుళ్ళో స్వామివారికి చేసే మంగళ హారతులు మంత్రఘోష.. వెరసి అదొక అపూర్వమైన, అనన్య సామాన్యమైన అద్భుతానందానికి గురిచేసే ఒక అనుభవాన్ని ప్రసాదిస్తోంది..

కేవలం ఆ అనుభవం కోసమే ఉదయం నాలుగు గంటల నుండే ఆ గుడికి భక్తులు రావడం ప్రారంభిస్తారు.. క్షణాల్లో వందల సంఖ్యలో భక్తులు అక్కడికి ప్రవేశిస్తారు.. భక్తి శ్రద్ధలతో భగవంతుడిని యధాశక్తి పూజించుకుంటారు.. విశాలమైన ఆ గుడి ప్రాంగణంలో పద్మాసనం వేసుకుని కూర్చుంటారు..

ఒకరు మరొకరితో మాట్లాడుకోకుండా తమ మనసుని ఆ శబ్దాలపైనే లగ్నం చేస్తారు..

అప్పుడు.. గుళ్ళోనుండి వినిపించే ఓంకారనాదం, గుడికి రెండు వందల మీటర్ల దూరంలో ఉన్న నది చేసే అద్భుతమైన అ నినాదం,, ఆ దేవుడిని స్మరణ చేస్తున్నట్టుగా వినిపిస్తూంటే ఈ రెండు శబ్దాలకు కోరస్ అందిస్తున్నట్టు గుడి ఆవరణలో ఉన్న చెట్లపై ఉండే పక్షులు చేసే కిలకిలా రావాలు...

సాక్షాత్తూ ఆ భగవంతుని సంగీత నిర్దేశకత్వంలో ఆ శబ్దతరంగ విన్యాసాలు ఆవిష్కరించాయా అన్న ఆలోచన అక్కడి ప్రతీ ఒక్కరి హృదయాలలో నాట్యం చేస్తూండగా..

ఆ అద్భుతమైన అనుభవం కోసం ప్రతీ ఒక్కరు పరితపిస్తూంటారు..

ఆ మందిరంలో ఉన్న వందలాది మంది జనసందోహం మధ్యలో శారదమ్మ పద్మాసనం వేసుకుని కూర్చుని ఉంటుంది.. ఆమె కళ్ళు మూసుకుని ఉంటుంది.. కానీ ఆమె కళ్ళల్లోనుండి కన్నీళ్ళు జలజలా రాలుతుంటాయి.. ఆ అద్భుతమైన అనుభవాన్ని పొందిన ఆమె, భగవంతుడు ప్రకృతితో జతకూడి చేస్తున్న ఆ శబ్ద తరంగాలు, అంతరంగాలలో అలజడి లేపుతూ, మనిషి జన్మని సార్ధకం చేస్తూంటే.. ఆ ఆనంద పారవశ్యాన్ని అనుభవించి, భావోద్వేగానికి లోనుకాని వారెవరుంటారు..?

సరిగ్గా ఆ క్షణంలో...

ఆ గుడికి ఆనుకుని ఉన్న పెద్ద పర్వతం బ్రద్దలవుతుంది.. అది బ్రద్దలయ్యాక కానీ తెలియదు.. అది అగ్నిపర్వతం అని.. ఆకాశాన్ని ఎరుపురంగులోకి మార్చేస్తూ.. ఆవురావురుమంటూ ఎగిసిపడుతున్నాయి అగ్నికీలలు.. పర్వతంపైన ఎగిసిపడుతున్న అగ్నికీలల వెలుగులతో ఆ మందిరం ఒక్కసారిగా ఎరుపురంగులోకి మారిపోయింది...

శిఖరంపైనుండి వెలువడుతున్న లావా వేగంగా క్రిందికి ప్రవహిస్తూంటూంది..

ఆ మందిరంలో భక్తిపారవశ్యంలో, భావ పారవశ్యంలో మునిగి ఉన్న ప్రజలందరూ ఉలిక్కిపడతారు.. క్షణాల్లో అక్కడ జరుగుతున్నదేమిటో అర్థం కాగానే అందరూ ఒక్కసారిగా గుడి బయటికి పరుగులు తీస్తారు.. అప్పటి వరకూ ఎంతో ఆనందాన్ని అనుభవించిన వారి ముఖాల్లో ఇప్పుడు భయాందోళనలు స్పష్టంగా కనిపిస్తున్నాయి..

అగ్నికీలకు ఆహుతి కాకుండా తమ ప్రాణాలను కాపాడుకోవడం కోసం విశాలమైన వీధిలోకి ప్రవేశించారు..

అంత అలజడి కలిగినా శారదమ్మలో మాత్రం ఎలాంటి చలనం లేదు..

ఆమె ముఖం ప్రసన్నంగా కనిపిస్తోంది.. ఆమె మనసు ఇంకా ఆ శబ్దతరంగాలలో ఓలలాడుతుంది.. మనసుకు హత్తుకుపోతూ సాగిపోతున్న ఆ సంగీత ఝరిలో మరో శబ్దతరంగం కలిసినట్టు ఆమెకు తెలుస్తుంది.. ఆ శబ్దం మొత్తం సంగీతాన్నే చిన్నాభిన్నం చేస్తున్నట్టు అనిపించి ఆమె కనుబొమ్మలు ముడుచుకున్నాయి.. అయినప్పటికీ ఆమె బాహ్యప్రపంచంలోకి రాలేకపోయింది...

ఆ సంగీతాన్ని తాను కోరుకున్న విధంగా మలచుకోవడం కోసం ప్రయత్నించింది.. నది చేసే అ శబ్దాన్ని తృంచివేసి ఏదో రణగొణ ధ్వనులతో దూసుకువస్తూన్న లావాగ్ని శబ్దం శృతిమించడంతో, ఆ శబ్దాన్ని పెంచేలా తాను చేయాలనుకున్న సంకల్పం ఆమె మనసులో రేగింది--- అంతే..

ఆమె మనసులో కలిగిన ఆ ఆలోచన.. ప్రకృతిని సైతం ప్రభావితం చేసేసింది...

తన మానాన తాను ప్రవహిస్తూన్న నది ఒక్కసారిగా తన దిశని మార్చి వేసింది... నగరం మధ్యలో ఉన్న విశాలమైన వీధిలోకి ఆ నది ప్రవహించడం ప్రారంభించిది..

ఒకవైపు నదీ ప్రవాహం.. మరో వైపు పర్వతం పైనుండి వేగంగా వస్తున్న లావాగ్ని ప్రవాహం.. ఈ రెండింటి మధ్య ప్రజలందరూ ఉక్కిరిబిక్కిరయ్యారు.. ఏమీ చేయలేని పరిస్థితి.. అందమైన చిత్రపటంలా కనిపించే ఆ నగరాన్ని జలసమాధి చేస్తూ మందిరం వైపు వేగంగా దూసుకువస్తూంది ఆ నది.. దానికి పోటీగా తన అగ్నికీలలతో నగరాన్ని బూడిదచేయాలన్న ఆరాటంతో దూసుకువస్తోంది లావాగ్ని.. రెండూ పోటా పోటీగా రావడం ప్రారంభించాయి...

శారదమ్మకి ఆ రెండు శబ్దాలు తనకి చేరువవుతున్నట్టు స్పష్టంగా వినిపిస్తుండడంతో ఆమె ముఖంలో ఆనందం ప్రవేశిస్తుంది.. తన కోరికని మన్నించి శబ్దాలు తన దరికి చేరుతున్నాయన్న సంతోషం ఆమెలో కనిపిస్తూంది...

మరి కొద్ది క్షణాలో ఒకవైపు నుండి వేగంగా దూసుకువస్తూన్న నదీ ప్రవాహం, మరో వైపునుండి పర్వతం మీద నుండి గుడికి సమీపించడానికి, శారదమ్మ శరీరాన్ని తనలో కలుపుకోవడానికి వాయు వేగంగా ప్రవేశిస్తూన్న లావాగ్ని...

ఆ రెండింటి మధ్యలో బాహ్యప్రపంచంతో సంబంధం లేకుండా నిశ్చలంగా కూర్చున్న శారదమ్మ.. సరిగ్గా అదే సమయంలో ''శారదమ్మని లేపండి.. శారదమ్మని లేపండి..'' అని ఎవరో అంటూన్న శబ్దం శారదమ్మ చెవులకి లీలగా వినిపించింది.. ఆ వెంటనే తన భుజాలపై ఒక చేయి ఆప్యాయంగా తడుతున్న భావన...

''శారదమ్మా...'' అన్న పిలుపు వినిపించడంతో ఆమె ఉలిక్కిపడింది.. ఆ పిలుపు విన్న మరుక్షణం అప్పటి వరకూ తాను అనుభవిస్తూన్న నదీప్రవాహపు హోరు, అగ్ని శిఖల తాలూకు శబ్దాలు, మందిరంలోనుండి వినిపించే ఓంకారనాదం, చెట్ల మధ్యలోనుండి వినిపించే పక్షుల కిలకిలా రావాల లాంటి శబ్దాలన్నీ మాయమైపోయాయి...

''శారదమ్మా..'' అన్న పిలుపు మళ్ళీ వినిపించడంతో మెల్లిగా కళ్లు తెరిచింది శారదమ్మ... తన ఎదురుగా చిరునవ్వుతో కనిపించిన ఆనందస్వరూప్‌ని చూసిన శారదమ్మ ఉలిక్కిపడింది...

అయోమయంగా పరిసరాలని గమనించింది.. తాను విమానంలో ఉన్నట్టు గుర్తించిన శారదమ్మ ఉలిక్కిపడింది.. కళ్ళముందు రెండు పర్వతాల మధ్యలో ఉన్న ఆ నగరం స్పష్టంగా ఉన్నట్టు అనిపించింది శారదమ్మకి.. తాను గుళ్ళో ఉండడం, నది వేగంగా నగరంలోకి ప్రవేశించడం, మరో వైపు అగ్నిపర్వతం బ్రద్ధలవ్వటం తో వెలువడిన లావా వేగంగా తన వైపుకి

రావడం, ఆ రెండూ తనని సమీపించే సమయంలోనే ఆనంద స్వరూప్ తనని మేల్కొలపడం గుర్తుకురావడంతో ఆమె వెన్నులోనుండి సన్నగా వణుకు పుట్టింది.

తాను కలకన్నదని అర్థమవ్వగానే ఆమెకంతా అయోమయంగా అనిపించింది.. ఒక వైపు జలము, మరో వైపు అగ్ని.. ఈ రెండూ తనని వెంబడించటం ఏమిటీ..? ఎన్నడూ రానటువంటి కల తనకి రావడం ఏమిటి..? ఆమెకేమీ అర్థం కాలేదు..

''శారదమ్మా.. మరి కొద్ది నిమిషాల్లో విమానం ల్యాండవుతుంది.. మనం అమెరికా వచ్చేసాము..'' చిరునవ్వుతో అన్నాడు ఆనందస్వరూప్.. ఆమెలో కనిపిస్తున్న టెన్షన్‌ని ఆయన మరో విధంగా అర్థం చేసుకున్నాడు. మొదటి సారి విమానం ప్రయాణం చేసేవారు అలా ఆందోళన చెందడం మామూలే అని అనుకున్నాడు.

శారదమ్మ తనని తాను సర్దిచెప్పుకుని ఆనందస్వరూప్‌ని చూసి చిన్నగా నవ్వింది..

ఆ తర్వాత తనతో పాటు తెచ్చుకున్న బ్యాగ్‌ని సర్దుకుని, విండోలోనుండి బయటికి చూసింది.. మేఘాల మధ్యలో నుండి విమానం భూమికి చేరువవుతోంది.. పెద్ద పెద్ద భవనాలు కనిపించడంతో వాటివైపు ఎంతో ఆశ్చర్యంగా చూస్తూ ఉండిపోయింది శారదమ్మ..

మరి కొద్ది నిమిషాల్లో విమానం ల్యాండవబోతోందన్న అనౌన్స్‌మెంట్‌తో ప్రయాణీకుల్ని అలర్ట్ చేసాడు పైలెట్. సీటు బెల్టులని సరిచేసుకుని కుర్చీలో వెనక్కి సాగిలబడి కూర్చుండిపోయారు అందరూ...

రన్‌వేపై విమానం ల్యాండవగానే అందరూ ఊపిరి పీల్చుకున్నారు.. శారదమ్మ తనకి వచ్చిన కల నుండి కొద్దిగా తేరుకుంది.. తాత్కాలికంగా ఆ కల గురించి ఆలోచన విరమించుకున్నా, దాని ప్రభావం మాత్రం ఆమె హృదయంలో బలంగా నాటుకుపోయింది..

మొదటిసారి అమెరికా గడ్డపై అడుగుపెడుతున్న ఉద్వేగం ఆమెలో స్పష్టంగా కనిపిస్తుంది.. ఎక్కడి ఇండియా, ఎక్కడి అమెరికా.. ఖండాంతరాలు దాటి ఇన్నివేల మైళ్ళదూరం రావడం ఆమెకింకా ఆశ్చర్యంగానే అనిపిస్తుంది..

ఇదంతా కేవలం ఆ సాయినాధుడి మహిమే తప్ప తన ప్రమేయం ఏముందని తనని తానే సమాధాన పరుచుకుంది..

ఆనందస్వరూప్ ని, శారదమ్మని రిసీవ్ చేసుకోవడానికి విమానాశ్రయంలో సిద్ధంగా ఉన్నారు ఆనందస్వరూప్ ఆధ్వర్యంలో వెలిసిన తెలుగు సంఘంలోని సభ్యులు..

వారు చెకౌట్ అయి బయటికి రాగానే ఆనందస్వరూప్‌ని చూసి ఎంతో ఆనందపడిపోయారు ఆ సభ్యులు.. ఆనంద స్వరూప్ వెనకాలే గంభీరవదనంతో వస్తున్న వృద్ధురాలిని గమనించగానే వారు అర్థం చేసుకున్నారు. ఆవిడే శారదమ్మ అని. పరిచయాలన్నీ అయిపోయాక శారదమ్మకి కావాల్సిన ఏర్పాట్లని పర్యవేక్షించేందుకు నియమించబడ్డ వ్యక్తిని ఆనందస్వరూప్ శారదమ్మకి పరిచయం చేశాడు. ఆయనపేరు సాయిరాం.. ఆయన వినయంగా నమస్కరించి శారదమ్మ లగేజీని అందుకున్నాడు.. వద్దని శారదమ్మ వారించినా ఆయన వినలేదు. ఆయన వయసు నలభై సంవత్సరాలు ఉంటాయి.. నల్లటి సూటు వేసుకున్నాడు, నెరసిన జుట్టు, కళ్ళజోడు, ఆ కళ్ళజోడు మధ్యలోనుండి నుదుటిన పొడవుగా పెట్టుకున్న మూడు నామాలు. ఆయన ముఖం చూడగానే ఆయనకి ఆధ్యాత్మికత మంటే ఎంతో ఇష్టం అని అర్థం చేసుకుంది శారదమ్మ..

అయితే అమెరికాలాంటి దేశంలోనూ సంప్రదాయబద్ధంగా నుదుటిన బొట్టుపెట్టుకోవడం ఆమెకెంతో ఆనందమేసింది.. దేశాలు మారవచ్చేమోగానీ, హిందూ సంప్రదాయాలెప్పటికీ మారవు కదా..

ఆనందస్వరూప్‌ని రిసీవ్ చేసుకోవడానికి వచ్చిన సభ్యులందరికీ శారదమ్మని పరిచయం చేసాడు ఆనంద స్వరూప్..

''మీ గురించి విన్నాం.. ఇప్పుడు ప్రత్యక్షంగా మిమ్మల్ని చూస్తూంటే ఎంతో సంతోషంగా ఉంది..'' అన్నారు వారందరూ..

అభిమానపూర్వకంగా వారికి నమస్కరించింది శారదమ్మ..

''శారదమ్మా.. ఇక్కడున్న తెలుగువారందరూ వారాంతం వరకూ తమ తమ వ్యక్తిగత పనులో తలమునకలై ఉన్నప్పటికీ శనివారం వచ్చిందంటే చాలు, ఆధ్యాత్మిక కార్యక్రమాల్లోనూ, సేవా కార్యక్రమాల్లోనూ చురుకుగా పాల్గొంటారు.. ఎవరికయినా ఏదయినా ఆపద వచ్చిందంటే వారిని ఆదుకోవడమే వీరందరి లక్ష్యం.. ఎప్పుడో పదిహేను సవత్సరాల క్రితం నాకు వచ్చిన ఈ ఆలోచన వల్ల, పదిమంది సభ్యులతో మొదలైన తెలుగు సంఘం లో ప్రస్తుతం లక్ష మంది వరకు సభ్యులుగా ఉన్నారు. ఇక్కడ వివిధ రాష్ట్రాలలో ఉద్యోగాలు, వ్యాపారాలు చేసుకుంటున్న

తెలుగు వారందరినీ ఒక వేదికపై చేర్చి వారి కష్ట సుఖాల్లో పాలు పంచుకుంటూ, మన హిందూ సంప్రదాయాన్ని విస్మరించకుండా వారికి ఆధ్యాత్మిక కార్యక్రమాలను పరిచయం చేస్తూ. మా సేవలు అందిస్తున్నాము..'' ఆనంద స్వరూప్ చెప్పిన మాటలని ఎంతో ఆసక్తిగా విన్నది శారదమ్మ..

మళ్ళీ ఆయనే..

''శారదమ్మా గారు.. మీరుండడానికి కావలసిన ఏర్పాట్లన్నీ అయిపోయాయి.. మీరు వెళ్ళి విశ్రాంతి తీసుకోండి.. నేను ఈరోజు సాయంత్రం వచ్చి మిమ్మల్ని కలుసుకుంటాను..'' అని పార్కింగ్‌లో సిద్దంగా ఉన్న కార్లవైపు దారి తీసాడు ఆనందస్వరూప్. ఆయన వెనకాలే శారదమ్మతో పాటు మిగతా వారందరూ నడిచారు. శారదమ్మ లగేజీ ని తీసుకువచ్చిన సాయిరాం ఒక కారు వైపు చూపిస్తూ కదిలాడు. ఆనందస్వరూప్ కారు వరకూ వచ్చి శారదమ్మని దగ్గరుండి కారులో కూర్చోబెట్టాడు. ఆ తర్వాత ఆమె నుండి సెలవు తీసుకుని తన కారువైపు అడుగు వేసాడు. శారదమ్మ కూర్చోగానే లగేజీని డిక్కీలో పెట్టేసి వచ్చి కారు స్టార్ట్ చేసాడు సాయిరాం..

విశాలమైన రోడ్డు మీదునుండి కారు వేగంగా ముందుకి పరుగు తీసింది.. విండోలో నుండి బయటి ప్రపంచాన్ని చూస్తూ ఎంతో ఆశ్చర్య పోయింది శారదమ్మ.. ఆకాశానికి అంటుకున్నట్లు కనిపిస్తున్న భవనాలు, రోడ్డుపై రయ్యుమంటూ వేగంగా పరుగులు తీస్తున్న కార్లు, వారి ఆకారాలను ఆసక్తిగా గమనించసాగింది శారదమ్మ.. తెల్లగా మెరిసిపోతూన్న మనుష్యులు, ఆడ మగ అన్న భేదాన్ని పెద్దగా పట్టించుకోనట్లుగా ఉన్న వారి ప్రవర్తన, మోకాళ్ళ వరకూ ఆడవాళ్ళు వేసుకున్న దుస్తుల్ని చూసి ఆశ్చర్యానికి గురయింది..

భారతదేశానికి, అమెరికాకి ఉన్న వ్యత్యాసం ఆమె కి అయిదు నిమిషాల్లోనే అవగతం అయింది.. భారతదేశం సంస్కృతీ సంప్రదాయాలకి నెలవు. అందుకే అక్కడ స్త్రీ, పురుషులు సాంప్రదాయ దుస్తులనే వేసుకుంటారు. ఆడవాళ్ళు చీరలు కట్టుకుంటారు. చుడిదార్లు వేసుకుంటారు.. అయినప్పటికీ శరీరావయవాలు కనిపించే విధంగా ఇలా అంగప్రదర్శన చేయడం మచ్చుకు కూడా కనిపించదు..

కానీ.. ఇక్కడ విచ్చలవిడిగా కనిపిస్తున్న మనుష్యుల తీరుకి కాస్తంత చిరాకుగా అనిపించింది శారదమ్మకి.. నాగరికత ఎంత పెరుగుతూంటే, మనిషి ఆలోచనలో కూడా మార్పు రావడం అన్నది సహజంగా జరుగుతుంది.. అయితే ఆ మార్పు సమాజానికి హితాన్ని చేసే విధంగా ఉంటే ఎవరికీ ఎలాంటి అభ్యంతరం ఉండదు.. కానీ సమాజాన్ని చెరిపే విధంగా ఉంటే అది మానవజాతికే పెను ప్రమాదంగా మారిపోతూంది..

అలాంటి సూచనలు ఆమెకి ఇక్కడ కొద్దిగా కనిపించాయి.. అయితే ఇలాంటి చోట ఉంటూ కూడా భారతీయులు, ముఖ్యంగా తెలుగు వారు తమ సంస్కృతీ సంప్రదాయాలకు విలువనిస్తూ ఆధ్యాత్మిక జీవితాన్ని గడపడం మాత్రం ఆమెకి ఎంతో సంతోషాన్ని కలిగించింది..

సరిగ్గా అరగంట ప్రయాణం తర్వాత లివర్మోర్ అనే ప్రాంతంలోకి ప్రవేశించారు.. అప్పటి వరకూ ఆకాశహర్మ్యాలతో, విశాలమైన రహదారులతో, కార్లు, ఇతర వాహనాలతో బిజీగా కన్పించిన వాతావరణం క్రమంగా కనుమరుగవ్వసాగింది..

వాటి స్థానంలోనే దారికిరువైపులా పచ్చటి చెట్లతో ప్రకృతి ఒడిలోకి వచ్చామా అన్నంత ఆహ్లాదంగా ఉన్న ప్రదేశంలోనుండి కారు రయ్యిన దూసుకుపోతుంది..

అక్కడక్కడా విసిరేసినట్టున్న విశామైన భవనాలు, ఆ భవనాల చుట్టూరా అందమైన చెట్లు.. చల్లని గాలికి ఆ చెట్లు అటూ ఇటూ ఊగుతూ శారదమ్మకి అప్యాయంగా తమ ప్రదేశానికి ఆహ్వానిస్తున్నట్లుగా అనిపిస్తున్నాయి.. దూరంగా కనిపిస్తున్న కొండలు.. రహదారికిరువైపుల రకరకాల పూల చెట్లు.. ఒక్కోచెట్టుకు గుబురుగా పెరిగివున్న అందమైన పుష్పాలు.. ఇలా స్వచ్ఛమైన వాతావరణం కనిపించడంతో శారదమ్మ మనసు పులకరించి పోయింది.. తన్మయత్వంతో చుట్టూ ఉన్న ప్రదేశాలను చూస్తూ ఉండిపోయింది.. విమానంలో ప్రయాణం చేసిన బడలిక క్రమంగా దూరమయిపోతున్న భావన ఆమెలో కలిగింది.. దాని స్థానంలోనే ఏదో తెలియని ఆనందం ఆమెలో ప్రవేశించింది..

ప్రకృతి ఎక్కడైనా ప్రకృతే.. దేశాలు దాటినా, ఖండాంతరాలు మారినా.. మొలిచే చెట్టూ ఒక్కటే.. పూసే పువ్వులూ ఒక్కటే.. వీచే గాలి ఒక్కటే.. అవి మనిషికి అందించే ప్రాణ వాయువూ ఒక్కటే.. అయినా తన పిచ్చి గానీ.. ప్రపంచంలో ఎక్కడికెళ్లినా ఉండే ప్రకృతి ఒక్కటే కదా.. మనుష్యుల లాగా ముసుగువేసుకోవడం ప్రకృతికి ఎలా సాధ్యపడుతుంది?

భగవంతుని ప్రతిరూపాలుగా, ఎంతో దివ్యంగా కనిపిస్తున్న ఆ చెట్లని చూసి పులకరించి పోయింది శారదమ్మ.. మరో పది నిమిషాల్లో వారి కారు ఒక మలుపు తిరిగింది..

కారు అద్దాలలో నుంచి దూరంగా కనిపించిన దృశ్యానికి శారదమ్మ కళ్ళు ఆశ్చర్యంతో పెద్దవయ్యాయి... దూరంగా తెల్లని పాలరాయితో కట్టబడి ఉన్న దేవాలయం ఆమె కన్నులకి కనిపించింది.. తిరుమల శ్రీవారి ఆలయ నమూనాలాగా వెలసిన ఆ దేవాలయాన్ని చూసి ఎంతో అచ్చెరువొందింది శారదమ్మ..

గాలిగోపురం ఎంతో గంభీరంగా తనవంక చూస్తున్నట్టు.. తనని ఆహ్వానిస్తున్నట్టు అనిపించింది ఆమెకి.. దాదాపు నాలుగు ఎకరాల విస్తీర్ణంలో, భారతదేశంలో కనిపించే దేవాలయాలకు ఏమాత్రం తీసిపోకుండా.. ఆగమశాస్త్ర నియమాలను పాటించి ఎంతో పవిత్రంగా నిర్మించారని ఆ ఆలయాన్ని చూస్తేనే అర్థమవుతుంది.. అ ఆలయం  చుట్టూరా గుబురుగా పెరిగిన వృక్షసంపద ఆమెని మరింత విస్మయానికి గురి చేసింది. హిందువులు ఎంతో భక్తితో ఆరాధించే వేప, రావి చెట్లు ఆలయ ప్రాంగణంలో ఎంతో అందంగా కనిపిస్తున్నాయి.. ఆలయానికి ఆనుకుని ఉన్న మూడంతస్తుల భవనం కారిడార్‌లోకి కారు ప్రవేశించింది..

ఆ భవనం ఎంతో విశాలంగా కనిపిస్తోంది.. ఆ భవనానికి, ప్రధాన గేటుకి మధ్యలో ఉన్న ప్రదేశంలో రకరకాల పూల  చెట్లు రమణీయంగా కనిపిస్తున్నాయి.. వాటి మధ్యలో పాలరాతితో నిర్మించిన చిన్న మండపం పై ఆమె దృష్టి పడింది.. ఆ మండపం మధ్యలో తులసి చెట్టుని గమనించిన శారదమ్మ మనసు ఎంతో భక్తిభావంతో పులకించి పోయింది..

ఆ తులసి చెట్టుకి ప్రతిరోజూ పూజలు  చేస్తారనడానికి గుర్తుగా దాని చుట్టూ దీపాలు  వెలిగించే ప్రమిదలు వరుసగా అమర్చబడి ఉన్నాయి.. అగరు వత్తులు  వెలిగించడానికి ప్రత్యేకంగా అమర్చిన ప్రాంతంలో సుగంధ పరిమళాలు వెదజల్లుతూ కనిపిస్తున్నాయి.. తులసి చెట్టు మొదట్లో ప్రత్యేకంగా తయారు చేసిన ఒక గూటిలో రెండు మట్టి ప్రమిదలలో నేతి దీపం ఉజ్వలంగా వెలుగుతోంది..

దానిని చూసిన శారదమ్మ ఎంతో ఆనందం చెందింది. తులసి చెట్టుకి క్రమం తప్పకుండా పూజలు చేసే ప్రాంతంలో త్రిశక్తి రూపిణీ, జగజ్జననీ సంచరిస్తూందని, ముక్కోటి దేవతలు

సైతం ఆ ప్రాంతంలో తిరుగుతుంటారని పురాణాలలో శాస్త్రాలలో ప్రత్యేకంగా చెప్పబడినదని శారదమ్మకి గుర్తుకు రావడంతో ఆమె మనసు ఎంతోపులకరించి పోయింది..

ఆ భవనం నిర్మించిన విధానం, దాని ముందు కనిపిస్తున్న చెట్లూ, వాటి మధ్యలో ఎంతో రమణీయంగా వెలిగిపోతున్న తులసి చెట్టు.. వెరసి ఆ ప్రాంతమంతా ఆధ్యాత్మికత భావనతో నిండిపోయిందని చెప్పకనే చెబుతున్నాయి.. సాయిరాం కారు దిగి వెనక ఉన్న డోరుని తీసి శారదమ్మ వంక చిరునవ్వు నవ్వుతూ చూసాడు..

''అమ్మా.. మీకు విడిది ఇక్కడే.. దిగండి..'' ఎంతో మర్యాదగా అన్నాడు సాయిరాం..

అంతవరకూ ఆలోచనలో గడిపిన శారదమ్మ ఆ మాటలకి ఉలిక్కిపడి ఈ లోకంలోకి వచ్చింది.. సాయిరాంని చూసి చిన్నగా నవ్వి కారు దిగింది..

వారిని గమనించిన ఇద్దరు పనివాళ్లు పరిగెత్తుకుంటూ వచ్చారు. వారుకూడా శారదమ్మకి ఎంతో వినయంగా నమస్కరించారు..

''స్వాగతం తల్లీ.. మీకు ఏం కావాలన్నా మాకు చెప్పండి క్షణాల్లో సమకూరుస్తాం..'' చిరునవ్వుతో అంటూ డిక్కీలో ఉన్న శారదమ్మ లగేజీ ని ఇద్దరూ తీసి లోపలికి తీసుకువెళ్ళారు.. సాయిరాం కుడిచేత్తో శారదమ్మని వినయంగా లోపలికి ఆహ్వానించాడు.. శారదమ్మ ముందుకు నడవగానే ఆమె వెనకాలే అడుగులు వేసాడు సాయిరాం..

లోపలికి ప్రవేశించిన శారదమ్మ లోపల విశాలంగా కనిపిస్తున్న హాలుని చూసి ఎంతో ఆశ్చర్యపోయింది.. ఆ హాలు మధ్యలో నుండి మెట్లున్నాయి.. అవి మొదటి అంతస్థుకి దారి తీస్తున్నాయి.. మొదటి అంతస్థు చుట్టూరా గదులు ఉన్నాయి.. ప్రతి గదికి మధ్యలో గోడలకు పెద్ద పెద్ద ఫోటోలు కనిపిస్తున్నాయి.. ఆ ఫోటోలో శ్రీ వేంకటేశ్వరుడు, సీతారామ లక్ష్మణాంజనేయులు, గోపిక మధ్యలో గోవుకి ఆనుకుని ఉన్న గోపాలుడు, జగజ్జననీ అమ్మవారు, లక్ష్మీనారసింహుడు, పార్వతీ పరమేశ్వరుల ఫోటోలు పెద్ద పెద్ద సైజులలో అందంగా అమర్చారు..

ఆ మొదటి అంతస్థుపైకి దారి తీసాడు సాయిరాం.. అతని వెనకాలే చుట్టూ ఉన్న పరిసరాలని ఆశ్చర్యంతో గమనిస్తూ అడుగులు వేయసాగింది శారదమ్మ..

మొదటి అంతస్థుని చేరుకుని ఆ పక్కనే ఉన్న లిఫ్టు దగ్గరికి వచ్చి ఆగాడు సాయిరాం.. లిఫ్టు లోపలికి శారదమ్మని వినయంగా ఆహ్వానించి తాను కూడా అందులోకి వెళ్ళాడు. మూడవ అంతస్థుకి చేరుకుని లిఫ్టు దిగారు ఇద్దరూ.. వారు లిఫ్టు దిగగానే లగేజి తీసుకువెళ్ళిన ఇద్దరు పనివాళ్ళు వాళ్ళకి ఎదురుగా కనిపించారు.. వారు శారదమ్మని వినయంగా ఆహ్వానిస్తూ తన గది వైపు తీసుకువెళ్ళారు..

తనకి కేటాయించిన గదిని చూడగానే శారదమ్మ ఆశ్చర్యంతో కళ్ళు పెద్దవి చేసింది.. మొత్తం మూడు గదులున్నాయి.. బయటి దృశ్యాలని చూడడానికి అనుగుణంగా పూర్తిగా అద్దాలతో నిర్మించారు.. అక్కడి నుండి మందిరం ఎంతో అందంగా కనిపిస్తోంది..

ఆ మందిరానికి వచ్చే భక్తులు, లోపల ఉన్న ఉప ఆలయాలు, తెల్లగా తళతళ మెరిసిపోతున్న విగ్రహాలు కనిపించగానే శారదమ్మ మనసు ఎంతో ఆనందానికి లోనయ్యింది..

''అమ్మా ఇదే నువ్వుండబోయే గది.. ఇక నుండి మీకేమి కావాల్సివచ్చినా ఇదిగో ఈ ఫోన్ తీసి సున్నాని నొక్కండి, ఈ ఇద్దరూ మీకు సహాయకులుగా ఉంటారు.. ఇరవై నాలుగు గంటలూ మీకు అందుబాటులో ఉంటారు. భోజనానికి సంబంధించి మీరేమీ చింతించనక్కరలేదు.. ఇండియాలో మీరు ఏదయితే తింటారో అదే ఇక్కడా తయారు చేస్తారు..'' నవ్వుతూ అన్నాడు సాయిరాం..

ఆయన మాటలకి చిన్నగా నవ్వింది శారదమ్మా..

''ఇక పోతే.. ఇటువైపు కిటికీలోనుండి చూస్తే ఆలయం కనిపిస్తుంది..'' అంటూ కిటికీ దగ్గరికి వచ్చాడు సాయిరాం.. హాలులా కనిపిస్తున్న ఆ గది మధ్యలో సోఫా సెట్టు, దాని మధ్యలో టీపాయ్.. దానిపైన తెలుగులో ఉన్న ఆధ్యాత్మిక పత్రికలూ కనిపించాయి..

సాయిరాం మరో గదిలోకి నడిచాడు.. ఆమె వెనకాలే అడుగులు వేసింది శారదమ్మ.. అది బెడ్‌రూం అని చూడగానే అర్థమయిపోయింది..

"ఇదే మీరు విశ్రమించే గది.." అని సాయిరాం చెప్పాడు. ఆ గదిలో ఎక్కడ చూసినా ఖరీదయిన ఫర్నీచర్‌తో తయారు చేసిన వస్తువులు అందంగా తీర్చిదిద్దబడ్డాయి.. డబుల్ బెడ్, దానికి ఎదురుగా దుస్తులు పెట్టుకోవడానికి కప్‌బోర్డు నీటుగా అమర్చారు. బెడ్ ప్రక్కనే టీపాయ్ పైన

మరో ఫోన్ ఉంది. దాని ప్రక్కనే ఒక మగ్‌లో మంచినీళ్ళు, ఓ ప్లేటులో రకరకాల పండ్లు ఉన్నాయి..

సాయిరాం ఆ గదిలో ఉన్న కిటికీ దగ్గరికి వచ్చాడు.. కర్టెన్ తొలగించాడు.. అక్కడ కనిపించిన దృశ్యానికి శారదమ్మ ఎంతో ఆనందాశ్చర్యానికి గురయ్యింది.. అక్కడి నుండి లివర్మోర్ ప్రాంతం అంతా స్పష్టంగా కనిపిస్తుంది.. ఖరీదయిన భవనాలు వరుస క్రమంలో కనిపిస్తున్నాయి.. పచ్చటి చెట్ల మధ్యలో కనిపిస్తున్న ఆ భవంతులు, దూరంగా కొండలు, విశాలమైన రహదారుల మధ్యలో రయ్యున దూసుకువెళ్తున్న కార్లు.. ఎంతో సుందరంగా అనిపించింది ఆ దృశ్యం..

''హాలులో నుండి చూస్తే ఆలయం కనిపిస్తుంది.. ఈ గదిలోనుండి చూస్తే లివర్మోర్ ప్రాంతం మొత్తం మీకు కనిపిస్తుంది.. ఏమీ తోచనప్పుడు ఓ కుర్చీవేసుకుని ఇక్కడ కూర్చుంటే మీకు సమయం ఎలా గడిచిపోతుందో కూడా తెలియదు..'' నవ్వుతూ అన్నాడు సాయిరాం..

ఆ మాటలకి కూడా చిన్నగా నవ్వింది శారదమ్మ..

''ఈ గదిలో కూడా మరో ఫోనుంది.. దీన్లోనుండి కూడా మీరు ఈ ఇద్దరితో కాంటాక్ట్ చేయవచ్చును... కేవలం సున్నా నొక్కండి అంతే..'' సాయిరాం మాటలు ఎంతో సరదాగా అనిపించాయి శారదమ్మకి. ఆ గదిలోనుండి మరో గదిలోకి దారితీసాడు సాయిరాం. ఆయన వెనకాలే శారదమ్మ కూడా నడిచింది.. మరో గదిలోకి వెళ్ళిన శారదమ్మ మనసు మరెంతగానో సంతోషించింది..

ఆ హాలు పూజ గది.. ఆ పూజగదిలో దేవుళ్ళ ఫోటోలు దివ్యంగా వెలిగిపోతున్నాయి.. వాటి మధ్యలో ఒక అడుగు ఎత్తున్న సాయినాధుడి పాలరాతి విగ్రహాన్ని చూసి ఎంతో ఆనందించింది శారదమ్మ..

''మీరు సాయినాధుడి భక్తురాలని ఆనందస్వరూప్ గారు స్వయంగా ఈ విగ్రహాన్ని ఇక్కడికి తరలించారు.. ఇక్కడ మీరు నిరభ్యంతరంగా ఎంతసేపయినా పూజ చేసుకోవచ్చు.. పూజకి కావాల్సిన వస్తువు లన్నింటనీ వీరిద్దరూ మీకు సమకూరుస్తారు..'' ముఖం లో చిరునవ్వు చెదరకుండా అన్నాడు సాయిరాం..

ఆయన మాటలకి సంతృప్తిగా తలాడించింది శారదమ్మ.. మళ్ళీ అందరూ హాలులోకి వచ్చారు. అప్పటి వరకూ చిరునవ్వుతో అన్నింటినీ శారదమ్మకి వివరించిన సాయిరాం.. సోఫా వైపు శారదమ్మకి చూపించాడు కూర్చోండి అన్నట్టుగా..

''మీరు ఇంతవరకూ నోరు తెరిచి ఒక్క మాటైనా మాట్లాడలేదు.. ఇప్పుడు చెప్పండి.. ఈ గది మీకు నచ్చిందా.. నచ్చక పోతే మొహమాటం లేకుండా చెప్పండి.. ఎందుకంటే మీకు నచ్చకుంటే వెంటనే మీ విడిది మార్చేస్తాను.. లేదంటే ఆనందస్వరూప్ గారు నా అడ్రస్‌ని మార్చేస్తారు..'' భయం నటిస్తూ చమత్కారంగా అన్నాడు సాయిరాం.. ఆయన మాటలకు శారదమ్మ తేలిగ్గా నవ్వేసింది..

''నేనూహించిన దానికంటే ఎంతో బాగా సమకూర్చారు.. అయినా ఇంత ఖరీదయిన గదులు నాకెందుకు.. ఏదో చిన్న గది ఉంటే సరిపోతుంది కదా..'' మొహమాటంగా అంది శారదమ్మా..

''అన్నన్నా.. మీకు చిన్న గదిలో విడిది ఏర్పాటు చేసి, మాకు మేము చిన్నబోయేలా చేసుకుంటామా.. అలా జరగదు.. మీరు మా అతిథిగా ఇంతదూరం వచ్చారు. ఏదో మాకు తగినట్లుగా మీకు ఆతిధ్యం అందించడం మా విధి.. మీరింకేమీ ఆలోచించకండి.. హాయిగా విశ్రాంతి తీసుకోండి.. ఫ్రెషప్ అయ్యి కాస్త సేదతీరండి.. సాయంత్రం మళ్ళీ వస్తాను.. మిగతా విషయాలన్నీ అప్పుడు వివరంగా మాట్లాడుకుందాం.. అన్నట్లు చెప్పడం మరిచాను.. ఈ భవంతిలోని, మొదటి రెండు అంతస్థులో ఈ ఆలయ పూజారి, వారి కుటుంబ సభ్యులు నివాసం ఉంటారు. వారు కూడా ఎంతో నియమనిష్టలతో ఉంటారు. 25 సంవత్సరాల క్రితం కట్టిన ఈ ఆలయం లో నిత్యం ధూప దీప నైవేద్యాలు సక్రమంగా జరుగుతున్నాయంటే అది వీరి నియమ నిష్ఠల వలననే.. ఈ మందిరం నిర్మించినప్పుడే ఇండియా నుండి వీరు ఇక్కడికి వచ్చారు. వంశపారంపర్యంగా ఈ ఆలయ పూజా కార్యక్రమాలని ఈ కుటుంబీకులే నిర్వహిస్తున్నారు.. వీరిని కూడా సాయంత్రం పరిచయం చేస్తాను.. ఇక నేను వస్తాను..'' సోఫాలో నుండి లేచి వినయంగా అన్నాడు సాయిరాం.. శారదమ్మ కూడా లేచింది.. సాయిరాంతో పాటు ఇద్దరు పనివారు కూడా శారదమ్మ దగ్గర సెలవు తీసుకున్నారు..

వారు గదిలోనుండి వెళ్ళగానే శారదమ్మ కిటికీ అద్దాల లోనుండి కనిపిస్తున్న ఆలయం వైపు దృష్టి సారించింది.. ఆలయ గర్భగుడి గోపురం స్పష్టంగా కనిపిస్తుంది.. ఆ గోపురానికి చివరలో బంగారు తాపడంతో చేసిన శంఖు, చక్రాలు తళతళా మెరిసిపోతూ కనిపించాయి..

శారదమ్మ ఇంకా నమ్మలేకపోతూంది.. తాను అమెరికాలో ఉన్నానని, ఇండియాని వదిలి వచ్చానని..

అప్రయత్నంగా శారదమ్మ రెండు చేతులతో నమస్కరించి ఆ భగవంతుడి ని మనసులోనే ప్రార్థించింది..

''తండ్రీ..! ముళ్ళల్లో కాలు మోపి రక్తమోడే పాదాలతో నరకం అనుభవిస్తూ నిన్ను ప్రార్థించినా, పూల దారిలో సుతిమెత్తగా ముందుకు సాగుతూ ఆనందానుభూతితో పయనించినా.. నిన్ను శరణు వేడడంలో మాత్రం నా ధోరణి మారదు.. అయినా ముళ్ళు గుచ్చుకుంటే వచ్చే బాధలోనుండి ఆర్తితో నిన్ను పిలిచే పిలుపుకి, పూలదారిలో పయనించినప్పుడు పిలిచే పిలుపుకి తేడా గమనించడానికి నువ్వు పెట్టే పరీక్ష నాకు తెలియదా..? కష్టాలైనా, సుఖాలనే భ్రమలో నన్నుంచినా నిన్ను స్మరించే తీరు మారదు, నాపై నీవుంచిన బాధ్యతని అణువంతైనా విస్మరించడం జరగదు.. సర్వం సాయినాధార్పణం..'' అంటూ ప్రార్థించి భారంగా ఓ నిట్టూర్పు విడిచింది శారదమ్మ..

...........................

సరిగ్గా సాయంత్రం అయిదు గంటలకి ఆనందస్వరూప్, సాయిరాం ఇద్దరూ శారదమ్మని కలవటానికి వచ్చారు.

కాస్త విశ్రాంతి తీసుకోవడంతో శారదమ్మ ముఖం లో ఉత్తేజం స్పష్టంగా కనిపిస్తోంది. ఆనందస్వరూప్‌ని చూడగానే శారదమ్మ మనసు కాస్త స్థిమితపడింది..

ఆప్యాయంగా నవ్వింది..

''శారదమ్మా.. ఇక్కడ మీకు ఏ ఇబ్బందీ లేదు కదా..? మొహమాటం లేకుండా చెప్పండి..'' నవ్వుతూ అన్నాడు ఆనంద్ స్వరూప్..

''దేశం మారిందన్న మాటే కానీ.. ఇక్కడి వాతావరణం మొత్తం నాకు కొత్తగా అనిపించడంలేదు.. మీ ఆతిథ్యం చాలా బావుంది..'' మనస్ఫూర్తిగా అంది శారదమ్మ..

‘‘హమ్మయ్య.. ఇప్పుడు నాకు ఆనందంగా ఉంది.. ఎక్కడ మీరు ఈ బస బాగాలేదని అంటారో అని హడలిపోయాననుకోండి..! ఎందుకంటే.. మీకు ఆతిథ్యాన్ని ఏర్పాటు చేసే బాధ్యత నాపై పెట్టారు ఆనంద స్వరూప్ గారు.. ఒకవేళ మీరు నచ్చలేదని అంటే తన పరిశోధన శాలకి తీసుకెళ్ళి, ఎలుకపై, కుందేళ్ళపై చేయాల్సిన పరిశోధనలు  నాపై చేస్తుండేవారు...’’ సాయిరాం భయం నటిస్తూ అన్నాడు.

దానికి ఆనంద స్వరూప్ పెద్దగా నవ్వాడు..

శారదమ్మ మాత్రం ఏమీ అర్థం కానట్టుగా చూస్తూండి పోయింది.. ఆవిడ ముఖం లో కనిపిస్తున్న ఆయోమయాన్ని గుర్తించాడు ఆనందస్వరూప్..

‘‘అన్నట్లు నా ప్రొఫెషన్ గురించి మీకు చెప్పడం మరిచిపోయాను.. నేనొక సైంటిస్టుని.. గత ఇరవై సంవత్సరాల నుంచి అమెరికా కేంద్రంగా ఎన్నో పరిశోధనలు చేసాను.. అందులో కొన్నింటిలో విజయాన్ని సాధించాను.. ఆ విజయం ప్రపంచ మానవాళికి అంకితం ఇచ్చాను.. ఎందుకంటే నేను పరిశోధనలు  చేసేది నాకోసం కాదు కదా.. సమాజం కోసమే కదా.. అందుకే ఈ విజయాన్ని కూడా సమాజానికి ఇచ్చేసాను.. ఇక పోతే.. నా పరిశోధనలని గుర్తించిన అమెరికా ప్రభుత్వం ఎన్నో అవార్డులు అందజేసింది.. భారత ప్రభుత్వం నుండి కూడా అవార్డు అందుకున్నాను. నవ నాగరికతకి నాంది పలుకుతూ ఎప్పటి కప్పుడు కొత్త తరంలో వచ్చే మార్పుని గమనించి, ఆ మార్పుకి అనుగుణంగా పుట్టుకొచ్చే మంచీ, చెడుని విశ్లేషించే బృహత్తరమైన పరిశోధన.. నా ప్రొఫెషన్‌తో నాకు చాలా సంతృప్తిగా ఉన్నప్పటికీ ఎక్కడో ఏదో లోటు.. సైన్స్ ఆధారంగా ఎన్నో శాస్త్రీయమైన అద్భుతాలని ఆవిష్కరించినప్పటికీ మనసులో ఎక్కడో ఏదో వెలితి.. శాస్త్ర, సాంకేతిక రంగాలలో ఎంతో పురోభివృద్ధి సాధించినప్పటికీ ఈ విజయాలన్నీ మిధ్యే అన్న ఆలోచన నా అంతరంగంలో కలిగేది. నేను అమెరికా వచ్చిన కొత్తలో ఇక్కడ ఒక్క దేవాలయం కూడా లేదు. మన తెలుగు వారు కూడా కేవలం వందల సంఖ్యలో ఉండేవారు. ఎవరికి వారు అన్నట్టుగా.. కాస్త మనసుకు ప్రశాంతత కోసం దేవాలయానికి వెళ్ళాలంటే ఇక్కడ మన దేవాలయం ఒక్కటి కూడా ఉండేది కాదు.. ఎక్కడ చూసినా చర్చిలే. పలుమార్లు చర్చికి వెళ్ళి కూర్చున్నప్పటికీ ఎందుకో మన దేవాలయాల్లో కూర్చుంటే కలిగే

సంతృప్తి ఆ చర్చిల్లో నాకు దొరకలేదు. సరిగ్గా అప్పుడే తెలుసుకున్నాను.. నా మనసులో ఉన్న వెలితి ఏమిటన్నది.. అదేమిటంటే..

లౌకికమైన ఎన్నో కార్యాలని అధ్భుతంగా చేస్తున్నప్పటికీ, ఆధ్యాత్మిక పరమైన చింతన, దేవారాధన కొరవడింది కాబట్టే నాలో అసంతృప్తి చోటు చేసుకున్నదని తెలుసుకున్నాను. దేశం కాని దేశంలో హిందూ సంప్రదాయాలని కొనసాగించడం ఎంత కష్టమో అనుభవించేవాడికే తెలుస్తుంది కదా..

అలా చేయాలంటే మనవారి సపోర్ట్ ఎంతో అవసరం.. కానీ అప్పట్లో హిందువులు, ముఖ్యంగా తెలుగు వారు చాలా తక్కువగా ఉండేవారు.. ఎలాగైన ఇక్కడ దేవాలయాన్ని నిర్మించాలన్న సంకల్పం ఉన్నప్పటికీ దాన్ని ఎలా నిర్వర్తించాలో తెలిసేది కాదు.. సమయం కోసం వేచి చూస్తున్న నాకు బిల్‌గేట్స్ కంప్యూటర్ రంగంలో తెచ్చిన పెనుమార్పుల ద్వారా ఒక దారి లభించినట్లయ్యింది. కంప్యూటర్ రంగంలో పెను మార్పులు సృష్టించి ప్రపంచాన్ని షేక్ చేసాడు బిల్ గేట్స్.. మైక్రోసాఫ్ట్, ఇన్ఫర్‌మేషన్ టెక్నాలజీ, ప్రపంచాన్ని అనుసంధానం చేసే ఇంటర్నెట్ టెక్నాలజీ అన్నీ అప్పుడే పురుడు పోసుకుని అతి వేగంగా దేశదేశాలలో పాకిపోయిన వేళ.. ఆ బూమ్ మన భారతదేశాన్ని సైతం తాకి ఒక ప్రకంపన సృష్టించిన వేళ.. ఇండియా నుండి అమెరికా రావాలంటే హబ్బో అనుకునే వారు.. చదువు కోసం, వ్యాపారాలకోసం ఒక్కరొక్కరుగా వచ్చి ఇక్కడ సెటిల్ అవుతుంటే.. ఎంతో ఆనందించినవారిలో ముందు వరుసలో నేనుంటాను..

నా ఆరాటమల్లా ఒక్కటే.. నా కోరిక నెరవేరాలంటే నాకు మనవారి అండతో పాటు, ఆర్థిక వనరులు సమకూర్చుకునేంత సమయం కావాలి.. నా కోరిక కొంతమందికి తెలియజేసాను.. వారు కూడా మనస్ఫూర్తిగా నా కోరికని అంగీకరించారు..

ఇంక వెనక్కి తిరిగి చూసుకోలేదు.. ఒక తెలుగు కమ్యూనిటీని ఏర్పాటు చేసాము.. అమెరికాలో ఉన్న తెలుగు వారందరినీ ఒకే తాటిపైకి తీసుకువచ్చాము. దేవాలయ నిర్మాణానికి కావాల్సిన ప్రణాళికని రూపొందించాము.. మేము చేస్తున్న ఈ ప్రయత్నానికి భారత ప్రభుత్వం అండగా నిలిచింది. దేవాలయానికి కావాలసిన స్థలాన్ని, ఇతర అవసరాలని అమెరికా ప్రభుత్వం

ఏర్పాటు చేసేలా చూసింది.. తిరుమల తిరుపతి దేవస్థానం వారు దేవాలయం ఆగమ శాస్త్రానికి అనుగుణం గా నిర్మింపజేయడానికి, పండితులని అమెరికాకి పంపించింది..

అంతే.. ఎక్కడో నాలో కలిగిన చిన్న అసంతృప్తి నుండి పుట్టిన ఆ సంకల్పం ఇప్పుడు ఇదిగో ఇంత పెద్ద మహా దేవాలయం గా మారిపోయింది.. రోజూ వందలాది మంది దర్శించుకునేంతగా ఎదిగింది..'' ఆనంద స్వరూప్ కళ్ళల్లో కన్నీళ్ళు సుడులు తిరుగుతున్నాయి.. శారదమ్మ కళ్ళల్లో కూడా కన్నీళ్ళు ప్రత్యక్షం అయ్యాయి.. ఆ క్షణంలో ఆనంద స్వరూప్‌ని చూస్తూంటే మనుషుల్లో దేవుడిలా కనిపించాడు.

సాయిరాం కి ఈ విషయం తెలిసినా అతని ముఖం కూడా భావోద్వేగంతో నిండిపోయింది.. కేవలం డబ్బు సంపాదించడానికే స్వంత ఊరిని, అయిన వారిని, దేశాన్ని వదిలి విదేశాలకి రావాలనుకునే వారు చాలా అరుదుగా ఉంటారని ఆనంద స్వరూప్ లాంటి వ్యక్తులని చూస్తే అర్థమవుతుంది.

అమెరికాలో చదువుకోవాలని ఆరాటపడే నేటి యువతకి, అమెరికా సంస్థతో కలిసి వ్యాపారాన్ని నిర్వహించాలని ఆతృతపడే భారతీయులకి మొదట్లో డబ్బు సంపాదించాలన్న ఆశ, ఆశయం ఉండవచ్చు గాక.. కానీ.. తమ ఆశ తీరాక, ఆ ఆశయం నెరవేరాక ఖచ్చితంగా తన వారికి గానీ, తన దేశానికి కానీ ఏదైనా చేయాలన్న తపన మొదలవుతుందని, ఏ ప్రొఫెషన్‌లో ఉన్నా, ఏ వ్యాపారం నిర్వహిస్తూన్న ఈ భావన ప్రతీ ఒక్కరిలో అంతర్లీనంగా ఇమిడి ఉంటుందని ఆనందస్వరూప్ జీవితాన్ని గ్రహిస్తే అర్థమవుతుంది.

ఆనంద స్వరూప్ మాటలకి ఆ హాలులో కొద్ది నిమిషాలు నిశ్శబ్దం ఆవరించింది. ఆయన చెప్పిన మాటలని జీర్ణించుకోవడానికి, ఆయన వ్యక్తిత్వాన్ని మహాద్భుతంగా అర్థం చేసుకోవడానికి ఆ నిశ్శబ్దం శారదమ్మకి సహాయం చేసింది. కొద్ది సేపటి తర్వాత అక్కడి వాతావరణాన్ని తేలిక చేయడానికన్నట్టుగా..

''ఆనంద స్వరూప్ గారంటే అమెరికాలో తెలియని తెలుగువారు ఉండరంటే అతిశయోక్తి కాదండీ.. ఆయన ల్యాబులో ఉన్నప్పుడు గాజు బాటిళ్లతో కుస్తీ పడతారు, ల్యాబు బయటికి వస్తే మనిషి లోపల దాగి ఉన్న మానవత్వాన్ని తట్టి లేపడానికి కుస్తీపడతారు. అందుకే ఆయన ఇంత

పెద్ద స్థాయికి చేరుకున్నా, చాలా సింపుల్‌గా ఉంటారు..'' సాయిరాం కళ్ళని కర్చీఫ్‌తో తుడుచుకుంటూ అన్నాడు.

ఆ మాటలకి శారదమ్మ నవ్వింది..

''మంచి చేయాలన్న తపన ఉన్నవారికి ఆ భగవంతుడు ఏదో ఒక రూపంలో సహాయం చేస్తూనే ఉంటాడు. సంకల్ప బలం ఎంత ఎక్కువగా ఉంటే, అంత ఎక్కువగా భగవంతుడి సహాయం మనకి అందుతుంది.. మీకు ఆ భగవంతుడు ఎల్లప్పుడూ తోడుగా నిలిచాడని నా ప్రగాఢ విశ్వాసం..'' మనస్ఫూర్తిగా అన్నది శారదమ్మ..

శారదమ్మ మాటలకి చిన్నగా నవ్వాడు ఆనంద స్వరూప్..

''అన్నట్లు.. మీరు ఒక రెండు రోజులు విశ్రాంతి తీసుకోండి.. ఈ వాతావరణానికి మీ శరీరం కాస్త అలవాటుపడ్డ తర్వాత అప్పుడు ప్రవచనాల కార్యక్రమానికి శ్రీకారం చుడదాము.. ఏమంటారు..?'' ఆనంద స్వరూప్ శారదమ్మని ప్రశ్నించాడు.. ఆ మాటలకి తేలికగా నవ్వింది శారదమ్మ..

''నాకు విశ్రాంతి ఎందుకండీ..? భగవదారాధన లేని విశ్రాంతి విశ్రాంతే కాదని నా అభిప్రాయం.. ఈ ప్రదేశానికి నేనెప్పుడో అలవాటు పడిపోయాను.. ఇంక నాకే విశ్రాంతీ అవసరం లేదు.. మందిరంలో నాకు ఒక చోటుని ఏర్పాటు చేస్తే.. వచ్చే భక్తులకు నావంతు ఆధ్యాత్మిక పరమైన సహాయం చేయడానికి నేను సిద్ధంగా ఉన్నాను..'' నిశ్చయంగా పలికింది శారదమ్మ..

ఆ మాటలకి ఆనంద స్వరూప్, సాయిరాం ఇద్దరూ ఆశ్చర్యపోయారు.. సహజంగా ఇండియా నుండి వచ్చే వారు ఇక్కడ అలవాటుపడటానికి కనీసం రెండు మూడు రోజుల సమయం తీసుకోవడం వారికి మామూలు విషయమే.. కానీ.. మొట్టమొదటి సారి ఇక్కడికి వచ్చిన శారదమ్మ ఇంత చలాకీగా ఉండడం, ఆరోగ్యపరమైన సమస్యలేవీ తలెత్తకపోవడం వారి ఆశ్చర్యానికి కారణమయింది..

''మీ ఇష్ట ప్రకారమే కానివ్వండి.. అయితే మీకు ఆలయ ప్రధాన అర్చకులని, ఆలయం లో సేవ చేసే పని వారిని పరిచయం చేస్తాను.. అలాగే ఆలయాన్ని కూడా చూపిస్తాను.. మీరు అనుమతిస్తే..'' వినయంగా పలికాడు ఆనంద స్వరూప్..

ఆయన మాటలకి చిన్నగా నవ్వింది శారదమ్మ..

''సరె.. అయితే ఇప్పుడే బయలు దేరుదామా..?'' అనడిగింది..

ఆమె ప్రశ్నకి మళ్ళీ ఉలిక్కిపడ్డారు. ఆమెలో భగవంతునిపై ఉన్న భక్తి, పని చేయాలన్న ఆరాటాన్ని గమనించి ఆనంద స్వరూప్ లోలోననే ఆమెను అభినందించాడు.

''ఏడు గంటలకి బయలు దేరుదాము.. ఇంకో రెండు గంటల సమయం ఉంది.. మిమ్మల్ని చూడడానికి మా సభ్యులు కొందరు ఇక్కడికి రావాలన్న కోరికని నాకు తెలియజేశారు. వారు ఆఫీసు నుండి తమ తమ ఇళ్ళకి వెళ్ళి ఫ్రెషప్ అయి ఇక్కడికి వస్తానని చెప్పారు. అయితే నేనే వారించాను.. కానీ మీ ఉత్సాహాన్ని గమనించాక.. ఆలస్యం చేయాలనిపించడం లేదు.. వారందరినీ వెంటనే రమ్మని కబురంపుతాను..'' నవ్వుతూ అన్నాడు ఆనంద స్వరూప్..

''అలాగే కానివ్వండి..'' శారదమ్మ కూడా నవ్వుతూ అంది..

సరిగ్గా ఆరున్నరకి ఆనంద స్వరూప్‌తో కలిసి గుడి దగ్గరకు వెళ్లింది శారదమ్మ. పాలరాతితో కట్టబడి ఉన్న ఆ గుడిని చూస్తుంటే శారదమ్మ మనసు ఎంతో ఉద్వేగానికి గురయింది. తాను అమెరికాలో ఉన్నానన్న విషయాన్ని కూడా ఆమె విస్మరించింది..

విశాలమైన స్థలంలో అందంగా కట్టబడిన ఆ గుడిని చూస్తూ ముందుకు నడుస్తోంది. అప్పుడే అస్తమించిన సూర్యుని ఎర్రటి కాంతి కిరణాలు గుడిపై పడడంతో తెల్లగా నిగనిగలాడే ఆ గుడి కాస్త ఎరుపు రంగులోకి మారిపోయి మరింత అందంగా కనిపిస్తోంది. ఆలయ ప్రాకారాలపై చెక్కబడిన అందమైన దేవతా మూర్తుల విగ్రహాలు, మహావిష్ణువు పది అవతారాలకు సంబంధించిన కట్టడాలు శారదమ్మకి ఎంతో అబ్బురపరిచాయి.

గుడి బయటే ఇంత ఆహ్లాదంగా ఉంటే ఇక లోపల ఇంకెలా ఉంటుందో అన్న ఆసక్తి ఆమెలో కలిగింది.. ఆనంద స్వరూప్, శారదమ్మ గుడి దగ్గరకు నడవగానే వారికి ఎదురుగా వచ్చి నిలబడ్డాడు సాయిరాం..

వారిని చూసి లోపలికి ఆహ్వానించాడు. శారదమ్మని చూసి పలకరింపుగా నవ్వి లోనికి దారి తీసాడు. ఆలయ ప్రధాన ద్వారాన్ని చూసి శారదమ్మకి కళ్ళు తిరిగినంత పనయ్యింది. ఇండియాలోని పురాతన ఆలయాలకు చేయించబడినట్టు ఉన్నాయి ప్రధాన ద్వారానికి అమర్చిన తలుపులు. దాదాపు ఇరవై అడుగుల పొడవుతో ఆరు అడుగుల వెడల్పుతో

ఉన్నాయి.. ఆ ద్వారాన్ని మూయాలంటే పదిమంది కలిస్తేనే కానీ సాధ్యపడదేమో అన్నంత దృఢంగా కనిపిస్తున్నాయి. ఆ తలుపులకి వెండి తాపడం చేయించడంతో అందంగా మెరుస్తున్నాయి.. ఆ తలుపుల నిండా రామాయణ, మహా భారత చిత్రాలన్ని అందంగా గీయించడంతో వాటిని చూస్తూ ఎంతో అబ్బురపడింది శారదమ్మ.

ఆ తలుపుల్ని నిశితంగా గమనిస్తూ మెల్లిగా లోనికి ప్రవేశించిన శారదమ్మ ఆశ్చర్యానికి అవధుల్లేకుండా పోయింది. ఎదురుగుండా.. వరుసగా అందంగా కట్టబడి ఉన్నాయి ఆలయాలు.. ప్రధాన ఆలయం మధ్యలో ఉంది. ఉప ఆలయాలు, ప్రధాన ఆలయానికి పది అడుగుల దూరంలో చుట్టూరా కట్టబడి ఉన్నాయి. అద్భుతమైన కళాసంపద ఆ ఆలయ గోపురాలపై కనిపిస్తూంది..

విద్యుత్ దీపాల వెలుగులతో ఆ ఆలయాలన్నీ తళతళా మెరుస్తున్నాయి.. భక్తులు కొట్టే గంట శబ్దం వినసొంపుగా వినిపిస్తోంది. చెవులకి లీలగా ఓంకార నాదం లా వినిపిస్తోంది.. రకరకాల టెన్షన్‌లతో వచ్చే భక్తులకి ఆ గుడిలోకి ప్రవేశించగానే తమ టెన్షన్స్ అన్నీ మరిచిపోయి పూర్తిగా దైవారాధనలో మునిగిపోయేందుకు కావాల్సిన వాతావరణం ఆ గుళ్ళో అడుగడుగునా కనిపిస్తోంది..

శారదమ్మ ఒళ్ళు జలదరించింది ఆ దృశ్యం చూడగానే.. అప్రయత్నంగా ఆమె రెండు చేతులు జోడించి భగవన్నామస్మరణ చేయడం ప్రారంభించింది. ఆనంద స్వరూప్ శారదమ్మ ముఖ కవళికలు గమనిస్తూ చిన్నగా నవ్వుకుని ముందుకు అడుగు వేయసాగారు.

వారు ముందుగా గణపతి మందిరాన్ని దర్శించుకున్నారు. గర్భాలయం లో ప్రసన్నవదనంతో సాక్షాత్కరిస్తున్న వినాయకుడిని చూడగానే శారదమ్మలో ఏదో శక్తి ప్రవేశించినట్టుగా అనిపించింది..

ఏ భక్తుడయినా ముందుగా గణపతిని దర్శనం చేసుకుని ఆ తర్వాత మిగతా ఉపాలయాలన్ని దర్శించుకుని చివరికి ప్రధాన ఆలయాన్ని దర్శించే విధంగా ఆ గుడిని రూపొందించారు. ఏ కార్యక్రమం చేయాలన్నా ముందుగా గణపతి ప్రార్థన చేయడం హిందూ ధర్మ సంప్రదాయం.. ఆ సంప్రదాయానికి అనుగుణంగానే ముందు గణేశుడిని దర్శించేలా ఆలయాన్ని రూపొందించడం శారదమ్మని ఎంతో అబ్బురపరిచింది.

హిందూ ధర్మాన్ని అణుమాత్రమైనా విస్మరించకుండా, ఆగమ శాస్త్రానుసారం ఆలయం ఎలా ఉండాలో ఒకటికి పదిమార్లు పరిశోధించి ఆ తర్వాత ఆ గుడిని నిర్మించారని ఆ అద్భుత కట్టడాన్ని చూస్తూంటేనే అర్థమవుతుంది శారదమ్మకి.

గర్భాలయంలో నుండి కాషాయం వస్త్రాలు ధరించిన బ్రాహ్మణుడు బయటికి రాగానే శారద మరింత ఆశ్చర్యపోయింది..

నియమనిష్టలతో దేవుడిని పూజించడానికి ఏర్పాటు చేసిన బ్రాహ్మణుడు ఇతను.. ఆగమశాస్త్ర ప్రకారంగా దేవుడికి చేయాల్సిన నిత్య పూజలను తూ.చ. తప్పకుండా చేస్తారు. అదే విషయాన్ని ఆనంద స్వరూప్ శారదమ్మతో చెప్పాడు.

''మీకు ఇందాక చెప్పాను కదా.. రామానుజాచార్యులవారు ఈ ఆలయానికి ప్రధాన అర్చకులు అని.. ఆయన శిష్యబృందంలో ఈయన ఒక్కరు. సత్సంప్రదాయాలని, వైష్ణవాచారాలను ఖచ్చితంగా పాటిస్తారు. అంతేకాదు.. ఈ దేవాలయం దేదీప్యమానంగా వెలిగిపోతుండటానికి కారణం రామానుజాచార్యుల వారే.. వారు అమెరికాకి రావడం, ఇక్కడే ఈ ఆలయంలో అర్చకునిగా ఉండడానికి అంగీకరించడం అంతా మా అదృష్టం..'' అర్చకుడు తెచ్చిన హారతిని కళ్ళకి అద్దుకుంటూ అన్నాడు ఆనంద స్వరూప్..

శారదమ్మ కూడా హారతిని కళ్ళకి అద్దుకుని గణేశుడికి భక్తిగా నమస్కరించింది..

తిరిగి వాళ్ళు మరో ఉప ఆలయానికి దారి తీసారు.. ఆ ఆలయంలో దుర్గాదేవి విగ్రహం దీపాల వెలుగులతో మెరిసిపోతూ కనిపించింది.. అమ్మవారిని చూడగానే శారదమ్మకి ఎనలేని ఆనందం కలిగింది.. అప్రయత్నంగా ఆమె పెదవులపై మంత్రం కదలాడింది...

''ఓం.. శ్రీ వాగ్దేవీం.. మాహాకాళీ.. మహాలక్ష్మీ.. సరస్వతీం.. త్రిశక్తి రూపిణీ అంబాం.. దుర్గాం చండీ నమామ్యహమ్..!

ఓం.. శ్రీ వాగ్దేవీం.. మాహాకాళీ.. మహాలక్ష్మీ.. సరస్వతీం.. త్రిశక్తి రూపిణీ అంబాం మాంభ్యాం.. దుర్గాం చండీ నమామ్యహమ్..!

ఓం.. శ్రీ వాగ్దేవీం.. మాహాకాళీ.. మహాలక్ష్మీ.. సరస్వతీం.. త్రిశక్తి రూపిణీ అంబాం.. దుర్గాం చండీ నమామ్యహమ్..! ''

కళ్ళు మూసుకుని అత్యంత భక్తి శ్రద్ధలతో ఉచ్చరించింది శారదమ్మ.. ఆమె చెబుతున్న మంత్రం విని ఆనంద స్వరూప్, సాయిరాం ఇద్దరూ ఎంతో ఆసక్తిగా చూస్తూండి పోయారు..

శారదమ్మ ఇంకా కళ్ళు మూసుకుని దేవిని స్తుతిస్తూనే ఉంది.. అంతలోనే దేవిని పూజిస్తున్న అర్చకుడు అమ్మవారికి హారతి ఇచ్చి వారి వద్దకు వచ్చాడు.. ఆనంద స్వరూప్, సాయిరాం ఇద్దరూ హారతిని కళ్ళకి అద్దుకున్నారు.. శారదమ్మ ఇంకా అలాగే కళ్ళు మూసుకుని మనసులో ఏదో స్తుతిస్తూనే ఉండడం గమనించిన ఆనంద స్వరూప్ మెల్లిగా పిలిచాడు..

''శారదమ్మా..'' అని..

దాంతో మెల్లిగా కళ్ళు తెరిచింది శారదమ్మ..

ఎదురుగా హారతి పళ్లెం పట్టుకుని చిరునవ్వుతో నిలబడి ఉన్న అర్చకుడిని చూడగానే భక్తితో హారతిని కళ్ళకి అద్దుకుంది శారదమ్మ.

''మీ భక్తి భావాలని చూస్తూంటే నాకెంతో సంతోషం వేస్తూంది.. మిమ్మల్ని ఇక్కడికి తీసుకువచ్చి నేను సరైన పనే చేసానన్న సంతృప్తి ఇప్పుడు కలుగుతుంది నాకు..'' మనస్ఫూర్తిగా అన్నాడు ఆనంద స్వరూప్.

''దేవుడిని ఆరాధించే వారికి ఏ రూపాన్ని చూసినా భక్తిపారవశ్యం లభిస్తుంది.. నేను సాయిబాబాని తప్ప వేరే అవతారాన్ని ఎక్కువగా కొలవను .. కానీ.. ఇప్పుడు ఈ దేవీ స్వరూపాన్ని తిలకించ గానే ఎందుకో నామనసంతా ఆనందసాగరంలో తేలియాడుతున్నట్టుగా అనిపించింది.. అనుకోకుండా నేను ఇంతకు ముందు ఎప్పుడూ పలకని ఈ మంత్రం నా నోటినుండి వెలువడింది..'' శారదమ్మ వదనంలో ఒక విధమైన ఆనందంతో పాటు రవ్వంత ఆశ్చర్యం కూడా కదలాడ సాగింది..

ఆమె మాటలకి ఆనంద స్వరూప్, సాయిరాం ఇద్దరూ ఒకరి ముఖాలొకరు చూసుకున్నారు.. అయితే అప్పటికీ వారేమీ మాట్లాడలేదు.. మౌనంగా అడుగులు ముందుకు వేసారు. శారదమ్మ వారిని అనుసరించింది.. ఆ తర్వాత మరొక ఉప ఆలయం దగ్గరికి చేరుకున్నారు..

ఆ ఆలయంలో సీతారామలక్ష్మణులు ఆంజనేయుని సమేతముగా కొలువుతీరి ఉన్నారు.. పంచలోహాలతో తయారు చేయించిన ఆ విగ్రహాలు దీపాల వెలుగులో ఎంతో అద్భుతంగా కనిపిస్తున్నాయి.. చిరు దరహాసంతో భక్తులని ఆశీర్వదిస్తున్న ఆంజనేయ సమేత

సీతారామక్ష్మణులని చూసి శారదమ్మ కళ్లు చెమ్మగిల్లాయి.. ఆమె మనసెంతగానో భావపారవశ్యాన్ని పొందింది..

రెండు చేతులు జోడించి కళ్ళు మూసుకుని మనస్ఫూర్తిగా ప్రార్థించింది..

ఆ ఆలయం తర్వాత మరో ఉప ఆలయానికి బయలు దేరారు.. అక్కడ రాధాగోపాలుడి విగ్రహాలు ముగ్ధ మనోహరంగా వెలుగొందుతున్నాయి.. శారదమ్మ ఆరాధనా పూర్వకంగా నమస్కరించింది.. ధూప దీప నైవేద్యాలతో అలరారుతున్న ఆ దేవతా మూర్తులని చూస్తూన్న శారదమ్మకి ఇదీ అని చెప్పలేని ఆనందం అణువణువునా కదలాడుతుండగా.. ఏదో మైకంలో ఉన్న దానిలా ముందుకి అడుగులు వేసింది..

ఆ తర్వాత మరొక ఉప ఆలయం దగ్గరకు వెళ్ళారు.. ఆ ఆలయంలో శ్రీ లక్ష్మీనరసింహస్వామి కొలువై ఉన్నారు.. లక్ష్మీనరసింహుడిని దర్శించుకున్నారు ముగ్గురూ..

మనసంతా భక్తి పారవశ్యంతో నిండిపోతుండగా.. నరసింహుడికి నమస్కరించింది శారదమ్మ.. అక్కడ కూడా తీర్థ ప్రసాదాలు సేవించి ఇక ప్రధాన ఆలయం వైపుకు అడుగులు వేసారు. ప్రతీ మందిరానికి మధ్య పది అడుగుల దూరం ఉండే విధంగా ఎంతో అద్భుతంగా నిర్మించారు ఆ మందిరాన్ని.. ప్రధాన ఆలయానికి వెళ్ళే దారిలో ఆ ప్రక్కనే ఉన్న గోడపై అద్భుతమైన పెయింటింగులని వేయించారు. ఒక్కో ఆలయం దగ్గర ఆ ఆలయంలో కొలువై ఉన్న దేవుడికి సంబంధించిన పెయింటింగులు అందంగా కనిపిస్తున్నాయి..

లక్ష్మీనరసింహుడిని దర్శించుకున్నాక, ప్రధాన ఆలయం దారికి మధ్యలో ఉన్న గోడపై తిరుమల ఏడుకొండల్ని చిత్రీకరించారు.. ఎంతో అద్భుతంగా కనిపిస్తున్న ఆ పెయింటింగులని చూడగానే శారదమ్మకి ఎంతో ఆనందం కలిగింది.. ప్రధాన ఆలయం చాలా పెద్దగా ఉంది.. నాలుగు ఎత్తయిన గాలి గోపురాలు.. ఆ గోపురాలపైన శంఖు చక్రాలు తళతళా మెరుస్తున్నాయి.. మందిరానికి నాలుగు వైపులా గోడలపై చివరలో గరుడ రూపాలు కనిపిస్తున్నాయి..

మందిరం ప్రక్కనుండి ప్రధాన ద్వారం దగ్గరికి వచ్చారు.. అక్కడి నుండి ఎదురుగా చూసిన శారదమ్మకి, ఎదురుగా కనిపించిన దృశ్యాన్ని చూడగానే శరీరంలోని రోమాలన్నీ నిక్కబొడుచుకున్నట్టు అనిపించింది..

ఎదురుగా శ్రీదేవి భూదేవి సమేతంగా కొలువై ఉన్నాడు వేంకటేశ్వరుడు. ఇద్దరు భార్యల మధ్యన ఎంతో హుందాగా కనిపిస్తున్న వేంకటేశ్వరుడిని చూడగానే శారదమ్మ కళ్ళల్లో నుండి ఆనంద బాష్పాలు జల జలా రాలాయి..

అప్రయత్నంగా ఆమె రెండు చేతులు జోడించింది.. మనసులో గోవింద నామాలు పలకడం ప్రారంభించింది.. అప్పుడు సరిగ్గా ఏడు గంటల సమయం అయ్యింది..

గర్భగుడిలో ఓ అర్చకుడు అటువైపు తిరిగి, విగ్రహాలకి ఎదురుగా కూర్చుని ఉన్నాడు.. ఆయన ముందు రకరకాల పూలు, సుగంధ ద్రవ్యాలు, హారతి కర్పూరాలు, పండ్లు, ఫలహారాలు, లడ్డూలు, పొంగలి తదితర సామాగ్రి అమర్చి ఉన్నాయి..

అతనికి సేవకులుగా ముగ్గురు ఆర్చకులు ఉన్నారు. అందరూ కాషాయ రంగు వస్త్రాలనే ధరించారు. అందరూ నున్నటి గుండ్లతో ఉన్నారు.. వారి వయసు కూడా ఇరవై అయిదు సంవత్సరాల లోపే ఉంటుంది. నుదుటపై మూడు నామాలతో వారు వైష్ణవ ఆచారాలని ఖచ్చితంగా పాటించేవారని తెలిసిపోతుంది..

''అక్కడ కూర్చున్నాడు కదమ్మా.. ఆయనే రామానుజాచార్యులు వారు.. ఈ ఆలయానికి ప్రధాన అర్చకులు వీరే.. ఈ మందిరంలో ఏ కార్యక్రమం జరగాలన్నా ఆయన అనుమతితోనే, ఆయన సూచనల ప్రకారంగానే జరుగుతాయి.. ఈ మందిరం నిర్మించిన దగ్గరనుండీ ఆయనే ప్రధాన అర్చకులుగా కొనసాగుతున్నారు. మొదట్లో ఈయన ఒక్కరే ఇక్కడికి వచ్చారు.. అప్పుడు కేవలం ఈ వేంకటేశ్వరుడి ఆలయం మాత్రమే ఉండేది.. రాను రాను ఒక్కో ఉపాలయాన్ని పెంచుకుంటూ ఈ పాతికేళ్ళ కాలంలో మందిరాన్ని ఇలా తయారు చేశాం. అనంతరం రామానుజాచార్యుల వారి కుటుంబ సభ్యులందరూ ఆలయ నిర్వహణ కోసం ఇక్కడికి చేరుకున్నారు.. వారు అమెరికాలో ఉంటారన్న మాటే గానీ.. వైష్ణవ ఆచారాలను తు.చ. తప్పకుండా పాటిస్తారు.. మందిరం ఇళ్లు తప్ప వారికి మరో వ్యాపకం అంటూ ఉండదు.. ఆలయాల్లో పూజలు చేసే వారందరినీ ఉదయం నాలుగు గంటలకే లేపి వారితో వేదపారాయణం చేయిస్తారు. ఎవరయినా ఏదయినా పొరపాటు చేస్తే నిర్దాక్షిణ్యంగా వారిని ఇండియాకి పంపించివేస్తారు..'' రామానుజాచార్యుల గురించి చెప్పడం ఆపి శారదమ్మ వంక చూసాడు ఆనంద స్వరూప్..

శారదమ్మ ఆనంద స్వరూప్ మాటలని ఎంతో ఆసక్తిగా విన్నది.. ఆ తర్వాత తిరిగి వేంకటేశ్వరుడి వైపు చూసి నమస్కరించింది..

‘‘ఆ దేవుడు తన సేవకులని తానే నియమించుకుంటాడన్నది ఎంత నిజమో కళ్ళ ముందు కనిపిస్తున్న ఆ మహానుభావుడిని చూస్తే అర్ధమవుతుంది.. అద్భుతమైన రీతిలో మందిరాన్ని నిర్మించినా ఆ మందిరంలో కొలువై ఉన్న దేవతామూర్తులకి సరిగ్గా ధూప దీప నైవేద్యాలు అందకపోతే ఆ ఆలయం కళావిహీనం అయిపోతుంది.. ఆలయం లోని శక్తి అంతరించి పోతుంది.. ఈ విషయం తెలిసే సాక్షాత్తూ ఆ భగవంతుడే రామానుజాచార్యల లాంటి మహానుభావుని ఇక్కడికి వచ్చేలా చేసాడేమో..’’ తన్మయత్వంగా అన్నది శారదమ్మ..

‘‘మీరు చెప్పింది కూడా నిజమే శారదమ్మ గారు.. ఖండాంతరాలు దాటినా మన హిందూమత ధర్మాన్ని రక్షించాలన్న నా సంకల్పం వల్ల అమెరికాలో ఆలయం వెలసింది.. రామానుజాచార్యుల వంటి నియమనిష్టా గరిష్టుడి వల్ల ఆలయం మూర్తులు దేదీప్యమానంగా వెలుగొందుతున్నాయి.. ఈ నిజాలన్ని ఇంత వరకూ ఎవరూ గ్రహించలేకపోయారు.. మీరు మాత్రం మొదటి చూపులోనే ఈ మందిరం విశిష్టతని గుర్తించారు.. నిజంగా మీకు నా జోహార్లు తెలియజేసుకుంటున్నాను..’’ అబ్బురంగా అన్నాడు ఆనంద స్వరూప్..

క్రమంగా అక్కడ భక్తులందరూ గుమిగూడ సాగారు.. అందరూ వేంకటేశ్వరుని విగ్రహం వైపు ఆరాధనా పూర్వకంగా చూస్తున్నారు..

శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వర స్వామికి ప్రత్యేక హారతి ఇచ్చే సమయం అది.. స్వయంగా రామానుజాచార్యుల వారే దగ్గరుండి ఆ హారతిని ఇస్తారు.. ఆ ప్రత్యేక హారతిని తిలకించడానికి వందలాది భక్తులు తరలి వస్తారు..

గర్భగుడిలో దీపాల కాంతులతో సర్వాంగ సుందరంగా సర్వాంలంకారభూషితుడిగా వెలుగొందుతున్న ఆ విగ్రహ మూర్తులని చూస్తూంటే సాక్షాత్తూ ఆ వేంకటేశ్వరుడే సతీ సమేతంగా నిజంగా ఉన్నాడేమో అన్న భ్రమ కలుగుతుంది.

స్వచ్ఛమైన నేతితో వెలిగించిన దీపాలను ఒక చేతితో పట్టుకుని, మరో చేత్తో గంటని పట్టుకుని లేచి నిలబడ్డాడు రామానుజాచార్యుల వారు.. అతనికి మరో వైపున అయిదు మంది శిష్యులు నిలబడి ఉన్నారు..

రామానుజాచార్యులు  పెద్దగా మంత్రాలని చదవడం ప్రారంభించాడు.. ఆయన మంత్రాలని చదువుతూ మధ్య మధ్యలో గంటని మ్రోగిస్తూంటే.. ఆ మంత్రాలకి అనుగుణంగా మధ్య మద్యలో అతని శిష్యులు కూడా చదవడం ప్రారంభించారు..

 కళ్ళకి ఇంపుగా, వినసొంపుగా సాగుతున్న ఆ కార్యక్రమాన్ని భక్తులందరూ ఎంతో శ్రద్ధగా తిలకిస్తున్నారు.. హారతి కార్యక్రమం ముగియగానే గోవిందనామస్మరణతో ఆ ప్రాంగణమంతా దద్దరిల్లిపోయింది..

రామానుజాచార్యుల శిష్యబృందం భక్తులందరికీ ప్రసాద వితరణ గావించారు. అనంతరం రామానుజాచార్యులు గర్భగుడిలో నుండి బయటికి వచ్చారు. దాదాపు అరవై సంవత్సరాలుంటాయి వారికి. కాషాయ వస్త్రాలు ధరించి ఉన్నారు. నుదుటిపై నామాలు, బోడి గుండుతో .. గంభీరమైన వదనంతో.. పెద్ద పెద్ద కళ్ళతో .. వయసు పెరిగిఉన్నా వన్నె తగ్గని శరీరంతో .. మెడలో రుద్రాక్ష మాలలతో .. నిరంతరం ఏదో  మంత్రజపం లోలోన పలుకుతున్న .. వారిని చూడగానే శారదమ్మకి ఎంతో గౌరవభావం కలిగింది.. ఆయన బయటికి రాగానే ఆయన దగ్గర ఆశీర్వాదం తీసుకోవడానికి భక్తులందరూ బారులు తీరారు. ఒకరికి ఒకరు తోసుకుంటూ ఆయన పాదాలపై పడ్డారు.. అందరికీ ఓపికగా ఆశీర్వాదాని అందజేసి ఆనంద స్వరూప్‌ని గమనించి ఆయన దగ్గరకు వచ్చాడు..

ఆనంద స్వరూప్ కూడా ఆయన పాదాలకి నమస్కరించాడు.

''అయ్యా.. నేను మీకు చెప్పానుకదా.. ఇండియా నుండి శారదమ్మ అని ఒక ఆధ్యాత్మికరాలని తీసుకువస్తున్నానని.. ఇదిగో ఆవిడే ఈవిడ.. శారదమ్మ '' రామానుజాచార్యులకి శారదమ్మని పరిచయం చేసాడు.. రామానుజాచార్యులు శారదమ్మ వంక చూశాడు.. ఆయన తన వంక చూడగానే వంగి ఆయన పాదాలని తాకి నమస్కరించింది శారదమ్మ..

రామానుజాచార్యులు శారదని కొన్ని క్షణాల పాటు తదేకంగా గమనించి ఆ తర్వాత ఏమీ మాట్లాడకుండా గంభీర వదనంతో ఆక్కడి నుండి వెళ్ళిపోయాడు..

ఆ పరిణామానికి ఆనంద స్వరూప్, సాయిరాం అవాక్కయ్యారు. శారదమ్మని చూసి ఆయన సంతోషిస్తాడని, ఆమె గురించిన వివరాలని ఆసక్తిగా అడిగి తెలుసుకుంటాడని ఆశించారు

వారు.. కానీ అలాంటిదేమీ లేకుండా ఒక్క మాటయినా మాట్లాడకుండా అక్కడి నుండి వెళ్లిపోవడం వారికి నిరాశపరిచింది..

ముందుగా తేరుకున్నది ఆనంద స్వరూప్.. శారదమ్మ వంక చూశాడు. శారదమ్మ ముఖం లో ఏ భావమూ కనిపించడం లేదు.. ఆమె ఆ మందిరం నలువైపులా చూస్తూ ఉండిపోయింది..

''.. శారదమ్మ గారూ.. పంతులు గారూ ఇప్పుడే హారతి పూర్తి చేశారు కదా.. అందుకే ఏమీ మాట్లాడకుండా వెళ్లిపోయారు..'' సంజాయిషీ చెబుతున్నట్టుగా అన్నాడు ఆనంద స్వరూప్.

ఆయన మాటలని అస్సలు పట్టించుకోలేదు శారదమ్మ..

''ఈ గుడి నాకు చాలా బాగా నచ్చిందండి.. ఈ వాతావరణం చూస్తూంటే నాకు పరాయి దేశంలో ఉన్నానన్న భావన కూడా కలగటం లేదు..'' ఆనందంగా అంది శారదమ్మ..

ఆమె ముఖకవళికలు గమనించిన ఆనంద స్వరూప్ తేలికగా ఊపిరి పీల్చుకున్నాడు.. శారదమ్మ అసలు రామానుజాచార్యుల గురించి పెద్దగా పట్టించుకోలేదని అర్థమయింది..

ఆనంద స్వరూప్ ఇంకా ఏదో మాట్లాడాలను కుంటుండగానే...

''మన బృందం వచ్చేసారండీ.. '' అన్నాడు మందిరం ద్వారం వంక చూస్తూ.. ఆనంద స్వరూప్ కూడా అటువైపు చూసాడు..

శారదమ్మ ఇచ్చే దివ్య ప్రసంగాలను మొట్టమొదటగా వినే అదృష్టం వారికి కలిగిందని ఆనంద స్వరూప్ అనుకున్నాడు.. వేంకటేశ్వరుని సన్నిధానం నుండి బయటికి వచ్చారు.. ఆ మందిరానికి ఆనుకుని ఉన్న ఒక హాలులోకి ప్రవేశించారు. దేవుడి కళ్యాణోత్సవాలు, సమావేశాలు ఏర్పాటు చేయడానికి ఉద్దేశించి కట్టారు. దాదాపు రెండువందల మంది వరకూ ఆ హాలులో కూర్చునేంత విశాలంగా ఉంది. దానికి ఒకవైపు వేదికని ఏర్పాటు చేసారు. ఆ వేదికకి ఆనుకుని ఉన్న గోడపై ఆ ఆలయం లో ఉన్న అందరి దేవుళ్ల ఫోటోలను అమర్చారు. అత్యాధునికమైన సౌండ్ సిస్టమ్‌ని ఏర్పాటు చేసారు.

ఇక నుండి శారదమ్మ ప్రవచనాలు ఆ హాలు నుండే మొదలు కాబోతున్నాయి. ఆ హాలు నుండే అమెరికాలో శారదమ్మ చేసే దివ్య ప్రసంగాలు ఇక్కడి ప్రజలకి చేరువ కాబోతున్నాయి.. వేల కిలో మీటర్ల దూరం నుండి ఆధ్యాత్మిక సంపదని మోసుకువచ్చిన ఓ పవిత్ర స్త్రీమూర్తి శారదమ్మ. తెలుగు వారిని ఉద్ధరించడానికి, తెలుగు జాతి ఔన్నత్యాన్ని ప్రపంచానికి చాటి చెప్పడానికి,

అలాగే హిందూ సంప్రదాయాన్ని, హిందూ దేవతలను మరియు దైవాన్ని ఆరాధించే వారిలో కలిగే సందేహాలని నివృత్తి చేయడానికి, భారతదేశం కీర్తి ప్రతిష్ఠలను అమెరికాలో ఇనుమడింప చేయటానికి కంకణం కట్టుకుంది శారదమ్మ..

ఆమెలో ఇంత శక్తి దాగుందని ఆమెకి కూడా తెలియదు.. కానీ.. ఆనంద స్వరూప్ మాత్రం భవిష్యత్తుని ముందే గ్రహిచాడు. అందుకే అతనికి శారదమ్మపై ఎనలేని గురి కలిగింది..

ఆధ్యాత్మిక ప్రపంచంలో తనకంటూ ఒక ప్రత్యేకతని చాటి చెప్పుకునేందుకు మొదటి అడుగు ఆనాటి నుండే పడబోతుండడం, ఆ అడుగు ఎన్ని సంచలనాలను సృష్టించబోతుందో తెలియని శారదమ్మ మాములుగా ముందుకు అడుగులు వేయడం ప్రారంభించింది.

అక్కడికి వచ్చిన వారందరూ ఆలయాలలోని దేవుళ్ళందరినీ దర్శించుకుని ఆనంద స్వరూప్ దగ్గరికి వచ్చారు. వారిలో కొందరు ఆనంద స్వరూప్ కొలీగ్స్ ఉన్నారు. మరి కొందరు తెలుగు సంఘం సభ్యులు ఉన్నారు.. దాదాపు ఒక ఇరవై మంది వరకూ వచ్చారు.

వారందరిలోనూ శారదమ్మ చెప్పే ప్రవచనాలను వినాలన్న కుతూహలం కనిపిస్తోంది.. శారదమ్మని వారికి ఆనంద స్వరూప్ పరిచయం చేశాడు..

శారదమ్మ వినయంగా నమస్కరించింది అందరికీ.. వారు కూడా శారదమ్మకి నమస్కరించారు..

''శారదమ్మ గురించి మీకు ప్రత్యేకంగా పరిచయం చేయాల్సింది ఏమీ లేదు.. ఈవిడ గురించి మీరు ఆల్రెడీ ఇంటర్‌నెట్‌లో చూసే ఉంటారు. ఈవిడ ప్రసంగాలు మనిషి ఆలోచనా తరంగాలను తడిమి ఆధ్యాత్మిక చింతన ద్వారా ఆ ఆలోచనల పదును పెంచేందుకు ఎంతగానో ఉపయోగ పడతాయని చెప్పడంలో ఎలాంటి సందేహం లేదు.. అయినా.. ఇదంతా నేను చెప్పడం ఎందుకు .. మీరే స్వయంగా వినండి..'' నవ్వుతూ అన్నాడు ఆనంద స్వరూప్..

వారందరూ వ్యక్తిగతంగా తమని తాము పరిచయం చేసుకున్నారు.. కొంత మంది తమ పిల్లలను కూడా తీసుకు వచ్చారు.. ఆ పిల్లలను చూడగానే శారదమ్మ ముఖం సంతోషంతో వెలిగిపోయింది.. ఎంతో చనువుగా ఆ పిల్లలను తన దగ్గరికి తీసుకుంది.. వారి పేర్లను అడిగి తెలుసుకుంది..

ఆమె మాట్లాడుతున్న విధానం.. ఆమె అనుసరిస్తున్న తీరు.. అక్కడి వారందరినీ ఎంతో ఆకట్టుకుంది.. ముఖ్యంగా పిల్లలతో శారదమ్మ మమేకం కావడం, వారితో ఆనందంగా ముచ్చటించడం ఆనంద స్వరూప్‌కి చాలా బాగా నచ్చింది.

అప్పటికే చీకట్లు అలుముకున్నాయి.. దేవాలయం విద్యుద్దీపాలంకరణతో దేదీప్యమానంగా వెలిగిపోతూంది.. చుట్టూ ఉన్న వాతావరణం కూడా ఎంతో ఆహ్లాదంగా ఉంది..

తాను అమెరికాలో ఉన్నానన్న విషయాన్ని మరిచిపోయింది శారదమ్మ.. అక్కడి వారు ఎంతో ఆప్యాయంగా మాట్లాడుతుండటం, చిన్న పిల్లలతో కలిసి ముచ్చటించడం ఆమెకి ఎంతో ఆనందాన్నిస్తోంది..

ఉదయం ఏడున్నర వరకు వారందరితో ముచ్చటించాక..

''ఇంక మీరు విశ్రాంతి తీసుకోండి శారదమ్మ గారూ.. రేపు ఉదయం మన కార్యక్రమాల వివరాలను  సాయిరాం తెలుపుతారు..'' నవ్వుతూ అన్నాడు ఆనంద స్వరూప్..

అతని మాటలకి సరే అన్నట్టు తలా ఊపింది శారదమ్మ..

శారదమ్మ దగ్గర సెలవు తీసుకుని అందరూ వెళ్లిపోయారు..

ఆనంద స్వరూప్, సాయిరాం ఇద్దరూ శారదమ్మ విడిది వరకు వెళ్లి ఆమె దగ్గర సెలవు తీసుకుని వెళ్ళిపోయారు.. శారదమ్మ కోరిక మేరకు ఆమెకోసం గోధుమ రొట్టి, పులకాలు తయారు చేసి తీసుకువచ్చారు అక్కడి పనివాళ్ళు.. వాటిని ఆరగించి బెడ్‌పై నడుం వాల్చింది శారదమ్మ..

అలా పడుకుందో లేదో.. నిద్రా దేవత ఆమెని ఆవరించింది.. ఈ ప్రపంచంతో సంబంధం లేకుండా ఆనందంగా నిద్రపోయింది శారదమ్మ..

.....................

ఉదయం అయిదు గంటలకి ఎవరో తట్టి లేపినట్టు మెలుకవ వచ్చింది శారదమ్మకు.. ఒక్క ఉదుటున లేచి కూర్చుంది శారదమ్మ.. కాసేపు అలాగే కూర్చుండిపోయింది.. ఆ తర్వాత సాయినాథుడిని మనసులోనే స్మరించుకుని మెల్లిగా బెడ్‌పైనుండి లేచి లైటు వేసింది..

కిటికీ దగ్గరకు వెళ్ళి కర్టెను పక్కకి లాగింది.. చీకట్లో లివర్మోర్ ప్రాంతంలోని ఇళ్ళల్లో వెలుగుతున్న లైట్లు, వీధి దీపాలు ఎంతో అందంగా కనిపిస్తున్నాయి.. చలి ఎక్కువగా ఉండడంతో ఆమె శరీరం సన్నగా కంపిస్తుంది.. దాంతో భుజంపై శాలువా  వేసుకుంది..

ఇంకా నిద్రమత్తు దిగనట్లు ఆవలింతలు  వచ్చాయి.. ఇండియాలో అయితే నాలుగున్నర కల్లా నిద్రలేచి సాయిమందిరం మొత్తం శుభ్రం చేయడం, సాయినాధుడి ఉదయం హారతి సమయానికి మందిరమంతా నీటుగా సర్దిపెట్టేసే పని ఉండడంతో అసలు  సమయం తెలిసేది కాదు..

కానీ.. ఇక్కడ ఆమెకి ఆ పని లేకపోవడంతో మనసులో ఎక్కడో తెలియని బాధ ఉన్నప్పటికీ.. సాయినాధుడి అభీష్టం మేరకే తాను ఇంత దూరం వచ్చానని ఆమె నమ్ముతుండడంతో ఆమె మనసు కాస్త స్థిమిత పడింది .. బెడ్‌రూంలో నుండి హాలులోకి  నడిచింది..

మందిరం కనిపించే కిటికీ దగ్గరకు వచ్చి కర్టెను తొలగించింది.. ఎదురుగా కనిపిస్తున్న మందిరాన్ని చూసి ఆమె ఒళ్ళు జలదరించింది..

తన కళ్ళని తానే నమ్మలేనంతగా షాక్‌కి గురయ్యింది శారదమ్మ.. ఎదురుగా మందిరం విద్యుద్దీపాలతో వెలిగిపోతూంది.. ప్రధాన దేవాలయంలోని వేంకటేశ్వరస్వామికి మేలుకొలుపు పూజలు  చేస్తున్నాడు రామానుజాచార్యులు..

మిగతా అర్చకులు ఉప ఆలయాలలోని దేవతా మూర్తులను పూల మాలలతో అలంకరిస్తున్నారు .. ధూప ధీప నైవేద్యాలు సిద్దం చేసుకున్నారు..

గాలిలోనుండి లీలగా 'కౌసల్యా సుప్రజారామా.. పూర్వా సంధ్యా ప్రవర్తతే.. ఉత్తిష్ట నరశార్దూల .. త్రైలోక్యం మంగళం కురూ..'' వేంకటేశ్వర సుప్రభాతం మనోరంజకంగా వినిపిస్తోంది..

వేద పాఠాలను నేర్చుకునే బ్రాహ్మణులు వేద పారాయణం చేయడంలో నిమగ్నమైపోయారు.. వారందరూ రెండు వరుసలుగా కూర్చున్నారు.. వారికి ఎదురుగా గురువు కూర్చుని ఉన్నాడు.. ఆయన గట్టిగా వేదాలని వల్లిస్తూంటే.. దానికి అనుగుణంగా శిష్యబృందం బట్టీ పదుతున్నారు.. మందిరంలో భక్తుల సందడి అప్పుడే మొదలయ్యింది.. మందిరం ప్రాంగణంలో ఉన్న పార్కింగ్ స్థలం లో పదుల సంఖ్యలో కార్లు పార్కు చేయబడి ఉన్నాయి.. సంప్రదాయ దుస్తులతో చిన్నా పెద్దా తేడా లేకుండా ఆలయం లోకి వస్తున్నారు. ఆలయంలో  దేవతామూర్తులకు పూజలు మొదలయ్యాయి.. ఒక వైపు వేద మంత్రోచ్చారణ, మరో వైపు వేంకటేశ్వర స్వామి వారి సుప్రభాతం.. ఇంకో వైపు అన్ని ఆలయాలలోని మూర్తులకు  అత్యంత నియమ నిష్టలతో ధూప ధీప నైవేద్యాలు సమర్పించి, దేవతలను స్తుతిస్తున్నారు అర్చకులు..

ఆ దృశ్యం చూస్తున్న శారదమ్మకి రెండు కళ్ళల్లోనుండి కన్నీళ్లు జలజలా రాలాయి.. ఇది కలా నిజమా అన్న సందిగ్ధం కూడా కలిగింది..

దేవాలయాల్లో పూజలు, మంగళ హారతులు ఇవ్వడం పెద్ద విషయమేమీ కాదు.. ప్రతీ ఆలయం లో పొద్దు పొడవక ముందే దేవుడికి ధూప, దీప నైవేద్యాలతో పూజించడం అలవాటు..

కానీ.. కానీ.. ఇంకా సూరీడు పొడువకముందే.. అత్యంత భక్తి శ్రద్ధలతో, సంప్రదాయ దుస్తులతో భక్తులు రావడం, దేవుళ్ళని దర్శించుకున్నందుకు వారి ముఖాలలో కనిపించే ఆనందం చూస్తూంటే ఆమెకి మతి పోయింది..

ఇండియాలో అయితే ఉదయం ఏడు గంటకి గానీ నిద్రలేవరు.. ఎనిమిది దాటాక గానీ భక్తుల హడావిడి మందిరాలలో ఎక్కువగా కనిపించదు..

కానీ ఇక్కడ.. దానికి విరుద్ధంగా ఇంత వేకువజామునే భక్తుల తాకిడి మొదలు కావటం శారదమ్మకి ఆశ్చర్యానికి గురి చేసింది.. పైగా.. రెండు దుప్పట్లు నిండా కప్పుకున్నా కూడా ఇంకా శరీరాన్ని ఒణుకుపుట్టించేంత చలిగా ఉన్న ఈ సమయంలో కేవలం తమ ఒంటిపై శాలువా, ధోవతి మాత్రమే వేసుకుని రావడం, ఆడవారు నిండుగా చీరని కట్టుకుని రావడం, చిన్న పిల్లలు సైతం లంగాలు జాకెట్లు వేసుకుని రావడం ఆమెకి మతిపోయినంత పని చేసింది..

అమెరికాలో దేవాలయాలు ఉన్నాయని ఆమెకి తెలుసు.. కానీ.. తమ దేవుళ్ళపై ఉన్న భక్తితో భారతీయులే దేవాలయాలను కట్టించుకున్నారని, తమకి సెలవు ఉన్న రోజున దేవాలయానికి వచ్చి దేవుడిని పూజించుకుంటారని, మిగతా దినాలలో దేవాలయానికి పెద్దగా భక్తుల తాకిడి ఉండదని ఆమె అనుకుంది.. కానీ.. దానికి విరుద్ధంగా కనిపిస్తున్న ఆ దృశ్యాన్ని చూసి ఆమె మనసు ఎంతగానో పొంగిపోయింది..

ఆచార వ్యవహారాలని, ఇండియాలో కన్నా ఇక్కడి ప్రవాసాంధ్రులు ఎక్కువగా ఆచరిస్తున్నారన్న విషయం ఆమెకి బోధపడింది.. ఆధ్యాత్మిక చింతనలో వారు ఎంతగా మమేకం అయ్యారో, దేవుడికి సంబంధించిన విషయాలని వినడానికి వారు ఎంత ఆసక్తి కనబరుస్తారో ఆమెకి అవగతమయ్యింది..

ఉన్నత చదువు, ఉన్నత వ్యాపారాలతో సరిసమానంగా ఉన్నతమైన భక్తిని కూడా ఆపాదించుకున్న అక్కడి తెలుగువారి ఔదార్యానికి ఆమె ముగ్ధురాలయిపోయింది..

కానీ.. ఎక్కడో ఆమెలో చిన్న సందేహం మొదలవ్వడం ప్రారంభించింది..

భక్తి తత్వంలోనూ, ఆధ్యాత్మిక చింతనలోనూ ఇక్కడివారికి ఉన్న అనంతమైన జ్ఞానం ముందు తన ప్రవచనాల ప్రభావం ఏమాత్రం ఉంటుంది.. అసలు ఇంత భక్తి జ్ఞానం కలిగిన వారికి తాను ఏమి సందేశాన్ని ఇవ్వగలుగుతుంది..

దేవుడిని పూజించడం వేరు, దేవుడికి నమస్కరించడం వేరు, దేవుడిని నిండు మనసుతో సంప్రదాయ బద్ధంగా కొలవటం వేరు..

మొదటి రెండు గుణాలు ఇండియాలో ఎక్కువగా కనిపిస్తాయి.. అందుకే అక్కడి వారికి దేవుడి గురించిన అవగాహనని పెంపొందించడానికి తన శక్తి మేరకు ప్రయత్నం చేసింది..

కానీ దేవుడిని నిండు మనసుతో సంప్రదాయ బద్ధంగా పూజిస్తున్న ఇక్కడి జనాలకి తాను ఏమి బోధిస్తుంది..? తులసి వనంలో ఏపుగా పెరిగిపోయే కలుపు మొక్కని ఏరివెయ్యడం చాలా అవసరం.. ఎందుకంటే ఆ కలుపు మొక్క ఆ వనాన్ని మొత్తం పాడు చేసే అవకాశం ఉంటుంది కాబట్టి..

కానీ.. కలుపు మొక్క మధ్య తులసి చెట్లు పెరిగి, నిశ్చలంగా కుదురుకుని ఉన్నాక ఇంక వాటిని ఏమి చెయ్యడానికి ఉంటుంది..? కలుపు మొక్క మధ్య తులసి మొక్క పెరగడమే పెద్ద విషయం.. అలాంటిది, మొక్కలు పెరిగి పెద్దవయ్యి తమ తులసి దళాలతో ఆ కలుపు తోటనంతటికీ పవిత్రత చేకూరుస్తున్న ఆ తులసిదళాలకి ఇంకా చెప్పడానికి ఏముంటుంది..?

ఆమె మనసు విపరీతమైన నిరుత్సాహంతో నిండిపోయింది.. ఏదో తెలియని ఆందోళన ఆమెని పట్టి పీడించటం ప్రారంభించింది..

భారంగా నిట్టూరుస్తూ కళ్ళు మూసుకుని మనసులోనే సాయినాధుడిని ప్రార్థించింది..

‘‘సాయి.. నీ ఆజ్ఞ ప్రకారమే నేను ఈ విదేశీ గడ్డపై కాలు మోపాను.. ఇంక ముందు ముందు జరగబోయే పర్యవసానాలన్నిటికీ నీదే బాధ్యత నేను నిమిత్తమాత్రురాలిని..’’ అని ప్రార్థించింది..

సాయినాధుడిని ప్రార్థించాక ఆమె మనసు కొద్దిగా కుదుట పడింది..

ప్రస్తుతం తన మదిలో మెదులుతున్న ఆలోచనకి కాస్త విరామాన్ని ఇచ్చి అక్కడి నుండి కదిలింది..

అయితే ఆమెకి తెలియని విషయం మరొకటి ఉంది..!

తాను భక్తులకి ప్రవచనాలు ఎలా చెప్పాలా అన్న సందేహంతో మాత్రమే ఉంది శారదమ్మ.. కానీ అంతకంటే పెద్ద ప్రమాదం ఆ దేవాలయం ప్రధాన అర్చకులు రమణ దీక్షితుల రూపంలో కాచుకుని కూర్చుందన్న విషయం ఆమెకి తెలియదు.. అది తెలిస్తే ఆమె ఆలోచనలు మరొక విధంగా సాగేవేమో..?

.......................

ఉదయం ఏడు గంటయినా ఇంకా చలి ప్రభావం తగ్గలేదు.. కాలింగ్‌బెల్ మ్రోగడంతో తలుపు తీసింది శారదమ్మ..

''గుడ్ మార్నింగ్ మదర్..'' ఎంతో వినయంగా అన్నారు ఇద్దరు పనివాళ్ళు..

చిన్నగా నవ్వుతూ విష్ చేసింది శారదమ్మ..

వాళ్ళలో ఒకడి చేతిలో ఉన్న ప్లేట్‌లో టీపొడి, చక్కెర విడివిడిగా ఉన్న డబ్బాలలో ఉన్నాయి. వాటి ప్రక్కనే అందమైన గాజు బాటిల్‌లో వేడివేడిగా ఉన్న డికాషన్ ఉంది.. డికాషన్ బయటికి వచ్చేందుకు ఏర్పాటు చేసిన గాజు గొట్టం ద్వారా వేడి వేడి పొగలు బయటికి వస్తున్నాయి.. దాని ప్రక్కనే వెండి గ్లాసు నిండా చిక్కటి పాలు ఉన్నాయి..

మరొకడి చేతిలో ఉన్న ప్లేట్‌లో ఇడ్లీ, ఉప్మా, దోస మూడు రకాలైన టిఫిన్స్ ఉన్నాయి..

వాళ్ళిద్దరూ హాల్‌లోకి వచ్చి వాటిని టీపాయ్ పైన పెట్టారు..

''మదర్.. మీరు ఇందులో ఏది బ్రేక్‌ఫాస్ట్‌గా తీసుకుంటారో తీసుకోండి.. అలాగే ఇదిగో టీకి కావాల్సినవన్నీ ఇక్కడ సిద్దంగా ఉన్నాయి.. మీకు కావాల్సిన విధంగా టీని చేసుకుని త్రాగండి..'' వినయంగా అన్నాడు ఒకడు..

వారి మాటకే కాదు, వారు తీసుకువచ్చిన వస్తువులని చూసి కూడా శారదమ్మ ఎంతో ఆశ్చర్యపోయింది.. ఆతిథ్యం విషయంలో ఆనంద స్వరూప్ ఎంత జాగ్రత్త తీసుకున్నాడో వారు చేస్తున్న సర్వీసింగ్ ద్వారా అర్థం చేసుకుంది శారదమ్మ.. ఆయన తనకి ఇచ్చిన గౌరవానికి లోలోనే నవ్వుకుంది..

''మదర్.. ఇక్కడ మీకు ఎలాంటి ఇబ్బందీ లేదు కదా.. ఏమయినా ఉంటే చెప్పండి..'' వినయంగా అన్నాడు ఒకడు..

‘‘అబ్బే.. అలాంటిదేమీ లేదు..’’ నవ్వుతూ అంది శారదమ్మ.

‘‘థ్యాంక్యూ మదర్.. ఆనంద స్వరూప్ గారు మిమ్మల్ని కంటికి రెప్పలా చూసుకోమని చెప్పారు.. మా వల్ల మీకేమయినా ఇబ్బంది తలెత్తినా, మా నుండి ఏమయినా పొరపాటు జరిగినా మీరు నిర్మొహమాటంగా చెప్పండి..’’ మరొక పనివాడు అన్నాడు.

‘‘అలాంటి అవసరం రాదు లెండి..’’ నవ్వుతూ అంది.. ఆ తర్వాత కూర్చున్న చోటు నుండి లేచి నిలబడి పూజ గదివైపు అడుగులు వేసింది..

ఆ పరిణామానికి ఇద్దరూ ఆశ్చర్యపోయారు.

‘‘అదేమిటి మదర్.. టిఫిన్ చేయకుండా వెళ్ళిపోతున్నారే..?’’ ఆశ్చర్యంగా అన్నాడు ఒక వ్యక్తి.

‘‘ఇప్పుడే వస్తాను..’’ అంటూ నవ్వుతూ పూజ గదిలోకి వెళ్ళింది..

శుభ్రంగా స్నానం చేసాక పూజ గదిలో సాయినాధుడి విగ్రహానికి శ్రద్ధాభక్తులతో పూజ చేసింది.. ముందుగానే చెప్పడంతో పనివారు పూజకి కావాల్సిన పూలు, నివేదనకి కావసిన ప్రసాదం తదితరాలు సిద్దం చేసి పెట్టారు.

సాయినాధుడికి నైవేద్యం పెట్టిన పండ్లని తీసుకుని హాలులోనికి వచ్చింది..

వాటిని ఆ ఇద్దరి పనివాళ్లకి అందించింది..

‘‘ఇదిగోండి.. సాయినాధుడి ప్రసాదం.. తీసుకోండి..’’ ప్రసాదాన్ని వారికి అందిస్తూ అంది శారదమ్మ..

ఆ ప్రసాదాన్ని అమితానందంతో అందుకున్నారు ఇద్దరూ.. వారి కళ్ళనుండి ఆనంద బాష్పాలు రాలాయి.. వారి ముఖాలలోని  భావాలని గమనించి ఆశ్చర్యపోయింది..

‘‘మదర్.. ఇక్కడ అందరి దేవుళ్ళ ఆశీర్వాదాలని అందుకున్నాము.. ఒక్క సాయినాధుడిది తప్ప.. ఈ రోజుతో ఆ కోరిక కూడా తీరింది.. ఈ ప్రసాదాన్ని చూస్తుంటే.. షిరిడీలో సాయినాధుడిని దర్శించిన ఆనందం కలుగుతుంది..’’ ఆర్ధ్రంగా అన్నాడు ఒక పనివాడు.

శారదమ్మ సంతోషంగా చూసింది..

వారు ఆమెకి వినయంగా నమస్కరించి గదిలోనుండి బయటికి వెళ్ళిపోయారు.

తొమ్మిది గంటల వరకూ గదిలోనే భాగవతం పారాయణం చేస్తూ గడిపింది.. ఆ గదిలో ఉన్న ఫోన్ మ్రోగడంతో చదవడం ఆపి ఫోన్ లిఫ్ట్ చేసింది..

''శుభోదయం శారదమ్మ గారూ.. సంతోషంగా ఉన్నారా..'' అవతలి నుండి ఆనంద స్వరూప్ మాటలు వినగానే శారదమ్మ మనసు ఆనందంతో నిండిపోయింది..

''చాలా సంతోషంగా ఉన్నాను..'' అంది శారదమ్మ..

''మరొక అరగంటలో మందిరానికి ఒక స్కూల్ వ్యాన్ వస్తుంది.. అందులో దాదాపు యాభై మంది పిల్లలు వస్తున్నారు.. ప్రత్యేకంగా మిమ్మల్ని కలుసుకోవడానికే.. మీ ప్రవచనాలు వినడానికి వారు ప్రత్యేకంగా స్కూల్ ప్రిన్సిపాల్ దగ్గర పర్మిషన్ తీసుకున్నారు.. వారి విజ్ఞాపనని మన్నించి మధ్యాహ్నం వరకు పర్మిషన్ ఇచ్చాడు ప్రిన్సిపాల్.. మీరు వారిని కలుసుకోగలరా..?'' వినయంగా అన్నాడు ఆనంద స్వరూప్..

''అయ్యో.. అదేమి భాగ్యం.. నిజానికి నేను కూడా ఆ సమయం కోసమే ఎదురు చూస్తున్నాను.. తప్పకుండా కలుసుకుంటాను..'' ఉత్సాహంగా అంది శారదమ్మ..

''విత్ ప్లెజర్.. సాయిరాం కూడా వారితో వస్తున్నాడు.. ఆయన వారిని పరిచయం చేస్తారు .. నేను సాయంత్రం మిమ్మల్ని కలుసుకుంటాను..''

ఆనంద స్వరూప్ ఫోన్ పెట్టేయగానే.. శారదమ్మలో ఏదో తెలియని ఉద్వేగం కలిగింది.. పది నిమషాల్లో గదిలోనుండి బయటికి వచ్చింది..

ఆలయం వైపు అడుగులు వేసింది.. గదిలోనుండి కిందికి వస్తూంటే కాషాయం వస్త్రాలు ధరించిన ఆలయ పూజారి శారదమ్మని అదోలా చూడడం మొదలు పెట్టారు.. సంప్రదాయ దుస్తులతో ఉన్న ఆడవాళ్ళు సైతం శారదమ్మని అదోలా చూస్తున్నారు.

వారి కట్టూ బొట్టూ చూస్తూంటే ఆళ్వారు తాలుకు వంశస్థులని అర్థమవుతోంది.. తమిళ వైష్ణవ సంప్రదాయాలు వారి వస్త్రధారణలో ప్రతిబింబిస్తున్నాయి.. రామానుజాచార్యుల వారు ఆ కోవకి చెందిన వారు కావడంతో వారి కుటుంబీకులు, వారి శిష్య బృందం కూడా అక్కడి నుండి వచ్చినవారే అని ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు కదా..

అయితే.. శారదమ్మని వారు చులకనగా చూస్తున్నట్టు వారి హావ భావాలలో ప్రతిఫలిస్తుంది.. ఇండియా నుండి ఒక ఆధ్యాత్మికురాలిని తీసుకువస్తున్నారంటే.. ఆమె కూడా తమకు లాగానే వైష్ణవ సంప్రదాయాలని ఆచరిస్తుందని, తమ లాగానే వస్త్రధారణ ఉంటుందని ఊహించారు..

కానీ అందుకు విరుద్దంగా శారదమ్మ సాదా సీదా కాటన్ చీరలో కనిపించగానే వారి ఊహలన్నీ తారుమారయ్యాయి..

ఎంతో మామూలుగా కనిపిస్తున్న శారదమ్మ ఒక ఆధ్యాత్మికవేత్త అని చెబుతూంటే వారు జీర్ణం చేసుకోలేక పోతున్నారు.. సాధారణ మనిషిలాగా కనిపిస్తున్న ఆమెకి తమకన్నా ఎక్కువ ఆ భగవంతుడి గురించి ఏం తెలుసు అన్న ప్రశ్న అక్కడి ప్రతీ ఒక్కరిలో కనిపిస్తుంది..

అందుకే శారదమ్మ పలకరించడానికి ప్రయత్నించినా కూడా తల తిప్పుకుని వెళ్ళిపోతున్నారు.. తాను పలకరించినా పట్టించుకోకపోవడంతో శారదమ్మ మనసులో ఎక్కడో కాస్త బాధ కలిగినప్పటికీ.. వెంటనే దాని గురించి ఆలోచించకుండా ముందుకు కదల సాగింది..

ఈ విషయాన్ని శారదమ్మకి కేటాయించిన పనివాళ్ళు సైతం గమనించినప్పటికీ వారు కూడా ఏమీ అనలేకపోయారు.. మందిరం ఆవరణలోకి రాగానే శారదమ్మ మనసు భగవంతుడి పై లీనమయిపోయింది..

ఆహ్లాదకరమైన వాతావరణం, ఆలయం లోపలి నుండి వినిపిస్తున్న గుడి గంట చప్పుడు వింటూంటే శారదమ్మ మనసు ఆనందంతో నిండిపోయింది.

రెండు చేతులతో గాలి గోపురానికి నమస్కరిస్తూ మందిరం లోనికి నడిచింది శారదమ్మ.. శారదమ్మని చూడగానే ఆ మందిరంలో పనిచేసే వ్యక్తి సాదరంగా లోనికి ఆహ్వానించాడు. ఆనంద స్వరూప్ శారదమ్మ గురించి అతనికి ముందే తెలియజేయడంతో మందిరంలో శారదమ్మకి కావలసిన అవసరాలని అతనే దగ్గరుండి చూస్తూంటాడు.

శారదమ్మతో అన్ని ఆలయాలోని దేవుళ్ళని దగ్గరుండి దర్శింపజేసాడు. ఆ తర్వాత ఇద్దరూ ఆలయం ప్రక్కనే ఉన్న కమిటీ హాలులోకి నడిచారు.

హాలులోకి వెళ్ళగానే శారదమ్మ కూర్చోవడానికి ఒక ఆసనం, దాని ముందు ఒక మైకుని ఏర్పాటు చేసాడు ఆ పని వాడు.. ఆ తర్వాత వేదిక ముందు ఉన్న కుర్చీలని వరుస క్రమంలో పేర్చాడు. అతను ఆ పని చేస్తూంటే శారదమ్మ ఆ హాలుని చూట్టూరా పరికించి చూడడం ప్రారంభించింది..

దాని కట్టడానికి శారదమ్మ ఎంతో ఆశ్చర్యపోయింది.. వాస్తు శాస్త్ర ప్రకారం ఎక్కడా ఏలోటు కలగకుండా కట్టారు ఆ హాలుని.. అందుకే ఉదయం మొదలు సాయంత్రం వరకు ఒకే రకంగా వెలుతురు ప్రసరించేలా కిటికీలని అమర్చారు..

స్కూలు పిల్లలు రావడానికి ఇంకా పదినిమిషాల సమయం ఉండడంతో వేదిక ముందున్న ఒక కుర్చీలో కూర్చుంది శారదమ్మ.. పనివాడు మంచినీళ్ళని తీసుకు వచ్చి ఇచ్చాడు. ఆ నీళ్ళని తీసుకుని త్రాగింది శారదమ్మ..

సరిగ్గా పదినిమిషాల తర్వాత ఆ హాలు స్కూలు పిల్లలు చేసే అల్లరితో దద్దరిల్లిపోయింది.. వారందరూ శారదమ్మ చుట్టూ చేరి ఆనందంగా కేరింతలు కొడుతూంటే శారదమ్మలో ఎక్కడా లేని ఉత్సాహం వచ్చింది..

శారదమ్మతో కరచాలనం చేయడానికి పిల్లలందరూ పోటీ పడటంతో వారి మధ్యలో శారదమ్మకి ఊపిరి తీసుకోవడం కష్టంగా అనిపించింది.. అయినప్పటికీ అందరికీ షేక్ హ్యాండ్ ఇస్తూ అందరినీ సంతోషపరిచింది.. పిల్లల మధ్యలో ఉన్న శారదమ్మని సాయిరాం తన వెంట తెచ్చిన కెమెరాలో బంధించడం ప్రారంభించాడు..

తన వయసును సైతం మరిచిపోయి శారదమ్మ వారితో మమేకం కావడం ఆయనకి ఎంతో ఆనందాన్ని కలిగించింది.

అయిదు నిమిషాల తర్వాత సాయిరాం పిల్లలందరిని వారిస్తూ అందరినీ వరుసగా పేర్చిన కుర్చీలలో కూర్చోవాలి అని చెబుతూ దగ్గరుండి కూర్చోబెట్టాడు.

వేదికపై ఏర్పాటు చేసిన ఆసనం దగ్గరికి చేరుకుని అందులో ఆసీనురాలయ్యింది శారదమ్మ. ఆమె ముందున్న మైక్‌ని తన దగ్గరికి జరుపుకుంది..

చంచలమైన మనస్సును ఏకతాటివైపుకి తీసుకురావడానికి చేసే ప్రయత్నంగా కళ్ళుమూసుకుంది.. రెండు నిమిషాలలోనే ఆమె మనస్సు ఆమె స్వాధీనంలోకి వచ్చేసింది.. పూర్తి ఏకాగ్రత స్వంతం కాగానే కళ్ళముందు సాయినాధుడు సాక్షాత్కరించాడు.

ఆ రమణీయమైన దృశ్యాన్ని ఆస్వాదించిన శారదమ్మ మనసులో ఎంతో ఆనందం పొంగిపొరలింది. తాను చేయబోతున్న మొట్టమొదటి దివ్య ప్రసంగానికి ఆ సాయినాధుడి

ఆశీస్సులని అందుకుంది. ఆ దర్శనం ఆమె భ్రాంతియో లేక నిజమో తెలియదు కానీ, ఆమె పొందిన ఆ ఆనందం మాత్రం వర్ణనాతీతం..

రెండు నిమిషాల అనంతరం మెల్లిగా కళ్ళు తెరిచింది..

ఎదురుగా కనిపించిన దృశ్యానికి ఒకింత ఆశ్చర్యపోయింది శారదమ్మ..

అప్పటి వరకూ ఆ హాలు పిల్లల అల్లరితో హోరెత్తిపోగా.. ఇప్పుడు మాత్రం పిల్లలందరూ సైలెంటుగా ఉండిపోయారు.. వారందరి చూపు తనవైపే ఉండడంతో శారదమ్మకి ఏమీ అర్థం కాలేదు..

పిల్లల అల్లరి ఆగిపోవడంతో ఆ హాలులో ఒక్కసారిగా నిశ్శబ్దం తాండవం చేసింది.. ఆ పరిణామానికి సాయిరాం కూడా అవాక్కయిపోయాడు.

అయితేపిల్లల మౌనానికి వెనుక అర్థం ఏమిటన్నది శారదమ్మకి మెల్లిగా బోధపడింది..

తాను కళ్ళు మూసుకుని ధ్యానంలోకి వెళ్ళిపోవడమే పిల్లల మౌనానికి కారణమని అర్థమయింది. బహుశ ఆ పిల్లలు ఇలాంటి దృశ్యాన్ని ఎప్పుడూ చూసి ఉండరు.. అందుకే తాను అలా కళ్ళు మూసుకునే సరికి ఆశ్చర్యపోయి అలాగే చూస్తుండిపోయారు..

అలా అర్థం కాగానే ఆమె చిన్నగా నవ్వుకుంది.. వాతావరణాన్ని తేలిక చేయడానికన్నట్టు..

''ఆ.. పాప, బాబూ.. మీరు నేర్చుకున్న కథలు గానీ, పాటలు గానీ, పద్యాలు గానీ ఏవైనా సరే.. చెప్పండి.. నేను వింటాను..'' అంది శారదమ్మ..

ఆ మాటకి ప్లిలలలో ఒక్కసారిగా ఉత్సాహం తన్నుకొచ్చింది..

''నేను చెబుతాను.. నేను చెబుతాను..'' అంటూ అందరూ ఒక్కసారిగా అరవడంతో మళ్ళీ హాలు వారి అల్లరితో దద్దరిల్లిపోయింది..

ఆ పిల్లల మధ్యలో సాయిరాం కలుగజేసుకోలేక తప్పలేదు..

''నో.. నో.. వన్ బై వన్.. ప్లీజ్ కీప్ సైలెంట్..'' ఇంగ్లీషులో అంటూ ఆ పిల్లల అరుపులుకి బ్రేకు వేసే ప్రయత్నం ప్రారంభించాడు.. అయినప్పటికీ పిల్లలు ఊరుకోకపోవడంతో సారధమ్మే కలుగజేసుకుంది..

''మీరందరూ ఇలా అరిస్తే నాకేమి అర్థమవుతుంది.. అందుకే ఒకరి తరువాత ఒకరు చెప్పండి.. మీరందరూ చెప్పేటంత వరకూ నేనెక్కడికీ వెళ్ళను సరేనా..?'' నవ్వుతూ అంది శారదమ్మ..

ఆ మాటలకి పిల్లలందరూ 'ఓ..'' అంటూ తలాడించి బుద్ధిగా తమ సీట్లలో కూర్చుండిపోయారు..

''ముందుగా బాబు.. నువ్వు చెప్పు.. అంటూ ముందు వరుసలో కూర్చున్న ఒక అబ్బాయిని వేలితో చూపుతూ అంది.. ఆ అబ్బాయి ఉత్సాహంగా లేచి నిలబడ్డాడు..

''ఆ.. మేడం.. నా రియల్ ఇన్సిడెంట్ చెబుతాను..'' అన్నాడు..

''ఓ.. యదార్థ సంఘటనా.. సరె.. సరే.. చెప్పు..'' ఆసక్తిగా అంది శారదమ్మ..

''ఒకరోజు అనుకోకుండా మా స్కూల్‌లో ఆలస్యం కావడంతో స్కూల్ బస్ మిస్ అయిపోయింది.. నా ఫ్రెండ్స్ అందరూ బస్‌లో వెళ్ళిపోయారు.. నేనొక్కడినే ఉండిపోయాను.. చేసేది లేక.. ఇంటికెళ్ళడానికి నడక ప్రారంభించాను.. మా ఇంటికి వెళ్ళే దారి చాలా నిర్మానుష్యంగా ఉంటుంది.. అడపా దడపా రోడ్డుపై కార్లు వెళుతున్నాయి.. కానీ మనుషులెవ్వరూ కనిపించడం లేదు.. నాకు చాలా భయమేసింది.. భయంతోనే గబగబా నడుస్తూండగా.. రోడ్డుప్రక్కనే ఉన్న ఒక చెట్టు పొదలో నుండి ఓ వ్యక్తి నావైపు దూసుకు వచ్చాడు.. అతడు లోకల్ అమెరికన్.. వాడి శరీరం తెల్లగా తళతలా మెరుస్తూంది.. వాడు నావైపు పిస్టల్ చూపి బెదిరించాడు. అప్పుడు గుర్తుకువచ్చింది నాకు.. అమెరికాలో చిన్న పిల్లలని అటకాయించి అందినకాడికి దోచుకునేవారుంటారని మా నాన్న గారు అప్పుడప్పుడు అంటూండేవారు .. ఇప్పుడు నేను అలాంటి వాడి చేతిలో ఇరుక్కుపోయానని అర్థమయింది.. అమెరికాలో ఉన్న పేదవాళ్ళు రిచ్ ఫ్యామిలీపిల్లలు కనిపిస్తే 'మగ్గింగ్' చేస్తారంటే వినడం తప్ప నేను కళ్ళారా చూడలేదు.. కానీ.. ఇప్పుడు నేనే వాడికి బలయిపోయేలా ఉన్నాను.. వాడు పెద్ద పెద్ద కనుగుడ్లతో తెల్లగా మెరుస్తూ తెల్ల దెయ్యం మాదిరి కనిపిస్తున్నాడు.. నా దగ్గరున్నవన్నీ లాక్కుంటున్నాడు.. నా మెడలో ఉన్న బంగారు గొలుసుని లాక్కున్నాడు.. నా స్కూల్ బ్యాగ్‌ని వెతకడం మొదలు పెట్టాడు.. నన్ను అరిస్తే చంపేస్తానని బెదిరించాడు.. నాకు విపరీతమైన భయంవేసింది.. ఒళ్లంతా చెమటలు పట్టేసాయి.. గజ గజా వణకడం ప్రారంభించాను..'' అంటూ ఆపేసాడు ఆ అబ్బాయి..

శారదమ్మతో పాటు అక్కడున్న మిగతా పిల్లలు , సాయిరాం కూడా ఆ అబ్బాయివైపే కన్నార్పకుండా చూస్తున్నారు.. ఆ అబ్బాయికి జరిగిన సంఘటన తాలుకు దృశ్యం కళ్లముందు మెదిలిందేమో.. గజగజా వణికిపోతున్నాడు..

''ఆ తర్వాతేం జరిగింది..'' ఆతృత అణుచుకోక అడిగేసాడు సాయిరాం..

ఆ అబ్బాయి సాయిరాం వంక చూసి, మళ్ళీ చెప్పడం ప్రారంభించాడు..

''ఆ క్షణంలో నాకు ఏం చేయాలో అర్థం కాలేదు.. చుట్టూ చూసాను.. దూరంగా కొందరు బేస్‌బాల్ ఆడుతున్నారు.. నేను గట్టిగా అరిచినా కూడా వారికి వినిపించనంత దూరం ఉన్నారు.. ఒక వేళ ఏదో ఆశతో నేను అరవడానికి నోరు తెరిచిన మరుక్షణం అతని చేతిలో ఉన్న గన్ పేలుతుందని అర్థం కావడంతో అలాగే ఉండిపోయాను.. వాడు నా జేబుని వెతుకుతున్నాడు.. ఇంకా ఏమైనా దొరుకుతాయేమోనని.. సరిగ్గా అప్పుడు నాకు వేంకటేశ్వర స్వామి గుర్తుకు వచ్చాడు. ప్రతీ వారం ఈ టెంపుల్‌కి వస్తాము కదా..! మా నాన్న గారు ఎప్పుడూ చెబుతుంటారు .. 'మీకు ఎప్పుడైనా ఏదైనా ఆపద సంభవిస్తే ఆ భగవంతుడిని స్మరించుకోవాలి.. సహాయం చేయడానికి మనుషులెవరూ లేకపోతే.. ఆ భగవంతుడే స్వయంగా రక్షిస్తాడు..' అని ఆ మాట గుర్తుకు రావడంతో గట్టిగా కళ్ళు మూసుకుని దేవుడిని రక్షించమని వేడుకున్నాను.. అంతే.. కళ్ళు తెరిచి చూద్దును కదా.. ఆ అమెరికా వాడు నేలపై పడిపోయి కనిపించాడు.. నాకేం జరిగిందో అర్థం కాలేదు.. కానీ.. ఆ గాడ్ నా ప్రేయర్ మన్నించి నన్ను రక్షించాడని మాత్రం అర్థమయింది..'' ఆ బాలుడు చెప్పడం ఆపేసి కళ్ళు మూసుకుని భగవంతుడికి నమస్కరించాడు..

సాయిరాం నొసలు ముడిపడింది... శారదమ్మ ముఖం లో కూడా ఆతృత కొట్టొచ్చినట్టు కనిపిస్తుంది.. పిల్లలు కూడా ఆ బాలుడి వంకే ఆసక్తిగా చూస్తున్నారు .. అక్కడున్న వారందరి మదిలోనూ ఒకటే ప్రశ్న.. ఇంతకీ ఆ అమెరికన్ వాడు ఎలా కిందపడిపోయాడు.. అన్నదే ఆ ప్రశ్న..

అదే ప్రశ్నని ఆ బాలుడినే అడిగారు..

ఆ బాలుడు రెండు క్షణాలు అందరివంకా చూసి మెల్లిగా చెప్పడం ప్రారంభించాడు..

‘‘నేను కళ్ళు మూసుకుని దేవుడిని ప్రార్థిస్తున్నాను.. ఆ లోకల్ అమెరికా వాడు నా ఒళ్లంతా తడుముతున్నాడు.. సడన్‌గా వాడు తడమడం ఆపేసాడు.. కళ్ళు తెరిచి చూద్దునుకదా.. వాడు కిందపడిపోయి కనిపించాడు.. ఏమి జరిగిందా అని నేను ఆశ్చర్యపోయాను.. వాడి ప్రక్కనే బేస్ బాల్ కనిపించింది.. ఆ బాల్ వాడి తలకి బలం గా తాకడంతో అలా పడిపోయాడని నాకు అర్థమయింది... ఆ బాల్ ఎక్కడినుండి వచ్చిందా అని ఆశ్చర్యపోయాను.. అప్పుడు అర్థమయింది.. మాకు దూరంగా బేస్‌బాల్ ఆడుతున్నారు కదా.. ఆ గ్యాంగ్‌లోని ఒకడు బాల్‌ని గట్టిగా కొట్టడంతో అది రయ్యుమని వచ్చి ఆ లోకల్ అమెరికా వాడికి తగిలిందని.. ఇక ఆ దొంగ తేరుకోకముందే నేను గట్టిగా ‘దొంగ.. దొంగ..’ అని అరిచాను.. నేను భయంగా అరుస్తున్నది గమనించి బేస్‌బాల్ ఆడుతున్న వారు పరుగెత్తుకుని వచ్చారు.. ఆ లోకల్ అమెరికా వాడు నా దగ్గర దొంగతనం చేసాడని అర్థం కాగానే వాడిని పట్టుకుని పోలీసులకి అప్పగించారు.. ఆ తర్వాత నన్ను వారి కార్లో మా ఇంటికి తీసుకువచ్చారు..’’ ఆ పిల్లాడి మాట పూర్తికాగానే అందరూ ఆనందంతో చప్పట్లు కొట్టారు..

‘‘ఆ సంఘటన తర్వాత దేవుడిపై నాకు పూర్తి నమ్మకం వచ్చింది.. దేవుడిని భక్తితో పిలిస్తే తప్పకుండా మన మాటలు వింటాడని అర్థమయింది.. అప్పటి నుండి ప్రతిరోజూ ఉదయం స్నానం చేసాక దేవుడిని పూజించిన తరువాతనే బ్రేక్‌ఫాస్ట్ తింటాను..’’ ఆ బాలుడి మాటలకు అందరూ సంతోషించారు..

శారదమ్మ కళ్ళల్లో కన్నీళ్ళు నిండాయి.. చూడడానికి పదేళ్ళు కూడా నిండని ఆ బాలుడిపై ఆ దేవుడు కురిపించిన ప్రేమ మామూలుది కాదు.. దేవుడు ఉన్నాడని ఋజువు చేసే సంఘటన అది..

‘‘చాలా మంచి విషయాన్ని చెప్పావు నాన్నా.. ఆపదలో ఉన్నప్పుడు దేవుడిని స్మరించుకుంటే తప్పకుండా ఆ దేవుడు మనల్ని రక్షిస్తాడు.. నువ్వు చెప్పిన ఈ విషయం ఇక్కడున్న ప్రతీ ఒక్కరికీ దేవుడిపై భక్తిని పెంచింది..’’ మనస్ఫూర్తిగా అంది శారదమ్మ..పిల్లలందరూ చప్పట్లు కొట్టారు..

‘‘అమ్మా.. మీరు కూడా ఇలాంటి విషయాలే చెబుతారని మా నాన్నగారు చెప్పారు.. మీరు కూడా చెప్పండి..’’ ఉత్సాహంగా అన్నాడు ఒక బాలుడు..

ఆ మాటకి శారదమ్మ చిన్నగా నవ్వింది..

వారంతా పది నుండి పదిహేను సంవత్సరాల వయసులో ఉన్నారు.. ఈ వయసులోనే వారికి దేవుడిపై ఉన్న భక్తి విశ్వాసాలని చూస్తూంటే శారదమ్మకి ఎంతో ముచ్చటేసింది.. విదేశాల్లో ఉన్నప్పటికీ మన దేవుళ్ళని ఆరాధించడం, దేవుడి మహిమని ఆస్వాదించడం అన్నది మామూలు విషయం కాదు.. ఆ అబ్బాయి నిజజీవితంలో జరిగిన సంఘటన.. అతను పెద్దయ్యాక హిందూ మత విశ్వాసాన్ని మరింత ప్రచారం చేసేందుకు ఖచ్చితంగా దోహదపడుతుందని అనిపించింది శారదమ్మకి.

''చెప్పండి అమ్మా..'' అంటూ పిల్లలు మళ్లీ అడిగే సరికి ఉలిక్కిపడి ఆలోచనలోనుండి తేరుకుంది శారదమ్మ.. ఒకసారి అందరివంకా చూసి గొంతు సవరించుకుంది..

''పసి పిల్లలు దేవుడితో సమానం అంటారు.. మీ అందరిలోనూ నాకు దేవుడు కనిపిస్తున్నాడు.. ఈ వయసులోనే మీకు దేవుడిపట్ల ఉన్న భక్తిని చూస్తూంటే నాకెంతగానో ముచ్చటేస్తుంది.. మొక్కగా ఉన్నప్పుడే చెట్టుని వంకర పోకుండా సరిచేస్తే పెద్దయ్యాక నిటారుగా పెరుగుతుంది.. అలాగే మీరు కూడా ఈ వయసులో ఆధ్యాత్మిక విషయాలపై మక్కువ పెంచుకుంటే పెద్దయ్యాక మీరందరూ అబద్దాలు ఆడకుండా ధర్మబద్దమైన జీవితాన్ని గడిపే అవకాశం ఏర్పడుతుంది.. అంతేకాదు.. ఇందాక ఆ బాబుకి దేవుడు బంతి రూపంలో వచ్చి ఆపదనుండి కాపాడాడు.. అలాగే మీ జీవితంలో కూడా ఎప్పుడైనా ఏదైనా ఆపద వస్తే ఏదో ఒక రూపంలో ఆ భగవంతుడు ఖచ్చితంగా రక్షిస్తాడు..'' ఎంతో భక్తిప్రపత్తులతో అంది శారదమ్మ.. ఆ తర్వాత పిల్లలందరిని ఒకసారి పరికించి..

''ఊ.. మీలో ఎవరికైనా దేవుడికి సంబంధించిన సందేహాలు ఉంటే అడగండి.. నేను సమాధానం చెబుతాను..'' అంది నవ్వుతూ..

శారదమ్మ మాటలకి ఒక పిల్లవాడు లేచి నిలబడ్డాడు.. శారదమ్మ ఆ అబ్బాయి వంక చూసింది అడగమన్నట్టుగా..

''నాకొక డౌటుంది..'' అన్నాడు ఆ అబ్బాయి..

''అడుగు బాబు..'' అంది ఆప్యాయంగా శారదమ్మ..

''మా మమ్మీ డాడీ ప్రతీ శనివారం ఉపవాసం ఉంటారు.. ఆ రోజు ఉదయమే లేచి తలారా స్నానం చేసి దేవుడికి పూజ చేస్తారు.. వాళ్ళుచేస్తే ఫర్వాలేదు.. నన్ను కూడా నిద్రలేపుతారు..

నాకసలు పూజ అంటేనే ఇష్టం ఉండదు.. కానీ.. మమ్మీ డాడీలు ఫీల్ అవుతారని ఇష్టం లేకపోయినా వారితోపాటు పూజలో పాల్గొంటాను.. అసలు.. దేవుడికి ఇలా పూజ చేయడం అవసరమా...? మా ఫ్రెండ్ క్రిష్టియన్.. వాడింట్లో ఇలా పూజ, గట్రా ఏమీ ఉండవు.. ఉదయాన్నే లేచి ప్రెయర్ చేస్తారు.. అంతే.. ఫైవ్ మినిట్స్‌లో వారు భగవంతుడికి చేసే పూజ అయిపోతుంది.. కానీ మా ఇంట్లో అలా కాదు.. ఉదయం అయిదు గంటలకి మొదలయితే పూజ పూర్తయ్యే సరికి ఏడు, ఎనిమిది అవుతుంది.. పైగా దేవుడిని పూలతో అలంకరించడం, ప్రత్యేకంగా చేసిన వంటకాలతో నైవేద్యాలు చేయడం, దేవుడికి నైవేద్యం చేసేంత వరకూ వాటిని అస్సలు ముట్టుకోనివ్వదు మా మమ్మీ.. అసలు.. ఇలా పూజ చేస్తే గానీ ఆ దేవుడు మనల్ని కరుణించడా..? టెంపుల్స్‌లో ప్రతిరోజూ దేవుడికి పూజలు చేస్తూనే ఉంటారు కదా.. టెంపుల్స్‌లో చేసే పూజలు దేనికి..? ఆ టెంపుల్స్‌కి వెళ్ళే మనందరి మంచి కోసమే కదా.. మరి అలాంటప్పుడు ఇళ్ళల్లో ఇంత టైం వేస్ట్ చేస్తూ పూజలు ఎందుకు చేయాలి..? అలా పూజలు చేయకపోతే ఆ దేవుడు మనతో ఫ్రెండ్‌షిప్ చేయడా..?'' ఆ అబ్బాయి అమాయకంగా వేసిన ఆ ప్రశ్నలో ఎంతో అంతరార్థం దాగుందని శారదమ్మకి అర్థమయింది.. ఈ సందేహం పిల్లలలో కలగడం సహజం.. కానీ.. ఈ సందేహాన్ని నివృత్తి చేయడంలో ఏమాత్రం ఏమరుపాటుగా సమాధానం చెప్పినా పిల్లలలో భగవంతుడిపై ఉన్న నమ్మకాన్ని పోగొడు తుందని శారదమ్మకి తెలుసు.. అందుకే కాసేపు మౌనంగా ఉండిపోయింది.. శారదమ్మ ఏం చెబుతుందా అని పిల్లలందరూ ఆసక్తిగా గమనిస్తున్నారు..

కొద్దిసేపటి తర్వాత ఆ అబ్బాయి వంక నవ్వుతూ చూసింది శారదమ్మ..

''చాలా మంచి ప్రశ్న వేశావు బాబూ.. భగవంతుడికి ఆ భగవంతుడు పూజలు చేయమని మనల్ని ప్రత్యేకంగా ఏమీ అడగడు.. అలాగే పుష్పాలతో అలంకరించమని, ఫలహారాలతో నైవేద్యం పెట్టమని కూడా అడగడు.. కానీ.. ప్రతిరోజూ ఉదయాన్నే ఆ దేవుడిని పూజించడం మన హిందూ సాంప్రదాయం.. ఇలా పూజచేస్తే భగవంతుడి అనుగ్రహమే కాదు.. మనకి సంపూర్ణ ఆరోగ్యం కూడా సిద్దిస్తుంది.. ప్రతిరోజూ ఉదయం అయిదు గంటలకి నిద్రలేస్తే ఆరోగ్యానికి ఎంతో మంచిది.. అలాగే సూరీడు ఉదయించక ముందే శుభ్రంగా స్నానం చేస్తే సూర్యుడు ఉదయించినప్పుడు వెలువడే మొట్టమొదటి కిరణాలు మన శరీరానికి తాకితే మనలో

ఎంతో శక్తి ప్రవేశిస్తుంది.. ఆ శక్తి మనలో ఉన్న రోగనిరోధక శక్తిని రెట్టింపు చేస్తుంది.. దాని వల్ల మన ఒంట్లోకి ఏరకమైన వైరస్‌లు దరిచేరవు.. ఒకవేళ చేరినా సూర్యకాంతి వల్ల మనలోకి ప్రవేశించే ఆ శక్తి వాటిని నిర్మూలిస్తుంది.. పూర్వకాలంలో ఉన్న మన ఋషులు ఈ విషయాన్ని గమనించారు. అయితే ఉదయాన్నే లేవండి మీకు మంచి ఆరోగ్యం వస్తుంది అని చెబితే ఎవరూ పట్టించుకోరు కాబట్టి, ఉదయాన్నే దేవుడికి పూజిస్తే చాలా మంచిది అని అన్నారు. దాంతో మన హిందువులందరూ ఉదయాన్నే దేవుడిని పూజిస్తారు. అలాగే దేవుడికి స్వచ్ఛమైన పూలతో అలంకరించడం ద్వారా ఆ పూల పరిమళం మన ఇల్లంతా చేరి చెడు బ్యాక్టీరియాని నిర్మూలిస్తుంది.. ఇక నైవేద్యం అంటారా.. దేవుడికి పరిశుభ్రంగా వండి ఆ వంటకాన్ని నైవేద్యంగా పెడతాము.. కానీ.. దాన్ని ఆ భగవంతుడు తినడు కదా.. అలా నైవేద్యం పెట్టినది తిరిగి మనమే తింటాము.. దీని అర్థం ఏమిటంటే.. వేడి వేడిగా చేసే వంటకాలు తినడం ద్వారా ఆరోగ్యం బావుంటుంది.. మెదడు చురుకుగా పనిచేస్తూంది.. మనం చేసే దైనందిన కార్యక్రమాలన్నింటినీ విజయవంతంగా పూర్తి చేస్తాము.. ఇక ఉపవాసం అంటారా.. ఇలా ఉపవాసం చేయడం ద్వారా కూడా మన ఆరోగ్యం చాలా బావుంటుంది.. వారం మొత్తం కడుపునిండుగా భోజనం చేస్తాము కదా.. వారంలో ఒకరోజు ఆహారం మానేస్తే.. మనలో ఉండే జీర్ణవ్యవస్థ మరింత బాగా పనిచేస్తూంది.. దీని ద్వారా మనకి అన్నం అరగకపోవడం, ఉబ్బసం లాంటి వ్యాధులు దరి చేరవు.. బాబూ.. నువ్వు వారంలో ఒక్కరోజు మాత్రమే ఉదయం నిద్రలేస్తావు కదా.. అయితే నువ్వు ఇన్నాళ్ళుగా నీలో ఉన్న సందేహంతో ఉదయం నిద్రలేవడం వల్ల ఎన్ని ఉపయోగాలు ఉన్నాయో తెలుసుకోలేకపోయావు.. ఈసారి శనివారం నాడు ఉదయమే నిద్రలేస్తావు కదా.. అప్పుడు వారం రోజులలో లేని ఉత్సాహం నీలో ఉంటుందన్నది గమనిస్తావు..! ప్రార్థించడం భగవంతుడి కోసమైతే.. ఆ భగవంతుడి కోసం చేసే ఈ పూజలన్నీ మన ఆరోగ్యాన్ని పరిరక్షించడం కోసం తప్ప మరొకటి కాదు.. అందుకే ఇండియాలో చాలా మంది వ్యవసాయం చేసుకునే వారందరూ పొద్దున్నే నిద్రలేచి, భగవంతుడిని పూజించి సూర్యుడు ఉదయించకముందే పొలం పనులకి వెళ్ళిపోతారు.. వారు మట్టిలో పనిచేస్తున్నా.. వారి ఆరోగ్యం మాత్రం ఏమాత్రం చెడిపోదు.. పూజలో ఉన్న రహస్యం ఇదే.. భగవంతుడిని ప్రార్థించాలి, మన ఆరోగ్యం కోసం భగవంతుడికి పూజలు చేయాలి..'' శారదమ్మ చెప్పిన

సమాధానానికి ఆ హాలులో ఉన్న పిల్లలందరూ గట్టిగా చప్పట్లు కొట్టారు.. సాయిరాం కూడా చప్పట్లు కొట్టాడు.. ఆయన శారదమ్మ వంకే అబ్బురంగా చూస్తూండిపోయాడు.. ఎంతో మామూలుగా కనిపించే శారదమ్మ మామూలు మనిషి కాదని ఆ క్షణంలో అర్థమయింది సాయిరాంకి..

శారదమ్మ మిగతా పిల్లలు వారిలో ఉన్న సందేహాలను అడుగుతూంటే.. ఓపికగా వారందరికీ సమాధానాలు చెబుతుంది.. పిల్లల సందేహాలు, శారదమ్మ సమాధానాలు వింటూంటే అసలు టైమే తెలియలేదు సాయిరాంకి..

మధ్యాహ్నం పన్నెండు కావడంతో పిల్లల కోసం ప్రత్యేకంగా వంటలు కూడా ఏర్పాటు చేయించారు. పనివాడు వచ్చి భోజనానికి పిలిచాక గానీ సాయిరాంకి టైం తెలీలేదు.. శారదమ్మ పిల్లలతో మమేకమైపోయి,పిల్లలకు అర్థమయ్యే విధంగా వారి సందేహాలను నివృత్తి చేసే విధానం సాయిరాంని ఎంతగానో ఆకట్టుకుంది..

పిల్లలలో ఇన్ని సందేహాలున్నాయా.. అని ఆశ్చర్యం కూడా వేసింది సాయిరాంకి. శారదమ్మ చెప్పే సమాధానాలు పిల్లలని ఎంతగానో ఆకట్టుకున్నాయి.. అంతేకాదు వారిలో భగవంతుడిపై భక్తి, ఆధ్యాత్మిక చింతన రెట్టింపు చేసాయన్నది నిర్వివాదాంశం.

.........................

ఆనంద స్వరూప్ ఆనందానికి అవధులు లేకుండా పోయింది. అమెరికాకి వచ్చి ఇన్ని సంవత్సరాలు గడిచినా కూడా ఇంత ఆనందం ఆయన ఎప్పుడూ పొందలేదు. ఆ ఆనందానికి కారణం శారదమ్మ. శారదమ్మ గుడిలో పిల్లలకి చెప్పిన బోదనలు వారిని ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఆ పిల్లలందరూ తమ ఆనందాన్ని వారి తల్లిదండ్రులతో పంచుకున్నారు. పిల్లలకి కలిగిన ఆనందం, శారదమ్మ చెప్పిన విషయాలను వారు గుర్తుపెట్టుకుని మరీ తమ తమ తల్లిదండ్రులకి చెప్పారంటే శారదమ్మ బోధన ప్రభావం వారిపై ఎంతలా ఉందో అర్థమవుతుంది.

తల్లిదండ్రులు తమ పిల్లల ఆనందాన్ని చూసి సంతోషించారు. అంతేకాదు తమ సంతోషాన్ని ఆనంద స్వరూప్‌తో షేర్ చేసుకున్నారు. వరుసగా పిల్లల తల్లితండ్రుల నుండి ఫోన్‌కాల్స్ రావడమే ఆనంద స్వరూప్ ఆనందానికి కారణం.

శారదమ్మలో ఉన్న శక్తిని ఆనందస్వరూప్ సరిగ్గా అంచనా వేయలేకపోయాడు. అంటే ఆమెని తక్కువ చేసి చూడడం అన్నది కాదు ఇక్కడ.. ఎదుటివారి ఆలోచనని బట్టి ఆమె ప్రసంగాలు ఉంటాయన్నది మొదటిసారి తెలుసుకున్నాడు.

ఆధ్యాత్మిక ప్రసంగాలంటే శాస్త్రాలని, గ్రంధాలని, పురాణాలని బట్టీపట్టి, వాటిని ప్రసంగాల ద్వారా అప్పజెప్పడం కాదు, అప్పటికప్పుడు ప్రవచనాలకి వచ్చే జనాలలో ఉద్భవించే ఆలోచనలకి అనుగుణంగా, వారి అంతరంగాలలో ఉండే సందేహాలను నివృత్తి చేస్తూ చేసే ప్రవచనాలే ఉత్తమ ప్రవచనాలు..

శారదమ్మ అలానే చేస్తూంది. ఆమె గ్రంధాలు, పురాణాలు అభ్యసించిందా లేదా అన్న విషయం అప్రస్తుతం, కానీ జనాల మనసులో కలిగే సందేహాలని నివృత్తి చేసే పరిజ్ఞానం ఉందా లేదా అన్నదే ప్రధానం..

ఆనంద స్వరూప్ వెంటనే శారదమ్మని కలుసుకోవాలనుకున్నాడు. అనుకున్నదే ఆలస్యం వెంటనే రెడీ అయిపోయి కారులో బయలుదేరిపోయాడు.

కారుని శారదమ్మ బస చేసిన భవంతి ముందు ఆపాడు. పోర్టికోలో కారు పార్కింగ్ చేసి లోపలికి వెళుతూండగా రామానుజాచార్యులు ఎదురుపడ్డారు.

ఆయనకి వినయంగా నమస్కరించాడు ఆనంద స్వరూప్..

చిరు దరహాసం చేస్తూ ముందుకు అడుగు వేయబోయిన రామానుజాచార్యులతో మాటలు కలిపాడు ఆనంద స్వరూప్.

‘‘నమస్కారం గురువుగారూ..’’

ఆనంద స్వరూప్ మాటలకి ఆగిపోయి వెనక్కి తిరిగి చూసాడు రామానుజాచార్యులు.. అతని ముఖం లో ఎలాంటి భావమూ లేదు.

‘‘మీకు తెలిసే ఉంటుంది.. ఇండియాలో నేను ఆలయ చైర్మన్‌గా ఉన్న సాయిబాబా ఆలయంలో ఉన్న ఒక ఆధ్యాత్మికురాలిని ఇక్కడికి తీసుకువచ్చాను. ఆమె చేసే ప్రసంగాలు ఎంతో అద్భుతంగా ఉంటాయి. సాయిబాబా టెంపుల్ వార్షికోత్సవం సందర్భంగా ఆమె చేసిన ప్రసంగాలు ఎంతో అద్భుతంగా ఉన్నాయి. ఆమె ప్రసంగాల కి భక్తులందరూ పరవశులయిపోయారు. ఆధ్యాత్మిక విషయాలతో పాటు, జీవితంలో అనుసరించాల్సిన మంచి

విషయాలని ఎంతో వివరంగా చెబుతుంది. ఆమె ప్రసంగాలు నన్ను కూడా ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఆమె సేవలు ఇండియాలోనే కాదు ఇక్కడి వారికి కూడా అవసరం ఉంటుందని ఆమెని తీసుకువచ్చాను. సమయాభావం వల్ల మీకు ఆమెని పరిచయం చేయలేదు..'' ఆనంద స్వరూప్ శారదమ్మ గురించి గర్వంగా చెప్పాడు.

ఆయన మాటలకి రామానుజాచార్యులు కొద్దిసేపు మౌనం వహించాడు. అతని ముఖం లో ఎలాంటి భావమూ లేదు. కాసేపటికి తలని నెమ్మదిగా ఆడిస్తూ..

''అలాగా.. మంచిది..'' క్లుప్తంగా అనేసి అక్కడినుండి వెళ్ళిపోయాడు.

ఆనంద స్వరూప్ ఎంతో ఆశ్చర్యపోయాడు. కనీసం మాట కూడా మాట్లాడకుండా అలా ముభావంగా వెళ్ళడం ఆనంద స్వరూప్‌కి అర్థం కాలేదు.

చిన్నగా నిట్టూర్పు విడిచి అక్కడి నుండి శారద బస చేసిన గదివైపుకి అడుగు వేసాడు. తలుపు తట్టగానే తెరుచుకున్నాయి. హాలులో శారదమ్మతో పాటు సాయిరాం కూడా ఉన్నారు. గుమ్మం దగ్గర ఆనంద స్వరూప్‌ని చూడగానే ఇద్దరూ సోఫాలోనుండి లేచి నిలబడి ఆనంద స్వరూప్‌ని సాదరంగా లోనికి ఆహ్వానించారు.

''శారదమ్మ గారూ.. ఈరోజు మీ ద్వారా నాకెంతో ఆనందం కలిగింది.. ఈ విషయాన్ని స్వయంగా మీతో పంచుకుందామని వచ్చాను..'' మనస్ఫూర్తిగా నవ్వుతూ అన్నాడు ఆనంద స్వరూప్.

ఆయన మాటలకి శారదమ్మ ఆశ్చర్యపోయింది.

''నా మూలంగా మీకు ఆనందం కలిగిందా..?'' అంది శారదమ్మ..

''అవును.. మీరు పిల్లలకి చేసిన బోధనలు అందరినీ ఎంతగానో ఆకట్టుకున్నాయి.. పిల్లలు ఎంత సంబరపడిపోయారంటే.. మీరు చెప్పిన విషయాలన్నింటినీ వారి తల్లిదండ్రులతో పంచుకున్నారు. దాంతో వారంతా నాకు ఫోన్ చేసి తమ సంతోషాన్ని వ్యక్తం చేసారు. పిల్లలపై మీ ప్రసంగాలు ఇంతగా ప్రభావం చూపాయంటే ఇంక పెద్దవారి సంగతి చెప్పాల్సిన పనిలేదు..'' ఆనందంగా అన్నాడు ఆనంద స్వరూప్..

''ఆ పిల్లలతో కలిసి ఆ ఆనందాన్ని పంచుకునే అదృష్టం నాక్కూడా కలిగింది.. పిల్లలతో పాటు నేను కూడా ఉన్నాను కదా..'' సంబరంగా అన్నాడు సాయిరాం..

వారిద్దరి మాటలకి శారదమ్మ చిన్నగా నవ్వింది..

''నాకు మీలో నచ్చినది ఇదే.. మిమ్మల్ని ఎంతలా పొగిడినా.. దానికి రియాక్షన్ ఉండదు.. మిమ్మల్ని కాకుండా మీ పక్కవారినెవరినో పొగుడుతున్నారేమో అన్నట్టుగా ఉంటాయి మీ ముఖ కవళికలు.. ఈ రోజుల్లో పొగడ్తలకి లొంగని వారు ఎవరుంటారు..? మీరు తప్ప..'' ఆనంద స్వరూప్ ఆమెనే చూస్తూ అన్నాడు..

''అంతా మీ అభిమానం.. నన్ను పొగిడినా, తిట్టినా అంతా ఆ దేవుడి దయ మాత్రమే.. ఎక్కడో ఓ చిన్న గ్రామంలో పుట్టిన దానిని ఇప్పుడు ఇలా ఇంతదూరం ప్రయాణం చేసి వచ్చాను.. అసలు కలలో కూడా ఈ ప్రయాణాన్ని నేను ఊహించలేదు. నా కర్తవ్యాన్ని నిర్వహించడానికే ఆ భగవంతుడు నన్ను ఇంత దూరం పంపించాడని నమ్మేదానిని, అందుకే మీరు నన్ను పొగిడినా పొంగిపోను.. ఎందుకంటే ఆ పొగడ్తలు నాకు చెందినవి కావు, నేను ఆరాధించే ఆ సాయినాధుడికే చెందుతాయి.. నేను కేవలం నిమిత్త మాత్రురాలిని మాత్రమే..''

ఆనంద స్వరూప్, సాయిరాం ఇద్దరూ నోటమాట రాకుండా శారదమ్మ వైపు చూస్తూండిపోయారు. కొద్దిగా మంచిపని చేస్తే చాలు, దానికి ఎంతో పబ్లిసిటీని కోరుకునే వారు సమాజంలో ఎంతో మంది ఉంటారు. కానీ ఎంత గొప్ప పని చేసినా ఇంత నిరాడంబరంగా ఉండగలగడం, ఆ గొప్ప పనికి సంబంధించిన అభినందనలన్నీ భగవంతుడికి అర్పితం చేయడమన్నది మామూలు మనుష్యలు చేసే పని కాదు.. ఖచ్చితంగా శారదమ్మ మామూలు మనిషి కాదు.. ఆమెలో ఏదో శక్తి ఉంది.. ఆ శక్తి మానవ కళ్యాణానికి ఉపయోగపడుతుంది..

ఆనంద స్వరూప్ ఆలోచనలు అలా సాగిపోతున్నాయి..

కొద్ది సేపటి తర్వాత... ఆనంద స్వరూప్ తేరుకున్నాడు.. సాయిరాం, ఆనంద స్వరూప్ ఇద్దరూ ఒకరి మొహాలొకరు చూసుకున్నారు..

తర్వాత గొంతు సవరించుకుంటూ అన్నాడు ఆనంద స్వరూప్...

''మీతో మాట్లాడితే గొప్ప అనుభూతిని అనుభవిస్తాను.. మీ మాటల లోతుని తెలుసుకోవడం మాలాంటి మామూలు మనుష్యులకు సాధ్యపడదు..'' నవ్వుతూ అన్నాడు. ఆనంద స్వరూప్ మాటలలో నిజాయితీ కనిపించింది..

ఆ మాటలకి చిన్నగా నవ్వేసి ఊరుకుంది..

పనివాళ్లు ముగ్గురికీ టీ తీసుకువచ్చారు..

ఆనంద స్వరూప్ టీ కప్‌ని అందుకుంటూ..

''శారదమ్మ గారూ.. మీరు ఇక్కడ కంఫర్టబుల్‌గా ఉన్నారనే అనుకుంటున్నాను.. ఈ వాతావరణం మీకు కాస్త అలవాటు అయిన తర్వాతే ప్రవచనాల తాలూకు షెడ్యూల్ చేయాలనుకున్నాను.. ఇప్పుడు మీరు ప్రవచనాలకి సిద్ధంగా ఉన్నారని నాకు అర్థమయింది.. ఇదిగోండి.. ఇదే షెడ్యూల్.. అమెరికాలోని పలు రాష్ట్రాలలో ఉన్న తెలుగు వారు ఎంతో ఆతృతగా ఎదురు చూస్తున్నారు.. వారి వారి ప్రాంతాలలో మీ ప్రసంగాలు సభలు నిర్వహించాలంటూ ఎంతో మంది రిక్వెస్ట్ చేస్తున్నారు.. వారందరి రిక్వెస్టు మన్నించి నేను కొన్ని ఏరియాల్లో మీ సభలని నిర్వహించడానికి ప్లాన్ చేసాను.. ఇదే ఆ లిస్ట్..'' ఒక పేపరును శారదమ్మకి అందించబోయాడు ఆనంద స్వరూప్..

''ఈ వివరాలన్నీ నాకెందుకండీ.. మీరు ఎక్కడికి తీసికెళ్తే అక్కిడికి వస్తాను.. ఈ విషయాలన్నింటినీ మీరే చూసుకోండి..'' నవ్వుతూ అంది శారదమ్మ..

ఆమె మాటలకి ఆనంద స్వరూప్ కూడా నవ్వాడు.. అతను సాయిరాం వంక తిరిగాడు..

''సాయిరాం.. ఇదిగో ఇదే లిస్ట్.. ప్రతీ శని ఆదివారాల్లో ప్రవచనాలు ఉండే విధంగా షెడ్యూల్‌ని ఫిక్స్ చేసాను.. మొత్తం ఎనిమిది ప్రదేశాల్లో శారదమ్మ పర్యటించాల్సి ఉంటుంది.. అవి.. అట్లాంటా, చికాగో, డల్లాస్, బే ఏరియా, లాస్ ఏంజిల్స్, డెట్రాయిట్, న్యూయార్క్, వాషింగ్‌టన్.. ఈ ఏరియాలలో ఏర్పాటు చేసిన సభల కి సంబంధించిన వివరాలన్నీ ఇందులో ఉన్నాయి. ఆయా తేదీల్లో శారదమ్మ ఉండడానికి కావలసిన ఏర్పాట్లు, ఆమె ఆహార విషయాలన్నీ మీరే దగ్గరుండి చూసుకోవాలి..'' సాయిరాంకి ఆర్డర్ పాస్ చేసాడు ఆనంద స్వరూప్..

ఆనంద స్వరూప్ మాటలకి ఎంతో ఆనందపడిపోయాడు సాయిరాం..

''అమెరికాలో అందరికంటే అదృష్టవంతుడు ఎవరైనా ఉన్నారంటే అది నేనే..'' సంబరంగా అన్నాడు సాయిరాం..

అతని మాటలు ఆనంద స్వరూప్‌కి గానీ, శారదమ్మకి గానీ అర్థం కాలేదు..

''ఎందుకు అలా అంటున్నారు..?'' ఆశ్చర్యంగా అన్నాడు ఆనంద స్వరూప్.

‘‘నాకంటే అదృష్టవంతుడు ఇంకెవరుంటారు చెప్పండి.. శారదమ్మ గారు ఇండియా నుండి రావడం మొదలు ఆమెకు సపర్యలు చేసే భాగ్యం నాకే కదా దక్కింది..’’ ఆనందంగా అన్నాడు.. ఆ మాటలకి ఇద్దరూ చిన్నగా నవ్వారు..

టీ త్రాగాక, షెడ్యూల్ వివరాలు ఉన్న పేపర్‌ని సాయిరాంకి అందించి అక్కడి నుండి సెలవు తీసుకున్నాడు ఆనంద స్వరూప్.

......................

విదేశాలలో ఉండే భారతీయు ల గురించి మాతృదేశంలోని ప్రజలకు ఎన్నో అపోహలు ఉంటాయి. ఇక్కడి నుండి వెళ్ళిన వారు విదేశీ సంస్కృతికి అలవాటు పడి విచ్చలవిడిగా జీవించేస్తారన్నది ప్రధాన అపోహ. అయితే కొంతమంది విదేశీయానం మోజుతో అలాంటి వికృతచేష్టలు చేస్తారేమో కానీ, భారతీయ సంస్కృతి, సంప్రదాయాలను ప్రతింబించేలా జీవించేవారు నూటికి తొంభైతొమ్మిది శాతం వరకు అమెరికాలో ఉంటారంటే అతిశయోక్తి కాదు.

భారతీయులంటే అమెరికాలో ప్రత్యేక గౌరవం ఉంటుంది. భారతీయుల ఆలోచనా విధానం, వారిలో ఉండే ఆత్మవిశ్వాసం అక్కడి వారిని ఆకర్షిస్తుంది. అందుకే అమెరికాలోని ప్రముఖ రంగాలలో భారతీయులు విజయకేతనం ఎగురవేస్తున్నారు.

భారతీయ పండగలకి అమెరికా ప్రెసిడెంట్ ప్రత్యేకంగా వైట్ హౌజ్‌లో సమావేశం ఏర్పాటు చేసి, భారతీయులందరికీ పండుగ శుభాకాంక్షలు తెలపడమే కాదు, భారతీయ ప్రముఖులకు పండుగ సందర్భంగా ప్రత్యేకంగా విందుని కూడా ఏర్పాటు చేస్తారంటే భారతీయులని అమెరికా ప్రభుత్వం ఎంతగా గౌరవిస్తుందో అర్థమవుతుంది.

దేశం ఏదైనా సరే.. తమలోని ప్రత్యేకతతో, వ్యాపారంలోనైనా, ఉద్యోగంలోనైనా విలక్షణంగా వ్యవహరించడం భారతీయుల స్వంతం.. అందుకే భారతీయులంటే ఏ దేశం వారికైనా ప్రత్యేక గౌరవం ఉంటుంది. నాలుగు వేదాలు, ఉద్భవించింది ఈ దేశంలోనే కావడం కూడా మరొక కారణం..

శారదమ్మకి ఆలయానికి తరలివస్తున్న భారతీయులు, ముఖ్యంగా తెలుగువారిని చూస్తూంటే ఎంతో ఆనందం కలుగుతుంది.. ఖాళీ సమయంలో తన గదిలోని హాలులో కూర్చుని కిటికీలోనుండి కనిపిస్తున్న ఆలయాన్ని చూస్తూండడం ఆమెకి అలవాటైపోయింది

ఆరోజు శుక్రవారం..

శ్రావణ మాసం కూడా కావడంతో ఆ శుక్రవారానికి ప్రత్యేకత చేకూరింది. దాంతో ఆలయానికి వస్తున్న భారతీయ వనితల సంఖ్య క్రమ క్రమంగా పెరుగుతోంది.. ప్రముఖంగా ఆంధ్ర, తమిళనాడు, కర్నాటక, మహారాష్ట్ర, గుజరాత్, పంజాబ్ రాష్ట్రాల వారు ఆలయానికి వస్తున్నారు. వారి కట్టూ బొట్టూ చూడగానే వారు ఏ రాష్ట్రానికి చెందిన వారో ఇట్టే గుర్తించగల్గుతుంది శారదమ్మ.

భారతీయులలో ఉండే గొప్పతనం అదే.. విదేశాలలో ఉన్నా కూడా తమ మాతృదేశపు కట్టూబొట్టూని మరవకుండా అలాగే అలంకరించుకుని రావడమన్నది చాలా పెద్ద విశేషం. పైగా దేవాలయాలకి వెళ్తున్న సమయంలో ఖచ్చితంగా సంప్రదాయాలని పాటించడం కూడా శారదమ్మని విశేషంగా ఆకట్టుకుంది.

భక్తుల కోలాహలం అధికంగా ఉండడంతో రామానుజాచార్యులు ఉదయం నుండి ఆలయంలోని పూజాది కార్యక్రమాలను పర్యవేక్షిస్తూ ఉండిపోయాడు.

శారదమ్మకి కూడా ఆలయానికి వెళ్ళాలనిపించడంతో మరేమీ ఆలస్యం చేయకుండా రెడీ అయిపోయింది. ఆలయం లోపలికి వెళుతున్న శారదమ్మని కొందరు ఆడవాళ్ళు ఆప్యాయంగా పలకరించడం శారదమ్మకి ఎంతో ఆశ్చర్యాన్ని కలిగించింది..!

''నమస్తే మేడం.. బావున్నారా..? మీ గురించి మాకు తెలుసు..'' అంటూ ఒక తెలుగు మహిళ ఆప్యాయంగా పలకరించడంతో ఏం మాట్లాడాలో అర్థం కాక అలాగే చూస్తూండిపోయింది శారదమ్మ.. ఆమెకి దాదాపు ముఫై అయిదు సంవత్సరాలు ఉంటాయి.. అందమైన ముఖారవిందంతో, గ్రీన్ కలర్ పట్టుచీర కట్టుకుని ఎంతో అందంగా కనిపిస్తుంది ఆమె.

''ఓహ్. మీరు నాకెలా తెలుసని అనుకుంటున్నారా.. మొన్న మీరు పిల్లలకి బోధన చేసారు కదా.. ఆ పిల్లలలో మా అబ్బాయి కూడా ఉన్నాడు. మీరు చేసిన బోధనలు మా అబ్బాయిని ఎంతగా ఆకట్టుకున్నాయంటే.. వాడు ప్రతి రోజూ మీ గురించి ప్రస్తావించకుండా ఉండలేడంటే

నమ్మండి.. వాడితో కలిసి మీరు ఫోటో దిగారు కదా.. ఆ ఫోటోలో మిమ్మల్ని చూసాను కాబట్టే ఇప్పుడు గుర్తు పట్టగలిగాను.. ఈ ఆలయానికి వస్తూండగానే అనుకున్నాను.. ఎలాగైనా మిమ్మల్ని ఒకసారి కలుసు కోవాలని.. చూసారా.. నేను మనస్ఫూర్తిగా మిమ్మల్ని కలుసు కోవాలని అనుకున్నాను కాబట్టే మీరు నాకు ఎదురుపడ్డారు.. మిమ్మల్ని ఇలా కలుసుకోవడం నాకెంతో ఆనందాన్ని కలిగించింది..'' ఆ మహిళ ముఖం లో ఆనందం స్పష్టంగా కనిపిస్తుంది. శారదమ్మని చూసానన్న తృప్తికూడా ఆమెలో కనిపిస్తోంది.

ఆమె మాటలకి శారదమ్మ నవ్వింది.. అవునా అన్నట్టుగా తల ఊపుతూ..

అంతలోనే అక్కడికి మరికొందరు మహిళలు వచ్చారు. వారు కూడా నిండైన పట్టుచీరల లో ఉన్నారు. వారందరికీ శారదమ్మ గురించి చెప్పి పరిచయం చేసింది. వారు కూడా ఎంతో వినయంతో శారదమ్మకి రెండు చేతులతో నమస్కరించారు.

వారితో మాట్లాడుతూంటే శారదమ్మకి ఇండియాలో ఉన్నట్టుగానే అనిపిస్తోంది.. ఉండేది విదేశాల్లోనే అయినా స్పష్టమయిన తెలుగులో మాట్లాడుతున్న వారిని చూస్తూంటే ఎంతో ముచ్చటేసింది శారదమ్మకి. వారందరూ ఆలయం లోపలికి వెళుతుండడంతో వారితో పాటు లోనికి నడిచింది శారదమ్మ.

ఒక్కొక్క గుడిని దర్శించుకుంటూ అమ్మవారి ఆలయం దగ్గరికి వచ్చారు. అమ్మవారి ఆలయం దగ్గర భక్తులు చాలా మంది ఉన్నారు. అమ్మవారి విగ్రహానికి రామానుజా చార్యులు ప్రత్యేకంగా పూజలు చేస్తున్నారు. దాంతో భక్తులు భక్తి శ్రద్ధలతో మాతకి నమస్కరిస్తూ నిలబడి ఉన్నారు.

శారదమ్మతో కలిసి అక్కడికి వచ్చారు మహిళలు..

రామానుజాచార్యుల వారు పెద్దగా మంత్రోచ్చారణ చేస్తూ అమ్మవారికి అభిషేకం, సహస్ర నామ పూజలు చేస్తున్నారు.

అక్కడికి వచ్చిన తెలుగు వారిలో దాదాపు చాలా మంది శారదమ్మని చూడగానే గుర్తు పట్టేసారు. ఆవిడని చూసినవారు ఆమె దగ్గరికి వచ్చి ఆప్యాయంగా పలకరించడం మొదలు పెట్టారు. శారదమ్మ పిల్లలకి చేసిన బోధన తాలూకు వీడియో క్లిప్పింగులని, ఫోటోలని చాలా మంది ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో పోస్ట్ చేయడం, శారదమ్మ గురించి ప్రత్యేకంగా ప్రస్తావించడం

లాంటివి చేయడంతో శారదమ్మ అక్కడ ఉన్న దాదాపు తెలుగు వారందరికీ సుపరిచితురాలయిపోయింది.

అందరూ తనని గుర్తుపట్టడం ఆనందంగానే ఉన్నా.. పూజలు జరుగుతున్న సమయంలో వారు తన దగ్గరకు వచ్చి పలకరించడం మాత్రం శారదమ్మకి ఇబ్బందికరంగా అనిపించింది.. అయినప్పటికీ వారందరూ ఎంతో అభిమానంతో తన దగ్గరికి వచ్చి పలకరిస్తూండడంతో వారితో మాట కలపక తప్పలేని పరిస్థితి ఏర్పడింది..

అయితే గర్భగుడిలో పూజలు చేస్తున్న రామానుజాచార్యులకి వారి మాటలు వినపడనప్పటికీ, భగవంతుని పూజ జరుగుతున్న సమయంలో శారదమ్మ, మిగతా మహిళల తో ముచ్చటించే దృశ్యం అతని కంట పడింది..

అంతే... ఏమాత్రం ఆలస్యం చేయకుండా తన చేతిలో ఉన్న పూజాసామాగ్రిని శిష్యులకు అందించి, చేస్తున్న పూజని మధ్యలోనే ఆపేసి శారదమ్మ దగ్గరికి వచ్చాడు. ఆయన ముఖం కోపంతో నిండిపోయింది.. కళ్ళల్లో ఎరుపు జీరలు అలుముకున్నాయి..

సూటిగా శారదమ్మ వంకే చూస్తున్నాడు.. ఆమె పెద్ద అపరాధం చేసిందన్నట్టుగా ఉంది ఆయన చూపు.. చేస్తున్న పూజని మధ్యలోనే ఆపేసి తమ దగ్గరికి రామానుజాచార్యులు రావడంతో మహిళలందరూ హడలిపోయారు.

''ఇది గుడి అనుకుంటున్నావా..? లేదంటే ఏదయినా ఎగ్జిబిషన్ గ్రౌండనుకుంటున్నావా..?'' సూటిగా, కోపంగా అన్నాడు రామానుజాచార్యులు శారదమ్మతో..''

ఆయన మాటలకి శారదమ్మ షాకైపోయింది.. ఆయన తనని అలా ఎందుకు ప్రశ్నిస్తున్నాడో అర్థం కాలేదు శారదమ్మకి. పైగా తానేమి తప్పు చేసానని అతను తనని నిందిస్తున్నాడన్న అయోమయం కూడా ఆమెలో కలిగింది..

''వీళ్ళతో మాట్లాడాలనుకుంటే గుడి బయట నిలబడు, పూజ అయిపోయాక వీరందరూ గుడి బయటికి వస్తారు కదా.. అప్పుడు అందరితో పరిచయం పెంచుకో.. అంతేకానీ ఇలా పూజకి ఆటంకం కలుగజేస్తూ, భక్తి భావంతో వచ్చిన వీరందరినీ చెడగొట్టే ప్రయత్నం చేయకు.. గుళ్ళో ఎలా మెదలాలో తెలియని దానికి, ప్రజలకు మంచి చెప్పేటంత తెలివి తేటలు ఉన్నాయంట..! ఇండియా నుండి వచ్చి ఇక్కడి వారికి నువ్వు నేర్పించడం ఇదేనా..? ఇలా పూజని మధ్యలో

ఆపేయించడమేనా నువ్వు నేర్పే సంస్కృతి..'' రామానుజాచార్యులు అన్న ప్రతీ ఒక్క మాట సూటిగా శారదమ్మ గుండెకి తాకాయి..

అతను తననే అంటున్నాడని అర్థం కాగానే ఆమె తీవ్రమైన షాక్‌కి గురయింది.. అసలు ఆయనతో తనకి పరిచయం కూడా లేదే.. అలాంటిది తనని ఇలా మాటలతో నిందించడం ఎంతవరకు సమంజసం..?

రామానుజాచార్యులు శారదమ్మని అలా అనడం ఆ మహిళలకి కూడా నచ్చలేదు.. వారు కూడా ఒకవిధమైన ఆశ్చర్యానికి గురయ్యారు.. ఆయన మాటలలోని తీవ్రతకి ఒకింత భయపడ్డారు కూడా.. ఆలయ ప్రధాన పూజారి కావడం, సంవత్సరాల తరబడి గురువుగా ఆయనని గౌరవిస్తూండటంతో ఆ మహిళలు సైతం నోరు తెరిచి రామానుజాచార్యులని ఏమీ అనలేకపోయారు..

శారదమ్మ కళ్ళల్లో కన్నీళ్ళు నిండాయి.. ఇంక అక్కడ ఉండడానికి మనసొప్పక పోవడంతో అక్కడి నుండి వేగంగా బయటికి వచ్చేసింది..

గుడిలోనుండి బయటికి వచ్చిందే కానీ.. ఆయన అన్న మాటలే ఇంకా ఇంకా మారుమ్రోగిపోతున్నాయి.. తాను వచ్చినప్పటి నుండి ఆలయంలో ఉండే పూజారులు, వారి ఆడవాళ్ళు తనని ఏదోలా చూడడం తాను గమనించినప్పటికీ.. తనపై అతనిలో ఇంత ద్వేషం దాగుందని మాత్రం అనుకోలేదు..

అటు శారదమ్మని పలుకరించిన మహిళలు కూడా బాధ పడ్డారు.. కేవలం తమ వల్లే శారదమ్మ అన్నేసి మాటలు పడిందన్న ఫీలింగ్ వారిలో కలిగింది..

గుడిలో పూజ పూర్తయిన వెంటనే శారదమ్మని కలుసుకోవాలని ఆ మహిళలు చూసారు కానీ.. శారదమ్మ అప్పటికే తన గదిలోకి వెళ్ళిపోయిందని తెలియడంతో నిరుత్సాహంగా వచ్చిన దారినే తిరుగుముఖం పట్టారు.

ఈ విషయం చివరికి ఆనంద స్వరూప్‌కి కూడా తెలిసిపోయింది..

...........................

రామానుజాచార్యులు  శారదమ్మని గుళ్ళో అవమానించారన్న విషయం సాయిరాంకి కూడా తెలిసింది. వెంటనే ఆనంద స్వరూప్‌కి ఫోన్ చేశాడు సాయిరాం.

''సర్.. విషయం మీకు కూడా తెలిసిపోయిందనుకుంటా..'' క్లుప్తంగా అన్నాడు.

''అవును.. కానీ.. మనం ఇప్పుడు ఈ విషయం గురించి ఏమీ మాట్లాడకపోవడమే మంచిది..'' అన్నాడు ఆనంద స్వరూప్.

''కానీ.. శారదమ్మ ఎంతలా బాధపడిందో కదా..''

ఆనంద స్వరూప్ చిన్నగా నవ్వాడు.

''ఇలాంటి మాటలని పట్టించుకుని బాధపడేంత సామాన్యురాలు కాదు శారదమ్మ గారు. రామానుజాచార్యులు  వారు ఎంతో గొప్ప వ్యక్తి. భగవంతున్ని ఆరాధించడంలో ఆయన తర్వాతే ఎవరైనా.. ఆయనని మనం పాతికేళ్ళ నుండి చూస్తున్నాం.. అకారణంగా ఆయన నోటినుండి ఎదుటివారిని బాధపెట్టే మాటలు  రావు.. శారదమ్మని ఆయన అలా అన్నారంటే.. దాని వెనక ఏదో అంతరార్ధం ఉండి ఉంటుంది.. భగవంతుడిని ఆరాధించే ఇద్దరు పరమ భక్తుల మధ్య జరిగిన సంఘటన ఇది. దీనిని మనం ఇంకా పెద్దది చేసి వివాదం చేయకూడదు. దేవుడి సంకల్పం లేనిదే ఏదీ జరగదు. మనం ఈ విషయం గురించి రామానుజాచార్యుల  వద్ద కానీ, శారదమ్మ గారి వద్ద కానీ ప్రస్తావించక పోవడమే భావ్యం.. తరువాత ఏం జరుగుతుందా అన్నది కాలమే నిర్ణయిస్తుంది..'' ఆనంద స్వరూప్ మాటలకి సాయిరాం మౌనంగా ఉండిపోయాడు.

''సరే అయితే..'' అని మాత్రం అన్నాడు.

''శారదమ్మ గారి ప్రవచనాలకి సంబంధించిన షెడ్యూల్‌లో ఎలాంటి మార్పూ ఉండదు. వచ్చే వారం నుండి ఆవిడ ప్రసంగాలు ఉంటాయి. నువ్వు ఈ విషయం గురించి ఆలోచించకుండా ఆ కార్యక్రమాల ఏర్పాట్లపై దృష్టి పెట్టు..'' అన్నాడు ఆనంద స్వరూప్.

''సరే.. మరి నేను ఉంటాను..'' సాయిరాం ఫోన్ కట్ చేశాడు.

ఆనంద స్వరూప్ అన్నది అక్షరాలా నిజం. రామానుజాచార్యులు తనని అవమానించారని శారదమ్మ బాధ పడుతూ కూర్చోలేదు. సంఘటన జరిగిన సమయంలో ఆమె తీవ్ర ఉద్వేగానికి లోనయిన విషయం వాస్తవమే అయినప్పటికీ తన గదిలోకి వచ్చి సాయిబాబా పారాయణం చేశాక ఆమె మనసు స్థిమిత పడింది. ఆ తర్వాత శారదమ్మ ఆ విషయం గురించి ఆలోచించడం మానేసింది.

..........................

రామానుజాచార్యులు శారదమ్మని అవమానించిన రెండు రోజుల  తర్వాత...

ఆ రోజు ఆదివారం..

ఉదయం నాలుగు గంటల సమయం..

తన గదిలో గాఢ నిద్రలో ఉన్న శారదమ్మని ఎవరో పిలిచినట్టనిపించి ఉలిక్కిపడి నిద్రలేచింది. బెడ్‌పై నుండి లేచి హాలులోనికి వచ్చింది. ఆవిడకేమీ అర్థం కాలేదు. ఎవరో తనని పిలిచినట్లు స్పష్టంగా వినిపించింది.. కానీ అక్కడ ఎవరూ కనిపించకపోవడంతో ఒక విధమైన ఆశ్చర్యానికి లోనయింది..

ఇదంతా తన భ్రమేమో అన్న అనుమానం కలిగింది. టీపాయ్ పైనున్న మంచినీళ్ళ గ్లాసుని అందుకుని నీరు త్రాగింది. నిద్రా దేవత ఆమెనుండి పూర్తిగా విడిపోయింది..

ఆమె మనసెందుకో ఆలయం లోనికి వెళ్ళాలని ఉబలాట పడసాగింది. కిటికీ లోనుండి ఆలయం వైపు చూసింది. విద్యుద్దీప కాంతులతో ఆలయం ధగధగా వెలిగిపోతుంది.

ఇంకా చీకట్లు కమ్ముకుని ఉండడంతో ఆ దృశ్యం ఎంతో మనోహరంగా అనిపించింది శారదమ్మకి. ఆలయ అర్చకులు అప్పటికే గుళ్ళోకి ప్రవేశించారు. ప్రదోష  కాలంలో ఇచ్చే హారతులకి కావాల్సిన ఏర్పాట్లలో వారుండిపోయారు.

శారదమ్మకి గుళ్ళోకి వెళ్ళాలన్న కోరిక మరింత బలపడడంతో పదినిమిషాలలో కాలకృత్యాలు తీర్చుకుని, పూజ గదిలోనికి వెళ్ళి సాయినాధుడిని పూజించి గదిలోనుండి బయటికి వచ్చింది. ఇంకా ఎవరూ నిద్రలేవక పోవడంతో ఆ బంగళా మొత్తం నిశ్శబ్దంగా ఉంది. లిఫ్ట్ ఎక్కకుండా మెట్ల మార్గం ద్వారా క్రిందికి దిగింది శారదమ్మ.

మెయిన్ ఎంట్రెన్స్ దగ్గర ఉన్న సెక్యూరిటీ గార్డులు శారదమ్మకి వినయంగా నమస్కరించారు. అంత పొద్దున్నే ఆవిడ బయటికి రావడంతో ఒకింత ఆశ్చర్యపోయారు వారు.

ఆలయానికి వెళుతున్నట్లు అటువైపు చేయి చూపించింది.

సెక్యూరిటీ గార్డు మెయిన్ గేటుకి ఉన్న తాళం తీసి గేటు తెరిచారు. వారిని చూస్తూ చిన్నగా నవ్వుతూ బయటికి నడిచింది శారదమ్మ.

వాతావరణం చల్లగా ఉండటంతో శరీరం కాస్త వణుకుతుంది. భుజాలపై వేసుకొని ఉన్న శాలువాతో ఒళ్లంతా కప్పుకుని ఆలయం వైపు అడుగులు వేసింది శారదమ్మ.

ఆకాశంలో నక్షత్రాలు తళ తళా మెరుస్తున్నాయి. అమెరికా అయినా ఆంధ్ర అయినా ఆకాశంలో ఉన్న నక్షత్రాలకు ఆ తేడా తెలియదు కదా.. ఎక్కడైనా నక్షత్రాలు ఒకేలా కనిపిస్తాయి.. ఆ నక్షత్రాలని చూస్తే ప్రపంచంలో ఏ ప్రదేశంలో ఉన్న వ్యక్తులకైనా ఒకే అనుభూతి కలుగుతుంది కదా..

శారదమ్మ ఆలయం లోనికి నడిచింది. మహా గణపతి ఉప ఆలయం గర్భగుడిని శుభ్రం చేస్తూ కనిపించాడు ఓ పూజారి. అంత పొద్దున్నే శారదమ్మని అక్కడ చూసి కాస్త ఆశ్చర్య పోయినా.. ఆమెని చూసీ చూడనట్టుగా నటిస్తూ తన పని తాను చేసుకుంటున్నాడు అతను.

శారదమ్మ కళ్ళు మూసుకుని గణేశుడి విగ్రహానికి నమస్కరించి అక్కడి నుండి ముందుకు నడిచింది. అమ్మవారి మందిరంలో రామానుజాచార్యులు ఉన్నారు. గర్భగుడిలోని అమ్మవారి విగ్రహాన్ని పూలమాలలతో అలంకరిస్తున్నారు. ఆయన నోట్లోనుండి అమ్మవారి

సహస్రనామాలు ధారాళంగా వెలువడుతున్నాయి. పరిసరాలని మరిచిపోయి ఎంతో తన్మయత్వంతో అమ్మవారిని అలంకరిస్తున్నారు రామానుజా చార్యులు.

మల్లెపూల హారం, తులసీ దళాలతో చేసిన హారం, సన్నజాజులు, గులాబీ పూలు, సంపెంగ, చామంతి పూలతో అమ్మవారి విగ్రహాన్ని అందంగా అలంకరిస్తున్నారు.

శారదమ్మ అమ్మవారి ఆలయంలో రామానుజాచార్యులని చూసింది. ఆయన ఎంతో భక్తిప్రపత్తులతో అమ్మవారిని అలంకరిస్తున్నారు. ఆయన నోటి నుండి వెలువడుతున్న సహస్ర నామాలు శారదమ్మకి ఎంతో ఆనందాన్ని కలిగిస్తున్నాయి. రామానుజాచార్యుల గొంతు గంభీరంగా పలుకుతోంది.. కానీ.. ఆయన అమ్మవారి సహస్ర నామాలని రాగయుక్తంగా పలుకుతున్నారు.. అవి తన నోటినుండి కాకుండా మనసులోనుండి వస్తున్నట్టుగా అనిపించింది శారదమ్మకి.

ఎదుటి వారిలో కూడా భక్తిభావం పెంపొందే శక్తి ఆయన పలుకుతున్న ఆ నామాలలో ఉందని శారదమ్మకి అర్థమయింది. అచేతనంగా రెండు చేతులతో అమ్మవారికి నమస్కరించింది.. బంగారు వర్ణ కాంతితో తళతళా మెరుస్తున్న ఆమ్మవారి ముఖవర్చస్సు చూస్తూంటే శారదమ్మ మనసులో ఏదో తెలియని ఆనందం కలుగుతోంది.

రామానుజాచార్యులు అమ్మవారిని అలంకరించే పనిలో ఉండడంతో శారదమ్మని ఆయన గమనించలేదు. శారదమ్మకి ఆ అలంకారం మొత్తం పూర్తయ్యేంత వరకూ చూడాలన్న ఆశ పుట్టడంతో గర్భగుడికి ఎదురుగా ఓ స్థంభాన్ని ఆసరా చేసుకుని కూర్చుండిపోయింది.

కళ్ళు మూసుకుని కూర్చున్న ఆమె కొద్ది క్షణాలలోనే బాహ్యస్మృతి కోల్పోయింది. పూర్తి ధ్యానావస్థలో ఆమె మునిగిపోయింది. ఆమె ముఖం  ఎంతో ప్రశాంతంగా కనిపిస్తోంది. ఆమె చెవులకి రామానుజాచార్యులు పలుకుతున్న అమ్మవారి నామాలు మాత్రమే వినిపిస్తున్నాయి.. ఆ నామాలు వింటూ ఆమె ఎంతో మైమరిచిపోతూంది..

ఈ ఆనందం కోసమే తన మనసు ఈ క్షణంలో మందిరంలోకి వెళ్ళేలా ప్రేరేపించిందని శారదమ్మకి అర్థమయింది.. ఇలాంటి ఆనందం వర్ణించడం కష్టం.. అది కేవలం  అనుభవిస్తేనే కానీ అర్థమవుతుంది..

శారదమ్మ అక్కడ కూర్చుందన్న విషయం రామానుజాచార్యులు గమనించలేదు. అమ్మవారిని అలంకరించడంలోని ఆనందాన్ని ఆయన అనుభవిస్తున్నారు. ఒకరు అమ్మవారిని అలంకరిస్తూ ఆనందిస్తూంటే, మరొకరు అమ్మవారి నామాలను ఆస్వాదిస్తూ ఆనందసాగరంలో మునిగి తేలుతున్నారు.

రామానుజాచార్యులు అమ్మవారి అలంకారం పూర్తి చేసారు. సువాసనలు  వెదజల్లే ధూపాన్ని వెలిగించి అమ్మవారికి ధూపాన్ని సమర్పించారు.. దీపాలంకరణ గావించారు. నైవేద్యం కోసం తయారు చేసిన తీపి పదార్థాన్ని అమ్మవారికి నివేదించారు. సహస్ర నామ పారాయణం ముగిసిపోయింది..

అమ్మవారి పూజ అయిపోయినప్పటికీ రామానుజాచార్యులలో ఏదో అసంతృప్తి కలిగింది.. ఎంతో భక్తి శ్రద్దలతో అమ్మవారిని పూజించినప్పటికీ తనలో ఈ అసంతృప్తి కలగడానికి కారణం ఏమిటి..? అన్నది అర్థం కాలేదు రామానుజాచార్యుల వారికి.

తన మనసు, బుద్ది రెండింటినీ ఏకంచేసి పూర్తి ఏకాగ్రతతో ఎంతో శుద్దితో పూజించాను కదా..? అయినా కూడా తనలో ఈ అసంతృప్తికి గల కారణమేమిటి? రామానుజాచార్యులకి ఏమీ అర్థం కాలేదు..

అమ్మ వారి విగ్రహం వైపు తదేకంగా చూసాడు. నిండుగా ఉన్న పుష్పాల మధ్యలో అమ్మవారి ముఖం  కనిపిస్తుంది.. కానీ ఆ ముఖం  కళావిహీనంగా ఉంది.

రామానుజాచార్యుల వారు షాకై పోయారు. జీవితంలో మొట్టమొదటి సారి ఆయన అలా షాక్‌కి గురవ్వడం.. ఆయన కళ్ళల్లోనుండి కన్నీళ్ళు జలజలా రాలాయి.. శరీరం మొత్తం కంపించిపోయింది.. విగ్రహంలోని అమ్మవారి ముఖం లో స్పష్టమయిన మార్పులు

కనిపిస్తున్నాయి.. ఇది.. ఇదెలా సాధ్యం.. విగ్రహం ముఖం లో ఆ మార్పులకి గల కారణం ఏమిటి? తానేమి దోషం చేసాడు.. పూజలో ఏమయినా పొరపాటులు దొర్లాయా.. ఆయన మెదడు మొద్దుబారి పోయినట్టనిపించింది..

ఏం చేయాలో అర్థం కాక అలాగే కొయ్యబారిపోయినట్లు ఉండిపోయాడు. ఆయన కళ్ళు పెద్దవయ్యాయి.. కళ్ళల్లో నుండి జారుతున్న కన్నీళ్ళు ఆయన చేసిన అపరాధానికి సంకేతంగా నిలుస్తున్నాయి.. కానీ.. కానీ.. తానేమి పొరపాటు చేసాను.. అన్నది మాత్రం అర్థం కావడం లేదు..

ఒకసారి పూజని ఏ విధంగా చేశాడన్నది మనసులోనే మననం చేసుకున్నాడు.. ప్రతిరోజూ చేసే మాదిరిగానే చేసాడే.. పూజలో ఎలాంటి మార్పూ చేయలేదు.. మరి ఈ విపరీత పరిణామానికి కారణం ఏమిటి? తన మనసులోనే రకరకాల ప్రశ్నలు వేసుకుంటున్నాడు.

పోనీ.. పూజ సమయంలో ఏకాగ్రత కోల్పోయానా.. అన్న ఆలోచన కూడా కల్గింది.. కానీ.. అలాంటిది ఏమీ జరగలేదు..! మరి.. మరి.. తాను ఏమి దోషం చేశాడు..? ఆయన మెదడు మొద్దుబారి పోయినట్టనిపించింది.. తానుచేసిన తప్పేమిటి... ఎంత ఆలోచించినా అర్థం కాలేదు..

కానీ.. ఏదో అపరాధం చేశాడు అని మాత్రం తెలుస్తోంది.. ఏమిటా అపరాధం..? అమ్మవారి విగ్రహంలోని ముఖారవిందంలో విచారం స్పష్టంగా కనిపిస్తుంది.. ఇది తన భ్రమేమో అని కళ్ళు నులుముకుని మరీ చూశాడు..

సందేహం లేదు.. అమ్మవారి ముఖం విచార వదనంతో కనిపిస్తోంది..

ఆయనకి ఏం చేయాలో అర్థం కాలేదు.. అమ్మవారిని ప్రసన్నం చేసుకోవడమెలాగో అర్థం కాలేదు.. ఆయన చూస్తూండగానే అమ్మవారికి అలంకరించిన పుష్పాలు కూడా కళావిహీనంగా మారిపోతున్న ఫీలింగ్ ఆయనకి కలగడంతో మరింత అదిరిపడ్డాడు..

''అమ్మా.. తల్లీ.. దుర్గామాతా.. నన్ను క్షమించు తల్లీ.. నేనేమి అపరాధం చేశాను తల్లీ.. నీలో ఈ మార్పుని నేనెప్పుడూ గమనించలేదు తల్లీ.. నేను చేసిన తప్పు నాకు తెలిసేలా చూడు తల్లీ..''

ఆయన ఎంతో రోదిస్తున్నాడు.. ఏడుపుతో గొంతు బొంగురుపోయింది.. అమ్మవారి పాదాల వద్ద తల ఆనించి రోదించసాగాడు రామానుజాచార్యులు.. అలా కొద్దిసేపు గడిచాక.. కళ్ళు తుడుచుకుని.. యధాలాపంగా బయటికి చూసాడు..

అక్కడ కనిపించిన దృశ్యానికి అదిరిపడ్డాడు రామానుజాచార్యులు.. తన కాళ్ళ క్రింద భూమి కంపించిపోతుందా అన్న ఫీలింగ్ కలిగింది ఆయనలో.

అది కలో.. నిజమో అర్థం కాని అయోమయ స్థితిలో ఉన్నాడు.. కళ్ళ ముందు ఒక అద్భుతాన్ని చూస్తున్నాడు.. ఆయనకి నోట మాట రావడం లేదు.. శరీరం అదుపు తప్పుతున్న అనుభూతి కలుగుతోంది..

ఎదురుగా.. ఎదురుగా..

శారదమ్మ కూర్చుని కనిపిస్తుంది..

కానీ.. కానీ.. తాను ఇంత వరకూ రకరకాల పుష్పాలతో అమ్మవారిని పూజించాడు..

తాను అమ్మవారికి పూజించిన పుష్పాలు శారదమ్మ ఒంటిని కప్పేసి కనిపిస్తున్నాయి.. తాను అమ్మవారికి సమర్పించిన ధూపపు పొగ శారదమ్మ చుట్టూ సువాసనలు జల్లుతూ కనిపిస్తుంది.. తాను అమ్మవారికి చేసిన దీపారాధన శారదమ్మ ముందు కనిపిస్తోంది..

అమ్మవారికి పెట్టిన నైవేద్యం శారదమ్మ ముందు ఉంది..

కళ్ళు మూసుకుని నిశ్చలంగా కనిపిస్తున్న శారదమ్మ ముఖం లో అమ్మవారి రూపం సాక్షాత్కరిస్తుంది..

రామానుజాచార్యుల కళ్ళ నుండి కన్నీళ్ళు ధారాపాతంగా కారుతున్నాయి.. ఎదురుగా సాక్షాత్తూ అమ్మవారి దైవస్వరూపాన్ని దర్శిస్తున్నాడన్న ఆలోచనే ఆయనకి ఎంతో ఆనందాన్ని ఇస్తోంది..

సహకరించని శరీరాన్ని అతి కష్టం మీద అదుపులోకి తెచ్చుకుని భారంగా అడుగులో అడుగు వేసుకుంటూ శారదమ్మ దగ్గరికి వచ్చాడు రామానుజాచార్యులు..

శారదమ్మలో ఎలాంటి చలనం లేదు.. నిశ్చయంగా కళ్ళు మూసుకొని ఉంది.. ఆమె ముఖం లో చిరునవ్వు చెదిరిపోలేదు..

రామానుజాచార్యులకి మాత్రం శారదమ్మలో అమ్మవారి రూపం స్పష్టంగా కనిపిస్తుంది..

రామానుజాచార్యులు శారదమ్మ కాళ్ళపై పడ్డాడు..

''నన్ను.. నన్ను క్షమించు తల్లీ.. నువ్వు దైవ స్వరూపానివని తెలియక నిన్ను అనరాని మాటలు అన్నాను.. నిన్ను నిందించాను.. నేను చేసిన అపరాధానికి నన్ను క్షమించుతల్లీ..'' శారదమ్మ కాళ్ళపై పడి బోరున విలపిస్తున్నాడు రామానుజాచార్యులు.

శారదమ్మ మాత్రం ఇంకా యోగనిద్రలోనే ఉంది. రామానుజాచార్యులు తన కాళ్ళపై పడడం, తనని మన్నించమని వేడుకోవడం ఇవన్నీ ఆమెకి తెలియవు.. ఒక రకమైన అలౌకిక ఆనందంలో శారదమ్మ మునిగిపోయి ఉంది..

రామానుజాచార్యుల వారు మాత్రం శారదమ్మ కాళ్ళు వదలలేదు.. తాను చేసిన అపరాదాన్ని మన్నించే వరకూ తాను కాళ్ళని వదిలేది లేదంటూ అలాగే ఉండిపోయాడు.. ఆయన కళ్ళు వర్షిస్తున్నాయి.. ఆ కన్నీళ్ళు శారదమ్మ పాదాలని అభిషేకం చేస్తున్నాయి...

తానేమి చేస్తున్నాడో అర్థం చేసుకునే స్థితిని కోల్పోయాడు రామానుజాచార్యులు..

''నన్ను క్షమించు తల్లీ.. నన్ను క్షమించు..'' ఆయన గట్టిగా అరుస్తున్నాడు.. ఆ అరుపులకి మిగతా ఆలయాల్లో పూజ చేస్తున్న ఆయన శిష్యులు పరిగెత్తుకుని వచ్చారు..

రామానుజాచార్యులు శారదమ్మ కాళ్ళముందు మోకరిల్లి ఏడస్తూండడం కనిపించి వారందరూ విపరీతంగా ఆశ్చర్యపోయారు..

గురువు గారేమిటీ.. ఆవిడ కాళ్ళపై పడి క్షమించమని వేడుకోవడమేమిటీ..? అని అయోమయపడిపోయారు... రామానుజాచార్యులు మాత్రం 'క్షమించు తల్లీ.. క్షమించు తల్లీ..'' అని అరుస్తూనే ఉన్నాడు..

వారికేం చేయాలో పాలుపోక ఒకరి ముఖాలొకరు చూసుకున్నారు ..

రామానుజాచార్యుల వారితో ఎదురుగా నిలబడి మాట్లాడటానికే జంకే వారు.. ఆయనని ఆ పరిస్థితిలో చూసే సరికి ఏం చేయాలో అర్థం కాకుండా తల పట్టుకున్నారు..

ఒక శిష్యుడు ధైర్యం చేసి రామానుజాచార్యుల దగ్గరికి వెళ్ళి మోకాళ్ళపై కూర్చుని ఆయనకి వినిపించేలా..

''గురువు గారూ..'' అని పిలిచాడు..

అయినప్పటికీ రామానుజంలో చలనం లేదు..

మరి కొంత స్వరం పెంచి..

''గురువు గారూ.. గురువు గారూ..'' అని అన్నాడు..

శిష్యుడి పిలుపుకి ఉలిక్కిపడ్డాడు రామానుజాచార్యులు.. చప్పున శారదమ్మ కాళ్ళ దగ్గరి నుండి తనని పైకెత్తాడు.. ఎదురుగా శిష్యులందరూ తననే ఆశ్చర్యంగా చూస్తూ నిలబడడం చూసి ఉలిక్కిపడ్డాడు.

ఒక్క క్షణం ఆయనకి ఏమీ అర్థం కాలేదు..

శారదమ్మ ఎదురుగుండా మోకాళ్ళపై కూర్చుని ఉండడం గమనించి అదిరిపడ్డాడు. శారదమ్మ వంక చూసాడు. ఆమె ఈ లోకంలో లేనట్టు.. కళ్ళు మూసుకుని నిశ్చలంగా ఉంది..

ఆమె చుట్టూ వలయాకారంగా ఏదో దివ్య తేజస్సు తిరుగుతున్నట్లనిపించింది రామానుజాచార్యుల వారికి. అయితే బాహ్యస్మృతిలోకి వచ్చిన రామానుజాచార్యుల కి ఇంతకు ముందులా శారదమ్మ ముఖం లో అమ్మవారి రూపం కనిపించలేదు. అయినప్పటికీ ఆమె చుట్టూ కనిపిస్తున్న కాంతిపుంజాన్ని చూసి ఆయన కళ్ళల్లో ఎంతో ఆనందం కనిపించింది.

శిష్యులందరూ తననే ఆశ్చర్యంగా చూస్తూండడంతో అక్కడ ఏమీ జరగనట్టుగా మౌనంగా లేచి నిలబడ్డాడు. శిష్యులు రామానుజాచార్యుల వారినే వింతగా చూస్తున్నారు. తన పిలుపుతో రామానుజాచార్యుల వారిని ఈలోకంలోకి వచ్చేలా చేసిన శిష్యుడు రెండు చేతులు కట్టుకుని వినయంగా నిలబడి కనిపించాడు. కానీ.. మిగతా వారు మాత్రం రామానుజాచార్యుల వారిని వింతగా చూస్తున్నారు.

రామానుజాచార్యులు గొంతు సవరించుకున్నాడు. ఆ తర్వాత ఏమీ జరగనట్టుగా భుజాలు ఎగురవేశాడు.

''అమ్మవారికి పూజా విశేషాలు ఈ రోజు చాలా బ్రహ్మాండంగా జరిగాయి. ఆ సంతోషంలో కాస్త అదుపుతప్పి ప్రవర్తించాను.. అంతేకానీ.. వేరే ఏమీ లేదు..'' సంజాయిషీ చెబుతున్నట్టుగా అన్నాడు..

ఆ మాటలకి శిష్యులు తల ఊపి మౌనంగా అక్కడి నుండి వెళ్ళిపోయారు.

వారు వెళ్ళిన తర్వాత తిరిగి శారదమ్మ వంక చూశాడు రామానుజాచార్యులు. శారదమ్మ అలాగే కళ్ళు మూసుకుని ఉంది.

రామానుజాచార్యుల మనసు ఎంతో ఆనందంతో నిండిపోయింది. గర్భగుడిలోని అమ్మవారి వైపు చూశాడు. ఇంతకు ముందులా కాకుండా అమ్మవారి ముఖం  దేదీప్యమానంగా వెలిగిపోతూ కనిపించింది..

రామానుజాచార్యుల జీవితంలో ఈరోజు మరిచిపోలేనిది. ఇన్నేళ్ళుగా దేవునికి సేవ చేస్తున్నా ఈరోజు లభించిన దర్శన భాగ్యం ఆయన గతంలో ఎప్పుడూ పొందలేదు.

..................

ఆరోజు ఆదివారం...

ఉదయం పది యాభై నిమిషాల సమయం..

మందిరంలో ఉన్న కమ్యూనిటీ హాల్ జనాలతో కిక్కిరిసిపోయి ఉంది. ఆనంద స్వరూప్‌తో పాటు తెలుగు సంఘం లోని సభ్యులు వారి కుటుంబ సభ్యులందరూ వచ్చారు. వారందరి ముఖాలలో ఒక విధమైన ఉత్సాహం కనిపిస్తుంది.

శారదమ్మ అమెరికాకి వచ్చిన తర్వాత ప్రవచనాలు చెబుతున్న మొదటి సమావేశం అది. దానికోసం సాయిరాం ఉదయం నుండే అన్ని ఏర్పాట్లు చేయడంలో నిమగ్నమయిపోయారు. అమెరికాలో ఒక కార్యక్రమాన్ని చేపట్టాలంటే మామూలు విషయం కాదు. మందిరం దగ్గరకు చేరుకోవడానికి చాలా మంది భక్తులు సుదూర ప్రాంతాల నుండి కూడా విచ్చేస్తారు. అంతేకాదు.. వారందరికీ భోజన సదుపాయాలు కూడా చేయడం కూడా జరుగుతుంది. తెలుగు వారందరూ ఒక చోట కలిసే సందర్భం ఏదయినా అలా కలుసుకునే సమయం లో  అందరి మధ్యా అప్యాయతానురాగాలు వెల్లి విరిసేలా ఏర్పాట్లు చేయడానికి ఆనంద స్వరూప్ ప్రత్యేక శ్రద్ధ చూపిస్తారు.

అందుకే ఉదయం నుండి సాయిరాం ఏర్పాట్లపై నానా పాట్లు పడుతున్నాడు. అందరూ దేవాలయంలో దేవుడిని దర్శించుకున్న తర్వాత శారదమ్మ ప్రసంగం కోసం ఎదురుచూస్తున్నారు. శారదమ్మ తన గదిలోనుండి ఇంకా మందిరం దగ్గరకు రాలేదు..

తెల్లవారక ముందుగానే ఆలయానికి వచ్చి పూజాదికాలు చేసి తిరిగి తన గదిలోకి వెళ్ళిపోయింది శారదమ్మ.. ఆనంద స్వరూప్ గారు శారదమ్మతో ముందుగానే చెప్పారు. ఈరోజు ఉదయం పదకొండు గంటలకు ప్రవచనం ఏర్పాటు చేస్తున్నట్లు..

అందుకే ఆ సమయం వరకు గదిలోనే ఉండిపోయింది.

అక్కడ కమిటీ హాలులోని వారందరూ శారదమ్మ ప్రవచనం వినాలని ఎంతో ఆరాటంగా ఉంటే.. ఇక్కడ శారదమ్మ మాత్రం ఎలాంటి ఆలోచనలు లేకుండా సాయి గ్రంధ పారాయణం చేస్తూ ఉండిపోయింది..

సరిగ్గా పది నిముషాల తర్వాత శారదమ్మ గది బయటికి వచ్చింది.. నేరుగా సమావేశ మందిరం వైపుకి అడుగులు  వేసింది..

ఆవిడ రాకని గమనించిన ఆనంద స్వరూప్, సాయిరాం ఇద్దరూ సాదరంగా ఎదురెళ్లి ఆహ్వానం పలికారు. అప్పటి వరకూ కోలాహలంగా ఉన్న ఆ హాలు శారదమ్మ రాకతో నిశ్శబ్దంగా మారిపోయింది. ఆవిడని గమనించి హాలులోని వారందరూ మర్యాద పూర్వకంగా కుర్చీలలోనుండి లేచి నిలబడ్డారు. ఆ హాలులో కనిపించిన జనాలని చూసి ఎంతో ఆశ్చర్యపోయింది శారదమ్మ.

ఆధ్యాత్మిక ప్రసంగాలని వినడానికి అమెరికాలో అంతమంది జనాలు వస్తారని ఆమె కలలో కూడా ఊహించలేకపోయింది.. యథాలాపంగా అందరికీ రెండు చేతులెత్తి నమస్కరించింది.. ఆనంద స్వరూప్ శారదమ్మని సాదరంగా వేదికపైకి తీసుకువెళ్ళారు..

శారదమ్మ ప్రసంగానికి ముందుగా ఆనంద స్వరూప్ మైకు దగ్గరికి వచ్చాడు. శారదమ్మ గురించి పరిచయం చేయడానికి.

''అందరికీ నమస్కారం.. ఈ రోజు మీరందరితో ఇలా మాట్లాడుతున్నందుకు నాకెంతగానో సంతోషంగా ఉంది. వారం అంతా ఆఫీసుల్లోనూ, వ్యాపార కార్యకలాపాల్లో బిజీగా ఉండే వారు.. శని, ఆది వారాలలో మాత్రం పూర్తిగా తమ వ్యక్తి గత జీవితానికి కేటాయిస్తారు.

కానీ.. ఈ రోజు శనివారం అయినప్పటికీ ఒకే ఒక్క పిలుపుతో మీమీ వ్యక్తిగత పనులని ప్రక్కన బెట్టి ఆధ్యాత్మిక ప్రసంగాన్ని వినడానికి మీరందరూ ఇక్కడికి వచ్చినందుకు మీ అందరికీ నేను ప్రత్యేకంగా ధన్యవాదములు తెలుపుతున్నాను. ఇక శారదమ్మ గురించి చెప్పాలంటే.. నేను ఇండియాకి వెళ్ళినప్పుడు మా సాయిబాబా ఆలయంలో శారదమ్మని చూడడం జరిగింది. ఆవిడ గురించి ఎంత చెప్పినా తక్కువే.. పది మందికి మంచి చేసే మాటలు చెప్పడం అందరికీ సాధ్యం కాదు.. దానికి ఆ భగవంతుడి అనుగ్రహం తప్పకుండా ఉండాలి.. ఆ దేవుని అనుగ్రహంతో శారదమ్మ ఎంతో మందిని తన ప్రసంగాల ద్వారా ప్రభావితం చేసింది.

వక్రమార్గంలో ప్రయాణించే చాలా మంది ఆమె ప్రసంగాలు విని మంచిమార్గంలోకి రావడాన్ని నేను కళ్ళారా గమనించాను. అంతేకాదు.. దేవుడి అనుగ్రహమే కాదు, ఆ దేవుడి అండ ఎల్లప్పుడూ శారదమ్మ గారికి ఉండడం అన్నది ఆమె ఎంతటి మహోన్నతురాలో చెప్పకనే చెబుతుంది.

నా ప్రత్యేక అభ్యర్థన మేరకు అమెరికాలో ఉన్న భారతీయులందరికీ తన ప్రసంగాలు వినే భాగ్యాన్ని కలిగించినందుకు శారదమ్మకి నేను ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలుపుకుంటున్నాను. ఈ కార్యక్రమాన్ని ఇంత దిగ్విజయంగా చేయడానికి నాకు సహకరిస్తున్న సాయిరాం గారికి ధన్యవాదములు  తెలుపుకుంటున్నాను.. ఇక శారదమ్మ గారిని తమ దివ్య ప్రసంగాన్ని అందరికీ వినిపించమని వినయంగా కోరుతూ ముగిస్తున్నాను..'' ఆనంద స్వరూప్ మాటలకి హాలంతా చప్పట్లతో మారు మ్రోగిపోయింది.

తనని ఆనంద స్వరూప్ గారు ఆకాశానికెత్తేసినట్లు పొగుడుతున్నా ఆ పొగడ్తని ఏమాత్రం పట్టించుకోకుండా చిరునవ్వు చిందిస్తూ అందరి వంకా ఆప్యాయంగా చూస్తూండి పోయింది శారదమ్మ. సాయిరాం మాత్రం ఎంతో ఉప్పొంగిపోయాడు. ఉదయం నుండి ఎడతెరిపి లేకుండా తాను కష్టపడిన అలసటంతా ఆనంద స్వరూప్‌కి, సభా ముఖంగా తన గురించి ప్రస్తావించడంతో ఇట్టే ఎగిరిపోయింది.

శారదమ్మ ఆసనానికి ముందు మైకుని ఏర్పాటు చేశారు. ప్రసంగాన్ని ప్రారంభించే ముందు కళ్ళు మూసుకుని ఆ సాయినాదుడిని మనస్ఫూర్తిగా ప్రార్థించింది. ఆ తర్వాత మెల్లిగా కళ్ళు తెరిచి ఒకసారి ఆ సభలో ఉన్న వారందరి వైపు చూసి.. చిన్నగా గొంతు సవరించుకుంది..

‘‘నా మీద అభిమానంతో మీరందరూ ఇక్కడికి రావడం నాకెంతో సంతోషంగా ఉంది. ఆనంద స్వరూప్ గారి సంకల్ప బలం వల్ల ఇప్పుడు నేను మీ ముందు ఇలా ప్రసంగించడానికి వీలు కలిగిందని సవినయంగా మనవి చేస్తున్నాను.. ఆ దేవుడు అందించిన పరిజ్ఞానాన్ని పదిమందికి

అందించాలన్న చిన్న ప్రయత్నం తప్ప నేను కూడా అందరిలా సాధారణమైన స్త్రీనే..'' అంటూ కాసేపు ఆగింది శారదమ్మ..

ఆమె మాటలని ఎంతో ఆసక్తిగా వినడం ప్రారంభించారు అందరూ.. అయితే అలా వినే వారిలో ఆమె ప్రసంగాలు విని ఆనందించాలి అనుకునే వారితో పాటు, ఆమె ప్రసంగాలలోని లోపాలని ఎత్తి చూపి, ఆమె వ్యక్తిత్వాన్ని కించించేందుకు కుయుక్తులు పన్నే వారు కూడా ఉన్నారు. వారు కూడా శారదమ్మ మాటలని ఎంతో శ్రద్ధగా వినడం ప్రారంభించారు.

''ఇండియాలో అయినా అమెరికాలో అయినా ప్రపంచంలో ఎక్కడయినా భారతీయుల, ముఖ్యంగా తెలుగువారి ఔన్నత్యాన్ని ఎవరూ ప్రశ్నించలేరు. అంతటి ఔన్నత్యం కేవలం మన భారతీయులకి మాత్రమే ఉంటుందని నేను భావిస్తాను. మన జీవితాలపై మన పురాణ గ్రంథాల ప్రభావం ఎంతో ఉంటుందని ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. ఉపనిషత్తులు మన జీవన గమ్యానికి సోపానాలయితే, పవిత్రమైన భగవద్గీత మనం ఎలా జీవించాలో చెప్పే గొప్ప గ్రంథం.. యుద్ధంలో తమ వారితో యుద్దం చేయలేక నిస్సహాయుడైన అర్జునుడికి శ్రీకృష్ణుడు ఉపదేశించింది ఈ భగవద్గీతనే అని మనందరికీ తెలిసిందే. భగవద్గీత అంటే కేవలం పూజా మందిరంలో అలంకార ప్రాయంగా ఉంచే గ్రంథం కాదు.. భగవద్గీత అంటే కేవలం వృద్దులు మాత్రమే పారాయణం చేసే గ్రంథం కాదు, భగవద్గీత అంటే చనిపోయిన వ్యక్తి ఇంట్లో వినే గ్రంథం కాదు..

భగవద్గీతని ప్రతీ ఒక్కరూ మననం చేయాలి.. భగవద్గీతలోని ప్రతీ ఒక్క శ్లోకం మనిషి జీవితంలో పైకి వెళ్లేందుకు ఏర్పాటు చేసిన ఒక్కో మెట్టులా భావించి పారాయణం చేయాలి.. అలా పారాయణం చేసిన దానిని అర్థం చేసుకుని, దానిలోని సారాంశాన్ని మనం జీవితంలోకి అన్వయించుకుంటే భగవద్గీత యొక్క ప్రాముఖ్యత ఏమిటో మనందరికీ అర్థమవుతుంది.. నిజానికి భగవంతుడి ఉద్దేశ్యం కూడా అదే కదా..!

ఇంతకీ భగవద్గీత మనకేం చెబుతోంది ?

భగవద్గీత కేవలం బుద్ధితో అర్థం చేసుకుని, అంతటితో ఆగిపోయే గ్రంథం కాదు. ఇది సాధనకు సంబంధించిన విషయం. ఇందులో చెప్పిన సాధనను సాధకుడు స్వయంగా అభ్యాసం చేసి తనలో మార్పు తెచ్చుకోవడానికై ఉద్దేశించిన గ్రంథం. ఇతరులను కాదు, తనను తాను మార్చుకోవడానికి ఉద్దేశించినది.

అందుకే భగవద్గీత మనకేం చెబుతోంది? అనే ప్రశ్నని పలు మార్లు మన మనసులోనే వేసుకుని, ఆ ప్రశ్నకి సమాధానాన్ని కనుగొనాలన్న ఆరాటం అన్వేషణగా మారినట్లయితే భగవద్గీతలో ఏముందో, భగవద్గీత మనకి ఏం చెబుతుందో అన్నది అర్థమవుతుంది.. ఇలా ప్రతి ఒక్కరూ చేయాలి.. అలా చేస్తేనే భగవద్గీతలోని సారాన్ని మనందరం తెలుసుకోవచ్చు. ప్రపంచంలోని పవిత్ర పుణ్య గ్రంథాలలో భగవద్గీత కూడా ఒకటిగా వెలుగొందుతున్న విషయం మనం విస్మరించరాదు. భగవద్గీత గ్రంధాన్ని ఎన్నో దేశాలలో పరిశోధించి, ఎంతో విశ్లేషించి భగవద్గీత గ్రంథంలో వివరించిన విషయాలు మామూలువి కావని తెలియజేశారు..'' శారదమ్మ మాటలని అందరూ ఎంతో శ్రద్ధగా వింటున్నారు. భగవద్గీత ఔన్నత్యాన్ని గురించి శారదమ్మ వివరించిన తీరు అక్కడ ప్రతీ ఒక్కరినీ ఆకట్టుకుంది.

''భగవంతుడు మనిషి కి గానీ, జంతువుకు గానీ పొరపాటున కూడా తక్కువ గానీ, ఎక్కువగానీ శిక్షలు ఇచ్చి ఈ భూమిపైకి పంపించలేదు.. ఒక మనిషి బీదవాడు గానో, మధ్యతరగతి వాడు గానో, ధనవంతుడు గానో లేదంటే అనారోగ్యవంతుడిగానో, ఆరోగ్యవంతుడి గానో ఎలా ఉండాలో ముందే నిర్ణయం జరిగిపోతుందని మన పురాణాలు చెబుతున్నాయి. మనిషి భూమిపైకి వచ్చాక ఎలా బ్రతుకుతాడు, వాడు కష్టపడతాడా.. సుఖపడతాడా అన్నది భగవంతుడు నిర్ణయిస్తాడు అని చాలా మంది నమ్ముతారు.. కానీ నేను మాత్రం ఒకే ఒక్క మాటని చెప్పదలుచుకున్నాను.. అది.. భగవంతుడు మనిషికి సుఖాలని ఇవ్వడు, కష్టాలనీ ఇవ్వడు.. కేవలం జీవితాన్ని మాత్రం ఇస్తాడు.. మనిషికి ఇచ్చిన జ్ఞానం వల్ల తాను ప్రసాదించిన జీవితంలో కష్టాన్ని కొని తెచ్చుకుంటాడా.. సుఖాలతో జీవితాన్ని సాగిస్తాడా అని భగవంతుడు

ఆసక్తిగా గమనిస్తాడు.. అంతే.. అందుకే భగవద్గీతలో భగవంతుడు ఒక మాటని అంటాడు.. ‘‘ఏది జరిగినా అది మంచికే, ఏది జరుగుతున్నదో అది కూడా మంచికే జరుగుతున్నది’’ అని.. ఈ మాటల్లోని గూఢార్థాన్ని సరిగ్గా అర్థం చేసుకుంటే కేవలం  ఈ ఒక్క మాట వల్లే మన జీవితంలోని సగం కష్టాలని దూరం చేసుకోవచ్చు.. మంచి, చెడు అనే వాటిని తెలుసుకుని, ఏది చేస్తే మంచో, ఏది చేస్తే చెడో గ్రహించగలిగినప్పుడు మనిషి జీవితం అంతా సుఖమయం అయిపోతుంది. భగవంతుని ఆజ్ఞలేనిది ఒక అణువు కూడా ముందుకు కదలదు అంటారు.. నిజమే.. ఒక క్రీడా మైదానం ఈ ప్రపంచం అయితే ఆ మైదానంలో ఉన్న ఆటగాళ్ళం మాత్రమే మనం.. మనల్ని ఆడించేవాడు ఖచ్చితంగా ఆ భగవంతుడే.. అయితే భగవంతుడు ఎంపైర్ స్థానంలో ఉండి మనం చేసే చర్యలో ఏది మంచో, ఏది చెడో గమనిస్తూ మన కర్మకి తగిన ఫలాన్ని అందించడంలో ఎప్పుడూ పారదర్శకంగానే వ్యవహరిస్తాడని మరిచిపోవద్దు.. మనిషి ఎలా జీవించాలి.. ఎలా జీవించకూడదు అన్న విషయాలని ఎంతో మంది మహానుభావులు, ఋషులు తమ గ్రంథాల ద్వారా వివరంగా చెప్పారు. వారు చెప్పిన మంచి మాటల ద్వారా మంచిని గ్రహించే నేర్పుని మనం సంపాదించ గలగాలి.. అలా సంపాదించలిగినప్పుడు నీటిని వదిలి పాలు మాత్రమే త్రాగే హంస లాగా అన్ని విషయాల నుంచి మనం మంచిని మాత్రమే గ్రహించే తెలివిని సంపాదించుకోవాలి.. అలా సంపాదించుకున్ననాడు మనిషి విజయాలకు అంతే ఉండదు, తనతో పాటు ఈ సమాజాన్ని సైతం అభివృద్ధి పథంలో ముందుకు నడిపిస్తూ ఆదర్శవంతమైన జీవితాన్ని గడపగలుగుతాడు..’’

శారదమ్మ ప్రసంగానికి హాలు దద్దరిల్లిపోతుందా అన్నంతగా చప్పట్లు మ్రోగాయి... ఆనంద స్వరూప్ అయితే కుర్చీలోనుండి లేచి మరీ చప్పట్లు కొట్టాడు.. అంతటి విశేష స్పందన ప్రేక్షకుల నుండి వచ్చినా కూడా తన ముఖం లో చిరునవ్వుని ఏమాత్రం చెదరనీయలేదు శారదమ్మ..

భగవద్గీత గ్రంథంలోని కొన్ని ముఖ్యమైన శ్లోకాలని చదివి వాటి అర్థాన్ని పూసగుచ్చినట్టుగా వివరించడం ప్రారంభించింది శారదమ్మ.. గీతలోని బోధనలు, మనిషి జీవితం యొక్క

ప్రాముఖ్యతపై సాగిన ఆమె ప్రసంగం ఆద్యంతం ఎంతో రమణీయంగాన, సాగిపోయింది.. మధ్య మధ్యలో ప్రేక్షకుల చప్పట్ల తో ఒకరకమైన ఉత్సాహభరిత వాతావరణం ఆ హాలులో కనిపించింది..

దాదాపు మూడు గంటల పాటు నిర్విరామంగా జరిగిన శారదమ్మ ప్రసంగానికి మైమరిచిపోని వారంటూ ఎవరూ లేకుండా అయిపోయారు. ఆమెని ప్రసంగంలో లోపాలు ఎత్తి చూపి ఆమెని విమర్శించాలనుకున్న వారు సైతం శారదమ్మ ప్రసంగానికి ఆకర్షితులు కాకుండా ఉండలేకపోయారు..

వ్యక్తిగతంగా ఏవో సమస్యలలో చిక్కుకున్న వారందరికీ ఆ ప్రసంగం ఒక పెద్ద ఊరటలా అనిపించింది. కష్టాలు, నష్టాలు చూసి భయపడవద్దని శారదమ్మ చెప్పిన విషయాలు అక్కడి వారందరిలో బలంగా నాటుకుపోయాయి. జీవితంలో ఎదురయ్యే సమస్యలని సమర్థవంతంగా ఎదుర్కొనే శక్తి అంతర్లీనంగా వారిలో శారదమ్మ ప్రసంగం కలుగచేసిందని చెప్పడంలో ఎలాంటి సందేహం లేదు..

అందుకే అక్కడున్న ప్రతి ఒక్కరి ముఖం లోనూ ఒక విధమైన ధైర్యం, దేన్నయినా ఎదుర్కొనేటంత దృఢ విశ్వాసం గోచరించడం ఆనంద స్వరూప్ మాత్రమే కనిపెట్టాడు.

భోజన విరామం కావడంతో అందరూ ఆ హాలులో నుండి భోజనశాలకి దారి తీసారు. శారదమ్మ కూడా వారితో కలిసి పోయింది. శారదమ్మని అందరూ చుట్టు ముట్టారు. వారిలోని ఆనందాన్ని ఆమెకి ఇస్తున్న కరచాలనం ద్వారా తెలియజేస్తున్నారు.

శారదమ్మ చేసిన ప్రసంగం చాలా బావుందని, తమలో ఎంతో ఉత్సాహాన్ని ఈ ప్రసంగం నింపిందని నేరుగా శారదమ్మతోనే చాలా మంది అన్నారు కూడా. వారి మాటలకి, పొగడ్తలకి చిరునవ్వుతో మాత్రమే సమాధానం చెప్పడం కేవలం  శారదమ్మకి మాత్రమే సాధ్యమేమో.

భోజనం అనంతరం మరికొన్ని సాహిత్య కార్యక్రమాలని ఏర్పాటు చేశారు. వాటిని కూడా అందరూ ఎంతో ఆనందంగా చూశారు. అయితే శారదమ్మ ప్రవచనం ముందు ఆ

కార్యక్రమాలన్నీ వెలవెలబోయినట్టు అనిపించింది చూసే వారికి, అలాగే ఆ కార్యక్రమాలని చేసే వారికీనూ..

శారదమ్మ కూడా వారందరితో పాటు ఆ కార్యక్రమాలని తిలకించింది.. సాయంత్రం వరకూ జరిగిన కార్యక్రమాలు ముగిసిన తర్వాత అందరూ శారదమ్మ దగ్గర సెలవు తీసుకుని అక్కడి నుండి బయలుదేరారు, ఆనంద స్వరూప్, సాయిరాం మరి కొందరు సంస్థ సభ్యులు మాత్రమే ఉండిపోయారు.

శారదమ్మ దగ్గర సెలవు తీసుకున్న ప్రతీ ఒక్కరూ ఆమెకి తమ ప్రత్యేక కృతజ్ఞతలు తెలపడం ఆనంద స్వరూప్ దృష్టిని దాటిపోలేదు.. దాంతో ఆయన ఆనందానికి అవధులు లేకుండా పోయింది..

అమెరికాలో శారదమ్మ చేసిన మొదటి ప్రసంగానికి ఇంత పెద్ద స్పందన వస్తుందని ఆయన కూడా ఊహించలేదు. ఆ స్పందనకి ఆయన కూడా కొద్దిగా షాక్‌కి గురయ్యాడు. అయితే మొదటి ప్రసంగానికి వచ్చిన ఈ స్పందనని దృష్టిలో ఉంచుకుని మిగతా చోట్లలో ఏర్పాటు చేసే కార్యక్రమాలలో కొన్ని మార్పులు చేసేందుకు ఆ కమిటీలోని వారందరినీ ఆగమని ఆనంద స్వరూప్ చెప్పడంతో వారందరూ ఆగిపోయారు.

.........................

కొన్ని కార్యక్రమాలు దిగ్విజయంగా జరగడానికి మానవ కృషి తో పాటు ఆ భగవంతుడి అనుగ్రహం కూడా తోడవ్వాలి. భగవంతుడి అనుగ్రహం ఉన్న ఏ కార్యక్రమమైనా చరిత్రని సృష్టించితీరుతుందని చెప్పటానికి శారదమ్మ ప్రసంగం ఒక ఉదాహరణగా నిలుస్తుంది.

శారదమ్మ చేసిన తొలి ప్రసంగం తాలుకు వీడియో సోషల్ మీడియాలో ఎంతో ప్రాముఖ్యాన్ని సంపాదించుకుంది. శారదమ్మ ప్రసంగాన్ని కొందరు తమ తమ మోబైల్స్‌లో వీడియో తీసి దాన్ని యూ ట్యూబ్‌లో అప్‌లోడ్ చేయడం, ఫేస్‌బుక్‌లలో షేర్ చేయడం చేసారు.

యూట్యూబ్‌లో అప్‌లోడ్ చేసిన శారదమ్మ వీడియోకు అనూహ్యంగా లక్షల సంఖ్యలో నెటిజన్లు తిలకించారు. అలాగే ఫేస్‌బుక్, ట్విట్టర్‌లాంటి సోషల్ నెట్‌వర్క్ సైట్‌లో శారదమ్మ ప్రసంగం వీడియో పెను సంచలనాన్నే సృష్టించింది. లక్షలాది షేర్స్, లైక్‌లతో దూసుకుపోయింది ఆమె ప్రసంగానికి సంబందించిన వీడియో.

దాంతో ఒక్క అమెరికాలోనే కాకుండా ప్రపంచం యావత్తూ ఆ వీడియోని తిలకించారు. కొందరు ఔత్సాహికులు తెలుగులో ఉన్న శారదమ్మ ప్రసంగాన్ని ఆయా భాషలలోనికి ట్రాన్స్‌లేట్ చేసి పెట్టడంతో భాషా భేదం లేకుండా ఆమె ప్రసంగాన్ని అందరూ విన్నారు.

అదొక పెను సంచలనం.. ఒక అద్భుతం.. నెట్ చరిత్రలో అప్పటి వరకూ సినిమా రంగానికి సంబంధించిన వీడియోకు, లేదంటే ప్రఖ్యాత పాప్ సింగర్ల తాలుకూ ఆల్బమ్స్ కి మాత్రమే విపరీతమైన క్రేజు లభించేది. కానీ.. శారదమ్మ ప్రసంగం తాలుకు వీడియో వాటికంటే రెట్టింపు వ్యూయర్స్‌ని సంపాదించింది.

అప్‌లోడ్ చేసిన రోజునే లక్షలాది మంది వీక్షించడంతో శారదమ్మ పేరు దశదిశలా మారుమ్రోగిపోయింది. దీంతో ఆమె గురించి తెలుసుకోవాలని ఎంతో మంది ఆసక్తి కనబరిచారు. శారదమ్మ జీవిత విశేషాలని ఆనంద స్వరూప్ ద్వారా తెలుసుకున్న ఒక సాఫ్ట్‌వేర్ ఇంజనీర్, ఆ విశేషాలని వికీపీడియాలో అప్‌లోడ్ చేయడంతో ఆ పేజీని కూడా లక్షలాది మంది తిలకించారు.

గూగుల్ సెర్చ్ ఇంజన్‌లోనూ శారదమ్మ గురించి తెలుసుకునే వారి సంఖ్య అనూహ్యంగా పెరిగిపోయింది. ఒక ఆధ్యాత్మిక ప్రసంగానికి ఇంత పెద్ద స్పందన రావడం బహుశా గతంలో ఎప్పుడూ జరగలేదేమో.. అందుకే శారదమ్మ ప్రసంగం పెను సంచలనమై కూర్చుంది.

ఆమె చేసిన భగవద్గీత ప్రసంగాన్ని విశ్లేషించి, ఆ ప్రసంగంలో నిగూఢంగా దాగి ఉన్న, సమాజ సంస్కరణకై ఉద్దేశించే, సారాంశాన్ని వివరంగా పొందుపరిచారు మరి కొందరు రచయితలు,

విశ్లేషకులు. దానితో  అటు అమెరికాలోనే కాదు, ఇటు ఇండియాలో సైతం శారదమ్మ పేరు మారుమ్రోగిపోయింది.

ఇక  తెలుగు మీడియా లో శారదమ్మ ప్రసంగానికి ప్రత్యేక స్థానం కల్పించారు. శారదమ్మ ప్రసంగం సోషల్ మీడియా లో ఎంతలా సంచలనం  సృష్టించిందో  ప్రత్యేక కార్యక్రమాల ద్వారా తెలుగు ప్రేక్షకులకు అందించాయి కొన్ని న్యూస్ చానెల్స్ . అంతేకాదు జాతీయ, అంతర్జాతీయ మీడియా  సైతం శారదమ్మ ప్రసంగానికి వచ్చిన స్పందనని విశేషంగా కవరేజ్ చేసింది.

అలా ఎక్కడో అమెరికాలో చేసిన ఆమె ప్రసంగానికి ఇంతలా వచ్చిన ప్రతిస్పందన వస్తుందని ఎవరూ ఊహించలేదు.

మరొక వైపు శారదమ్మని అమెరికాకి తీసుకురావడానికి  ప్రత్యేక శ్రద్ధ కనబరిచిన ఆనందస్వరూప్‌ని సైతం ఎంతో మంది అభినందించారు.

ఆనంద స్వరూప్ గనుక ఇంతటి చొరవ కనబరచకపోతే శారదమ్మ ప్రసంగాన్ని వినే భాగ్యాన్ని తాము పొందేవారు కాదని చాలా  మంది అభిప్రాయపడ్డారు. తమ సందేశాన్ని  ఇమెయిల్స్ రూపంలోనూ,ఫేస్ బుక్ , ట్విట్టర్లలో ఉన్న ఆనంద స్వరూప్ ఎకౌంట్‌లోనూ ప్రత్యేకంగా ప్రస్తావించారు. ఆనంద స్వరూప్‌కి పరిచయం ఉన్న వారు ఫోన్ చేసి మరీ ఆయనని అభినందించారు.

అయితే శారదమ్మ ప్రసంగాన్ని లక్షలాది మంది అభినందించడమే కాదు, మరి కొంత మంది ఆమె ప్రసంగాన్ని విమర్శించారు కూడా.. ఆమె ప్రసంగంలో పెద్ద విశేషం ఏమీ లేదని, ఇదొక పబ్లిసిటీ స్టంట్ అని , శారదమ్మకి పేరు ప్రఖ్యాతులు  తీసుకురావడం  కోసం కొంతమంది చేసిన కుట్రే ఇదనీ, ఇలా శారదమ్మకి పబ్లిసిటీ తీసుకువచ్చి ఆధ్యాత్మిక ముసుగులో కోట్లాది

రూపాయలని సంపాదించాలన్న దురాశతోనే  ఇంతటి హైప్‌ని తీసుకువచ్చారని కొంతమంది తమ అభిప్రాయాన్ని తెలియజేశారు.

అలా తెలియజేసిన వారిలో హిందూ మతానికి  సంబంధించిన కొందరు ఆధ్యాత్మిక వేత్తలు ప్రధానంగా ఉండడం ఇక్కడ విశేషంగా చెప్పుకోవాల్సిన విషయం. ఎవరో ఒక అనామకురాలు ఒకే ఒక్క ప్రసంగంతో ప్రపంచ వ్యాప్తంగా  గుర్తింపు పొందడంతో ఓర్వలేక కొందరు ఇలాంటి ప్రచారానికి పూనుకున్నారు . ఎక్కడ తమ ఉనికికి శారదమ్మ ద్వారా ప్రమాదం ఏర్పడుతుందో అన్న భయంతో మరి కొందరు ఈ ప్రచారాన్ని  మరింత ముందుకు తీసుకుపోవడానికి తగిన ప్రణాళికలు  సైతం సిద్ధం చేసుకున్నారు.

ఒక వైపు శారదమ్మ సందేశానికి వచ్చిన స్పందనని చూసి ఆనందంతో ఉప్పొంగిపోయిన ఆనంద స్వరూప్ మరో వైపు ఆమెకి వ్యతిరేకంగా సాగుతున్న ఈ ప్రచారానికి  ఒకింత ఆందోళన చెందాడు. అయితే మంచి ఎక్కడుంటుందో దానిని అంటి పెట్టుకుని చెడు కూడా తన ఉనికిని తెలపడానికి ప్రయత్నం చేస్తుందన్న సత్యం ఆయనకి తెలుసు  కాబట్టి మొదట్లో కాస్త ఆందోళన చెందిన తరువాత తరువాత  కొద్దిగా స్థిమిత పడ్డాడు.

అయితే శారదమ్మ చేయాల్సిన ప్రసంగాల తాలూకు  కార్యక్రమాలు మరి కొన్ని ఉండడం, మొదటి ప్రసంగానికే ఇంత రెస్పాన్స్ రావడంతో  తరువాత ఆమె చేసే  ప్రసంగానికి ఎంతటి క్రేజు ఏర్పడిందో  ఆయనకి అర్థమయిపోయింది.

ఆమె చేయబోయే రెండవ ప్రసంగం కోసం కోట్లాది మంది ఎదురు చూస్తున్నారన్న  ఊహ ఆయనకి కొద్దిగా ఆందోళన కలిగించింది.

అయితే భగవత్సంకల్పం తో అనూహ్య రీతిలో జరుగుతున్న ఈ పరిణామానికి మానవమాత్రులు  ఏమీ చేయలేరని, ఆధ్యాత్మిక ప్రపంచంలో ఒక కొత్త ఒరవడిని సృష్టించిన శారదమ్మ ప్రసంగానికి అడ్డుకట్ట వేసేవారెవరు  ఉండబోరన్న విషయం మాత్రం ఆయనకి స్పష్టం అయ్యింది. ఎంత మంది ఎన్నిరకాల  విమర్శలు  చేసినప్పటికీ ఒక సత్సంకల్పం తో

ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమాలు తప్పకుండా విజయం సాధిస్తాయన్న నమ్మకం ఆయనకి కలిగింది.

తనకి వస్తున్న ప్రశంసలకి ఒక విధమైన ఆనంద పారవశ్యంలో మునిగితేలుతున్న ఆనంద స్వరూప్ మొబైల్‌కి ఒక ఫోన్ కాల్ వచ్చింది..

ఫోన్ లిఫ్ట్ చేసి ''హలో'' అన్నాడు...

''నేను.. రామానుజాచార్యుల వారిని ..'' అవతలి నుండి గంభీరంగా గొంతు వినిపించడంతో ఆనంద స్వరూప్ ఉలిక్కిపడ్డాడు. మొట్టమొదటి సారి రామానుజాచార్యులు తనకి ఫోన్ చేయడంతో ఎంతో ఆశ్చర్యానికి గురయ్యాడు.

ఏం మాట్లాడాలో అర్థం కాలేదు..

''ఆ.. నమస్కారం గురువు గారు.. చెప్పండి ..'' అని మాత్రం అనగలిగాడు..

''మీతో మాట్లాడాలి.. అర్జెంటుగా టెంపుల్‌కి రండి ..'' క్లుప్తంగా చెప్పి ఫోన్ కట్ చేశాడు రామానుజాచార్యులు.

ఆయన గొంతులో పలికిన గాంభీర్యానికి ఆనంద స్వరూప్ అవాక్కయ్యాడు.

రామానుజాచార్యులు వచ్చిన ఈ పాతికేళ్ళలో ఆనంద స్వరూప్‌తో నేరుగా ఫోన్‌లో మాట్లాడటం అదే మొదటి సారి.. ఆయనే నేరుగా ఫోన్ చేసి తనని మందిరానికి రమ్మనడం ఆనంద స్వరూప్‌కి మరింత ఆందోళన కలిగింది. ఆలయానికి సంబంధించిన ఏదయినా విషయం తనతో మాట్లాడాలంటే తన శిష్యులతో కబురు పెట్టేవారు. అలాంటిది ఆయనే స్వయంగా తనకి ఫోన్ చేయడం, ఉపోద్ఘాతం లేకుండా నేరుగా తనని మందిరానికి ఆహ్వానించడంతో ఆనంద స్వరూప్ మనసు కీడుని శంకించింది.

అయితే ఆయన ఫోన్ చేయడానికి కారణం మాత్రం శారదమ్మే అని అర్థమయింది.

గతంలో శారదమ్మతో ఆయన గొడవపెట్టుకోవడం ఆనంద స్వరూప్‌కి తెలుసు.

పాతికేళ్ళుగా తాను ప్రధాన పూజారిగా ఆలయంలో ఉన్నప్పటికీ, అమెరికాలో ఉన్న హిందువుల ఇళ్ళల్లో చేసే దైవ కార్యాలకి తానె వెళ్లి చేసినా కూడా రానటువంటి పేరు ప్రఖ్యాతులు శారదమ్మకి ఒకే ఒక్కరోజులో రావడం తో ఆయన కలత చెందాడేమో అన్న ఆలోచనతో ఆనంద స్వరూప్ లో ఒకింత భయం ప్రవేశించింది.

రామానుజాచార్యులకి, శారదమ్మకి మధ్య జరిగిన గొడవకి సంబంధించి ఆనంద స్వరూప్‌కి ముందుగానే తెలిసినప్పటికీ ఆయన పెద్దగా పట్టించుకోలేదు. ఎందుకంటే వేదాలలోనూ, శాస్త్రాలలోనూ ఎంతో అనుభవం గడించిన రామానుజాచార్యులు ఈర్ష్య తో శారదమ్మని ఛీత్కరించుకునేటంత స్థాయికి దిగజారదన్న నమ్మకంతోనే ఆ విషయాన్ని పెద్దగా పట్టించుకోలేదు ఆనంద స్వరూప్..

కానీ.. ఇప్పుడు అలా కాదు.. మందిరానికి వచ్చిన ప్రతీ భక్తుడు శారదమ్మ గురించి ఆరా తీయడం, ఆమెని కలుసుకోవడం, ఆమెతో ఫోటోలు దిగడం ఇవన్నీ రామానుజాచార్యుల దృష్టికి రాకుండ ఉండవు. దానితో సహజంగానే ఆయన అహం దెబ్బతింటుందని చెప్పడంలో ఎలాంటి సందేహం లేదు. శారదమ్మకి ఏర్పడ్డ పాపులారిటి అంత ఇంత కాదు, ఆ పాపులారిటీలో కనీసం పదోవంతయిన ఆయనకి రాలేదన్న బాధ ఆయనలో ఉంటుంది. ఈ విషయం గురించి మాట్లాడటానికే నేరుగా ఆయన తనకి ఫోన్ చేసారేమో అన్న ఊహతో ఆనంద స్వరూప్ శరీరం సన్నగా జలదరించింది.

రామానుజాచార్యులు తనకి ఫోన్ చేశారన్న విషయాన్ని సాయిరాం కి చెప్పాడు ఆనంద స్వరూప్. వెంటనే సాయిరాం ని కూడా మందిరానికి బయలుదేరి రమ్మని చెప్పి తాను కూడా మందిరానికి బయలుదేరాడు .. ఆయన మనసులో రకరకాల ఆలోచనలు , ఆ ఆలోచనలు సృష్టించే ఆందోళనతోనే కారుని వేగంగా మందిరానికి పోనిచ్చాడు.

......................

శారదమ్మ మొదటి ప్రసంగం చేసి అప్పటికి రెండు రోజులయింది. ఆమె ప్రసంగం సృష్టించిన సంచలనానికి శారదమ్మ సెంటర్ ఆఫ్ ఎట్రాక్షన్ అయిపోయింది. సహజంగానే దేవాలయానికి వచ్చే భక్తులు కొందరయితే ప్రత్యేకంగా శారదమ్మని చూడాలని వచ్చే వారి సంఖ్య కూడా పెరిగింది. దానితో శారదమ్మ ఎక్కువగా గుళ్ళోనే ఉంటోంది.

తనని చూడాలని, తనతో మాట్లాడాలని వచ్చే వారిని నిరుత్సాహ పరచకుండా వారితో ఆనందంగా మాట్లాడుతూ వారికున్న సందేహాలని సైతం తీర్చుతోంది.

ఆమె ప్రసంగాన్ని యూట్యూబ్‌లో చూసిన వారు కొందరు, ఆమెని ప్రత్యక్షంగా కలిసిన తరువాత ఆమె నిరాడంబరతత్వానికి ఎంతో ఆశ్చర్యపోతున్నారు. తాను చేసిన ప్రసంగం పెను సంచలనం సృష్టించిందని, ప్రస్తుతం తానూ సెంటర్ ఆఫ్ ఎట్రాక్షన్ అయ్యానన్న విషయం శారదమ్మ ఏమాత్రం పట్టించుకోలేదు.

ఆమెకి వచ్చిన పేరు ప్రఖ్యాతులు ప్రకటించాలని కొందరు చేసిన ప్రయత్నాన్ని ఆమె సుతారంగా వారించింది.

తాను పేరు ప్రఖ్యాతుల కోసం ప్రసంగాలు చేయడం లేదని, కేవలం భగవంతుని ఆజ్ఞ ప్రకారమే తాను నడుచుకుంటున్నానని వినయంగా ఆమె చెప్పే సమాధానాలకు ఎంతో ఆశ్చర్యపోయారు.

ఆ సమాధానంతో ఆమెపై మరింత గౌరవం పెరిగింది వారికి.

ఇక కొన్ని లోకల్ మీడియా వారు సైతం శారదమ్మతో ఇంటర్వ్యూ తీసుకోవడానికి ఉత్సాహాన్ని కనబరిచారు.

కానీ శారదమ్మ సుతారంగా వారందరినీ వారించింది.

ప్రచార ఆర్భాటాల కోసం తాను ప్రసంగాలు చేయడం లేదని సూటిగా చెప్పడంతో మీడియా వారికి ఏం చేయాలో పాలుపోలేదు. ఎలాగైన్న ఆమెతో ఇంటర్వ్యూ తీసుకోవాలని ఆశగా వచ్చిన వారికి నిరాశే ఎదురు కావడంతో నిరుత్సాహం తో వెనుదిరిగి పోయారు.

సాయంత్రం ఆరున్నర కావొస్తుంది..

ఆలయంలో ఉన్న ప్రధాన దేవత మూర్తులందరికీ సాయంకాల  పూజ అయిపోయింది.

మందిరం భక్తులతో కిటకిటలాడుతోంది. కొంత మంది భక్తులు  శారదమ్మ చుట్టూ కూర్చుని ఉన్నారు. ఆమెతో ఆనందంగా మాట్లాడుతూ

ఆమె చెప్పే విషయాలని  ఆసక్తిగా వింటూ తమ మొబైల్ ఫోన్లలో ఆమె మాటలని షూట్ చేస్తున్నారు.

ఆ సమయంలో రామానుజాచార్యుల వారి  శిష్యుడు శారదమ్మ దగ్గరికి వచ్చాడు.

''అమ్మా.. మిమ్మల్ని గురువు గారు పిలుస్తున్నారు.. ఆ గదిలో ఉన్నారు.. వెళ్లండి ..'' అంటూ వినయంగా తెలిపాడు.

శారదమ్మ ఎంతో ఆశ్చర్యపోయింది.. అసలు  తనతో మాట్లాడటానికే విముఖత చూపించే వ్యక్తి తనని పిలవడం ఏమిటన్న ప్రశ్న ఆమెని ఉక్కిరిబిక్కిరి చేసింది.

భక్తుల  దగ్గర సెలవు తీసుకుని ఆ శిష్యుడు చూపించిన గది వైపు అడుగులు  వేసింది.

సరిగ్గా అదే సమయంలో ఆలయం ముందు ఆనంద స్వరూప్ కారు ఆగింది. అప్పటికే ఆనంద స్వరూప్ రాక కోసం ఎదురు చూస్తున్న సాయిరాం  కారు దగ్గరికి పరిగెత్తుకుంటూ వచ్చాడు.

ఆనంద స్వరూప్ కారు పార్క్‌చేసి బయటికి వచ్చాడు.

ఆయన ముఖం లో కనిపిస్తున్న ఆందోళనని గమనించిన సాయిరాం అవాక్కయ్యాడు.

ఎప్పుడూ చిరునవ్వు చిందిస్తూ.. ఎంత టెన్షన్ ఉన్నప్పటికీ ముఖం లో ఆ భావాలు కనిపించకుండా ఉండే ఆనంద స్వరూప్ గారి ముఖం  వివర్ణం కావడం మొదటి సారి చూస్తున్నాడు  సాయిరాం ..

అతనికి ఏం మాట్లాడాలో తెలియక ఒక వెర్రినవ్వు నవ్వి ''హలో సర్..'' అన్నాడు..

''హలో..'' ముఖం లోకి చిరునవ్వు తెచ్చిపెట్టుకుంటూ బదులిచ్చాడు ఆనంద స్వరూప్..

‘‘గురువు గారు ఆలయంలోనే ఉన్నారు..’’ చెప్పాడు సాయిరాం ..

‘‘అలాగా..’’ ముక్తసరిగా బదులిస్తూ ఆలయం ఆవరణలో ఉన్న వాటర్ టాప్ దగ్గరికి నడచి కాళ్ళు కడుక్కున్నాడు..

ముఖం పై కూడా నీళ్ళు చల్లుకున్నాడు.

కర్చీఫ్‌తో ముఖం తుడుచుకుని గాఢంగా ఒక నిట్టూర్పు విడిచి సాయిరాం వంక చూశాడు ఆనంద స్వరూప్..

‘‘సర్.. మీతో ఉన్న ఇన్ని రోజుల పరిచయంలో మీ ముఖం లో ఇంతటి టెన్షన్‌ని నేనెప్పుడూ గమనించలేదు..

అసలేం జరిగింది..? నన్ను వెంటనే ఇక్కడకి ఎందుకు పిలిపించారు..?’’ ఆత్రంగా అడిగాడు సాయిరాం..

ఆనంద స్వరూప్ సాయిరాం వంక చూసి చిన్నగా నవ్వాడు.

‘‘గురువుగారు ఫోన్ చేసి వెంటనే రమ్మని చెప్పారు ..’’ క్లుప్తంగా అన్నాడు.

ఆ మాటలకి అదిరిపడ్డాడు సాయిరాం..

‘‘ఏమిటీ..? గురువుగారు ఫోన్ చేసారా ..?’’ ఆ మాటల్లో విస్మయం, ఆతని ముఖం లో ఆశ్చర్యం స్పష్టంగా కనిపించాయి.

‘‘అవును.. ఆయన నాకు స్వయంగా ఫోన్ చేసి రమ్మనడం ఇదే మొదటి సారి.. గతంలో ఎప్పుడూ ఆయన నాకు ఫోన్ చేయలేదు’’ చిన్నగా నవ్వుతూ అన్నాడు ఆనంద స్వరూప్.

ఆనంద స్వరూప్ ముఖం లో కనిపిస్తున్న ఆందోళనకి అర్థమేమిటో అప్పుడు అర్థమయింది..

‘‘సర్.. గురువుగారు స్వయంగా ఫోన్ చేసి రమ్మన్నారంటే.. ఖచ్చితంగా శారదమ్మ విషయమే అయి ఉంటుంది..’’

ఆందోళనగా అన్నాడు సాయిరాం..

‘‘అవును.. నాక్కూడా  అదే అనిపిస్తుంది.. కానీ.. శారదమ్మ విషయాన్ని ఆయన ఇంత సీరియస్‌గా తీసుకుంటాడని నేను ఊహించలేదు..’’

‘‘గురువుగారు శారదమ్మ విషయాన్ని ఎప్పుడూ సీరియస్‌గానే తీసుకున్నాడు. కాకపోతే ఇప్పుడు బయట పడ్డారు..

శారదమ్మతో గొడవపడిన విషయం మీకు తెలిసిందే కదా..’’ సాయిరాం  కంఠం సన్నగా కంపిస్తుంది. ఆనంద స్వరూప్ కంటే ఎక్కువగా సాయిరాం  ఆందోళన చెందుతున్నాడని ఆయన మాటల్లోనే అర్థమవుతుంది..

ఆనంద స్వరూప్ గట్టిగా నిట్టూర్పు విడిచారు..

‘‘పరిస్థితి ఇంత దూరం వస్తుందని నేనూహించలేదు. అయినా శారదమ్మకి వస్తున్న పాపులారిటీని చూసి ఆయన తట్టుకోలేనట్టుగా ఉంది.. ఇది సహజమే కదా.. పాతికేళ్ళనుండి తాను  భగవంతుని సేవలో ఉన్నా రానటువంటి పేరు ప్రఖ్యాతులు,  ఒక్క ప్రసంగంతోనే శారదమ్మ స్వంతం చేసుకుంటే ఆయనకి బాధగానే ఉంటుంది కదా..!’’ మనసులోని ఆందోళన తగ్గించుకునేందుకు ఆనంద స్వరూప్ ప్రయత్నిస్తున్నాడు.

‘‘అదీ నిజమే.. మరి.. ఇప్పుడెలా సార్..’’ సాయిరాం కి  మాత్రం ఆందోళన పెరుగుతూనే ఉంది.

సాయిరాం  వంక చూశాడు ఆనంద స్వరూప్.. అతను పడుతున్న టెన్షన్ అతని ముఖం లో స్పష్టంగా కనిపిస్తుండడంతో చిన్నగా నవ్వుతూ భుజంపై చేయివేసాడు ఆప్యాయంగా..

‘‘మనం టెన్షన్ పడ్డా  ప్రయోజనం ఏమీలేదు. ఎలా జరగాలో ఆ భగవంతుడు నిర్ణయిస్తాడు.. కాక పోతే రామానుజాచార్యుల వంటి మహనీయులకి సైతం ఈర్ష్య ద్వేషాలు  ఉంటాయని నేననుకోలేదు. అసలు  అలాంటి ఊహ కూడా నా  మనసులోకి రానేలేదు. అందుకే దానిని గురించి ఎక్కువగా ఆలోచించలేదు..’’ ఆనంద స్వరూప్ గొంతులో ఆశ్చర్యం..

సాయిరాం  అవునన్నట్టుగా తల  పంకించాడు.. ఆ తర్వాత  కొద్దిగా సర్దుకుని..

''అయినా.. ఈ రోజుల్లో ఎంతటి మహనీయులైనా పబ్లిసిటీ కోసం ప్రాకులాడటం మనం చూస్తూనే ఉన్నాము కదండి ..'' అన్నాడు సాయిరాం..

''అవుననుకో.. కానీ..రామానుజాచార్యుల వారు కూడా ఆ కోవలోకే వస్తారని నేననుకోలేదు.. శారదమ్మ గురించి నేరుగా ఆయన ప్రస్తావిస్తే ఏం సమాధానం చెప్పాలో అర్థం కావడం లేదు..'' తీవ్రంగా ఆలోచిస్తున్నట్టుగా అన్నాడు ఆనంద స్వరూప్..

సాయిరాం కి కూడా ఏమీ తట్టలేదు.. ఒకవైపు ఆలయ ప్రధాన పూజారి, మరో వైపు ఆధ్యాత్మికతని కొత్త పుంతలు తొక్కిస్తున్న మహా శక్తిమంతురాలు .. వీరిద్దరి మధ్య విభేధాలు వస్తే .. మామూలు మనుషులం తామెలా పరిష్కరిస్తాం..

అదే విషయాన్ని ఆనంద స్వరూప్ ముందు ఉంచాడు సాయిరాం..

ఆనంద స్వరూప్ చిన్నగా నవ్వాడు..

''ఇద్దరూ మనకి ముఖ్యమే.. ఇద్దరిలో ఎవరినీ మనం వదులుకోలేము.. అలాగని ఇద్దరి మధ్య ఏర్పడ్డ అగాధాన్నీ మనం పూడ్చలేము.. ఇదొక సంకట పరిస్థితి.. లోనికి వెళితే ఎలాంటి పరిణామాన్ని ఎదుర్కోవాలో అన్న భయం నాకుంది..'' ఆనంద స్వరూప్ ముఖం లో విచారం కనిపించింది..

సాయిరాం ఏమీ మాట్లాడలేదు.. ఆయన మెదడు మొద్దుబారి పోయినట్లయిపోయింది..

''దేవుడా.. దీనికి పరిష్కారమేమిటీ..? మాకు ఇంత పెద్ద పరీక్షని ముందు పెట్టావు కదయ్యా..'' ఆలయం గోపురం వంక చూస్తూ ఆవేదనగా అన్నాడు సాయిరాం ..

సాయిరాం మాటలని పట్టించుకోకుండా అన్నాడు ఆనంద స్వరూప్..

''ఇప్పుడు మన ముందున్న కర్తవ్యం ఒక్కటే.. రామానుజాచార్యుల వారు ఏం చెప్పినా వినడం తప్ప మనకి మరో మార్గం లేదు.. ఎందుకంటే ఆయన శాశ్వతంగా ఇక్కడే ఉండేవాడు.. శారదమ్మ అలా కాదు కదా.. అందుకే శారదమ్మ విషయంలో గురువుగారు ఏం నిర్ణయం తీసుకున్నా మనం శిరసా వహించాల్సిందే..'' భారంగా అన్నాడు ఆనంద స్వరూప్..

‘‘ఒక వేళ శారదమ్మని ఇండియాకి పంపించివేయమని గురువుగారు ఖచ్చితంగా ఆదేశిస్తే ..?’’ తన మనసులోని ప్రశ్నని ఆనంద స్వరూప్ ముందు పెట్టాడు..

ఆనంద స్వరూప్ సాయిరాం వంక చూసాడు.. ఆ చూపులో ఎలాంటి భావం లేదు.. ఒక నిర్జీవమైన నవ్వు నవ్వాడు..

‘‘ఆ ఆదేశాన్ని శిరసావహించడం తప్ప మనం చేయగలిగింది ఏమీ లేదు..’’ ఆయన గొంతులో బాధ గోచరించింది..

‘‘అలా అయితే శారదమ్మ ప్రసంగానికి చేసిన ఏర్పాట్ల సంగతి ఏమిటి..? ఇప్పటికే శారదమ్మ ప్రసంగాన్ని వినడానికి అందరూ మానసికంగా సిద్ధపడిపోయారు. ఉన్న పళంగా ప్రసంగాలు క్యాన్సిల్ చేశామని చెబితే వారి నుండి ఎంతటి వ్యతిరేకత వస్తుందో ఊహించలేం .. ఒకే ఒక్క ప్రసంగంతో శారదమ్మ ఎంతటి సంచలనం సృష్టించిందో చూశారు కదా.. ఒక వేళ ఆమె ప్రసంగాల కార్యక్రమాలని మనం అర్ధాంతరంగా రద్దు చేస్తే .. లక్షలాది మందిలో ఆమెపై ఉన్న అభిమానం కాస్తా కోపంగా మారుతుంది.. ఒక్క ప్రసంగంతో వచ్చిన పబ్లిసిటీతో శారదమ్మలో గర్వం ప్రవేశించిందని, అందుకే మిగతా కార్యక్రమాలన్నింటినీ రద్దు చేసుకుందన్న ప్రచారం కూడా అంతే వేగంగా జరుగుతుంది.

అప్పుడు శారదమ్మ పై ప్రశంసలు కురిపించిన వారు సైతం ఆమెని తీవ్రంగా విమర్శించడం మొదలు పెడతారు. దాంతో శారదమ్మకి ఎంత నష్టం వాటిల్లుతుందో ఊహించలేం ..? ఇక భవిష్యత్తులో ఆమె ప్రసంగాలు చేయడానికి అవకాశం కూడా ఉండదు.. తనకి జరిగిన అవమానాన్ని శారదమ్మ ఎలా జీర్ణించుకుంటుంది..? చూస్తూ చూస్తూ ఆమెకి ఇంతటి అపకీర్తిని తెచ్చిపెట్టిన పేరు మీకే వస్తుంది కదా..?’’ సాయిరాం అన్న మాటలకి ఆనంద స్వరూప్ విపరీతంగా కదిలిపోయాడు..

ఎక్కడో ఇండియాలో తన మానాన తాను సాయిన్నాదుడి కి సేవ చేస్తూ తృప్తిగా గడుపుతున్న శారదమ్మని, ఇంత దూరం తీసుకువచ్చింది ఆమెని అవమాన పరచడానికేనా..? ఆమె వ్యక్తిత్వానికి మాయని మచ్చని తెచ్చి పెట్టడానికేనా ..?

ఆనంద స్వరూప్ మనసులో మెదిలిన ఈ ప్రశ్నలు ఆయనని ఉక్కిరిబిక్కిరి చేశాయి..

ఏం చేయాలో ఒక్క క్షణం అర్థం కాలేదు..

మెదడు మొద్దుబారిపోయినట్టుగా అనిపించింది..

ఇద్దరూ కాసేపు మౌనంగా ఉండిపోయారు..

ఆలయం వెలుపలే దీర్ఘాలోచనలో ఉన్న వారిని చూసి ఆలయ సిబ్బంది కొందరు ఆశ్చర్యపోయారు.. ఆనంద స్వరూప్‌ని గమనించిన మరికొందరు ఆయన దగ్గరికి వచ్చారు..

''గుడీవినింగ్ సర్.. ఆలయంలోకి ప్రవేశించకుండా ఇక్కడే ఆగిపోయారేమిటి..?'' ఒక ఆలయ సిబ్బంది అక్కడకి వచ్చి అన్నాడు..

ఆలోచనలో నుండి తేరుకుని అతని వంక చూసి చిన్నగా నవ్వాడు ఆనంద స్వరూప్..

''మరేమీ లేదు.. అర్జెంట్ ఫోన్ ఒకటి అటెండ్ చేయాలి... ఆలయంలో ఫోన్ మాట్లాడితే బాగోదు కదా.. అందుకే కాల్ కోసం వెయిట్ చేస్తున్నాను..'' నవ్వుతూ అన్నాడు ఆనంద స్వరూప్..

''ఓ.. అలాగా.. క్యారీ ఆన్ సర్..'' వినయంగా అంటూ అక్కడ నుండి అతను వెళ్ళిపోయాడు..

సాయిరాం కి ఆనంద స్వరూప్ పడుతున్న బాధ తెలుస్తోంది.. ఆయనని చూస్తే ఎంతో జాలి అనిపించింది..

ఆనంద స్వరూప్ కళ్ళు మూసుకున్నాడు.. రకరకాల ఆలోచనలతో ఉక్కిరిబిక్కిరి చేస్తున్న మనసుని తన అదుపులోకి తీసుకునేందుకు ప్రయత్నిస్తున్నాడు.. మెల్లి మెల్లిగా మనసులో

ప్రశాంతత చోటుచేసుకుంటుంది.. మెదడులో అలజడులు  రేపుతున్న ఆలోచనలన్నీ అదృశ్యమైపోయి సమస్యకి పరిష్కారం  చూపే  దిశగా సాగిపోతుంది..

కొన్ని దైవ కార్యాలు మొదలుపెట్టాక  కొన్ని పరీక్షలని కూడా ఎదుర్కోవలసి వస్తుంది.. ఆ పరీక్షలు సృష్టించిన  విపత్కర పరిస్థితులకి తలొగ్గి కార్యాన్ని మధ్యలోనే ఆపేస్తారా ..? లేదంటే ఆ పరిస్థితులని ఎదుర్కొని కార్యాన్ని  దిగ్విజయంగా పూర్తి చేస్తామా .? అని ఆ దేవుడు గమనిస్తుంటాడు..

ఎన్ని ఆటంకాలు  ఎదురయిన  కార్యాన్ని  పూర్తి చేయాలన్న సంకల్పం  ఉంటే.. ఆ దేవుడే స్వయంగా విషమ పరిస్థితులన్నింటినీ చక్కబెడతాడు .. అలాగని వెనుకడుగు వేస్తే  ఇంక దేవుడు మాత్రం చేసేదేముంది.. ఓ నవ్వు నవ్వి ఊరుకుంటాడు..

సంకల్పానికి ఉన్న శక్తి దేవుడ్ని సైతం ఎదురిస్తుంది.. ఎందుకంటే.. ఆ సంకల్పం  ఆ దేవుడి కార్యం కోసమే సృష్టించబడింది కదా.. మరలాంటప్పుడు ఆ దేవుడే తన సంకల్పానికి అడ్డుతగిలితే..

ఊరుకుంటుందా..? ఊరుకోదు.. దేవుడ్ని సైతం ఎదుర్కొంటుంది.. ప్రస్తుతం తను చేయాల్సింది కూడా అదే..!

ఆనంద స్వరూప్‌లో ఎక్కడా లేని శక్తి ప్రవేశించినట్టుగా అయింది.. తన ముందున్న సమస్య తీవ్రత తగ్గింది..

ఎలాంటి పరిస్థితినయిన ఎదుర్కొనేలా మానసికంగా సిద్దపడిపోయాడు.. ఒక్కసారిగా ఆయనలో వచ్చిన మార్పుని గమనించి ఆశ్చర్యపోయాడు సాయిరాం..

సాయిరాం  వంక చూశాడు ఆనంద స్వరూప్.. సాయిరాం  తన వంకే ఆశ్చర్యంగా చూస్తూండడం గమనించి చిన్నగా నవ్వి.. అతని భుజం తట్టి మందిరం లోనికి నడిచాడు .. ఆయనని అనుసరిస్తూ ముందుకు కదిలాడు సాయిరాం ..

ఆ మందిరంలోని దేవుళ్ళందరినీ భక్తితో దర్శించుకున్నారు ఇద్దరూ.. ఆనంద స్వరూప్‌ని చూసి ప్రత్యేకంగా అర్చనాది కార్యక్రమాలని చేసి తీర్థప్రసాదాలు సమర్పిచారు ఆలయ పూజారులు ..

వాటిని  స్వీకరించి ఇద్దరూ ఒకచోట కూర్చున్నారు.. ఆలయంలో దేవుడిని దర్శించుకున్న తర్వాత ఆలయంలో కొద్దిసేపు కూర్చోవాలి .. అలా చేస్తే .. ఆ ఆలయంలో ఉండే పాజిటివ్ ఎనర్జీ శరీరంలోకి ప్రవేశించి మనిషిలో దాగి ఉన్న శక్తిని వెలికి తీస్తుందన్నది శాస్త్రం చెప్పిన విషయం కాదు.. వైజ్ఞానికంగా నిరూపమయిన సత్యం..

రెండు నిమిషాల  కూర్చున్న తరువాత ఇద్దరూ లేచారు. ఆనంద స్వరూప్ చూపులు రామానుజాచార్యులని  వెతికాయి..

ఆయన ఎక్కడా కనిపించకపోవడంతో ఆశ్చర్యపోయాడు ఆనంద స్వరూప్.

ఈ సమయంలో ఆయన మందిరంలోనే ఉంటాడు కదా.. అని అనుకుంటూ చుట్టూ చూశాడు.. సాయిరాం కూడా భయం భయంగానే రామానుజాచార్యుల  గురించి చుట్టూ చూస్తున్నాడు..

సరిగ్గా అదే సమయంలో అక్కడకి రామానుజాచార్యుల శిష్యుడు వచ్చాడు..

‘‘మీరు ఇక్కడ ఉన్నారా ..? గురువుగారు తన విశ్రాంతి గదిలో ఉన్నారు.. మీరు వస్తే పంపించమని చెప్పారు..’’ నవ్వుతూ అన్నాడు అతను..

అతని మాటలకి చిన్నగా నవ్వి ఆ గది వైపు అడుగు వేశారు ఇద్దరూ.. ఆనంద స్వరూప్ ఎంతో కాన్ఫిడెంట్‌గా కనిపిస్తున్నప్పటికీ, సాయిరాం  ముఖం లో మాత్రం ఆందోళనతో కూడిన భయం కనిపిస్తోంది.. ఎదురుగా కనిపిస్తున్న ఆ గదిని చూస్తూంటే.. రెండు కనిపించని శక్తులు  పెద్ద కర్రని పట్టుకుని నిలబడ్డట్టూ.. ఆ గదిలోకి వెళ్లగానే  తమ వీపుపై ఆ కర్రతో నాట్యం చేయడానికి సిద్దంగా ఉన్నట్టు ఊహ రావడంతో అదిరిపడ్డాడు సాయిరాం..

దడదడలాడుతున్న గుండెలో కాస్త ధైర్యాన్ని కూడ దీసుకుంటూ ఆనంద స్వరూప్ వెనకాలే గది దగ్గరకు వచ్చాడు సాయిరాం ..

వారగా వేసి ఉన్న తలుపులని తట్టాడు ఆనంద స్వరూప్..

లోపలి నుండి ''రండి ..'' అన్న పిలుపు వినగానే తలుపులని మెల్లిగా తెరిచి లోనికి వెళ్ళబోతున్న ఇద్దరూ ఎదురుగా కనిపించిన దృశ్యానికి కాళ్ళ క్రింద భూమి కంపిస్తుందా అన్నంతగా షాకైపోయారు..

ఎదురుగా.. రామానుజాచార్యుల వారితో పాటు శారదమ్మ కూడా ఉంది.

రామానుజాచార్యుల ఎదురుగా కూర్చుని ఉంది శారదమ్మ..

ఆ సమయంలో వార్నిద్దరినీ అలా చూడడంతో వారిలో తీవ్రమైన విభ్రాంతి చోటు చేసుకుంది.. శారదమ్మ ఏమిటీ..? అక్కడ ఉండడం ఏమిటీ..? వారికి ఏమీ అర్థం కాలేదు.. శారదమ్మపై తీవ్రమైన కోపంతో రగిలిపోతున్న రామానుజాచార్యుల ఎదురుగా శారదమ్మ ఉంటుందని కలలో కూడా ఊహించలేదు వాళ్ళు.. రెండు భిన్న ధ్రువాలు ఎదురెదురుగా ఉన్నట్టు అనిపించింది..

ఆనంద స్వరూప్ కొద్ది క్షణాలలోనే ఆ షాక్ నుండి తేరుకున్నప్పటికీ సాయిరాం మాత్రం ఇంకా షాక్‌లోనే ఉండిపోయాడు.. అతని ముఖమంతా చెమటలు పట్టేసింది..

శరీరం సన్నగా కంపిస్తుంది.. చేష్టలు దక్కి అలాగే నిలబడిపోయాడు..

అప్పటికే తేరుకున్న ఆనంద స్వరూప్ ముఖం లో చిరునవ్వు తెచ్చిపెట్టుకుని రామానుజాచార్యుల వారిని పలకరించాడు..

తన వెనకాలే కొయ్యబారిపోయి ఉన్న సాయిరాం వంక చూసి భుజం తట్టాడు ఆనంద స్వరూప్.. ఆ స్పర్శకి తేరుకున్న సాయిరాంకి ఏం చేయాలో అర్థం కాలేదు..

అర్జెంటుగా ఆ గదిలోనుండి పారిపోవాలన్న కోరికని బలవంతంగా ఆపుకుని రామానుజాచార్యుల వంక చూస్తూ ఒక వెర్రినవ్వు నవ్వాడు..

రామానుజాచార్యుల  ముఖం  గాంభీరంగా ఉంది..

అతని ముఖాన్ని చూశాక సాయిరాంలో ఉన్న ధైర్యం కూడా ఎగిరిపోయింది.. ఆ పరిస్థితిని తట్టుకోలేక తూలిపడబోయి ఆనంద స్వరూప్‌ని ఆసరాగా పట్టుకున్నాడు..

''రండి .. కూర్చోండి..'' గంభీరంగా అన్నాడు రామానుజాచార్యుల వారు..

ఆనంద స్వరూప్, సాయిరాం  ఇద్దరూ వచ్చి శారదమ్మ ప్రక్కనే ఉన్న సోఫాలో కూర్చున్నారు..

ఆనంద స్వరూప్ శారదమ్మ వంక చూశాడు.. ఆమె ముఖం లో ఎలాంటి భావమూ లేదు.. స్వచ్ఛమయిన చిరునవ్వుతో ఆనంద స్వరూప్‌ని పలకరించింది..

ఇద్దరిలోనూ విపరీతమైన ఆశ్చర్యం..

మాట్లాడాలన్న నోటివెంట మాటలు  రావడం లేదు వారిద్దరికీ.. ముందుగా రామానుజాచార్యుల వారు అన్నారు.

''ఆనంద స్వరూప్.. మిమ్మల్ని ఇక్కడ్నకి పిలిపించింది ఎందుకా అన్న దానికి రకరకాల ఆలోచనలతో ఉక్కిరిబిక్కిరి అవుతున్నట్టున్నారు..'' ఆనంద స్వరూప్ కళ్ళల్లోకి సూటిగా చూస్తూ అన్నాడు రామానుజాచార్యులు.

ఆనందస్వరూప్ ఉలిక్కిపడ్డాడు ఆయన మాటలకి.. అతని చూపు శారదమ్మపై పడింది.. ఆమె ముఖం లో చిరునవ్వు తప్ప మరెలాంటి భావం కనిపించలేదు.

''అవును' అన్నట్టుగా తలూపాడు ఆనంద స్వరూప్.

''మీరాలోచిస్తున్న దానికి విరుద్దమైన దృశ్యాన్ని చూస్తున్నానన్న ఆశ్చర్యం కూడా ఉంది కదూ..'' గంభీరమైన స్వరంతో అన్నాడు రామానుజాచార్యులు.

'అవును' అన్నట్టుగా తలూపాడు ఆనంద స్వరూప్..

రామానుజాచార్యుల వారు  ఆనంద స్వరూప్‌ని ఒక్కక్షణం సూటిగా చూసాడు. ఎప్పుడూ గంభీరవదనంతో ఉండే ఆయన ముఖం లో చిరునవ్వు ప్రవేశించింది..

ఆ దృశ్యం చూసి ఆనంద స్వరూప్‌కి, సాయిరాం కి మతిపోయినంత పనయింది..
గురువుగారు ఎప్పుడూ ఏదో దీర్ఘాలోచనలోనే ఉండడం, బాహ్య లోకంలో ఉన్నప్పటికీ అంతర్ముఖంగానే ఉంటూ తనలో తానే మాట్లాడుకునే రామానుజాచార్యుల వారి ముఖం లో మొట్టమొదటి సారిగా చిరునవ్వుని చూశారు..
అది వారి ఆశ్చర్యానికి కారణం అయితే మరొక అద్భుత దృశ్యాన్ని చూసి వారిద్దరి మెదడు మొద్దుబారి పోయినట్టుగా అయిపోయాయి..
ఆ అద్భుతం.. రామానుజాచార్యుల ముఖంలో ఎనలేని సంతృప్తి కనిపిస్తుంది.. ఎప్పుడూ దేనినో వెతుకుతున్నట్టుగా తిరుగాడే ఆయన కన్నులలో దివ్యమైన తేజస్సుతో కూడిన సంతోషం కనిపిస్తుంది..
ఆ రెండు తేడాలు గమనించిన ఇద్దరిలోనూ ఒకరకమైన భావాలు తలెత్తాయి .. అది ఆనందమో, ఆశ్చర్యమో వారికే తెలియడం లేదు..
ఇద్దరూ ఒకరి ముఖాలొకరు చూసుకున్నారు.. తిరిగి రామానుజాచార్యుల వంక చూశారు.
రామానుజాచార్యుల వారు తిరిగి అన్నారు.
''భగవంతుడి లీలలు చాలా అద్భుతంగా ఉంటాయి ఆనంద స్వరూప్.. వాటిలో ఒక అద్భుతం ఏమిటంటే..
శారదమ్మగారిలో నేను దేవతా మూర్తిని తిలకించాను..'' అలా అంటున్నప్పుడు ఆయన కళ్ళల్లో కనిపించిన కాంతిని ఇద్దరూ పసిగట్టారు.
అయితే ఆయన అన్న మాటలు ఇద్దరికీ అర్థం కాలేదు..
''ఏమిటంటున్నారు...?'' అర్థం కానట్టుగా అన్నాడు ఆనంద స్వరూప్..
తిరిగి రామానుజాచార్యుల వారు ఏదో చెప్పడానికి నోరువిప్పబోతుంటే శారదమ్మ కల్పించుకుంది..

'రామానుజాచార్యుల వారికి  కొన్ని సందేహాలు  కలిగాయి.. వాటిని నేను నివృత్తి చేశాను.. అందుకే ఆయన నాపై ఉన్న అభిమానం కొద్దీ అలా అంటున్నారు..'' అంది శారదమ్మ.
ఆమె మాటలకి రామానుజాచార్యుల వారు  ఎంతో ఆశ్చర్యపోయారు. అయితే ఆమె ముఖం లోని భావాన్ని ఆయన అర్థం చేసుకున్నాడు. ఆ రోజు శారదమ్మలో అమ్మవారి రూపాన్ని తిలకించిన దృశ్యాన్ని వారిద్దరికీ చెప్పాలన్న ఆయన ఉద్దేశ్యాన్ని వెంటనే విరమింపజేసుకున్నాడు.
దేవుడు సాక్షాత్కరించడం అంటే అది అంత సులువైన విషయం కాదు.. అది ఎన్నో జన్మల పుణ్యఫలం ..
రామానుజాచార్యుల వారు శారదమ్మలో దేవతా స్వరూపం దర్శించాడని ఆమెకు వివరించాడు. దానికి ఆమె ఎంతో సంతోషించింది.. అయితే ఆ క్షణంలో తాను స్పృహ లో లేనని తెలిపింది..
సాక్షాత్తూ ఆ అమ్మవారి అవతారంగా  రామానుజాచార్యుల వారు  ఆమెని కీర్తిస్తుంటే ఇబ్బంది పడింది  శారదమ్మ..
''మీరు పెద్దవారు.. నాలో మీకు అమ్మవారి రూపం కనిపించిందంటే నాకెంతో సంతోషంగా ఉంది.. కానీ.. నేను అమ్మవారిని కాను కదా.. సాధారణ మనిషినే.. నాలో మీకు కలిగిన దర్శన భాగ్యం కేవలం  ఆ భగవత్సంకల్పం  మాత్రమేకానీ నా  గొప్పతనం ఏమీ లేదు.. కాబట్టి పెద్దవారు మీరు నన్ను ఇలా కీర్తించడం నాకు చాలా ఇబ్బందికరంగా ఉంది.. మీ సహోదరిగా చూస్తే  నేనెంతగానో సంతోషిస్తాను..'' అన్న శారదమ్మ మాటలకి నిలువునా చలించిపోయాడు రామానుజాచార్యులవారు.
ఈ సంభాషణ అంత ఆనందస్వరూప్, సాయిరాం రాక మునుపు  జరిగినది.. అయితే రామానుజాచార్యుల వారు తనకి జరిగిన దర్శనభాగ్యాన్ని వారితో చెబుతుంటే శారదమ్మ ఎందుకు వారించిందో రామానుజాచార్యులవారికి

అర్థమయింది..

'దైవ సాక్షాత్కారం తో లభించే అనంతమైన ఆనందం, సంతోషం మాటల్లో చెప్పలేనిది.. అది అనుభవిస్తేనే కానీ తెలియనిది, మామూలు  మనుషులకు సాధ్యం కానిది.. అంతటి అద్భుతమైన ఆ సాక్షాత్కారం గురించి ఇతరులకు చెబితే ఫలితం శూన్యం.. ఎందుకంటే మాటలలో వివరించలేనంత ఆనందాన్ని ఎదుటి వారికి ఎలా వ్యక్తీకరించగలుగుతారు..? అందుకే ఆ ఆనందాన్ని తమలోనే దాచుకోవాలని కను సైగ ద్వారానే  వివరించింది శారదమ్మ..

''గురువు గారూ.. మీరు ఏదో చెప్పబోతున్నారు..'' వినయంగా అన్నాడు ఆనంద స్వరూప్..

ఆ మాటలకి ఉలికిపాటుకి లోనయ్యాడు రామానుజాచార్యులు .. ఆ వెంటనే తనకి తాను సర్దుకుని ఆనంద స్వరూప్ వంక చూశాడు..

''నాకు దేవుడికి  సంబంధించిన కొన్ని ప్రశ్నలు  ఎప్పటినుండో మదిలో తొలుస్తున్నాయి .. ఆ ప్రశ్నలకి సంబంధించిన సమాధానముల  కోసం ఎన్నో ఏళ్ళుగా వెతుకుతూనే ఉన్నాను.. అయితే నా  మనసులో మెదులుతున్న ప్రశ్నలకి సమాధానాలు శారదమ్మ చెప్పింది.. ఆమె సమాధానం విన్న తర్వాత  కలిగిన ఆ ఆనందం గురించి ఏమని వర్ణించను.. అది అద్భుతం.. దాని గురించే నేను మీకు చెబుదామనుకున్నాను..'' నవ్వుతూ అన్నాడు రామానుజాచార్యులవారు..

ఆయన మాటలకి ఆనంద స్వరూప్, సాయిరాం  ఇద్దరూ ఒకరి ముఖాలొకరు చూసుకున్నారు.. రామానుజాచార్యుల వారి  మాటలో స్పష్టమైన తేడాని వారు గమనిస్తున్నారు. అతనిలో ఏదో తెలియని ఆనందం తొణికిసలాడుతోంది, చూపుల్లో చురుకుదనం, మనిషి కూడా ఎంతో చలాకీగా కనిపిస్తున్నాడు.

కారణం ఏమయినప్పటికీ శారదమ్మ గురించి రామానుజాచార్యులకి  మంచి అభిప్రాయమే కలగడంతో మనసులో ఇద్దరూ ఎంతో సంతోషపడిపోయారు. అప్పటి వరకూ తాము అనుభవించిన బాధనంతా  ఎవరో తీసి విసిరేసినట్టుగా
అయిపోయింది..
దాంతో ఇద్దరిలోనూ నూతనోత్సాహం చిగురించింది.
''ఏమిటా ప్రశ్నలు  గురువుగారూ..'' ఉత్సాహంగా అన్నాడు ఆనంద స్వరూప్..
ఆయన మాటలకి చిన్నగా నవ్వాడు రామానుజాచార్యులు.
''తెలుసుకోవాలి అన్న  కుతూహలం  లేకపోతే మనిషికి మనుగడే కష్టమవుతుంది.. ఆ తెలుసుకోవాలన్న  తపనతోనే మనిషి దేన్నయిన్న సాధిస్తాడు.. అలా కొన్ని దైవసంబంధమైన ప్రశ్నలకి సమాధానాలని వెతికే క్రమంలో నేను ఎన్నో ఏళ్లుగా  నిరీక్షించాను..
ఈనాటికి వాటికి  సరైన సమాధానాలు  లభించాయి .. ఇక ఆ ప్రశ్నలు  ఏమిటంటావన్న ..? వాటిని నేను చెప్పినా  మీకు అర్థం కాదు.. మీకై మీరు తెలుసుకోవాల్సిందే ..! అయితే ఆ ప్రశ్నలేమిటో, వాటి సమాధానాలేమిటో
ముందు ముందు శారదమ్మ నోటి వెంట మీరే గ్రహిస్తారు..'' అన్నాడు రామానుజాచార్యుల వారు.
ఆయన అన్న మాటలకి ఆనందస్వరూప్‌లో కొద్దిగా నిరుత్సాహం కలిగినా ఆ వెంటనే సర్దుకున్నాడు. శారదమ్మని రామానుజాచార్యులవారు అభిమానించడం కాదు, ఓ దేవతా మూర్తిగా ఆరాధిస్తున్నాడని  మాత్రం అతనికి అర్థమయింది..
దానితో ఎంతో ఆనందపడ్డాడు ఆనంద స్వరూప్.
''మీ మాటలతో ఏకీభవిస్తున్నాను.. శారదమ్మ దగ్గర ఎన్నో అద్భుత విషయాలు  దాగి ఉన్నాయి.. వాటిని  ప్రపంచానికి అందించాలన్న తపనతోనే వారిని ఇంతదూరం తీసుకువచ్చాను. మీరు శారదమ్మని అభిమానించడం నాకు ఎంతగానో ఆనందాన్ని

కలిగిస్తుంది గురువుగారూ.. మీరు ముందుగా చెప్పినట్లుగా మీ ఇద్దరి మధ్య సంధి ఎలా కుదర్చాలి  అని తల బద్దలు  కొట్టుకుంటూ వచ్చాము .. కానీ.. తీరా  ఇక్కడకి వచ్చాక  మీ ఇద్దరినీ ఇలా చూసే  సరికి నాకెంతో సంతోషం కలిగింది.. ఇదంతా  ఆ భగవంతుడి లీల కాకపోతే మరేమిటి..?'' దేవుడికి  మ్రొక్కుతున్నట్టుగా చేతులని సాచి అన్నాడు ఆనంద స్వరూప్.

ఆయన మాటలకి రామానుజాచార్యుల వారు నవ్వారు.

''మీ మనసులో ఉన్న భావాలని నేను ముందుగానే గమనించాను. ఇక నుండి  నా  గురించి ఆలోచించడం మాని, శారదమ్మ చేసే దైవ కార్యాలకి  సంబంధించిన విషయాలపై దృష్టి సారించండి .. ప్రస్తుతం శారదమ్మ అంటే ప్రపంచమంత గౌరవిస్తుంది.. ఆ గౌరవానికి ఎలాంటి భంగం వాటిల్లకుండా మీ ప్రయత్నాలు చేయండి ..'' శారదమ్మ వంక ఆరాధనా పూర్వకంగా చూస్తూ అన్నాడు రామానుజాచార్యుల వారు.

ఆయన మాటలకి ఆనంద స్వరూప్‌లోని ఉత్సాహం మరింత రెట్టింపయింది..

''మీ ఆశీస్సులు  లభించాయి  అంతే చాలు . ఇక మా కార్యాలకి  ఎలాంటి విఘ్నాలు కలగకుండా చూసుకునే బాధ్యత మాది..'' సంతోషంగా అన్నాడు ఆనంద స్వరూప్.

సాయిరాం కి కూడా ఎంతో సంతోషం వేస్తూంది.. అయితే ఆ ఆనందాన్ని ఎవరితోనైనా పంచుకోవాలన్న ఆరాటం అతని ముఖం లో కనిపిస్తుంది.. ముందు కూర్చున్నవారు మామూలు వారు  కాదు కాబట్టి , తనలోని ఆనందాన్ని తనలోనే అణిచివేసుకున్నాడు.

ఇద్దరూ రామానుజాచార్యుల దగ్గర, శారదమ్మ దగ్గర సెలవు తీసుకున్నారు.

దిగులుగా గదిలోకి వెళ్ళిన వారిద్దరూ బయటికి వచ్చేటప్పుడు మాత్రం ఎంతో ఉత్సాహంగా ఉన్నారు. బయటికి రాగానే సాయిరాం  వంక ఆనందంగా చూశాడు ఆనంద స్వరూప్..

సాయిరాం కి ఆనందంతో మాటలు  కరువైపోయాయి. ఆనంద స్వరూప్ ఆనందంగా ఒకే ఒక్క మాటన్నాడు..

''మానవుడి కి సాధ్యం కానిది ఉందేమో కానీ ఆ భగవంతుడి కి సాధ్యం కానిదంటూ ఏదీ లేదని ఈ సంఘటన ద్వారా  మరోమారు రుజువయింది..''

..........................

అమెరికాలోని అట్లాంటా నగరం..

శనివారం ..

పని దినాలలో  నల్లటి తారు రోడ్డుపై  వందలకొద్దీ కార్లు రోడ్డుపై పరుగులు  తీస్తుంటాయి. కానీ వారాంతం  కావడంతో కొద్దిగా రద్దీ తక్కువగా ఉంది. సోమవారం నుండి  శుక్రవారం వరకూ ఆఫీసు పనులలో బిజీగా ఉండే అక్కడ ప్రజలు, శని ఆదివారాలని మాత్రం పూర్తిగా తమ వ్యక్తిగత జీవితానికి కేటాయిస్తారు.

అట్లాంటాలోని తెలుగు  ప్రజలు  మాత్రం ఈ రోజుని శారదమ్మ ప్రసంగం కోసం కేటాయించారు. ఇంటిల్లిపాదీ ఆమె ప్రసంగం వినడానికి సిద్దపడిపోయారు.

సోషల్ నెట్‌వర్కింగ్ సైట్లలో సైతం అట్లాంటాలో జరిగే శారదమ్మ ప్రసంగం గురించి విపరీతమైన ప్రచారం జరగడంతో ప్రవాసాంధ్రులే కాక ఇతర భారతీయులు  సైతం ఆమె ప్రసంగం వినడానికి ఇంట్రెస్ట్ చూపించారు. అట్లాంటా నగరంలో

ఉండే అతిపెద్ద ఆడిటోరియంలో శారదమ్మ ప్రసంగం ఏర్పాటు  చేయడం జరిగింది.

సాయంత్రం అయిదున్నరకి శారదమ్మ ప్రసంగం మొదలు  కానుంది.

కానీ నాలుగు  గంటల  నుండే ఆ ఆడిటోరియం జనంతో కిటకిటలాడడం మొదలయ్యింది.

తెలుగు వారందరు సంప్రదాయ దుస్తులతో ఆ కార్యక్రమానికి చేరుకుంటున్నారు.  సాయిరాం మధ్యాహ్నం నుండే కార్యక్రమ ఏర్పాట్లలో

బిజీగా ఉండిపోయాడు.

ఆనంద స్వరూప్ ఫోన్‌లోనే సాయిరాం కి ఏర్పాట్లకి సంబందించి ఎలా చేయాలో చెపుతున్నాడు. తెలుగు సంఘం సభ్యులు సైతం స్వచ్ఛందంగా ఆ కార్యక్రమ ఏర్పాట్లలో ఉత్సాహంగా పాల్గొంటున్నారు.

శారదమ్మ ప్రసంగాన్ని లైవ్ టెలికాస్ట్ ఇవ్వడానికి కొన్ని తెలుగు న్యూస్ చానల్స్ సిద్ధపడిపోయాయి. ఆ కార్యక్రమం లైవ్‌లో వస్తున్నట్టు ఇరవై నాలుగు గంటల ముందు నుండి తమ చానల్స్‌లో ప్రకటనలు వేయడంతో ఇండియాలో ఉన్న తెలుగు వారు సైతం అమెరికా కాలమానం ప్రకారం అయిదున్నరకి జరిగే ఆ కార్యక్రమాన్ని లైవ్‌లో తిలకించడానికి రెడీ అయిపోయారు.

లివర్మోర్ మందిరం నుండి శారదమ్మని ఆరోజు ఉదయాన్నే కారులో అట్లాంటాకి తీసుకుని వచ్చాడు సాయిరాం..

ఆవిడకి ఒక తెలుగువారి ఇంట్లో బస ఏర్పాటు చేసాడు. శారదమ్మ తమ ఇంటికి రావడంతో వారి ఆనందానికి అవధుల్లేకుండా పోయాయి.

ఆవిడ కోసం ప్రత్యేకంగా తెలుగు వంటకాలని సిద్ధం చేశారు. తెలుగు వారు చేసుకునే పిండివంటలని ఏర్పాటు చేసారు. శారదమ్మతో మాట్లాడుతూ వారిలో ఉన్న ఎన్నో ఆధ్యాత్మిక సందేహాలని తీర్చుకుంటున్నారు. ఆ తెలుగు కుటుంబానికి ఆరోజు జీవితంలో మరిచిపోలేని రోజని ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు.

సరిగ్గా అయిదు గంటలకి ఆనంద స్వరూప్ ఆడిటోరియం చేరుకున్నాడు. అప్పటికే ఆడిటోరియం పూర్తిగా నిండిపోవడం గమనించిన ఆనంద స్వరూప్ ఆశ్చర్యపోలేదు. అతను అనుకున్నట్లు గానే జరిగింది.. అందుకే మనసులోనే

చిన్నగా నవ్వుకుని మిగిలిన ఏర్పాట్లు ఎలా జరుగుతున్నాయో సాయిరాం ని అడుగుతూ దగ్గరుండి అన్నీ చూసుకుంటున్నాడు.

మరో పదిహేను నిమిషాలలో శారదమ్మ తను బస చేసిన తెలుగు కుటుంబ సభ్యులతో సహా కారులో అక్కడకి చేరుకుంది..

శారదమ్మ కారులో నుండి కాలు పెట్టడం ఆలస్యం.. ఆమె రాక కోసం ఆత్రంగా ఎదురు చూస్తున్న పత్రికా విలేఖరులు , చానల్స్ ప్రతినిధులు ఆమె కారు చుట్టుముట్టారు..

వారి చేతిలో ఉన్న కెమెరాలు క్లిక్ మన్నాయి.. టీవీ చానల్స్ వారు లైవ్ ప్రోగ్రాంని స్టార్ట్ చేసారు. శారదమ్మ కారులోనుండి దిగి నడవడం నుండి లైవ్‌లో టి.వి.లో ప్రపంచం మొత్తం తిలకిస్తున్నారు.

కొన్ని వెబ్‌సైట్స్ వారు సైతం ఆ కార్యక్రమాన్ని లైవ్‌లో అందించడానికి రెడీ అయిపోవడంతో నెటిజన్లు సైతం కంప్యూటర్లకి, ల్యాప్‌టాప్‌లకి అతుక్కుపోయి ఆమె కార్యక్రమాన్ని ఆసక్తిగా చూస్తూండిపోయారు.

ఆనంద స్వరూప్ శారదమ్మని సాదరంగా ఆడిటోరియం లోకి ఆహ్వానించారు .

అక్కడంతా పండుగ వాతావరణం నెల కొని ఉన్నది. చిన్న పిల్లలు, పెద్దలు అన్న తేడా లేకుండా శారదమ్మ కనిపించగానే పెద్దగా అరుస్తూ తమ అభిమానాన్ని చాటుకుంటున్నారు. చాలా మంది తమ మొబైల్ ఫోన్లతో శారదమ్మని బంధించడానికి విశ్వప్రయత్నం చేస్తున్నారు.

కొందరు తెలుగు సంఘం సభ్యులు శారదమ్మకి బాడీగార్డ్స్‌గా వలయాకారంలో చేరి ఆమెని చుట్టముడుతున్న జనాలని కంట్రోల్ చేసే పనిలో బిజీ అయిపోయారు. శారదమ్మ చిరునవ్వు నవ్వుతూ అందరికీ చేతితో అభివాదం చేస్తూ ఆడిటోరియం లోనికి ప్రవేశించింది.

ఒక పది నిముషాల పాటు విశ్రాంతి గదిలో కూర్చుంది.

అంతమంది జనాలు తన ప్రసంగం వినడానికి వచ్చారన్న భావన శారదమ్మకి ఒక విధమైన ఆశ్చర్యానికి గురి చేసింది. ఎక్కడ నుండి ఎక్కడ వరకు తన జీవన ప్రయాణం కొనసాగుతుందో ఆమెకి అర్థం కాలేదు. అన్నీ కోల్పోయి అనాధలా రైల్వే స్టషన్‌లో అడుక్కు

తినే వారి అక్కున చేరిన తను.. ఇప్పుడు ఇంత మంది హృదయాలలో స్థానం సంపాదించుకోవడం.. ఇదంతా ఆ దేవుడి  లీల కాకపోతే మరేమిటి..?

ఆమె మనసులో రేగుతున్న ఆలోచనకి చిన్నగా నవ్వుకుంది శారదమ్మ.

సరిగ్గా అయిదున్నరకి వేదికపైకి ఆనంద స్వరూప్ చేరుకున్నాడు.

ఆడిటోరియం  నిండా కిక్కిరిసిన జనాలని చూసి ఆయన ఎంతో పొంగిపోయాడు. తాను చేసిన ఒక చిన్న ప్రయత్నం ఇంత పెద్ద ఫలితాన్ని ఇస్తుందని ఊహించలేకపోయాడు. ఆ ఆనందం ఆయన కళ్ళల్లో కనిపిస్తుంది.

మనసంతా  ఉత్సాహం తో నిండిపోయింది.

అదే ఉత్సాహంతో మైక్ దగ్గరికి వచ్చాడు.

''గుడీవినింగ్ లేడీస్ అండ్ జెంటిల్‌మెన్..'' ఇంగ్లీషులో తన ప్రసంగాన్ని కొనసాగించాడు.

ఆయన అన్న ఆ మాటలకి ఆ హాలంతా కేరింతలతో నిండిపోయింది. వారి అరుపులు  తగ్గాక తిరిగి తన ప్రసంగాన్ని ఇంగ్లీషులో కొనసాగించాడు.

''ఈరోజు ఒక చారిత్రాత్మికమైన  రోజు. ప్రపంచంలోనే అగ్రదేశమైన ఈ అమెరికాలో ఒక భారతీయ మహిళకి లభిస్తున్న ఈ గౌరవం చూస్తుంటే  నాకెంతో సంతోషంగా ఉంది. భారతదేశ చరిత్ర, అక్కడి  ప్రజలపై ఇక్కడి వారికి  ఉండే అభిమానానికి ఇదొక ఉదాహరణ. ఈ ఆడిటోరియం లో శారదమ్మ ప్రసంగం నిర్వహించడంకోసం నేను ఇక్కడి గవర్నర్ దగ్గర పర్మిషన్ తీసుకోవడానికి వెళ్లడం జరిగింది. ఆయన నన్ను సాదరంగా ఆహ్వానించడమే కాకుండా శారదమ్మ గురించి ప్రత్యేకంగా విచారించడం నాకెంతో సంతోషాన్ని కలిగించింది. ఆమె దివ్యప్రసంగానికి తమ అనుమతి కావాలని  నేను అడగగానే ఏమాత్రం ఆలోచించకుండా 'ప్రొసీడ్' అంటూ నన్ను ప్రోత్సహించిన గవర్నర్ గారికి ముందుగా కృతజ్ఞతలు  తెలియజేస్తున్నాను. ఇక శారదమ్మ ప్రసంగం వినడానికి వేలాది మంది ఇక్కడికి తరలి రావటం  చూస్తూంటే నాకు  గర్వంగా అనిపిస్తుంది. ఇంత పెద్ద  బృహత్కార్యక్రమం

నా  చేతుల మీదుగా జరగడం నేను చేసుకున్న పూర్వజన్మ  సుకృతం  తప్ప ఇంకేముంటుంది..? శారదమ్మ గురించి మీకు ఒక విషయం చెప్పాలి. ఆవిడకి లౌకిక జీవన విధానం పట్ల పెద్దగా ఆసక్తి ఉండదు. దేవుని సేవ  కోసమే తన జీవితం అంకితం చేయాలనుకుంటున్నారు ఆమె...

నేను ఇండియాకి వెళ్లినప్పుడు ఆమె ప్రసంగాన్ని విని ఎంతో ఇన్స్పిరేషన్ పొందాను. ఆవిడ చేసిన  ప్రసంగంలో ఏదో శక్తి దాగుందని నా కనిపించింది. ఆ ప్రసంగాన్ని  అమెరికాలో ఉన్న సోదర సోదరీ మణులకు కూడా అందిచాలన్న  సంకల్పం ఆ క్షణంలోనే కలిగింది. ఆ విషయాన్ని ఆమెతో చెప్పడం, ఆమె అందుకు అంగీకరించడం, ఇప్పుడు మనం ఇలా కలుసుకోవడం అంతా  ఒక కలగా అనిపిస్తుంది నాకు. డియర్  బ్రదర్స్ అండ్ సిస్టర్స్.. ఇంకా నేను మాట్లాడి  మిమ్మల్ని ఇబ్బంది పెట్టను. మరి కొద్ది క్షణాలలో శారదమ్మ వేదికని అలంకరించనున్నారు.'' ఆనంద స్వరూప్ అన్న చివరి మాటలకి ఆడిటోరియం  అంతా హర్షద్వానాలతో  దద్దరిల్లిపోయింది.

ఆ హర్షధ్వానాల  మధ్యనే శారదమ్మ వేదికపైకి చేరుకుంది. వేదికపై శారదమ్మని చూడగానే ఆడిటోరియం లో ఉన్న వారందరిలో ఒక్కసారిగా నూతనోత్సాహం కలిగింది. తమ అభిమానాన్నంతా హర్షధ్వానాలతో తెలియబరిచారు. అయిదు నిమిషాల  వరకూ ఆ ఆడిటోరియం అంతా  దద్దరిల్లిపోయింది.

తన ఎదురుగా కనిపిస్తున్న వేలాది మందికి అభివాదం చేసింది శారదమ్మ. ఆమె ముఖం లో చిరునవ్వు తప్ప మరే భావమూ   లేదు. కానీ ఆమె కళ్ళల్లో సన్నటి కన్నీటి పొర.. ఇంతమంది జనం హృదయాల్ని  తాను కదిలించానా   అన్న ఆశ్చర్యానందంతో వచ్చిన కన్నీళ్ళు అవి. వేదిక మధ్యలో ఏర్పాటు చేసిన ఆసనంపై కూర్చుంది శారదమ్మ. తన ముందున్న మైకుని తనకి అనుగుణంగా సవరించుకుంది. ఒక్కసారి కళ్ళు మూసుకుని సాయినాధుడిని

మనసులోనే స్మరించుకుంది. ఆ తర్వాత మెల్లిగా కళ్ళు తెరిచి అందరి వంకా చూస్తూ తన ప్రసంగాన్ని ప్రారంభించింది.''అందరికీ నమస్కారం.. నా యందు గౌరవాభిమానాలని చూపిస్తూ మీరందరూ ఇక్కడకి వచ్చినందుకు నాకెంతో ఆనందంగా ఉన్నది. ఈ సందర్భంగా మనం ఒక వ్యక్తిని స్మరించికోవాలి. భారత దేశం నుండి ఎన్నో వ్యయ ప్రయాసల కోర్చి ఇక్కడకి వచ్చిన ఆ మహానుభావుడు, దేశ ఔన్నత్యాన్ని, భారతీయుల మనోభావాలని కళ్లకి కట్టినట్టుగా తన మాటల ద్వారా ప్రపంచానికి తెలియజేసిన గొప్ప వాడు. మొట్టమొదటి సారిగా ప్రపంచం భారతీయ మత విశ్వాసాల గురించి చర్చించుకునేలా చేసిన మహనీయుడు.. ఆయనే స్వామీ వివేకానంద...''

శారదమ్మ మాటలకి ఆడిటోరియం చప్పట్లతో దద్దరిల్లిపోయింది. వివేకానందుడి గురించి శారదమ్మ మాట్లాడటాన్ని ఎంతమాత్రమూ ఊహించని ఆనందస్వరూప్ ఆశ్చర్యానికి గురయ్యాడు.

సభలోని కరతాళధ్వనుల మధ్యనే శారదమ్మ తిరిగి మాట్లాడటం ప్రారంభించింది.

''స్వామీ వివేకానంద భారతదేశంలోని ప్రజల జీవితాలని ప్రకాశింపజేశాడని చెప్పడంలో ఎలాంటి సందేహం లేదు.. ఆయన ఒక సందర్భంలో అన్న మాటలని ఒక్కసారి పరిశీలిస్తే..

'మానవత్వం, సౌభ్రాతృత్వం ఉన్నదేశాలు ఆర్థికంగానూ, ఆరోగ్యంగానూ ఉంటాయి. అంతేకాదు అక్కడ విద్య ఉంటుంది, ప్రదేశాలన్నీ పరిశుభ్రంగా ఉంటాయి, సాటి మనిషి బాధని తీర్చే ఉదారత ఉంటుంది, మానవత్వం ఉన్న చోటు అన్నింటిలోనూ ఆరితేరి ఉంటుంది.. అదే మానవత్వం లేని దేశాలు బీదరికంతో అల్లాడుతుంటాయి, కరువు కాటకాలతో నిండిపోయి ఉంటాయి..'

అసలు మానవత్వం అంటే ఏమిటి..? తన ప్రవర్తన వల్ల ఇతరులను బాధించకుండా ఉండడమే మానవత్వం..!

అంటే.. సాటి మనిషి కష్టాలలో ఉన్నప్పుడు తన వంతు సహాయం చేయాలన్న తపనే మానవత్వం అన్నది. మానవత్వాన్ని మించిన మంచి గుణం మరొకటి ఉండదని అనడం అతిశయోక్తి కాదు. ప్రతీ మనిషిలోనూ మానవత్వం ఉంటుంది.

కానీ అది సరయిన సమయంలో సందర్భానికి అనుగుణంగా మేల్కోవాలి. అప్పుడే మానవత్వానికి ఉన్న విలువ ఎదుటి వారికి తెలుస్తుంది. ఆ మానవత్వాన్ని ప్రదర్శించడం ద్వారా  మనలోని ఆత్మ సంతృప్తి చెందుతుంది. అలాగే వివేకానందుడు మరొక మాట కూడా అన్నాడు.. అదేమిటంటే

'దేవాలయంలోని విగ్రహాల్లో దేవుడిని చూసేవాడు  భక్తిలో అట్టడుగు స్థానంలో ఉంటాడు. కానీ ఆకలితో బాధపడే  పేదవాడికి  అన్నంపెట్టి ఆకలి తీర్చడంలో,

ఎదుటి వారి కష్టాలలో పాలుపంచుకోవడంలో దేవుణ్ణి చూసేవాడు భక్తులలో మొదటి స్థానంలో ఉంటాడు..'

అని అన్నారు. నిజమే కదా.. మనిషి సాటి మనిషికి సహాయ పడటమే గొప్ప భక్తి. ఆ సహాయ పడటం ద్వారా  ఆ దేవుడు కూడా ఎంతో ప్రీతి చెందుతాడు. అందుకే మనం ఇతరులకు సహాయం చేయడంలో ముందుండాలి.

దీనికి ఒక చిన్న ఉదాహరణ మీకు చెబుతాను.. ఇది యదార్థ సంఘటన..

ఒక వ్యక్తి తాగుడుకు బానిసయ్యాడు.. ప్రతి నిత్యం అతనికి మందు లేనిదే మనుగడలేదన్నంతగా ఆ వ్యసనానికి లొంగిపోయాడు. ఒకరోజు అతడు ఒక మద్యం విక్రయించే చోట కూర్చుని మద్యాన్ని సేవిస్తున్నాడు. అతనితో పాటు అక్కడ చాలా మంది మద్యాన్ని సేవిస్తున్నారు.

వారిలో కొందరు యువకులు  కూడా ఉన్నారు. ఆ యువకులు  మద్యాన్ని సేవించడం ఆ వ్యక్తికి నచ్చలేదు. ఉజ్వల భవిష్యత్తు ఉన్న యువకులు  ఇలా మద్యాన్ని త్రాగుతూ తమ జీవితాలని నాశనం చేసుకుంటున్నారే అన్న బాధ ఆ వ్యక్తిలో కలిగింది. వెంటనే వారి వద్దకు

వెళ్లాడు. ''మీరిలా త్రాగడం నాకు నచ్చడం లేదు.. వెంటనే మానివేయండి ..'' అన్నాడు. అతని మాటలకి ఆ యువకులు ఆశ్చర్యపోయారు. వెంటనే తేరుకున్న ఒక యువకుడు.. ''అలా చెప్పడానికి నువ్వెవరు..? మమ్మల్ని త్రాగకూడదని మా తల్లిదండ్రులే చెప్పడం లేదు.. నువ్వు చెబితే మేము వింటామా..?'' అని కోపంగా అన్నాడు.

ఆ వ్యక్తి శాంతంగా..''వినాలి.. ఎందుకంటే నేను మీ మంచి కోసం చెబుతున్నాను.. మద్యానికి బానిస అయితే బ్రతుకు ఎంత నరకప్రాయంగా మారుతుందో నాకు తెలుసు.. అలాంటి బాధలు వయసులో ఉన్న మీరు ఇప్పటినుండే పడటం నాకు ఇష్టం లేదు.. మీరు విని తీరాల్సిందే ..'' అన్నాడు.. అతని మాటలకి ఆ యువకులు ఎంతో ఆశ్చర్యపోయారు. మద్యం మత్తులో ఉండటంతో అతను చెప్పే మంచిమాటలు వారికి పట్టలేదు.. వెంటనే మరో యువకుడు..

''ఒరేయ్.. వయసులో పెద్దవాడివి కాబట్టి కొట్టకుండా వదిలేస్తున్నాను.. మర్యాదగా ఇక్కడ నుండి వెళ్లిపో..

లేదంటే.. నువ్వు ఒక్కడివే ఉన్నావు.. చూశావుగా మేము ఎందరం ఉన్నామో.. మా చేతిలో తన్నులు తినకముందే ఇక్కడ నుండి వెళ్లిపో..'' కోపంగా అన్నాడు..

అతని మాటలకి అప్పటి వరకూ శాంతంగా ఉన్న ఆ వ్యక్తిలో కోపం ప్రవేశించింది. మరో ఆలోచన లేకుండా ఆ యువకుడి చెంపపై గట్టిగా చరిచాడు. ఆ హఠాత్పరిణామానికి మిగతా యువకులందరూ షాకైపోయారు.. ఆ వ్యక్తి మిగతా యువకుల వంక కోపంగా చూసాడు.''మీరెంత మంది ఉన్నారన్న విషయం నాకు పట్టదు.. కానీ మీరు చేసే పని మంచిది కాదు.. ఇక్కడ నుండి మీరు వెంటనే వెళ్లకపోతే వీడికి పడ్డ దెబ్బలు మీకు కూడా పడతాయి..'' అతని మాటల్లో వినిపించిన కర్కశత్వానికి ఆ యువకులలో భయం ప్రవేశించింది.. అతని ముఖం లో కనిపిస్తున్న రౌద్రానికి ఆ యువకులు ఝుడుసుకున్నారు...

''ఒరేయ్.. నీకు ధైర్యముంటే ఒక్క పావుగంట ఇక్కడే ఉండు.. మేము ఎవరో నీకు తెలియదు.. మా బ్యాక్‌గ్రౌండ్ ఏమిటో నీకు తెలియదు.. మా వెనక ఎమ్మెల్యే ఉన్నాడు.. ఆయన అనుచరులం మేము.. ఆయన పేరు చెబితేనే ఈ ప్రాంతమంతా హడలిపోతుంది.. అలాంటిది.. ఆయన అనుచరుల మీదే చేయి చేసుకున్నావంటే.. ఆయన మీదే చేయి చేసుకున్నట్లే ... నువ్వు ఇక్కడే ఉండు.. పావుగంటలో ఎమ్మెల్యే వస్తాడు.. నీ తాట తీస్తాడు..'' కోపంగా ఊగిపోతూ అన్నాడు ఆ యువకుడు..

ఆ మాటలకి ఆ వ్యక్తి పెద్దగా నవ్వాడు..

''సరే.. ఇక్కడే ఉంటాను.. మీ ఎనకాల ఉన్న ఆ ఎమ్మెల్యేని తీసుకురండి .. నా తాట వాడు తీయడం కాదు.. వాడి తాట నేను తీయాలి.. సరిగ్గా పావుగంటలో మీ ఎమ్మెల్యే ఇక్కడకి రాలేదంటే.. నేనే మీ ఎమ్మెల్యే దగ్గరికి వస్తాను.. వెళ్లండి ..'' ఆ వ్యక్తిలో కనిపిస్తున్న ధైర్యానికి ఆ యువకులు ఎంతో ఆశ్చర్యానికి గురయ్యారు.. వారి సంభాషణని అక్కడున్న అందరూ ఆసక్తిగా గమనించడం చూసిన ఆ యువకులలో ఆ వ్యక్తిపై ఎనలేని ఆక్రోశం ప్రవేశించింది.. బెదిరిస్తే అదిరిపోయే వ్యక్తి అతను కాదని వారికి అర్థమయింది.. ఇక లాభం లేదనుకుని ఆ యువకులందరూ అక్కడ నుండి వెళ్లిపోయారు. వెళుతూ వెళుతూ ఆ వ్యక్తికి ఒక హెచ్చరిక జారీ చేశారు. ''ఒరేయ్.. కేవలం పావుగంటలో ఇక్కడకి వస్తాము.. మేము వచ్చేసరికి నువ్వు ఇక్కడ లేకపోయావో.. నిన్ను వెతుక్కుంటూ మరీ వచ్చి నీ సంగతి చూస్తాము..'' అన్నాడు ఒక యువకుడు.. ఆ వ్యక్తికి ఆ యువకుడి మాటలతో చిర్రెత్తుకొచ్చింది.. ''ఒరేయ్.. మీరు పావుగంటలో గనుక ఇక్కడకి రాకపోతే.. నేనే వెతుక్కుంటూ వచ్చి మరీ మీ సంగతి చూస్తాను..వెళ్లండి ..'' అన్నాడు కోపంగా..

యువకులందరూ వెళ్లిపోయారు.. ఆ వ్యక్తి మళ్లీ మందు బాటిల్ ముందు పెట్టుకుని తాపీగా త్రాగుతూ కూర్చున్నాడు.. కానీ ఇదంతా గమనించిన మిగతావారికి మాత్రం భయం పట్టుకుంది.. యువకులు వెళ్ళిన తీరు.. ఆ వ్యక్తిని హెచ్చరించిన విధానాన్ని బట్టి ఖచ్చితంగా

ఆ యువకులు  మందీ మార్భలంతో వస్తారని, తర్వాతా ఈ  వ్యక్తిని ఏదో చేస్తారన్న ఆందోళన వారిలో కలిగింది.. జరగబోయే సంఘటన ఎంత భయంకరంగా ఉంటుందో ఆలోచిస్తేనే వారి శరీరాలు  జలదరిస్తున్నాయి.. కానీ..

ఆ వ్యక్తి మాత్రం ఏమాత్రం ఆందోళన చెందకుండా తన మానాన తాను మద్యాన్ని సేవిస్తూ ఉన్నాడు.. పావుగంట గడిచింది..

ఆ యువకులు  అన్నట్టుగానే మందీ మార్భలంతో వచ్చారు. వారికి వెన్నుదన్నుగా నిలిచే ఎమ్మెల్యే కూడా వచ్చాడు.  అతడు కోపంతో రగిలిపోతున్నాడు.

''తన అనుచరులనే హెచ్చరించే మొనగాడు ఎవడ్రా'' అంటూ వెర్రిగా కేకలు  వేస్తూ అక్కడకి వచ్చాడు.

ఆ యువకులు  తమని బెదిరించిన వ్యక్తిని చూపించారు. ఆ ఎమ్మెల్యే అతన్ని చూసాడు.. అప్పటికే ఆ వ్యక్తి పూర్తి మద్యం మత్తులో తూగుతున్నాడు. లేచి నిలబడే ఓపిక కూడా అతడికి లేదు. మరో వ్యక్తి సాయం చేస్తే గానీ అక్కడి  నుండి  కదిలే పరిస్థితిలో అతను లేడు. ఎమ్మెల్యే అతని దగ్గరకు వచ్చాడు.. అతని వెనకాలే యువకులు  వచ్చారు. భారీ శరీరంతో ఉన్న కొందరు దృఢకాయులు  కూడా వచ్చారు. ఎమ్మెల్యే కనుసైగ చేస్తే చాలు .. ఆ వ్యక్తి ఆ దృఢకాయుల  చేతిలో అంతం కావాల్సిందే.. చుట్టూ ఉన్న జనం వారిని భయంగా చూస్తున్నారు.. ఆ ఎమ్మెల్యే ముఖం లో కనిపిస్తున్న కోపం.. అతని అనుచరుల  ముఖం లో కనిపిస్తున్న క్రోధం చూస్తుంటే ఆ వ్యక్తిని అక్కడే నరికి పాతిపెట్టేలా కనిపిస్తున్నారు..

ఆ ఘోరాన్ని కళ్లారా  చూడలేమన్నట్టుగా కొందరు అక్కడి  నుండి  పారిపోయారు. మరి కొందరు ఏం జరుగుతుందా అన్నట్లుగా టెన్షన్ గా చూస్తున్నారు..

ఎమ్మెల్యే ఆ వ్యక్తి భుజంపై చేయి వేసాడు.. కానీ ఆ వ్యక్తిలో చలనం లేదు.. పూర్తిగా మద్యం మత్తులో తూగుతున్నాడు.. వెంటనే ఎమ్మెల్యే తన అనుచరులకి ఒకే ఒక్క ఆర్డర్ వేసాడు..

''ఒరేయ్.. ఇతన్ని తీసుకుని కారులో కూర్చోబెట్టండి ..'' అన్నదే ఆ ఆర్డరు..

ఆయన మాటలకి యువకులు , అనుచరులతో పాటు అక్కడున్న వారందరూ ఆశ్చర్యపోయారు.. ఏదో జరగరానిది జరుగుతోందని ఊహించిన కొందరికి ఆ ఎమ్మెల్యే మాటలతో నిరాశ కలిగింది..

మారు మాట్లాడకుండా ఆ ఎమ్మెల్యే చెప్పినట్టుగానే ఆ వ్యక్తిని ఇద్దరు దృఢకాయులు మోసుకుని వచ్చి కారులో కూర్చోబెట్టారు.. క్షణాల్లో వచ్చిన వారందరూ అక్కడి నుండి వెళ్ళిపోయారు...

అంత వరకూ చెప్పి శారదమ్మ కాసేపు ఆగిపోయింది.. ఆ ప్రవచనాన్ని వింటున్న వారందరిలోనూ ఉత్కంఠ.. ఆ వ్యక్తిని ఎమ్మెల్యే ఏం చేసాడు..? అన్న ప్రశ్న అక్కడి వారందరిలోనూ కలుగుతోంది..

ఆనంద స్వరూప్ సైతం ఉత్కంఠతో శారదమ్మ ఏం చెబుతుందా అని ఎదురు చూస్తున్నాడు..

వేలాది మందితో నిండి ఉన్న ఆ హాలు పూర్తిగా నిశ్శబ్దంతో నిండి పోయింది..

శారదమ్మ గొంతులో నుండి వెలువడే మాటల కోసం అందరూ ఎదురు చూస్తున్నారు..

కొన్ని క్షణాల మౌనం తరువాత శారదమ్మ తన ప్రసంగాన్ని మొదలు పెట్టింది..

మరునాడు ఉదయం ఆ వ్యక్తికి మద్యం మత్తు దిగిపోయింది.. ఒక్క క్షణం తాను ఎక్కడున్నాడో అతనికి అర్థం కాలేదు.. ఖరీదయిన బెడ్‌పైన అతను పడుకుని ఉన్నాడు.. గదిలో ఉన్న ఎసి చేస్తున్న శబ్దం తప్ప అంతా నిశ్శబ్దంగా ఉంది.. ఆ వ్యక్తికంతా అయోమయంగా అనిపించింది.. అంత ఖరీదయిన గదిలో తానుండడమేమిటి..? అని తికమక పడిపోయాడు. చల్లగా వస్తున్న ఆ గాలిలో సైతం అతని నుదుటిపై చెమట ప్రత్యక్షమయింది..

బెడ్ ప్రక్కనే ఉన్న టీపాయ్ పైన ఉన్న మంచినీళ్ళ బాటిల్‌ని తీసి త్రాగాడు. గత రాత్రి తన జేబులో ఉన్న వస్తువులన్నీ ఆ టీపాయ్‌పైన ఉన్నాయి.. తన సెల్‌ఫోన్ కూడా కనిపించింది.. ఫోన్ తీసి టైం చూసుకున్నాడు.. ఉదయం తొమ్మిది గంటలయింది..

దాంతో కంగారుగా బెడ్‌పై నుండి  లేచి తన వస్తువులని తీసుకుని మెల్లిగా ఆ గదిలో నుండి బయటికి వచ్చాడు..

విశాలమైన హాలులో తన అనుచరులతో మాట్లాడుతూ కనిపిస్తున్నాడు ఎమ్మెల్యే.. ఆ ఎమ్మెల్యేని చూడగానే క్రమంగా గత రాత్రి జరిగిన విషయం గుర్తుకు వచ్చింది.. యువకులతో తాను గొడవ పడ్డ విషయం గుర్తుకు వచ్చింది.. వారు కోపంగా వెళ్ళి ఆ ఎమ్మెల్యేని తీసుకుని రావడం గుర్తుకు వచ్చింది.. ఆ తర్వాతేం జరిగిందో మాత్రం అతనికి గుర్తులేదు.. అనుచరులతో మాట్లాడుతూన్న ఎమ్మెల్యే ఆ వ్యక్తిని చూసాడు. దగ్గరకు వచ్చాడు..

'రాత్రి ఏం జరిగిందో గుర్తుందా..?'' అన్నాడు సూటిగా..

''సరిగ్గా గుర్తులేదు..'' నుదురు రాసుకుంటూ అన్నాడు ఆ వ్యక్తి..

''అవునా .. నువ్వు నా  మనుషులపై చేయిచేసుకున్నావు.. వారు కోపంతో నా  దగ్గరికి వచ్చారు.. నేను నిన్ను చంపేయాలనంత  కోపంతో నీ దగ్గరికి వచ్చాను.. నిన్ను చూశాక.. పీకల వరకు త్రాగి ఉన్నావని, ఆ పరిస్థితిలో ఎలా వెళతావో తెలియక.. మా ఇంటికి తీసుకువచ్చాను..''

ఎమ్మెల్యే మాటలకి ఆ వ్యక్తి బుర్ర గిర్రున తిరిగింది.. చంపేస్తానని వచ్చిన వాడికి నా మీద అంత జాలి ఎందుకు కలిగింది.. మానవత్వం అంటే ఇదేనేమో..

''మానవత్వం అన్నది ఇంకా బ్రతికే ఉందని చెప్పడానికి మీరు చేసిన ఈ సహాయమే ఉదాహరణ.. మీకు కృతజ్ఞతలు  తెలుపుతున్నాను..'' మనస్ఫూర్తిగా అన్నాడు ఆ వ్యక్తి..

ఎమ్మెల్యే పెద్దగా నవ్వాడు...

''మానవత్వం ఉన్నది నాకు కాదు.. నీకు.. నీలో ఉన్న మానవత్వమే నిన్ను బ్రతికించింది..''

ఎమ్మెల్యే మాటలు  ఆ వ్యక్తికి అర్థం కాలేదు..

''ఏమిటి మీరంటున్నది..?'' అయోమయంగా అన్నాడు..

‘‘ఒక్క నిమిషం..’’ అంటూ పక్కకి చూస్తూ తన పదేళ్ళ అమ్మాయిని పిలిచాడు.. ఆ అమ్మాయి పరుగు పరుగున అక్కడికి వచ్చింది.. ఆ వ్యక్తిని ఆ అమ్మాయి గుర్తు పట్టింది.. ‘హాయ్ అంకుల్..’’ అంటూ ఆప్యాయంగా పలకరించింది..

ఆ అమ్మాయిని చూడగానే ఎక్కడో చూసినట్టుగా అనిపించింది ఆ వ్యక్తికి..

‘‘మా అమ్మాయే.. ఒక రోజు స్కూల్‌కి వెళుతుండగా యాక్సిడెంట్‌కి గురయింది గుర్తుందా.. ప్రాణాపాయ స్థితిలో ఉన్న మా అమ్మాయిని ఒక్కక్షణం ఆలోచించకుండా హాస్పిటల్‌లో జాయిన్ చేసావు.. చాలా రక్తం పోయిందని డాక్టర్లు చెబితే ఏమాత్రం ఆలోచించకుండా రక్తం ఇచ్చావు.. పాప ప్రాణాపాయ స్థితిలో నుండి  తప్పుకుందని తెలిసాక, పాప స్కూల్ ప్రిన్సిపాల్‌కి ఫోన్‌చేసి విషయం చెప్పి నీ దారిన నువ్వు వెళ్ళిపోయావు.. ఈ పాప ఒక ఎమ్మెల్యే కూతురని ఎవరో చెబితే..

ఓహో.. అలాగా అని అన్నావే కానీ.. నీవు చేసిన సహాయానికి నా నుండి  ఏమీ ఆశించలేదు.. మా పాపకి పునర్జన్మ ప్రసాదించిన నీ కోసం నేను ఎంతో గాలించాను.. హాస్పిటల్‌లో ఉన్న సిసి పుటేజీలో నిన్ను చూసాను.. మానవత్వానికి నిలువెత్తు నిదర్శనంలా కనిపించావు.. నువ్వు నా  పాపకి పునర్జన్మనిచ్చి మా ఇంట్లో వెలుగుని ప్రసాదించావు.. నేను..

ఏకంగా నిన్ను చంపడానికే వెతుక్కుంటూ వచ్చాను.. ఇదీ.. నీకూ నాకూ ఉన్న వ్యత్యాసం..’’

ఆ ఎమ్మెల్యే చెప్పింది విని  ఎంతో ఆశ్చర్యానికి గురయ్యాడు.. ఎదురుగా కనిపించిన పాప తనవంక ఎంతో ఆనందంగా చూస్తూండడం గమనించి అతను కూడా సంతోషపడిపోయాడు..

శారదమ్మ చెప్పడం ఆపేసింది.. ఒక్కసారిగా హాలు చప్పట్లతో దద్దరిలిపోయింది..

‘‘మానవత్వం ప్రతి మనిషిలోనూ ఉంటుంది.. తనలో ఉన్న మానవత్వాన్ని చాటుకోవడానికి మనిషి ప్రత్యేకంగా ప్రయత్నించాల్సిందేమీ ఉండదు.. తన కళ్ళముందు ఏదయిన దుర్ఘటన జరిగితేనో, అన్యాయం జరిగితేనో, లేదా ఇంకేదయిన ఘోరం జరిగితేనో, ఆ సమయంలో

మరో ఆలోచనకి తావు లేకుండా తనకు తానుగా స్పందించి మంచి చేసేలా మనిషిని ఉసికొల్పేదే మనలో మానవత్వం.. చూసారా...

వ్యసనానికి  బానిస అయిన వ్యక్తిని చావు అంచుల్లో నుండి  మానవత్వం ఎలా బయటపడేసిందో..! వ్యసనం అన్నది అతని వ్యక్తిగతం.. కానీ వ్యసనం ఏం చేసింది.. ఎదుటి వారితో గొడవ పెట్టుకోవడానికి ఉసిగొల్పింది.. మానవత్వం అన్నది కూడా వ్యక్తిగతమే.. కానీ.. ఆ మానవత్వం అతన్ని కాపాడింది..

ఎదుటి వారికి సహాయం చేసి ఏమీ ఆశించని వాడిని దేవుడని అంటారు..

అంతటి మంచి సుగుణం కేవలం  మానవత్వానికి మాత్రమే ఉంది..

ఈ పోటీ ప్రపంచంలో దైనందిన కార్యకలాపాల  వలన, ఒత్తిడుల వలన మనిషిలో ఉన్న మానవత్వం అణిగిపోతోంది..

కళ్ళముందు ఏదయిన జరిగితే మనకెందుకులే అని తప్పించుకోవడం నేడు సమాజంలో సర్వ సాధారణంగా జరుగుతోంది.. మనలో ఉన్న మానవత్వం ఎంత గొప్పదో చెప్పడానికి ఇలాంటి ఉదాహరణలు  ఎన్నో ఉన్నాయి..

నేటి తరం ఈ మానవత్వాన్ని రాబోయే  తరానికి పరిచయం చేయాలి.. 'ఆ.. మనకెందుకులే..' అని అనుకుంటే వచ్చే తరం హింసాత్మకమైన సంఘటనలతో, అసాంఘిక కార్యకలాపాలతో వర్ధిల్లుతుంది.. మన కళ్ళముందే మన పిల్లలు చెడిపోవడం కళ్లారా మనమే చూడాల్సిన పరిస్థితి వస్తుంది.. అలాంటి పరిస్థితి రాకుండా మానవత్వంతో ప్రతీ ఒక్కరూ ఆలోచించాలి..

మానవత్వానికి ఉన్న విలువ ఏమిటో మన పిల్లలకి మనమే బోధించాలి.. మానవత్వంతో మనం ఏదయిన  పని చేస్తే ఆ పని పిల్లల  హృదయాలలో చిరస్థాయిగా నిలిచిపోతుంది.. వారిలో కూడా మానవత్వంతో స్పందించే గుణం సహజంగానే వస్తుంది.. దాని గురించి ప్రతీ ఒక్కరూ ప్రయత్నం చేయాలి.. ముఖ్యంగా మీకు అంటే ఈ అమెరికాలో ఉండే వారికి

మానవత్వంతో మెలగడం ఎంతో అవసరం, ప్రతీ ఒక్కరితోనూ కలిసి మెలిసి ఉంటూ ముందుకు సాగితేనే భవిష్యత్తులో మన పిల్లల మనుగడ సాఫీగా ఉంటుంది.. లేని పక్షంలో ఇక్కడ ఏ ఒక్కరు చిన్న పొరపాటు చేసిన ఆ పొరపాటు ప్రభావం యావత్ దేశ ప్రజలపై పడుతుంది.. ఎక్కడ మంచి ఉంటుందో అక్కడ చెడు కూడా తప్పకుండా ఉంటుంది.. మంచి అనే పునాదిపై మన జీవితాన్ని నిర్మించుకోవాలి.. చెడు అనే దానిని మానవత్వంతో ఎదుర్కోవాలి..

అలా చేస్తే మనకే కాదు ముందు తరాల వారికి సైతం మనం స్ఫూర్తిదాతల మవుతాము.. నమస్కారము..''ప్రవచనం ముగిసిందన్నట్టుగా శారదమ్మ రెండు చేతిలెత్తి జోడించింది.. సభ మొత్తం హర్షధ్వానాలతో, చప్పట్ల మోతతో నిండి పోయింది. ఆనంద స్వరూప్ కళ్ళు ఆనందంతో చెమర్చాయి.. శారదమ్మ చెప్పిన ప్రతీ మాట అక్షర సత్యం.. ఈ మాటలు ఇంట్లో పిల్లలకి తల్లిదండ్రులు చెబితే అంతగా రుచించవు.. కానీ.. శారదమ్మ లాంటి ఎంతో పేరున్న ఓ జ్ఞాన స్వరూపురాలి నోటివెంట వస్తే తప్పకుండా దాని ప్రభావం అందరిపై ఉంటుంది.. హాలులో ఉన్నవారి కళ్ళల్లో కనిపిస్తున్న 'సంతృప్తి'ని స్పష్టంగా గ్రహించాడు ఆనంద స్వరూప్. శారదమ్మ ప్రవచనం వారిలో ఆలోచనని రేకెత్తించిందని చెప్పడానికి అంతకన్న ఉదాహరణ ఏముంటుంది..

శారదమ్మ వేదికపై లేచి అందరికీ అభివాదం చేస్తూ ముందుకు కదిలింది..

ఆమెని కలవాలని, ఆమెతో కలిసి సెల్ఫీ దిగాలన్న ఆరాటం అందరిలోనూ కనిపిస్తుంది..

అంతమందిని ఎలా అదుపు చేయాలా అన్న ఆలోచనతో ఆనంద స్వరూప్ తమ అనుచరులను అప్రమత్తం చేసాడు..

ప్రవచనం ముగిసిన కొద్ది నిమిషాలలోనే శారదమ్మ చేసిన ప్రసంగం యదాతథంగా సోషల్ మీడియాలో ప్రవేశించింది.. ఆమె ప్రవచనానికి ఆ హాలులో ఉన్న వారే కాదు, కోట్లాది మంది నెటిజన్లలో కూడా స్ఫూర్తిని రగిలించిందని ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు కదా...

..................................

అట్లాంటాలో జరిగిన శారదమ్మ ప్రవచనానికి వచ్చిన అనూహ్య స్పందనని చూసిన సాయిరాం ఎంతో సంబరపడిపోయారు. అమెరికా వ్యాప్తంగా శారదమ్మ ప్రవచనాలని ఎనిమిది ప్రాంతాల్లో నిర్వహించాలని ముందే షెడ్యూలు ఖరారు చేసుకుని ఉన్నారు ఆనంద స్వరూప్. కానీ అట్లాంటాలో ప్రవచనం ముగిసిన తర్వాత వివిధ ప్రాంతాల నుండి వచ్చిన తెలుగు వారు ఎంతో మంది తమ ప్రాంతాల్లో కూడా శారదమ్మగారి ప్రవచనాలని ఏర్పాటు చేయమని ఎంతో బ్రతిమిలాడుతున్నారు. ఆనంద స్వరూప్ వారి విన్నపాలని సున్నితంగా తిరస్కరిస్తున్నప్పటికీ మనసులో మాత్రం

ఏదో బాధ కనిపిస్తుంది. శారదమ్మ ప్రవచనాలు ప్రజలని ఇంతలా కదిలిస్తాయని ఆనంద స్వరూప్ ఏమాత్రం ఊహించలేక పోయాడు. కానీ ఆవిడ చేసిన రెండవ ప్రవచనానికే ఇంతటి అనూహ్య స్పందన రావడంతో మిగతా ఆరు చోట్ల జరిగే ప్రవచనాలకి ప్రజల నుండి ఇంకెంతటి స్పందన వస్తుందో అన్న విషయం ఊహించుకుంటేనే ఆనంద స్వరూప్ గుండె ఝల్ మంటోంది.

ఇప్పటికే సోషల్ నెట్‌వర్క్‌లో మాత్రం శారదమ్మ గురించి చర్చించని తెలుగు వారు లేరంటే అతిశయోక్తి కాదు.

ఆవిడ చేసిన ప్రసంగం ఫేస్ బుక్‌లో అప్‌లోడ్ అయిన అరగంటలోనే రెండు లక్షల షేర్లు నమోదయ్యాయంటే ఆవిడ ప్రవచనాలకి ప్రజల నుండి ఎంతటి స్పందన వస్తోందో అర్థమవతుంది. ఆనంద స్వరూప్, సాయిరాం మొబైల్స్ నిరంతరాయంగా అరుస్తూనే ఉన్నాయి. ఫోన్ మాట్లాడితే చాలు

శారదమ్మ గురించిన విన్నపాలే. తమ ప్రాంతాల్లో సైతం శారదమ్మ ప్రవచనం ఏర్పాటు  చేస్తే బావుంటుంది అన్న విజ్ఞప్తులే వినిపిస్తున్నాయి.

పదుల  సంఖ్యలో  రిక్వెస్ట్ లు  రావడంతో ఒక దశలో ఆనంద స్వరూప్ ఆలోచనలో పడిపోయాడు కూడా.

శారదమ్మ చేత మరో నాలుగు చోట్ల ప్రవచనాలు చేయిస్తే  బావుంటుంది కదా అని.. కానీ ఆ వెంటనే వాస్తవ  పరిస్థితులు  అవగతం కాగానే వెంటనే ఆ ఆలోచనని విరమింపజేసుకున్నాడు.

ప్రవచనం ముగిసిన తర్వాత శారదమ్మ గారికి అట్లాంటా లోనే ఉంటున్న ఒక తెలుగు వారి ఆహ్వానం మేరకు వారి ఇంట్లో బస ఏర్పాటు చేసాడు ఆనంద స్వరూప్. ప్రవచనం ముగిసిన వెంటనే శారదమ్మ వారి కారులో వెళ్లిపోయింది.

ఆనంద స్వరూప్ మాత్రం ఇంకా హాలు  దగ్గరే ఉండిపోయాడు.

అక్కడకి వచ్చిన ఆయన మిత్రులు, సన్నిహితులు, తెలుగు సంఘం సభ్యులందరినీ పేరుపేరున పలకరిస్తూ వారి వద్ద సెలవు తీసుకుంటున్నాడు ఆనంద స్వరూప్. సాయిరాం  కూడా ఆయన వెంటే ఉన్నాడు. అక్కడ  నుండి  ఎంత తొందరగా బయటపడితే అంత బావుంటుందని ఉంది వారిలో.

కనిపించిన ప్రతీ వ్యక్తి శారదమ్మ ప్రవచనం తమ ప్రాంతంలో ఏర్పాటు చేయాల్సిందిగా కోరుతుంటే వారికి ఏమి సమాధానం చెప్పాలో అర్థం కావడం లేదు. అందుకే అందరి దగ్గర సెలవు తీసుకుని హడావిడిగా అక్కడి  నుండి కారులో శారదమ్మ బస ఏర్పాటు  చేసిన ప్రాంతానికి బయలుదేరారు.

కారులో కూర్చున్న తర్వాత  కానీ ఆనంద స్వరూప్ మనసు కుదుట పడలేదు.

‘‘సర్.. దిసీజ్ అమేజింగ్ రెస్పాన్స్.. ఐ నెవర్ ఎక్స్పెక్టెడ్ దిస్’’ కారులో కూర్చోగానే సాయిరాం ముఖం  వెలిగిపోతుండగా సంబరంగా అన్నాడు.

ఆ మాటలకి ఆనంద స్వరూప్ చిన్నగా నవ్వాడు.

''ఐ.. నో.. బట్.. శారదమ్మ ప్రవచనాలకి వస్తున్న ఇంతటి స్పందనకి ఆనంద పడాలో, ఆవిడ ప్రవచనాలని తమ ప్రాంతాలలో కూడా ఏర్పాటు చేయమని ఎంతో మంది కోరుతుండడం చూసి బాధ పడాలో అర్థం కావడంలేదు నాకు ..'' నవ్వుతూ అన్నాడు ఆనంద స్వరూప్..

''నేనూ అలాంటి ఫీలింగ్‌నే అనుభవిస్తున్నాను సర్.. నన్నుకూడా చాలా మంది అడిగారు. మా ప్రాంతంలో శారదమ్మ ప్రవచనాలన్ని ఏర్పాటు చేయించండి .. దానికి కావల్సిన అన్ని ఏర్పాట్లని మేమే చేస్తాము.. అంటూంటే వారికి ఏం సమాధానం చెప్పాలో అర్థం కాలేదు..'' సాయిరాం కూడా బాధగా అన్నాడు. ''దీనికి ఏదో ఒక పరిష్కారాన్ని వెతకాలి.. లేదంటే ముందు ముందు మనం మరింత ఇరకాటంలో పడి పోవాల్సి వస్తుంది. జనం తెస్తున్న ఒత్తిడిని చూస్తుంటే శారదమ్మ గారిని ఒప్పించి వారి కోరికని మన్నించాలా అన్న ఆలోచన కూడా నాకు వచ్చింది.. కానీ.. అది పద్ధతి కాదు కదా.. అనవసరంగా శారదమ్మ గారిని ఇబ్బంది పెట్టడం బాగోదని ఊరు కుండిపోయాను..''

''యా.. మీరన్నది నిజమే సర్.. ఇదేదో ప్రేక్షకుల కోరికపై రెండవ వారం కూడా ప్రదర్శింపబడుతుందని కొత్త సినిమా పబ్లిసిటీ లాగా అయిపోతుంది.. ప్రజల కోరికపై శారదమ్మ ప్రవచనాలని పెంచుతున్నామని చెబితే ఎంత అసహ్యంగా ఉంటుంది..''

సాయిరాం ఉదహరించిన విధానానికి పెద్దగా నవ్వాడు ఆనంద స్వరూప్.. ''సినిమాతో శారదమ్మ ప్రవచనం పోల్చడం కాస్త ఇబ్బందికరమే అయిన నవ్వించావు కదయ్యా.. జనం వస్తున్నా రు కదా అని మనం అతిగా స్పందించడం కూడా బాగుండదు.. దాని వల్ల శారదమ్మని ఇబ్బందులకి గురి చేసిన వారం అవుతాము. ఈ రెస్పాన్స్‌ని చూసి మనం ఎంతో మురిసిపోతున్నాం .. కానీ.. శారదమ్మకి ఇవ్వన్నీ ఏమీ పట్టవు కదా..

ఆవిడ ముందు వేలాది మంది ఉన్నా.. ఒక్కరు కూర్చున్నా ఆవిడకి ఒక్కటే.. తాను చెప్పదలుచుకున్నది చెప్పడమే ఆవిడ చేసే పని.. మిగతావేవీ పట్టించుకోదు.. అందుకే మనం

చాలా  జాగ్రత్తగా వ్యవహరించాలి.. ఇక్కడ బస ఏర్పాటు  చేసిన ఫ్యామిలీ వారికి  మనం వెళ్ళగానే చెప్పాలి. ఎలాగూ శారదమ్మ వారింట్లో  ఉందని చెబితే ఖచ్చితంగా చాలా మంది ఆవిడని కలవడానికి వస్తారు. అలా వచ్చిన వారు మర్యాదగా రెండు ముక్కలు  మాట్లాడి వెళ్ళాలి తప్ప.. మరో ప్రవచనాన్ని ఆశించవద్దని ముందే హెచ్చరించాలి..'' సాయిరాం ని చూస్తూ సీరియస్‌గా అన్నాడు ఆనంద స్వరూప్..

ఆయన మాటలకి సాయిరాం  కూడా తలాడించాడు..

కారు వేగంగా అట్లాంటాలోని భారతీయులు  ఎక్కువగా నివసించే ప్రాంతంలోకి చేరుకుంది..

అప్పుడు సమయం రాత్రి  తొమ్మిది గంటలు  కావొస్తుంది.. ఆ సమయంలో ఎంతో

ప్రశాంతంగా ఉండాల్సిన ప్రాంతం అది. కానీ.. వారికి

కొద్ది దూరంలో ఏదో గొడవ జరుగుతున్నట్టుగా కనిపిస్తుంది..

ఆ దృశ్యం చూసిన ఆనంద స్వరూప్ ఉలిక్కిపడ్డాడు.

సరిగ్గా శారదమ్మ బస చేయబోయే ఇంటిముందే గొడవ జరుగుతుంది..

సాయిరాం  కూడా ఆశ్చర్యంగా చూస్తున్నాడు.. సరిగ్గా శారదమ్మ ప్రయాణిస్తున్న కారుకి

అడ్డంగా కొందరు అమెరికన్ పౌరులు  చేస్తున్న అల్లరని

అర్థం అయ్యేసరికి ఆయనకి ఒళ్ళు జలదరించినంత పనయ్యింది..

రోడ్డుపై గొడవ జరుగుతుండడంతో ట్రాఫిక్ జామ్ అయిపోయింది.. ఆ ట్రాఫిక్‌లో ఆనందస్వరూప్ కారు చిక్కుకుపోయింది.. గొడవ పెద్దదవుతుందన్నట్టుగా గట్టిగా అరుపులు వినిపిస్తున్నాయి..

శారదమ్మ గురించిన ఆలోచన రాగానే ఇంక ఆగలేకపోయాడు ఆనందస్వరూప్..

''సాయి.. నేను వెళుతున్నాను.. కారు తీసుకురా ..'' అంటూ సాయిరాం  సమాధానం కోసం వెయిట్ చేయకుండా కారు డ్రైవింగ్ సీట్‌లో నుండి  లేచి బయటికి వచ్చి వేగంగా ముందుకు పరుగు తీస్తున్నట్టుగా బయలుదేరాడు.

అతను ఊహించింది నిజమే..

అట్లాంటాలో ఉండే లోకల్ జనాలందరూ శారదమ్మని అడ్డుకున్నారు.

తాను చేసిన ప్రసంగంలో కేవలం భారతీయ సాంప్రదాయాలు , భారతదేశం గొప్పతనం మాత్రమే కనిపిస్తుందన్నది వారి ఆరోపణ. అంతేకాదు.. అమెరికాలో అదీ అట్లాంటా లో ప్రాంతీయతా భావాలు అధికంగా ఉన్నాయి. తమ ప్రాంతంలో తమ మత విశ్వాసాలు , తమ ఆచారాలు, వ్యవహారాల సాంద్రత ఎక్కువగా కనిపించాలి కానీ మిగతా దేశాలకి చెందిన వారి సంస్కృతీ, సంప్రదాయాల గురించి గానీ, ఆ దేశ చరిత్ర గురించి గొప్పగా చెప్పుకుంటే గానీ స్థానికంగా ఉండే అమెరికన్స్ భరించలేరు. శారదమ్మ ప్రవచనం సోషల్ నెట్‌వర్క్‌లో విపరీతంగా ప్రచారం కావడం, ఆట్లాంటాలో జరిగిన శారదమ్మ ప్రవచనం తాలుకు లైవ్ షోని లోకల్ చానల్స్ కూడా అధిక ప్రాధాన్యత కల్పించి లైవ్ టెలికాస్ట్ ఇవ్వడంతో అట్లాంటా స్థానిక అమెరికన్స్‌కి విపరీతమైన కోపం ముంచుకు వచ్చింది..

ఎక్కడి నుండో వచ్చి తమ దేశ ప్రాధాన్యత గురించి వివరిస్తున్న శారదమ్మపై విపరీతమైన కక్ష పెంచుకున్నారు. వెంటనే శారదమ్మ విడిది చేసే నివాసం గురించిన సమాచారాన్ని సేకరించి అక్కడికి చేరుకున్నారు. శారదమ్మ ప్రయాణిస్తున్న కారుని అడ్డగించి ఆందోళన చేస్తున్నారు.

సరిగ్గా అదే సమయంలో అక్కడికి చేరుకున్నాడు ఆనంద స్వరూప్.

కారుని అడ్డగించిన ఆందోళనకారులు తీవ్ర ఆవేశంలో ఉన్నారు. కారులో నుండి శారదమ్మ బయటికి వస్తే ఆమెపై భౌతిక దాడికి పాల్పడాలన్నంత కోపం వారిలో కనిపిస్తుంది.

వారి ఆవేశాన్ని గమనించి ఆనంద స్వరూప్ తీవ్ర ఆందోళన చెందాడు. మూడు పదుల సంఖ్యలో ఉన్న వారిని ఎలా అదుపు చేయాలో అర్థం కాలేదు ఆనంద స్వరూప్‌కి. వారందరూ కారు చుట్టూ మూగి కారు డోర్లు తెరువడానికి విశ్వప్రయత్నం చేస్తున్నారు. కారులో ఉన్న శారదమ్మతో పాటు మిగతా వారు సైతం ఎంతో ఆందోళన చెందుతున్నారు. ఆనంద

స్వరూప్ వారందరినీ వారించడానికి విశ్వ ప్రయత్నం చేస్తున్నాడు. వారు ఆనంద స్వరూప్‌తో వాగ్వాదానికి దిగారు.

వారి సంభాషణ ఇంగ్లీషులో సాగుతోంది..

''భారతదేశ గొప్పతనం గురించి తెలుసుకునేందుకు మీకు ఇంట్రెస్ట్‌గా ఉండొచ్చేమో.. మీకు ఇంట్రెస్ట్‌గా ఉంటే మీ దేశం వెళ్ళి మీ గొప్పతనాలు తెలుసుకోండి .. అంతేకానీ.. అక్కడి నుండి (పాస్టర్) ఆధ్యాత్మికురాలినీ తీసుకువచ్చి ఇక్కడ మీ గొప్పతనాలు చెప్పుకుంటూ మా మనోభావాలని దెబ్బతీయడానికి ప్రయత్నిస్తే ఇక్కడున్న భారతీయులు తీవ్ర పరిణామాలని ఎదుర్కొంటారు జాగ్రత్త'' ఒక స్థానిక యువకుడు ఎర్రబడిన కళ్ళతో ఆనంద స్వరూప్‌ని హెచ్చరించాడు.

అతని మాటలకి ఆనంద స్వరూప్ పెదాలపై చిరునవ్వు తెచ్చుకోవడానికి ప్రయత్నిస్తూ అన్నాడు..

''లుక్ సర్.. మీరనుకున్నట్టుగా మీ మనోభావాలని దెబ్బతీయాలన్న ఉద్దేశ్యం మాకు ఏకోశాన లేదు. మేము మిమ్మల్ని కించపరిచేలా మా ప్రోగ్రామ్స్ ని ఏర్పాటు చేయలేదు.. దయచేసి గమనించాలి.. ఈవిడ నాకు తెలిసిన ఆవిడ.. కేవలం మా భారతీయుల కోసం మాత్రమే ఏర్పాటు చేసుకున్న కార్యక్రమం తప్ప ఇక్కడి వారిని హర్ట్ చేయడానికి ఉద్దేశించబడినది మాత్రం కాదు..'' ఎంతో వినయంగా అన్నాడు ఆనంద స్వరూప్..

కానీ వారిలో ఉన్న ఆవేశం చల్లారలేదు.. కారులో ఉన్న వారిని వదిలేసి ఆనంద స్వరూప్ చుట్టూ మూగారు వారు. వారందరూ కలిసి ఒక్కసారి ఆనంద స్వరూప్‌తో వాగ్వాదానికి దిగడంతో ఊపిరి ఆడనంత పనయింది ఆయనకి..

దాదాపు అరగంట పాటు వారిని సముదాయించడానికి ప్రయత్నిస్తూనే ఉన్నాడు ఆనంద స్వరూప్.. సాయిరాం పోలీసులకి ఫోన్ చేయడంతో పోలీసులు అక్కడికి చేరుకున్నారు..

విషయం మొత్తం పోలీసులకి వివరించాడు ఆనంద స్వరూప్.. పోలీసుల రాకతో అప్పటి వరకూ ఎంతో ఆవేశంగా ఊగిపోయిన స్థానికులు కాస్త శాంతించారు.

పోలీసులు వారికి నచ్చజెప్పడంతో మళ్ళీ ఒక సారి ఇలాంటి సంఘటన రిపీట్ కాకూడదని హెచ్చరిస్తూ అక్కడి నుండి వెళ్ళిపోయారు.. అరగంట పాటు భూకంపం వచ్చిందా అన్నట్టు అయింది అక్కడి పరిస్థితి..

ఆనంద స్వరూప్‌కి ఒళ్ళంత చెమట పట్టేసింది.. ఆయన కంగారుగా కారు దగ్గరికి పరిగెత్తి శారదమ్మ వంక చూశాడు..

అంత గొడవ జరిగినప్పటికీ ఆవిడ ముఖం లో ఏమాత్రం ఆందోళన కనిపించలేదు..

చిరునవ్వుతో ఆనంద స్వరూప్ వంక చూసింది..

ఆవిడ ముఖం లో కనిపించిన భావాలని చూసి ఆనంద స్వరూప్ ఎంతో ఆశ్చర్యపోయాడు.. ఆవిడకి ఉన్న మనోబలాన్ని చూసి షాకైపోయాడు.

ఆ షాక్‌లోనుండి తేరుకుని కారుని పార్టికోలోకి తీసుకువెళ్లమని డ్రైవర్‌కి చెప్పాడు.. ఆ కారు వెనకాలే సాయిరాం తమ కారుని కూడా పోనిచ్చాడు..

ఆ ఇంటి యజమాని ఆనంద స్వరూప్‌కి దూరపు బంధువు.. శారదమ్మని తమ ఇంటికి ఆహ్వానించాలన్న ఆయన కోరికని ఆనంద స్వరూప్‌కి వారం రోజుల క్రిందటే చెప్పాడు. అట్లాంటాలో శారదమ్మ ప్రవచనం ఉందన్న విషయం తెలిసిన దగ్గర నుండి ఆనంద స్వరూప్‌ని కోరుతూనే ఉండడంతో కాదనలేక శారదమ్మ బసని వారింట్లో ఏర్పాటు చేసాడు. శారదమ్మ తమ ఇంటికి రావడంతో ఆ ఇంటి కుటుంబసభ్యుల ఆనందానికి అవధుల్లేకుండా పోయింది..

శారదమ్మ వస్తుందని తెలియడంతో అందరూ సంప్రదాయమైన దుస్తులని వేసుకున్నారు. ఆమెని ఇంట్లోకి ఆహ్వానించడానికి ఎన్నో ఏర్పాట్లు చేసారు.

ఇంటి యజమానికి ఇద్దరు అమ్మాయిలు, ఒక బాబు.. ఇద్దరమ్మాయిలు  పట్టు లంగాలు, జాకెట్లు  వేసుకున్నారు..

బాబు పట్టు పంచె కట్టుకున్నాడు. నుదుటికి తిలకం పెట్టుకున్నాడు.. యజమానురాలు  భార్య పట్టు చీర కట్టుకుని ఉంది..

ఇంటి ముందు అందంగా ముగ్గుని వేసారు.. గుమ్మానికి మామిడాకులు  అలంకరించారు. చుట్టూ తోరణాలు ఏర్పాటు చేసారు.. శారదమ్మ కారు దిగి అక్కడి వాతావరణాన్ని గమనించి ఎంతో ఆశ్చర్యపోయింది.. వారు అలంకరించుకొన్న విధానం చూస్తుంటే తాను అమెరికాలో కాకుండా ఆంధ్రాలో ఉందేమో అన్నంతగా మైమరిచిపోయింది శారదమ్మ. శారదమ్మ కారు దిగగానే ఇద్దరు అమ్మాయిలు  శారదమ్మకి ఎదురొచ్చారు.. ఇంటి యజమాని, అతని భార్య, ఆనంద స్వరూప్, సాయిరాం  అందరూ శారదమ్మని సాదరంగా ఆహ్వానించారు.. శారదమ్మ గుమ్మం దగ్గరికి రాగానే యజమాని భార్య ‘ఒక్కనిమిషం ఆగండి ’ అని కోరడంతో లోపలికి అడుగుపెడుతున్న శారదమ్మ తో పాటు ఆనంద స్వరూప్, సాయిరాం  అక్కడే ఆగిపోయారు. ఆవిడ హడావిడిగా లోనికి పరుగు తీసింది..

పనిమనిషి సిద్దంగా ఏర్పాటు చేసిన హారతి పళ్ళాన్ని తీసుకుని శారదమ్మ ఎదురుగా వచ్చింది.. ఎంతో సంతోషంతో శారదమ్మకి హారతి ఇచ్చి సాదరంగా లోనికి ఆహ్వానించింది.. శారదమ్మ చిరునవ్వు నవ్వుతూ లోనికి దారితీసింది. ఆవిడ వెనకాలే ఆనంద స్వరూప్, సాయిరాం , ఇంటి యజమాని ముగ్గురూ లోపలి వెళ్లారు

రోడ్డుపై జరిగిన గొడవకి సంబంధించి అక్కడున్న వారందరి మనసులలోనూ కాస్త ఆందోళన ఉన్నప్పటికీ శారదమ్మ ఇంట్లోకి అడుగు పెట్టగానే వారిలో ఉన్న ఆందోళన మటు మాయమైపోయింది..

ఒక్క ఇంటి యజమానికి తప్ప...

సమయానికి ఆనంద స్వరూప్ వచ్చాడు కాబట్టి వారి బారినుండి  తాను, శారదమ్మ తప్పించుకోగలిగారు.. కానీ ఆనంద స్వరూప్ రావడం ఏమాత్రం ఆలస్యమైనా వారందరి చేతిలో తాము దెబ్బలు తినేవారమే అన్న ఆలోచన రాగానే అతని ఒళ్ళంత  చెమట పట్టేసింది..

వెంటనే ఆనంద స్వరూప్‌ని ఆ హాలులో నుండి  పక్కకి తీసుకెళ్ళాడు..

తనలో ఉన్న భయాన్ని ఆనంద స్వరూప్ ముందు ఉంచాడు.

ఆనంద స్వరూప్ చిన్నగా నవ్వాడు..

''మీరంతలా కంగారు పడాల్సింది ఏమీ లేదు.. నేను వారు సంతృప్తి పడే విధంగా సమాధానం చెప్పాను..

అందుకోసమే అరగంట పాటు వారితో వాదించాను .. వారితో వాదించడం అనవసరం అనుకుంటే మరు క్షణంలో పోలీసులని రప్పించి వారందరినీ అరెస్టు చేయించేవాణ్ణి, అలా చేస్తే  వారు మనపై ఇంకా ఆవేశం పెంచుకుంటారన్న ఆలోచన తోనే వారితో అంతసేపు మాట్లాడటం జరిగింది.. ఈ విషయంలో మీరు నిశ్చింతగా ఉండండి .. మీరు ఎంతగానో బ్రతిమాలారు కాబట్టే శారదమ్మని మీ ఇంట్లో ఉండడానికి అంగీకరించాను.. ఆవిడకి ఏమాత్రం లోటు రాకుండా చూసుకోండి ..'''

ఆనంద స్వరూప్ మాటలకి ఇంటి యజమాని ఎంతో ఆనందపడి పోయాడు..

''మీరీ మాట అన్నారు చాలు .. ఇప్పుడు నా  మనసెంతో రిలీఫ్‌గా అయిపోయింది.. ఈ రాత్రికి మీరు కూడా ఇక్కడే ఉండి  మా ఆతిథ్యం స్వీకరించాలి..'' సంతోషంతో అన్నాడు ఆయన.. దానికి ఆనంద స్వరూప్ తలని అడ్డంగా ఊపాడు..

''లేదండీ.. నేను వెళ్ళాలి.. నాకు వేరే పని ఉంది.. పైగా బయట జరిగిన గొడవ కారణంగా శారదమ్మ కాస్త ఇబ్బందికి గురయ్యే అవకాశం లేకపోలేదు.. ఆ గొడవ వల్ల  శారదమ్మ డిస్టర్బ్  కాకుండా చూసుకునే బాధ్యత నాపై ఉంది..''

''అదేమిటీ..? ఆ గొడవ గురించి అసలేమీ పట్టనట్టుగా ఉండిపోయిందే.. ఆవిడ ముఖం చూస్తే  జరిగిన గొడవ తనకోసమే అని అర్థం చేసుకోలేదని నాకు కనిపించింది.. పైగా అందరూ అమెరికన్స్ కావడంతో వారితో తనకి వైరమేమిటి..

వారు ఎవరి గురించో గొడవ పడుతున్నారని అనుకుండి  ఉంటుంది..''

''మీరు పొరపాటు పడుతున్నారు.. శారదమ్మ గురించి నాకు బాగా తెలుసు.. ఆవిడ తనలోని ఆందోళనని బయటికి కనిపించకుండా ప్రయత్నిస్తుంది.. కానీ బయట జరుగుతున్న ప్రతీ అంశమూ ఆవిడకి తెలిసిపోతుంది..

ఆవిడ మనసులో అలజడి  రేగితే అది రాబోయే ప్రసంగాలపై ప్రభావం పడుతుంది.. అందుకే ఆవిడని ఆహ్లాదకరమైన వాతావరణంలో ఉండేలా చూసుకోవాలి.. మరో విషయం.. మీరు ఆవిడకి విసుగు కలగకుండా చూసుకోవాలి..

ప్రసంగాల  తాలూకు ప్రశ్నలతో  ఆవిడని విసిగించవద్దు.. ఈ విషయం మీ ఫ్యామిలీ మెంబర్స్‌కి కూడా తెలియజేయండి ..''

''అయ్యో.. ఎంత మాట.. మీరు మరీ అంతగా చెప్పాలా.. నేను జాగ్రత్తగా ఉంటాను..'' వినయంగా అన్నాడు అతను..

ఇద్దరూ హాలులోకి వచ్చారు.. సోఫాలో ఇంటి యజమాని ఇద్దరు అమ్మాయిలతో ముచ్చటిస్తూ కనిపించింది శారదమ్మ.. ఆనంద స్వరూప్ అనుమానిస్తున్నట్టుగా ఆవిడలో ఎలాంటి ఆందోళన కనిపించడం లేదు.. హాయిగా నవ్వుతూ ఇద్దరితో ముచ్చటిస్తుంది.. వారు అడిగిన ప్రశ్నలకు ఓపికగా సమాధానం చెబుతుంది.. అది గమనించి ఆనంద స్వరూప్ తేలిగ్గా ఊపిరి పీల్చుకున్నాడు.

శారదమ్మ దగ్గరికి వచ్చి ఆవిడకి ఎదురుగా సోఫాలో కూర్చున్నారు. సాయిరాం  కారులో ఉన్న శారదమ్మ లగేజీని తీసుకుని లోనికి వచ్చాడు. ఇంటి యజమాని భార్య స్వయంగా ఆ లగేజీని తీసుకుని శారదమ్మకి కేటాయించిన గదిలోకి తీసుకువెళ్ళింది..

సాయిరాం  కూడా వచ్చి ఆనంద స్వరూప్ పక్కనే కూర్చున్నాడు.

''అమ్మా.. మీకు ఇక్కడ ఎటువంటి అసౌకర్యం కలిగిన మొహమాట పడకుండా నాతో చెప్పండి ..'' వినయంగా అన్నాడు ఇంటి యజమాని..

శారదమ్మ అతని వంక చూసి చిన్నగా నవ్వి సరే అన్నట్టుగా తలూపింది..

పనిమనిషి తీసుకువచ్చిన ఫలహారాన్ని , తేనీటి ని  ఇంటి యజమాని స్వయంగా శారదమ్మకి, సాయిరాంకు , ఆనంద స్వరూప్‌కి అందించాడు. ఆ తర్వాత  ఆనంద స్వరూప్ లేచాడు..

''శారదమ్మ గారూ.. ఇంక నేను బయలు  దేరుతాను.. రేపు ఉదయాన్నే వస్తాను..'' అన్నాడు నవ్వుతూ..

''అలాగే..నా  గురించి మీరేమీ కంగారు పడకండి .. నేను ఎక్కడున్నా సంతోషంగానే ఉంటాను..'' ఆనంద స్వరూప్ మనసులోని భావాలని అర్థం చేసుకున్నట్టుగా అనడంతో ఉలిక్కిపడ్డాడు ఆనంద స్వరూప్..

సాయిరాం, ఆనంద స్వరూప్ ఇద్దరూ ఒకరి ముఖాలొకరు చూసుకున్నారు. తనని తాను సర్దుకుని చిన్నగా నవ్వాడు ఆనంద స్వరూప్.

''మీరు మా ప్రత్యేక అతిథి.. మీకు ఏ లోటూ రాకుండా చూసుకోవల్సిన బాధ్యత నాపై ఉంది.. అందుకే కాస్త ఎక్కువగా స్పందిస్తున్నాను..''

''సరే.. మీరు క్షేమంగా వెళ్ళి రండి..'' అంది శారదమ్మ..

ఆనంద స్వరూప్, సాయిరాం  ఇద్దరూ అక్కడి  నుండి  బయలు దేరారు ..

ఆ రాత్రికి శారదమ్మ కోసం ప్రత్యేకంగా తయారు చేసిన ఆంధ్రా వంటకాలతో భోజనం ముగించిన తర్వాత శారదమ్మ వారందరి దగ్గర సెలవు తీసుకుని తనకి కేటాయించిన గదిలోకి నడిచింది..

ఆ గది చాలా పెద్దగా ఉంది. అందులో ఉన్న ఫర్నీచర్ చాలా ఖరైనదని చూస్తేనే తెలుస్తుంది. పెద్ద ఎల్ఇడి  టీవీ కూడా ఉంది. బెడ్‌కి ఎదురుగా నిలువెత్తు సాయిబాబా ఫోటో కనిపించగానే శారదమ్మకి ఎంతో సంతోషం  వేసింది.

శారదమ్మ సాయిబాబా భక్తురాలని ముందుగానే ఆనంద స్వరూప్ వారికి తెలపడంతో ఆవిడ కోసమే ప్రత్యేకంగా ఆ ఫోటోని అక్కడ ఏర్పాటు చేసారు. ఫోటో దగ్గరికి వెళ్ళి సాయినాధుడి పాదాలకి భక్తితో నమస్కరించింది శారదమ్మ.

కాసేపు ఆ ఫోటోకేసి  తదేకంగా చూసి ఆ తర్వాత  వెళ్ళి నిద్రకి ఉపక్రమించింది.

............................

ఆ మర్నాడు ఆదివారం ..

శారదమ్మకి అయిదు గంటలకే మెలుకువ వచ్చింది. లేవగానే ఎదురుగా కనిపించే సాయినాధుడి  ఫోటోకి భక్తితో నమస్కరించి బెడ్‌పై నుండి  లేచింది. సరిగ్గా అరగంటలో కాలకృత్యాలు  ముగించుకుని తనతో పాటు తీసుకువచ్చిన సాయినాధుడి  దివ్య చరిత్రని పారాయణం  చేయడం ప్రారంభించింది.

ఏడు గంటలకు ఆ ఇంటి యజమాని తలుపు తట్టేంత వరకూ పారాయణం చేస్తూనే గడిపింది. తలుపు శబ్దం వినగానే లేచి వెళ్ళి తలుపు తీసింది. ఎదురుగా ఇంటి యజమాని, అతని భార్య నిలబడి  ఉన్నారు. శారదమ్మని

చూడగానే రెండు చేతులెత్తి నమస్కరించారు ఇద్దరూ..

‘‘సారీ అమ్మా.. మిమ్మల్ని డిస్టర్బ్ చేస్తే మన్నించండి ..’’ వినయంగా అన్నాడు ఆయన..

శారదమ్మ చిన్నగా నవ్వింది..

‘‘అలాంటిదేమీ లేదు.. ఉదయం అయిదు గంటలకే నిద్రలేచాను.. స్నానం చేసి సాయిబాబా దివ్య చరిత్ర పారాయణం చేస్తూ కూర్చున్నాను..’’ నవ్వుతూ అంది శారదమ్మ..

''ఓ.. అలాగా.. మీ చేతుల  మీదుగా పూజ చేయించాలని మా కోరిక అందుకే ఇలా వచ్చాము..'' అన్నాడు ఇంటి యజమాని..

''చాలా సంతోషం పదండి..'' ఆనందంగా అంది శారదమ్మ.

ముగ్గురూ దేవుడి  గది వైపు నడిచారు..

దేవుడి  గదిని రకరకాల పూలతో అందంగా అమర్చారు . అక్కడ  వేంకటేశ్వరస్వామితో పాటు, శివలింగం, లక్ష్మీ, సరస్వతుల, విఘ్నేశ్వరుని, సాయినాధుడి  వెండి  విగ్రహాలని వరుసగా అమర్చారు. వాటికి ఇంటి యజమాని ఇద్దరు కూతుళ్ళు పూలని అందంగా అమర్చుతున్నారు.

ఆ పిల్లలని చూస్తూంటే శారదమ్మకి ఎంతో ముచ్చటేస్తుంది. ఒకమ్మాయికి పదేళ్ళుంటాయి, మరొకమ్మాయికి పన్నెండు సంవత్సరాలుంటాయి... పిల్లలిద్దరూ ఎంతో అందంగా ఉన్నారు. తెలుగుదనం ఉట్టిపడేలా పట్టు లంగాలు, జాకెట్టు ధరించారు. వారెంతో భక్తి భావంతో విగ్రహాలని అలంకరిస్తున్నారు. వారికి తమ తమ్ముడు, ఇంటి యజమాని కుమారుడైన ఎనిమిది సంవత్సరాల  అబ్బాయి పూలని అందిస్తూ తమ వంతు సహాయం చేస్తున్నారు. శారదమ్మని చూడగానే చేసే పనిని ఆపేసి  ఆవిడ పాదాలకి వినయంగా నమస్కరించారు. ఆ పిల్లల  వినయ విధేయతలు  చూస్తూంటే శారదమ్మ మనసు ఎంతో పొంగిపోయింది. ఖండాలు  దాటినా తమ సంస్కృతి, సంప్రదాయాలు  మరవకుండా భారతజాతి గౌరవాన్ని ఇనుమడింప జేస్తున్న వారిని చూసి గర్వపడింది శారదమ్మ. పూజకి కావలసిన అన్ని వస్తువులని అమర్చి ఓ పక్కన నిలబడ్డారు ముగ్గురు పిల్లలు. శారదమ్మ దేవుడి  విగ్రహాల ముందు కూర్చుంది. భక్తి శ్రద్ధలతో పూజ చేయడం ప్రారంభించింది. నివేదన కోసం తయారు చేసిన వేడి వేడి  పాయసాన్ని తీసుకు వచ్చింది ఇంటి యజమానురాలి  భార్య. అత్యంత భక్తి శ్రద్ధలతో పూజని ముగించి ఆ పాయసాన్ని నైవేద్యం పెట్టి భక్తి శ్రద్ధతో ప్రార్థించింది

శారదమ్మ. ముగ్గురు పిల్లలు ఇంటి యజమాని, భార్య అందరు కూడా భక్తి శ్రద్ధలతో దేవుడి కి దండం పెట్టారు.

శారదమ్మ చేతుల మీదుగా దేవుడి కి పూజ చేయించామన్న సంతోషం వారందరి కళ్ళల్లో స్పష్టంగా కనిపిస్తుంది. పూజ అనంతరం అందరూ కలిసి హాలులోనికి వచ్చారు. శారదమ్మ వారింటికి వచ్చిందని తెలిసిన ఇంటి యజమాని బంధువులు, స్నేహితులు అందరూ వచ్చారు. దాంతో అక్కడ పండగ వాతావరణం ఏర్పడింది.

ప్రతీ ఒక్కరూ శారదమ్మతో ఆప్యాయంగా మాట్లాడుతూ తమ సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నారు. శారదమ్మ కూడా వారితో ఆనందంగా మాట్లాడుతూ ఎంతో ఉత్సాహంగా కనిపించింది.

............................

ఆనంద స్వరూప్ చాలా అసహనంగా ఉన్నాడు. సాయిరాం కూడా టెన్షన్‌గా కనిపిస్తున్నాడు.

''ఛ.. ఇలా జరుగుతుందని నేను ఏమాత్రం ఊహించలేదు..'' నుదుటిపై వేలితో రుద్దుకుంటూ అన్నాడు ఆనంద స్వరూప్.

''అవును సార్.. నేను కూడా ఊహించలేదు. కానీ పండ్లతో కళకళలాడే చెట్టుకే రాళ్ళ దెబ్బలు తగులుతాయని నానుడి ఉంది కదా.. ఇదే శారదమ్మ విషయంలో జరిగింది.. ఇప్పుడేం చేద్దాం..'' ఆనంద స్వరూప్ ముఖం చూస్తూ అన్నాడు సాయిరాం.

ఆట్లాంటాలో శారదమ్మ ప్రవచనం సోషల్ మీడియాలో ఎంత పాపులారిటీ సంపాదించిందో.. అంతే వ్యతిరేకత కూడా ఎదురయింది. ఇండియాలో ఉండే కొందరు ఆధ్యాత్మిక వేత్తలు శారదమ్మపై విమర్శల వర్షం కురిపించారు. 'ఒక ఆధ్యాత్మికురాలయి ఉండి మానవత్వం గురించి చెబుతూ ఉదాహరణగా ఒక తాగుబోతు వృత్తాంతాన్ని చెప్పడం ఎంత వరకు న్యాయం .. అతిగా మద్యం సేవించే వాడికి సమాజంలో ఎలాంటి గౌరవం ఉంటుందో తెలుసు కదా.. అసలు మద్యం త్రాగడమే తప్పు.. అలాంటిది మద్యం త్రాగేవాడిని ఎంకరేజ్ చేస్తున్నట్టుగా ఆవిడ మాట్లాడటం చాలా విడ్డూరంగా ఉంది.. దీనిని మేము ఖండిస్తున్నాం..'

అంటూ వారు తీవ్ర స్వరంతో చేసిన ప్రసంగం సోషల్ మీడియాలో హల్‌చల్ చేస్తుంది. దానికి కూడా సోషల్ మీడియాలో అధిక ప్రాధాన్యం దక్కింది. కొందరు నెటిజన్లు వారితో ఏకీభవించారు.

శారదమ్మపై విమర్శలు  గుప్పించారు.

రెండు ప్రసంగాలతో ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన శారదమ్మకి ఈ ఒక్క సంఘటన ద్వారా వచ్చిన పేరు ప్రఖ్యాతులపై మచ్చ పడినట్లయింది. అయితే శారదమ్మకి సపోర్టుగా కూడా చాలా మంది స్పందించడం కొంత ఊరట కలిగించినప్పటికీ ఈ వ్యవహారం ఎటు నుండి ఎటు వైపుకి దారితీస్తుందో అన్న ఆందోళన ఆనంద స్వరూప్‌లో కలుగుతుంది. శారదమ్మ మూడవ ప్రవచనానికి అంతా సిద్దం చేస్తున్నారు.

ఆ సభపై ఈ సంఘటన ప్రభావం పడుతుందేమో అన్న టెన్షన్ ఆయనలో పట్టుకుంది. శారదమ్మకి వస్తున్న పేరు  ప్రఖ్యాతులని చూసి ఓర్వలేని వారే పనిగట్టుకుని ఆమెపై దుష్ప్రచారం చేస్తున్నారని స్పష్టంగా అర్థమవుతుంది. కానీ దీనిని ఎలా ఎదుర్కోవాలో ఆయనకి అర్థం కావడం లేదు.

అందుకే అంతలా ఆందోళన చెందుతున్నారు..

''పోనీ ఒక పని చేస్తే  ఎలా ఉంటుంది సార్..'' ఏదో ఐడియా వచ్చినట్టుగా అన్నాడు సాయిరాం ..

''ఏమిటది..?'' ఆసక్తిగా అడిగాడు ఆనంద స్వరూప్.

''శారదమ్మకి ఈ విషయం చెప్పి, తాను అలా ఎందుకు మాట్లాడిందో వివరణ ఇప్పిచ్చినట్లయితే బాగుంటుంది కదా..'' అన్నాడు సాయిరాం..

''వద్దు.. అలా చేస్తే  శారదమ్మని విమర్శిస్తున్న వారిని చూసి భయపడుతున్నట్లవుతుంది. దాంతో శారదమ్మని విమర్శించే వారి గొంతు మరింత పెరుగుతుంది. ఒక్కసారి శత్రువు

తమని చూసి భయపడుతున్నాడని తెలిస్తే  అవతలి వ్యక్తిలో మరింత బలం  చేకూరుతుంది. దానితో ఆమెపై మరిన్ని దుష్ప్రచారం  చేయడం ప్రారంభిస్తారు. గోరంతని కొండంతగా చేసి చూపించేందుకు రెడీ అయిపోతారు. వారు విమర్శించే ప్రతీ సారీ శారదమ్మ చేత మనం వివరణ ఇప్పిస్తూ వెళితే ఇక మనం ముందుకు ఎలా వెళతాం ..? అన్నాడు ఆనంద స్వరూప్..

''మీరన్నది నిజమే సార్.. నేను అంత దూరం ఆలోచించలేదు.. మరిప్పుడేం చేద్దాం..?'' తల గోక్కుంటూ అన్నాడు సాయిరాం..

''ప్రస్తుతం ఈ విషయం శారదమ్మ దృష్టికి తీసుకుపోకుండా ఉండడమే మంచిది. ఇక దీని గురించి ఎక్కువగా ఆలోచించి మనం ఆందోళన చెందే కంటే వచ్చే శనివారం డల్లాస్‌లో జరిగే శారదమ్మ ప్రవచనంపై దృష్టి సారించడం మంచిది.''

''అలాగే సార్..'' ఆనంద స్వరూప్ మాటలకి తలాడించాడు సాయిరాం .

''అయితే ఒక విషయం.. శారదమ్మ పై సోషల్ నెట్‌వర్క్‌లో జరుగుతున్న నెగిటివ్ ప్రచారాన్ని ఎప్పటికప్పుడు మనం నిశితంగా గమనించాలి.. ఆ ప్రచారం  మరింత ఎక్కువగా ఉంటే అప్పుడు మనమే శారదమ్మ క్యారెక్టర్  గురించి, ఆవిడ నేపథ్యం, ఆవిడ జీవితం ఎంత నిరాడంబరంగా సాగిందో వివరిస్తూ ఒక వీడియోని పోస్ట్  చేద్దాం.. అలా చేస్తే కొంతలో కొంతయిన శారదమ్మపై వస్తున్న విమర్శలని అరికట్టగలుగుతాం ..''

ఆనంద స్వరూప్ ఆలోచనకి ఎంతో సంబరపడిపోయాడు సాయిరాం..

''చాల కరెక్టుగా చెప్పారు సార్ మీరు.. అయితే ఆ పనేదో వెంటనే చేస్తే అయిపోతుంది కదా.. ఇంకా ఆలస్యం చేయడం ఎందుకు..? శారదమ్మ గురించి వచ్చే ఏ వార్తయిన  సోషల్ నెట్‌వర్క్‌లో ఎంతో ప్రాధాన్యం సంతరించుకోవడం మనం చూస్తూనే ఉన్నాం  కదా.. మీరు చెప్పినట్టుగా శారదమ్మ జీవితం గురించి క్లుప్తంగా వివరిస్తూ ఓ వీడియోని తయారు చేసి

పోస్ట్ చేస్తే దానికి కూడా విశేషమైన స్పందన వస్తుంది.. ఆ పనేదో ఇప్పుడే చేస్తే ఓపని అయిపోతుంది కదా..'' ఉత్సాహంగా అన్నాడు సాయిరాం..

సాయిరాం ఆలోచన కూడా ఆనంద స్వరూప్‌కి బాగానే ఉందనిపించింది.. కాసేపు ఆలోచించి.. సాయిరాం వంక చూసాడు ఆనంద స్వరూప్..

''సరే.. అయితే.. శారదమ్మ జీవితం గురించి నేను వివరిస్తాను.. దానిని క్లుప్తంగా ఎడిట్ చేసి ఒక పదినిమిషాల నిడివి గల వీడియోని తయారు చేసి పోస్ట్ చేయ్..'' ఆనంద స్వరూప్ మాటలకి సాయిరాం ఉత్సాహంగా ''అలాగే సార్..'' అంటూ తన మొబైల్ ఫోన్ తీసి అందులో వాయిస్ రికార్డర్ ఆప్షన్ ఆన్ చేసి ఆనంద స్వరూప్ నోటి ముందు పెట్టాడు..

ఆనంద స్వరూప్ ఒకసారి సాయిరాం వంక చూసాడు.. కాసేపు కళ్ళు మూసుకుని శారదమ్మ జీవితం గురించి ఒకసారి మననం చేసుకుని, గొంతు సవరించుకుని చెప్పడం ప్రారంభించాడు. శారదమ్మ జీవితం గురించి చెబుతుంటే మొదటి సారిగా వింటున్న సాయిరాం ఎంతో ఎగ్జైట్ అయ్యాడు..

దాదాపు అరగంట సేపు ఆనంద స్వరూప్ చెప్పాడు.

శారదమ్మకి చిన్నప్పుడు పాము కాటువేయటం, జమీందారుని శారదమ్మ పెళ్ళి చేసుకోవడం, ఆస్తి కోసం స్వంత వారే శారదమ్మని ఇంట్లోనుండి గెంటేయడం, అనాథగా రైల్వే స్టేషన్ లో ఉన్న శారదమ్మ అనుకోకుండా సాయిబాబా మందిరానికి రావడం, అక్కడి నుండి ఆధ్యాత్మికురాలిగా మారడం, తర్వాత తన ద్వారా అమెరికాకి రావడం .. అంతా వివరంగా చెప్పాడు.

శారదమ్మ వృత్తాంతం విన్న సాయిరాం కళ్ళల్లో కన్నీళ్ళు నిండాయి. ఆనంద స్వరూప్ కళ్ళల్లో కూడా సన్నటి కన్నీటి పొర.. చెప్పడం పూర్తయ్యాక సాయిరాం వాయిస్ రికార్డర్‌ని ఆఫ్ చేసాడు. రెండు నిమిషాల వరకు ఇద్దరూ

మౌనంగా ఉండిపోయారు. వారి మెదడులో శారదమ్మ జీవిత వృత్తాంతమే కదులుతుంది..

అందులోనుండి  ముందుగా తేరుకున్నది ఆనంద స్వరూప్..

''సాయిరాం .. ఇప్పుడు నేను చెప్పినదంతా మరొక సారి విని, అందులో ముఖ్యమైన పాయింట్లు తీసుకుని వీడియో రూపొందించు.. ఇది తెలుగు లోనూ ఉండాలి, ఇంగ్లీషు లోనూ ఉండాలి.. దీనిని ఇంగ్లీషులో ట్రాన్స్‌లేట్ చేసి దానిని కూడా అప్‌లోడ్ చేయాలి'' అన్నాడు.

అప్పుడే తేరుకున్న సాయిరాం  కళ్ళని తుడుచుకుంటూ..

''అలాగే సార్..'' అన్నాడు..

''దీనిని ఎవరితో చెప్పిస్తావ్..?'' అన్నాడు..

''ఎవరైన లేడీ అయితే బావుంటుంది సార్..'' అన్నాడు సాయిరాం..

''నువ్వు చెప్పింది నిజమే.. అమ్మాయితో చెప్పిస్తే  స్పందన వెంటనే వస్తుంది.. మంచి రూపంతో పాటు తెలుగులో స్పష్టంగా మాట్లాడగలిగే వారు ఎవరున్నారు..?'' ఆలోచిస్తూ అన్నాడు ఆనంద స్వరూప్. ''ఆ విషయం నాకు వదిలేయండి  సార్.. నేను చూసుకుంటాను.. సరిగ్గా రెండు గంటల్లో ఫేస్ బుక్ ఆన్ చేసి చూడండి .. వీడియో అప్‌లోడ్ అయి ఉంటుంది..'' అంటూ ఆనంద స్వరూప్ దగ్గర సెలవు తీసుకుని వెళ్ళిపోయాడు సాయిరాం..

సాయిరాం  వెళ్ళిన తర్వాత ఆనంద స్వరూప్ చాలా సేపు  ఆలోచనలో పడిపోయాడు. 'ఒక మంచి పని చేస్తున్నప్పుడు ఎన్నో అవాంతరాలు ఎదురవుతుంటాయి.. వాటిని చూసి వెనుకడుగు వేస్తే జీవితంలో  ముందుకు  సాగడం కష్టం .. అందుకే ఆ అవాంతరాలని ఎదుర్కొంటూ లక్ష్యం వైపుకి దూసుకుపోవాలి..

అప్పుడే సంపూర్ణ విజయం దక్కుతుంది..'

ఒక సందర్భంలో శారదమ్మ అన్న మాటలు  గుర్తుకు రాగానే అతనిలో అప్పటి వరకూ ఉన్న నీరసం అంత  ఎగిరిపోయింది.. మనసంతా ఉత్సాహం నిండిపోగా.. విమర్శకుల  గురించిన ఆలోచనలు  విడిచిపెట్టి, డల్లాస్‌లో జరిగే

శారదమ్మ ప్రవచనం ఏర్పాట్ల గురించిన ఆలోచనలో పడిపోయాడు.

..................................

చెప్పినట్టుగానే సాయిరాం  రెండు గంటల్లో వీడియోని తయారు చేసాడు. దానిని ఫేస్ బుక్‌తో పాటు మిగిలిన సోషల్ సైట్లలో అప్‌లోడ్ చేసి ఆనంద స్వరూప్‌కి సమాచారం అందించాడు.
ఆనంద స్వరూప్ తన లాప్‌టాప్ ఆన్ చేసి ఆ వీడియోని చూసాడు. దానిని చూసిన ఆనంద స్వరూప్ సాయిరాంని మెచ్చుకోకుండా ఉండలేకపోయాడు.

అందమైన అమ్మాయితో ఆ వీడియోని రూపొందించాడు. శారదమ్మ జీవిత వృత్తాంతాన్ని స్పష్టమైన తెలుగులో ఆమె చెప్పడం ప్రారంభించింది. కంటెంట్‌కి అనుగుణంగా ఆమె ముఖం లో భావాలు  కదలాడుతున్నాయి. అలాగే ఆమె చేతనే ఇంగ్లీషులో కూడా చెప్పించాడు.. ఆ రెండు వీడియోలు  చాలా బాగా వచ్చాయి. వాటిని చూసిన వారు తప్పకుండా శారదమ్మపై వస్తున్న విమర్శలని ఖండించకుండా ఉండలేరు..

ఆనంద స్వరూప్ ముఖం  సంతోషంతో వెలిగిపోయింది.. అలాగే ఆ వీడియోని చూస్తూ ఉండిపోయాడు..

ఆ వీడియో అప్‌లోడ్ చేసిన పదినిమిషాల్లోనే పదివేల  వ్యూస్ రావడంతో ఆనంద స్వరూప్ ఎంతో ఆశ్చర్యపోయాడు.

సోషల్ మీడియాలో శారదమ్మకి ఉన్న ఫాలోయింగ్ అలాంటిది మరి..

వ్యూస్‌తో పాటు కామెంట్స్ కూడా చాలా వస్తున్నాయి.. ప్రతీ ఒక్కరూ ఆమె జీవితం స్ఫూర్తిదాయకమని, అలాంటి మంచి మనిషిని విమర్శించడం సరికాదంటూ చాలా మంది తమ అభిప్రాయాన్ని కామెంట్ల రూపంలో పంచుకోవడం ఆనంద స్వరూప్‌కి మరింత సంతోషాన్నిచ్చింది..

తమ ఆలోచన ఫలించినందుకు ఆనంద స్వరూప్ పొంగిపోయాడు. వెంటనే సాయిరాం కి ఫోన్ చేసాడు..

''సాయి.. యు డన్ ఎ వెరీ గుడ్ జాబ్..'' మెచ్చుకోలుగా అన్నాడు ఆనంద స్వరూప్..

''థ్యాంక్యూ సార్..'' ఆనంద స్వరూప్ మెచ్చుకోవడంతో సాయిరాం  ముఖం వెలిగిపోయింది..

''చూసారుగా ఈ వీడియోకి వస్తున్న రెస్పాన్స్.. చూస్తూ ఉండండి .. డల్లాస్‌లో జరిగే శారదమ్మ ప్రవచనం రోజు వరకు ఆవిడ పై వచ్చిన విమర్శలన్నీ పటాపంచలయిపోతాయి.. మళ్ళీ ఆవిడ ప్రవచనం కోసం అందరూ ఎదురుచూసేంతగా పరిస్థితులు  మారిపోతాయి..'' తిరిగి తనే అన్నాడు ఉత్సాహంగా..

సాయిరాం  మాటలకి ఆనంద స్వరూప్ కూడా ఏకీభవించాడు..

''మీరన్నది నిజమే సాయిరాం .. ఇంక మనం నెగెటివ్ రెస్పాన్స్ గురించి ఆలోచించడం మానేసి డల్లాస్‌లో జరిగే కార్యక్రమల  పనులు  పై దృష్టి సారించాలి.. డల్లాస్‌లో ఉన్న పెద్ద హాల్‌ని బుక్ చేయాలి.. ఆ తర్వాత ..'' అంటూ డల్లాస్‌లో శారదమ్మ ప్రవచనం కోసం చేసే ఏర్పాట్లకై  చేయాల్సిన పనుల గురించి వివరంగా చెప్పడం ప్రారంభించాడు ఆనంద స్వరూప్. ఆయన చెబుతున్న విషయాలని శ్రద్ధగా వింటూ నోట్ చేసుకోవడం ప్రారంభించాడు సాయిరాం.. పది నిమిషాల  పాటు వివరంగా చెప్పిన ఆనంద స్వరూప్..''ఇంకా మనకి నాలుగు రోజుల  వ్యవధి మాత్రమే ఉంది.. ఈ నాలుగు రోజులలో నేను చెప్పిన పనులన్నీ పూర్తయిపోవాలి.. ఏమాత్రం తేడా రాకూడదు.. రెండు ప్రవచనాలని మనం దిగ్విజయంగా ఏర్పాటు చేయగలిగాం..

ముందు ముందు జరిగే కార్యక్రమాలని కూడా అంతే దిగ్విజయంగా జరిపించడానికి శాయ శక్తులా కృషి చేయాలి..

ఏమాత్రం ఏమరుపాటుగా ఉన్నా అందరి ముందు అభాసుపాలవుతాం ..'' ఆనంద స్వరూప్ సున్నితంగా హెచ్చరించాడు సాయిరాంని..

''మీరు అంతలా చెప్పాలా సార్.. నాలుగు రోజుల్లో ఈ పనులన్ని పూర్తి చేసే  బాధ్యత నాది.. ఈ విషయంపై మీరేమీ కంగారు పడకండి ..'' కాన్ఫిడెంట్‌గా అన్నాడు సాయిరాం..

సాయిరాం  మాటలకి తృప్తిగా తలాడించి ఫోన్ పెట్టేసాడు ఆనంద స్వరూప్..

...........................

చికాగో లోని మహానగర్ ఏరియా..

ఆ మహానగర్ లోని సామ్ బర్గ్ ప్రాంతంలో ఉంది సాయిబాబా ఆలయం..

తెల్లటి పాలరాతితో నిర్మించిన ఆ ఆలయం ప్రేమామృతాన్ని  కురిపించే దివ్యాలయంలా కనిపిస్తుంది.. దాదాపు అయిదు ఎకరాల స్థలంలో  ఎంతో విశాలంగా నిర్మించారు ఆ ఆలయాన్ని.. ఇండియాలో సాయినాధుడికి జరిగే అర్చనలు, పూజలు  యధాతథంగా అక్కడ జరుగుతాయి.

గర్భగుడిలో నిలువెత్తు సాయినాధుడి  విగ్రహం చిరునవ్వు చిందిస్తూ కనిపిస్తుంది. కాలు మీద కాలు  వేసుకుని, కుడి చేతితో భక్తులని ఆశీర్వదిస్తూ, ముఖం లో చెదరని చిరునవ్వుతో ఎంతో అందంగా మెరిసిపోతూంది సాయినాధుడి  విగ్రహం.

ఆ విగ్రహాన్ని చూస్తూంటే ఆ సాయినాధుడే దిగివచ్చి నిజంగానే అక్కడ కూర్చున్నాడేమో అంత సహజంగా ఉంది ఆ విగ్రహం..

ప్రతి రోజూ ఉదయమే సంధ్యా హారతితో మొదలయ్యే భక్తుల హడావిడి , రాత్రి  వేళ సాయినాధుడికి ఇచ్చే శేజ్ హారతి వరకూ భక్తులు  వస్తూనే ఉంటారు. ఆ సాయినాధుడి దివ్య ఆశీర్వాదాలు పొందుతూనే ఉంటారు. సాయినాధుడిని కేవలం  ప్రవాస  భారతీయులే కాకుండా జాతి బేధం లేకుండా ప్రతీ ఒక్కరూ కొలుస్తారు. అందుకే ఆ మందిరంలోకి అడుగుపెట్టగానే ఎంతో మంది దేశస్థులు  అక్కడ కనిపిస్తుంటారు. భారతీయులలో ఈస్ట్ , నార్త్  అనే భేదం లేకుండా అన్ని వైపుల  నుండి  ఆయనని కొలవడానికి వస్తూంటారు.

ఆ రోజు సాయినాధుడిని దర్శించుకోవడానికి వచ్చారు.. ఒక వృద్ధ జంట, వారి కుమారుడు, కోడలు, మనుమరాలు, మనుమడు..

వారందరూ సంప్రదాయ దుస్తులు  వేసుకుని సాయి దర్శనం కోసం వచ్చారు. ఖరీదైన కారు మందిరం ప్రాంగణంలో ఆగగానే అందులోనుండి  దిగారు వారందరూ.. సాయినాధుడి మందిరం ఆవరణలోకి రాగానే ఏదో ప్రశాంతత.. అప్పటి వరకూ ఎన్నో సమస్యలతో, ఒత్తిడులతో తల్లడిల్లిపోయే భక్తులు .. ఒక్కసారిగా ఆ మందిరంలోకి అడుగుపెట్టగానే ఎంతో సేదతీరుతారు.. కంటికి కనిపించకుండానే ఆ సాయినాధుడు భక్తుల  మనసులో ఉండే బాధల నుండి  విముక్తుడిని చేస్తున్నాడేమో అని అక్కడికి వచ్చే ప్రతీ భక్తుడి  మనసులో మెదులుతుంది..

అంత స్వాంతన లభిస్తుంది కాబట్టే సాయినాధుడిని దర్శించుకోవడానికి  జాతి, ప్రాంత భేదాలు లేకుండా తండోప తండాలు గా విచ్చేస్తుంటారు..

కారు దిగిన వారు నేరుగా మందిరం వైపు నడిచాడు.. ఆ వృద్దుడికి దాదాపు 65 సంవత్సరాలుంటాయి..

వయసు పైబడ్డా శరీర దారుఢ్యం మాత్రం ఏమాత్రం తగ్గలేదు అతనిలో.. తెల్లటి వెంట్రుకలు ఉన్నప్పటికీ ఏదో రాజఠీవి ఆయన ముఖం లో కనిపిస్తుంది.. మీసాలు  మెలేసి ఉన్నాయి.. వయసుతో నిమిత్తం లేకుండా ఎంతో హుషారుగా అడుగులు  వేస్తున్నాడు..

ఆయన కుమారుడి పేరు రామారావు .. ఆయన భార్యపేరు  మీనాక్షి... కోడలు  శీలావతి, మనమరాలు  ప్రతిభ పదిసంవత్సరాల  వయసుంటుంది.. మనమడు ప్రవీణ్ ఎనిమిది సంవత్సరాల  వయసు..

అమెరికాలో ఉన్న కొడుకు కోడలిని చూడడానికి  ఇండియా నుండి  వచ్చారు ఆ వృద్ధ దంపతులు.

కొడుకూ, కోడలు , మనుమడూ మనుమరాలితో ఎంతో హాయిగా జీవితం సాగిపోతుంది వారికి. ఇండియాలో ఉన్న వంద కోట్ల రూపాయల  ఆస్తికి వారసుడు ఆయన కుమారుడు రామారావు.

తన తదనంతరం ఆ ఆస్తిని కాపాడుకునే బాధ్యతని తన కొడుకుకి ఇవ్వాలన్న ప్రధాన లక్ష్యంతో ఆయన అమెరికా వచ్చాడు.

సాయిబాబా అంటే ఆయనకి ఎంతో భక్తి. చేసే పనులలో 'చెడు' ఉన్నప్పటికీ సాయిబాబాని కొలిచే విషయంలో మాత్రం ఆయన ఎంతో నిష్టగా నిష్ఠగా వ్యవహరిస్తారు. అందుకే ఈ రోజు అమెరికాలోని సాయిబాబా మందిరానికి వచ్చారు.

సాయి దర్శనం అనంతరం ఆస్తిని కుమారుడికి అప్పగించే విషయం గురించి మాట్లాడాలని ఆయన భావన.

అయితే అనుకోకుండా ఆ ఆస్తి తన కుమారుడికే కాదు, తనకి కూడా దక్కనంత పెద్ద ఉపద్రవం వచ్చింది..

దాంతో ఒక్కసారిగా కుప్పకూలిపోయాడు ఆ వృద్దుడు.. సరిగ్గా వారం రోజుల క్రితం చికాగోలోని తన కుమారుడి ఇంట్లో ఉన్న సమయంలో తన మనుమరాలు ప్రతిభ ద్వారా ఆ ఉపద్రవాన్ని తెలుసుకున్నాడు..

ఆరోజు..

ఏదో తెలుగు పేపరు తిరగేస్తూ సోఫాలో కూర్చున్నాడు ఆయన. అదే సమయంలో మనుమరాలు ప్రతిభ పరుగెత్తుకుంటూ వచ్చింది ఆయన దగ్గరికి..

''తాతయ్యా.. తాతయ్యా.. ఒక్కసారి ఇటు రా నీకొకటి చూపించాలి..'' అంటూ పేపరు చదువుతున్న తాతయ్య చేయి పట్టుకుని లాగింది..

మనుమరాలి వైపు అప్యాయంగా చూస్తూ..

''ఏమిటమ్మా అది.. ఇప్పుడు చూసేంత ఓపిక నాకు లేదు కానీ.. నువ్వే చూసుకో..'' అన్నాడు లాలనగా..

''అదేం కుదరదు.. నువ్వు రావాల్సిందే.. ఎందుకంటే ఇండియా నుండి ఒకావిడ అమెరికాకి వచ్చింది.. ఆవిడ చేసే ప్రసంగాలు ఎంత బావుంటాయో తెలుసా.. అవి వింటే నీవు ఎంత

ఆశ్చర్యపోతావో..'' అంది.. ఆయనకి కూడా అదేంటో తెలుసుకోవాలన్న కుతూహలం పుట్టడంతో మనుమరాలితో వెళ్ళాడు..

మనుమరాలు ప్రతిభ కంప్యూటర్ ముందుకు తీసుకు వెళ్ళింది.. యూట్యూబ్ ఓపెన్ చేసి శారదమ్మ ప్రవచనాన్ని క్లిక్ చేసింది..

కంప్యూటర్ స్క్రీన్‌పై కనిపించిన శారదమ్మని చూడగానే.. ఆ వృద్ధుడి చేతిలో ఉన్న పేపరు క్రిందపడిపోయింది..

ఆశ్చర్యంతో ఆయన కనుగుడ్లు పెద్దవయ్యాయి.. తన కాళ్ళ క్రింద భూమి కంపిస్తుందేమో అన్నంతగా వణికిపోయాడు.. కంప్యూటర్ స్క్రీన్‌పై శారదమ్మ..

శారదమ్మ ఇంకా బ్రతికే ఉందా..? ఆ ఆలోచననే అతను భరించలేకపోతున్నాడు..

ఎప్పుడో చనిపోయిందని భావించి హాయిగా ఉంటున్న ఆయనకి ఇప్పుడు ఇలా కనిపించి పెద్ద షాకే ఇచ్చింది శారదమ్మ..

అతను ఇంకా షాక్‌లో నుండి తేరుకోలేకపోతున్నాడు.. శారదమ్మ ఆచూకి తెలిస్తే గుట్టు చప్పుడు కాకుండా

అంతమొందించాలని పదిమందిని ప్రత్యేకంగా నియమించాడు తను.. వారందరూ కొన్ని సంవత్సరాల పాటు ప్రతీ ఊరుని గాలించి మరీ శారదమ్మ కనిపించడం లేదనీ, ఆవిడ ఎప్పుడో చనిపోయి ఉంటుందని చెప్పడంతో వారి మాటలని నమ్మి తాను శారదమ్మ గురించి దాదాపుగా మరిచిపోయాడు..

కానీ.. కానీ..

శారదమ్మ బ్రతికే ఉంది..

అదీ అమెరికాలో..

అదెలా సాధ్యం..

అసలు శారదమ్మ ఇన్నేళ్ళుగా ఎక్కడుంది..?

తాను పంపించిన వారు ఊళ్ళలోనే కాదు, పట్టణాలలో కూడా శారదమ్మ గురించి వాకబు చేసారు.. అన్ని అనాధాశ్రమాలలోనూ, వృద్ధాశ్రమాలోనూ గాలించారు.. ఎక్కడా కనిపించని శారదమ్మ

ఇప్పుడు.. ఈ అమెరికాలో అదీ ఓ ఆధ్యాత్మికురాలి అవతారంలో కనిపించింది..

చిరునవ్వు చిందిస్తూ ప్రసంగిస్తున్న శారదమ్మని చూసి భరించలేకపోతున్నాడు. ఆయన ఒళ్ళంతా చెమటపట్టేసింది.. ఒంట్లోనుండి ఎవరో శక్తినంత బయటికి లాగేస్తున్నట్టుగా అలాగే కుప్పకూలిపోయాడు.

తన తాతయ్య కుప్పకూలిపోవడంతో ఉలిక్కిపడింది ప్రతిభ. ఉన్నఫళంగా తాతయ్య అలా ఎందుకు పడిపోయాడో ఆ చిన్నారికి అర్థం కాలేదు.

''తాతయ్యా.. తాతయ్యా..'' అంటూ కంగారుగా పిలిచింది ప్రతిభ.. ఆ చిన్నారికి ఏం చేయాలో అర్థం కాలేదు..

''మమ్మీ.. మమ్మీ..'' అంటూ గట్టిగా అరిచింది..

అప్పటికి కాస్త తేరుకున్న ఆ వృద్ధుడు ప్రతిభని వారించాడు...

''నాకేం కాలేదులే తల్లీ.. కాస్త కళ్ళు తిరిగినట్లయి పడిపోయాను అంతే..'' క్రింది నుండి లేచి నిలబడుతూ నవ్వుతూ అన్నాడు.

ఆయన మాటలకి ఎంతో ఆశ్చర్యపోయింది ప్రతిభ.

'ఎలాంటి పరిస్థితిలోనైన ధైర్యంగా ఉండాలి.. ఏ సమస్య వచ్చినా ధైర్యంగా ఎదుర్కోవాలి.. భయం అన్నది మన మనసులోకి వస్తే ఆ భయమే మన ఎదుగుదలకి ఆటంకంగా మారుతుంది..

కాబట్టి ప్రతికూల పరిస్థితులలో ధైర్యం కోల్పోకుండా ముందుకు సాగాలి..' అంటూ తాతయ్య ఎప్పుడూ తమకి చెబుతుండే వాడు.. కానీ.. అలాంటి తాతయ్య కళ్ళల్లో స్పష్టంగా భయాన్ని చూసింది ప్రతిభ.

తాతయ్య అంతలా ఎందుకు భయపడ్డాడు..? చిన్నారి ప్రతిభకి అర్థం కాలేదు..

కానీ తన తాతయ్య ముఖం లో ఇంకా భయం కనిపిస్తూంది.. ఆయన శరీరం మొత్తం చెమటతో నిండిపోయింది.

ప్రతిభ అరుపుకి కిచెన్ గదిలో ఉన్న శీలావతి అక్కడికి పరిగెత్తుకుంటూ వచ్చింది..

''ఏమయిందమ్మా.. అంత గట్టిగా అరిచావు..?'' కంగారుగా అంది శీలావతి..

ప్రతిభ ఏదో చెప్పాలని అనుకుంటుండగానే..

''అబ్బే.. ఏమీలేదమ్మా.. కంప్యూటర్‌లో ఏదో ప్రోగ్రాం చూస్తూ అలా అరిచింది..'' నవ్వుతూ అన్నాడు ఆ వృద్ధుడు.

''అంతేనా .. అమాత్రం దానికి అంతలా అరవాలా..? రాను రాను  నీకు అల్లరి ఎక్కువవుతోంది..'' చిరుకోపంగా అంటూ అక్కడి  నుండి  వెళ్ళిపోయింది శీలావతి.

ప్రతిభ తన తాతయ్య వంక గుర్రుగా చూసింది.. ఆ చూపులో 'నీ వల్ల  అమ్మతో చివాట్లు తినాల్సి వచ్చింది..' అన్న అర్థం ప్రతిబింబిస్తుంది..

మనుమరాలి చూపులోని భావాన్ని అర్థం చేసుకున్న అతను తప్పుచేసిన వాడిలా లెంపలు వేసుకుంటూ...

''నన్ను క్షమించు తల్లీ.. నేను క్రిందపడ్డానని తెలిస్తే  మీ అమ్మ అనవసరంగా కంగారు పడుతుంది.. ఈ విషయం డాడీకి చెబుతుంది.. డాడీ కూడా కంగారు పడతాడు.. హాస్పిటల్ అదీ అంటూ నానా  హంగామా చేస్తాడు..

అందుకే అలా చెప్పాను.. ఏదీ ఒకసారి నన్ను సరిగ్గా చూడనీ..'' ప్రతిభకి సర్దిచెబుతున్నట్టుగా అన్నాడు. ఆయన గొంతులో సన్నటి వణుకుని స్పష్టంగా గమనించింది ప్రతిభ.

''తాతయ్య ఈ సీట్లో కూర్చుని చూడండి..'' అంటూ తాను కుర్చీలో నుండి  లేచి ఆయనని కూర్చోమంది.. అతను కూర్చున్నాడు.

కంప్యూటర్ స్క్రీన్‌పై శారదమ్మ ప్రవచనం వస్తోంది.. అతను శారదమ్మనే చూస్తున్నాడు.. కళ్ళు పెద్దవి చేసుకుని మరీ.. ప్రతిభ ఆయననే గమనిస్తూంది..

శారదమ్మ ప్రవచనాన్ని చూస్తున్న ఆయన ముఖం లో క్రమంగా భావాలు  మారుతున్నాయి.

ఏసీ గదిలో కూడా ఆయన ముఖం  చెమటతో తడిసిపోతూంది.

ఆయన కళ్ళల్లో ఎరుపు జీరలు  అలుముకున్నాయి .. కంప్యూటర్ స్క్రీన్‌పై కనిపిస్తున్న శారదమ్మని చూస్తూ తనని తాను మరిచిపోయాడు.

ఏదో తెలియని కోపం అతనిలో ప్రవేశిస్తుంది. కరుణేంద్ర భూపతిలో వస్తున్న ఆ మార్పుని గమనించిన చిన్నారి ప్రతిభకి మొట్టమొదటి సారి తన తాతయ్యని చూస్తూంటే భయమేసింది.. గతంలో ఎప్పుడూ ఆయన అలా ఉండడం చూసి ఎరుగని ప్రతిభ ఎంతో ఆశ్చర్యానికి గురయ్యింది..

కంప్యూటర్ స్క్రీన్‌పై కనిపిస్తున్న శారదమ్మని చూస్తూ తన తాతయ్య అలా మారిపోయాడన్నది మాత్రం ప్రతిభకి అర్థం అయ్యింది..

కానీ శారదమ్మని చూసి తాతయ్య ఎందుకు అలా మారిపోయాడు..?

ఆమెని చూడగానే తాతయ్య ఎందుకలా భయపడుతున్నాడు..?

అది భయమా..? కోపమా..? లేక మరింకేదయినానా..?

లోతుగా ఆలోచించడానికి చిన్నారి ప్రతిభ మెదడు సహకరించలేదు..

కానీ తన తాతయ్యలో వచ్చిన ఆ మార్పుని మాత్రం ప్రతిభ స్పష్టంగా పసిగట్టింది..

ప్రతిభ ఆయననే గమనిస్తుంది..

‘‘ఇది.. ఇది.. ఇంకా బ్రతికే ఉందా..? ఎప్పుడే చచ్చిపోయిందనుకున్న శారదమ్మ ఇంకా బ్రతికే ఉన్నదా.. ఇదెలా సాధ్యం..? ఇది బ్రతకడానికి వీల్లేదు.. బ్రతకడానికి వీల్లేదు..’’ తనని తాను మరిచిపోయి.. ప్రక్కన తన మనుమరాలు  ఉందన్న స్పృహ కూడా లేకుండా గట్టిగా అరిచాడు..

ఆ అరుపులకి అదిరిపడింది ప్రతిభ..

''తాతయ్యా.. తాతయ్యా..'' భయంగా పిలిచింది..

ప్రతిభ పిలుపుతో ఉలిక్కిపడ్డాడు. ఒంటిమీద స్పృహలేకుండా తాను అన్న మాటలు ప్రతిభ విన్నదన్న ఆలోచనతో అదిరిపడ్డాడు. తనని తాను సర్దుకుంటూ ముఖం లో చిరునవ్వుని తెచ్చిపెట్టుకుంటూ మనుమరాలిని దగ్గరికి తీసుకుని తన ఒళ్లో కూర్చోపెట్టుకున్నాడు..

ఆయన ప్రవర్తన ప్రతిభకి ఏమీ అర్ధం కాలేదు.. ఆయనవైపు అయోమయంగా చూస్తూండి పోయింది.. ఆయన వింత చేష్టలతో ప్రతిభ ఝుడుసుకుందన్న విషయం ఆమె ముఖం చూస్తేనే అర్ధమవుతుంది. మనుమరాలు భయపడిందని గ్రహించిన అతను మామూలు స్థితిలోకి వచ్చాడు.

''అమ్మా.. ప్రతిభ.. భయపడ్డావా .. హ..హ..హ..''

అంత వరకూ తీవ్రమైన స్వరంతో అరిచిన తాతయ్య.. తిరిగి ఏమీ జరగనట్టుగా మామూలుగా మాట్లాడుతుండడం ప్రతిభకి ఎంతో ఆశ్చర్యాన్ని కలిగించింది..

''ఎలా ఉంది నా నటన.. బావుందా..?'' నవ్వుతూ అన్నాడు అతడు.

''ఏమిటీ..? నువ్వు యాక్టింగ్ కూడా చేస్తావా తాతయ్యా..?'' కనుబొమ్మలు ఎగరేస్తూ అంది ప్రతిభ.. ''ఓ.. చిన్నప్పుడు మా ఊళ్ళో నేను డ్రామాలు వేసేవాణ్ని.. అందులో నేను రావణాసురుడి వేషం వేసేవాడిని .. నా నటనకి అందరూ మెచ్చుకునే వారు తెలుసా..?'' గర్వంగా అన్నాడు ఆ వృద్ధుడు.

''అది సరే.. ఉన్న ఫళంగా ఇప్పుడు యాక్టింగ్ చేయాల్సిన అవసరం ఏమొచ్చింది..? నీ యాక్టింగ్ వల్ల నేనెంత భయపడ్డానో తెలుసా..?'' గుండెపై చేయి వేసుకుని భయంగా అంది ప్రతిభ..

''హ..హ..హ.. భయపడ్డావా..? నీకో విషయం తెలుసా.. నిన్ను ఇలా భయపెట్టడానికే అలా చేసాను.. హ..హ..హ..''

రాని నవ్వుని ముఖం లోకి తెచ్చుకుంటూ అన్నాడు అతను.

''పో.. తాతయ్యా.. నన్ను భయపెట్టడానికి నీకు ఇదే సమయం దొరికిందా.. కంప్యూటర్‌లో ఆవిడ ప్రవచనం ఎంత బాగుందో.. ఆ అమ్మ చెప్పే మాటలు నాకు చాలా బాగా నచ్చాయి.. ఆమె ప్రోగ్రాం వస్తున్నప్పుడు నువ్విలా చేయడం ఏమీ బావోలేదు..'' బుంగ మూతి పెట్టి అంది ప్రతిభ..

''హ..హ..హ.. సరిగ్గా ఆవిడ మాట్లాడేటప్పుడే నేనెందుకు నటించాను తెలుసా..?'' అన్నాడు.

''ఎందుకు..?'' ఆశ్చర్యంగా అంది ప్రతిభ..

''ఎందుకంటే.. ఆవిడ కూడా నటిస్తుంది కాబట్టి..''

''ఏమిటీ..? అదంత నటనేనా .. కానీ నాకలా అనిపించడంలేదు కదా.. జీవితంలో ఎలా ఎదగాలన్న విషయం గురించి ఆవిడ అంత బాగా వివరిస్తున్నారు కదా.. పదేళ్ళ వయసున్న నాకే ఇంత బాగా అర్థం అవుతుంది.. అలాంటిది ఆవిడ ప్రవచనాల వల్ల ఎంతో మంది, వారి జీవితాలలో వెలుగు నింపుకున్నారంట.. నీకు సోషల్ మీడియా గురించి తెలియదు.. ఆవిడ ప్రసంగాన్ని సోషల్ మీడియాలో కొన్ని కోట్ల మంది చూసారు తెలుసా..? అలాంటావిడ నటిస్తుందని అంటే నమ్ముతా ననుకుంటున్నావా ..?'' అంది ప్రతిభ..

తన మనుమరాలు , శారదమ్మని పొగుడుతూంటే భరించలేకపోయాడు ఆ వృద్ధుడు. ''నువ్వు చిన్న పిల్లవి.. నటన ఏదో, నిజం ఏదో తెలుసుకునే వయసు నీకు లేదు.. ఇంకో సారి ఇలాంటి పిచ్చి పిచ్చి ప్రోగ్రాంలు చూడవద్దు.. అర్థమయిందా..'' సీరియస్‌గా అన్నాడు.

తన మాటకి తాతయ్య అంతలా సీరియస్ అవుతాడని ఊహించని ప్రతిభ ఆ విషయం మరీ పొడిగించకుండా 'అలాగే తాతయ్యా' అని అన్నది.

''అదీ.. అలా చెప్పిన మాట వింటే నా చిట్టి తల్లికి ఏది కావాలంటే అది కొనిస్తాను.. బుద్ధిగా చదువుకోవాలి గానీ..

ఇలాంటి పిచ్చి పిచ్చి ప్రోగ్రాంలు చూడకూడదు.. సరేనా తల్లీ..''

''అలాగే తాతయ్యా..''

''సరే.. అమ్మా..

ఇక్కడ కూర్చునే ఓపిక లేదు.. నేను అలా సోఫాలో కూర్చుని పేపర్ చదువుకుంటాను..''

అంటూ ఒళ్ళో నుండి మనమరాలిని దింపేసి అక్కడి నుండి వెళ్ళిపోయాడు అతను.

వెళుతున్న తాతయ్యనే గమనిస్తుంది ప్రతిభ..

ఈ రోజు ఆమె కంటికి అతను కొత్తగా కనిపిస్తున్నాడు.. ఆయనలో వచ్చిన మార్పు, ఆయన అన్న మాటలు ఆమె చెవుల్లో ఇంకా మారుమ్రోగుతూనే ఉన్నాయి.. అప్పటికి తాత్కాలికంగా ఆ విషయాన్ని మరిచిపోయి కంప్యూటర్‌లో గేమ్స్ అడుకుంటూ కూర్చుండి పోయింది ప్రతిభ.

కానీ.. ఆ వృద్ధుడి గుండెల్లో మాత్రం అగ్ని పర్వతాలు బ్రద్దలవుతున్నాయి..

ఆయన ఆలోచనలన్నీ శారదమ్మ చుట్టూనే తిరుగుతున్నాయి.. ఇంతవరకూ చనిపోయిందన్న భ్రమలో ఉన్న తనకి శారదమ్మ కనిపించి కనువిప్పు చేసింది..

ఇప్పుడేం చేసేది..? శారదమ్మని ఎలాగైనా అంతమొందించాలి..?

ఎలా..?

ఎలా..?

ఎలా..?

ఇండియాలో అయితే తన మనుషులతో చిటికెలో శారదమ్మని అంతం చేయించగలడు..

కానీ.. ఇది అమెరికా..

ఈ అమెరికాలో ఆమెని అంతమొందించడం సాధ్యం కాదు..

కానీ.. ఏదో చేయాలి..?

అసలు .. అసలు .. శారదమ్మ అమెరికాకి వచ్చేంత స్థాయికి ఎలా ఎదగగలిగింది..

కట్టు బట్టలతో ఇంట్లో నుండి తరిమివేయబడ్డ శారదమ్మ.. ఏకంగా అమెరికాకి వచ్చేటంత ఎత్తుకు ఎలా ఎదగగలిగింది..

అతని మెదడు మొద్దుబారిపోయినట్లనిపించింది.. తల పట్టేసినట్టయింది.. మెల్లిగా తలనొప్పి ప్రారంభమయింది..

శారదమ్మ గురించి తెలిసిన్పటి నుండి ఆ వృద్దుడి ముఖం కళావిహీనంగా మారిపోయింది.. మనిషి నీరసించిపోయాడు.. ముందులాగ హుషారుగా ఉండలేక పోతున్నాడు. కొడుకు, కోడలు, మనుమడు, మనమరాలితో మనస్ఫూర్తిగా మాట్లాడలేకపోతున్నాడు.

వారు ఏదడిగినా .. పొడిగా సమాధానం చెబుతూ చాలా వరకూ మౌనంగానే ఉండిపోతున్నాడు.

తన తండ్రిలో వచ్చిన ఈ మార్పుని రామారావు గమనించాడు..

ఆయన అలా ముభావంగా ఉండడానికి కారణం ఏమిటో రామారావుకి కూడా అర్థం కాలేదు..

రామారావు నేరుగా తన భార్య శీలావతి దగ్గరకు వెళ్ళాడు..

''శీలా..'' పిలిచాడు రామారావు..

బెడ్‌రూంలో బట్టలు సర్దుతున్న శీలావతి భర్త పిలుపుకి వెనక్కి తిరిగి చూసింది..

''ఏమిటండీ..?'' అంది..

''నువ్వు మా నాన్న గారిని ఏమయినా అన్నావా ..?'' అనుమానంగా అన్నాడు రామారావు..

''అయ్యో రామా.. నేను మామ గారిని ఏమంటానండీ.. ఉదయం టిఫిన్ చేద్దువు రా మామయ్యా.. అన్నాను..

మధ్యాహ్నం భోంచేద్దువు రా మామయ్యా అన్నాను.. సాయంత్రం టీ త్రాగుతావా మామయ్యా అని అన్నాను అంతే..''

అమాయకంగా అంది శీలావతి..

''అబ్బా.. ఆ అనడం కాదు.. ఏదయిన ఆయన మనసుకి గాయం చేసే మాటలు అన్నావా అని అంటున్నాను..''

వారు మాట్లాడుతుండగానే ప్రతిభ అక్కడికి వచ్చింది..

''ఇది మరీ బావుంది.. మామ గారి మనసుని గాయం చేసేలా నేనేమంటానండీ.. మన పెళ్ళయి ఇన్ని రోజులయింది.. ఎప్పుడయిన మీరు నన్నీ విధంగా అన్నారా .. అత్త, మామని మా అమ్మా నాన్న లాగా చూసుకుంటానని మీకు తెలియదా..'' తన మాటలతో భార్య మనసు నొప్పించానని రామారావుకి అర్థమయింది..

''అపార్థం చేసుకోకు శీలా.. రెండు మూడు రోజులుగా నాన్న గారు చాలా ముభావంగా ఉంటున్నారు.. ఎవరితోనూ సరిగా మాట్లాడటం లేదు.. అందుకే నిన్ను అలా అడిగాను తప్ప మరొకటి కాదు..''

''అవునండీ.. నేను గమనిస్తున్నాను.. మునుపటిలా హుషారుగా ఉండటం లేదు.. అత్తయ్య తో కూడా సరిగా మాట్లాడటం లేదు.. పిల్లలు పలకరించినా  నవ్వి ఊరుకుంటున్నారు తప్ప వారితో ఉత్సాహంగా గడపడం లేదు..

ఎందుకంటారు..?'' అనుమానంగా అంది శీలావతి..

''అదే నాకు అర్థం కావడం లేదు.. ఏమయి ఉంటుంది..? మన వల్ల ఆయనకేమయినా ఇబ్బంది కలిగిందా అన్న సందేహం నాకు వస్తూంది..''

వారి మాటలు  వింటున్న ప్రతిభకి ఆరోజు శారదమ్మ ప్రవచనాలన్ని విన్న తర్వాత తాతయ్య చేసిన వింత ప్రవర్తన గర్తుకు వచ్చింది..

''ఆ.. డాడీ.. తాతయ్య అలా ఎందుకు ఉంటున్నారో నాకు తెలుసు..'' అంది ప్రతిభ..

ఆ మాటలకి రామారావు, శీలావతి ఇద్దరూ ఉలిక్కిపడ్డారు ..

''తాతయ్య అలా ఉండడానికి కారణం నీకు తెలుసా..? ఎందుకలా ఉంటున్నారు..?''

ఆతృతగా అడిగాడు రామారావు..

''మరేమో.. మొన్న కంప్యూటర్‌లో శారదమ్మ ప్రవచనం వస్తూంటేనూ తాతయ్యని ఆ ప్రవచనం చూడమని కంప్యూటర్ దగ్గరికి తీసుకువచ్చాను.. కంప్యూటర్‌లో శారదమ్మ ప్రవచనం చూసి తాతయ్య చాలా వింతగా ప్రవర్తించారు..

అంతేకాదు.. తనలో తాను ఏదో మాట్లాడుకున్నారు కూడా..'' ఆరోజు సంఘటనని ఊహించుకుంటూ చెప్పింది ప్రతిభ..

రామారావు, శీలావతి ఇద్దరూ ఒకరి మొహాలొకరు చూసుకున్నారు..

''ఎవరిదో ప్రవచనం వస్తే నాన్న గారు ఎందుకలా ప్రవర్తిస్తారు..? అది సరే.. ఇంతకీ తాతయ్య ఏమని మాట్లాడారు..'' కుతూహలంగా అడిగాడు రామారావు ..

''అదీ.. అదీ.. ఆ.. కంప్యూటర్ స్క్రీన్‌పై శారదమ్మని చూస్తూ.. ఇది ఇంకా బ్రతికే ఉందా..? ఇది చావలేదా..?

అంటూ పిచ్చివాడిలా అరిచాడు.. ఆయన అరుపుకి నాకు భయమేసింది.. నేను భయంగా తాతయ్యా.. అని పిలవగానే మళ్ళీ మామూలుగా మాట్లాడారు.. అంతేకాదు.. మరొక్కసారి ఆమె ప్రవచనాలు చూడవద్దని కూడా హెచ్చరించారు..''

ప్రతిభ మాటలకి రామారావు, శీలావతి ఇద్దరూ ఆశ్చర్యపోయారు..

''ఇంతకీ ఏమిటా ప్రవచనం.. ఒకసారి చూద్దాం పదా..'' అంటూ అక్కడి నుండి కంప్యూటర్ రూం వైపు నడిచాడు రామారావు, ప్రతిభ, శీలావతి..

ప్రతిభ కంప్యూటర్ ఆన్ చేసి, యూట్యూబ్‌లో శారదమ్మ ప్రవచనం తాలుకు వీడియోస్ ప్లే చేసింది..

ఆ వీడియోలో కనిపించిన శారదమ్మ వంక ఆశ్చర్యంగా చూసాడు రామారావు.. ఆమెని ఎక్కడో చూసినట్టు లీలగా గుర్తుకు వస్తుంది.. కానీ ఎక్కడ చూసానో అన్నది మాత్రం తెలియలేదు.. ఆమెని చూసి తన తండ్రి అంతలా రియాక్టయ్యాడంటే.. దీని వెనుక ఏదో పెద్ద రహస్యమే ఉండి ఉంటుందని

మాత్రం రామారావుకి  అర్థమయింది. కానీ.. ఒక ఆడదానిని చూసి తన తండ్రి ఇంతలా మానసిక ఒత్తిడికి గురవుతున్నాడంటే.. అసలు  సంగతేమిటో కనుక్కోవాలి.. రామారావు మనసులో మొదటి సారి శారదమ్మ గురించిన ఆలోచన మొలకెత్తింది..

''చూడమ్మా ప్రతిభ.. తాతయ్య ముందు ఈ ప్రవచనాల  తాలూకు  వీడియోని  ఎప్పుడూ ప్లే చేయకు.. ఆయనకి ఇష్టం లేని పని మనం చేయకూడదు కదా..'' లాలనగా అన్నాడు రామారావు..

''అలాగే డాడీ..'' అంటూ బుద్ధిగా తలూపింది ప్రతిభ..

రామారావు కి తన తండ్రి ముభావంగా ఎందుకున్నాడో అర్థమయింది.. కానీ.. అర్థం కానీ విషయం ఏమిటంటే..

ఆ ముభావం వెనుకున్న రహస్యం.. దాన్ని ఎలాగయిన ఛేధించాలి.. అని మనసులో గట్టిగా అనుకున్నాడు..

ఈ విషయాన్ని తాత్కాలికంగా ప్రక్కన పెట్టి, తనకి ఏమీ తెలియని వాడిలా తండ్రి దగ్గరకు వచ్చాడు రామారావు.

''నాన్న మూడు నాలుగు రోజుల నుండి నిన్ను గమనిస్తున్నాను.. మాతో సరిగా మాట్లాడటం లేదు.. పిల్లలతో కూడా సరిగా ఉండలేకపోతున్నారు..? అసలేమయింది..? ఒంట్లో బావోలేదా..?'' అప్యాయంగా అడిగాడు రామారావు.

ఆ మాటలకి ఉలిక్కిపడ్డాడు అతడు. తిరిగి తనని తాను సర్దుకుంటూ..

''అబ్బే.. అలాంటిదేమీ లేదు .. ఏదో ఒంట్లో కాస్త నలతగా ఉంటేనూ..'' అన్నాడు..

''అయ్యో.. అలాగా.. మరీ విషయం నాదగ్గరెందుకు దాస్తున్నారు.. పదండి  హాస్పిటల్‌కి వెళదాం..'' కంగారు పడుతూ అన్నాడు రామారావు ..

''అబ్బే.. హాస్పిటల్‌కి వెళ్ళాల్సినంత సీరియస్ ఏమీ కాదు లే.. వాతావరణం మారింది కదా.. దానివల్ల  వచ్చిన నీరసం ఇది.. అంతే తప్ప మరోటి కాదు.. రెండు మూడు రోజులు  గడిస్తే ..

మళ్ళీ మామూలుగా అవుతానులే..'' తేలికగా అన్నాడు ఆ వృద్ధుడు. ''లేదు.. లేదు.. మీరు మునపటిలా హుషారుగా ఉండటం లేదు.. సరిగా భోజనం కూడా చేయడం లేదు.. ఇలాగే చూస్తూ ఊరుకుంటే.. మీ ఆరోగ్యం మరింత క్షీణించిపోతుంది.. నా మాట విని ఒకసారి హాస్పిటల్ కి వెళ్ళి చెక్ చేయించుకోవడం మంచిది నాన్న..'' తండ్రి పక్కనే కూర్చుంటూ ఆయన నుదుటిపై తన చేయివేసి చూస్తూ అన్నాడు రామారావు..

తనపై రామారావు చూపిస్తున్న అప్యాయతకి కరుణెద్రభూపతి మనసు ఉప్పొంగిపోయింది.. పుత్ర వాత్సల్యం పొంగుకొచ్చింది.. ఆ ఆనందంలో కళ్ళల్లోనుండి సన్నటి కన్నీటిపొర ఏర్పడింది.. కన్నీళ్ళని రామారావు కంట కనిపించనీయకుండా తుడుచుకుంటూ..

''హాస్పిటల్ అదీ ఏమీ వద్దు కానీ.. ఒకసారి గుడికి వెళ్ళొద్దాం.. ఈ దగ్గర్లో సాయిబాబా మందిరం ఉందా..? ఉంటే ఒకసారి గుడికి వెళ్ళి రావాలని ఉంది ..'' అన్నాడు..

''మీరింతగా అడగాలా నాన్న గారూ.. ఇక్కడికి యాభై కిలోమీటర్ల దూరంలో సామ్‌బర్గ్ అనే ప్రాంతంలో సాయిబాబా టెంపుల్ ఉంది.. రేపు ఉదయమే వెళదాం.. ఇప్పుడు అర్థమయింది మీ సమస్య.. ఇండియాలో అయితే రోజూ గుడికి వెళ్ళి వచ్చే అలవాటు మీకుంది.. ఇక్కడ ఆ అవకాశం లేకపోయే సరికి ఇలా నీరసించిపోయారు.. అంతేకదా..'' నవ్వుతూ అన్నాడు రామారావు.

ఏమాత్రం ఆలస్యం చేయకుండా తలాడించాడు.. ''అవునవును.. అంతే.. అంతే..'' అన్నాడు..

''నాకు ముందే చెప్పి ఉంటే.. డ్రైవర్‌నిచ్చి మిమ్మల్ని ప్రతిరోజూ గుడికి పంపించేవాణ్ణి కదా.. ఇప్పటికీ మించిపోయిందేమీ లేదు.. మీరు ఇక్కడ ఉన్నన్ని రోజులు వీలయినప్పుడల్లా గుడికి వెళ్ళిరండి.. రేపు ఉదయం మాత్రం మనమందరం కలిసి వెళదాం.. సరేనా..'' అన్నాడు రామారావు..

''అలాగే..'' ఆనందపడి పోతున్నట్టుగా నటిస్తూ అన్నాడు కరుణేంద్ర భూపతి..

అలా.. సాయిబాబా టెంపుల్‌కి వారంతా రావడం జరిగింది..

ఆ టెంపుల్‌ని చూడగానే కరుణేంద్రభూపతి మనసు కాస్త ప్రశాంతతకి గురియింది. అందరూ కలిసి మందిరంలోనికి వెళ్ళారు.. ఎదరుగా చిద్విలాసంగా కనిపిస్తున్న సాయినాధుడి విగ్రహాన్ని చూడగానే అందరూ భక్తితో నమస్కరించారు..

అప్పటికే భక్తులతో కిటకిటలాడుతున్నది.

సాయినాధుడిని దర్శించుకోవడానికి క్యూలో వెళుతున్నారు.. వీరందరూ కూడా క్యూలో నిలబడ్డారు.. అతనుసాయి విగ్రహాన్నే చూస్తున్నాడు.. రెండు చేతిలెత్తి నమస్కరిస్తూ. ''తండ్రీ సాయినాధా.. ప్రశాంతంగా గడపడానికి అమెరికాలో ఉన్న కొడుకు, కోడలు దగ్గరికి వచ్చాను.. కానీ.. నాకీ పరీక్ష ఏమిటి తండ్రీ.. ఎక్కడో ఇండియాలో చచ్చిపోయిందనుకున్న ఆ పిశాచి ఇక్కడ ప్రత్యక్షమయ్యింది.. ఎలాగయిన ఆ పిశాచి గురించి నా కొడుకుకి తెలియకుండా చూడాల్సిన బాధ్యత నీదే తండ్రీ.. ఇండియాకి వెళ్ళగానే షిరిడీకి వచ్చి నీకు బంగారు విగ్రహాన్ని చేయిస్తాను.. నన్ను నమ్ము.. నిజంగా చేయిస్తాను.. ఆ శారదమ్మ గురించి నా కుమారుడికి తెలియకుండా చూడాల్సిన బాధ్యత నీదే..'' తన మనసులో ఉన్న కోరికను సాయినాధుడి ముందు పెట్టాడు కరుణేంద్రభూపతి..

మరి.. సాయినాధుడు కరుణేంద్రభూపతి కోరికని మన్నించి శారదమ్మ రామారావు కంట పడకుండా చూసాడా..?

లేక శారదమ్మ పడ్డ కష్టాన్ని చూసి దయతలచి స్వయంగా ఆమెకి రావాల్సిన ఆస్తిని ఆమెకి వచ్చేలా చేస్తాడా..? అన్నది కాలమే నిర్ణయించాలి.

................................

శారదమ్మకి ఆతిథ్యం ఇస్తున్న ఆ దంపతులు ఆనందానికి అవధుల్లేకుండా పోయింది. శారదమ్మని స్వంత తల్లిలా చూసుకున్నారు వాళ్ళు..

ఆమె చెప్పే ఎన్నో ఆధ్యాత్మిక విశేషాలని వింటూ, తన కూతుళ్ళతో భారతీయ సంప్రదాయాల గురించి ఆమె చెబుతుంటే వారి సంతోషానికి అంతే లేకుండా పోయింది..

ఇంక ఒక్కరోజు మాత్రమే శారదమ్మ వారింట్లో ఉంటుంది.. ఆ తర్వాత శారదమ్మ డల్లాస్ ప్రయాణం కావాల్సి ఉంది..

శారదమ్మ వెళ్ళిపోతుందన్న ఆలోచననే ఆ దంపతులు భరించలేకపోతున్నారు. శారదమ్మ ఉన్నన్ని రోజులు ఆ దంపతులిద్దరూ తమ ఆఫీసుకి సెలవు పెట్టారు. శారదమ్మ తమ పిల్లలతో కలిసి ఉత్సాహంగా గడపడం చూసి వారెంతగానో మురిసిపోయారు ప్రతి రోజూ ఉదయం అయిదు గంటలకే నిద్ర లేవడం, తలారా స్నానం చేసి శారదమ్మ దగ్గరికి వెళ్ళి ఆవిడ సాయిబాబా దివ్య చరిత్ర పారాయణం చేస్తూంటే శ్రద్ధగా వినడం ఈ వారం రోజులు ఆ ఇంటి యజమాని ఇద్దరు కూతుర్లు, కుమారుడు చేసిన పని.. సాయిబాబా దివ్య చరిత్ర పారాయణం పూర్తి కాగానే, ముగ్గురు పిల్లలు పూజ గదిలోకి వెళ్ళి దేవుడి విగ్రహాలని శుభ్రంగా కడిగి, గంధం, కుంకుమ తిలకాలను అందంగా విగ్రహాలకు పెట్టి, పూలతో పూజ గదిని అందంగా అలంకరించి, పూజకి కావలసిన వస్తువులన్నింటినీ సమకూర్చేవారు. ఆ తర్వాత శారదమ్మ పూజ చేస్తూంటే ఎంతో శ్రద్ధ, భక్తులతో తిలకించేవారు. ఇంటి యజమాని, ఆయన భార్య ఇద్దరూ కూడా శారదమ్మ పూజ చేస్తున్నంతసేపూ భక్తి ప్రపత్తులతో దేవదేవుడికి వందన సమర్పణ గావించేవారు.

శారదమ్మ ఆ ఇంట్లో ఉన్నన్ని రోజులు వారింట్లో ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది. ఉదయం నుండి మొదలు రాత్రి పడుకునేంత వరకూ అన్నీ ఆధ్యాత్మిక విశేషాలే తెలుసుకునేవారు. వారు అడిగిన ప్రశ్నలకి శారదమ్మ ఏమాత్రం చికాకుపడకుండా అన్నింటికీ సమాధానం చెప్పేది.

ఆవిడ ఓపికకి, ఆవిడ జీవన శైలికి వారందరూ ఎంతో ముగ్ధులయిపోయారు. ప్రపంచ వ్యాప్తంగా పేరు గడించినప్పటికీ ఆవిడలో ఆ ధ్యాస అస్సలు ఉండేది కాదు.

అదే వారందరికీ ఎంతో ఆశ్చర్యాన్ని కలిగించేది. అక్కడ శారదమ్మ ఉన్నన్ని రోజులు ప్రతి రోజూ ఉదయం, సాయంత్రం ఆనంద స్వరూప్ ఫోన్ చేసి శారదమ్మ యోగక్షేమాలు

తెలుసుకునేవాడు. ఆవిడకి ఏలోటూ రాకుండా చూసుకుంటున్నామని వారు చెప్పడంతో ఆయన సంతృప్తి పడేవాడు.

అమెరికాలో సంవత్సరాల తరబడి ఉంటున్న వారికి ఆ వారం రోజులు ఎంతో ప్రత్యేకమైనవి. ముఖ్యంగా వారి ముగ్గురు పిల్లలో వచ్చిన మార్పు చూసి ఎంతో ఆశ్చర్యానికి గురయ్యారు వారు. ఉదయం ఏడు గంటల వరకూ పడుకునే తమ పిల్లలు అయిదు కాగానే ఠంచనుగా నిద్రలేచి, స్నానం చేసి దైవారాధనలో గడపడం వారికి ఎంతో ఆనందాన్ని కలిగించింది.

అంతకు ముందు ప్రతీ శనివారం నాడు మాత్రమే పిల్లలని బలవంతంగా నిద్రలేపి, దేవుడికి చేసే పూజలోపాలు పంచుకోవాలని ఎంత కోరినప్పటికీ వారు ససేమిరా అనేవారు. అటువంటి పిల్లలలో ఇంత మార్పురావడం సహజంగానే ఆ దంపతులకి ఎంతో ఆనందాన్ని కలిగించింది. కానీ శారదమ్మ తమ ఇంట్లో ఇంకా ఒక్కరోజు మాత్రమే ఉంటుందని తెలియడంతో వారందరూ ఎంతో దిగాలు పడిపోయారు.

దానిని గమనించిన శారదమ్మ తనలో తానే నవ్వుకుంది. ఈ వారం రోజులు ఆ కుటుంబంతో గడపడం శారదమ్మకి కూడా ఎంతో సంతోషాన్ని కలిగించింది. వారెవరో తనకి తెలియదు. వారికి, తనకు ఎలాంటి సంబంధమూ లేదు.. కానీ.. తనని కన్న తల్లిలా చూసుకున్న వారి వాత్సల్యానికి శారదమ్మ ఎంతో పొంగిపోయింది. శారదమ్మకి తాను రైల్వే స్టేషన్ లో గడిపిన రోజులు గుర్తుకు వచ్చాయి. ఆకలితో కడుపు మాడిపోతుంటే ఒక చిన్న బ్రెడ్డు ముక్క కోసం తాను ఎంతగా తాపత్రయపడిందో గుర్తుకు వచ్చింది.. ఆ సంఘటన కళ్ళముందు మెదిలే సరికి ఆమె కళ్ళల్లోనుండి కన్నీళ్ళు రాలాయి..

గతం తాలుకు జ్ఞాపకాలు మనసుని చుట్టు ముడుతుంటే ఆమె హృదయం బరువెక్కింది. అయితే వెంటనే ఆమె వాస్తవంలోకి వచ్చింది. ఎవరూ గమనించకముందే చీరకొంగుతో కన్నీళ్ళని తుడుచుకుని ముఖం లో చిరునవ్వుని తెచ్చిపెట్టుకుంది. ''అమ్మా.. ఈ వారం

రోజులు  మీరు మా ఇంట్లో విడిది చేసినందుకు మాకెంతో ఆనందంగా ఉంది. ఈ వారం రోజులు  మా జీవితంలో మరిచిపోలేని రోజులు, మీతో కలిసి పంచుకున్న అనుభవాలు  మా జీవితాంతం గుర్తుంచుకుంటాము. ఆ భగవంతుడు మమ్మల్ని కరుణించి మీ రూపంలో మా ఇంట్లోకి ప్రవేశించాడని మేము విశ్వసిస్తున్నాము..'' ఆర్ద్రత నిండిన కంఠంతో అన్నాడు ఇంటి యజమాని. ఆయన మాటలకి శారదమ్మ అతని వంక చూసింది.

ఆయన కళ్ళల్లోనూ సన్నటి కన్నీటి పొరని గమనించింది శారదమ్మ.

ఆయన భార్య, ముగ్గురు పిల్లలు  కూడా శారదమ్మ వంకే చూస్తున్నారు. శారదమ్మ వెళ్ళిపోతుందన్న బాధ వారిలో స్పష్టంగా కనిపించే సరికి ఆమె మనసు తరుక్కుపోయింది.

''నాక్కూడా కాస్త బాధగానే ఉంది.. అయిన  నేను వెళ్ళిపోతున్నానని మీరు బాధ పడవద్దు.. ఆ సాయినాధుడి  దివ్యాశీస్సులు  మీ కుటుంబానికి ఎల్లప్పుడూ ఉంటాయి. మిమ్మల్ని, మీ పిల్లలని చూస్తుంటే నాకెంతో ముచ్చటేస్తుంది. ఈ వారం రోజులు  నేను అమెరికాలో ఉన్నానన్న సంగతే మరిచిపోయేలా చేసింది మీ ఆతిథ్యం. ప్రపంచంలో ఏచోట ఉన్న తెలుగు వారు వారి సంస్కృతీ సంప్రదాయాలని మరిచిపోరని, ముందు తరాల వారికి సైతం మన నాగరికతని ఎంతో శ్రద్ధగా అందించేందుకు కృషి చేస్తారని అనడానికి మీ కుటుంబమే ఉదాహరణ. పాశ్చాత్య పోకడలకి దూరంగా ఉంటూ మన నాగరికతని మరిచిపోకుండా ఉన్న మీకు తప్పకుండా అంత  మంచే జరుగుతుంది. అయినా సాయినాధుడిని ఆరాధించిన వారికి ఆయన ఎప్పుడూ అండగా ఉంటాడని మరిచిపోవద్దు. క్రమం తప్పకుండా ఆ సాయినాధుడిని పూజిస్తూ, ఆయనని స్మరిస్తూ ఉండండి .. తప్పకుండా మీ కుటుంబం భవిష్యత్తులో ఎంతో ఉన్నత స్థాయికి చేరుకుంటుంది..'' మనస్ఫూర్తిగా అంది శారదమ్మ.

ఆమె మాటలకి వారెంతగానో పొంగిపోయారు. ఆమె ఇచ్చిన ఆశీస్సులకి వారి మనసు పులకరించిపోయింది. ''మీరు చెప్పినట్టుగానే ఆ సాయినాధుడిని సేవలో తరిస్తాము.. కానీ నాదొక చిన్న కోరిక..'' శారదమ్మకి రెండు

చేతులతో నమస్కరిస్తూ అన్నాడు ఆయన.

ఏమిటో చెప్పు అన్నట్టుగా నవ్వుతూ చూసింది శారదమ్మ..

‘‘మరేమీ లేదు.. మీరు వచ్చినప్పటినుండి  బయటికి ఎక్కడికీ వెళ్ళలేకపోయాము. కనీసం ఈ చివరి రోజునైన ఒకసారి సాయిబాబా టెంపుల్‌కి వెళ్ళి వద్దాము.. మీతో కలిసి ఆ సాయినాధుడిని దర్శించుకునే భాగ్యం కన్న మాకింకేమి కావాలి.. దయచేసి నా  కోరికని మన్నించండి ..’’ వినయంగా అన్నాడు ఆయన. శారదమ్మకి ఎంతో సంతోషం వేసింది ఆయన మాటలు  వినగానే. తనకి కూడా సాయినాధుడిని దర్శించుకోవాలన్న కోరిక బలంగా ఉంది. కానీ దేశం కాని దేశంలో ఆ సాయినాధుడిని దర్శించుకునే అవకాశం వస్తుందో రాదో అని మధనపడింది కూడా.. ఇప్పుడు ఆ అవకాశం వచ్చింది..

కాదని ఎలా అంటుంది.. వెంటనే ‘సరే’ అంది..

ఆమె ఒప్పుకోవడంతో వారెంతగానో ఆనందపడిపోయారు. ఆ వెంటనే సాయిబాబా టెంపుల్‌కి వెళ్ళడానికి అందరూ సిద్ధమయిపోయారు.

వారున్న చోటు నుండి  సాయిబాబా టెంపుల్‌కి వెళ్ళడానికి చాలా దూరం ప్రయాణించాల్సి ఉంటుంది. కానీ వారు ఆ దూరాన్ని గురించి ఆలోచించడం లేదు. ఆ దేవుడిని దర్శించుకోవచ్చనే బలమైన కోరిక ముందు తాము పడే ప్రయాసనంతటనూ మరిచిపోయారు. అదే ఇండియాలో అయితే.. ఇంటి ప్రక్కనే మందిరం ఉన్నా కూడా కనీసం ఆ గుడి కేసి చూడడానికి కూడా ఇష్టపడని ఎంతో మంది బద్ధకస్తులు  ఉంటారు. దేవుడు పక్కనే ఉన్నా చూడని దురదృష్టవంతులు వారైతే.. దేవుడి  కోసం ఎంత దూరం అయినా ప్రయాణించడానికి  వెనుకాడకుండా, దేవుడు దర్శించుకునే అదృష్టవంతులు  వీళ్ళు..

ఇంటి యజమాని భార్య రకరకాల  పిండివంటలు  తయారు చేయడంలో నిమగ్నమయింది. దారిలో తినడానికి కావలసిన  ఆహార పదార్థాలతో పాటు సాయిబాబాకి నివేదించడానికి ప్రత్యేకంగా పరమాన్నాన్ని తయారు చేసింది.

పిల్లలు  కూడా ఎంతో ఉత్సాహంగా అన్ని పనులనీ చేస్తున్నారు.

ఇంటి యజమాని ఆనంద స్వరూప్‌కి ఫోన్ చేసాడు.

తాము సాయిబాబా మందిరానికి వెళుతున్నట్టు ఆయనకి తెలిపారు. ఆ మాటలకి ఆనంద స్వరూప్ కూడా ఎంతో ఆనందించాడు. తాను కూడా మందిరానికి వస్తున్నట్టు తెలిపాడు.

ఆనంద స్వరూప్ కూడా సాయిబాబా మందిరానికి వస్తున్నట్టు తెలియడంతో శారదమ్మ కూడా సంతోషించింది.

సరిగ్గా గంట తర్వాత అందరూ కలిసి కారులో సాంబర్గ్‌లో ఉన్న సాయిబాబా టెంపుల్‌కి బయలు  దేరారు.

...................................

రామారావు  ఆలోచనలన్నీ శారదమ్మ చుట్టూనే తిరుగుతున్నాయి.

అసలు  ఈ శారదమ్మ ఎవరు..?

ఆమెను చూడగానే తన తండ్రిలో ఎందుకు అంత మార్పు వచ్చింది..?

శారదమ్మకి, తన తండ్రికి మధ్య ఏమయిన శతృత్వం ఉన్నదా..?

రామారావుకి తన తండ్రి  గురించి తెలుసు. తన తండ్రి  ఎన్నో అరాచకాలు  చేస్తున్నాడని ఇండియాకి వెళ్ళినప్పుడు తెలుసుకున్నాడు. తండ్రికి చెప్పేటంత వాడు కాకపోయిన ఇన్ డైరెక్టుగా అలాంటి పనులు  చేయడం తప్పని ఒకటి రెండు సార్లు హెచ్చరించాడు కూడా.. అయిన ఆయన పనులు  ఆయన చేసుకుంటూ పోయాడు. ఇక తండ్రికి ఎంత చెప్పిన లాభం లేదనుకుని తన మానాన తాను అమెరికా వచ్చేసాడు. ఇక్కడి  వరకూ బాగానే ఉంది.. కానీ.. శారదమ్మ విషయానికి వచ్చే సరికి రామారావు  ఆలోచనలు  ముందుకు సాగడం లేదు..

శారదమ్మకి తన తండ్రికి మధ్య వైరం ఏమిటో ఎంత ఆలోచించిన అర్థం కావడం లేదు.. ఏదో బలమైన కారణం లేకపోతే తన తండ్రి  శారదమ్మని చూసి అంతలా భయపడడు.. ఏమిటా కారణం..?

ఏ విషయాన్నయినా ధైర్యంగా ఎదుర్కొనే తన తండ్రి  శారదమ్మ విషయానికి వచ్చే సరికి ఎందుకు నీరసించి పోతున్నాడు..?

ఆవిడని కంప్యూటర్‌లో చూసిన దగ్గర నుండి  ఆయనలో వచ్చిన మార్పుకి గల సంకేతం ఏమిటి..? శారదమ్మని ఎక్కడో చూసినట్టు తనకి లీలగా గుర్తుంది..

కానీ ఎక్కడ చూసాను..? రామారావు  ఎంత ఆలోచించిన శారదమ్మని ఎక్కడ చూసాడో గుర్తుకు రావడం లేదు.. శారదమ్మని చూసినప్పటి నుండి  తన తండ్రిలో వచ్చిన మార్పుని ఆయన స్పష్టంగా కనిపెట్టాడు. కానీ.. దానికి గల కారణం మాత్రం కనిపెట్టలేకపోతున్నాడు.. ఏది ఏమయిన.. శారదమ్మ గురించి తెలుసుకోవాలని, శారదమ్మకి, తన తండ్రికి ఏమయిన శతృత్వం ఉన్నదా అన్నది కనిపెట్టాలని బలంగా అనుకున్నాడు రామారావు. మొన్న సాయిబాబా టెంపుల్‌కి వెళ్ళి వచ్చినప్పటి నుండి  తన తండ్రిలో కాస్త ఉత్సాహం వచ్చింది. మందిరం నుండి  ఇంటికి రాగానే  షరా  మామూలుగా ముభావంగానే ఉండిపోతున్నాడు.. ఆయనని ఇంతలా కదిలించిన ఆ శారదమ్మ ఎవరు..? ఆ క్షణంలోనే  రామారావు  మనసులో బలంగా నిర్ణయించుకున్నాడు.. శారదమ్మ గురించి తెలుసుకోవాలని.. రామారావు  తన గదిలో నుండి  బయటికి వచ్చాడు. హాలులో సోఫాలో కూర్చుని ఏదో తెలుగు  పేపరు ని తిరగేస్తున్నాడు రామారావు తండ్రి. ఆయనని నిశితంగా గమనించాడు రామారావు. మునుపటి ఉత్సాహం ఆయన ముఖం లో కనిపించడం లేదు..

రామారావు  ఆయన దగ్గరికి వచ్చి ఆయన ప్రక్కనే సోఫాలో కూర్చున్నాడు..

‘‘నాన్న .. మీ ఆరోగ్యం బాగానే ఉంది కదా..’’ అనుమానంగా అడిగాడు రామారావు.

అకస్మాత్తుగా కొడుకు అలా అడిగే సరికి ఆశ్చర్యపోయాడు ఆయన.

‘‘నా ఆరోగ్యానికేమయింది .. భేషుగ్గా ఉన్నాను.. నా గురించి ఎక్కువగా ఆలోచించకు.. నేను బాగానే ఉన్నానులే..’’ చిన్నగా నవ్వుతూ అన్నాడు.. ఆయన మాటల్లో సైతం మునుపటి గాంభీర్యం లేకపోవడం రామారావు  గమనించాడు.

‘‘ఈ మధ్య మీరు దేనిగురించో మధనపడుతున్నారేమో అని నా కనిపిస్తుంది.. మీకు ఇబ్బంది కలిగించే విధంగా నేనుగానీ, నా భార్య గానీ ఏమయిన  ప్రవర్తించామా.. నిర్మొహమాటంగా చెప్పండి .. మీ మనసుకి నొప్పించే విధంగా మా ప్రవర్తన ఉన్నట్లయితే వెంటనే మార్చుకుంటాము..’’ కొడుకు మాటలకి ఆయన మనస్సు చివుక్కుమన్నది..

తన గురించి కొడుకు ఎంతగా ఆలోచిస్తున్నాడో ఆయన మాటల  ద్వారానే అర్థం చేసుకున్నాడు కరుణేంద్రభూపతి. ఆయన కళ్ళల్లో కన్నీళ్ళు సుడులు  తిరిగాయి.. ఆ కన్నీళ్ళు కొడుకు కంట పడకుండా జాగ్రత్త పడుతూ.. ‘‘అలా అడుగుతావేంటిరా  .. మీరు నన్ను తక్కువ చేసి చూస్తారా .. అట్లాంటి ఆలోచననే నువ్వు పెట్టుకోవద్దు.. కోడలు  పిల్ల  నన్ను కన్నతండ్రిలా చూసుకుంటుంది.. పిల్లలు  తాతయ్యా.. తాతయ్యా అంటూ ఎంతో ప్రేమగా నా చుట్టూ తిరుగుతున్నారు. ఈ ప్రపంచంలో మీరు తప్ప నాకింకెవరున్నారు..  అయిన  మీవల్ల నా కేమయిన  ఇబ్బంది కలిగింది అని ఎప్పుడూ అనుకోకురా రామా  .. ఇట్లాంటి ఆలోచనలు పెట్టుకుని నీ మనసు పాడు చేసుకోకు.. నేను ఎంతో సంతోషంగా ఉన్నాను..’’ గొంతు కాస్త తడబడుతుండగా అన్నాడు రామారావు తండ్రి. ‘‘ఈ మధ్య మీరు కాస్త ముభావంగా ఉంటున్నారు.. అందుకే అలా అడిగాను తప్ప వేరే ఉద్దేశ్యంతో కాదు.. సరే కానీ.. ఇంట్లో ఉంటే మీకు బోర్‌గా ఉన్నట్టుంది.. సాయిబాబా మందిరానికి వెళ్దామా..’’ అన్నాడు రామారావు.. సాయిబాబా మందిరం పేరు  వినగానే ఆయన ముఖం  విప్పారింది.. ‘‘చాలా మంచి మాట చెప్పావురా రామా .. నా మనసులో కూడా మరొక సారి సాయినాధుడిని దర్శించుకోవాలన్న  కోరిక ఉంది.. కానీ అనవసరంగా నీ పనులకి ఆటంకం కలిగించడం ఎందుకని నీకు చెప్పకుండా ఊరుకున్నాను..’’ నవ్వుతూ అన్నాడు. ‘‘అదేమిటి నాన్న .. మీకు

నేను ఆరోజే చెప్పాను కదా.. మీకు ఎప్పుడు సాయిబాబా మందిరానికి వెళ్ళాలనిపిస్తే  అప్పుడు వెళ్ళమని, మన కారు డ్రైవర్‌కి కూడా చెప్పాను.. మీరు మందిరానికి వెళ్ళాలనుకుంటే తీసుకెళ్ళమని.. పోనీలే.. నేనిప్పుడు ఖాళీగానే ఉన్నాను .. సరదాగా అందరం కలిసి మందిరానికి వెళ్ళొద్దాం.. మీరు రెడీ అవ్వండి '' అన్నాడు రామారావు..'అలాగే' అంటూ చదువుతున్న పేపర్ ని పక్కన పెట్టి తన భార్యని పిలిచాడు. ''తొందరగా స్నానం చేసి రెడీ అవ్వు.. సాయిబాబా మందిరానికి వెళ్లొద్దాం.. అలాగే పిల్లలని  కూడా రెడీ చేయి..''
భార్యకి ఆర్డర్ వేస్తూ తన గదిలోకి నడిచాడు ఆ వృద్దుడు.
వెళుతున్న తన తండ్రి  వంకనే దీక్షగా చూస్తూండి  పోయాడు రామారావు.

................................

సామ్‌బర్గ్ లోని సాయిబాబా మందిరం.. భక్తులతో కిటకిటలాడుతుంది..
మందిరం ప్రాంగణంలోకి రయ్యిన దూసుకువచ్చింది శారదమ్మ ప్రయాణిస్తున్న కారు. కారుని పార్కింగ్ చేయగానే శారదమ్మ తో పాటు, ఇంటియజమాని, అతని భార్య పిల్లలు కారులోనుండి  దిగారు. కారు లాక్ చేసి డిక్కీలో సాయినాధుడి  కోసం ప్రత్యేకంగా తయారు చేసిన ప్రసాదాన్ని బయటికి తీసాడు. అందరూ కలిసి మందిరం వైపు అడుగు వేసారు.. సరిగ్గా అదే సమయానికి రామారావు  ఫ్యామిలీ ప్రయాణిస్తున్న కారు వచ్చింది. ఇంటి యజమాని కారు ప్రక్కనే ఆయన కారుని పార్క్ చేసాడు రామారావు. ఆ కారులోనుండి  రామారావు తండ్రి, ఆయన భార్య, కోడలు, మనుమడు, మనమరాలు  అందరూ దిగారు. సాయిబాబా మందిరాన్ని చూడగానే ఆ వృద్ధుడి మనసు ప్రశాంతంగా మారిపోయింది.. ''ఓం సాయిరాం ..'' అంటూ మనసులో అనుకుంటూ ముందుకు అడుగు వేసాడు.. ఆయన

వెనకాలే అందరూ నడిచారు. రామారావు  కారు లాక్ చేసి మందిరం వైపు అడుగులు  వేస్తూ దూరంగా మందిరం మెట్లు ఎక్కుతూ కనిపించిన శారదమ్మని చూసి ఠక్కున ఆగిపోయాడు..
ఆయన ఆశ్చర్యానికి అవధుల్లేకుండా పోయింది..
ఆవిడ నిజంగా శారదమ్మేనా.. అన్న అనుమానం కలిగింది..
కళ్ళు చిట్లించి మరీ చూశాడు.. సరిగ్గా అప్పుడే వెనుక నుండి  ఇంటి యజమాని కూతురు పిలవడంతో వెనక్కి తిరిగి చూసింది శారదమ్మ..
అలా వెనక్కి తిరిగిన శారదమ్మ రామారావుకి  స్పష్టంగా కనిపించింది..
అనుమానం లేదు.. ఆవిడే శారదమ్మ.. తన తండ్రి  తనలో తానే మధనపడి పోవడానికి కారణమైనది.. తన తండ్రి  మునపటి ఉత్సాహాన్ని వదిలేసి ముభావంగా ఉండడానికి గల కారణమైన శారదమ్మ ఆవిడే.. రామారావు  గుండె వేగంగా కొట్టుకోవడం ప్రారంభించింది..
ఇప్పుడు.. ఇప్పుడు.. తన తండ్రి  శారదమ్మని చూస్తే  ఆయన ఎలా రిసీవ్ చేసుకుంటాడు..? కంప్యూటర్‌లో చూసినందుకే అంతలా కదిలిపోయాడే.. ఇప్పుడు ప్రత్యక్షంగా ఆమెని చూస్తే .. ఆయన మనసులోని భావాలు  ఏ విధంగా ఉంటాయో..
వారిద్దరి మధ్య ఎలాంటి వివాదం ఉందో రామారావుకి తెలియకపోయినప్పటికీ.. శారదమ్మ అంటే తన తండ్రి  భయపడుతున్నాడని మాత్రం గ్రహించాడు రామారావు.. ఇప్పుడు శారదమ్మని తన తండ్రి చూస్తే  ఏం జరుగుతుంది..?
ఆ ప్రశ్నే రామారావు  మనసుని అతలాకుతలం  చేస్తుంది..
అతని మనసెందుకో కీడుని శంకిస్తోంది.. అనవసరంగా తన తండ్రిని మందిరానికి తీసుకువచ్చానా  అన్న ఆలోచన కూడా అతని మనసులో మెదిలింది..
ఆ వెంటనే తనని తాను సమాధాన పర్చుకున్నాడు.. ఏమి జరిగినా ఆ సాయినాధుడే ఉన్నాడు..? ఏదో అద్భుతం జరగబోతుందేమో.. అందుకే ఆ సాయినాధుడు అందరినీ తన మందిరానికి రప్పించుకున్నాడు.. ఇంక దాని గురించి ఎక్కువగా ఆలోచించకుండా మనసుని

సాయినాధుడిపై లగ్నం చేయడానికి విశ్వప్రయత్నం చేస్తూ ముందుకు అడుగులు వేసాడు రామారావు.. ''ఓం సాయి.. శ్రీ సాయి.. జయ జయ సాయి..'' అని మనసులోనే అనుకుంటూ తమ వారిని సమీపించాడు రామారావు. అందరూ కలిసి మందిరంవైపు అడుగులు వేసారు. సరిగ్గా అప్పుడే ఆనంద స్వరూప్ కూడా కారులో అక్కడికి వచ్చాడు. అతనితో పాటు సాయిరాం కూడా ఉన్నాడు. కారు పార్క్ చేసి ఇద్దరూ కారులో నుండి దిగారు. ''శారదమ్మ కారణంగా చాలా రోజుల తర్వాత నా తండ్రి దగ్గరికి వచ్చాను.. సాయిబాబా దర్శనం కోసం ఎన్నో రోజులుగా ఎదురు చూసాను.. ఆ అదృష్టం నేడు దక్కింది..'' కారులో నుండి దిగగానే ఎదురుగా కనిపిస్తున్న సాయినాధుడి మందిరం గాలి గోపురం వంక చూసి భక్తితో నమస్కరిస్తూ అన్నాడు ఆనంద స్వరూప్.

''అవును సార్.. నేను కూడా ఈ టెంపుల్‌కి రావాలని చాలా సార్లు అనుకున్నాను.. ఈరోజు కుదిరింది..'' ఆనందంగా అన్నాడు సాయిరాం..

అంతలో ఆనంద స్వరూప్ సెల్ మ్రోగింది.. ఫోన్ లిఫ్ట్ చేసి

''హలో..'' అన్నాడు.. ''స్వరూప్ గారూ.. మేము మందిరం బయట మీకోసం వెయిట్ చేస్తున్నాము.. నేను మిమ్మల్ని చూసాను..

ఒకసారి గుడి మెట్ల ప్రక్కకి దృష్టి సారించండి .. మేము మీకు కనిపిస్తాము..'' ఇంటి యజమాని అన్నాడు. ఫోన్ చెవి దగ్గర పెట్టుకునే ఆయన చెప్పిన వైపు చూసాడు ఆనంద స్వరూప్.. ఇంటి యజమాని చేయి ఊపుతూ కనిపించాడు.. ఆనంద స్వరూప్ చిరునవ్వుతో ఆయనకి ప్రతిగా చేయి ఊపుతూ.. ''వచ్చేస్తున్నాము..'' అని క్లుప్తంగా చెప్పి ఫోన్ కట్ చేసి ముందుకు నడిచారు ఇద్దరూ.. సాయినాధుడి మందిరం భక్తులతో నిండిపోయింది. ''ఓం సాయి.. శ్రీ సాయి.. జయ జయ సాయి..'' అన్న నినాదం మందిరంలోనూ, మందిరం ఆవరణలోనూ అమర్చిన అత్యాధునిక సౌండ్ సిస్టమ్ లో నుండి మంద్రంగా వినిపిస్తుంది.. ఆ

శబ్దం వింటూంటే.. ఏదో చెప్పలేని మానసిక ఆనందం అక్కడ ఉన్న ప్రతీ భక్తుడిలోనూ కనిపిస్తుంది..

శారదమ్మ ఒక విధమైన పరవశంలో మునిగిపోయింది.. ఆ శబ్దం చెవులకి లీలగా తాకుతుంటే ఆనంద పారవశ్యంతో కళ్ళు మూసుకుంది శారదమ్మ..

సరిగ్గా వారు నిలుచున్న ప్రదేశానికి చేరువయ్యారు రామారావు ఫ్యామిలీ. రామారావు హృదయం వేగంగా కొట్టుకుంటోంది.. ఆయన చూపులు మొత్తం తన తండ్రి పైనే ఉన్నాయి.. ఆయన ఇంకా శారదమ్మని గమనించలేదు.. శారదమ్మ వారికి స్పష్టంగా కనిపిస్తుంది.. రామారావు  శారదమ్మ వంక చూశాడు.. ఆమె కళ్ళు మూసుకుని దేవుడిని ప్రార్థిస్తున్నట్టు కనిపించడంతో కొంత నిరాశ పడ్డాడు రామారావు..

తన తండ్రి  శారదమ్మని గమనించిన, శారదమ్మ తన తండ్రిని గమనించిన వారి ముఖాలలో ప్రతిఫలించే భావాలని గమనించాలని ఎంతో ఆతృతతో ఉన్నాడు రామారావు. ఇద్దరూ ఒకరిని ఒకరు చూసుకున్నప్పుడు వారి ముఖాలలో కదలాడే ఎక్స్‌ప్రెషన్స్‌తో వారి మధ్య ఉండే శతృత్వాన్ని అంచనా వేయాలన్న ఆలోచన రామారావుది.. కానీ ఆయన ఆశపై నీళ్లు చల్లినట్టు కరుణేంద్రభూపతి మందిరంలో ఉన్న సాయినాధుడి  విగ్రహం వంకే చూస్తూ ముందుకు సాగాడు.. శారదమ్మ కళ్ళు మూసుకుని నిలుచుండి  పోయింది.. చూస్తూండగానే శారదమ్మని దాటుకుని మందిరంలోనికి వెళ్ళిపోయారు రామారావు  ఆయన కుటుంబ సభ్యులు ..

ఆనంద స్వరూప్ ఇంటియజమాని దగ్గరకు వచ్చాడు..

పలకరింపు పూర్తయ్యాక శారదమ్మ వంక చూసాడు ఆనంద స్వరూప్.. ఆమె కళ్ళు మూసుకుని భక్తి భావంతో మనసులో సాయినాధుడిని ప్రార్థిస్తుందని ఇట్టే అర్థమయింది ఆనంద స్వరూప్‌కి.. మెల్లిగా ''శారదమ్మ గారూ..'' అంటూ పిలిచాడు.. ఆయన పిలుపుకి ఉలిక్కిపడి  కళ్ళు తెరిచింది శారదమ్మ..

ఎదురుగా ఆనంద స్వరూప్ కనిపించడంతో ఆమెకి ఎంతో ఆనందమేసింది..

''మీరు కూడా వచ్చినందుకు నాకెంతో సంతోషంగా ఉంది..'' అంది శారదమ్మ..

ఆయన ఆ మాటకి చిన్నగా నవ్వుతూ లోపలికి వెళ్దాం అన్నట్టుగా చేయితో సైగ చేశాడు..

అందరూ గుడి లోనికి నడిచారు.. విశాలమైన హాలులో భక్తులతో నిండిపోయి ఉంది.. సాయి దర్శనం కోసం వేచి చూసేవారు క్యూలో ఉన్నారు..

దర్శనం చేసుకున్నవారు హాలు మధ్యలో కూర్చుని సాయినాధుడి విగ్రహాన్నే తనివితీరా చూస్తూ ప్రార్థిస్తున్నారు. శారదమ్మకి ఎంతో ఆశ్చర్యం వేసింది ఆ దృశ్యం చూస్తూంటే..

ఇందులో ఆశ్చర్యపడాల్సిన అవసరం ఏమొచ్చిందన్న ప్రశ్న రావచ్చు..

కానీ.. ఇండియాలోని సాయినాధుడి టెంపుల్‌ని చూసి, అమెరికాలో ఉన్న సాయినాధుడి టెంపుల్‌ని చూస్తున్న శారదమ్మకి అక్కడి టెంపుల్‌కి వచ్చే భక్తులకు, ఇక్కడి భక్తులకు మధ్య వ్యత్యాసం చాలా స్పష్టంగా కనిపించింది.. ఆ కారణమే ఆమెను ఆశ్చర్యానికి గురిచేసింది..

విశాలమైన ఆ ప్రాంగణంలో వందల సంఖ్యలో భక్తులు ఉన్నారు.. అంతమంది జనాలు ఉన్నా కూడా వారందరూ కేవలం సాయినాధుడిని ప్రార్థిస్తూ ఉన్నారు తప్ప ఎవ్వరూ ఏమీ మాట్లాడుకోవడం లేదు.. అంత నిశ్శబ్ద వాతావరణం ఆ ఆవరణలో కనిపించింది..

ఆ నిశ్శబ్దంలో లీలగా ''ఓం సాయి.. శ్రీ సాయి.. జయ జయ సాయి'' అని సౌండ్ సిస్టమ్ లోనుండి వస్తున్న శబ్దం తప్ప అంతా నిశ్శబ్దంగా ఉంది..

అదే ఇండియాలో అయితే ఎవరికి వారు గట్టిగా మాట్లాడుకుంటూ.. నిశ్శబ్ద వాతావరణాన్ని మొత్తం కాలుష్యం చేసేస్తారు.. మానసిక ప్రశాంతత కోసం వచ్చే భక్తులకు ఆ భగవంతుడిని మనసులో ప్రార్థించుకునే అవకాశాన్ని కూడా ఇవ్వరు.. తమ మాటలతో ఇతరులు ఇబ్బందికి గురవుతారన్న స్పృహ కూడా వారిలో ఉండదు.. ఆ తేడాని శారదమ్మ స్పష్టంగా గమనించింది.. ఆమె చూపు సాయినాధుడిపై పడింది.. కాలు మీద కాలు వేసుకుని, ముఖం లో చిరునవ్వు చిందిస్తూ అచ్చు జీవం ఉన్న మనిషి మాదిరిగానే కనిపిస్తున్న సాయినాధుడి

విగ్రహం చూడగానే శారదమ్మ హృదయం భక్తి భావంతో నిండిపోయింది.. అనుకోకుండానే ఆమె రెండు చేతులు సాయినాధుడిని నమస్కరించాయి.. సాయినాధుడి దర్శనం కోసం అందరూ క్యూలో నిలుచున్నారు.. ఒక్కొక్కరే మెల్లిగా ముందుకు అడుగులు వేస్తున్నారు.. అందరి చూపులు సాయినాధుడి విగ్రహంపైనే ఉన్నాయి.. అందరూ మనసులోనే సాయినాధుడి ని ప్రార్థిస్తూ ముందుకు సాగుతున్నారు.. ఆ ప్రశాంత వాతావరణంలో, ఆ సాయినాధుడి దివ్యాశీస్సులు పొందిన ప్రతీ ఒక్కరూ ఎంతో ఆనందంగా కనిపిస్తున్నారు.. ఒక్క రామారావు తప్ప.. ఆయన మనసు మనసులో లేదు.. తమ వెనుక ఇరవై మంది భక్తుల తర్వాత శారదమ్మ క్యూలో నిలబడి ఉంది.. సాయినాధుడి దర్శనం తర్వాత ఎలాగయినా శారదమ్మ ని తన తండ్రికి కనిపించేలా చేయాలి.. శారదమ్మ కనిపించగానే ఆయనలో వచ్చే మార్పుని గమనించాలి.. ఒక విధంగా ఈ రోజు ఇక్కడికి రావడం మంచిదే అయింది.. శారదమ్మ గురించిన ఆలోచనతో కొద్ది రోజులుగా రామారావు సతమతమవుతున్నాడు. తన తండ్రికీ, శారదమ్మకి మధ్య ఉన్న వైరం ఏమిటో ఎంత ఆలోచించినా అతనికి అంతుపట్టడం లేదు. వాటికి సమాధానం కోసం అన్వేషిస్తున్న తనకి ప్రత్యక్షంగా శారదమ్మ కనిపించడంతో ఒక ఆశ చిగురించింది.. తన మనసులో మెదులుతున్న ప్రశ్నకి సాయినాధుడి సన్నిధిలో సమాధానం లభిస్తుందేమో అన్న చిన్న ఆశ అతనిలో మెదులుతోంది.

రామారావు కుటుంబ సభ్యులందరూ సాయినాధుడి ని సమీపించారు. వారు తెచ్చిన నైవేద్యం, పళ్ళు పలహారాలు స్వీకరించి హారతి ఇచ్చాడు పూజారి. తర్వాత అందరూ సాయినాధుడి పాదాలని తాకి సంతృప్తిగా దర్శించుకున్నారు.

దర్శనానంతరం ఆ హాలు మధ్యలో అందరూ కూర్చున్నారు. పూజారి అందించిన ప్రసాదాన్ని అందరికీ పంచింది శీలావతి. క్యూలో నిలుచున్న శారదమ్మనే గమనిస్తున్నాడు రామారావు. ఆమె చూపు సాయినాధుడిపైనే ఉండడంతో కాస్త నిరాశకి గురయ్యాడు. ఎలాగయిన తన

తండ్రి , శారదమ్మ ఇద్దరూ ఎదురుపడేలా చేయాలన్నది రామారావు ఆలోచన. శారదమ్మ సాయినాధుడిని దర్శనం చేసుకున్న తర్వాత వారు కూర్చున్న చోటు నుండే బయటికి వెళ్ళాలి.. సరిగ్గా అదే సమయంలో తన తండ్రి దృష్టి ఆమెపై పడేలా చేయాలి.. అని మనసులో అనుకున్నాడు రామారావు. అనుకున్నట్టుగానే శారదమ్మ, ఆనంద స్వరూప్ సహా మిగతా వారందరూ సాయినాధుడిని భక్తితో దర్శించుకున్నారు..

అనంతరం వారందరూ రామారావు కుటుంబ సభ్యులు కూర్చున్న చోటుకి సమీపంలోనే వారు కూడా కూర్చున్నారు. రామారావు ఊపిరి బిగపట్టి తన తండ్రిని గమనిస్తున్నాడు.. ఆయన ఇంకా శారదమ్మని చూడలేదు.. శారదమ్మని చూడగానే ఆయన హావభావలు ఎలా ఉండబోతున్నాయని ఊహించుకుంటూ ఆయననే గమనిస్తున్నాడు. రామారావు కోరికని ఆయన కుమార్తె ప్రతిభ తీర్చింది..

ప్రతిభ శారదమ్మని చూసింది.. శారదమ్మని చూడగానే ప్రతిభ ఎంతో ఆనందంగా..

''డాడీ.. ప్రవచనాలు చెబుతుందే అమ్మ.. యూట్యూబ్‌లో మీకు చూపించాను కదా.. అదిగో ఆవిడే ఆ ప్రవచనాలు చెప్పేది..'' అంటూ చేతి వేలితో శారదమ్మని చూపించింది.. అందరూ శారదమ్మ వంక చూసారు.. ఒక్క రామారావు తప్ప..

రామారావు చూపు ఆయన తండ్రిపై ఉంది.. ఆయన తండ్రి యథాలాపంగా శారదమ్మ వంక చూసాడు. అంతే..!

అప్పటి వరకూ ఎంతో ఆనందంగా కనిపించిన తన తండ్రి ముఖం లో రంగులు మారడం ప్రారంభమయ్యాయి.. ఆయన కళ్ళు ఎర్రబడ్డాయి..

ముక్కుపుటాలు అదురుతున్నాయి.. శారదమ్మపై ఉన్న కోపం మొత్తం ఆయన కళ్ళల్లో కనిపిస్తుంది.. ఆశ్చర్యం, కోపం, ఆందోళన అన్నీ ఆయనలో కనిపిస్తున్నాయి..

కోపంతో ఆయన చేతి పిడికిలి బిగుసుకుంది...

ఆయన మనసులో సముద్రాలు ఉప్పొంగిపోతున్నట్టు, ఆయన శరీరం సన్నగా కంపిస్తుంది.. ఆయనలో వచ్చిన మార్పుని గమనిస్తున్న రామారావు ఆందోళనకి గురయ్యాడు. ఇంకాసేపు చూస్తూ ఉంటే తన తండ్రికి టెన్షన్‌తో ఫిట్స్ వచ్చే ప్రమాదం ఉందన్న ఊహ రామారావు ఆందోళనకి కారణం.. శీలావతి, ప్రతిభ, ప్రశాంత్ శారదమ్మని చూసి ఎంతో సంతోషించారు..

''డాడీ.. డాడీ.. నేను ఒక సారి ఆ అమ్మ దగ్గరికి వెళ్ళి వస్తాను.. ఆటోగ్రాఫ్ తీసుకుంటాను..'' సంబరంగా అంది ప్రతిభ..

ప్రతిభ అన్న మాటలకి తన తండ్రి లో మరింత టెన్షన్ పెరిగిందని ఆయన ముఖ కవళికలే చెబుతున్నాయి. ''నాన్న మంచినీళ్ళు త్రాగుతారా ..'' వాటర్ బాటిల్ ఆయనకి అందిస్తూ అన్నాడు రామారావు. రామారావు మాటకి ఉలిక్కిపడి రామారావు వంక చూసాడు ఆయన. కొడుకు తన వైపు పరిశీలించి చూస్తూండడంతో కంగారు పడ్డాడు. తన ముఖం లోకి చిరునవ్వుని తెచ్చుకోవడానికి ప్రయత్నిస్తూ రామారావు చేతిలో ఉన్న వాటర్ బాటిల్ అందుకుని గటగటా త్రాగాడు. ప్రతిభ శారదమ్మ దగ్గరికి వెళ్ళింది. తన చేతిలో ఉన్న పాకెట్ సైజు బుక్‌ని ఆమె ముందుకు జాపుతూ..

''మేడమ్ ఆటోగ్రాఫ్ ఇవ్వరా ..'' అంది ఆనందంగా.. రామారావు దృష్టి శారదమ్మపై పడింది.. శారదమ్మ ప్రతిభ వంక చిరునవ్వు నవ్వుతూ చూసింది..

ఆ తర్వాత ఆమె చూపు తన తండ్రిపై పడింది.. రామారావు ఊపిరి బిగపట్టి ఆమె వంకే చూస్తున్నాడు.. తన తండ్రిని చూడగానే ఆమె ముఖం లో భావాలు ఎలా కదలాడతాయో గుర్తించాలని రామారావు భావన.

రామారావు  ఊహించినట్టుగానే ఆయన తండ్రి  వంక చూసిన శారదమ్మ నొసలు ముడిపడింది.. కొద్ది క్షణాలు  ఆమె ముఖం లో చిరునవ్వు మాయమైంది..

ఆమె చూపులో తీక్షణత కనిపించింది.. ఆమె రామారావు  తండ్రి  వంకే చూస్తూ ప్రతిభ చేతిలోని బుక్‌ని అందుకుంది.. ఆనంద స్వరూప్ అందించిన పెన్ను తీసుకుని ఆటోగ్రాఫ్ చేసింది.

ప్రతిభ ఎంతో సంబరపడిపోయింది..

‘‘థ్యాంక్యూ మేడమ్..’’ ఎంతో సంబరపడుతూ అంది ప్రతిభ. శారదమ్మ దగ్గర ఆటోగ్రాఫ్ తీసుకున్నందుకు ప్రపంచాన్ని జయించినంతగా ఆనంద పడుతూ చెంగు చెంగున ఎగురుతూ రామారావు  దగ్గరికి వచ్చింది. రామారావు  తన తండ్రినే గమనిస్తున్నాడు. ఆయన ముఖం పూర్తిగా మారిపోయింది.. కళ్ళల్లో ఎరుపుజీరలు అలముకున్నాయి. ఏదో చూడకూడనిది చూసినట్టుగా  ఫీలయి పోతున్నాడు..

అప్పటి వరకూ ఆ భగవంతుని స్మరణలో హాయిగా గడిపిన ఆయన శారదమ్మని చూసిన వెంటనే తాను ముళ్ళమీద కూర్చున్నట్టుగా అసహనంగా కనిపిస్తున్నాడు..

అక్కడి  నుండి  ఎంత త్వరగా వెళితే అంత బావుంటుందన్న భావన ఆయన మదిలో మెదిలింది.. ‘‘పదండి  వెళదాం..’’ గంభీరంగా అన్నాడు ఆయన..

‘‘అదేమిటి నాన్న గారూ.. అప్పుడే వెళదామా..?’’ ఓరకంట ఆయననే గమనిస్తూ అన్నాడు రామారావు.. ‘‘సాయి దర్శనం అయ్యింది కదా.. ఇంకా ఇక్కడ ఎందుకు..?’’ అసహనంగా అన్నాడు ఆయన.. రామారావు, శీలవతి ఇద్దరూ ఒకరి ముఖాలొకరు చూసుకున్నారు. తన తండ్రి ప్రవర్తనకి రామారావు ఆయన భార్యకూడా విస్తుబోతారు.. తండ్రి  పూర్తిగా అదుపు తప్పే  స్థితిలో ఉన్నాడని రామారావుకి అర్థమయింది.. శారదమ్మని చూడగానే ఆయనలో అంతలా ఎందుకు మార్పు వచ్చిందో తెలుసుకోవాలన్న దృఢ సంకల్పం  ఆయనలో కదిలింది..

‘‘సరే అయితే మీరు బయట వెయిట్ చేయండి .. నేను ప్రసాదం కౌంటర్ దగ్గరకు వెళ్ళి ప్రసాదాలు తీసుకువస్తాను..’’ అన్నాడు రామారావు ..

ఆయన మాట ఇంకా పూర్తి కానేలేదు.. ఆయన తండ్రి అక్కడి నుండి ఎవరో వెనకాల నుండి తరుముతున్నట్టుగా వేగంగా అడుగులు వేసుకుంటూ వెళ్ళిపోయాడు.. రామారావు తప్ప మిగతా అందరూ ఆయన వెనకాలే వెళ్ళిపోయారు. రామారావు చూపు శారదమ్మపై పడింది.. ఆమె చూపు వెళుతున్న తన తండ్రి పైనే ఉండడం గమనించాడు. ఎలాగైనా శారదమ్మతో మాటలు కలిపి అసలు ఆవిడ ఎవరు..? తన తండ్రి ఆవిడని చూసి ఎందుకు అంతగా కంగారు పడుతున్నాడో తెలుసుకోవాలన్న ఆతృతతో సమయం కోసం వేచి చూస్తున్నాడు రామారావు. శారదమ్మతో కలిసి వచ్చిన వారందరూ ఆవిడతో ఎంతో ఆప్యాయంగా మాట్లాడుతున్నారు. వారందరి ముందూ శారదమ్మని ఎలా పలకరించాలి అని తర్జనభర్జన పడుతున్న సమయంలో ఆనంద స్వరూప్ కూడా ప్రసాదాల కౌంటర్ దగ్గరికి వెళ్లడం గమనించాడు రామారావు.

అసలు శారదమ్మ ఎవరో తెలుసుకోవాలంటే ఆయనని కలిస్తే ఏమయినా విషయం తెలుస్తుందేమో అన్న కోరికతో ఆనంద స్వరూప్ వెనకాలే నడిచాడు రామారావు.

ఆనంద స్వరూప్ ప్రసాదం కౌంటర్ దగ్గరికి చేరుకుంటున్న సమయంలోనే వెనక నుండి .. ‘‘హలో సార్…’’ అని వినిపించడంతో వెనక్కి తిరిగి చూసాడు ఆనంద స్వరూప్.. ముఖం లో చిరునవ్వుతో ఆనంద స్వరూప్ దగ్గరికి వచ్చాడు రామారావు.. ఆనంద స్వరూప్‌కి చేయందిస్తూ.. ‘‘నా పేరు రామారావు ..’’ అంటూ పలకరించాడు.. ఆనంద స్వరూప్ కూడా చేయందిస్తూ విష్ చేసి రామారావు వంక నొసలు ముడివేసి చూసాడు.. ఈయనకి నాతో పనేమిటా అన్న ప్రశ్న మెదులుతుంది ఆయన వదనంలో.. రామారావు తనని తాను పరిచయం చేసుకున్నాడు. తాను చేస్తున్న ప్రొఫెషన్ గురించి, ఉండే ప్రాంతం గురించి

వివరంగా చెప్పాడు.. రామారావు చెబుతున్న విషయాన్ని చిరునవ్వుతో వింటూ తలాడించాడు ఆనంద స్వరూప్.. ఇవన్నీ నాతో ఎందుకు చెబుతున్నాడా అన్న ప్రశ్న ఆయనలో కలుగుతోంది.. రామారావు ఉపోద్ఘాతం లేకుండా విషయంలోకి వచ్చాడు.. ''సర్.. అసలు విషయం ఏమిటంటే.. మీరు అనుమతిస్తే మీతో కొద్దిగా మాట్లాడదామనుకుంటున్నాను..'' అభ్యర్థనగా అన్నాడు రామారావు..

ఆనంద స్వరూప్ ఆశ్చర్యపోయాడు.. అసలెవరో కూడా పరిచయం లేని వ్యక్తి అలా అడగడంతో ఆయన నొసలు ముడిపడింది..

''నాతో ఏమి మాట్లాడానుకుంటున్నారు..?'' ''కాస్త అలా వస్తే చెబుతాను..'' అంటూ ఆ పక్కనే మందిరం చివర ఎవరూ లేని ప్రదేశాన్ని చూపించాడు

రామారావు..

''సరె.. పదండి ..'' అంటూ రామారావు చూపించిన వైపు అడుగులు వేసాడు ఆనంద స్వరూప్.. ''ఊ.. ఇప్పుడు చెప్పండి .. నాతో ఏమి మాట్లాడాలనుకుంటున్నారు..?'' రెండు చేతులని కట్టుకుంటూ కూల్‌గా ప్రశ్నించాడు ఆనంద స్వరూప్.. ''నాకు శారదమ్మ గురించి కొన్ని వివరాలు కావాలి.. మీ ద్వారా నా కావలసిన వివరాలు దొరుకుతాయేమో అని మిమ్మల్ని ఇలా డిస్టర్బ్ చేసాను.. అయాం సారీ సార్..'' ఆనంద స్వరూప్ ఉలిక్కిపడ్డాడు.. అమెరికాకి వచ్చిన తర్వాత శారదమ్మ గురించి ఆరా తీస్తున్న మొట్టమొదటి వ్యక్తి రామారావు కావడంతో ఆనంద స్వరూప్‌లో కూడా ఒక విధమయిన ఎగ్జైట్‌మెంట్ కలిగింది.. ''ఆవిడ గురించి సోషల్ నెట్‌వర్క్‌లో సెర్చ్ చేస్తే బోలెడు వివరాలు దొరుకుతాయి.. ఇంకా కొత్తగా చెప్పడానికి ఏముంటుంది..?'' నవ్వుతూనే అన్నాడు ఆనంద స్వరూప్.. ''నా ఉద్దేశ్యం ఆవిడ ప్రొఫెషనల్ డీటెయిల్స్ గురించి కాదండీ.. ఆవిడ పర్సనల్ డీటెయిల్స్ కావాలి..''

రామారావు మాటలకి ఉలిక్కిపడ్డాడు.. ''ఆవిడ పర్సనల్ డీటెయిల్స్ తో మీకేం అవసరమండీ.. అయినా అసలు  పరిచయమే లేని మీకు ఆవిడ గురించి చెప్పాల్సిన అవసరం  నాకేమిటి చెప్పండి ..'' సూటిగా ప్రశ్నించాడు ఆనంద స్వరూప్..

రామారావు అసలు  విషయం ఆనంద స్వరూప్ ముందు ఉంచాడు..

''శారదమ్మ గురించి ఎందుకు అడుగుతున్నానంటే..'' అంటూ తన తండ్రి  శారదమ్మని చూసినప్పుడల్లా వింతగా ప్రవర్తించడం గురించి వివరించాడు.

ఆనంద స్వరూప్ ఎంతో ఆశ్చర్యపోయాడు రామారావు  మాటలకి.. కొంత ఆసక్తికరంగా కూడా అనిపించింది.. ''మా నాన్న  గారు శారదమ్మని చూడగానే ఎందుకు అలా ప్రవర్తిస్తున్నాడన్నది నాకు అంతు చిక్కడం లేదు.. ఇప్పుడు కూడా ఈ టెంపుల్‌లో శారదమ్మని చూసిన మరుక్షణం ఆయనలో మార్పుని స్పష్టంగా గమనించాను.. ఆవిడని చూసిన తర్వాత ఆయన ఒక్క క్షణం కూడా ఈ టెంపుల్‌లో ఉండడానికి ఇష్టపడలేదు.. అందుకే నేరుగా శారదమ్మనే ఈ విషయం గురించి అడగాలనుకున్నాను..

కానీ.. అంతమంది ముందు ఆ పెద్దావిడని అడగాలంటే మనసు రాలేదు.. మీరు శారదమ్మగారితో ఆప్యాయంగా మాట్లాడటం గమనించాను.. అందుకోసమే మిమ్మల్ని అడుగుతున్నాను..'' పూర్తిగా వివరించాడు రామారావు.

ఆనంద స్వరూప్ రెండు క్షణాలు  రామారావు  వంకే చూసి ఆలోచనలో పడిపోయాడు..

''ఇంకో విషయం కూడా మీతో చెప్పాలి.. శారదమ్మని చూస్తే నాక్కూడా ఎక్కడో చూసినట్టుగా అనిపిస్తుంది.. అంతే కాదు.. ఆవిడతో ఏదో అనుబంధం కూడా ఉందేమో అన్న ఫీలింగ్ కలుగుతుంది.. నాకు కలుగుతున్న ఈ ఫీలింగ్‌కి, మా నాన్న గారు ప్రవరిస్తున్న వింత ప్రవర్తనకి అసలు  లింకేమిటో కనుక్కోవాలన్నదే నా ఆలోచన.. అంతే తప్ప ఇందులో వేరే ఉద్దేశ్యం ఏమీ లేదు..''

రామారావు  మాటలో కనిపిస్తున్న నిజాయితీకి ఆనంద స్వరూప్ ఆయనకి శారదమ్మ వివరాలని అందించాలనే  నిర్ణయానికి వచ్చాడు.

''మీ నాన్న గారు అలా ప్రవర్తిస్తున్నాడంటే నాకూ ఆశ్చర్యంగానే ఉంది.. ఇంతకీ నేను మీకు ఏం వివరాలు  అందించగలనో చెప్పండి ..'' సౌమ్యంగా అన్నాడు ఆనంద స్వరూప్.. ''నాకు ఆవిడ వ్యక్తిగత వివరాలు కావాలి .. వాటి ఆధారంగా మా నాన్న గారి ప్రవర్తనకి గల కారణం ఏమైనా దొరుకుతుందేమో అన్నది నా ఆశ.. ఎందుకంటే.. నేను పుట్టిన దగ్గరి నుండీ మా నాన్న  గారిని చూస్తున్నాను.. ఆయన ముఖం  ఎప్పుడూ ఒక విధమైన గర్వంతో కూడుకుని ఉంటుంది.. ఊళ్ళో ఆయనంటే అందరికీ భయంతో కూడిన గౌరవం.. పైగా జమీందారులు కావడంతో పుట్టుకతోనే ఆయనకి ఆ దర్పం వచ్చింది.. అలాంటి వాడు శారదమ్మని చూడగానే డీలా పడుతున్నాడంటే..'' రామారావు  చెప్పుకు పోతున్నాడు.. కానీ ఆనంద స్వరూప్ మాత్రం రామారావు  పలికిన జమీందారులం  అన్న మాట దగ్గరనే ఆగిపోయింది.. జమీందారులు .. అంటే.. అంటే..

శారదమ్మ కూడా జమీందారీ వంశంలోనుండి  వచ్చిందే..

''ఒక్క నిమిషం.. మీ ఊరు పేరు చెప్పండి ..'' ఎగ్జైట్‌మెంటుతో అడిగాడు ఆనంద స్వరూప్..

''సిద్దిపేట  దగ్గర బస్వాపురం గ్రామం..'' ఆశ్చర్యంగా అన్నాడు రామారావు..

''మీరు.. మీరు.. జమీందారులా..?'' మరింత ఎగ్జైట్‌మెంటుతో అన్నాడు..

''అవును..'' ఆనంద స్వరూప్‌లో వస్తున్న ఎగ్జైట్‌మెంట్‌ని ఆశ్చర్యంగా గమనిస్తూ అన్నాడు రామారావు..

''జమీందార్ రాజ బహదూర్ భూపతి గారు ఎవరో మీకు తెలుసా..?'' ఆతృతగా అడిగాడు ఆనంద స్వరూప్.. ''నాకు తెలియక పోవడమేమిటండీ.. స్వయంగా మా తాత గారు.. అంటే రాజ బహదూర్ భూపతి తమ్ముడి  కుమారుడు మా నాన్న గారు.. అంటే మా పెద తాతయ్య'' రామారావు  మరింత ఆశ్చర్యంగా అన్నాడు..

''అంటే.. అంటే.. రాజ బహదూర్ భూపతి గారికి ఇద్దరు కుమారులని విన్నాను..'' తమ స్వంత విషయాలని అంత డీటెయిల్‌గా అడుగుతున్న ఆనంద స్వరూప్‌ని ఆశ్చర్యంగా చూశాడు రామారావు.

''అవును నాకు ఇద్దరు ఇద్దరు పెదనాన్న లు ఉన్నారు. మా నాన్న గారు నేను నా చిన్నతనంలోనే చదువు కోసం హైదరాబాద్ కి వెళ్లడం, ఆ తర్వాత అమెరికాకి రావడంతో మా కుటుంబ విషయాలు ఎక్కువగా నాకు తెలియవు.. కాక పోతే మా రెండవ పెదనాన్న చాలా దుర్మార్గుడని, ఆస్తి కోసం సొంత అన్నయ్యనే చంపేసిన కర్కశుడని విన్నాను.. అంతే కాదు.. ఆయన అన్న భార్య, మా పెద్దమ్మని ఇంట్లోనుండి గెంటివేసారని తెలిసి ఎంతో బాధపడ్డాను.. ఇప్పుడావిడ ఎక్కడుందో.. అసలు ఉందో లేదో కూడా తెలియదు.. ఆ తర్వాత మా చిన్న మామయ్య కూడా వ్యసనాలకి బానిసయ్యి చనిపోయాడని తెలిసింది..'' బాధగా అన్నాడు రామారావు..

ఆనంద స్వరూప్ ముఖం ఆనందంతో వెలిగిపోతుంది.. శారదమ్మ కుటుంబ సభ్యులు ఇలా అమెరికాలో కలుస్తారని ఆయన కలలో కూడా అనుకోలేదు..

ఈ విషయం శారదమ్మకి తెలిస్తే ఆవిడ ఎలా ఫీవుతుందో అని ఊహించుకుంటూ.. విస్మయంగా అడిగాడు ఆనంద స్వరూప్..''ఇప్పుడు ఆ ఆస్తి అంతా ఎవరి ఆధీనంలో ఉంది..?''

''మా ఆధీనంలోనే ఉంది.. ఇద్దరు పెదనాన్న లు చనిపోయిన తర్వాత, రాజ బహదూర్ భూపతి తమ్ముడి ఏకైక కుమారుడు అయిన మా నాన్న గారే ఆ ఆస్తినంతటినీ స్వాధీనం చేసుకున్నారు.. అలా చేసుకోవడం కోసం ఆయన కొన్ని చెడు పనులు కూడా చేసారని తెలిసి ఎంతో బాధపడ్డాను. రియల్ ఎస్టేట్ బూమ్ వచ్చాక మాకున్న వేలాది ఎకారాల భూమి విలువ అమాంతం పెరిగిపోయింది.. వందల కోట్ల రూపాయల ఆస్తి మా నాన్న గారే చూసుకుంటున్నారు..'' వివరంగా చెప్పాడు రామారావు..

''ఓహ్  మై గుడ్ నెస్..'' పెద్దగా అరిచినట్టుగా అన్నాడు ఆనంద స్వరూప్..

రామారావు  ఉలిక్కిపడ్డాడు.. ఆనంద స్వరూప్ అలా ఎందుకు అరిచాడో రామారావుకి అర్థం కాలేదు.. రామారావు  తననే వింతగా చూస్తుండడంతో..

''అయాం సారీ.. ఎక్కువగా ఆనందం కలిగినప్పుడు ఇలా అరవడం నా కలవాటు..'' ఆహ్లాదంగా నవ్వుతూ అన్నాడు ఆనంద స్వరూప్..

ఆయనకి ఆనందం ఎందుకు కలుగుతుందో రామారావుకి అర్థం కాలేదు..

''నాకింత ఆనందం ఎందుకు కలుగుతుందో అని మీరనుకుంటున్నారు కదూ.. నా ఆనందానికి కారణం తర్వాత చెబుతాను.. అయితే ఇప్పుడు మీ సమస్య.. శారదమ్మని చూడగానే మీ నాన్న  గారు అలా ఎందుకు మారిపోతున్నారో తెలుసుకోవాలని .. అంతే కదా..''

''ఎగ్జాట్లీ అంతే నండీ..'' అన్నాడు రామారావు..

''కొన్ని వందల కోట్ల రూపాయల  ఆస్తి చూస్తూ చూస్తూ చేయిజారిపోతుంటే ఎవరు మాత్రం అలా అవకుండా ఉంటారు చెప్పండి ..'' అన్నాడు ఆనంద స్వరూప్.. రామారావు ఉలిక్కిపడ్డాడు ఆయన మాటలకి.. ''మీరేం అంటున్నారో నాకు అర్థం కావడం లేదు..'' అయోమయంగా అన్నాడు రామారావు..

''చెబుతాను.. చెబుతాను.. దానికి ముందు మీరు నాకు కొన్ని వివరాలు  అందించాలి..'' అన్నాడు ఆనంద స్వరూప్..

''ఏమిటో చెప్పండి ..'' ఆశ్చర్యంగా అన్నాడు రామారావు..

''మీకు తెలిసినంత వరకు మీ కుటుంబ నేపథ్యం గురించి, మీ నాన్న గారి గురించి వివరిస్తారా..''

ఆ ప్రశ్నకి అదిరిపడ్డాడు రామారావు ..

''ఇప్పుడవన్నీ ఎందుకండీ..?'' ఆశ్చర్యంగా అన్నాడు రామారావు..

‘‘మీ నాన్న గారు అలా కావడానికి గల కారణం ఏమిటో నేను మీకు చెబుతాను.. దానికి ముందు మీరు నా  ప్రశ్నకి సమాధానం చెప్పాల్సిందే..’’ నవ్వుతూ అన్నాడు ఆనంద స్వరూప్.. తన నాన్న  అలా ప్రవర్తించడానికి, తన కుటుంబ నేపథ్యానికి లింకేమిటో అర్థం కాకపోయిన

.. చెప్పడం

ప్రారంభించాడు రామారావు.

................................

కరుణేంద్ర భూపతి సాక్షాత్తూ శారదమ్మ భర్త తమ్ముడు.. అంటే శారదమ్మ భర్త తండ్రి తమ్ముడి కుమారుడు.. ప్రస్తుతం శారదమ్మకి చెందాల్సిన కోట్లాది రూపాయల  ఆస్తిని అనుభవిస్తూ దర్జాగా జీవితాన్ని అనుభవిస్తున్నవాడు. శారదమ్మ ఉండాల్సిన ఇంద్రభవనం లాంటి భవంతిలో ఆయన ఉంటున్నాడు.. ఆయన పేరులో ఉన్న కరుణ ఆయనలో మాత్రం ఇసుమంతయినా కనిపించదు. శారదమ్మని ఇంట్లోనుండి  బయటికి గెంటేసిన తర్వాత కొన్ని సంవత్సరాలకే ఆమె భర్త తమ్ముడు తీవ్రమైన అనారోగ్యంతో మృత్యువాత  పడ్డాడు. దాంతో పినతండ్రి కుమారుడు అయిన కరుణేంద్ర భూపతి ఆ ఆస్తిని తెలివిగా తన వశం చేసుకున్నాడు.. తన పెదనాన్న  ముగ్గురు కూతుర్లని ఆస్తి కొరకు వస్తే   ప్రాణాలు  దక్కవని బెదిరించడంతో వారు ఆ ఆస్తిపై ఆశలు  వదులుకున్నారు.. ఇక ఆ ఆస్తికి సర్వ హక్కుదారు ఒకే ఒక్కరు.. ఆవిడే శారదమ్మ.. కుటుంబంలో భర్త మరణానంతరం అతనికి చెందిన ఆస్తిపై సర్వహక్కులు  భార్యకే చెందుతుందని చట్టంలోనే ఉంది.. అయితే ఆవిడ భర్తనే కాదు, ఆవిడ మరిది కూడా చనిపోవడంతో ఆ ఇద్దరికి చెందిన ఆస్తిపై సర్వహక్కులు శారదమ్మకే చెందుతాయి.. ఈ విషయం కరుణేంద్రభూపతికి తెలియనిది కాదు.. అందుకే ఆస్తిని చేజిక్కించుకున్నాక శారదమ్మ ఆ ఛాయలకి రాకుండా చూసుకోవడానికి చాలానే జాగ్రత్త పడ్డాడు.. అందుకోసం ప్రత్యేకంగా ఒక పదిమందిని నియమించాడు.. ఆ

చుట్టు ప్రక్కల  ఉండే గ్రామాలలో ఎక్కడైన శారదమ్మ ఉందా.. అని వెతకడమే వారు చేయాల్సిన పని.. ఒక వేళ శారదమ్మ కనిపిస్తే  మరో ఆలోచన లేకుండా ఆమెని అంతమొందించాలని  చాలా స్పష్టమైన ఆదేశాలని కరుణేంద్ర భూపతి వారికి ఇచ్చాడు.. అలా కొన్ని సంవత్సరాల  పాటు శారదమ్మని వెతికారు వారు.. ఎంత వెతికినా శారదమ్మ కనిపించకపోవడంతో.. ఒంటరిగా వెళ్ళిపోయిన ఆవిడ ఇన్ని సంవత్సరాల తర్వాత  కూడా కనిపించడం లేదంటే ఖచ్చితంగా ఆవిడ చనిపోయి ఉంటుందని నిర్ధారణకు వచ్చారు వారు.. ఇదే విషయాన్ని కరుణేంద్రభూపతికి చెప్పారు.. ఆయనకి కూడా శారదమ్మ బ్రతికి ఉండదని, ఎక్కడో అనాధలా చనిపోయే ఉంటుందని నమ్మకం కుదరడంతో ఎంతో సంబరపడిపోయాడు.. వందల  కోట్ల రూపాయల విలువ చేసే  ఆ ఆస్తికి తానే వారసుడని, ఇక తనకు తిరుగు లేదని ఆనంద పడిపోయాడు.. వేలాది ఎకరాల  పంట పొలాలు  ఇప్పుడు ఆయన సొంతం.. ఆ పంట పొలాలలో పనిచేసే  రైతులను చాలా చిన్నచూపు చూసేవాడు కరుణేంద్ర భూపతి.. వారిచేత రాత్రనకా, పగలనకా కష్టం చేయించుకునేవాడు.. పంట చేతికి రాగానే వారికి  తలా ఒక బస్తా ధాన్యాన్ని ఇచ్చేవాడు. కష్ట పడినందుకు ఫలితం అదే అని అనేవాడు.. ఆ ధాన్యంలో కొన్నింటిని అమ్ముకుని ఆ వచ్చే అరకొర సొమ్ముతోనే వారు ఎంతో దుర్భరమైన జీవితాన్ని అనుభవించేవారు. తమ కష్టానికి తగ్గ ప్రతిఫలాన్ని ఇవ్వాలని ఎవరైనా ఎదురు తిరిగి మాట్లాడితే ఆ మరునాడు ఆ వ్యక్తి కనిపించేవాడు కాదు.. రాత్రికి రాత్రే కరుణేంద్ర భూపతి ఏర్పాటు  చేసిన రౌడీలు ఎదురు తిరిగిన వారిని హతమార్చి పూడ్చిపెట్టేవారు.. ఆ విషయం తెలిసి కరుణేంద్ర భూపతికి ఎదురు తిరగలేక, తమ జీవితాల్లో ఉన్న కష్టాన్ని  ఎవరికి చెప్పుకోవాలో అర్ధం కాక, చస్తూ బ్రతుకుతున్నారు వారందరూ.. వారిలో ఏదో ఆశ.. కరుణేంద్ర భూపతి ఆగడాలని ఎదురించే శక్తి ఏదో ఉందని, ఏన్నటికైనా ఆ శక్తి తమకి అండగా నిలుస్తుందని వారికి ఎంతో ఆశ..

ఆ ఆశ.. శారదమ్మనే..

ఇంట్లో నుండి గెంటి వేయబడ్డ శారదమ్మ బ్రతికే ఉందని వారి ప్రగాఢమైన విశ్వాసం.. ఏనాటికైనా శారదమ్మ వస్తుందని, కరుణేంద్ర భూపతి నుండి తన ఆస్తిని సొంతం చేసుకుని తమ జీవితాలో కొత్త వెలుగు నింపుతుందన్న నమ్మకంతోనే వారు జీవిస్తున్నారు.. సంవత్సరాలు గడిచిన , తమ తర్వాత తమ వారసులు సైతం కరుణేంద్ర భూపతికి ఊడిగం చేస్తూ బ్రతికీడుస్తున్నా.. వారు ఏమాత్రం కృంగిపోలేదు.. శారదమ్మ రూపంలో తమ జీవితంలో వెలుగు వస్తుందన్న విశ్వాసం వారిలో చాలా బలంగా నాటుకుపోయింది.. అందుకే కరుణేంద్ర భూపతి తమ కష్టాన్ని దోచుకున్నా మిన్నకుండిపోయారు.
తన కుమారుడు రామారావు భూపతి కాలేజీ చదువు అయిపోగానే అమెరికాకి పంపించేశాడు కరుణేంద్ర భూపతి.. ఆమెరికాకి వచ్చిన రామారావు, ఉన్నత విద్యాభ్యాసం చేసి, మంచి ఉద్యోగం సంపాదించి అక్కడే స్థిరపడిపోయాడు..
అయితే రామారావుకి ఆ జమిందారు గిరీ అన్నా, పేదవారి కడుపు కొట్టి సంపాదించే ఆ ఆస్తి అన్నా పరమ అసహ్యం. పేదవారికి ఒక ముద్ద పెడితే వారి ఆశీస్సులతో తమ కుటుంబం బావుంటుంది.. కానీ వాళ్ళని హింసిస్తూ, వారి కష్టాన్ని దోచుకుని తింటే కచ్చితంగా ఆ పాపం తమపై పడుతుందని తండ్రితో ఎన్నో సార్లు చెప్పాడు.. కానీ.. ఆయన వినిపించుకోలేదు.. ఊరి విషయాలు నీకు తెలియవు.. ఈ విషయంలో నువ్వేమీ కల్పించుకోవద్దు.. అంటూ కుమారుడిని హెచ్చరించేవాడు.. చెబితే వినే రకం కాదు తన తండ్రి అని రామారావు కి తెలియడంతో చేసేదేమి లేక మిన్నకుండి పోయేవాడు..
అమెరికాలో స్థిరపడ్డాక రామారావు కూడా బాగానే సంపాదించాడు.. దాంతో ఎప్పుడూ తన తండ్రి నుండి వచ్చే ఆస్తికోసం పెద్దగా పట్టించుకోలేదు.. తన మరణానంతరం ఈ ఆస్తిని మొత్తం ఒక్కగానొక్క కొడుకు రామారావు చేతిలో పెట్టాలని కరుణేంద్ర భూపతి కోరిక.. అయితే రామారావు మాత్రం ససేమిరా అంటున్నాడు.. ఎక్కడో అమెరికాలో ఉండే తను ఇండియాలో ఉన్న అంత ఆస్తిని ఎలా కాపాడుకోగలడు..? పైగా ఇండియాలో ప్రస్తుతం ఉన్న

పరిస్థితులు  రామారావు కి తెలియనిది కాదు.. ఏమాత్రం అవకాశం వచ్చిన భూముని కబ్జా చేసుకోవాలని చూసే రాజకీయ  నాయకులకి  కొదవ లేదు.. భూమి యజమాని ముందే దర్జాగా కబ్జా చేసుకుని, ఎదురుతిరిగితే ఆ యజమానిని హతమార్చేందుకు కూడా వెనుకాడని ఈ రోజుల్లో.. వేలాది ఎకరాలకు వారసుడు  అమెరికాలో ఉంటాడని వారికి తెలిస్తే ఊరుకుంటారా .. దర్జాగా  తమ కబ్జా పంజాని విసిరేసి, రాత్రికి రాత్రే ఆ భూమిని మొత్తం తమ సొంతం చేసుకుంటారు..

ఇటువంటి పరిస్థితిలో అమెరికాలో సంతోషంగా జీవితాన్ని గడుపుతున్న తన మెడలో ఆస్తి అనే డోలు వేస్తే  .. ఆ ఆస్తిని కాపాడుకోలేక, సంతోషంగా ఉండలేక జీవితాన్ని చిన్నాభిన్నం చేసుకోవాల్సిన పరిస్థితి వస్తుందని రామారావు వాదన..

కానీ.. కుమారుడికి ఎన్నో విధాలుగా సర్ది చెప్పాడు కరుణేంద్ర భూపతి.. తన తదనంతరం ఆ ఆస్తి దిక్కూమొక్కూ లేకుండా ఎవడికో దక్కడం కోసమేనా  తాను ఇన్ని సంవత్సరాలుగా కాపాడుకుంటూ వచ్చింది.. ఒకటా రెండా,, వందల కోట్ల రూపాయల ఆస్తి.. అంత ఆస్తిని చూస్తూ చూస్తూ ఒదులుకోవద్దు.. కావాలంటే ఒక ఆరు నెలలు  ఇండియాకి వచ్చి, తమకి కావాల్సినంత మేర ఉంచేసి, మిగతా భూములన్నింటీ అమ్మేసి ఆ డబ్బును,  కుమారుడిని బ్యాంకులో డిపాజిట్ చేసుకోమని కరుణేంద్ర భూపతి వేడుకున్నాడు..

ఆ ఆలోచన బాగానే ఉందనిపించింది రామారావుకి..

దానికి ఇంకా సమయం ఉండడంతో ప్రస్తుతం ఆ విషయం గురించి ఆలోచించకుండా హాయిగా కొద్ది రోజులు  గడిపేసి ఇండియాకి వెళ్ళిపోండని కరుణేంద్ర భూపతిని కోరాడు రామారావు ..

ఇక చేసేదేమీ లేక కొడుకు మాటకు సరే అని.. ఇంక ఆ ఆలోచనని విరమించుకుని మనుమడు, మనుమరాండ్లతో హాయిగా గడుపుతున్నాడు కరుణేంద్ర భూపతి..

..............................

రామారావు  చెప్పడం ఆపి ఆనంద స్వరూప్ వంక చూసాడు. ఆయన ముఖం లో కొంత బాధ కదలాడుతుంది..

శారదమ్మని ఇంట్లో నుండి  గెంటి వేసారన్న విషయాన్ని గతంలోనే తాను విని ఉన్నాడు. కాకపోతే ఆ తదనంతరం ఆ ఆస్తిని ఎవరు చూసుకుంటున్నారన్న విషయం ఇప్పుడు రామారావు ద్వారా  తెలిసింది.. అంటే.. అంటే..

ఆ ఆస్తికి ఏకైక వారసురాలయిన  శారదమ్మని అంతం చేస్తే  ఇంక తమకి ఎలాంటి అడ్డంకి ఉండదనుకున్న కరుణేంద్ర భూపతి ఆవిడని అడ్డు తొలగించుకోవడం కోసం రకరకాల ప్రయత్నాలు చేసాడు.. ఎన్నాళ్ళకీ ఆవిడ ఆచూకీ తెలియకపోవడంతో ఇంక చనిపోయి ఉంటుందని భావించి ఆనందంగా ఆస్తిని అనుభవిస్తున్నాడు.. ఇప్పుడు ఇన్నేళ్ళ తరువాత తిరిగి శారదమ్మని చూడగానే ఆయన జీర్ణించుకోవడం లేదన్న మాట.. ఆనంద స్వరూప్ రామారావు  వంక చూసి నవ్వాడు.. ''మీ గురించి చెప్పినందుకు థ్యాంక్యూ.. ఇక మీకున్న సందేహం మీ నాన్న  గారు అలా ఎందుకు ప్రవర్తిస్తున్నారనే కదా..''

''నాక్కావాల్సిందే అదే అని మీకు ముందే చెప్పాను..''

''మీ నాన్న గారు అలా ప్రవర్తించడానికి కారణమైన ఆ శారదమ్మ ఎవరో కాదు..'' అంటూ ఆనంద స్వరూప్ రామారావు  వంక చూసాడు..

రామారావు  నొసలు ముడిపడినది... ఆత్రంగా ఆనంద స్వరూప్ ఏం చెబుతాడా అని చూస్తున్నాడు..

''ఆమె రాజా రావుబహదూర్ కోడలు, ఆయన పెద్ద కొడుకు అమరేంద్ర భూపతి భార్య. ఇప్పటి వరకూ మీ నాన్న  గారి ఆధీనంలో ఉన్న వందల కోట్ల రూపాయల  ఆస్తికి ఏకైక

వారసురాలు..'' ఆనంద స్వరూప్ మాటలకి భూమి గిర్రున తిరిగినట్లనిపించింది

రామారావుకు .. ఒక్క క్షణం. తాను వింటున్నది నిజమేనా అన్న అనుమానం కలిగింది..

''నేను చెబుతున్నది నిజం.. ఇన్నాళ్ళ వరకూ మీనాన్న గారు చనిపోయిందని భావిస్తున్న మీ పెద్దమ్మ గారే ఈ శారదమ్మ.. అందుకే శారదమ్మని చూడగానే తన ఆస్తి మొత్తం ఆమెకి ఎక్కడ ధారాదత్తం చేయాలో అన్న భావనతోనే

ఆయన ఇలా విపరీతంగా ప్రవర్తిస్తున్నాడు..''

రామారావు కి ఏం మాట్లాడాలో అర్థం కాలేదు.. అసలు ఎలా రియాక్ట్ అవ్వాలో కూడా తెలియకుండా చేష్టలుడిగి చూస్తూండి పోయాడు..

ఇద్దరి మధ్యలో కొన్ని క్షణాలు నిశ్శబ్దంగా గడిచిపోయాయి... చివరికి ఆనంద స్వరూప్ భారంగా ఊపిరి తీస్తూ అన్నాడు.. ''ఇన్ని రోజులు కోట్ల రూపాయల ఆస్తిని అనుభవించిన వాడు ఆ కోట్లని వదులుకోవడానికి ఎలా ఇష్ట పడుతాడు.

అందుకే శారదమ్మని చూడగానే మీ నాన్న గారిలో మునుపటి కోపం ఆవరించింది..''

రామారావు కళ్ళల్లోనుండి కన్నీళ్ళు జలజలా రాలుతున్నాయి ..

తనకి ఒక పెద్దమ్మ ఉందని, అదీ ప్రస్తుతం ఆమె తన సమీపంలోనే ఉందన్న ఆలోచననే ఆయనని ఎంతో విస్మయానికి గురి చేస్తుంది..

ఆనంద స్వరూప్ రామారావునే గమనిస్తున్నాడు.. ఆయన భావోద్వేగానికి గురి కావడంతో మౌనంగా ఉండిపోయాడు.. రామారావు కాస్త తేరుకున్నాక.. ఆనంద స్వరూప్ వంక చూస్తూ..

''ఇప్పుడు నాకేం చేయాలో పాలు పోవడం లేదు.. ఇన్నాళ్ళుగా ఎవరూ లేని అనాధగా మా పెద్దమ్మ ఉందన్న ఊహనే భరించలేకపోతున్నాను.. కోట్ల రూపాయల ఆస్తి, జమిందారు వంశం.. ఇవన్నింటినీ వదులుకున్న ఒక ఉత్తమురాలు నాకు పెద్దమ్మ అని తెలిసి ఎంతో గర్వపడుతున్నాను..'' గాద్గద స్వరంతో అన్నాడు రామారావు..

ఆనంద స్వరూప్ భుజంపై ఓదార్పుగా చేయి వేసాడు ఆనంద స్వరూప్..''స్వయంగా ఆ సాయినాధుడే మిమ్మల్ని ఇలా దగ్గరికి చేరదీసాడు.. శారదమ్మకి సాయి భగవానుడంటే ఎంతో ఇష్టం.. అందుకే ఆవిడకి కావలసిన వారిని ఆవిడ దరికి చేరేలా చేసాడు..''

అన్నాడు ఆనంద స్వరూప్..

''నాకు ఎప్పుడెప్పుడు మా పెద్దమ్మని చూడాలా అని ఆరాటం కలుగుతుంది.. పదండి వెళదాం.. ఒకసారి ఆప్యాయంగా ఆవిడతో మాట్లాడాలని ఉంది..'' ఎంతో ఆత్రంగా అన్నాడు రామారావు.. ''అప్పుడే తొందర పడకండి .. ముందు మీ నాన్న గారి గురించి ఆలోచించాలి కదా..''

రామారావుకి అప్పుడు గుర్తుకు వచ్చింది అసలు సమస్య..

''అవును కదా.. ఈ ఆనందంలో మా నాన్న గారి గురించే మరిచిపోయాను.. ఇప్పుడెలా చేసేది..?'' ఆలోచిస్తూ అన్నాడు రామారావు ..

ఆ సమయంలోనే రామారావుని వెతుక్కుంటూ అక్కడికి ప్రతిభ వచ్చింది..

''డాడీ.. ప్రసాదాలు తీసుకురావడానికి ఇంత సమయం పడుతుందా.. అంటూ తాతయ్య కోపం చేస్తున్నారు.. మిమ్మల్ని తొందరగా రమ్మంటున్నారు..'' ప్రతిభ మాటకి ఇద్దరూ ఉలిక్కిపడ్డారు..

''గతంలోకి వెళ్ళి, వర్తమానాన్ని మరిచిపోయాము.. అన్నట్టు ఇదిగోండి నా విజిటింగ్ కార్డు.. ఇప్పుడు మీరు ఏమీ ఆలోచించకుండా వెళ్ళిపోండి .. విషయం నాకు తెలిసింది కాబట్టి.. మరొక్కసారి మనం కలిసినప్పుడు దీనికి పరిష్కార మార్గం అన్వేషిద్దాం..'' అన్నాడు ఆనంద స్వరూప్ తన జేబులోనుండి విజిటింగ్ కార్డు తీసి అందిస్తూ..

రామారావు కూడా తన విజిటింగ్ కార్డు ఇచ్చాడు..

''మీరేమీ అనుకోకపోతే రేపు మనం కలిసే అవకాశం ఉందేమో చూడండి ..'' అభ్యర్థనగా అన్నాడు రామారావు..

అతను శారదమ్మని కలుసుకోవాలని ఎంతగా ఆత్రపడుతున్నాడో అర్థం అయింది ఆనంద స్వరూప్‌కి.. చిన్నగా నవ్వేసి.. ‘‘అలాగే.. రేపు మధ్యాహ్నం కలుద్దాం..’’ అన్నాడు..

‘‘థ్యాంక్యూ వెరీమచ్ సర్.. ఆ సాయినాథుడే మిమ్మల్ని నన్ను కలిసేలా చేసాడని విశ్వసిస్తున్నాను.. లేకపోతే నా సమస్యకి పరిష్కారం దొరకక మరింత మధనపడిపోయే వాడిని..’’ షేక్ హ్యాండిస్తూ అన్నాడు రామారావు..

అతని మాటకి చిన్నగా నవ్వి అక్కడి నుండి ముందుకు కదిలాడు ఆనంద స్వరూప్.. ప్రసాదాలు తీసుకున్న రామారావు టెంపుల్ బయటికి అడుగు వేస్తూ శారదమ్మ వంక చూసాడు.. ఎంతో నిర్మలంగా కనిపిస్తున్న ఆవిడని చూస్తూంటే రామారావు మనసు ఎంతో ఆనందంతో ఉప్పొంగిపోతూంది.. తన పెద్దమ్మని తొందరగా కలుసుసుకోవాలని ఆరాటం అతనిలో మొదయింది.

..............................

సాయి టెంపుల్ నుండి అందరూ బయటికి వచ్చారు. శారదమ్మకి ఆతిథ్యం అందించిన వారి కారులో శారదమ్మ బయలుదేరింది. ఆ తర్వాత ఆనంద స్వరూప్ కూడా తన కారులో బయలు దేరాడు. కారులో వెళుతున్న ఆనంద స్వరూప్ ఆలోచన మొత్తం రామారావు, ఆయన తండ్రి కరుణేంద్ర భూపతి చుట్టూనే తిరుగుతుంది. రామారావు మాటలని బట్టి చూస్తే ఆయనకి ఇండియాలో ఉన్న సంపదపై మక్కువ లేదని తెలిసిపోతుంది. కానీ ఆయన తండ్రి మాత్రం ఆ ఆస్తికి రామారావునే వారసుడుగా చూసుకోవాలనే తీవ్రంగా ప్రయత్నిస్తున్నాడు. కానీ అనుకోకుండా శారదమ్మ కనిపించడంతో ఆయనకి ఏం చేయాలో అర్థం కాని పరిస్థితి ఎదురయింది..ఇంత వరకూ బాగానే ఉంది.. ఇక శారదమ్మ విషయానికి వస్తే ..

ఈ భోగ భాగ్యాలపై విరక్తి భావంతో ఉన్న ఆవిడ తనకి వచ్చే కోట్ల ఆస్తి కోసం ఆశ పడుతుందన్నది కలలో మాట. ఆస్తి గురించి కాకపోయినా, ఆప్యాయత కోసం పరితపిస్తున్న

రామారావు  ఫ్యామిలీతో శారదమ్మని కలపాలని మాత్రం దృఢంగా అనుకున్నాడు ఆనంద స్వరూప్..  అయితే ఈ విషయాన్ని శారదమ్మతో వెంటనే చెప్పాలని అనుకోవడం లేదు ఆనంద స్వరూప్.. తన వ్యక్తిగత విషయాలపై ఆమె ఆలోచనలు  వెళితే ఆ ప్రభావం తాను చేసే  ప్రసంగాలపై పడుతుందన్నది ఆయన భావన.. అందుకే.. లాస్ ఏంజిల్స్‌లోనూ, డెట్రాయిట్‌లోనూ జరిగే ఆవిడ ప్రవచనాల  కార్యక్రమం పూర్తయిన తర్వాతే  ఈ విషయాన్ని ఆవిడతో చెప్పాలనుకున్నాడు.. అయితే ఈ ముగ్గురినీ ఎలా కలపాలా అన్నదే ముఖ్యమయిన సమస్య.. ఆ సమస్యని ఎలా పరిష్కరించాలా అని తీవ్రంగా ఆలోచనలో మునిగిపోయాడు ఆనంద స్వరూప్.

..............................

లాస్ ఏంజిల్స్ నగరం.. అమెరికాలో ఖరీదయిన నగరాల్లో ఇదీ ఒకటి.. అక్కడ నివసించే వారి జీవన విధానం కూడా ఖరీదుగానే ఉంటుంది.. అంతేకాదు.. అమెరికాలో అత్యధికంగా నేరాలు  జరిగే ప్రాంతం కూడా అదే.. అయినప్పటికీ లాస్ ఏంజిల్స్ నగరం ఒక భూతల స్వర్గంగా చెప్పవచ్చు.

లాస్ ఏంజిల్స్‌లోని ప్రధాన కూడలిలో ఉన్న సెంట్రల్ హాల్ శారదమ్మ ప్రవచనం కోసం ఏర్పాటు  చేసారు. ఆవిడ అక్కడ ప్రసంగించేది నేడే..

అప్పటికి సమయం సాయంత్రం నాలుగు  గంటలు అవుతుంది.. కార్యక్రమం ఆరున్నరకి మొదలయినప్పటికీ, శారదమ్మ ప్రసంగం వినడానికి దూర ప్రాంతాల నుంచి విచ్చేసిన తెలుగు వారు  అప్పుడప్పుడే అక్కడకి చేరుకుంటున్నారు. శారదమ్మ కూడా గత రాత్రే  లాస్ ఏంజిల్స్ చేరుకుంది.

ఆమె అంటే ఎంతో గౌరవించే ఓ తెలుగు కుటుంబం ఆమెకి ఆతిథ్యాన్ని అందిస్తోంది.. ఆనంద స్వరూప్ కార్యక్రమం కోసం చేసే  పనులలో బిజీబిజీగా ఉన్నాడు. ఆయన అసిస్టెంట్ ఎస్.రామ్  కూడా హడావిడిగా కదులుతూ చేయాల్సిన పనులను చకచకా చేసుకుంటూ

పోతున్నాడు. శారదమ్మ ప్రసంగాన్ని లైవ్‌లో అందించడం కోసం అక్కడి లోకల్ చానెల్స్ అప్పటికే సిద్ధపడిపోయాయి..

అంతే కాదు.. శారదమ్మ చేసే ప్రసంగం అప్పటికప్పుడు ఇంగ్లీషులో ట్రాన్స్‌లేట్ అయ్యేలాకూడా ఏర్పాటు చేసేసారు.. ఆరున్నర ఎప్పుడవుతుందా అని శారదమ్మ ప్రసంగాన్ని తిలకించడానికి ఇష్టపడే ప్రతీ ఒక్కరూ ఎదురు చూస్తున్నారు.. ఆ ఒక్కరిలో రామారావు ముందు వరుసలో నిలుస్తాడు. రామారావు తన తండ్రికి వేరే పనిపై బయటకు వెళ్తున్నానని చెప్పి తన భార్య పిల్లలతో కలిసి లాస్ ఏంజిల్ చేరుకున్నాడు.. వారిని సాదరంగా ఆహ్వానించాడు ఆనంద స్వరూప్.. రామారావు శారదమ్మ బంధువలన్న అభిమానం ఆనంద స్వరూప్‌లో కనిపిస్తుంది.. అందుకే వారికి ప్రత్యేకంగా ముందు వరుసలో సీట్లని రిజర్వ్ చేయించాడు.

రామారావు ముఖం ఆనందంతో వెలిగిపోతుంది.. శారదమ్మ గురించి తన ఫ్యామిలీ మెంబర్లకి ఏమీ చెప్పకపోయినప్పటికీ.. ఆమె ప్రసంగాన్ని ప్రత్యక్షంగా చూడాలన్న కోరికతోనే మిమ్మల్ని కూడా తీసుకెళుతున్నాను అని మాత్రం తన భార్యతో చెప్పాడు. శారదమ్మ ప్రసంగాలంటే ఆమెకి కూడా ఇష్టమే కావడంతో కాదనకుండా అందరూ రెడీ అయిపోయారు. సరిగ్గా ఆరుగంటల కల్లా ఆ హాలు మొత్తం ప్రేక్షకులతో నిండిపోయింది. అందులో తెలుగు వారితో పాటు భాషేతర వారు కూడా ఉండడం విశేషం. శారదమ్మని ప్రత్యక్షంగా చూడాలన్న ఆరాటంతో తమకి భాష అర్థం కాకపోయిన చాలా మంది ఆ ప్రోగ్రాంని చూడడానికి వచ్చారు.

భాషా భేదం లేకుండా సాగే ఆ ప్రసంగం తిలకించడం కోసం లాస్ ఏంజిల్స్ మేయర్‌ని ఆనంద స్వరూప్ స్వయంగా ఆహ్వానించాడు.. నగర మేయర్ వస్తున్నాడంటే ఆ ప్రోగ్రాంకి ఎంతటి ప్రాధాన్యత సంతరించుకుందో ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. సరిగ్గా ఆరు ఇరవైకి శారదమ్మ ఆ ప్రాంగణానికి చేరుకుంది.. శారదమ్మని సాదరంగా ఆహ్వానించాడు ఆనంద

స్వరూప్.. ఆవిడ రాకతో అక్కడంత  సందడిగా మారిపోయింది.. ఆవిడతో కలిసి మాట్లాడాలని, ఆవిడతో సెల్ఫీ  తీసుకోవాలని చాలా  మంది ప్రయత్నిస్తున్నారు.. వారందరినీ చిరునవ్వుతో పలకరిస్తూ హాలులోకి వెళ్ళింది శారదమ్మ.. శారదమ్మకి సెక్యూరిటీగా పది మంది వరకూ ఆమె చుట్టూ ఉండడంతో అంతమంది జన సందోహంలో  నుండి  వెళ్ళడం సాధ్యమయింది.

సరిగ్గా అరున్నరకి లాస్ ఏంజిల్స్ మేయర్ కారు అక్కడకి చేరుకుంది.. మేయర్ రాకతో మళ్ళీ అక్కడంత హడావిడి  మొదలయింది.. మేయర్‌ని కూడా సాదరంగా ఆహ్వానించాడు ఆనంద స్వరూప్, ఆయన అనుచరులు..

ఆయన ఫోటోలు తీయటానికి ఫోటో గ్రాఫర్లు చుట్టుముట్టారు.. వారందరికీ అభివాదం చేస్తూ లోనికి నడిచాడు మేయర్.. అతనితో పాటు ఆనంద స్వరూప్, సాయిరాం కూడా వెళ్ళారు. లోనికి వెళ్తూనే శారదమ్మ గురించి ఆనంద స్వరూప్‌ని అడిగాడు మేయర్.. ఆవిడ వెయిటింగ్ రూంలో ఉన్నారని తెలపటంతో మేయర్ హాలులోకి వెళ్ళకుండా నేరుగా ఆవిడ ఉండే గదివైపు అడుగులు  వేసాడు..ఆ హఠత్పరిణామానికి ఆనంద స్వరూప్‌తో పాటు అందరూ ఆశ్చర్యపోయారు.. ఆ గదిలో మేయర్ ప్రవేశించే సమయానికి శారదమ్మ సోఫాలో కూర్చుని ఉంది.. ఆమె చేతిలో భగవద్గీత ఉంది..మేయర్‌తో పాటు ఆనంద స్వరూప్ కూడా లోనికి వచ్చాడు. మేయర్ శారదమ్మ దగ్గరికి వెళ్ళాడు..అంతపెద్ద మేయర్ స్థాయి వ్యక్తి శారదమ్మ దగ్గరికి రావడం ఇంకా జీర్ణించుకోలేకపోతున్నాడు ఆనంద స్వరూప్.. మేయర్ దగ్గరికి రాగానే ఆనంద స్వరూప్ శారదమ్మకి మేయర్‌ని పరిచయం చేసాడు..

శారదమ్మ చిరునవ్వుతో లేచి నిలబడి  రెండు చేతులతో నమస్కరించింది..

మేయర్ కూడా చిరునవ్వు చిందిస్తూ రెండు చేతులు  జోడించి ఆమెకి అభివాదం చేసాడు..

ఆ అరుదైన సంఘటనని చిత్రించడానికి టివి కెమెరాలు పోటీ పడ్డాయి.. ఫోటో కెమెరాలు తమ కెమెరాలని క్లిక్ మనిపించాయి.. రెండు నిమిషాల పాటు మేయర్ శారదమ్మతో మాట్లాడాడు..

‘‘కోట్లాది మంది జీవితాలలో వెలుగు నింపే ప్రసంగాన్ని చేస్తున్న శారదమ్మ ఇంత సాదాసీదాగా ఉంటుందని నేను కలలో కూడా ఊహించలేకపోయాను.. ఆమె నిరాడంబరత, నిర్మలమైన జీవితానికి నేను హాట్సాఫ్ చెబుతున్నాను..’’ అని మేయర్ విలేఖర్ల ముందు ప్రకటించాడు..

ఆ తర్వాత శారదమ్మ కి రెండు చేతులు జోడించి నమస్కరించి హాలులోకి ప్రవేశించాడు మేయర్.. మరో పది నిముషాలలో శారదమ్మ వేదికపైకి వచ్చింది.. తనకి కేటాయించిన ఆసనంపై కూర్చుని గొంతు సవరించుకుని ముందున్న మైకుని సరిచేసుకుంది..శారదమ్మని చూడగానే ఆ హాలంతా కరతాళ ధ్వనులతో మ్రోగిపోయింది.. ఆమెకి గౌరవంగా అందరూ సీట్లలో నుండి లేచి మరీ చప్పట్లతో ఆమెకి స్వాగతం పలికారు.. ఆ అద్భుత సంఘటన చూస్తున్న రామారావు కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి.. స్వయాన తనకి పెద్దమ్మ అయిన శారదమ్మకి అమెరికాలో లభిస్తున్న గౌరవాన్ని చూస్తూంటే రామారావు హృదయం ఉప్పొంగిపోయింది.. ఎప్పుడెప్పుడు ఆమెకి తాను కొడుకుని అవుతానన్న నిజం తెలపాలా అని ఎంతో ఆరాటంగా ఉంది. అందరికీ వినయంగా నమస్కరించింది శారదమ్మ..శారదమ్మ ప్రసంగం మేయర్‌కి అర్థమయ్యేలా ఆయన ప్రక్కనే ఓ ట్రాన్స్‌లేటర్‌ని కూడా ఏర్పాటు చేసాడు ఆనంద స్వరూప్.. ప్రసంగం ప్రారంభమయింది.. అప్పటి వరకూ కరతాళ ధ్వనులతో దద్దరిల్లిపోయిన ఆ హాలులో ఒక్కసారిగా నిశ్శబ్దం ఆవరించింది.. శారదమ్మ గొంతులోనుండి వెలువడుతున్న మాటలు తప్ప మరేదీ వినిపించడం లేదు..భగవద్గీత లోని సారాన్ని, రామాయణంలోని భావాన్ని, భాగవతంలోని అంశాలని ఆవిడ చెబుతున్న తీరుకి ప్రతీ

ఒక్కరూ ముగ్ధులయిపోతున్నారు.. ఆవిడ చెప్పే ప్రతీ మాట మనిషి జీవితంలో పాటించవలసినవే.. పురాణాలు ఉన్నవి కేవలం చదువుకోవడానికి మాత్రమే కాదు, అందులో ఉన్న సారాన్ని అర్థం చేసుకుని భవిష్యత్తు తరంకి వెలుగు ప్రసాదించాలన్న సత్యాన్ని శారదమ్మ ఎంతో చక్కగా వివరించింది.. అనర్గళంగా మాట్లాడుతున్న ఆమె వాగ్ధాటికి, ఆ మాటలో వినిపిస్తున్న జీవిత సత్యాలకి ప్రతీ ఒక్కరూ లీనమయిపోయారు.. అప్పటికి సమయం ఎనిమిది గంటలు గడిచింది.. గంటన్నర సేపు అనర్గళమైన ప్రసంగం.. హాలులో ఉన్న ప్రేక్షకులు కుర్చీలోకి అతుక్కుని మరీ వింటూండిపోయారు.. లైవ్ టెలికాస్ట్ ద్వారా టీవీలో చూస్తున్న కోట్లాది మంది జనం ముగ్ధులయిపోతున్నారు. సోషల్‌నెట్‌వర్క్ సైట్లలో సైతం ఆ ప్రసంగం లైవ్ వస్తుండడంతో నెటిజన్లు సైతం ఆసక్తిగా శారదమ్మ ప్రసంగాన్ని వింటున్నారు.. ''ఇంతటితో నా ఈ ప్రసంగాన్ని ముగిస్తున్నాను..'' అంటూ రెండు చేతులెత్తి అందరికీ అభివాదం చేసింది శారదమ్మ..

అప్పటికి గానీ హాలులోని ప్రేక్షకులు ఈ లోకంలోకి రాలేకపోయారు. అప్పుడే సమయం గంటన్నర గడిచిపోయిందా అన్న ఆశ్చర్యం ప్రతీ ఒక్కరిలోనూ కనిపించింది.. ఆ షాక్ నుండి తేరుకున్న మరుక్షణం హాలంతా చప్పట్లతో మారు మ్రోగిపోయింది.. మరొక్కమారు అందరూ సీట్లలో నుండి లేచి మరీ కరతాళ ధ్వనులు చేసారు. చివరికి మేయర్ సైతం శారదమ్మ ప్రసంగానికి ముగ్ధుడై ప్రేక్షకుల మాదిరిగా లేచి నిలబడి మరీ చప్పట్లతో తన సంతోషాన్ని వ్యక్త పరిచాడు. రామారావు మరో కొత్త లోకంలో విహరిస్తున్న వాడిలా.. ఆ లోకంలో కేవలం ఆనందం తప్ప మరేదీ లేనంత సంతృప్తి పడ్డాడు. తన పెద్దమ్మ ప్రవచనం కనులారా వీక్షించడం ఒకెత్తయితే ఆ ప్రసంగానికి కోట్లాది మంది ముగ్ధులయి తన పెద్దమ్మకి జేజేలు పలుకుతుంటే.. ఆ దృశ్యం అతని జీవిత ఫలకంలో శాశ్వతంగా ముద్రించుకునిపోయింది..

కార్యక్రమం అనంతరం మేయర్ మళ్ళీ శారదమ్మని కలిసి ఆమెకి వంగి వంగి మరీ అభివాదం చేసారు.. ఆ ప్రసంగం తన జీవితంపై కూడా ప్రభావం చూపుతుందని చెప్పిన మేయర్ మాటలు  ఆ మరునాడు వచ్చిన దినపత్రికలలోనూ, పలు ఛానెళ్ల లోను  విశేష ప్రాధాన్యం సంతరించుకుంది.. అప్పటి వరకూ కేవలం తెలుగు వారికి  మాత్రమే పరిచయమైన శారదమ్మ, లాస్ ఏంజిల్స్ ప్రసంగం తర్వాత  యావత్ ప్రపంచం ఆమె వైపు చూసేటంత ఎత్తుకు ఎదిగింది..

అమెరికాలోని ప్రముఖ వార్తా పత్రికలో ఆమె గురించి పతాక శీర్షికలో వార్తలు వచ్చాయి.. ఆ ప్రసంగం సంచలనం అంత ఇంత కాదు.. లాస్ ఏంజిల్స్‌లో శారదమ్మ చేసిన ప్రసంగం ఇండియాలోనూ ప్రకంపనలు  సృష్టించింది. ఇండియాలోని జాతీయ పత్రికలు, వార్తా ఛానళ్ళు శారదమ్మ గురించి ప్రముఖంగా వార్తని అందించాయి..

ఆ ప్రభావంతో ఏకంగా భారత ప్రధానమంత్రి శారదమ్మ ప్రసంగం గురించి, అమెరికాలో ఆమె స్పష్టించిన ప్రభంజనం గురించి ప్రెస్ మీట్ పెట్టి మరీ అభినందించేలా చేసింది. ఆధ్యాత్మిక చింతనలో అలరారే ప్రతీ ఒక్కరికీ శారదమ్మ పేరు  నోటిలో నానిపోయింది. ఆమె గురించి ప్రముఖులు  సైతం ఆరాతీసేంతగా  ఎదిగిపోయింది. అంతకు ముందు జరిగిన ప్రసంగం తర్వాత  ఆమె గురించి విమర్శించిన విమర్శకులు  నోళ్ళు మూసుకుపోయేంతగా శారదమ్మ ప్రసంగం ఎదిగిపోయింది. దాంతో ఈసారి శారదమ్మని ఎలా విమర్శించాలా అని తలలు  బద్దలు  కొట్టుకుని,

ఈ సమయంలో ఆమె గురించి ఒక మాట కూడా తప్పుగా మాట్లాడాలన్నా కోట్లాది మంది ప్రజలు ముందు తలదించుకునే పరిస్థితి వస్తుందని వారికి అర్థమయిపోయింది. ఫేస్ బుక్, ట్విట్టర్, యూ ట్యూబ్ లాంటి సోషల్ నెట్‌వర్క్ సైట్లలో ఆమె ప్రసంగం తాలూకు వీడియోలకు మిలియన్ల సంఖ్యలో లైకులు  వచ్చాయి..  అదొ సంచలనం, అదొక అద్భుతం, అది వర్ణనాతీతం.. శారదమ్మ అంటే ఇప్పుడు మనిషి కాదు, ఒక శక్తి, మానవాళి జీవనసరళిని

మంచి మార్గంలోకి నడిపించడానికి వచ్చిన దేవదూత అంటూ పత్రికలు ఆమెని ఆకాశానికెత్తేసాయి. శారదమ్మని కలవడానికి, ఆమెతో మాట్లాడటానికి లక్షల సంఖ్యలో జనాలు ఎదురు చూసేటంతగా ఎదిగిపోయింది. కనీసం ఆమెతో ఫోన్‌లో నయినా మాట్లాడాలని ఉవ్విళ్ళూరే వారు కూడా లక్షల సంఖ్యలో ఎదురు చూస్తూండి పోయారు.. శారదమ్మ ప్రసంగాన్ని ఆర్గనైజ్ చేసింది ఆనంద స్వరూప్ అని తెలిసిన వారందరూ ఆయనతో మాట్లాడడానికి,

ఆయన ద్వారా శారదమ్మని కలవడానికి క్యూ కట్టేసారు. ఇంత రెస్పాన్స్‌ని ఆనంద స్వరూప్ ఊహించలేదు.. ఆయన ఫోన్ తీరిక లేకుండా మ్రోగుతూనే ఉంది.. అమెరికాలో ఉన్న తెలుగు సంఘాలన్నీ శారదమ్మని తమ ప్రత్యేక కార్యక్రమాలలో పాలుపంచుకోవాలని విన్నపాలు చేయడం మొదలు పెట్టారు.. ఇంత జరిగిన.. ఈ ప్రపంచంతో తనకి సంబంధం లేదన్నట్టు.. కేవలం ఆ సాయినాధుడి ఆదేశాన్ని మాత్రమే తాను శిరసావహిస్తున్నట్టు.. తన గదిలో నిశ్శబ్దంగా సాయిపారాయణం చేస్తూ ఉండిపోయింది శారదమ్మ..

ఇంత నిరాడంబరత మనుషులకి సాధ్యం కాదు.. అది కేవలం మహనీయులకి మాత్రమే సాధ్యమవుతుంది.. శారదమ్మ మహనీయురాలు అని అనడంలోనూ ఎలాంటి సందేహం లేదు.

…………………………………

శారదమ్మ ప్రసంగం ప్రభావం రెండు రోజులుగా కొనసాగింది.. ఆ రెండు రోజులు ఏ వార్తా ఛానల్ చూసినా ఏదో ఒక సమయంలో ఆమె గురించిన వార్తలే..

ఆ ప్రభావం కాస్త సద్దుమణిగాక రామారావు ఆనంద స్వరూప్‌కి ఫోన్ చేసాడు.

‘‘ఇంక నేను ఆగలేకపోతున్నాను.. మా పెద్దమ్మని కలవాలని మనసు ఉరకలు వేస్తుంది.. మా ఈ సమస్యకి పరిష్కారం చూపే బాధ్యత మీదే నండీ..’’ రామారావు గొంతు దీనంగా పలకడంతో ఎంతో జాలి కలిగింది ఆనంద స్వరూప్‌కి. దిగులు పడకండి రామారావు

గారు.. నేను కూడా ఈ సమస్యని ఎలా పరిష్కరించాలా అని విపరీతంగా ఆలోచిస్తున్నాను.. మరి కొద్ది రోజులు ఓపిక పట్టండి .. వచ్చే శనివారం డెట్రాయెట్‌లో మీ పెద్దమ్మగారి ప్రసంగం ఉంది.. ఆ ప్రసంగం అయిపోయిందంటే ఆవిడ కొద్దిగా తేలికపడుతుంది.. ప్రసంగం షెడ్యూల్ మధ్యలో ఇలా ఫ్యామిలీ గొడవలోకి లాగి ఆవిడ కాన్సన్‌ట్రేషన్‌ని డిస్టర్బ్ చేయడం ఇష్టం లేకనే నేను ఈ సమస్య గురించి కొద్దిగా వాయిదా వేసాను కానీ మరొకటి కాదు.. మీరు నిర్భయంగా ఉండండి .. మీ

నాన్నగారిలో మార్పు వచ్చేలా చేయడం ముందు మన ముందున్న సమస్య.. ఆ సమస్యకి పరిష్కారమార్గం లభించిందంటే ఇంక మనకి ఈ సమస్య నుండి బయట పడటం ఏమాత్రం కష్టం కాదు..'' తన మనసులో ఉన్న విషయాన్ని చెప్పేసాడు ఆనంద స్వరూప్..

రామారావు కి ఏం మాట్లాడాలో అర్థం కాలేదు.. 'సరే' అని మాత్రం అనగలిగాడు.

అయితే రామారావు తండ్రి కరుణేంద్రభూపతిలో క్రమంగా మార్పు రావడం స్పష్టంగా గమనించాడు రామారావు. తెలుగు దినపత్రికలో శారదమ్మ గురించి ప్రముఖంగా రావడం, ఆవిడని స్వయంగా ప్రధానమంత్రి ప్రశంసించడంతో శారదమ్మ గురించి కరుణేంద్రభూపతిలో కాస్త మార్పు రావడం కనిపిస్తుంది.. ఎంత లేదన్న శారదమ్మ తన కుటుంబ సభ్యురాలు అని మనసులో ఏ మూలో ఆయనకి ఉంది.. కానీ ఆయన ఆలోచనంతా.. ఆవిడ తమ కుటుంబ సభ్యురాలు అని లోకానికి చాటితే ఆ వెంటనే ఆస్తి మొత్తం ఆమెకి సమర్పించాలన్న ఈర్ష్యతోనే ఆవిడ తన కుటుంబ సభ్యురాలు అని ఒప్పుకోవడానికి అడ్డుపడుతుంది..

అయినప్పటికీ దినపత్రికలోనూ, తెలుగు చానెల్స్‌లోనూ ఆవిడ గురించి వస్తున్న ప్రత్యేక కార్యక్రమాలను ఆసక్తిగా గమనించడం రామారావు దృష్టిని దాటిపోలేదు. అంతేకాదు యూ ట్యూబ్‌లో శారదమ్మ చేసిన ప్రసంగాలని కూడా వింటున్నాడంటే, శారదమ్మపై ఆయనలో ఒక మంచి ఉద్దేశ్యం మొదలయిందని రామారావుకి అర్థమయింది.. ఆ పరిణామం రామారావుకి

ఎంతో ఆనందాన్ని కలిగించింది.. శారదమ్మని తమకి పరిచయం చేసిన ఆ సాయినాధుడి ఆలయానికి మరొక్కమారు వెళ్ళి రావాలన్న కోరిక రామారావు మదిలో మెదిలింది.. అంతే.. మరింకేమీ ఆలస్యం చేయకుండా అందరినీ మందిరానికి వెళ్ళడానికి సిద్ధం చేసేసాడు.

..............................

డెట్రాయెట్‌లో జరిగే ప్రవచనం కార్యక్రమానికి అన్నీ చకచకా జరిగిపోతున్నాయి.. అయితే ఆ పనులలో ఈసారి రామారావు సైతం పాలు పంచుకుంటున్నాడు.. ఆవిడ తనకి పెద్దమ్మ అవుతుందన్న నిజం తెలిసేందుకు ఆలస్యం జరిగిన ఫరవాలేదు.. కనీసం ఆవిడ చేసే ప్రసంగం తాలూకు కార్యక్రమాలన్ని ఏర్పాటు చేసే పనులోనైన తాను పాలుపంచుకునేలా చేయండని కోరడంతో ఆనంద స్వరూప్ మరోమాట లేకుండా 'సరే' అన్నాడు.

అంతేకాదు డెట్రాయెట్‌లో జరిగే కార్యక్రమాలన్ని తాను స్పాన్సర్ చేస్తానని కూడా రామారావు రిక్వెస్ట్ చేసాడు. దీనికి ఆనంద స్వరూప్ ససేమిరా అన్నాడు.. అయినప్పటికీ రామారావు పట్టు విడవక పోవడంతో దీనికి కూడా 'సరే' అనక తప్పలేదు. అందుకే మూడు రోజుల ముందే రామారావు డెట్రాయెట్ చేరుకున్నాడు. ఆ కార్యక్రమానికి సంబంధించిన ప్రతి పనిలోనూ పాలు పంచుకుంటున్నాడు. ఈ ప్రవచనానికి తన తండ్రిని కూడా తీసుకురావాలని ఎంతో కోరికగా ఉన్నప్పటికీ ఇప్పుడిప్పుడే శారదమ్మపై సదభిప్రాయానికి వస్తున్న తన తండ్రి, ఆమె గురించి తనకి తెలిసిందని తెలిస్తే సమస్య మళ్ళీ మొదటికి వచ్చిన వస్తుందని ఆ ఆలోచనని విరమించుకున్నాడు. రామారావు చేస్తున్న ప్రతి పనిలోనూ శారదమ్మ అంటే ఆయనకి ఎంత అభిమానమో గుర్తిస్తున్నాడు ఆనంద స్వరూప్. ఆ అభిమానానికి ముగ్ధుడైపోతున్నాడు. 'నీ బంధువు కూడా ఇక్కడే ఉన్నారని శారదమ్మకి చెప్పాలని ఆనంద స్వరూప్ కూడా ఎదురు చూస్తున్నాడు.. డెట్రాయిట్‌లో జరిగే కార్యక్రమం పూర్తయిన తర్వాత ఈ విషయం చెప్పాలని మిన్నకుండిపోయాడు. అమెరికాలో రాజకీయంగా పేరు సంపాదించుకున్న పలువురు ఎన్నారై లు శారదమ్మ ప్రసంగం గురించి

ప్రత్యేకంగా ఆరాతీసారు. ఆ కార్యక్రమానికి ఆహ్వానిస్తూ, తాము సైతం వస్తామన్న సంకేతాలు పంపారు. దాంతో ఆనంద స్వరూప్ ఆనందానికి అవధుల్లేకుండా పోయింది.. వైట్ హౌస్‌లో ప్రముఖ స్థానాల్లో ఉండే ఇండియన్స్ సైతం ఈ కార్యక్రమంపై ఆసక్తి కనబరుస్తున్నారని పలు వార్తా పత్రికలూ ప్రచురించాయి .. కొందరు బహిరంగంగానే వీలయితే ఈ కార్యక్రమానికి తాము హాజరు అవుతామని ప్రకటనలు కూడా చేసారు. దాంతో మూడు రోజుల ముందు నుండే డెట్రాయెట్‌లో జరిగే ప్రవచనం తాలుకు ప్రకంపనలు ప్రారంభమయ్యాయి..

ఆనంద స్వరూప్ సైతం మరొక పని పెట్టుకోకుండా ఈ కార్యక్రమం కోసం ప్రత్యేకమైన ప్రణాళికలు రూపొందిస్తున్నాడు. రామారావు ఏర్పాట్ల గురించిన పనులు పర్యవేక్షిస్తుంటే, ఆనంద స్వరూప్ అతిథులకి ఆహ్వానాలు పంపే పనిలో బిజీగా ఉన్నాడు. ఈ కార్యక్రమం కోసం దాదాపు వందమంది సభ్యులు పనిచేయడంలో నిమగ్నమయిపోయారంటే ఈ కార్యక్రమాన్ని ఏ స్థాయిలో నిర్వహించాలని ఆనంద స్వరూప్ భావిస్తున్నాడో అర్థమయిపోతుంది.

ప్రవచనం తాలూకు కార్యక్రమానికి రావాలని ఆకాంక్షించే ప్రముఖులందరినీ ఆహ్వానించాలని ఆనంద స్వరూప్ నిర్ణయించుకున్నారు. అంతేకాకుండా ఈ కార్యక్రమం కోసం ఇండియా నుండి అమెరికాకి తమ తమ వ్యక్తిగత పనులపై వచ్చిన కొంతమంది తెలుగు ప్రముఖులు సైతం తాము వస్తున్నామన్నట్లు సందేశాలు పంపడంతో ఈ కార్యక్రమ నిర్వహణ కోసం తీవ్రంగా కృషి చేస్తున్నాడు ఆనంద స్వరూప్. అమెరికాలో సినిమా షూటింగ్ కోసం వచ్చిన కొంత మంది సినీ ప్రముఖులు సైతం ఈ కార్యక్రమానికి రావడానికి ఉత్సాహం కనబరుస్తున్నారు.

వారందరినీ ఆహ్వానించడానికి సిద్దపడిపోయాడు ఆనంద స్వరూప్. అయితే ఈ విషయాలేవీ శారదమ్మకి తెలియవు. ఆమె కళ్ళముందున్నది ఒక్కటే.. తాను చేసే చివరి ప్రసంగంలో ఏ

అంశాని ఉద్భోధించాలన్నది మాత్రమే. ఒకవైపు పనులు చురుకుగా జరుగుతున్నాయి.. ఏ రోజు పనులు ఆ రోజు మీడియాలో వస్తుండడంతో అందరికీ ప్రసంగం జరిగే హాలులో తమ సీటుని రిజర్వు చేసుకోవడానికి ఇప్పటి నుండే ప్రయత్నాలు ప్రారంభించారు. ఈ సారి జరిగే కార్యక్రమానికి వేల సంఖ్యలో ప్రేక్షకులు వస్తారని ఆ స్పందనని చూస్తుంటేనే ఆనంద స్వరూప్‌కి అర్థమయిపోయింది.. అందుకే ఆ స్థాయిలో సామర్థ్యం ఉండే సెంట్రల్ హాల్‌నే బుక్ చేయాలని నిర్ణయించుకున్నాడు. డెట్రాయెట్‌లోనే అత్యంత పెద్దదయిన హాల్‌ని ఈ ప్రసంగం కోసం బుక్ చేసాడు. తీరిక లేకుండా ఇన్ని పనులు చేస్తున్నప్పటికీ శారదమ్మ కుటుంబ వ్యవహారాన్ని ఏ విధంగా చక్కబెట్టాలా అన్న ఆలోచనని కూడా చేయకుండా ఉండలేదు ఆనంద స్వరూప్.

............................

శారదమ్మ ప్రవచనానికి మరొక రోజు మాత్రమే ఉంది..

గత రెండు రోజులుగా తన కుమారుడు రామారావు తీరిక లేకుండా బిజీగా ఉండడం గమనించిన కరుణేంద్రభూపతి ఆశ్చర్యపోయాడు. అతను అమెరికాకి వచ్చినప్పటి నుండి ఈ మూడు రోజులు మాత్రమే రామారావు ఇంత బిజీగా ఉండడం గమనించాడు. ఇంటికి వచ్చినా ఫోన్‌లో మాట్లాడుతుండడం, ఎదుటి వారికి ఏవో సూచనలు చేస్తుండడం చేస్తున్నాడు.

పిల్లలతోనే కాదు, తమతోనూ గడిపేందుకు సమయాన్ని కూడా కేటాయించడం లేదు. సరిగ్గా ఇంటికి రావడం కూడా లేదు. ఇరవై నాలుగు గంటలు బిజీగా గడుపుతున్నాడు. అసలేం చేస్తున్నాడు..? అని అడగాలనుకున్నాడు కానీ ఏదో పనిలో తలమునకలై ఉన్న అతనని తన ప్రశ్నలతో విసిగించడం ఎందుకులే అని ఊరుకుండి పోయాడు.

మరోవైపు శారదమ్మకి సంబంధించిన వార్తలు తెలుగు పేపర్లలో సైతం ప్రముఖంగా రావడం చూసి వాటిని ఎంతో ఆసక్తిగా చదువుతున్నాడు కరుణేంద్రభూపతి. ఆమెకి ఇస్తున్న

ప్రాముఖ్యానికి ఓ వైపు బాధగా ఉన్నప్పటికీ.. తన ఇంటి ఆడపడుచు ఇంత పెద్ద స్థాయిలో ఉండడం చూసి ఏమూలో కాస్త గర్వంగా కూడా ఉంది అతనికి. ప్రతి రోజూ వచ్చే పేపర్లే కాదు, టివిలో సైతం ఆమె గురించిన వార్తలు వస్తున్నాయి. ఆమె చేసే ప్రసంగ కార్యక్రమానికి అమెరికానే కాదు యావత్ ప్రపంచం ఎదురు చూస్తుంది అని చదువుతున్నప్పుడు కరుణేంద్రభూపతికి గతం గుర్తుకు వచ్చింది. ఆస్తిని కాపాడుకోవడం కోసం ఆమెని చంపే ప్రయత్నం చేయించడం గుర్తుకు వచ్చింది. అనామకంగా వచ్చే ఆస్తిని కాపాడుకోవడం కోసం తాను ఆమెని అంతమొందించాలని చూసాడు. ఆమె చనిపోయిందని భావించి ఇక ఆమె గురించి ఆలోచించడం కూడా మానేసాడు. కానీ ఇన్ని సంవత్సరాల తర్వాత తిరిగి ఆమెని చూసాడు.. అదీ అమెరికాలో.. అదీ ఒక ప్రముఖ ఆధ్యాత్మికురాలిగా..

ఇన్ని రోజులుగా శారదమ్మ బ్రతికే ఉన్నప్పటికీ ఆమె ఒక్కసారి కూడా తనకి సంబంధించిన వంద కోట్ల రూపాయల ఆస్తి గురించి ఆలోచించలేదా..? శారదమ్మ బ్రతికేవుంది..

కాబట్టి తన ఆస్తి తాను దక్కించుకోవడం కోసం ఆమె నేరుగా కోర్టుకు వెళ్లి ఉండవచ్చు. తాను ఇన్ని కుయుక్తులు పన్నిన విషయం కోర్టు వరకు వెళితే ఆ ఆస్తి ఖచ్చితంగా ఆమెనే వరించేది.. ఎందుకంటే ఆ ఆస్తికి నిజమైన వారసురాలు శారదమ్మే కాబట్టి..

కానీ ఆ ప్రయత్నం శారదమ్మ ఎందుకు చేయలేదు..? వంద కోట్ల రూపాయల ఆస్తిని తృణప్రాయంగా వదిలేసుకుందా..?

లేదంటే తనకి భయపడి ఆ ఆస్తి జోలికి రాలేకపోయిందా..?

తనకే భయపడేదే అయితే సాయిబాబా టెంపుల్‌లో తనని చూడగానే ఆమెలో ఏమాత్రమయిన కంగారు కనిపించేది..? కనీసం తనని గమనించి కూడా నిర్లక్ష్యంగా చూపు మరల్చుకుంది కదా.. పైగా శారదమ్మ ధైర్యం గురించి తన ఊరివారందరూ ఎంతో గొప్పగా చెప్పుకుంటారు. ఆ విషయం తనకు కూడా తెలుసు.. కానీ వినీ వినకుండా వదిలేసేవాడిని..

అలా అయితే శారదమ్మకి తానంటే భయం లేదు.. ఇది నిజం..!

మరి ఆస్తి జోలికి ఎందుకు రాలేదు..!

కట్టు బట్టలతో ఇంట్లోనుండి గెంటివేయబడ్డ శారదమ్మకి ఆస్తిపై విరక్తి కలిగిందా..? వంద కోట్ల రూపాయల ఆస్తిపై ఎవరికైన్న విరక్తి కుగుతుందా..?

ప్రస్తుతం శారదమ్మని చూస్తే అదే నిజమనిపిస్తుంది..! ఆస్తి, ఆంతస్తు వదిలేసి దైవ చింతనలో గడిపేందుకు సిద్దపడిపోయింది శారదమ్మ.. అంటే.. శారదమ్మ నుండి తన ఆస్తికి వచ్చే ఆపద ఏమీ లేదు..! అవును.. ఏమీ లేదు..! పైగా ఇప్పుడు శారదమ్మకి వచ్చిన పేరు ప్రఖ్యాతులు ముందు వందల కోట్ల ఆస్తి ఒక లెక్కనా..? అవును..!

శారదమ్మ... తన వదిన.. తన పెదనాన్న కొడుకు భార్య.. ఇప్పుడు ప్రపంచం ఆమెని ఆరాధిస్తోంది .. నా ఇంటి ఆడపడుచుని ప్రపంచమే అక్కున చేర్చుకున్న తర్వాత నేనెందుకు ద్వేషించుకోవాలి ..! ఆలోచనతో కరుణేంద్రభూపతి మెదడు మొద్దుబారిపోయింది..

అసలు శారదమ్మని నేనెందుకు చూసాను..? శారదమ్మని నాకు కనిపించేలా ఎందుకు చేసావు తండ్రీ..? ఆలోచిస్తున్న వాడల్లా ఠక్కున ఆగిపోయాడు...

తాను శారదమ్మని చూసింది తానెంతగానో ఆరాధించే ఆ సాయినాధుడి మందిరంలో.. సాయినాధుడి ప్రమేయం లేకుండానే నేను శారదమ్మని చూసినా ?

లేదు..! ఖచ్చితంగా ఇది సాయినాధుడి లీలనే.. సాయినాధుని అనుగ్రహమే శారదమ్మ తనకి కనిపించడం.. వృద్ధాప్యంలో ఉన్న తనకి కోట్ల ఆస్తి ఇంకా అవసరమా..?

తాను చనిపోయిన తర్వాత తన కుమారుడిని చూసుకునేందుకు ఎవరున్నారు..?

అమెరికాలో ఉన్న కుమారుడికి ఆ ఆస్తి గురించి ఏమాత్రం మక్కువ లేదు..

అంటే తన మరణానంతరం ఆ ఆస్తి మొత్తం పరులపాలు కావలసిందే కదా..!

అలా కాకుండా ఉండేందుకే ఆ సాయినాధుడు శారదమ్మ నాకు కనిపించేలా చేసాడు..

అవును.. ఆ సాయినాధుడి లీల అద్భుతం.. శారదమ్మ కనిపించడం అంటే అది తనకు ప్రమాదం కాదు, తన ఆస్తికి ఆటంకం కాదు, ఆమె తనకి కనిపించింది అంటే అది తనకి

శుభసూచకమే అవుతుంది.. ప్రపంచం ఆరాధిస్తున్న శారదమ్మ తన వదిన అని ఆ ప్రపంచానికి తెలిస్తే, ఆమెకే కాదు, తనకి, తన కుటుంబానికి కూడా గౌరవం పెరుగుతుంది.. తమ వంశానికి శారదమ్మ రూపంలో ఒక ఆణిముత్యం లభించింది.. ఇంక లాభం లేదు.. శారదమ్మని ద్వేషించటం కాదు, ఆమెని అభిమానించాలి.. తన వదిన.. తనకి తల్లి లాంటిది.. అలాంటి తల్లిని ఆరాధించాలి కానీ ద్వేషించకూడదు.. అంతే.. అప్పటి కప్పుడు కరుణేంద్రభూపతి ఒక నిర్ణయానికి వచ్చాడు.. ఇంట్లో కుమారుడు లేడు..

ఏమాత్రం ఆలస్యం చేయకుండా రామారావుకి ఫోన్ చేసాడు.. ఆ క్షణంలో తండ్రి నుండి ఫోన్ రావడంతో రామారావు ఆశ్చర్యపోయాడు.. ఇంటి దగ్గరే ఉన్న తండ్రికి ఏదైనా అవసరం వస్తే తన భార్యకి చెబుతాడు.. మరీ అర్జెంటయితేనే తన భార్య తనకి కాల్ చేస్తుంది.. అలాంటిది తండ్రి నుండి ఫోన్ రావడంతో కాస్త కంగారుగానే ఫోన్ లిఫ్ట్ చేసాడు..

''హలో.. నాన్న గారు చెప్పండి ..'' అన్నాడు..

''హలో.. కన్న.. ఎక్కడున్నావు.. ఫోన్ చేసి నేను నిన్ను ఏమయిన ఇబ్బంది పెట్టాన..'' సౌమ్యంగా అన్నాడు కరుణేంద్రభూపతి.. రామారావుకి ఏమీ అర్థం కాలేదు.. ఆయన మాటల్లోనూ ఏదో తేడా స్పష్టంగా కనిపెట్టాడు.. ''అలాంటిదేమీ లేదు నాన్న గారూ.. ఏమిటో చెప్పండి .. ఒంట్లో బావోలేదా..'' ''అబ్బే.. అలాంటిది ఏమీ లేదు నాన్న .. నువ్వు నాకొక సహాయం చేయాలి నాన్న..'' ''నాకు సహాయం చేయండని అడగడం ఏమిటి నాన్న.. అసలేం కావాలో చెప్పండి .. చిటికెలో చేసేస్తాను..'' ''అంటే.. నాన్న.. రేపు డెట్రాయిట్ వెళ్దామనుకుంటున్నాను.. ఏర్పాటు చేస్తావా..'' పక్కనే బాంబు పడ్డట్టు ఉలిక్కిపడ్డాడు రామారావు .. ''డెట్రాయెట్‌కా.. ఎందుకు నాన్న..'' ఆశ్చర్యంగా అన్నాడు.. ''అంటే.. అక్కడ ఒక తెలుగు కార్యక్రమం ఏదో జరుగుతుంది కదా.. అదే.. ఆధ్యాత్మిక ప్రసంగం ఏదో జరుగుతుందని పేపర్ లో చూసాను.. అక్కడికి వెళ్దామనుకుంటున్నాను..'' ఆ మాటలకి

రామారావు ముందున్న భూమి గిర్రున తిరిగినట్లయింది.. తూలి పడబోయి తమాయించుకున్నాడు..

అదేమిటీ..? ఆ తెలుగు కార్యక్రమం శారదమ్మదని తెలిసే మాట్లాడుతున్నాడా..? లేక మామూలుగా తెలుగు కార్యక్రమం కావడంతో చూడాలనుకుంటున్నాడా.. ఒకవేళ అలా అనుకుంటే శారదమ్మని చూసిన మరుక్షణమే ఆయన అగ్గిమీద గుగ్గిలం అవ్వడం ఖాయం.. అంతేకాదు.. దురదృష్టం కొద్దీ ఆ ప్రోగ్రానికి నేనే స్పాన్సర్ అని తెలిస్తే ఇంకేమయినా ఉందా..! అసలేం మాట్లాడాలో అర్థం కాలేదు రామారావుకి.. ''ఏమిటి కన్నా ఆలోచిస్తున్నావు.. అక్కడకి వెళ్లడం కుదరదా..? కుదరక పోతే వద్దులే..!''

''ఛ..ఛ.. అలాంటిదేమీ లేదు నాన్న... ఆ ప్రోగ్రాం టిక్కెట్లు అప్పుడే అయిపోయాయని మా ఫ్రెండెవరో చెప్పారు.. అందుకోసం ఆలోచిస్తున్నాను..'' ఏం మాట్లాడాలో అర్థం కాక నోటికి వచ్చింది చెప్పేసాడు.. ''అది కాదు నాన్న.. ఆ ప్రోగ్రాంలో ప్రసంగిస్తున్నది ఎవరో కాదు.. అదే శారదమ్మ అని పేరు వినేవుంటావు.. ఆ శారదమ్మ ఎవరో కాదు.. ఆవిడది మన ఊరే.. చాలా రోజుల తర్వాత ఆవిడ కనిపించింది.. అందుకే వీలయితే ఒకసారి పలకరిద్దామని.. అంతేకాదు.. ఈ ఫోనులో ఎందుకు గానీ.. ఆవిడ గురించి మరొక రహస్యాన్ని కూడా నీకు చెప్పాలి..'' రామారావు ఈసారి నిజంగానే తూలి కింద పడిపోయాడు.. బలవంతంగా పక్కనున్న కుర్చీని ఆసరా చేసుకుని లేచి నిలబడ్డాడు.. ఇది కలో నిజమో అర్థం కావడం లేదు..ఎంతలో ఎంత మార్పు.. తన తండ్రి శారదమ్మతో మాట్లాడాలనుకుంటున్నాడు.. అంటే ఆయనలో మార్పు వచ్చింది.. ఎస్.. మార్పు వచ్చింది.. ''యాహూ...'' గట్టిగా అరవాలనుకున్నాడు.. కానీ ఫోన్ లైన్లో తన తండ్రి ఉండడంతో తమాయించుకున్నాడు..

''అరె.. నిజమా నాన్న.. మన ఊరు ఆవిడనా .. అలా అయితే మీరొక్కరే రావడం ఎందుకు నాన్న ఫ్యామిలీ అంత వెళదాం.. నేను అన్ని ఏర్పాట్లు చేస్తాను.. అమ్మకి, మీ కోడలికి కూడా ఈ విషయం చెప్పి రెడీ కమ్మని చెప్పండి నాన్న..''

ఆనందంతో రామారావు  నోటి మాటలు  తడబడుతున్నాయి.. ''చాలా సంతోషం కన్నా.. మరి ఉంటాను..'' తండ్రి  ఫోన్ కట్ చేసిన శబ్దం వినగానే ఈసారి నిజంగా గట్టిగా 'యాహూ' అని పైకే అరిచేసాడు.. ఆయన అరుపుకి చుట్టు పక్కల వారు ఆశ్చర్యంగా చూసిన కూడా ఏమాత్రం పట్టించుకోకుండా నాలుగు పిచ్చిగంతులు  వేసి ఆ వెంటనే ఫోన్‌ని ఆనంద స్వరూప్‌కి డయల్ చేసాడు.. ''హలో..'' అవతలి నుండి  ఆనంద స్వరూప్ గొంతు వినగానే.. ''ఆనంద స్వరూప్ గారూ.. నమ్మలేని నిజం ఒకటి మీకు చెప్పాలని ఫోన్ చేసానండీ..'' సంతోషం పట్టలేకపోతున్నాడు రామారావు.. ''అంత నమ్మలేని నిజం ఏమిటండీ..'' ఆశ్చర్యంగా అడిగాడు ఆనంద స్వరూప్.. ''మా నాన్న గారు నాకు ఫోన్ చేసారండీ.. ఆయన శారదమ్మని కలవాలనుకుంటున్నాడు.. అంతేకాదు.. శారదమ్మ గురించి ఓ రహస్యం కూడా చెప్పాలని నాతో అన్నాడు.. అంటే.. ఆయనలో మార్పు వచ్చింది.. శారదమ్మని కలుసుకోవాలని అనుకున్నాడంటే.. ఆస్తి గురించి ఆలోచించడం మానేసాడనే కదా..'' ''నిజమా.. ఓ మై గాడ్.. ఇది నిజంగా ఆ సాయినాధుడి లీలనే రామారావు గారూ.. నేను కూడా నమ్మలేకపోతున్నాను .. ప్రోగ్రాం పూర్తయ్యాక మీ ఫ్యామిలీని ఎలా ఒక్కటిగా చేయాలా అని నేను జుట్టు పీక్కుంటుంటే..

ఆ జుట్టుకి కొబ్బరి నూనెతో మాలీష్ చేసినంత చల్లటి కబురు చెప్పారు..'' ఆనందంగా అన్నాడు ఆనంద స్వరూప్. ''ఈ ఆనందాన్ని మీతో షేర్  చేసుకోవాలనుకున్నాను అందుకే వెంటనే మీకు కాల్ చేసాను..'' ''చాలా  సంతోషం.. అయితే మీక్కూడా నేనొక నమ్మలేని నిజం చెప్పబోతున్నాను..'' నవ్వుతూ అన్నాడు ఆనంద స్వరూప్.. ''ఏమిటండీ అది..?'' ఎగ్జయిట్‌మెంట్‌గా అన్నాడు రామారావు.. ''మీ నాన్నగారి భయంతోనే ఇంతవరకూ మీకు శారదమ్మని పరిచయం చేయకుండా ఉండిపోయాను.. ఇంక ఆ అడ్డంకి తొలిగిపోయింది.. ఇంక ఆలస్యం ఎందుకు..? ఈరోజే మీ పెద్దమ్మ గారికి మిమ్మల్ని పరిచయం చేస్తాను.. అదే శారదమ్మ గారికి..''

''థ్యాంక్యూ.. థ్యాంక్యూ వెరీమచ్ ఆనంద్ స్వరూప్ గారూ.. ఈ సంతోషంతో నాకు మాటలు కూడా రావడం లేదు..'' రామారావు గొంతు సన్నగా వణుకుతుంది..

''సరే.. ముందు మీరు ఈ ఆనందాన్ని పూర్తిగా ఆస్వాదించండి .. మరో గంటలో నేను మిమ్మల్ని కలుస్తాను..'' అంటూ ఫోన్ పెట్టేసాడు ఆనంద స్వరూప్.. రామారావు కళ్ళల్లో నుండి కన్నీళ్ళు రాలుతున్నాయి.. కన్నీళ్ళు ఆపుకోవాలన్న స్పృహకూడా లేకుండా ఆ ఆనంద సమయాన్ని ఆస్వాదిస్తున్నాడు రామారావు.

...........................

సరిగ్గా గంటన్నర తర్వాత ఆనంద స్వరూప్, రామారావు ఇద్దరూ శారదమ్మ గదిలో ఉన్నారు..

సోఫాలో కూర్చుని ఉంది శారదమ్మ.. ఆమెకి ఎదురుగా నిలబడి ఉన్నారు ఇద్దరూ..

''ఆనంద స్వరూప్ గారూ చాలా కష్టపడుతున్నారని విన్నాను.. ఇదే చివరి ప్రవచనం కదా.. ఆ తర్వాత మీకింకేమీ ఇబ్బంది ఉండదు లెండి ..'' నవ్వుతూ అంది శారదమ్మ. ''ఛ..ఛ.. అవేం మాటలండీ.. ఇలా కష్టపడటం నా అదృష్టంగా భావిస్తున్నాను.. మీకు ఓపిక ఉండాలే కానీ ఇలాంటి కార్యక్రమాలు ప్రతీ వారం ఏర్పాటు చేస్తాను..'' నవ్వుతూ అన్నాడు ఆనంద స్వరూప్.. ఆ మాటకి చిన్నగా నవ్వి.. ఆనంద స్వరూప్ ప్రక్కనే నిలబడి ఉన్న రామారావుని చూసింది శారదమ్మ.. రామారావు శారదమ్మనే చూస్తున్నాడు.. అతని కళ్ళు చెమ్మగిల్లి ఉన్నాయి..

శరీరం సన్నగా వణుకుతున్నట్టు ఉంది.. శారదమ్మని చూసానన్న ఆనందం అతనిలో, త్వరలో తాను ఆమె కుమారుడిని అన్న నిజం తెలియబోతుందన్న భావనలో ఉన్నాడు.

''ఎవరీ అబ్బాయి..?'' అడిగింది శారదమ్మ.. ఆనంద స్వరూప్ రామారావు వంక చూసాడు.. అతనున్న పరిస్థితిని అర్థం చేసుకుని తనలో తానే నవ్వుకున్నాడు.. ''శారదమ్మ గారూ.. అమెరికా నుండి మీరు ఇండియాకి వెళ్ళేలోగా మీకొక బహుమతిని ఇవ్వాలని

సంకల్పించాను.. ఆ సంకల్పానికి రూపమే ఈ రామారావు ..'' నవ్వుతూ అన్నాడు ఆనంద స్వరూప్.. అతని మాటలు ఏమీ అర్థం కానట్టుగా ముఖం పెట్టింది శారదమ్మ..

''మీరు ఇండియా నుండి అమెరికా వచ్చాక.. నేను ఇండియాలో నాకు తెలిసిన వారి ద్వారా మీ గురించి ఎంక్వైరీ చేయించాను.. మీరు ఇండియాకి వెళ్ళాక ఒంటరిగా ఉండకూడదని, మీ కుటుంబ సభ్యులతో కలిసి ఉండాలని, కానీ నా ఫలితం ఫలించలేదు.. మీ గురించి ఆరా తీయించాను మీ ఫ్యామిలీ వివారాలని తెలుసుకోలేకపోయాను.. అందుకే ఆ సాయినాధుడు ఈ రామారావు రూపంలో ఆ లోటుని పూడ్చేసాడు..'' అని ఆనంద స్వరూప్ శారదమ్మ వంక చూసాడు.. ఆవిడకి ఇంకా ఏమీ అర్థం కానట్టుగా చూస్తోంది.. రామారావు, ఆనంద స్వరూప్‌ని ఇద్దరినీ మార్చి మార్చి చూసింది.. ఇంక వెయిట్ చేయించడం ఇష్టం లేని ఆనంద స్వరూప్ రామారావు ని చూస్తూ.. ''ఇతను ఎవరో కాదు.. మీ మరిది కరుణేంద్రభూపతి కుమారుడు.. పేరు రామారావు భూపతి.. మీగురించి తెలిసినప్పటి నుండి ఎప్పుడెప్పుడు మిమ్మల్ని చూడాలా అని ఎంతో ఆత్రపడుతున్నాడు..'' ఆనంద స్వరూప్ చెప్పిన మాటలకి శారదమ్మ కొద్దిగా ఆశ్చర్య పోయింది.. ఆ వెంటనే తేరుకుని రామారావు వంక చూసింది.. రామారావు ఇంక ఆగలేకపోయాడు.. శారదమ్మ ఎదురుగా వచ్చి కాళ్ళపై పడిపోయాడు.. అతనికి

దు:ఖం ఆగడం లేదు.. పరిసరాలని మరిచిపోయి గట్టిగా ఏడ్చేసాడు..

కాళ్ళపై పడ్డ రామారావుని ఆప్యాయంగా పైకి లేపింది శారదమ్మ.. ధారాళంగా కారుతున్న కన్నీళ్ళని తన చేతితో తుడిచింది.. రామారావు రెండు చేతులు జోడించి మ్రొక్కుతూ ''నన్ను క్షమించు పెద్దమ్మా.. నిన్ను మా నాన్న చాలా మోసం చేసాడు.. వందల కోట్ల ఆస్తి ఉన్నా ఓ అనాధలా జీవించడానికి కారణం మేమే.. మమ్మల్ని శిక్షించు పెద్దమ్మా.. శిక్షించు..'' గుండెల్లో నుండి తన్నుకుంటూ వస్తున్న కన్నీళ్ళని తుడుచుకుంటూ అన్నాడు రామారావు..

శారదమ్మ చిన్నగా నవ్వింది రామారావు మాటలకి..

''ఇందులో మీ నాన్నగారి తప్పిదం ఏముంది.. మా కుటుంబంలో అందరూ చనిపోయాక స్వయంగా ఆస్తి అంతా  ఆయనకే దక్కుతుంది కదా..'' ఆప్యాయంగా రామారావు  తల నిమురుతూ అంది శారదమ్మ.. ''అలా ఎలా జరగుతుంది పెద్దమ్మా.. ఆ ఇంటి వారసురాలిగా నువ్వున్నప్పుడు ఆస్తి మా నాన్నకెలా దక్కుతుంది.. మిమ్మల్ని అన్యాయం చేసాము పెద్దమ్మా..'' చిన్నపిల్లాడిలా ఏడుస్తూ అన్నాడు రామారావు.

రామారావుని తన ప్రక్కనే కూర్చొబెట్టుకుంది శారదమ్మ..

తల్లి ముందు గారాలు  పోతూ ఏడ్చే చిన్న పిల్లాడిలా అనిపిస్తున్నాడు రామారావు  ఆ క్షణంలో ఆనంద స్వరూప్‌కి.  ఎదురుగా సోఫాలో కూర్చుని ఆ వారిద్దరినీ గమనిస్తున్నాడు..

''దేవుడి  ఆజ్ఞ లేనిది ఏదీ జరగదు కదా.. ఎలా వ్రాసి  ఉంటే అలా జరుగుతుంది.. ఇన్ని సంవత్సరాల తర్వాత దేశం కాని దేశంలో నా అనుకునే వాళ్ళని చూస్తానని నేననుకున్నానా.. ఇదిగో ఇప్పుడు నువ్వు నన్ను వెతుక్కుంటూ వచ్చావు.. అంతా ఆ సాయినాధుడి  అనుగ్రహం తప్ప మరొకటి కాదు..'' ఆమె మాటలకి ఆనంద స్వరూప్, రామారావు ముగ్ధులైపోయారు. ఆస్తి గురించి, కోట్ల గురించి ఒక్కమాట కూడా ఆమె నోటి నుండి  రాలేదంటే ఆవిడ ఎంత ఉన్నతమైనదో అర్థమవుతుంది.. ''ఇంతకీ మీ నాన్నగారు, అమ్మగారు బావున్నారా..?'' ఆప్యాయంగా పలకరించింది శారదమ్మ.. ''చాలా బావున్నారు పెద్దమ్మా.. వారు కూడా ఇక్కడే ఉన్నారు..'' ఆనందంగా అన్నాడు రామారావు.. ''ఓ.. అనుకున్నాను.. మొన్న సాయిబాబా టెంపుల్‌లో మీ నాన్న గారు కనిపించారులే..'' నవ్వుతూ అంది శారదమ్మ.. ఆ మాటలకి ఇద్దరూ ఉలిక్కిపడ్డారు. కరుణేంద్రభూపతి కనిపించిడాన్న కూడా ఆ విషయం బయటికి చెప్పకుండా మౌనంగా ఉన్న ఆమె వ్యక్తిత్వాన్ని ఎలా అర్థం చేసుకోవాలో అర్థం కాలేదు ఆనంద స్వరూప్‌కి. ''ఓ చూసారా.. అక్కడే అమ్మ, నా భార్య పిల్లలు  కూడా ఉన్నారు వారిని కూడా చూసారా..?'' ఆనందంగా అన్నాడు రామారావు..

ఆ మాటలకి శారదమ్మ నవ్వింది.. ''చూడడమేమిటి..? నా మనవరాలికి ఆటోగ్రాఫ్ కూడా ఇచ్చానుకదా..'' ఆ మాటలకి ఇద్దరూ ఉలిక్కిపడ్డారు.. ''అంటే అక్కడున్న మా ఫ్యామిలే అని మీకు ముందే తెలుసన్నమాట..''తెల్లబోయి అడిగాడు రామారావు. ''అవును.. మీ నాన్న గారు నన్ను గమనించి బయటకు వెళ్ళినప్పుడే మీ అందరినీ చూసాను.. అప్పుడే అనుకున్నాను.. నువ్వాయన కుమారుడివని, వారు మీ పిల్లలని ..'' ముఖం లో చిరునవ్వు తప్ప మరో భావం కనిపించకుండా అంది శారదమ్మ..

''అంటే.. వారు .. వారు మీకు కావలసిన వారని తెలిసి కూడా కనీసం నా క్కూడా చెప్పకుండా దాచారెందుకు?'' ఆశ్చర్యంగా అడిగాడు ఆనంద స్వరూప్.. దానికి శారదమ్మ నుండి చిరునవ్వుతోనే సమాధానం చెప్పింది.. ''వారు కనిపించగానే నా మనసు నాకు చెప్పింది.. త్వరలోనే నేను నాకు కావలసిన వారిని కలుసుకుంటానని, అది కూడా మీ ద్వారేనే మేమంత కలుస్తామని, సాయినాధుడి మందిరంలో కూర్చున్నప్పుడు నా మనసులో ఈ భావం కదలాడిందంటే అది నిజమవుతుందని నా విశ్వాసం.. అందుకే మీకు చెప్పాలనిపించలేదు.. నేను చెప్పక పోయినా మమ్మల్ని కలిపారు కదా..'' నవ్వుతూ అంది శారదమ్మ..

ఆ మాటలకి ఆనంద స్వరూప్‌కి సైతం దిమ్మతిరిగిపోయినంత పనయ్యింది..

శారదమ్మ తమ పెద్దమ్మ అని తెలియగానే రామారావు కళ్ళల్లో కన్నీళ్ళు ఆగలేదు, పరిసరాలు గమనించకుండా ఏడ్చేసాడు.. వారి నాన్న ముఖం లో కోపం ప్రవేశించింది.. ఎదురుగా కొడుకున్నాడని చూడకుండా, అది మందిరం అని కూడా గమనించకుండా కోపంగా బయటకు వెళ్ళిపోయాడు..

కానీ.. శారదమ్మ.. ఆ విషయం తనకి ముందే తెలిసిన ఏమాత్రం బయటికి కనిపించకుండా మౌనంగా ఉండిపోయిందంటే.. బహుశా.. శారదమ్మ ప్రసంగాలకి కోట్ల మంది ఆకర్షితులవుతున్నారంటే ఆమెలో ఉన్న ఈ గొప్పతనం వల్లే కాబోలు .. అప్రయత్నంగా

ఆనంద స్వరూప్ రెండు చేతులతో శారదమ్మకి నమస్కరించాడు.. ''శారదమ్మ గారూ.. మీరు నాకు కలవడం, మిమ్మల్ని ఇలా అమెరికాకి తీసుకురావడం, మీరు చెప్పే అమృత వాక్యాలు ఇన్ని కోట్ల మందికి చేరేలా చేయడం.. నిజంగా ఇది నా అదృష్టం కాదు.. పూర్వ జన్మ సుకృతం.. ఏ జన్మలో ఏ పుణ్యం చేసానో.. ఈ జన్మలో మీకు సేవ చేసే భాగ్యం లభించింది..'' ఆనంద స్వరూప్ కళ్ళల్లో మొదటి సారి కన్నీళ్ళను చూసింది శారదమ్మ.. ''అంత ఆ సాయినాథుడి లీల తప్ప ఇందులో నేను చేసింది ఏమీ లేదు'' అని అంది శారదమ్మ..

''పెద్దమ్మా.. రేపు మీ ప్రవచనానికి మన కుటుంబం మొత్తం వస్తుంది.. అక్కడే అందరినీ పరిచయం చేస్తాను.. మీ మనవరాలికి నీవంటే ఎంత ఇష్టమో మాటల్లో చెప్పలేను..'' ఆనందంగా అన్నాడు రామారావు.. ''సరే, అలాగే..'' చిన్నగా నవ్వుతూ అంది శారదమ్మ.. ''ఇంక మేము బయలు దేరుతాము.. చాలా పనులు ఉన్నాయి..'' ఆనంద స్వరూప్ అనగానే రామారావు సోఫాలోనుండి లేచి మరొకసారి శారదమ్మ పాదాలకి నమస్కరించి ఆమె దగ్గర సెలవు తీసుకున్నాడు.. బయటికి వచ్చిన ఇద్దరూ చాలా సేపు మాట్లాడుకోలేకపోయారు.. స్వంత ఆత్మీయురాలయిన ఓ పెద్దమ్మ తనకి దొరికిందన్న ఆనందం మనసు నిండా రామారావుకి ఉంటే.. ఒక గొప్ప స్త్రీమూర్తికి సేవ చేసే భాగ్యం తనకి కలిగిందన్న ఆనందం ఆనంద స్వరూప్ మనసు నిండా పరుచుకుంది.. ఆ ఆనందం వల్ల ఇద్దరిలోనూ మాటలు కరువయిపోయాయి.

---------------------

డెట్రాయెట్..!

శారదమ్మ ప్రవచనం జరగడానికి ఇంకా మూడు గంటల సమయం ఉంది.. రామారావు శారదమ్మని కంటికి రెప్పలా చూసుకుంటున్నాడు. ఆమె విడిదికి వచ్చినది మొదలు ఆవిడకు సంబంధించి ఆహారాన్ని కూడా అతనే సమకూరుస్తున్నాడు.. రామారావు మనసు గర్వంగా

పొంగిపోతూంది. మొట్టమొదటి సారి నా అనుకునే వారికి సేవ  చేయడం ఆగర్వానికి కారణం..

జరిగిన విషయాన్ని శీలావతికి చెప్పాడు.. ఆవిడ కూడా ఎంతో ఆనందపడింది.. పిల్లలని, అత్త మామయ్యని తీసుకుని కార్యక్రమానికి బయలు దేరారు. ఆనంద స్వరూప్ వచ్చే ఆహూతులని ఆహ్వానించే హడావిడి లో ఉన్నాడు. ఈ కార్యక్రమానికి అమెరికా పర్యటనలో ఉన్న తెలంగాణ రాష్ట్రానికి చెందిన ఇద్దరు మంత్రులతో పాటు ఆంధ్ర రాష్ట్రానికి చెందిన మరికొందరు రాజకీయ నాయకులు  సైతం హాజరవుతున్నారు. అలాగే తెలుగు  సినీ రంగానికి చెందిన కొందరు ప్రముఖులు  సైతం హాజరవుతున్నారు. ఇక సెనేటర్‌తో పాటు అమెరికా ప్రభుత్వంలో కీలక శాఖలో కార్యకలాపాలు  నిర్వహిస్తున్నట్టి భారత సంతతికి చెందిన వారు కూడా విచ్చేస్తున్నారు.

ఇండియాలోని జాతీయ ఛానల్స్ తో పాటు, తెలుగు ఛానల్స్ అన్నీ లైవ్ ప్రసారం అందించడానికి రెడీ అయిపోయాయి. అలాగే అమెరికాలోని ఛానల్స్ కూడా కవరేజీ కోసం సిద్ధం చేసుకున్నాయి. ఒక చిన్న ఆధ్యాత్మిక కార్యక్రమంలాగా ఎక్కడో ఓ మందిరంలో మొదలయిన శారదమ్మ ప్రసంగం రాను, రాను ప్రపంచాన్ని శాసించేంతగా ఎదిగింది. ఆమె చేసే  ప్రసంగాల ద్వారా ఎంతో మంది జీవితాలలో వెలుగు నిండుతోందంటే అతిశయోక్తి కాదు. ఎంత ఎత్తుకు ఎదిగినా ఒదిగి ఉండాలన్నది శారదమ్మ జీవితంలో నేర్చుకున్న సత్యం.. అలా ఉంది కాబట్టే కష్టాలని ఎదుర్కోని, కన్నీళ్ళని దాటుకుని, సుఖాన్ని త్యజించి కోట్లాది మంది హృదయాలలో స్థానం సంపాదించుకుంది. మరో గంటలో కార్యక్రమం ప్రారంభమవుతుందనగా కరుణేంద్రభూపతి, శారదమ్మని కలుసుకున్నాడు. శారదమ్మని చూసిన ఆయన కళ్ళల్లోనూ కన్నీళ్ళు సుడులు  తిరిగాయి. కరుణేంద్రభూపతి భార్య ఆప్యాయంగా శారదమ్మని హత్తుకుంది, రామారావు  భార్య శీలావతి, పిల్లలు  ఇద్దరూ కాళ్ళకి నమస్కరించి ఆమె ఆశీస్సులు  అందుకున్నారు.

ఆ క్షణాలు  చూస్తున్న రామారావుకి ఎంతో ఆనందం కలిగింది. ప్రతీ ఒక్కరి హృదయాలలోనూ తాము కూడా శారదమ్మ కుటుంబం నుండి  వచ్చామన్న భావన వారిలో ప్రతిఫలిస్తుంది.

వారికి మాటలు రావడం లేదు.. కళ్ళతోనే మాట్లాడుకున్నారు.. కరుణేంద్రభూపతి మాత్రం మనస్ఫూర్తిగా.. ''నన్ను క్షమించండి  వదిన గారూ..'' అని అన్నాడు..

ఆ మాటలకి ఆయన వంక చూసి చిన్నగా నవ్వింది శారదమ్మ.. పిల్లలని ఆప్యాయంగా పలకరించింది. శీలవతితో ముచ్చటించింది.. కరుణేంద్రభూపతి భార్య యోగక్షేమాలు తెలుసుకుంది.. కార్యక్రమం సమయం అవుతోందని రామారావు గుర్తు చేయడంతో అందరూ కలిసి డెట్రాయిట్‌లోనే పేరు గాంచిన కల్చర్  సెంటర్ హాల్‌కి బయలు దేరారు. శారదమ్మ హాలు  దగ్గరికి చేరుకోగానే అక్కడే సిద్ధంగా ఉన్న ఆనంద స్వరూప్ ఎదురెళ్లి వారిని ఆప్యాయంగా ఆహ్వానించాడు. ఈసారి గత కార్యక్రమాలలో  ఎదురయినట్టుగా ప్రేక్షకులు గుమి కూడడం, సెల్ఫీ  దిగడం అన్న బెడద పోయింది.. కారణం ఆ కార్యక్రమానికి ఎంతో మంది ప్రముఖులు  వస్తుండడంతో పోలీసులు భద్రత కట్టుదిట్టం చేసారు. విఐపిలకి కేటాయించిన పార్కింగ్‌లో గానీ, వారు వచ్చే దారిలో గాని మామూలు జనాలని అనుమతించలేదు. దాంతో అందరూ హాలులోనికి నడిచారు. ఆమె రాకకోసం ఎదురు చూస్తున్న ఎందరో ప్రముఖులు  ఆమెని ఆప్యాయంగా పలకరించారు. ఇండియా నుండి వచ్చిన మినిస్టర్లు, సినిమా స్టార్లు, మిగతా  విఐపి లు  అందరితోనూ ముచ్చటించింది శారదమ్మ. ఆవిడ వారితో ముచ్చటిస్తున్న సందర్భంలో మా పెద్దమ్మగారు అంటూ వారికి చెప్పడం రామారావుకి ఒక కొత్త అనుభూతిగా తోచింది.

హాలు  మొత్తం ప్రేక్షకులతో నిండిపోయింది. హాలు లోనికి రాలేని వారు కూడా వందలాది మంది ఉండడంతో వారికి ఇబ్బంది కలగకుండా హాలు  బయట కూడా పెద్ద పెద్ద స్క్రీన్‌ని ఏర్పాటు చేసారు. రామారావు, ఆనంద స్వరూప్‌లు  వెంటరాగా  శారదమ్మ వేదికపైకి

వెళ్ళింది.. ఎదురుగా కనిపిస్తున్న వేలాది మంది ప్రేక్షకుల కరతాళ ధ్వనులని స్వీకరిస్తూ వారందరికీ అభివాదం చేసింది.
ఆమెకి కేటాయించిన ఆసనాన్ని అలంకరించింది. ఆమె చేతిలో ఉన్న సాయి పారాయణం గ్రంధాన్ని ముందు పెట్టుకుంది.. ఆ గ్రంధానికి భక్తితో నమస్కరిస్తూ ఒకసారి గొంతు సవరించుకుని.. ''ఇక్కడికి విచ్చేసిన మహానుభావులందరికీ నమస్కారములు..'' అంటూ ఆమె ప్రసంగం మొదలు పెట్టగానే హాలంతా కరతాళ ధ్వనులతో మారుమ్రోగిపోయింది.. ఆ శబ్దం సద్దుమణిగాక తిరిగి ప్రవచనం మొదలు పెట్టింది.

ఆమె మాట్లాడుతూంటే ఆధ్యాత్మిక ఘోష ప్రతీ ఒక్కరి చెవుల్లో మారు మ్రోగి పోతుందా అన్నట్లుగా సాగుతుంది ప్రవచనం. ఆమె మొదలు పెట్టిన క్షణాల్లోనే ఆ హాలు లోనే కాదు, బయట టీవీలోనూ, సోషల్ నెటవర్క్ ద్వారా లైవ్‌లో తిలకిస్తున్న నెటిజన్లు, పిల్లలు, పెద్దలు, వృద్ధులు అనే తేడాలేకుండా, మెదడులో మరో ఆలోచన రాకుండా ఆమె మాటలనే వింటూండి పోయారు. ఆమె చెబుతున్న ఒక్కో మాట సూటిగా వచ్చి హృదయానికి తాకుతోంది. తెలుగు వారే కాదు, మిగతా భాష వారు సైతం ఆమె ప్రసంగాన్ని వింటున్నారు. ఆయా ఛానల్స్ ఆమె ప్రసంగాన్ని ఆయా భాషలలో ట్రాన్స్‌లేట్ చేస్తున్నాయి.. సరిగ్గా గంటన్నర పాటు ఏకధాటిగా సాగిపోయిన ఆమె ప్రసంగం, కోట్లాది ప్రజలని మోక్షమార్గంలో నడిపించడానికి బాటలు వేసింది, భారతీయ సంస్కృతీ సంప్రదాయాలని తెలియచేసినది. భారతీయ ఋషులు అందించిన ఎన్నో పురాణాల గురించి ప్రస్తావించింది. మనిషి జీవితానికి వెలుగు రేఖని ప్రసాదించింది..
ప్రస్తావన ముగియగానే ప్రతీ ఒక్కరూ కరతాళ ధ్వనులతో శారదమ్మని అభినందించారు. కుర్చీలోనుండి అందరూ లేచి మరీ ఆమెని గౌరవించారు. కోట్లాది హృదయాలు శారదమ్మని అభినందనతో ముంచెత్తాయి. టీవీలో చూసిన వారు సైతం శారదమ్మ ప్రవచనానినికి

ముగ్ధులైపోయారు. అమెరికాలో తాను చేసిన ఈ చివరి ప్రసంగం ద్వారా తన జ్ఞానాన్ని అందరికీ పంచింది శారదమ్మ. కార్యక్రమం పూర్తవ్వగానే రామారావు, ఆనంద స్వరూప్‌లు ఇరుప్రక్కలా నడుస్తూండగా బయటికి వచ్చింది శారదమ్మ. ఆమెని అభినందించడానికి ప్రముఖులందరూ క్యూ కట్టారు.

ఇండియా నుండి వచ్చిన వారు ఆమెకి పాదాభివందనం చేసారు. మంత్రులు సైతం ఆమెని ఎంతో కొనియాడారు. ఆమె సేవలు రాష్ట్ర ప్రజలకు అందించాలని అందుకు ప్రభుత్వం తరపున ఏం కావాలన్న చేయడానికి సిద్ధమని వెంటనే ప్రకటించారు ఒక మినిష్టరు గారు. శారదమ్మ కార్యక్రమం చేపడితే ఎంత ఖర్చయినా మేము స్పాన్సర్ చేస్తామని ప్రముఖ వ్యాపారులు అన్నారు. వారందరి అభినందనలు చిరునవ్వుతో అందుకోంటూ అక్కడి నుండి బయటికి నడిచింది. ఆమెతో పాటు కరుణేంద్రభూపతి కుటుంబ సభ్యులు కూడా కలిసి వచ్చారు. శారదమ్మ బయటికి రాగానే ఫోటోగ్రాఫర్లు ఆమెని ఫోటోలు తీయడానికి బారులు తీశారు. ఆమెతో పాటు రామారావు కుటుంబసభ్యులు సైతం ఫోటోకి ఫోజిచ్చారు. ఆ తర్వాత వీరంత ఒకే కుటుంబ సభ్యులని అక్కడి జర్నలిస్టుకి తెలిసేలా చేసాడు ఆనంద స్వరూప్.

ఎంతో అద్భుతంగానూ, ఆహ్లాదంగానూ జరిగిన శారదమ్మ చివరి ప్రసంగం గురించి ఆ మరునాడు ఉదయం అమెరికా, ఇండియా అనే తేడా లేకుండా ప్రపంచ ప్రఖ్యాత అన్ని వార్తా ఛానళ్ళు, వార్తా పత్రికలు ఆమె గురించి ప్రముఖంగా ప్రకటించాయి. అంతే కాదు కోట్లాది మంది జనుల హృదయాలలో చోటు సంపాదించుకున్న శారదమ్మని అమెరికాలోని ఒక ప్రముఖ యూనివర్శిటీ వారు వినయంగా ఆహ్వానించారు. తమ యూనివర్శిటీలో ప్రసంగించాలని కోరారు అంతేకాదు అమెకి గౌరవ డాక్టరేటు కూడా ప్రదానం చేస్తున్నారని ప్రకటించడంతో శారదమ్మ పేరు దశ దిశలా మారు మ్రోగిపోయింది.

యూనివర్శిటీ ఆఫ్ ఫ్లోరిడా..

ఫ్లోరిడా లోని గైన్స్‌విల్లే ప్రాంతంలో 2,000 ఎకరాల విస్తీర్ణంలో సువిశాలంగా పరుచుకుని ఉంది యూనివర్శిటీ..

వంద సంవత్సరాలకి పైగా చరిత్ర కలిగిన ఈ యూనివర్శిటీలో చదువుకున్న విద్యార్థులు ప్రపంచ వ్యాప్తంగా ఆయా రంగాలలో కీలక పదవులలో తమ నైపుణ్యాన్ని ప్రపంచానికి అందిస్తున్నారు. ఆ యూనివర్శిటీలో చదువంటే ప్రపంచంలోని ప్రతీ అంశంపై అవగాహన పెంచుకోవడమే.. ఆ యూనివర్శిటీలో ప్రొఫెసర్‌గా చేసామంటే .. ఎన్నో పరీక్షలని తట్టుకొని నిలబడగగాలి.. రోజు రోజుకీ పుట్టుకు వస్తున్న కొత్త కొత్త ప్రశ్నలకి సమాధానాలని అన్వేషించేది సైన్స్.. ఆ అన్వేషణలో సమాధానాలు దొరకవచ్చు.. అలాగే ఆ ప్రశ్నలో నుండి మరి కొన్ని ప్రశ్నలు కూడా ఉద్భవించవచ్చు.. అలా ఉద్భవించే ఎన్నో, ఎన్నెన్నో ప్రశ్నలని ఛేధించడానికి, ఆ సమాధానాలని వెతికి ప్రపంచ శాంతికి తోడ్పాటు నందించడానికి ఆ యూనివర్శిటీ నిరంతరాయంగా పనిచేస్తూనే ఉంటుంది.మనిషి ఆలోచన నుండే పుట్టుక వచ్చినా దానిని సైన్స్ అంటారు. సైన్స్ అంటే.. అది పూర్తిగా మానవ విజ్ఞాన భాండాగారం. ఆ విజ్ఞానం ఎంత కుమ్మరించిన ఆ భాండాగారం లో మరికొంత చోటు ఉండే ఉంటుంది.. అంటే.. ఆ భాండాగారం ఈ భూప్రపంచం ఉన్నంత కాలం అలా వెలితిగానే ఉంటూంది.. ఆ 'వెలితి'ని పూడ్చడానికి మానవ మేధస్సు కొత్త కొత్త పరిశోధనలకి శ్రీకారం చుడుతూనే ఉంటుంది.. ఆ శోదనల నుండి కొన్ని ప్రశ్నలకి సమాధానాలు దొరకవచ్చు అలాగే మానవ మేధస్సుకి అందని మరి కొన్ని ప్రశ్నలు ఉద్భవించనూ వచ్చు.. అది అంతే.. దానికి అంతం లేదు..

ఇదీ మానవ మేధస్సు ద్వారా సృష్టింపబడిన సైన్స్ చరిత్ర.. మేధస్సుకి పదును పెట్టడం అనే ప్రక్రియ ఇక్కడ నిరంతరాయంగా కొనసాగుతూనే ఉండాలి..

ఇక మరో కోణంలోకి వెళితే..

మనిషికి ఉన్న అంతులేని మేధస్సుకి నిలువెత్తు నిదర్శనం సైన్స్..

మరి ఆ మనిషినే సృష్టించిన వాడొకడున్నాడు కదా.. అతడెవరు.. అతడే 'దేవుడు'.

ఎస్.. ఆ దేవుడు మనిషిని సృష్టించాడు, మనిషికి ఈ భూప్రపంచాన్ని అందించాడు. తల పై భాగంలో ఓ మెదడుని అమర్చాడు, ఆ మెదడు ద్వారా ప్రపంచాన్ని శాసించేటంత జ్ఞానాన్నీ సమకూర్చాడు.

ఆ జ్ఞానం, విజ్ఞానంగా రూపుదాల్చింది.. ఆ విజ్ఞానాన్ని ప్రపంచమంతా వ్యాపించేలా ఫ్లోరిడా యూనివర్శిటీ కృషి చేస్తోంది. అంతేకాదు.. సైన్స్‌ని సమృద్ధిగా అందించే ఆ యూనివర్శిటీ.. సైన్స్‌కి పూర్తిగా వ్యతిరేక భావాలను కలిగిన దైవాన్ని కూడా అంతే స్థాయిలో ప్రపంచానికి అందించేందుకు కృషి చేస్తుంది కూడా..

ప్రపంచ వ్యాప్తంగా ఎన్నో మతాలూ, ఎన్నో జాతులు, ఎందరో దేవుళ్ళు, ఎన్నో విశ్వాసాలు, ప్రతీ మతానికీ, ప్రతీ జాతికీ ఓ ధర్మం.. ఆ ధర్మానికి అనుగుణంగా ఆయా జాతులు నడుచుకోవాల్సిందే.. కంటికి కనిపించని ఆ దేవుడిని ఆరాధిస్తూ , ఆధ్మాత్మిక తత్వాన్ని ఆస్వాదించే కోటాను కోట్ల మంది జనం.. ఒక్కో మతానికీ, ఒక్కో జాతికీ ఎంతో చరిత్ర.. కొన్ని వందల సంవత్సరాల క్రితం పుట్టుకువచ్చినవి కొన్నయితే, మరి కొన్ని జాతులు వేల సంవత్సరాల క్రితం పుట్టుకువచ్చినవి.. ఫోర్లిడా యూనివర్శిటీ ఆయా జాతుల సంస్కృతి, సంప్రదాయాలపై కూడా అధ్యయనం చేపట్టింది.. అన్నింటికంటే ముఖ్యంగా.. భారతీయ సంస్కృతి, సంప్రదాయాలపై ప్రత్యేకంగా శ్రద్ధ పెట్టింది.. దానికి కారణం.. ప్రపంచ దేశాలతో పోలిస్తే ఆధ్యాత్మికంగా భారతదేశానికి ఎంతో చరిత్ర ఉండడమే.. భారతదేశం సంస్కృతి, సంప్రదాయాలు కొన్ని వేల సంవత్సరాల క్రితం పుట్టిందన్నది ఎవరూ కాదనలేని సత్యం. అయితే మిగతా దేశాలతో పోలిస్తే, భారతదేశంలో ఉన్న సంస్కృతి భిన్నమైనది. ఎన్నో మతాలు, ఎన్నో భాషలు , ఎన్నో సంప్రదాయాలు వెరసి భారతదేశం. మనుషుల ఆచారాలు ,వ్యవహారాలు వేరయిన భారతీయులంతా ఒక్కతాటిపై నిలవడం అన్నది ఆ యూనివర్శిటీ ప్రొఫెసర్లని ఎంతగానో ఆకట్టుకుంది.

సైన్స్‌కి సంబంధించి ఎన్నో ప్రయోగాలు  చేసి విజయాన్ని అందుకున్న చరిత్ర ఆ యూనివర్శిటీకి ఉంది.. కానీ.. దేవుడి  విషయానికి వచ్చే సరికి వారి  మదిలో ఎన్నో ప్రశ్నలు .. ఎన్నో సందేహాలు .. వాటిని నివృత్తి చేసుకోవడం కోసం ఆ యూనివర్శిటీ అన్వేషణ కొనసాగుతూనే ఉంది..సరిగ్గా ఇదే సమయంలో అమెరికాకి శారదమ్మ రావడం, ఆమె ఆధ్యాత్మిక ప్రసంగాలు అమెరికానే కాకుండా ప్రపంచ వ్యాప్తంగా కోట్లాది మందిని ఉత్తేజితులని చేయడంతో ఫ్లోరిడా యూనివర్శిటీ వారి దృష్టి శారదమ్మపై పడింది. శారదమ్మ గురించి క్షుణ్ణంగా తెలుసుకుని, ఆమె ప్రసంగాలని క్షుణ్ణంగా పరిశీలించిన తర్వాత  తమ యూనివర్శిటీ తరపున గౌరవ డాక్టరేటుకి శారదమ్మ పూర్తి అర్హురాలిగా నిర్ధారించారు. ఆమెకి డాక్టరేటు ప్రధానం చేయడమే కాదు, దైవానికి సంబంధించి తమకున్న సందేహాలకి, సమాధానాలు  కూడా శారదమ్మ నుండి  రాబట్టుకోవాలన్న ఆలోచన కూడా వారిలో ఉంది. రామారావు, ఆనంద స్వరూప్‌లు  తోడు రాగా శారదమ్మ యూనివర్శిటీకి బయలు  దేరింది. యూనివర్శిటీలో ఉన్న ఆడిటోరియం ఆ యూనివర్శిటీ విద్యార్థులతో కిక్కిరిసి పోయింది. శారదమ్మని చూడాలన్న ఆతృత అక్కడ  వారిలో స్పష్టంగా కనిపిస్తుంది.

శారదమ్మ రాగానే ఆమెని అడగాలనుకున్న ప్రశ్నలని సిద్ధం చేసుకున్నారు ఆ యూనివర్శిటీ ప్రొఫెసర్లు.

యూనివర్శిటీ మెయిన్ గేటు దగ్గరికి చేరుకుంది శారదమ్మ ప్రయాణిస్తున్న కారు. ఆనంద స్వరూప్ డ్రైవింగ్ సీట్లో ఉండగా, ఆయన ప్రక్కనే రామారావు  కూర్చున్నాడు. వెనక సీట్లో శారదమ్మ కూర్చుంది. సెక్యూరిటీ గార్డు గేటు ఓపెన్ చేయగానే కారు లోనికి పోనిచ్చాడు ఆనంద స్వరూప్. లోనికి కారు ప్రవేశించగానే శారదమ్మ చూపు చుట్టూ ఉన్న పరిసరాలపై పడింది. ఆ దారికి ఇరువైపులా పచ్చని చెట్లతో నిండి  ఉంది. ఆ చెట్లకి పూసిన రంగు రంగు పూలు  రోడ్డుపై రాలిపడ్డాయి.. నల్లటి రోడ్డుపై రంగు రంగు పూలు పరుచుకోవడంతో, ఆ దృశ్యం శారదమ్మకి ఎంతో ఆహ్లాదకరంగా అనిపించింది.. ఎవరో చిత్రకారుడు చాలా శ్రద్ధగా

కాన్వాస్‌పై రంగు రంగు పూల చిత్రాన్ని గీసినట్టుగా అనిపిస్తుంది. సరిగ్గా కిలోమీటరు దూరం వెళ్లిన తర్వాత  వారికి ఎదురుగా కనిపించింది అతి పెద్ద భవనం.. ఆ భవంతి ప్రక్కనే ఒక పెద్ద బోర్డు శారదమ్మని ఆకట్టుకుంది.. దానిపై ఇలా రాసి ఉంది..

The challenges facing our world are bigger than one person. One organization. One university.

The Gator Good is our campaign to combine those efforts and solve those global problems.

Because together, our impact is greater.

..........................

శారదమ్మ ఆలయంలోకి ప్రవేశించింది. ఆమె వెనకాలే ఆనంద స్వరూప్, రామారావు, కరుణేంద్రభూపతి, సాయిరాం లు  కూడా ప్రవేశించారు. వారందరి మొహాల్లో ఎంతో ఆనందం కనిపిస్తుంది. శారదమ్మ చేసిన ప్రసంగాలతో  కోట్లాది మందిని ప్రభావితం చేసిన వ్యక్తిగా అమెరికాలోని ప్రఖ్యాత యూనివర్సిటీ నుండి  డాక్టరేట్ అందుకోవడం, అక్కడ ఆమెకి లభించిన విశేషమైన అభిమానం విషయం గుర్తుకు వస్తుంటేనే ఆనంద స్వరూప్‌కి ఆకాశంలో తేలిపోతున్నంత ఆనందం కలుగుతుంది. అంతేకాకుండా శారదమ్మ కుటుంబ సభ్యులు సైతం ఒక్కటవడం కూడా ఆయన ఆనందానికి కారణం..

వారందరూ ఆలయంలో ఉన్న ఉపాలయాలలోని దేవుళ్ళని దర్శించుకున్నారు. శారదమ్మతో సహా అందరూ. ప్రత్యేకంగా పూజలు  కూడా నిర్వహించారు.

ఆ తర్వాత  నేరుగా శారదమ్మ రామానుజాచార్యులు దగ్గరికి వెళ్ళింది. అప్పుడే గర్భగుడిలో పూజ ముగించిన రామానుజాచార్యుల వారు  శారదమ్మని చూడగానే ఆయన కళ్ళల్లో వెలుగు నిండాయి. సాక్షాత్తూ ఆ జగజ్జననిని చూస్తున్నానన్న ఆనందం ఆ కళ్ళల్లో ప్రతిఫలిస్తుంది..

మనసు, హృదయం ఎంతో ఆనందంతో నిండిపోవడంతో ఆ దేవదేవుడికి మరొక్కమారు సాష్టాంగవందనం సమర్పించుకుని గర్భాలయం  నుండి  శారదమ్మకి ఎదురుగా వచ్చాడు. ఆ చర్యకి ఆనందస్వరూప్ ఎంతో విస్మయపడిపోయాడు.

రామానుజాచార్యుల  వద్దకు ఎవరు వచ్చినా ఒక అయిదు, పది నిమిషాలపాటు వారిని వేచి ఉండమని పురమాయించే రామానుజాచార్యుల వారు , శారదమ్మకి ఎదురు వచ్చి మరీ పలకరించడం ఆయన విస్మయానికి కారణం. శారదమ్మకి రెండు చేతులతో నమస్కరించారు రామానుజాచార్యుల వారు. ''అమ్మా.. మీ రాకతో ఈ ఆలయం మరింత శోభాయమానమయిపోయింది..'' ఆనందంగా అన్నాడు రామానుజాచార్యులు.

''మిమ్మల్ని చూసి నా మనసు కూడా ఎంతో ఆనందంతో నిండిపోయింది గురువు గారు..'' ఎదురు నమస్కరిస్తూ వినయంగా అంది శారదమ్మ..ఆ వినయ విధేయతలే ఆమెకు ఆభరణాలేమో అని అనిపించింది ఆనంద స్వరూప్‌కి.

''పదండి .. నా గదిలోకి వెళ్ళి మాట్లాడుకుందాం..'' రామానుజాచార్యుల చేతితో శారదమ్మకి తన గదివంక దారి చూపిస్తూ అన్నాడు. అందరూ కలిసి గదిలోకి నడిచారు.

అందరూ ఆసీనులయ్యాక రామానుజాచార్యుల చూపు ఆనంద స్వరూప్ వైపు తిరిగింది.

''నువ్వు సామాన్యుడివి కాదు ఆనంద స్వరూపా.. ఒక అసామాన్య స్త్రీశక్తిని నేను దర్శించుకునేలా చేసిన మహానుభావుడవి నువ్వు. కొన్ని కోట్ల హృదయాలు జ్ఞానపు దీపాన్ని వెలిగించిన వాడివి.. శారదమ్మని అమెరికాకి తీసుకు వచ్చి అంతరించిపోతున్న ఆధ్యాత్మికపు పరిమళాన్ని మరింత ఘుమఘుమలాడేలా చేసావు కదయ్యా.. నీ జన్మ ధన్యమయిపోయింది..'' మనస్ఫూర్తిగా అన్నాడు రామానుజాచార్యులు.

ఆయన మాటలకి ఆనంద స్వరూప్ ఎంతో పొంగిపోయాడు. వెంటనే లేచి ఆయన పాదాలకి నమస్కరించారు. ''తమ లాంటి వారి ఆశీస్సు లేకుండా నేనొక్కడినే ఇంత పెద్ద కార్యాన్ని నిర్వహించగలిగేవాడినా గురువు గారు..'' వినయంగా అన్నాడు ఆనంద స్వరూప్.

‘‘నిజంగా నేడు నా మనసు ఎంతో ఆనందంగా ఉంది.. శారదమ్మ ఇక్కడకి వచ్చి వెళుతున్నందుకు కాదు ఆ ఆనందం.. ఒక మామూలు అధ్యాత్మికురాలిగా వచ్చి, ఈ మందిరంలోని ఆ చిన్న హాలులో ఒక వందమంది పిల్లలకి తన బోధనని వినిపించే స్థాయి నుండి ప్రపంచం యావత్తూ తనవైపు తిప్పుకునే ఆదిపరాశక్తిగా ఎదిగినందుకు నాకు ఆనందం కలుగుతుంది..’’ గర్వంగా అన్నాడు రామానుజాచార్యులు.

ఆ మాటకి చిన్నగా నవ్వింది శారదమ్మ. ఆ తర్వాత ఆమెతో పాటు వచ్చిన వారిపై ఆయన చూపు పడింది. అదిగమనించిన ఆనంద స్వరూప్.. ‘‘ఈయన పేరు కరుణేంద్రభూపతి, శారదమ్మకి స్వయాన మరిది గారు, ఇతను రామారావు .. ఈయన కుమారుడు. ఒంటరిగా వచ్చిన శారదమ్మ తన కుటుంబంతో వెళుతోంది..’’ ఆనందంగా అన్నాడు ఆనంద స్వరూప్. కరుణేంద్రభూపతి, రామారావు ఇద్దరూ రామానుజాచార్యులకి నమస్కరించారు. ‘‘ఆ భగవంతుడి అనుగ్రహం లేనిదీ ఏదీ జరగదు.. ఇక నుండి శారదమ్మ జీవితం ఆధ్యాత్మిక గ్రంధాలయంగా భాసిల్లుతుంది. ఆమె జీవితాంతం ఆధ్యాత్మిక బోధనలు చేస్తూ ప్రపంచాన్ని పావనం చేస్తుంది..’’ కళ్ళు మూసుకుని భవిష్యత్తుని చెబుతున్నట్టుగా అన్నాడు రామానుజాచార్యులు . ‘‘అంతా మీ ఆశీర్వాదం తండ్రీ..’’ అంది శారదమ్మ రెండు చేతులు నమస్కరించి. శారదమ్మ ఇండియాకి వెళ్ళడానికి సమయం ఆసన్నమయింది. ఆమెకి వీడ్కోలు పలకడానికి ఎంతో మంది ప్రముఖులు ఆ ఆలయం దగ్గరికి వచ్చారు. శారదమ్మతో పాటు రామారావు ఫ్యామిలీ కూడా ఇండియాకి వెళుతున్నారు. కరుణేంద్రభూపతి దంపతులు సైతం శారదమ్మ అడుగు జాడల్లో ఆమెకి సేవ చేస్తూ శేష జీవితం గడపడానికి నిర్ణయించుకున్నారు.

తమ ఆస్తినంతా గురుకుల ట్రస్టు వారికి ఇస్తున్నట్లు ప్రకటించారు. ఇండియాలో అడుగు పెట్టగానే శారదమ్మకి కావలసిన సకల ఏర్పాట్లన్నీ దగ్గరుండి పర్యవేక్షించాలని తెలంగాణ ముఖ్యమంత్రి దేవాదాయ శాఖ మంత్రికి ఆదేశాలు అందించారు. ఆమెకి ఏ ప్రదేశంలో

ఆమెకి స్థలం  కేటాయించాలన్న  కేటాయించమని, ఆమె ఆశ్రమానికి సంబంధించి పనులు వేగవంతం చేయాలని ఆవన్నీ పూర్తయ్యేంత వరకూ ఆమెకి ప్రభుత్వమే దగ్గరుండి చూసుకోవాలన్న ఆదేశాలు  జారీ అయ్యాయి. అంతేకాదు ముందుగా ఢిల్లీలో, ప్రధానమంత్రిని, రాష్ట్రపతిని  ప్రత్యేకంగా కలుసునేందుకు వారి అపాయింట్‌మెంట్‌లు  కూడా సిద్ధమైపోయాయి. కోట్లాది మంది హృదయాలని కదిలించిన శారదమ్మని ప్రత్యేకంగా అబినందించడానికి వారు ఈ ఏర్పాటు  చేసారు. ఆమె రాష్ట్రంలో ఎప్పుడు అడుగు పెడుతుందా అని మీడియా సైతం కళ్ళు కాయలు కాసేలా  ఎదురు చూస్తోంది. ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు తెచ్చుకున్న శారదమ్మకి అమెరికా విమానాశ్రయంలో వీడ్కోలు పలకడానికి ఆనంద స్వరూప్, సాయిరాం తో పాటు ఆమెకి ఆతిధ్యం ఇచ్చిన వారందరూ వచ్చారు. తమ రాష్ట్రానికి వచ్చిన ప్రముఖ వ్యక్తిగా

ఆమెని అమెరికా ప్రభుత్వం సకల  తీరున గౌరవించింది. అమెరికాను వీడుతున్న ఆమెకు కవరేజ్ చేయడానికి అమెరికా మీడియా ఎంతో ప్రాధాన్యాన్ని ఇచ్చింది. ఒక మామూలు వ్యక్తిగా వచ్చి, అనంత శక్తిగా ఎదిగి తిరిగి మాతృ గడ్డకి పయనమవుతుంది శారదమ్మ. ఆమె తమని వీడి  వెళుతుందే అని అమెరికాలో ఉన్న ప్రతీ తెలుగువారికి   బాధగా ఉంటే, ఇండియాకి ఎప్పుడు వస్తుందా అనే ఆరాటంలో ఇండియా ప్రజలు  ఉన్నారు.

ఇన్ని జరుగుతున్న, ఇంత పేరు ప్రఖ్యాతులు సంపాదించుకున్న శారదమ్మ లో మాత్రం ఏమాత్రం మార్పు రాలేదు. అంతే సాదాసీదాగా, చేతిలో సాయి పారాయణం పట్టుకుని తన ప్రపంచంలో తాను మునిగిపోయింది. విమానంలో కూర్చున్నాక మాత్రం కళ్ళు మూసుకుని సాయినాధుడిని మనస్ఫూర్తిగా ప్రార్థించింది.

‘‘దేవుడా.. ఎక్కడో పేదరికంలో పుట్టాను, జమీందారీ వంశం రుచి చూశాను, కటిక దరిద్ర్యాన్ని అనుభవించాను, చివరికి నీ అక్కున చేరాను.. నీ సన్నిధిలో చేరాక  నా జీవితం నీకే అంకితం చేశాను. నాకు ఎంతో పేరు  వచ్చిందని, ఇప్పుడు నేను ఎంతో ఎత్తుకు

ఎదిగానని ప్రపంచం అంటుంది.. కానీ.. నీ ఆజ్ఞని శిరసావహించడమే నా కర్తవ్యం...

ఇకముందు కూడా అదే చేస్తాను. నీ సేవ  చేస్తూ నీ సూక్తులని, భారత సంప్రదాయాలని ప్రపంచానికి తెలియచేస్తాను... ఓం సాయి.. శ్రీ సాయి.. జయ జయ సాయి..''

విమానం ఆకాశంలోకి ఎగిరింది..

అమెరికా అంచులు  దాటుతూ..

ఇండియా వైపు పరుగులు  తీస్తూ...

ఒక జ్ఞాన దీపాన్ని, ఒక స్త్రీ శక్తిని, ఆదిపరాశక్తిని  భారతీయులకు చేరువ చేస్తూ...

## ఓం సాయి.. శ్రీ సాయి.. జయ జయ సాయి